# వర్తమాన వ్యవహారాలు

ఖండాలు : 1 - 5

BRAOU

డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

హైదరాబాద్

2003

**పాఠ్య నిర్మాతలు**

డా॥ బూదరాజు రాధాకృష్ణ (సంపాదకుడు)

ఆచార్య ఎస్. బ్రహ్మాజీరావు

ఆచార్యఎమ్. సత్యనారాయణరావు

డా॥ మధుసూదన రెడ్డి

ఆచార్య వి. రామకృష్ణ

ఆచార్య భిక్షు

డా. ఐ.రామబ్రహ్మం

సి. వెంకటయ్య

ఆచార్య కె. కుప్పుస్వామిరావు

డా॥ శ్రీనివాసాచార్యులు

ఆచార్య డి.నరసింహారెడ్డి

కార్యక్రమ సమన్వయకర్త

ఆచార్య కేతువిశ్వనాథరెడ్డి

పాఠ్యాంశ సమన్వయకర్త

డా॥ కె. యెస్. రమణ

సమన్వయం :

డా॥ ఆర్. వసునందన్

ఘంటా చక్రపాణి

డా॥ ఉమాపతి వర్మ

అనువాదం :

డా॥ ఐ.రామబ్రహ్మం

115094
29-4-05
Dr. B.R.A.O.U. LIBRARY
Acc. No. 115094
Date 29.4.2005
Call No. 659.2
PRA
BRAOU

ముఖచిత్రం

చంద్ర

*డా॥ బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం*

హైదరాబాదు

మొదటి ముద్రణ, 1996 , 2003

అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. ఈపుస్తకంలోని ఏ భాగం ఐనాఉపయోగించదలుచుకుంటే, విశ్వవిద్యాలయం అనుమతి పొందాలి. ఈ పాఠ్యాలు సార్వత్రిక విశ్వవిద్యాలయం పాఠ్య ప్రణాళికలో ఒక భాగం.

ఇతర వివరాలకు: డైరెక్టర్ (ఎకడమిక్),డా॥ బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
రోడ్‌నెం. 46, జూబిలీ హిల్స్, హైదరాబాద్ - 33.

Lr.No.52/Dr. BRAOU/DMP/PTG/F.No.45/J.O.205/2003-2004/dt.16.4.03/No. of Copies 200

Printed at : **Graphica Printers,** Hyderabad.

**(PGDWMMT) Book 5**

# వర్తమాన వ్యవహారాలు

BRAOU

ఖండాలు 1 -5

| | |
|---|---|
| 1 | పరిచయం |
| 2 | ఆంధ్రప్రదేశ్ : చరిత్ర, సంస్కృతి |
| 3 | ఆంధ్రప్రదేశ్ : రాజకీయ,ఆర్థిక నిర్మితులు |
| 4 | ఆంధ్రప్రదేశ్ : అభివృద్ధి సమస్యలు |
| 5 | ధోరణులు, పరిణామాలు |

BRAOU

## ఖండాల, భాగాల క్రమం


**ఖండం : 1 పరిచయం**

| | | |
|---|---|---|
| భాగం : 1 | ప్రపంచం : భౌగోళికపరిస్థితులు, సహజ వనరులు | 1 |
| 2. | ప్రపంచం : సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులు | 28 |
| 3. | భారతదేశం : భౌగోళికపరిస్థితులు, సహజ వనరులు | 49 |
| 4. | భారతదేశం : సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులు | 70 |

**ఖండం : 2 ఆంధ్రప్రదేశ్ : చరిత్ర, సంస్కృతి**

| | | |
|---|---|---|
| భాగం : 5. | నేపథ్యం : (1956 వరకు) ఆంధ్రోద్యమ చరిత్ర | 83 |
| 6. | భౌగోళిక పరిస్థితులు, సహజ వనరులు | 104 |
| 7. | సామాజిక ఆర్థిక వ్యవస్థలు | 121 |
| 8. | లలిత కళలు | 134 |
| 9. | భాష,సాహిత్యం | 158 |

**ఖండం : 3 ఆంధ్రప్రదేశ్: రాజకీయార్థిక నిర్మితులు**

| | | |
|---|---|---|
| భాగం : 10. | రాజకీయ వ్యవస్థ | 171 |
| 11. | పరిపాలన వ్యవస్థ | 186 |
| 12. | స్థానిక సంస్థలు | 206 |
| 13. | ఆర్థిక ప్రణాళికా వ్యవస్థలు | 224 |
| 14. | ప్రభుత్వ రంగ సంస్థలు | 241 |

**ఖండం : 4 ఆంధ్రప్రదేశ్: అభివృద్ధి సమస్యలు**

| | | |
|---|---|---|
| భాగం : 15. | శాస్త్ర సాంకేతిక రంగం | 253 |
| 16. | మానవ వనరులు | 264 |
| 17. | పర్యావరణం:ఇంధనం | 275 |
| 18. | సామాజికా శాంతి | 284 |
| 19. | పారిశ్రామిక రంగం | 297 |
| 20. | వ్యవసాయ రంగం | 307 |

**ఖండం : 5. ధోరణులు, పరిణామాలు**

| | | |
|---|---|---|
| భాగం : 21. | అంతర్జాతీయ పరిణామాలు | 317 |
| 22. | భారతదేశ పరిణామాలు | 332 |
| 23. | రాష్ట్ర పరిణామాలు | 345 |


BRAOU

BRAOU

# పరిచయం

గణితం వంటి కొన్ని శాస్త్రాల పరిచయం ప్రాథమిక విద్యగానే మొదలవుతుంది. జర్నలిజం వంటి కొన్ని విషయాలు పట్ట పరీక్షా స్థాయిలో గాని పఠనపాఠనాల్లో ఉండవు. అందువల్ల సాధారణ విద్యార్థికి పత్రికలను చదివే నేర్పున్నా పాత్రికేయ వృత్తికి సంబంధించిన ప్రాథమిక పరిచయం కూడా అందుబాటులో ఉండదు. అది అభిమాన విద్యగా నేర్చుకోవలసిన విషయమే. ఒకప్పుడు చిన్న వృత్తిగా ప్రవృత్తిగా ఉండే పత్రికా రచన ఇప్పుడొక భారీ పరిశ్రమలోని అనేక విభాగాల్లో ఒకటయింది. భిన్న విద్యా స్థాయిలకు, ప్రాంతాలకు, కులాలకు, మతాలకు చెందిన వ్యక్తులిప్పుడు పాత్రికేయ విద్యను అభిమానించి నేర్చుకోవాలనుకుంటున్నారు. ఉన్నత పాఠశాలలో సామాజిక శాస్త్రం చదివి అందులో స్నాతకోత్తర స్థాయి పట్టం సంపాదించిన విద్యార్థి భౌతిక శాస్త్రంలో నైపుణ్యం గల మరో విద్యార్థితోబాటు పాత్రికేయ విద్యలో పోటీ పడవలసి వస్తున్నది. వారిద్దరి చదువు సంధ్యలకూ సంస్కారాలకూ నైపుణ్యాలకూ సంబంధం లేదు. కానీ ఆ ఇద్దరూ ఒకే శాస్త్ర విషయం నేర్చుకోక తప్పదు. కాబట్టి వారికి సమంగా నేర్పవలసినవిషయాలను గుర్తించక తప్పదు. ఒకరికొక శాస్త్రంలో మంచి పరిచయమున్నా ఇతర శాస్త్రాలలో ఏమీ తెలియక పోవచ్చు. జర్నలిస్టు కాదలచిన వ్యక్తి ఏ ఒక్క విషయంలోనో నైపుణ్యం కన్నా అనేక విషయాల్లో సామాన్య పరిజ్ఞానం సంపాదించటం వృత్తి రీత్యా అవసరం. అందుకీ గ్రంథం కొంత తోడ్పడుతుంది.

సమాచారసేకరణ, దాని స్వభావ లక్షణాల అవగాహన,దాన్ని ప్రసారం చేయటానికి అవసరమైన భాషా పటిమ, రచనాశక్తి జర్నలిస్టుకు ముఖ్యంగా కావలసిన, ఉండవలసిన లక్షణాలు. ఏవో కొన్ని గాలి వార్తలను, నీలి వార్తలనుపోగుచేయటంమాత్రమే సమాచార సేకరణకాదు. తాను పనిచేసే పత్రికకూ, తానున్న సమాజంలోని వ్యక్తులకూ పనికివచ్చే,ఉపయోగపడేవిషయాలే సరైన సమాచారం. ఒక విషయాన్ని విని, విన్నంత మాత్రాన అది అందరికీ అవసరమని భావించటం మంచిదికాదు. ఆ విషయానికున్న పూర్వరంగం,దాని ప్రయోజనం, చరిత్ర, అందులోని లోటుపాట్లు గుర్తించగలగటం సమాచార సేకరణకన్నా ముఖ్యమైన వృత్తి ధర్మం. ఆ వార్తను ప్రసారం చేయటం వల్ల సమాజానికి లాభమోనష్టమో తెల్చుకోగలగటం అంతకన్నా ప్రధానం. వార్తలు పాఠకులకు అందించగల రూపంలో, ఒక క్రమంలో, ఒకేసారి రావు, దొరకవు. వాటిని, తార్కికంగా, కాలక్రమానుసారంగా, సులభగ్రాహ్యంగా తిరిగి రాయవలసిన అవసరముంది. ఏవో కొన్ని పదాలను ఏదో క్రమంలో అమర్చి రాసిన వాక్యాలు వార్తలు కావు. వాటిని సమాజంలోని భిన్న వ్యక్తులకు ఆకర్షణకరంగా చెప్పటానికి భాషా పటిమ కావాలి. పాఠకుల్లో మహా విద్వాంసులుండవచ్చు; అక్షరాలను గుణించుకొంటూ శ్రమపడి చదువుకొనే సామాన్యులూ ఉండవచ్చు. సూటిగా సులభమైన భాషలోస్పష్టంగా వార్తలు రచించటానికి మంచి భాషా పరిజ్ఞానంకావాలి. అలాగని అందరూ ఒకేరకమైన రచనాధోరణిలో రాస్తే ఆనందిస్తారని అనుకోలేం. రచనా శక్తి వ్యక్తిగతమైనది. ఒక్కొక్కరి శైలి ఒక్కో ప్రత్యేక పద్ధతిలో ఉంటుంది. అయినా రాసే పద్ధతిలో కొద్దిపాటి చిన్న చిన్న మార్పులుండకపోతే విసిగిస్తుంది. అందువల్ల భిన్న విధాలుగా రచించగల నేర్పును అలవరచుకోవలసివస్తుంది. జర్నలిస్టులు ఈ కసరత్తులు చేయక తప్పదు. నిత్య విద్యార్థులుగా ప్రవర్తించకా తప్పదు.

పాత్రికేయ వృత్తికి కావలసిన నైపుణ్యాలు అనేకం. ఆ శాస్త్రంలోభిన్న శాఖలున్నాయి. ఆయా విషయాల్లో కొన్ని మూలసూత్రాలు మరికొన్ని దేశకాల పాత్రల్లోని భేదాల వల్ల, చరిత్రగతిలో విజ్ఞాన వికాసంలో,పారిశ్రామికీకరణఫలితంగా వచ్చిన నూతనావిష్కరణాల వల్ల రకరకాలమార్పులు పొందాయి. పొందుతున్నాయి. వాటికి సంబంధించిన సమాచారం ఈ కోర్సుకు సంబంధించిన ఇతర పాఠ్య గ్రంథాల ద్వారా కొంతవరకు లభిస్తుంది. ఈ శాస్త్ర విషయాల్లో వెలువడ్డ ఇతర గ్రంథాల ద్వారా మరింత తెలుస్తుంది. ఈ గ్రంథంలోని అయిదు ఖండాల్లో వర్తమాన విషయాలకు సంబంధించిన

BRAOU

అనేకాంశాలున్నాయి. వర్తమానకాలంలో మన రాష్ట్రంలో జర్నలిస్టులుగా వ్యవహరించదలచిన విద్యార్థులీ అంశాలను తెలుసుకోవాలి. వర్తమానమనగానే తక్షణ కాలానికి మాత్రమే సంబంధించిన పనికాదు. గతం లేని వర్తమానం లేదు. వర్తమానం లేని భవిష్యత్తు ఉండదు. ఈ కాలంలో సామాజికుల అనుభవంలో ఉన్న అనేక విషయాల బీజాలు గతంలో ఉన్నాయి. వాటిని గురించి క్లుప్తంగానయినా తెలుసుకోకపోతే ఇప్పటి వాటి లక్షణాలు,గుణగణాలు,స్వరూప స్వభావాలు స్పష్టంగా తెలియవు. సరైన అవగాహనలేని విషయ సేకరణగాని వార్తా ప్రసారంగాని నిర్దుష్టంగా ఉండదు. అందువల్ల వర్తమాన వ్యవహారాలు నేపథ్యం అంతో ఇంతో తెలుసుకోవలసి ఉంది. చూస్తుండగానే వర్తమానం భవిష్యత్తుగా మారుతుంది. అందువల్ల ఈ పుస్తకం అందించే సమాచారాన్ని ఎప్పటికప్పుడు సవరించుకోక తప్పదు. నూతనాంశాలు కొన్ని చేరగా పాతవి కొన్ని మరుగున పడక తప్పదు. విద్యార్థులీ విషయాన్ని గుర్తించాలి.

జర్నలిజమనే శాస్త్రంలాగానే మనమిప్పుడున్న ప్రజాస్వామ్య వ్యవస్థ, మన అనుభవంలో ఉన్న శాస్త్రసాంకేతిక పరిసరాలూ, వాటి మూల సూత్రాలూ మన దేశంలో పుట్టి పెరిగిన భావనలు కావు. ఒకప్పుడు దినచర్య రాసుకోవటంగా ఉన్న జర్నలిజం ఇప్పుడొక భారీ పరిశ్రమలో భాగమయి, వృత్తిగా మారింది. ఇంగ్లీషు విద్య ద్వారా మనకు ప్రజాస్వామ్య మనేభావన (concept), అది కొంతకాలానికి ఒక ఉద్యమమై నేటికి వ్యవస్థగా పరిణమించింది. శాస్త్ర విజ్ఞానాభివృద్ధి స్వదేశీయంకాదు. భారతదేశమనే భావన కూడా ఏర్పడని కాలంలో ఈగడ్డమీద మౌలిక పరిశోధనలు జరిగాయి. క్రీస్తు శకం నాలుగో శతాబ్దం తరవాత ప్రపంచ విజ్ఞానయాత్రలో మన వంతు మౌలిక సేవలు జరగనే లేదన్న ఆక్షేపణ ఉంది. యూరప్ ఖండంలోపునరుజ్జీవన (rennaissance) వాదం, పారిశ్రామికీకరణ (Industrialisation), శాస్త్ర విజ్ఞాన వికాసాలు పుట్టిన తరవాత చాలా కాలానికి వాటి ఫలితాలు మన అందుబాటులోకి వచ్చాయి. రెండు ప్రపంచయుద్ధాల తరువాత, విశ్వాంతరాళ పరిశోధనలు పెచ్చుపెరిగిన తరువాత వాటివల్ల కలిగిన సత్ఫలితాలతో బాటు కొన్ని దుష్ఫలితాలుకూడా మానవజాతికి సంక్రమించాయి. వాతావరణ కాలుష్యం, పేదరికం, నిరుద్యోగం వంటివి అన్ని దేశాలనూ మనలనూ బాధిస్తున్నాయి. సామాజికార్థిక రాజకీయ సిద్ధాంతాల వల్ల మరికొన్ని సమస్యలు ఉత్పన్నమైనాయి. అవేవో తెలుసుకోవటం జర్నలిస్టుల కర్తవ్యం.

BRAOU

ఈ పుస్తకంలో ఆంధ్రప్రదేశ్ పరిస్థితులకు, సమస్యలకు ప్రాధాన్యమిచ్చాం. భారతదేశ సమస్యల వల్ల మన రాష్ట్రంలో వర్తమానకాలంలో నెలకొన్న పరిస్థితులనూ, అందుకు ఆధారభూతమైన కారణాలయిన అంతర్జాతీయ విధానాలనూ స్థూలంగా ఈ పుస్తకం పరిచయం చేస్తుంది. ఆ సందర్భంలోప్రస్తుత ప్రపంచంలోపరివ్యాప్తంగా ఉన్న భావనలను వాటి పరిణామాలను దృష్టికి తేవలసి వచ్చింది. ఆయా విషయాల నేపథ్యం తెలిసిన జర్నలిస్టు వాటికి సంబంధించిన వార్తలను సరిగా విశ్లేషించగలడు.

మొదటి ఖండంలో జాతి(nation), రాజ్యం(state) అనే భావనలను వివరించారు. రెండు ప్రపంచ యుద్ధాల పరిణామంగా ఐక్యరాజ్య సమితి ఏర్పడటం, దరిమిలా ప్రచ్ఛన్న యుద్ధం కొంత కాలం కొనసాగటం, ఆ సమయంలో అలీనోద్యమం వచ్చి మూడో ప్రపంచానికి ప్రపంచంలో సముచిత స్థానమేర్పరుచుకోదలచటం ఈ ఖండం స్థూలంగా చర్చించింది. రాజకీయార్థిక సామాజిక పరిణామాల మీద భౌగోళిక వ్యవస్థ ప్రభావాన్ని పూర్వులంతగా గుర్తించలేదు. ప్రాదేశిక రాజకీయాలకు (geopolitics) నేటి జగత్తులోఉన్న ప్రాచుర్య విషయం నూతన భావన. సంపదను సృష్టించటంలో ఉపయోగపడే అటవీ, పశు, వ్యవసాయ, ఖనిజ వినియోగం ఇందులోచర్చకు వచ్చింది.

ప్రజాస్వామ్య విధానాల వల్ల కలిగిన చైతన్యం ఎన్ని రకాల ఆర్థిక ప్రణాళికలను కల్పించిందోవాటిలాభనష్టాలేమిటో రెండో ఖండం వివరిస్తుంది. విద్యావ్యాప్తి, గ్రంథాలయోద్యమం, పత్రికా ప్రచురణ, వార్తాప్రసార సాధనాల ఆవిష్కరణ జనజీవనంలో తెచ్చిన మార్పులూ ఆంధ్రోద్యమజాతీయోద్యమాల పరిణామాలూ ఈ భాగంలో విశదీకరించారు. సంఘ సంస్కరణ భావనవల్ల సాంఘిక దురాచారాలను అరికట్టిన వైనం,కుల వ్యవస్థ బలపడ్డ విధానం ఇందులో ఉంది.

ఆంధ్రప్రదేశ్ భౌతిక సంపదను వనరులను పరామర్శించారు. సంగీత సాహిత్యాల్లో చిత్రలేఖన శిల్పనృత్యాల్లో భాషా నాటక రంగాల్లో వచ్చిన వికాసాన్ని స్థూలంగా పరిచయం చేశారు. ఈ విషయాలు వర్తమానపరిస్థితిని గత స్థితితోపోల్చి చెప్పటానికి ఉపయోగపడతాయి.

మన దేశంలోని శాసన వ్యవస్థను గురించి మూడో ఖండంలో చదవవచ్చు. ఎన్నికల విధానాలు, విభిన్న రాజకీయ పక్షాల బలాబలాలు, మంత్రివర్గ నిర్మాణ పద్ధతులు ఈ ఖండంలో వివరించారు. పాలన వ్యవస్థలోనూ న్యాయవ్యవస్థలోనూఉన్న భిన్న స్థాయులను చర్చించారు. భారత రాజ్యాంగంలో సువిస్తృతంగా ఉన్న పంచాయతీరాజ్ వ్యవస్థనూ స్థానిక సంస్థలనిర్వహణనూ విశదీకరించారు. ఆర్థిక రంగంలో ప్రవేశపెట్టిన ప్రణాళికలమంచి చెడ్డలను పరిశీలించారు. ప్రభుత్వ రంగంలో శాఖీయంగానూ కంపెనీ రకంగానూ ఏర్పడ్డ సంస్థల లక్షణాలను ప్రస్తావించారు.

విద్య,ఆరోగ్యం ప్రత్యేక విభాగాలుగా పూర్వం ఉండేవి. ఆరోగ్యవంతులయిన వ్యక్తులువిద్యావంతులైతే మరింత సమర్థంగా సంపదను సృష్టి చేయగలరని, అవి పరస్పరాధారితాలని ఇటీవల గుర్తించారు. మహిళలకు సమాన ప్రతిపత్తి కల్పించటం ఇందుకు తోడ్పడుతుందని నేటి భావన. ఈ మూడు రంగాలనూ కలిపి మానవ వనరులనే వ్యవహరించాలనేది ఈనాటి పద్ధతి. పర్యావరణంలో సమతౌల్యం లేకపోతే ప్రకృతి సంపద వ్యర్థమవటమే కాక మానవ వికాసం దెబ్బతింటుందని ఇటీవల గుర్తించారు. రకరకాలకాలుష్యాలను పరిహరించే మార్గాలను ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా అన్వేషిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణను కోరుతూఉద్యమాలు మొదలైనాయి. స్వాభావిక పర్యావరణంలోని అనర్థక పరిణామాలు సామాజిక సాంస్కృతిక జీవనాలకు విఘాతం కల్పిస్తాయని లోకం గుర్తించింది. ఇందుకు సంబంధించిన చర్చలు ఈ ఖండంలో కనిపిస్తాయి. రవాణా సౌకర్యాలు, నీటి పారుదల వసతులు, వ్యవసాయ భూపరిమాణం, ఎరువులు, మార్కెటింగ్ సౌకర్యాలు మొదలైనవి సమగ్రాభివృద్ధికి దారితీస్తాయని అవి ఒకదానికొకటి తోడ్పడుతాయని వర్తమాన కాలంలో గుర్తించారు. ఆయా భావనలను ఈ ఖండం విశదీకరిస్తుంది.

రాష్ట్ర స్థాయిలో, జాతీయాంతర్జాతీయ స్థాయిల్లో కొత్తగా వచ్చిన, వస్తున్న ధోరణులు, వాటిపరిణామాలు అయిదోఖండంలో చర్చకు వచ్చాయి. వర్తమాన వ్యవహారాల సదవగాహన ఈపుస్తకం తోడ్పడుతుంది. భిన్నరచయితలు తమతమ నైపుణ్యాలను, అనుభవాలను పురస్కరించుకొని తమకు ప్రత్యేకమైన భాషలో, శైలిలో, పద్ధతిలో ఆయా విషయాలను ఇందులో ప్రతిపాదించి చర్చించారు. మొత్తం మీద వారి రచనా స్వాతంత్ర్యానికి విఘాతం కలగని తీరున ఈ గ్రంథం వెలువడింది. జర్నలిజాన్నివృత్తిగా ప్రవృత్తిగా ఎంచుకొని ఆ రంగంలో అభివృద్ధి సాధించదలచిన విద్యార్థులు ఇందులోని పాఠాలను శ్రద్ధగా చదివి వర్తమాన వ్యవహారాలంటే ఏమిటోతెలుసుకుంటారని ఆశిస్తున్నాం. ఆయా విషయాలను గురించి అనేక పరామర్శ గ్రంథాలు దొరుకుతాయి. వాటిని కూడా చదివి ఒంట పట్టించుకొని అభివృద్ధి కాముకులు కావాలని ఆపేక్షిస్తున్నాం. సమాజంలోని భిన్న వర్గాల వారు పేదరికంలో నిరుద్యోగంలో అశాంతిలో మగ్గుతున్న ఈ కాలంలోఆయా దుస్థితుల కారణాలనూ నివారణ మార్గాలనూ గ్రహించటం దేశాభివృద్ధికి కీలకమైన రంగాల్లో అనుసరించవలసిన మార్గాలనుఅన్వేషించటం అనే రెండు మౌలికాంశాల్లో ఈ గ్రంథం సదవగాహన కల్పిస్తుందని ఆశిస్తున్నాం.

- సంపాదకుడు

BRAOU

BRAOU

# ఖండం - 1 పరిచయం

వర్తమాన ప్రపంచంలో - భారతదేశంలో ఎలాంటి పరిస్థితులు నెలకొన్నాయో తెలియజెప్పటం ఈ ఖండం ఉద్దేశం. రాజకీయార్థిక పరిణామాలపైన భౌగోళిక వ్యవస్థ ప్రభావం కూడా ఉంటుంది. ఈ ప్రాదేశిక రాజకీయాలను అవగాహన చేసుకోవటానికి వీలుగా ఈ ఖండంలో నాలుగు భాగాలను సమకూర్చాం. అవి :

1. ప్రపంచం : భౌగోళిక పరిస్థితులు, సహజ వనరులు,
2. ప్రపంచం : సామాజిక,రాజకీయ, ఆర్థిక పరిస్థితులు.
3. భారతదేశం : భౌగోళిక పరిస్థితులు, సహజ వనరులు.
4. భారతదేశం : సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులు.

BRAOU

BRAOU

# భాగం 1 ప్రపంచం : భౌగోళిక పరిస్థితులు, సహజ వనరులు

## విషయ క్రమం

1.0 ఉద్దేశం

1.1 ప్రవేశిక

1.2 మన గ్రహం, భూమి

అభ్యాసాలు

1.3 భూ గ్రహంపై జీవం పుట్టుక

1.4 భూ వాతావరణం

అభ్యాసాలు

1.5 సముద్రాలు, మహాసముద్రాలు

అభ్యాసాలు

1.6 భూగోళ శీతోష్ణ స్థితి

1.7 పర్యావరణ వ్యవస్థలు

అభ్యాసాలు

1.8 సహజ వనరులు

అభ్యాసాలు

1.9 వాతావరణ కాలుష్యం

అభ్యాసాలు

1.10 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

1.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

## 1.0. ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది అంశాలను తెలుసుకోగల్గుతారు :

- విశ్వంలో భూగ్రహం స్థానం
- భూగ్రహంపై మొట్ట మొదటి సారిగా జీవం ఎలా పుట్టింది
- భూవాతావరణం, దాని నిర్మాణం

BRAOU

- సముద్రాలు, వాటి వివరాలు
- భూ శీతోష్ణస్థితి అంటే ఏమిటి ?
- సహజ వనరులు వాటి వినియోగం
- వాతావరణ కాలుష్యం,కారణాలు,నివారణ,జాగ్రత్తలు
- జీవుల మనుగడను సంరక్షించుకొనడానికి మానవుడు ఏం చేయాలి ?

## 1.1 ప్రవేశిక

భూ గ్రహం ఈ సౌర కుటుంబంలో జీవరాశులకు ముఖ్యంగా మానవులకు నివాసయోగ్యమైన గ్రహం. దీనిపై ఎన్నోరకాల జీవరాశులు, ఎన్నో రకాల సహజవనరులు, వైవిధ్యంతో కూడిన జీవ భౌతిక పరిసరాలు ఒకదానితో ఒకటి పరస్పర సంబంధం కల్గి ఒక దానిని ఒకటి ప్రభావితం చేస్తూ అదే సమయంలో సమతుల్యం ప్రదర్శిస్తూ సహజీవనం చేస్తున్నాయి. అంతేకాకుండా భూవాతావరణంలో ఒక వైపు శీతోష్ణ పరిస్థితులు, ఇంకొక వైపు సమస్త జీవరాశుల మనుగడకు అవసరమయ్యే ప్రాణవాయువు, ఇతర అంశీ భూతాలు ఉన్నాయి. అయితే మానవుడు తన స్వలాభం కోసం ప్రకృతిని, వాతావరణాన్ని, సహజ వనరులను, విచక్షణా రహితంగా వినియోగం (ఇంకో విధంగా చెప్పాలంటే దుర్వినియోగం) చేస్తున్నాడు. ఈ విషయాలను గురించి మీరు ఈ భాగంలో క్రమంగా తెలుసుకుంటారు.

BRAOU

## 1.2 మన గ్రహం - భూమి

విశ్వంలో తొమ్మిది గ్రహాలు, మరికొన్ని ఉపగ్రహాలు సూర్యుని చుట్టూ నిత్యం అవిరామంగా ప్రత్యేక కక్ష్యలలో పరిభ్రమణం చేస్తూనే ఉన్నాయి. ఈ మొత్తం ఖగోళ వ్యవస్థను సౌరకుటుంబం అంటారు. ఇందులో సూర్యుడు కేంద్రంగా గ్రహాలన్నీ తమతమ ప్రత్యేక కక్ష్యలలో నిర్ణీత వేగాలతో గురుత్వాకర్షణకు లోనై తిరుగుతూ ఉన్నాయి. ఉదాహరణకు సూర్యుని నుంచి సుమారు 150 మిలియన్ కిలోమీటర్ల సగటు దూరంలో వున్న కక్ష్యలో 30 కిలోమీటర్లు / సెకను వేగంతో భూమి తిరుగుతూవుంది.

అంతేకాక అది 465 మీటర్లు / సెకను వేగంతో ఆత్మ ప్రదక్షణం కూడా చేస్తుంది. సౌరకుటుంబం చిత్రాన్ని పటం 1 లో చూడండి.




పటం 1 సౌరకుటుంబం

భూమి మీద నివసించే జీవరాశులు అన్నిటి మనుగడకు కావలసిన శక్తి మొత్తం సూర్యుని నుంచి లభిస్తుంది. అవసరమైన వాతావరణాన్ని భూమి సమకూర్చుతుంది. సూర్యునిలో జరిగే కొన్ని పరమాణు కేంద్రక చర్యల ఫలితంగా అపారమైనశక్తి సూర్యునిలో జనిస్తూ ఉంది. సూర్యుని కేంద్రకం వద్ద సుమారు 15 మిలియన్ కెల్విన్ డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుంది. సెల్సియస్ మానంలోని డిగ్రీకంటే కెల్విన్ మానంలోని డిగ్రీ విలువ $273^0$ ఎక్కువ.

భూమి వయస్సు సుమారు 4.6 బిలియన్ సంవత్సరాలు అని శాస్త్రవేత్తల అంచనా.

అయితే 600 మిలియన్ సంవత్సరాల నుంచే మనం భూమిని అర్థం చేసుకోడానికి వీలు కల్గింది. ఈ మొత్తం కాలాన్ని భూవిజ్ఞాన శాస్త్రవేత్తలు మూడు యుగాలుగా విభజించారు. వీటిని పాలిశాజోయికి, మెసోజోయికి, సెన్‌జోయికి, యుగాలు అంటారు. భూమి మీద మొట్టమొదటసారిగా ఆవిర్భవించిన జీవరాశి వయస్సును నిర్ణయించడానికి జరిపిన పరిశోధనలు ఆధారంగా దీని విలువ 3.5 బిలియన్ సంవత్సరాలని అంచనా. దీని ఆధారంగా భూమి మీద నీరు 3.5 బిలియన్ సంవత్సరాల క్రితం నుంచి మాత్రమే వుండి ఉండాలని శాస్త్రవేత్తలు ఊహించటం జరిగింది.

**అభ్యాసాలు**

భూమి యితర గ్రహాలతో పాటు సూర్యుని చుట్టూ పరిభ్రమణం చెందుతూవున్న వ్యవస్థపేరు ఏమిటి ? దీనిలోని ఇతర గ్రహాలపేర్లు రాయండి.

BRAOU

భూమి సూర్యుని నుంచి ఎంత దూరంలో (సగటు) ఉంది? భూమి సూర్యుని చుట్టూ ఎంత వేగంతో తిరుగుతూవుంది? ఎంతవేగంతో ఆత్మప్రదక్షణం చేస్తూంది?

భూమి వయస్సు ఎంతని అంచనా? అది ఎలాసాధ్యం అయింది? అందువల్ల తెలిసిన ఇతర విజ్ఞాన విషయాలు ఏవి?

## 1.3 భూ గ్రహంపై జీవం పుట్టుక

భూమి మీద జీవం మొట్టమొదటి సారిగా ఎలా పుట్టింది అనే అంశం ఇంకా పూర్తిగా అవగాహన కాలేదు అనే చెప్పాలి. అయితే శాస్త్రపరమైన కొన్ని ఊహలు ఆలోచనలు మాత్రం లేకపోలేదు. సూర్యుని నుంచి వచ్చే అతి నీల రోహిత కిరణాలు సహాయంతో కొన్ని సామాన్య కర్బన రసాయన పదార్థాలు ముందుగా మార్పు చెందాయి అని శాస్త్రవేత్తలు నమ్ముతున్నారు. సుమారు రెండు బిలియన్ సంవత్సరాల క్రితం ప్రోటెరోజోయిన్ యుగంలో ఈ జీవరాశులు నేల మీద వ్యాప్తి చెందాయి అని భావిస్తున్నారు. జీవరాశుల మనుగడకు ముఖ్యాధారమైన ప్రాణవాయువు (ఆక్సిజన్‌వాయువు) జీవరాశులు ఏర్పడిన తొలిదశలో భూమిపైలేదని అది తరువాతికాలంలో క్రమేపి ఏర్పడిందని తెలుసుకొన్నారు. సూర్యరశ్మి, నీరు, కార్బన్ డైఆక్సైడ్ వాయువులను వినియోగించుకొని మొక్కలు కార్బోహైడ్రేట్లు అనే ఆహార పదార్థాలను తయారు చేసుకొన్నాయని ఆ ప్రక్రియలో ఆక్సిజన్ వాయువు వెలువడిందని పరిశోధనలు తెల్పాయి. ఈ ప్రక్రియను కిరణ జన్య సంయోగక్రియ అంటారు. దీని ఫలితంగా భూమి మీద ఆక్సిజన్ వాయువు ఏర్పడడం ప్రారంభం అయి క్రమక్రమంగా దాని పరిణామం వర్తమాన స్థాయికి చేరుకుంది. అప్పుడు ఆక్సిజన్ వాయువుమీద ఆధారపడి జీవించే జీవరాశులు భూమిమీద పుట్టడం ప్రారంభం అయింది. ఈ క్రమంలో సముద్ర జంతువులు, నీటిలో నివసించే వెన్నెముక గల జంతువులు, నీటిలోనూ, భూమిమీద నివసించే ఉభయచర జీవులు మొదలైనవి పుట్టాయి. తమ పిల్లలకు తామే పాలిచ్చే స్తన్యదాలు అనే జీవరాశులు మొట్టమొదటిసారి 225 మిలియన్ సంవత్సరాల క్రితమే భూమిపై ఏర్పడ్డాయి. 70 మిలియన్ సంవత్సరాల క్రితం ప్రారంభం అయిన సెన్‌జోయిన్ యుగంలో పాలిచ్చే సముద్రపు జంతువులు, ఆదిమానవ జాతులు ఉద్భవించాయి. మానవుణ్ని పోలిన "రామపితికస్" "ఆస్ట్రాపితిసెన్స్", అనే అభివృద్ధి చెందిన ఆదిమానవ జాతులు సెన్‌బోయిన్ యుగం చివర దశలో ఏర్పడ్డాయి. ఆధునిక మానవుని పోలిన "హోమోసేపియన్లు" సుమారు 40,000 సంవత్సరాల క్రితం భూగ్రహంపై మనుగడ ఆరంభించినట్లు భావిస్తున్నారు.

**అభ్యాసాలు**

భూమిపై మొట్టమొదట జీవం ఎలా పుట్టింది?

BRAOU

ఆధునిక మానవుడ్ని పోలిన జీవులు ఏవి? ఇవి సుమారు ఎన్ని సంవత్సరాల క్రితం భూమిపై ఏర్పడ్డాయి ?

ఆది మానవ జాతులకు ముందు భూమిపై ఏర్పడ్డ జీవులు ఏవి?

## 1.4 భూ వాతావరణం

ఆకర్షణ ద్వారా భూమిని అంటిపెట్టుకొని అంతరిక్షంలో సుమారు 50,000 కిలో మీటర్లు వరకు వ్యాపించివున్న వాయు మండలాన్ని వాతావరణం అంటాం. భూమిపై నివసించే జీవులు అన్నీ వాటి మనుగడకు ఈ వాతావరణంపై ఆధారపడి వున్నాయి. సూర్యుడి నుంచి లభించే సౌరశక్తిని యాంత్రిక శక్తిగా మార్చే సాధనంగా ఈ వాతావరణాన్ని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. వాతావరణం సాంద్రత సముద్రమట్టం దగ్గర ఎక్కువగా ఉండి, క్రమేపి ఎత్తులకు పోయేకొద్దీ తగ్గుతుంది. వాతావరణ ఉష్ణోగ్రత కూడా దిగువనుంచి పైకి పోయేసరికి తగ్గుతుంది. ఈ ఉష్ణోగ్రత మార్పు ఆధారంగా వాతావరణాన్ని ఎన్నో పొరలుగా విభజించారు. తక్కువ ఎత్తులలో తటస్థపడే వాతావరణ పొరను తిరిగి మూడు భాగాలుగా లేదా ఆవరణలుగా విభజించారు. ఇవి ట్రోపోవరణం, స్ట్రాటోవరణం, మిసోవరణం. ఇవికాక అయినోవరణం కూడా వుంటుంది.



పటం 2 వాతావరణం భాగాలు

ఈ మూడు ఆవరణలలోని వాతావరణ భాగం కల్లోల స్థితిలో వుండి చాలా దట్టంగా వుంటుంది. ఇందుకు వ్యతిరేకంగా చాల ఎత్తున ఉన్న వాతావరణం నిశ్చలంగా ఉండి పలుచగా వుంటుంది. జీవరాశుల మనుగడకు అవసరమయ్యే తక్కువ ఎత్తులో ఈ వాతావరణంలో నైట్రోజన్, ఆక్సిజన్, కార్బన్‌డై ఆక్సిడ్, అర్గాన్, నీటి ఆవిరి మొదలైన వాయుస్థితిలోని రసాయన పదార్థాలు ఉన్నాయి. వీటిలో ప్రధానంగా నైట్రోజన్ ఆక్సిజన్ వాయువులు అధిక ప్రమాణంలో 78.21 ఘన పరిమాణ శాతం నిష్పత్తిలో ఉన్నాయి. మొత్తం వాతావరణంలో దిగువ ఎత్తులనుండి పైకి పోయేటప్పుడు ముందుగా ఆక్సిజన్ వాయువు దానిపై హీలియం వాయువు దానిపై హైడ్రోజన్ వాయువు తటస్థిస్థాయి. తక్కువ ఎత్తులోని వాతావరణంలో కార్బన్‌డై ఆక్సైడ్ వాయువు. భూమి నుంచి వికరణం చెందే లేదా పరావర్తనం చెందే ఉష్ణశక్తిని కొంతమేరకు తనలో బంధిస్తుంది. కాబట్టి వాతావరణంలో కార్బన్‌డై ఆక్సైడ్ వాయువు పరిమాణం పెరిగినకొద్దీ ఉష్ణశక్తి విలువ కూడా పెరుగుతుంది. ఈ కారణంగా వాతావరణంలో ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఈ స్థితి కొన్ని అనర్థాలకు దారి తీస్తుంది. కాబట్టి వాతావరణంలో ఈ వాయువు పరిమాణం పెరగకుండా చూడవలసిన బాధ్యత మన అందరిపైన వుంది. సూర్యుడి నుంచి వెలువడే అతి నీల లోహిత కిరణాల ప్రభావం ద్వారా ట్రాపోవరణంలోని ఆక్సిజన్ వాయువు కొంతమేరకు వాతావరణం భాగంలో ఓజోన్ అనే వేరొక మూడు పరమాణువుల ఆక్సిజన్ సమ్మేళనం (03) గా మారుతుంది.

భూగ్రహం ఈ సౌరకుటుంబంలో జీవరాశులకు, ముఖ్యంగా మానవులకు నివాస యోగ్యమైన గ్రహం. దీనిపై ఎన్నోరకాల జీవరాశులు, ఎన్నోరకాల సహజ వనరులు ఒకదానితో ఒకటి పరస్పర సంబంధం కల్గి ట్రాపోవరణంలో ఒకరక్షణ కవచంగా ఏర్పడి వుంది. దీనినే ఓజోన్ పొర అని వ్యవహరిస్తారు. సూర్యుడి నుండి భూమివైపు ప్రసరించే అపాయకరమైన కిరణాల బారినుండి జీవరాశులను పరిరక్షించడానికి ఈ ఓజోన్ పొర ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ ఓజోన్ పొర ఏర్పడకుండా వుంటే జీవరాశుల మనుగడ ముఖ్యంగా మానవుల మనుగడ ఎంత దుర్భరంగానో ఉండి ఉండేది. కాబట్టి ఈ పొరను కాపాడుకోవలసిన అవసరం, బాధ్యత ఎంతైనా ఉంది. అయితే ప్రస్తుత కాలంలో వాతావరణంలోకి ప్రవేశిస్తున్న పారిశ్రామిక వాయువులు ఈ పొరలో కొన్ని రంధ్రాలు ఏర్పరుస్తున్నట్లు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఇది ఇంకా ఈవిధంగా కొనసాగినట్లైతే జీవరాశుల మనుగడకే హాని కలుగవచ్చు. కాబట్టి, వాతావరణంలోని ఆక్సిజన్ కార్బన్‌డైఆక్సైడ్, ఓజోను వాయువులు జీవరాశుల మనుగడకు ఎంతో అవసరమని మనం తెలుసుకొని కావలసిన పరిమాణాలలో మాత్రమే వీటిని ఉంచవలసి వుంటుంది. వీటి పరిమాణం తగ్గినా, పెరిగినా మనుగడకే ప్రమాదం వాటిల్ల వచ్చుని గ్రహించాలి.

BRAOU

## అభ్యాసాలు

భూవాతావరణం అంటే ఏమిటి ? దాని నిర్మాణం ఎలా ఉంది ?

వాతావరణంలో జీవరాశులను అపాయకరమైన కిరణాలనుండి కాపాడుతున్న రక్షక కవచం పేరు ఏమిటి? అది ఎలా ఏర్పడుతుంది ?

మానవుని మనుగడకు ఉపకరించే వాతావరణ నిర్మాణం గూర్చి రాయండి.

BRAOU

## 1.5 సముద్రాలు, మహాసముద్రాలు

మానవ జీవితాన్ని, ఇతర జీవరాశుల మనుగడని ప్రభావితం చేసే ఇతర భౌగోళిక అంశాలలో సముద్రాలు, మహాసముద్రాలు చాల ప్రాముఖ్యం గలవి. భూమి ఉపరితలంలో సుమారు 71 శాతం ఈ సముద్రాలే. ఈ భూగోళంలోని వివిధ ఖండాలను వేరుపర్చే నీటి ప్రదేశాలను స్థూలంగా మహాసముద్రాలుగా పరిగణిస్తారు. ఇటువంటి మహాసముద్రాలు ముఖ్యంగా నాలుగు. ఇవి ః

1. **పసిఫిక్ మహాసముద్రం** : ఇది ఆసియా ఆస్ట్రేలియాలను ఉత్తర అమెరికా నుండి వేరుపరుస్తుంది. ఇది మహాసముద్రాలు అన్నింటిలో అతిలోతైంది. సుమారు 11,022 మీటర్లు లోతైంది.

2. **అట్లాంటిక్ మహాసముద్రం** : ఇది యూరపు ఆఫ్రికాలను, దక్షిణ అమెరికా నుండి వేరు చేస్తుంది. ఇది వ్యాపార రంగంలో అతి ముఖ్యమైనది.

3. **హిందూ మహాసముద్రం** : ఇది ఆస్ట్రేలియాకు పడమటగాను భారతదేశానికి దక్షిణంగాను ఉంది.

4. **ఆర్కిటిక్ మహాసముద్రం** : ఇది ఉత్తర ధృవాన్ని ఆవరించుకొని ఉంది. రష్యా, స్కాండినేవియా, గ్రీన్‌లాండ్, కెనడా, అలస్కాలను ఎల్లలుగా కల్గి ఉంది.

ఇవి కాక చాల సంఖ్యల్లో సముద్రాలు ఉన్నాయి. ఉదాహరణకు అరేబియా సముద్రం, బేఆఫ్ బెంగాల్, పెర్నిమన్‌గల్ఫ్ మొదలైనవి.

సముద్రాల సగటులోతు 3.7 కిలోమీటర్లు. భూమి లోతుల నుండి వచ్చిన నీరు ఈ సముద్రాలను ఏర్పరచింది. సముద్రపు నీటిలో చాల రకాల రసాయన పదార్థాలు ఉన్నాయి. వీటిలో అతి ముఖ్యమైంది ఉప్పు. ఇంకా మెగ్నీసియం, కాల్షియం పొటాసియం, లోహాల సల్ఫేటు, బైకార్బనేటు లవణాలు కూడా ఎక్కువ పరిమాణంలో వున్నాయి. ఈ కారణంగా మంచి నీటి సాంద్రతకంటే సముద్రపు నీరు సాంద్రత చాల ఎక్కువ. అంతేకాక సముద్రపు నీరు రుచికి ఉప్పగా వుంటుంది. సముద్రంలో నీరు నిశ్చలంగా ఉండక ఎప్పుడు చలనంలోనే వుంటుంది. ఈ చలన స్వభావం ఆధారంగా సముద్ర స్వభావాన్నీ కూడా నిర్ణయిస్తారు.

సముద్ర జలాల చలనం భూవాతావరణంపై ఎంతో ప్రభావాన్ని చూపుతుంది. సముద్రపు జలాల ప్రవాహాల ద్వారానే సముద్రంలోని ఖనిజాలు, ఆహారపదార్థాలు, జలజీవరాశులు భూగోళంలో ఒక ప్రదేశంనుండి వేరొక ప్రదేశానికి రవాణా చెందుతున్నాయి. సముద్రపు జలాలు అన్నీ లోతులలోను అడ్డంగాను నిలువుగాను ప్రవహిస్తూ ఉంటాయి. ఈ జల ప్రవాహానికి భూమ్యాకర్షణ శక్తి కారణం అయినప్పటికి అది ఒక్కటే సముద్రపు నీటి చలనానికి దోహదం చేయలేదు. సౌరశక్తి భూమ్యాకర్షణ శక్తి ఈ రెండింటి మొత్తం ప్రభావం కారణంగానే ఈ సముద్రపునీటి చలనం ఏర్పడుతుంది. అంతేకాకుండా సూర్య చంద్రుల గురుత్వాకర్షణ బలలాలు కూడా ఈ నీటిచలనాన్ని ప్రభావితం చేస్తాయి. దీని కారణంగానే సముద్రపు అలలు ఏర్పడతాయి. కాబట్టి వాతావరణంలో మానవుడు తన కార్యకలాపాల ద్వారా కల్పించిన అవాంఛనీయ మార్పులు పరోక్షంగా ఈ సముద్ర జలాల చలన స్వభావాన్ని ప్రభావితం చేస్తాయి. ఇవి ఒకొక్కప్పుడు ప్రకృతి వైపరీత్యాలకు దారితీస్తాయి. ఉదాహరణకు ప్రకృతిలో ఈ మధ్యకాలంలో కార్బన్‌డై ఆక్సైడ్ వాయువుపరిమాణం విపరీతంగా పెరిగి పోతూంది. దీని కారణంగా భూ ఉష్ణోగ్రత పెరుగుతూంది. ఫలితంగా సముద్రమట్టం 4 మీటర్లు ఎత్తు వరకు పెరుగుతూందని ఒక అంచనా. ఇదే జరిగినట్లైతే కొన్ని దేశాలు శాశ్వతంగా మునిగి పోయే ప్రమాదం ఉంది. ప్రపంచ దేశాలలోని చాలదేశాల శాస్త్రవేత్తలు పరస్పరం సహకరించుకొని ఈమధ్యకాలంలో సముద్రాల అంతర్భాగాన్ని గూర్చి తెలుసుకోనేందుకు వీలుకల్పించే విలువైన పరిశోధనలు జరిపారు. ఇందుకుగాను సముద్రాలలో సుమారు 9.5 కిలోమీటర్లు లోతుకు చేరుకొనే జలాంతర్గాములను రూపకల్పన చేసారు. సముద్రపు అట్టడుగు భాగాల ఛాయాచిత్రాలను తీయడానికి వీలు కల్పించే పనిముట్లను, కెమెరాలను రూపకల్పన చేయగల్గారు. ఇది మన అందరం గర్వించదగిన విషయాలు. అంతే కాక సముద్రపు అట్టడుగు భాగాలలో ఉన్న మట్టి నమూనాలను పరిశోధించి వాటిలో వివిధ మందాలు కల సెడిమెంటు రాతి సంబంధమైనవి లేదా జీవసంబంధమైనవి ఉన్నట్టు కనుగొన్నారు. చనిపోయిన జీవరాశుల అవశేషాలు ఈ లోతులలో పాతుకుపోయి కొన్నివేల సంవత్సరాలు నిక్షిప్తమై ఉండి ఈ సెడిమెంటులో శిలాజాలుగా భద్రపరచబడి ఉన్నట్లు కనుగొన్నారు. జీవరాశులు వాటి నిజరూపాలతో కాని లేదా కొన్ని రకాల పోతలు ముద్రల రూపాలలో కాని శిలాజాలుగా భద్రపరచి వుంటాయి. ఈ కారణంగానే సెడిమెంటరీ శిలలు ఈ శిలాజాలకు ఉనికిపట్టుగా ఉన్నాయి. అయితే సముద్రపు ఇతర వృక్షసంబంధమైన లేదా బొగ్గు రూపాలలో ఇవి నిల్వచేయబడి వుంటాయి. ఈ విధంగా చాలారకాల నిక్షేపాలు ఏర్పడుతున్నాయి.

BRAOU

## అభ్యాసాలు

సముద్రాలు, భూ ఉపరితలంలో ఎంత భాగాన్ని ఆక్రమిస్తున్నాయి. వాటి జలాల కదలికలు ఎలాజరుగుతాయి ?

సముద్ర జలాల చలనం వాతావరణ కాలుష్యం వీటికి మధ్య సంబంధం ఏమిటి? సముద్ర సంపదను గూర్చి రాయండి ?

శిలలు అంటే ఏమిటి ? అవి ఎలా ఏర్పడతాయి ?

BRAOU

Dr. BRAOU LIBRARY Acc. No: 115094 Class No: 659.2 PRA

## 1.6 భూగోళ శీతోష్ణస్థితి

భూగోళం తలం ఘనమైన పరిమాణం కారణంగా వివిధ ప్రాంతాలలో వివిధ రకాల శీతోష్ణస్థితి పరిస్థితులను కల్గి ఉంటుంది. వీటిని అధ్యయనం చేయడానికి వీలుగా మొత్తం గోళాన్ని భాగాలుగా విభజిస్తారు. ఈ భూభాగాలను గుర్తించడానికి వీలుగా గోళంపై నిలువుగాను అడ్డంగాను ఊహారేఖలను గీస్తారు. ఉత్తర ధృవాన్ని దక్షిణ ధృవాన్ని కలుపుతూ గీసిన నిలువు గీతలను అక్షాంశాలు (మెరిడియన్స్ ఆఫ్ లాంగిట్యూడ్లు) అనీ తూర్పు పడమరలను కలిపే రేఖలను రేఖాంశాలు (లాటిట్యూడ్ సమాంతరాలు) అనీ వ్యవహరిస్తారు. వీటిని డిగ్రీలలో కొలుస్తారు. భూగోళాన్ని రెండు సమ అర్ధ భాగాలుగా విభజించే ఊహారేఖని భూమధ్యరేఖ అంటాం. ఈ కారణంగా దీని లాటిట్యూడ్‌లను 00గాను ఉత్తర, దక్షిణ ధృవాల లాటిట్యూడ్‌లను900 గాను వ్యవహరిస్తారు. ఇంతేకాక $23^1/_2{}^0$ N, $23^1/_2$S, $66^1/_2{}^0$N, $66^1/_2{}^0$S ల వద్ద లాటిట్యూడేలు కూడా అతి ముఖ్యమైనవి. వీటి ఆధారంగా భూగోళాన్ని మూడు ప్రాంతాలు - జోన్‌లుగా విభజిస్తారు. వీనిని పటం 3 లో చూడండి.




పటం 3. భూమి ఉష్ణ పరిస్థితులను తెలిపేజోన్‌లు

వీటిని ఫ్రిజిడ్‌జోన్ (అతిశీతల మండలం) టెంపరేట్‌జోన్ (సమశీతోష్ణమండలం) టారిడ్ జోన్ (ఉష్ణమండలం) అంటారు. అయితే ఈ భూగోళ పరిస్థితులు వాతావరణంలో వస్తున్న మార్పుల ద్వారా అవాంఛనీయ రీతిలో ప్రభావితం అవుతున్నట్లు కనుగొన్నారు.

## 1.7 పర్యావరణ వ్యవస్థలు

ప్రకృతిలో ఒకదానితో ఒకటి సంబంధం ఉన్న జీవ నిర్జీవ రాశుల సమతుల్య వ్యవస్థలను పర్యావరణ వ్యవస్థలు అని వ్యవహరిస్తారు. మన భూగ్రహంపై ఇటువంటి వ్యవస్థలు ఎన్నింటినో మనం చూస్తాం. ఈ వ్యవస్థలలో భౌతిక అంశాలు, జీవ సంబంధమైన అంశాలు పరస్పరం సంబంధం కలిగి సమతుల్యంలో ఉంటాయి. అడవులు, సముద్రాలు, ఇటువంటి వ్యవస్థలకు ఉదాహరణలు. అడవులలో అనేక రకాల జీవ రాశులు, చెట్లు, పుట్టలు, జలవనరులు, రాతి సంబంధమైన భూభాగాలు అన్ని ఒక ప్రత్యేకమైన సమతుల్యం కలిగి ఉంటాయి. ఇదే విధంగా సముద్రంలోని వృక్ష సంబంధమైన వివిధ రకాల అంశీభూతాలు పరస్పరం ఒకదానితో ఒకటి సమతుల్య సంబంధం కలిగి ఉంటాయి. ఇటువంటి వ్యవస్థలు వాటిలోని వివిధ భాగస్వాముల మధ్య సమతుల్యాన్ని కలిగి ఉండడమే కాకుండా వివిధ వ్యవస్థల మధ్యకూడా సమతుల్యాన్ని ప్రదర్శిస్తాయి. ఈ కారణంగా ఈ వ్యవస్థలను పరస్పర సంభరిత వ్యవస్థలుగా పేర్కొంటారు. ఉదాహరణకు అడవులలో కురిసిన వర్షపు నీరు భూమిమీద వాగులుగాను, నదులుగాను ప్రవహించి చివరకు సముద్రంలోకి చేరుతుంది. ఈ ప్రక్రియలో నీరు తనతో బాటు ఎన్నో పదార్థాలను తీసుకొని పోయి సముద్రంలో చేర్చుతుంది. సముద్రపునీరు తిరిగి గాలి, ఎండల ప్రభావం ద్వారా ఆవిరిగా మారి, వాతావరణంలో మేఘాలుగాను ఏర్పడుతుంది. ఈ మేఘాలు తిరిగి వర్షించి అడవులతో సహా అన్నీ ప్రాంతాలలో వాగులుగాను నదులుగాను ప్రవహిస్తుంది. ఈ నీరు తిరిగి సముద్రంలో కలుస్తుంది. సముద్రపునీరు తిరిగి ఆవిరిగా మారి మేఘాలను ఏర్పరచి చివరకు వర్షిస్తుంది. ఈ విధంగా రెండు (అడవులు, సముద్రాలు) పర్యావరణ వ్యవస్థలు చక్రీయ పద్ధతిలో ఒకదానితో ఒకటి సమతుల్య సంబంధం కల్గి ఉంటాయి. ఇటువంటి చక్రీయ ప్రకృతి ప్రక్రియలను అధ్యయనం చేసే ప్రకృతి శాస్త్ర విభాగాన్ని పర్యావరణశాస్త్రం అంటాం. ఈ వ్యవస్థలలో ద్రవ్యం-శక్తుల మధ్య సమతుల్య సంబంధం ఉంటుంది.

ఈ కారణంగా భూమిని ద్రవ్యం-శక్తుల మధ్య సమతుల్యాన్ని సమకూర్చే బృహత్ వ్యవస్థగా పరిగణిస్తారు. కాబట్టి పర్యావరణ వ్యవస్థలను ద్రవ్యం-శక్తి పరంగానే అధ్యయనం చేస్తారు. అయితే భూమి మొత్తం ద్రవ్యరాశి స్థిరం అని భావించవచ్చు. శక్తి విషయంలో ఇటువంటి భావన చేయటం సులభంకాదు. కాంతి, ఉష్ణం, శక్తి రూపాలలో సూర్యుని నుండి భూమికి చేరుతుంది. ద్రవ్యం-శక్తి ఒకదానితో ఒకటి పరస్పరం ఎన్నో రకాలుగా చర్యలలో పాల్గొంటాయి. ఇటువంటి చర్యలు ప్రకృతిలో ఎప్పుడూ జరుగుతూ ఉంటాయి. కాబట్టి ప్రకృతి వైపరీత్యాల ద్వారా కానీ మానవుని కార్యకలాపాల వలన కానీ ఈ చర్యలలో గణనీయమైన మార్పు వస్తే, ఆ మార్పు తప్పకుండా పర్యావరణ వ్యవస్థలలో కన్పిస్తుంది. ఈ మార్పులు చాలాసార్లు మానవుని మనుగడకే ముప్పువాటిల్లేవిగా ఉంటాయి. కాబట్టి తన కార్యకలాపాలను సాగించేటప్పుడు మానవుడు ఈ విషయాలను గుర్తుంచుకోవాలి. ప్రకృతిలో జరిగే వివిధ ప్రక్రియలు నిర్దిష్ట మార్గాలలో జరుగుతాయి. ఈ మార్గాలలో శక్తి ప్రయాణిస్తుంది. ఉదాహరణకు సూర్యుని నుండి వెలువడే ఉష్ణం భూమిని వేడి చేస్తుంది. ఫలితంగా భూమిపైన ఉన్నగాలి వ్యాకోచిస్తుంది. నీరు ఆవిరి అవుతుంది. ఇవి వరుసగా గాలి ప్రసరణకు, మేఘాల ఏర్పాటుకు దోహదం చేస్తాయి. ఈ కారణంగా శీతోష్ణస్థితిలో మార్పులు వస్తుంటాయి. ఇదే విధంగా కొన్ని పచ్చని మొక్కలు, ప్రోటోజోవాలు పలురకాల బాక్టీరియాలు, సూర్యశక్తిని గ్రహించి ఆహార పదార్థాలను కిరణజన్య సంయోగ ప్రక్రియ అనే రసాయన చర్య ద్వారా తయారు చేసుకొంటాయి. ఇలా తాము స్వతంత్రంగా సూర్యశక్తిని గ్రహించి ఆహార పదార్థాలను తయారు చేసుకొనే జీవరాశులను ఉత్పత్తిదారులు అంటాం. ఉత్పత్తిదారులు తయారు చేసిన ఆహార పదార్థాలపై ఆధారపడి జీవించే ఇతర జీవరాశులను వినియోగదారులు అని వ్యవహరిస్తారు. ఉదాహరణకు జంతువులు వినియోగదారులు. ఎందుకంటే చిన్న జంతువులు, మొక్కలను తింటాయి. ఈ చిన్న జంతువులను పెద్ద జంతువులు ఈ పెద్ద జంతువులని ఇంకా పెద్ద జంతువులు తింటాయి. ఈ ప్రక్రియలో మొక్కలలోని ఆహార పదార్థం రూపంలో ఉన్న శక్తి మొక్కల నుండి చిన్న జంతువులకు, వీటి నుండి పెద్ద జంతువులకు వాటి నుండి ఇంకా పెద్ద జంతువులకు స్థాన చలనం చెందుతుంది. ఈ స్థానాంతర గమన

BRAOU

మార్గాన్ని ఆహార శృంఖల అంటాం. ఇదే విధంగా చనిపోయిన మొక్కల, జంతువుల అవశేషాలను కొన్ని మైక్రో జీవరాశులు ఆహారంగా తీసుకుంటాయి. ఫలితంగా మొక్కలలోని శక్తి జీవరాశులలోనికి స్థాన చలనం చెందుతుంది. అయితే ఆహారపు గొలుసులో ఆహారం ఒక జీవరాశి నుండి మరొక జీవరాశికి పోయే ప్రక్రియలో ఆహారం మొదటి దశనుండి చివరి దశకు చేరేసరికి సంబంధిత శక్తిలో నష్టం కలుగుతుంది. ప్రాథమిక ఉత్పత్తిదారులు ఉపయోగించుకొనే శక్తి, సౌరశక్తిలో 0.1 నుండి 2 శాతమే వుంటుంది. కాబట్టి వినియోగదారులు అయిన మానవులు, జంతువులు వినియోగించుకొనే శక్తి ఇంకా తక్కువగా వుంటుంది. ఇది ఉత్పత్తి దారులు గ్రహించిన శక్తిలో 10 శాతం మాత్రమే ఉంటుంది. అంటే సూర్యుని నుండి వెలువడే శక్తిలో 0.01 శాతం మాత్రమే మనకు, జంతువులకు లభ్యం అవుతుందని తెలుసుకోవాలి.

**అభ్యాసాలు**

పర్యావరణ వ్యవస్థ అంటే ఏమిటి?

ఉత్పత్తిదారులు, వినియోగదారులు - ఈ పదాలను వివరించండి.

BRAOU

ప్రకృతి నుండి లభించే శక్తిలో జీవరాశులు ఎంత భాగం వినియోగించుకోగల్గుతున్నాయి ?

ఆహార శృంఖల అనే పదాన్ని వివరించండి.

## 1.8. సహజ వనరులు

మానవులకు ఉపయోగపడే ప్రకృతిలో అపారంగా లభించే అన్నిరకాల జీవ, నిర్జీవ సంపదలను సహజ వనరులు అంటాం. ఉదాహరణకు ప్రకృతి, నీటి వనరులు (భూగర్భజలాలు, చెరువులు, నదులు, సముద్రాలు) అడవులు, పంటభూములు, శిలలు, ఖనిజాలు, పెట్రోలియం, సహజ వాయువు, జంతుసంపద, వృక్షసంపద వగైరా అన్నింటిని మనం సహజ వనరులుగా వ్యవహరిస్తాం. ఇదే విధంగా ప్రకృతిలో శక్తి వివిధ రూపాలలో లభిస్తుంది. వీటిని శక్తి సహజ వనరులు అంటాం. ఉదాహరణకు సూర్యుని నుండి లభించే సౌరశక్తి, గాలి సమకూర్చే వాయుశక్తి సముద్రపు అలల నుండి లభించే తరంగశక్తి, భూగర్భంనుంచి లభించే భూమి ఉష్ణశక్తి, మొదలైన శక్తిరూపాలు అన్నింటిని శక్తి వనరులుగా భావిస్తారు. ఈ సహజవనరులు రెండు రకాలు : 1. పునరావృతం అయ్యేవి. 2. పునరావృతం కానివి. మొదటి వర్గం వనరులు ప్రకృతి చర్యల ద్వారా తిరిగి తిరిగి ఏర్పడి మనకు అనంతంగా లభ్యం అవుతూనే ఉంటాయి. దీనికి సూర్యశక్తి ఒక ఉదాహరణగా తెలుసుకోవచ్చు. రెండవరకం సహజ వనరులు మనకు నిరంతరంగా లభించవు. అవి వాడుకలో తరిగిపోతూ ఉంటాయి. తిరిగి వాటిని మనం కాని, ప్రకృతిగాని, భర్తీ చేయడానికి సాధ్యంకాదు. ఉదాహరణకు ప్రకృతిలో దొరికే ఖనిజాలు - బొగ్గు, పెట్రోలియం.

BRAOU

జీవరాశుల ప్రమేయం సహకారంతో ప్రకృతిలో రసాయనిక ద్రవ్యం శక్తిరూపాలు పరస్పరం చర్య జరుపుతూ ఉంటాయి. ఈ ప్రక్రియలో జీవరాశులు శక్తిని ఉపయోగించుకొని రసాయనిక ద్రవ్యాలను గ్రహిస్తాయి. ఇలా గ్రహించిన రసాయనిక ద్రవ్యాలను పోషక పదార్థాలు (న్యూట్రియంట్స్) అని వ్యవహరిస్తారు. ఇలా గ్రహించిన రసాయనిక పదార్థాలలోని రసాయనిక మూలకాలలో సుమారు 30 నుంచి 40 వరకు జీవరాశుల మనుగడకు చాల అవసరం అవుతాయి. అయితే ఈ రసాయనిక మూలకాలు వాటిని గ్రహించిన జీవరాశులలో నశించవు. ఇవి తిరిగి ఇతర రసాయనిక పదార్థాల రూపాలలో భావి తరాల జీవరాశులకు ఉపయోగపడుతూనే ఉంటాయి. అంటే జీవరాశులకు, శక్తి రసాయన పదార్థాలకు మధ్య చర్య పునరావృతంగా జరుగుతూ వుంటుంది. జీవరాశులు ఈ పదార్థాలను ఒక రూపంలో గ్రహిస్తాయి. ఇలా బహిష్కరించబడిన పదార్థాలు తిరిగి కొన్ని చర్యల ద్వారా తొలి రూపాలలోకి మారి జీవరాశులకు తొలి విధంగా ఉపయోగపడుతాయి. ఈ చర్యలు ప్రకృతిలో చక్రీయ పద్ధతిలో జరుగుతూ ఉంటాయి. ఈ ప్రక్రియలలో జీవరాశులు శక్తి రూపాలు, భూద్రవ్యాలు కారణంగా వీటిని జీవ భూరసాయనిక చక్రీయ ప్రక్రియలు అంటాం. ఇటువంటివి భూగ్రహంపై కొన్ని సంఖ్యలలో జరుగుతూ ఉన్నాయి. జీవరాశుల మనుగడ ఈ భూమిమీద ఎప్పుడూ కొనసాగేందుకు కొన్ని రసాయనక పదార్థాలు పునరావృతం చెందాలి. ఈ చక్రీయ ప్రక్రియలు అందుకు ఉపయోగపడుతున్నాయి. వీటికి ఉదాహరణంగా నత్రజని, కార్బన్, ఫాస్ఫరస్, సల్ఫర్, చక్రీయ ప్రక్రియలను పేర్కొనవచ్చు.

మానవ కార్యకలాపాల కారణంగా ప్రకృతి వనరులు ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి అదే రూపంలోగాని లేదా మరొక రూపంలోగాని బదిలీ అవుతూ ఉంటాయి. అంటే రసాయన పదార్థాలు ఒక పర్యావరణ వ్యవస్థ నుండి ఇంకొక పర్యావరణ వ్యవస్థకు మారుతూ ఉంటాయి. ఈ మార్పు రెండవ పర్యావరణ వ్యవస్థకు హాని కలిగించవచ్చు లేదా ఒకప్పుడు మేలు కూడా కలిగించవచ్చు. కాని, ఎక్కువ సందర్భాలలో హాని కలగడమే కనిపిస్తుంది. ఉదాహరణకు ఒక ప్రదేశంలో దొరికే ఫాస్ఫేటు శిలను త్రవ్వి పైకి తీసి పొడి చేసి, ఆమ్లంలో కరిగించి వ్యవసాయ భూములలో ఎరువుగా ఉపయోగిస్తారు. వర్షపునీరు ఈ ఎరువును కొంతవరకు తనలోకరిగించుకొని, చెరువులలోనికి నదులలోనికి తనతోపాటు తీసుకొని పోతుంది. ఈ నీటి వనరులలో ఫాస్ఫేటు ప్రభావం ద్వారా ఆల్గె మొక్కలు విపరీతంగా పెరుగుతాయి. తరువాత కొంతకాలానికి అవి చనిపోతాయి. బాక్టీరియాలను అభివృద్ధి చేస్తాయి. ఈ బాక్టీరియాలు నీటి వనరులలోని కరిగిన ఆక్సిజన్ వాయువును విపరీతంగా వాడుకుంటాయి. ఈ కారణంగా ఈ నీటి వనరులలో నివశించే ఇతర జల చరాలకు సరిపడినంత ఆక్సిజన్ ఉండదు. ఫలితంగా ఈ జలచరాలు కూడా చనిపోతాయి. చనిపోయిన జలచరాల అవశేషాలు కూడా బాక్టీరియాలకు ఆహారంగా ఉపయోగపడి వాటి అభివృద్ధికి దోహదం చేస్తాయి. ఈ ప్రక్రియల ఫలితంగా ఒకప్పుడు మొక్కలతో ఉన్న పరిశుభ్రమైన నీరు కరిగి కలకల లాడే నీటి వనరులు దుర్వాసనతో కూడి బాక్టీరియాలకు నిలయమై బురద నీటి వనరులుగా మారిపోతాయి. వీటిలో కొద్ది ప్రమాణంలో మాత్రమే జీవరాశులు నివసించకలుగుతాయి. దీనిని శాస్త్ర పరిభాషలో "యూట్రిఫికేషన్' అంటారు. ఈ పరిస్థితి సహజ వనరుల నష్టానికి, పరిసరాల కాలుష్యానికి దారితీస్తుంది.

### 1.8.1 సహజ వనరుల వాడుకపోకడలు - సంబంధిత పరిణామాలు.

**ఎ) ఖనిజ సంపదలు :-** ప్రకృతిలో ఎన్నో లోహాలు వాటి రసాయనక సమ్మేళనాల రూపంలో ప్రకృతిలో లభిస్తాయి. వీటిని లోహ ఖనిజాలు అంటాం. కొన్ని రసాయన పద్ధతులద్వారా ఈ ఖనిజాల నుండి లోహాలను రాబట్టుతారు. దీనినే లోహ సంగ్రహణం అని వ్యవహరిస్తాం ఈ లోహాలను పరిశ్రమలలోను, ఇతర కార్యకలాపాలలోను విరివిగా వాడుతున్నాం. ఈ లోహ వినియోగపు రేటు ప్రస్తుతం ఉన్న ప్రమాణంలో ఇంకా కొనసాగితే ప్రపంచంలో ఉన్న లోహఖనిజ వనరులు ఇంకొక 50సంవత్సరాలకు మించి సరిపడవని శాస్త్రవేత్తల అంచనా. ప్రస్తుతం అందుబాటులో ఉండే పెట్రోలియం సహజ వాయువు వనరులు కూడా ప్రస్తుతం వాటి వినియోగం రేటును కొనసాగిస్తే ఇంకొక 20 సంవత్సరాలకు మాత్రమే సరిపోతాయి అని ఒక అంచనా. కాబట్టి తరువాతి కాలాల వారు తమ ఉపయోగానికి మొత్తం వనరుల్ని పొదుపుగా వాడుకొంటూ కాపాడుకొంటూ రావాలి అని శాస్త్ర వేత్తలు చాలమంది భావిస్తున్నారు.

ఇంకొక 2000 సంవత్సరాలకు భూవనరులు సరిపోతాయి అని ఒక అంచనా. సముద్రాలలో అట్టడుగు భాగాలలో లోహసంపదలు పుష్కలంగా ఉన్నాయని వాటిని వెలికి తీసి ఉపయోగించుకొనడానికి వీలు కల్పించే కొత్త సాంకేతిక పద్ధతులను, పనిముట్లను కనుగొనవలసిన అవసరం ఎంతైనా ఉందని శాస్త్ర వేత్తలు భావిస్తున్నారు. కాబట్టి సుస్థిరమైన అభివృద్ధిని సాధించి ఈ సహజ వనరులను అందించే విషయంలో భావితరాలవారికి అన్యాయం చేయకుండా ఉండాలంటే పరిశ్రమలలో మనం క్రొత్త సాంకేతిక పద్ధతులను రూపొందించవలసి ఉంటుంది. అంతేకాక పరిశ్రమల నుండి వెలువడే వ్యర్థపదార్థాల పరిమాణాన్ని తగ్గించడం లేదా వాటిని తిరిగి ఉపయోగ యోగ్యమైన పదార్థాలుగా మార్చే పద్ధతులను గూర్చి పరిశోధనలు జరపడం, ప్రత్యామ్నాయాలను కనుగొనడం కూడా ఈ సహజ వనరులను కాపాడుకొనడానికి ఎంతగానో ఉపయోగ పడుతాయి.

**బి) శక్తి వనరులు వినియోగం కొన్ని ఆలోచనలు :** మానవుడు తన మనుగడకు, సామాన్య నిత్య జీవనానికి, రోజువారీ కార్యకలాపాలకు అవసరమయ్యే కనీసపు శక్తి కంటే ఇప్పుడు అత్యధికంగా శక్తిని ఉపయోగిస్తున్నట్లు అర్థం అవుతుంది. ప్రకృతిలో ముఖ్యమైన శక్తులలో చాల భాగం మన పారిశ్రామిక సమాజ వాడుకలో ఉండే చాల రకాల

BRAOU

పదార్థాలను, సామగ్రిని, సాధనాలను, తయారుచేయడానికి ఉపయోగిస్తున్నామనడంలో ఏ మాత్రం సందేహం లేదు. మానవుని ఆహార సేకరణకు దైనందిన కార్యకలాపాలకు మాత్రమే శక్తి వాడుకను పరిమితం చేస్తే మనిషికి రోజుకి 2000 కాలరీల శక్తిమాత్రమే అవసరం అవుతుంది. అయితే మానవుడు "నిప్పు" ను కనుగొన్నదశనుండి ప్రస్తుతపు సాంకేతిక యుగం వరకు గడచిన కాలంలో వివిధ ప్రధాన దశలలో ప్రతిమనిషి కనీసపు శక్తి కంటే అత్యధికంగా శక్తిని వినియోగిస్తున్నాడు. ఈ శక్తి విలువలు కింది విధంగా ఉన్నాయి :

నిప్పును తయారు చేయక ముందు దశలో 2000 కాలరీలు / రోజు/ మనిషి.

నిప్పును తయారు చేయడం ప్రారంభించిన తరువాత - 4000 కాలరీలు / రోజు / మనిషి

పారిశ్రామిక విప్లవం తరువాతి దశలో - 70,000 కాలరీలు / రోజు / మనిషి

సామాన్య సాంకేతిక పరిజ్ఞానం సాధించిన దశ - 1,00,000 కాలరీలు / రోజు / మనిషి

ఉన్నతస్థాయి సాంకేతిక పరిజ్ఞానం పొందిన తరువాత దశ - 2,30,000 కాలరీలు / రోజు / మనిషి

అంతేకాకుండా ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల శాతం మొత్తం దేశాల్లో కేవలం 30 శాతం అయితే ఇవి వినియోగించే శక్తి ప్రపంచంలో లభించే మొత్తం శక్తిలో 80 శాతం. అంటే ప్రకృతి సమకూర్చిన సహజ సంపద అన్ని దేశాలకు సమానంగా ఉపయోగపడడం లేదని మనం గ్రహించాలి. ఈ కారణంగా ప్రపంచదేశాల మధ్య ఒక సద్భావనా ఒడంబడిక ఈ శక్తి సహజ వనరులు ఖనిజ సంపదలు వాడుక విషయంలో సాధించవలసిన అవసరం ఉంది. మొత్తం ప్రపంచ జనాభాలో 6 శాతం మాత్రమే జనాభాకల అమెరికా దేశం మొత్తం ప్రపంచంలో లభించే శక్తిలో సుమారు 30 శాతం శక్తిని వినియోగిస్తున్నట్లు ఒక అంచనా! ఈ కారణంగా సాంప్రదాయిక శక్తి వనరులు (పెట్రోలియం, సహజవాయువు, బొగ్గు, కలప మొదలైనవి) మీదనే ప్రపంచ ప్రజలు ఆధార పడడానికి వీలుపడదు అనేది అక్షర సత్యం కాబట్టి సంప్రదాయేతరశక్తి వనరులపైన, ఇంధనాలపైన మానవుడు తన దృష్టిని కేంద్రీకరించాలి. ఈ సాంప్రదాయేతర శక్తి వనరులలో అతిముఖ్యమైనవి సౌరశక్తి, అలలశక్తి, గాలిశక్తి, భూగర్భ ఉష్ణశక్తి, పరమాణుశక్తి, హైడ్రోజన్, వాయువువంటి సాంప్రదాయేతర ఇంధనాల ద్వారా లభించేశక్తి అయితే కొత్త శక్తి వనరుల అన్వేషణ పైనే మానవుడు దృష్టిని పూర్తిగా మరల్చకుండా ప్రస్తుతం అందుబాటులో ఉన్న సహజ వనరులను పొదుపుగా వాడడం కూడా అతిముఖ్యమైనవే.

BRAOU

వ్యర్థపదార్థాలని తగ్గించే కొత్త పారిశ్రామిక పద్ధతులను రూపొందించడం, వ్యర్థపదార్థాలను తిరిగి ఉపయోగయోగ్యమైన పదార్థాలుగా కూర్చే ప్రక్రియలను రూపొందించడం, సహజవనరులకు ప్రత్యామ్నాయాలను కనుగొనడం సాంప్రదాయేతర వనరులు, ప్రక్రియలు వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వటం, నష్టపోయిన భూసంపదను తిరిగి రాబట్టడం, భూమిని సారవంతం చేసే పద్ధతులను రూపొందించడం, సామాజిక అడవులను, సాంప్రదాయక అడవులను పెంచే కార్యక్రమాలను చేపట్టడం ఉన్న అడవులను, పరిరక్షించడం మొదలైనవి చాల ముఖ్యం అని మనం గ్రహించాలి. అన్నింటి కంటే అతిముఖ్యమైనవి వైవిధ్యంతో కూడిన జీవన సంపదను పరిరక్షించడం, అపాయాలకు గురి అవుతున్న పక్షులను జంతువులను రక్షించుకొనడం.

అభ్యాసాలు :

సహజవనరులు అంటే ఏమిటి? కొన్నింటిని ఉదహరించండి.

శక్తి వనరులను పేర్కొనండి.

ప్రకృతిలో జరిగే చక్రీయ ప్రక్రియలు ఏవి?

ప్రకృతి సహజ వనరుల వాడుకలో ఎలాంటి మార్పులు ప్రస్తుతం వాంఛనీయమో తెలుపండి ?

BRAOU

శక్తి వినియోగం పరిమాణంలో కాలానుగతిని వచ్చిన మార్పులు, కారణాలు తెలుపండి ?

అడవుల విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, కారణాలు తెలపండి.

## 1.9 వాతావరణ కాలుష్యం, దాని నివారణలో మానవుని బాధ్యత.

BRAOU

అభివృద్ధి కార్యక్రమాల కారణంగా కాని ఇతర కారణాల వలన కానీ, పర్యావరణ వ్యవస్థల సమతుల్యం జీవరాశులకు హానికలిగించే విధంగా వమ్ముచేయబడితే మనం ఆ పరిస్థితిని స్థూలంగా వాతావరణ కాలుష్యం లేదా పరిసరాల కాలుష్యం అంటాం. పర్యావరణ వ్యవస్థలు చాల క్లిష్టమైనవి. కాబట్టి ఈ వ్యవస్థలలో వచ్చే మార్పులు కూడా క్లిష్టంగానే ఉంటాయి. సమతుల్యం చెదిరి పోవడానికి దోహదం చేసే అంశాలను కాలుష్య కారణాలు అని వ్యవహరిస్తారు. ఈ కారణాలు రసాయన పదార్థాలు కావచ్చు లేదా శక్తి రూపాలు కావచ్చు, లేదా ఈ రెండింటి మధ్య కలిగే ఒక చర్యకావచ్చు. అయితే పదార్థం శక్తి స్వతహాగా కాలుష్య కారకం కాదు. అది ఎప్పుడైతే పర్యావరణ సమతుల్యాన్ని భంగ పరుస్తుందో, అప్పుడే దానిని మనం కాలుష్య కారకం అంటాం. ఉదాహరణకు కార్బనడైఆక్సైడ్ వాయువు వాతావరణంలో ఉంటుంది. అయితే తగుమాత్రంగా ఉంటుంది. దీని పరిమాణం ఎక్కువ అయితే వాతావరణ సమతుల్యానికి భంగం కలుగ చేసి దానిని కలుషితం చేస్తుంది. కాబట్టి మానవుల అభివృద్ధి కార్యకలాపాలు లేదా ఇతర కార్యకలాపాలు వాతావరణం మీద ఎటువంటి ప్రభావం కలుగజేసాయి. లేదా చేస్తున్నాయి అనే అంశం క్షుణ్ణంగా పరిశీలించవలసిన అవసరం ఉంది. ఇటువంటి పరిశీలనలను ముందుగా జరపకుండా ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టరాదు. దీనినే పరిసరాలపై ప్రభావం విశ్లేషణ అని శాస్త్రవేత్తలు అంటారు.

జపాన్ దేశంలో మినమటా దుర్ఘటనలో జపాన్ సముద్ర తీరం పాదరసం లోహ కాలుష్యానికి గురి అయింది. సముద్రజలాలు లోనికి చేరిన ఈ పాదరసంలోహం చేపలలో ప్రవేశించింది. ఆ చేపలు తిన్నవారు చని పోవడం జరిగింది. ఈ కారణంగా ఎందరో చనిపోవడం, చాల మంది గర్భిణీ స్త్రీలు అంగవైకల్యం కలిగిన సంతానానికి తల్లులు కావడం

జరిగింది. ఇదే విధంగా 1976 లో చైనాలో జరిపిన అణ్వస్త్ర ప్రయోగాల ద్వారా చైనాలోనే కాకుండా, అమెరికాలో కూడా వాటి దుష్ఫలితాలు కనిపించాయి. 1984లో వాతావరణంలోనికి విషవాయువు ప్రవేశించడం ద్వారా సుమారు 25000 మంది చనిపోయారు. రష్యాలో చర్నోబిల్‌లో సంభవించిన ప్రమాదం ద్వారా అధిక సంఖ్యలో ప్రజలు అణుశక్తి ప్రమాదాలకు గురి అయ్యారు. ప్రస్తుతకాలంలో వాతావరణం, పరిసరాలు, మానవుని ఆరోగ్యానికి హాని కల్గించే విష పదార్థాలతో కలుషితం కావడం ఒక సామన్య సంఘటన కింద ప్రజలు పరిగణిస్తున్నట్లు కనిపిస్తుంది, చాలమంది ప్రజలు ప్రతిదినం ఈ కాలుష్యంతో సహజీవనం చేస్తున్నారు అనడంలో ఏమాత్రం అసత్యం లేదు. వేరొక మార్గంలేని కారణంగా కొంతమంది, అజ్ఞానం చేత మరికొందరు, ఈ సహా జీవనం చేస్తున్నారు. ఈ కాలుష్యం అనేది ప్రకృతి సిద్ధమైన కారణాలు వల్ల కలగవచ్చు లేదా మానవుని కార్యకలాపాల ద్వారా సంభవించే కారణాలు ద్వారా కలగవచ్చు, గాలి, నీరు, నేల ప్రధానంగాను, వీటి ప్రభావం ద్వారా మన ఆహార దినుసులు, కూరగాయలు, జలచరాలు, పండ్లు మొదలైనవి అన్నీ కలుషితం చెందుతున్నాయి అనక తప్పదు. నాగరికతా జీవనం ఎన్నో రకాలైన కాలుష్యాలకు దారితీస్తుంది. అయితే ఈ కారణాలుగా మనం అభివృద్ధి కార్యకలాపాలను ఆపివేయడం కాని నాగరిక జీవనానికి స్వస్తి చెప్పడంకాని చేయలేం. అందుచేత వీటిని కొనసాగిస్తూ వాతావరణాన్ని పరిసరాలను ఎలా పరిరక్షించుకోవాలి అనేది ముఖ్యమైన ప్రశ్న. అంటే సుస్థిరమైన అభివృద్ధిని సాధిస్తూ, పరిసరాలను రక్షిస్తూ, ఆరోగ్యమైన జీవనానికి కారణమైన వాతావరణాన్ని భావితరాల వారికి ఎలా అందచేయాలి, సహజవనరుల పరిరక్షణ, అభివృద్ధి సాధన, వీటికి మధ్య జరిగే సంఘర్షణ ఒప్పుకి, ఒప్పుకి మధ్య సంఘర్షణగా భావించాలి కాని ఒప్పుకు, తప్పుకు మధ్య జరిగే సంఘర్షణగా భావించకూడదు. వాతావరణ కాలుష్యంలో మొత్తం మానవ జాతినే కలవర పరుస్తున్న ముఖ్యమైన సమస్యలను కింది విధంగా పేర్కొనవచ్చు :

1. వాతావరణంలో కార్బన్‌డైఆక్సైడ్, మిథన్, వాయువులు కొన్ని నైట్రోజన్ ఆక్సైడ్ వాయువులు పరిమాణం భరించగల స్థాయి కంటే అత్యధికంగా ఉండడం జరుగుతుంది. ఈ కారణంగా వాతావరణం ఉష్ణోగ్రత పెరగడం, ఫలితంగా సముద్ర మట్టాలు పెరగడం జరుగుతుంది. దీని వలన కొన్ని దేశాలు మునిగిపోయే ప్రమాదం ఉంది. ఈ వాయువుల అధిక పరిమాణం ద్వారా వాతావరణం వేడెక్కే దృగ్విషయాన్ని గ్రీన్ ఫలితం అంటారు.

2. రాకెట్లులలో వాడే ఇంధనాలు నుంచి వెలువడే వ్యర్థవాయువులు, రిఫ్రిజిరేటర్లు ఇండ్లలో వాడే కొన్ని రకాల అగ్నిమాపక సాధనాలు వాటి నుంచి వెలువడే వాయువులు, క్రిమినాశకాలలో వాడే రసాయన పదార్థాలు వాటి ద్వారా వెలువడే వాయువులు వాతావరణంలోకి క్లోరోఫ్లోరోకార్బన్‌లు అనే రసాయనిక పదార్థాలను విపరీతంగా చేర్చుతున్నాయి. దీని ఫలితంగా వాతావరణంలో కవచంగా పని చేసే ఓజోన్ పొరలో రంధ్రాలు ఏర్పడుతున్నాయి. ఇదే పరిస్థితి ఇంకా కొనసాగితే కొన్ని సంవత్సరాలలోనే జీవరాశులన్నీ అపాయకరమైన సూర్యుని నుండి అంతరిక్షం నుండి వెలువడే వికిరణాలకు గురి కావలసి వస్తుంది. ఇది చర్మ వ్యాధులకు, కాన్సర్ వ్యాధికి దారి తీస్తుంది. కాబట్టి ఈ పదార్థాల వాడుకను క్రమేపి తగ్గించి కొంతకాలానికి పూర్తిగా నిలిపి వేయాలని ప్రపంచదేశాలు ఒక ఒప్పందానికి రావడం తెలిసిన విషయమే. దీనికి ప్రత్యామ్నాయాలను తయారు చేయాలని కూడా నిశ్చయించడం జరిగింది.

3. పరిశ్రమల నుండి వాతావరణంలోకి చేరే నైట్రోజన్ ఆక్సైడ్లు, సల్ఫర్‌ఆక్సైడ్లు, కార్బన్‌డైఆక్సైడు వాయువు నీలివర్షపు నీటిలో కరిగి ఆమ్ల వర్షాలకు దారి తీస్తున్నాయి. ఈ విషయాలు ప్రతివారికి ఆందోళన కలుగజేస్తున్నాయి.

4. ప్రకృతి జన్య రసాయన పదార్థాలు లేదా కృత్రిమ రసాయన పదార్థాలు, కొన్ని జీవప్రక్రియల ద్వారా హాని కలిగించని సరళ పదార్థాలు ($H_2O$, $CO_2$, $N_2$ ) గా మారి వాతావరణం, పరిసరాలు ఎప్పుడూ పరిశుభ్రంగా ఉండడానికి దోహదం చేస్తాయి. ఇది ప్రకృతి ధర్మం. ప్రకృతి మనకిచ్చినవరం. ఇలా కాని సందర్భంలో ఈ ప్రపంచ మంతా ఎన్నో రకాల వ్యర్థ పదార్థాలకు ఒక కుప్ప తొట్టిగా మారి ఉండేది.

BRAOU

అయితే మానవుడు ఈ నాగరికతా ప్రపంచంలో కృత్రిమంగా తయారు చేస్తున్న చాల పదార్థాలు (పాలిస్టరు ప్లాస్టిక్‌లు, క్రిమినాశకాలు డిటెర్జింట్లు) ఈ విధమైన చర్యలకు అతీతంగా వుంటున్నాయి. ఈ కారణంగా వాతావరణం పరిసరాలు ఈ వ్యర్థ పదార్థాలతో నిండిపోయి వాటిని కలుషితం చేస్తున్నాయి. కాన్సర్ వంటి ఎన్నో ప్రాణహాని కలిగించే రోగాలకు దారి తీస్తున్నాయి.

5. విచక్షణారహితంగా అడవులను నరికి వేయడం, డామ్‌లను కట్టడం వంటి కార్యకలాపాలు అపూర్వ జీవన సంపదను నాశనం చేస్తున్నాయి. కాబట్టి ఈ భిన్న జీవ సంపదను పరిరక్షించుకునే సమయం వచ్చిందని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి.

పై పేర్కొన్న అంశాలు గూర్చి ప్రతి మానవుడు తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా వుంది.

**అభ్యాసాలు**

వాతావరణ కాలుష్యం అంటే ఏమిటి ? దీనికి కారణాలు ఏమిటి ?

కొన్ని ప్రమాదకరమైన కాలుష్యాలను వివరించండి ?

BRAOU

కాలుష్యనివారణ కార్యక్రమాలలో ముఖ్యమైన వాటి గురించి తెలుపండి ?

## 1.10. ముఖ్యవిషయాలను గుర్తుంచుకొందాం :

* మానవుని మనుగడకు, ఇతర జీవరాశులు జీవించడానికి దోహదం చేసే గ్రహం భూమి.
* భూమి సౌరకుటుంబంలో ఒక ముఖ్యమైన పెద్దగ్రహం
* భూమి సూర్యునికి 150 మిలియన్ కిలోమీటర్ల సగటు దూరంలో 30 కిలోమీటర్లు / సెకన్‌కు వేగంతో తిరుగుతూ ఉంది.
* ఆధునిక మానవుడిని పోలిన మానవజాతి సుమారు 40,000 సంవత్సరాల క్రితం భూమిపై మనుగడ ప్రారంభించినట్లు శాస్త్రవేత్తల అంచనా.
* భూ ఆకర్షణ ద్వారా భూమిని అంటిపెట్టుకొని కొన్ని కిలోమీటర్లు ద్వారా వ్యాపించి ఉన్న వాయు మండలాన్ని వాతావరణం అంటారు.
* తక్కువ ఎత్తులలో కల ఈ వాతావరణం మానవుల మనుగడకు ఎంతో అవసరం. ఇది ముఖ్యంగా మూడు ఆవరణలను కల్గివుంది. ఇది ట్రోపోవరణం, స్ట్రాటావరణం, మిసోవరణం.
* మానవుడు ఇతర జీవరాశులు, వీటి మనుగడకు అవసరమయే ఆక్సిజన్ వాయువుతో సహా ఈ వాతావరణంలో నైట్రోజన్, కార్బన్డై ఆక్సైడ్, నీటి ఆవిరి ఉన్నాయి.
* వాతావరణమే కాకుండా సముద్రాలు, మహాసముద్రాలు, ఖనిజసంపదలు, సహజవనరులు, శక్తి వనరులు, ఎన్నో భూగ్రహంపై జీవరాశుల కోసం సృష్టించబడి ఉన్నాయి.
* కాబట్టి వీటిని అవసరం అయినంత వరకు హాని కలిగించని విధంగా ఉపయోగించుకొని సుస్థిర అభివృద్ధిని సాధించవలసిన బాధ్యత మానవులపై ఉంది.
* ప్రతి మానవుడు ఈ భూగోళాన్ని దాని సహజవనరులను, శీతోష్ణస్థితిని, వాతావరణాన్ని భద్రపరచవలసిన అవసరం ఎంతైనా ఉంది.



BRAOU

## 1.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

30 పంక్తుల్లో జవాబులు రాయండి.

1. భూవాతావరణం అంటే ఏమిటో తెలిపి, దాని నిర్మాణాన్ని విశదీకరించండి.
2. పర్యావరణ వ్యవస్థలు ప్రాముఖ్యాన్ని వివరించండి ?

15 పంక్తుల్లో జవాబులు రాయండి.

1. విశ్వంలో భూగ్రహస్థానం ఏమిటో తెలపండి.
2. వాతావరణ కాలుష్య నివారణకు పాటింపవలసిన జాగ్రత్తలు ఏమిటి ?

BRAOU

# భాగం 2 ప్రపంచం : సామాజిక, రాజకీయ ఆర్థిక పరిస్థితులు

విషయ క్రమం


2.0 ఉద్దేశం

2.1 ప్రవేశిక

2.2 ప్రస్తుత ప్రపంచపు పూర్వ చారిత్రక స్థితి

2.3 జాతి రాజ్య భావన

అభ్యాసం

2.4 ప్రపంచ యుద్ధాలు

అభ్యాసం

2.5 ఐక్యరాజ్యసమితి

అభ్యాసాలు

2.6 అగ్రరాజ్యాలు, ప్రచ్ఛన్న యుద్ధం

అభ్యాసం

2.7 అలీనోద్యమం

అభ్యాసం

2.8 మూడవ ప్రపంచం - సమస్యలు

అభ్యాసం

2.9 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

2.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 2.0 ఉద్దేశం

ఈ భాగాన్ని చదివాక మీరు :

ప్రస్తుత ప్రపంచ పరిస్థితిని, పూర్వ చారిత్రక స్థితిని, జాతి రాజ్యభావన, ప్రపంచ యుద్ధాలు, ఐక్యరాజ్య సమితి, అగ్రరాజ్యాలు, ప్రచ్ఛన్నయుద్ధం, అలీనోద్యమం, మూడవ ప్రపంచ సమస్యలు మొదలైన అంశాలు వివరించగలుగుతారు.

## 2.1 ప్రవేశిక

స్వభావ రీత్యా మానవుడు సంఘజీవి. రాజకీయ జీవికూడా. తన జీవన పరిస్థితిని, పరిసరాల పరిస్థితులను మెరుగుపరచుకోవటానికి నిరంతరం కృషి చేస్తున్నాడు. నిరంతరాన్వేషణ పర్యవసానమే మానవనాగరికతా వికాసం. మానవ వికాస చరిత్రయే నాగరికతా వృద్ధిక్రమం. ఈ వృద్ధిక్రమంలో మానవుడు ఎదురైన ఎన్నో అడ్డంకులను తొలగించుకున్నాడు. నాగరికత వృద్ధితో మానవుడు మూఢ విశ్వాసాలను విస్మరించి నూతన జీవన విధానాన్ని సంతరించుకొన్నాడు. మానవుని నిరంతరాన్వేషణ ఫలితంగా అనేకాలైన కొత్త ఆవిష్కరణలు రూపు దిద్దుకొన్నాయి. తన అన్వేషణ పథంలో మానవుడు తోటి మానవులతో పోటీ పడ్డాడు. మానవుల మధ్య పోటీలు ఒక్కొక్క సందర్భంలో యుద్ధాలకు, సంఘర్షణలకు దారితీసాయి. జీవన పరిస్థితులను మెరగు పరచుకోవటం కోసం సంపాదించుకొన్న విజ్ఞానాన్ని మారణహోమానికి కూడ ఉపయోగపడేటట్లు తీర్చిదిద్దుకున్నాడు.

మధ్యయుగాల అంతర్థానం ఆధునిక యుగావిర్భావానికి దారితీసింది. ప్రాచీన మధ్య యుగాలలో మానవుని కృషి పర్యవసానమే ఆధునిక యుగం. అతికొద్ది కాలంలోనే గత యుగాలలో సాధించిన దానికంటే మిన్నగా విజ్ఞాన శాస్త్రాలను అధ్యయనం చేసి మధించి పరిసరాలపై మానవుడు విజయం సాధించాడు. పరిసరాలపై మానవుడు సాధించిన విజయం సామాజిక, రాజకీయ, ఆర్థిక వ్యవస్థలపై ప్రభావం చూపింది. తన చుట్టూగల ప్రపంచాన్ని, దాంట్లోని ప్రతి అంగుళ ప్రదేశాన్ని తెలుసుకొన్నాడు. పరిసరాలు తన జీవనానికి ఏ విధంగా దోహద పడతాయన్న విషయాన్ని గ్రహించాడు. ప్రకృతిని జయించాడు. దూరాన్ని జయించాడు. సమాచార విస్ఫోటనానికి మార్గం సుగమం చేసుకొన్నాడు. తన వివిధ ఆవిష్కరణల ద్వారా తన పరిసరాలను, తన్నుతాను బాగా తెలుసుకొన్న కొద్దీ మానవుని మనుగడ ప్రమాదకరంగా పరిణమించసాగింది.

ప్రధానంగా ఈ శతాబ్దంలో రెండు ప్రపంచ యుద్ధాలు జరిగాయి. మానవుని విజ్ఞాన ప్రగతి అణు విస్ఫోటనాన్ని సాధించింది. అంతరిక్షం అవగాహనలోకి వచ్చింది. అంతరిక్ష విజయం సమాచార ప్రసార విప్లవానికి బాగా అంది వచ్చింది. నిరంతరాన్వేషణ ఫలితంగా ప్రపంచంలో సంభవించిన సామాజిక, రాజకీయ, ఆర్థిక మార్పులను పరిశీలించటం ద్వారా ప్రస్తుత ప్రపంచ పరిస్థితి మనకు బాగా అవగాహన అవుతుంది. ఈ నిరంతరాన్వేషణ కృషి ప్రాచ్య ప్రపంచంలో కన్నా పాశ్చాత్య ప్రపంచంలోనే ఎక్కువగా జరిగింది. అందువల్ల సమకాలీన ప్రపంచ పరిస్థితుల అవగాహనకు ఈ శతాబ్దంలో జరిగిన ప్రధాన సంఘటనల అధ్యయనం చాలా అవసరం. పాశ్చాత్య ప్రపంచంలో జరిగిన సంఘటనలే ప్రపంచాన్నంతా ప్రభావ పరిచాయి. ఈ శతాబ్దంలోనే కనీవినీ ఎరుగనంత స్థాయిలో రెండు ప్రపంచ యుద్ధాలు జరిగాయి. మానవ మారణహోమాన్ని సులభతరం చేసే అణ్వాయుధాల ప్రయోగం వృద్ధి కూడా ఈ కాలంలోనే జరిగింది. యుద్ధాలను నివారించటానికి ప్రపంచం చేసిన ప్రయత్నాల పరంపరలో, సుస్థిర ప్రపంచ శాంతి స్థాపనా ధ్యేయంతో 1945 లో ఐక్యరాజ్య సమితి రూపొందింది.

## 2.2 ప్రస్తుత ప్రపంచపు పూర్వ చారిత్రక స్థితి

ఆధునిక యుగారంభం దాకా ప్రపంచం బల్లపరుపుగా ఉందన్నది పాశ్చాత్యుల విశ్వాసం. ఈ విశ్వాసం వృద్ధిని మతం బాగా సానుకూల పరిచింది. మధ్యయుగాల చివర దశలో సాంస్కృతిక పునరుజ్జీవనం, మతసంస్కరణోద్యమం మానవుణ్ణి వీపు తట్టి మేల్కొల్పాయి. ఫలితంగా జరిగిన ఆవిష్కరణలు, అన్వేషణలలో ప్రస్తుత ప్రపంచపు అవగాహన ఏర్పడింది. భూమి గుండ్రంగా ఉందని, అది సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తున్నదన్న విషయం అవగతమైంది. పాశ్చాత్యులు చేసిన ఈ అన్వేషణలు, ఆవిష్కరణలు ప్రపంచ ప్రజలను, వారి జీవితాలను, ఆర్థిక పరిస్థితులను బాగా ప్రభావ పరిచాయి.

BRAOU

అన్వేషణల ఫలితంగా కొత్త భూఖండాలు వెలుగులోకి వచ్చాయి. వలసల ఏర్పాటు అరంభమై సామ్రాజ్యవాదానికి బలం చేకూరింది. ప్రాచీన నాగరికతా ప్రాంతాలు చాలా వరకు పాశ్చాత్య దేశాల వలసలుగా మారాయి. ఇరవయ్యో శతాబ్దం ప్రారంభం వరకు ప్రపంచ చరిత్ర అంటే యూరోపు చరిత్రగానే భావించారు. యూరపులోని అయిదారు రాజ్యాలు మొత్తం ప్రపంచాన్ని వలసల పేరుతో తమ ఆధిపత్యంలో ఉంచుకోవటమే ప్రధాన కారణం. పాశ్చాత్య దేశాలు మొత్తం ప్రపంచాన్ని తమ అభీష్టానికి అనుగుణంగా వాటి రాజకీయ, సామాజిక, ఆర్థిక, విదేశాంగ విధానాలను నిర్దేశిస్తుండేవి.

ఆధునిక రాజ్య వ్యవస్థ 'జాతి రాజ్యం' (Nation State) భావనపై ఆధారపడిన రాజకీయవ్యవస్థ. ఆధునిక యుగారంభ దినాల్లోనే జాతీయ రాజ్య వ్యవస్థ ఛాయలను గుర్తించగలిగినప్పటికీ, అది 18,19 శతాబ్దాలలోనే యూరోపు ఖండంలోఒక నిర్దిష్టమైన రూపాన్ని పొందింది. వివిధ ఒడంబడికలు, సంధి ఒప్పందాల ద్వారా 19వ శతాబ్దాంతానికి జాతీయ రాజ్య వ్యవస్థకు బాగా గుర్తింపు లభించింది. ఇదే సమయంలో యూరోపు ఖండానికే పరిమితమైన జాతీయ రాజ్య భావం, అమెరికా, జపానుల ఆవిర్భావంతో అంతర్జాతీయకరణంచెంది మిగిలిన ఖండాలకు కూడా వ్యాపించింది. అయినప్పటికీ యూరోపుఖండమే అంతర్జాతీయ రాజకీయాలకు కేంద్రంగా కొనసాగింది. ఇరవయ్యో శతాబ్దం ప్రారంభం వరకు ప్రపంచ చరిత్ర అంటే యూరోపు చరిత్రగానే భావించేవారు. ఇరవయ్యో శతాబ్దంలో ప్రధానంగా రెండవ ప్రపంచ యుద్ధానంతరం జాతీయోద్యమాలు, రాజకీయ స్వాతంత్రోద్యమాల ద్వారా వలస వాదం బలహీన పడి ఎన్నో నూతన రాజ్యాలు ఆవిర్భవించాయి. ఈక్రొత్త రాజ్యాల ఆవిర్భావంతో అంతర్జాతీయ రంగంలో చాలా మార్పులు వచ్చాయి. కొత్తగా ఆవిర్భవించిన రాజ్యాలు సామ్రాజ్యవాదం, వలస వాదం, జాతి విచక్షణ విధానాల దుష్ఫలితాలను స్వయంగా అనుభవించి ఉన్నందున, వాటిని ప్రపంచంలో ఏ మారుమూల ఉన్నప్పటికీ వ్యతిరేకించటం సర్వసాధారణమైంది. మరొకవక్క ప్రపంచ శాంతికి ప్రాముఖ్యం పెరిగింది. కొత్త రాజ్యాలు పలు రాజకీయ ఆర్థిక సమస్యలను ఎదుర్కోనాల్సిరావడంతో, వాటి పరిష్కారం వాటి ప్రథమ కర్తవ్యమైంది. ఈ కొత్త రాజ్యాల తోడ్పాటు వల్ల అంతర్జాతీయ వ్యవహారాల్లో ఐక్యరాజ్య సమితి ప్రాధాన్యంపెరగటానికి, అవకాశం కలిగింది. అంతర్జాతీయంగా ఐక్యరాజ్య సమితికి ఆవశ్యకమైన నైతిక బలం ఈ రాజ్యాల నుండి లభిస్తోంది. వీటి ఆవిర్భావంతో అంతర్జాతీయ రంగంలో దోపిడీకి, ఆర్థిక అసమానతలకు అవకాశం లేని అంతర్జాతీయ సమ సమాజాన్ని స్థాపించటానికి ప్రయత్నాలు మొదలయ్యాయి.

BRAOU

## 2.3. జాతి రాజ్య భావన

జాతీయ భావం ఒక్క రోజున హఠాత్తుగా ఆవిర్భవించలేదు. అనేక శతాబ్దాల పరిణామ క్రమంలో వివిధ సామాజిక సంఘటనల ఫలితంగా, కాలక్రమేణా రూపు దిద్దుకొన్న భావమే జాతీయ భావం. జాతి అనే పదానికి స్పష్టమైన అర్థం ఇవ్వటం అంత సులభమైన విషయం కాదు. కొందరు రచయితల అభిప్రాయంలో జాతి, జాతీయ అనే అర్థాన్ని సూచిస్తున్నాయని భావించారు. మరి కొందరు'జాతి' పదాన్ని రాజ్యానికి సమానార్థంగా భావించారు. జాతి ప్రాథమికంగా సామాజిక, సాంస్కృతిక పరమైన మానవ సమూహం. మొదటిప్రపంచ యుద్ధం తరువాత 'జాతి' పదం కొత్త రాజకీయ అర్థాన్ని సంతరించుకొంది. ఈ అర్థంలో జాతి అంటే రాజ్యం, జాతీయ సమ్మదాయాల సమ్మిళితం. ఈ కారణంగానే సమకాలీన సమాజంలో రాజ్యాలను జాతీయ రాజ్యాలుగా పేర్కొంటున్నారు. జాతిరాజ్యంగా గుర్తింపు పొందటానికి సాంస్కృతిక, ఆధ్యాత్మిక బాంధవ్యంతో పాటు రాజకీయంగా వ్యవస్థీకృతం కావాలి. జాతీయభావం ఒక మానసిక ప్రవృత్తి. అది ప్రజా సముదాయంలో నెలకొన్న, కలిసి జీవించాలనే ప్రగాఢవాంఛ. ఒక నిర్ణీత ప్రదేశంలో నివసిస్తున్న, ఒకే భాష, ఒకే సాహిత్యం, ఒకే రకమైన సంప్రదాయాలు, ఒకే మతం కలిగిన ప్రజల మధ్య నెలకొన్న మానసిక స్పందన లేక అనుభూతి,తామంతా ఒకటే అనేసోదర భావం ఒక ప్రజాసముదాయంలో నెలకొని వున్నప్పుడు దాన్ని జాతీయ భావం అంటాం. ఒక ప్రజాసముదాయంలో అటువంటి జాతీయ భావం పెంపొందటానికి భౌగోళిక సాన్నిహిత్యం,రక్త సంబంధం, ఒకే రకమైన భాష, సాహిత్యం, మతం, ఉమ్మడి రాజకీయ

అవకాశాలు, ఉమ్మడి ఆర్థిక ప్రయోజనాలు, ఒకే రకమైన చరిత్ర, సాంస్కృతిక, సంప్రదాయాలు మొదలైన వివిధ కారకాలు దోహదం చేస్తాయి. వీటి కారణంగా ప్రజలలో సోదరభావం పెంపొంది జాతీయ భావంగా బహిర్గత మౌతుంది. జాతీయ సముదాయం రాజకీయంగా వ్యవస్థీకృతమై స్వతంత్రంగా వ్యవహరించ గల్గినప్పుడు దానిని 'జాతి' లేదా 'జాతీయ రాజ్యమని' పేర్కొనవచ్చు. ఆధునిక 'రాజ్యవ్యవస్థ' 'జాతీయ రాజ్యం' భావనపై ఆధారపడిన రాజకీయ వ్యవస్థ. దీన్ని ఒక విధంగా యూరోపియన్ రాజ్య వ్యవస్థకు కొనసాగింపుగా పేర్కొనవచ్చు. జాతీయ భావం వివిధ రాజ్యాలలో విభిన్నసాధనాల ద్వారా వ్యాప్తి చెందుతోంది.

అంతర్జాతీయ వ్యవహారాల్లో బాగా ప్రాముఖ్యత ఉన్న భావాలలో సామ్రాజ్యవాదం ఒకటి. అయితే ప్రపంచంలోని వారందరూ ఒకే అర్థంలో దీనిని వాడటం లేదు. అయినప్పటికీ ఈ పదం వాడుక బాగా ఎక్కువ అయింది. ఆధునిక కాలంలో సామ్రాజ్యవాదం పదాన్ని 1830లలో నెపోలియన్ సామ్రాజ్య స్థాపన సందర్భంలో వాడటం జరిగింది. ప్రఖ్యాత రోమన్ చక్రవర్తి జూలియస్ సీజర్ అడుగుజాడల్లో నడుస్తున్న నెపోలియన్ విధానాలను సామ్రాజ్య విధానాలనటం ప్రారంభమైంది. ఒక విధంగా ఒక దేశపు అంతరంగిక లేదా విదేశాంగ విధానాలను వ్యతిరేకిస్తున్న వారు ఆ విధానాలను సామ్రాజ్యవాద విధానాలనటంతో ఆ పదానికి వ్యతిరేకార్థం స్థిరపడింది. బ్రిటీష్ వారు తాముపలసలను విస్తరించే విధానాన్ని సానుకూల అర్థంలో 'సామ్రాజ్య సమాఖ్య రాజ్యం' 'తెల్లవారి బాధ్యత'(white man'sburden) లాంటి అర్థాలను వివరించారు. కాని బ్రిటిష్ సామ్రాజ్యవిధానం, ప్రధానంగా ఆసియా, ఆఫ్రికా ఖండాలలో పెరిగి, ఆ దేశాలలో పటిష్ఠమైన ఆందోళనలు, అలజడులు, ఉద్యమాలు వృద్ధి చెందటంతో దాన్ని వ్యతిరేకార్థంతో సామ్రాజ్యవాద విధానమన్నారు. బ్రిటన్, ఫ్రాన్సులే కాకుండా ఇతర యూరోపు దేశాలు కూడా ఇలాంటి వలస విధానాన్ని అవలంబించటం వల్ల, యూరోపియన్ వలస విధానాన్ని సామ్రాజ్యవాద విధానంగా పరిగణించసాగారు. ఆ విధంగా సామ్రాజ్యవాద భావనకు వ్యతిరేకార్థ భావం ఉండటమే గాక సామ్రాజ్యవాదం, వలస విధానం రెంటిని ఒక దానినిగానే భావించ ప్రారంభించారు. మొదటి ప్రపంచ యుద్ధానంతరం సోవియల్ రష్యా ఆవిర్భావంతో వ్యతిరేకార్థం పొందిన సామ్రాజ్యవాద భావనకు మరో అర్థం ప్రాప్తించింది. మార్క్సిస్టు వాదం ప్రకారం, పెట్టుబడిదారీ ఆర్థిక విధానానికి పర్యవసానం విదేశీ మార్కెట్లలో తమ పెట్టుబడులు వృద్ధి చెందేటట్లుగా వ్యవహరించటం. ఈ విధమైన ఆర్థిక విధానం ద్వారా లాభార్జనలే కాకుండా ఆ దేశాలలో తమ ఆధిపత్యం లేదా ప్రభావం పటిష్ఠ పరుచుకోవటం. ఈ లక్షణాలన్నీ సామ్రాజ్యవాద విధానాలుగా మార్క్సిజం పేర్కొంది. అంటే పెట్టుబడీ దారీ విధానం అవలంబించే దేశం మరో దేశంపై ఆధిపత్యం ఏర్పరచటం. అయితే మార్క్సిస్టులు సామ్రాజ్యవాద పదాన్ని కేవలంపెట్టుబడిదారీ విధానాలను అవలంబిస్తున్న ఉదార వాద దేశాలకే పరిమితం చేశారు. ధనిక దేశాలు అవి పెట్టుబడిదారీ విధానపు దేశాలైనా, సోషలిస్టు దేశాలైనా,బీద దేశాలపై పెత్తనం చేసే, ఆధిపత్యం, అజమాయిషీ నిర్వహించే విధానాలను కూడా సామ్రాజ్య విధానాలని అంటున్నారు. ఇటువంటి అభిప్రాయం ప్రధానంగా మూడో ప్రపంచ రాజ్యాల నుండి వెలువడింది.

అభ్యాసాలు

'జాతి' అన్న భావనను నిర్వచించండి.

BRAOU

సామ్రాజ్యవాద లక్షణాలను పేర్కొనండి.

## 2.4 ప్రపంచ యుద్ధాలు

19వ శతాబ్దం చివరలో యూరోపు ఖండంలో జరిగిన పరిణామాలు మొదటి ప్రపంచ యుద్ధానికి దారి తీసాయి. 1914లో యూరోపులోప్రారంభమైన యుద్ధం క్రమక్రమంగా ప్రపంచమందంతటా వ్యాపించింది. ఆనాటి అగ్రరాజ్యాలు తమ ప్రాబల్య పరిధిని పెంచుకోవటానికి చేసిన ప్రయత్నాలు,జాతీయ భావం వృద్ధి, ముడి పధార్థాల సరఫరాకు, విదేశీ మార్కెట్ల ప్రాబల్యం కొరకూ జరిగిన పోటీలు, దేశాల మధ్య తలెత్తే వివాదాలను పరిష్కరించుకోవటానికి సరి అయిన అంతర్జాతీయ యంత్రాంగం లేకపోవటం మొదటి ప్రపంచ యుద్ధానికి కారణాలయ్యాయి. మొదట యూరోపు రాజ్యాలమధ్య ప్రజ్వరిల్లిన యుద్ధం, వాటివలస ప్రాంతాలకు కూడా విస్తరించింది. చాలా కాలంగా ప్రపంచ వ్యవహారాల్లో జోక్యం కల్పించుకోకుండా 'ఏకాంత' విధానాన్ని అవలంబించిన అమెరికా సంయుక్త రాష్ట్రాలు మిత్ర రాజ్యాలకు బాసటగా యుద్ధంలోకి దిగింది. ఆనాటి అమెరికా అధ్యక్షులు ఉడ్రో విల్సన్ యుద్ధంలో పాల్గొనేటప్పుడు ప్రపంచాన్ని ప్రజాస్వామ్యానికి అనుగుణంగా ఉండేటట్లు చేయటానికేనని ప్రకటించారు. యుద్ధ లక్ష్యాలుగా విల్సన్ తన 14 సూత్రాల ప్రణాళికను ప్రకటించారు. మిత్ర రాజ్యాలు యుద్ధంలో విజయం సాధించాయి. యుద్ధానంతరం జరిగిన వర్సైల్స్ శాంతి సమావేశం కొత్త ప్రపంచ వ్యవస్థ రూపకల్పనకు ఏర్పాట్లు చేసింది. పూర్వపు జర్మనీ, టర్కీ, ఆస్ట్రియా - హంగేరీ సామ్రాజ్యాలు అంతర్ధానమయ్యాయి. స్వయం నిర్ణయాధికార ప్రాతిపదికగా పూర్వపు సామ్రాజ్యాలలోని ప్రజలు స్వతంత్ర రాజ్యాలుగా ఏర్పడేందుకు తీవ్రమైన కృషి చేశారు. అనేక కొత్త రాజ్యాలు ఏర్పడ్డాయి. యుద్ధం వివిధ దేశాల ఆర్థిక, సాంఘిక, రాజకీయ వ్యవస్థలపై ప్రభావం కనపరచింది. ఆర్థిక సంక్షోభం,నిరుద్యోగం, బీదరికం ప్రబలమయ్యాయి. వాటిని పరిష్కరించటంలోవిఫలమైన ఇటలీ, జర్మనీ, స్పెయిన్ రాజ్యాలలో నియంతృత్వ వ్యవస్థలు అవతరించాయి. అంతర్జాతీయ శాంతి పరిరక్షణ నిమిత్తం ప్రథమ ప్రయత్నంగా నానాజాతి సమితి రూపొందింది. సమితి సభ్యత్వాన్ని అమెరికా స్వీకరించలేదు. ఇటలీ, జర్మనీలలో తీవ్ర జాతీయ వాదాలు పెల్లుబుకాయి. రాజ్యాల మధ్య వివాదాలు పరిష్కరించాలని ఉద్దేశించిన నానాజాతి సమితి పటిష్ఠంగా వ్యవహరించలేక పోయింది. ప్రపంచ శాంతిని పరిరక్షించటంలో నానాజాతి సమితి విఫలమై, ఇరవై సంవత్సరాలకే రెండవ ప్రపంచ యుద్ధం ఆరంభమైంది. ఆనాటి ప్రపంచంలో కార్యసాధకమైన శాంతిని నెలకొల్పలేకపోయినా, ఆర్థిక,సాంఘిక,సాంస్కృతిక రంగాలలో సమితి చేసిన కృషి

BRAOU

ప్రశంసనీయం. అంతర్జాతీయ సహకారం,స్నేహం,సౌభ్రాతృత్వం పెంపొందించటానికి సమితి ఎంతో కృషి చేసింది. మొదటి ప్రపంచ యుద్ధం జరుగుతుండగానే రష్యాలో విప్లవం చెలరేగి సోవియట్ రష్యా అవతరించింది. ఇది ప్రపంచ రాజకీయాలలో గమనించదగిన విషయం. ఘోర వినాశానికి దారితీసిన రెండవ ప్రపంచ యుద్ధానికి అనేక కారణాలు దోహదం చేశాయి. మిత్రదేశాల చేతులలో ఓడిపోయిన జర్మనీ, వర్సైల్స్ శాంతి సమావేశంలో తీవ్ర అవమానాలకు గురి కావటం, ఆశించిన ఫలితాలు పొందటంలో విఫలమైన ఇటలీ, జపానులు అసంతృప్తిని వ్యక్తపరచటం, ఇటలీ, జర్మనీ, జపానులలో ఫాసిజం ఆవిర్భావం, మూడో దశకంలో ప్రపంచాన్ని చుట్టివేసిన ఆర్థిక మాంద్యం; ఫాసిస్టు రాజ్యాల పట్ల ఆనాటి అగ్రరాజ్యాలు అవలంబించిన 'సంతృప్తిపరచు విధానం' మొదలైన వాటిని ప్రధాన కారణాలుగా పేర్కొనవచ్చు. వర్సైల్స్ సంధి జరిగిన కొన్ని సంవత్సరాలు గడిచిన పిదప యూరోపు ఖండం యుద్ధ శిబిరాలుగా మారడం ప్రారంభమయింది. ముఖ్యంగా 1930వ దశకంలో అనేక ద్వైపాక్షిక, బహుపక్ష సంధులు రాజ్యాల మధ్య రూపొందాయి. పర్యవసానంలో మొదటి ప్రపంచ యుద్ధం ముందు నెలకొన్న వాతావరణమే రెండవ ప్రపంచ యుద్ధం ముందు కూడా నెలకొంది. నానాజాతి సమితిలో అమెరికా సభ్యత్వం స్వీకరించనందున సమితి వ్యవహారాలలో యూరోపు ఖండరాజ్యాల స్పర్థలు కీలక పాత్ర వహించాయి. రెండో ప్రపంచ యుద్ధం చాలా వరకు ముడి సరుకుల కోసం, ఎగుమతులు చేయటానికి మార్కెట్ల కోసం, పెరుగుతున్న జనాభాను సర్దటానికి వలసల కోసం జరిగింది. మొదటి ప్రపంచ యుద్ధం జరగటానికి గల కారణాలలో ఇవి కూడా కొన్ని ఉన్నాయి. ఆ పోటీ అంతం కాకపోగా రెండో ప్రపంచ యుద్ధ సమయానికి తీవ్రమైంది. వలసలు సంపాదించుకోవటంలో వెనుకబడిన ఇటలీ, జపానులు తీవ్రంగా ప్రయత్నించి విఫలమై అసంతృప్తి చెందాయి. ప్రపంచంలో గల అత్యధిక భాగం అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సు, బెల్జియం, హాలండ్, పోర్చుగల్ దేశాల ఆధీనంలో వలస ప్రాంతాలుగా ఉన్నాయి. జపాను, జర్మనీ, ఇటలీలు మూడూ తాము కూడా ముడిసరుకులు పొందటానికి, మార్కెట్లు సంపాదించుకోవటానికి సంసిద్ధమయ్యాయి. అవి మూడు ఏకమై దురాక్రమణ విధానాలను అవలంబించసాగాయి. వీటిలో జర్మనీ అనుసరించిన విస్తరణ, దురాక్రమణ విధానం చివరకు రెండవ ప్రపంచ యుద్ధానికి దారితీసింది. నానాజాతి సమితి బలహీనత కూడ కొంత వరకు కారణమైంది. ఈ యుద్ధంలో జర్మనీ, జపాను, ఇటలీలు అక్షరాజ్యాలుగానూ బ్రిటన్, ఫ్రాన్సు, సోవియట్ రష్యా, చైనా, అమెరికాలు మిత్రరాజ్యాలుగానూ పాల్గొన్నాయి.

రెండవ ప్రపంచ యుద్ధం వల్ల అపారమైన ప్రాణ నష్టం కోట్ల కొలది ధన నష్టం సంభవించింది. అది ఒక పీడ కల లాంటిది. రెండవ ప్రపంచ యుద్ధానంతరం ప్రపంచ రాజ్యాలన్నీ సహాయ సహకారాలందించుకొనే మిత్ర రాజ్యాలుగా సన్నిహితమయ్యాయి. యుద్ధ సమయంలో ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా బ్రిటన్, ఫ్రాన్సు,అమెరికాలు సాగించిన పోరాటంలో సోవియట్ రష్యా కూడా భాగస్వామి అయింది. యుద్ధ కాలంలోఏర్పడిన మిత్రభావం,స్నేహం కొనసాగి వారి సమిష్టి కృషి ప్రపంచంలో యుద్ధాలు రాకుండా నిరోధించగలదని అందరూ ఆశించారు. యుద్ధానంతరం అమెరికా తన ఏకాంత విధానానికి స్వస్తి చెప్పి ప్రపంచ రాజకీయాలలో చురుకుగా పాల్గొనటం ప్రారంభించింది. యుద్ధంలో విజయం పొందినప్పటికీ బ్రిటన్, ఫ్రాన్సులు సైనికంగా, ఆర్థికంగా బలహీన రాజ్యాలయ్యాయి. ఆర్థికవ్యవస్థలు కుంటుపడినందున సామ్రాజ్యవాద దేశాలు తమ వలసలను నిలుపుకోలేక పోయాయి. వలసల ప్రాంతాలలో జాతీయోద్యమాలు బాగా బలపడ్డాయి. వలసల విమోచనాఖికి రంగం సిద్ధమైంది. మిత్ర రాజ్యాల యుద్ధ కాలపు మైత్రి భ్రమగా మిగిలిపోయింది. సమిష్టి శత్రువులైన ఫాసిస్టు రాజ్యాలు అంతరించి పోవటంతో అమెరికా, సోవియట్ రష్యాల మధ్య భేదాభిప్రాయాలు పొడసూపాయి. వారి మధ్య చెలరేగిన అపనమ్మకాలే తరువాత కాలపు ప్రచ్ఛన్న యుద్ధానికి దారితీసాయి. నానాజాతి సమితి వైఫల్యాలను గుర్తించి పటిష్ఠమైన అంతర్జాతీయ వ్యవస్థ నిర్మాణానికి పునాదులు వేశారు.

BRAOU

**అభ్యాసం**

నానాజాతి సమితి వైఫల్యానికి కారణాలను పేర్కొనండి.

## 2.5 ఐక్య రాజ్య సమితి

BRAOU

రెండో ప్రపంచ యుద్ధం కొనసాగుతుండగానే మిత్ర రాజ్యాల నాయకులు అంతర్జాతీయ వ్యవస్థ అవసరాన్ని గుర్తించారు. విఫలమైన నానాజాతి సమితిని పునరుద్ధరించటం అసాధ్యమైన విషయంగా మిత్రరాజ్యాల నాయకులు భావించారు. కొత్త అంతర్జాతీయ వ్యవస్థ స్థాపనలో నానాజాతి సమితి ద్వారా పొందిన అనుభవం అపూర్వంగా ఉపయోగపడింది. యుద్ధం జరుగుతుండగానే జరిగిన మిత్ర రాజ్యాల అగ్రనాయకుల సమావేశాలలో భవిష్యత్తులో రూపొందనున్న ఐక్యరాజ్యసమితిని గురించి తీవ్రంగా చర్చించారు. రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభ దశలోనే కొత్త ప్రపంచ వ్యవస్థ స్థాపన కోసం మిత్ర రాజ్యాలు సూత్రప్రాయంగా అంగీకరించాయి. మిత్ర పక్షాలవైపు అమెరికా యుద్ధంలో చేరకముందే అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్, బ్రిటీష్ ప్రధానిచర్చిల్ అట్లాంటిక్ సముద్రంలోని ఒక రహస్య స్థావరంలో జరిపిన చర్చలలోయుద్ధానంతరం ప్రపంచ శాంతిని నెలకొల్పాల్సిన ఆవశ్యకతను వక్కాణించారు. దీనినే "అట్లాంటిక్ ఛార్టర్" అని వ్యవహరిస్తున్నారు. తరువాత జరిపిన వివిధ అగ్రనాయకులసమావేశాలలో ఐక్యరాజ్య సమితి ఏర్పాటును కూలంకషంగా చర్చించారు. ఆ చర్చల పర్యవసానంగా జరిగిన వివిధ దేశాల ప్రతినిధుల సమైక్య కృషి ఫలితమే ఐక్యరాజ్య సమితి. తమ జీవిత కాలంలో రెండు ప్రపంచ యుద్ధాలను చూసిన జనావళి భవిష్యత్తులో మరో ప్రపంచ యుద్ధాన్ని చూడకుండా ఉండగల వాతావరణాన్ని సృష్టించడమే ఐక్యరాజ్య సమితి ప్రాథమిక లక్ష్యం. అంతర్జాతీయ శాంతి భద్రతలను కాపాడటం, దురాక్రమణలను అరికట్టి శాంతిని పరిరక్షించడానికి అన్ని రకాలైన శాంతియుత మార్గాలను అన్వేషించటం, అంతర్జాతీయ సౌభ్రాతృత్వాన్ని ధృడ పరచడానికి విభిన్న దేశాల మధ్య సమాన హక్కులు, స్వయం నిర్ణయాధికారాల ప్రాతిపదికల మీద మైత్రిని పెంపొందించటం ఐక్యరాజ్య సమితి లక్ష్యాలు. ప్రపంచంలోని వివిధ దేశాల సభ్యత్వం ద్వారా ఐక్యరాజ్య సమితి ఏర్పాటైంది. సర్వం సహాధికారం కలిగి ఉన్న సార్వభౌమ రాజ్యాలు ఇందులో సభ్య రాజ్యాలు. భద్రతా సంఘం సిఫారసు మీద సాధారణ సభ అంగీకారంతో కొత్త దేశాలు సభ్యత్వాన్ని పొందవచ్చు. 'అన్నిదేశాలు సమానం' అనే సూత్రం ప్రాతిపదికపై సమితి సాధారణ సభ వ్యవస్థీకృతమైంది. ఇది ఒక రకంగా ప్రపంచ శాసనసభ. సంవత్సరంలో ఒకసారైనా తప్పనిసరిగా సమావేశమౌతుంది.

ఆరంభంలో 45 దేశాలలో ప్రారంభమైన ఐక్య రాజ్య సమితిలో నేడు 1995 నాటికి 186 రాజ్యాలు సభ్యత్వం స్వీకరించాయి. వలసల విమోచనం కారణంగా స్వాతంత్ర్యం పొందిన చాలా దేశాలు సమితి సభ్యత్వం పొందాయి. ఐక్యరాజ్య సమితి అంగాలలో భద్రతా సంఘం చాలా ప్రధానమైంది. నానాజాతి సమితి అనుభవాన్ని దృష్టిలోపెట్టుకొని ప్రపంచ శాంతిని పరిరక్షించే బాధ్యతను భద్రతా సంఘానికి అప్పగించారు. భద్రతా సంఘం ఒక విధంగా ఐక్యరాజ్య సమితి కార్యనిర్వాహక వర్గం. ఇందులో రెండవ ప్రపంచ యుద్ధ కాలం నాటి మిత్ర దేశాలైన బ్రిటన్, ఫ్రాన్సు, సోవియట్ రష్యా,చైనా, అమెరికాలు శాశ్వత సభ్యులు. మిగతా సభ్యులను సాధారణసభ నిర్ణీత కాల వ్యవధికి ఎన్నుకొంటుంది. యుద్ధ కాలం నాటి మైత్రి కొనసాగితే ప్రపంచ శాంతి స్థాపన చాలా సులభమవుతుందనుకొన్నారు. ఈ శాశ్వత సభ్య దేశాల అంగీకారం శాశ్వత సభ్యుల్లో ఏ ఒక్కరి ఇష్టం లేకున్నా భద్రతా సంఘం నిర్ణయాలు చేయవీలులేదు. దీనినే శాశ్వత సభ్య రాజ్యాల 'వీటో' అధికారంగా వ్యవహరిస్తున్నారు. యుద్ధకాలం నాటి మిత్ర రాజ్యాల స్నేహం యుద్ధానంతరం వైరంగా మారి పోయింది. పర్యవసానంలో భద్రతా సమితి సమర్థవంతంగా తన కర్తవ్యాలను నిర్వహించడంలో శాశ్వత సభ్య దేశాల వీటో అడ్డు వచ్చింది. ఈ వీటో అధికారం వల్ల భద్రతా సంఘం చర్చల్లో చాలాసార్లు ప్రతిష్ఠంభన ఏర్పడింది. 1950 తరువాత కొరియా సమస్య విషయంలో భద్రతాసంఘంలో ప్రతిష్టంభన ఏర్పడినందు వల్ల అమెరికా సాధారణ సభలో "శాంతి కోసం ఐక్యత" తీర్మానాన్ని ఆమోదింప చేసింది. శాశ్వత సభ్యరాజ్యాల వీటో వల్ల భద్రతా సంఘంలో ప్రతిష్టంభన ఏర్పడ్డప్పుడు సాధారణ సభ ఆ సమస్యను పరిష్కరించటానికి తగిన చర్యలు తీసుకొనే అధికారం లభించింది. ఐక్యరాజ్య సమితికి ఒక ప్రధాన కార్యదర్శి ఉంటారు. భద్రతా సంఘం సిఫారసుపై సాధారణ సభ్య ప్రధాన కార్యదర్శిని నియమిత కాలానికి నియమిస్తుంది. ఆయన సమితి సచివాలయానికి అధిపతి. తన రాజకీయ వ్యక్తిత్వం వల్ల సమితి దైనందిన పాలన విషయాలలోనే గాక అంతర్జాతీయ రాజకీయ సంబంధాలలో విశిష్టమైన పాత్రను నిర్వహిస్తారు. సమితి ప్రధాన కార్యదర్శి నిర్వహిస్తున్న పాత్ర ఆ పదవిని అలంకరించిన వివిధ వ్యక్తుల వ్యక్తిత్వాల ఆధారంగా పరిశీలించవచ్చు. ఎన్నో సందర్భాలలో ప్రధాన కార్యదర్శి ప్రదర్శించిన దౌత్యప్రతిభ, రాజకీయ చతురత, వివాదాల పరిష్కారానికి ఉపయోగపడింది. నానాటికి ప్రధాన కార్యదర్శి రాజకీయ ప్రతిభ,వ్యక్తిత్వం, సమితి కార్యకలాపాలలో ప్రాముఖ్యం పొందుతున్నాయి.

ఐక్యరాజ్య సమితి కేవలం రాజకీయ విధులనే కాకుండా ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక విధులను కూడా నిర్వర్తిస్తోంది. ఈ రంగాలలో కృషి చేసే నిమిత్తం అనేక ప్రత్యేక అనుబంధ సంస్థలు సమితికి ఉన్నాయి. ఈ సంస్థలకు స్వయం పాలన ప్రతిపత్తి ఉంది. ఐక్యరాజ్య సమితిలో సభ్యత్వం లేని దేశాలు కూడా ఈ సంస్థలలో సభ్యత్వం పొందవచ్చు. వీటిలో కొన్ని ఐక్యరాజ్యసమితి నిర్మాణానికి ముందునుంచే ఉన్నాయి. ఐక్యరాజ్య సమితి సాధించిన దానికంటే సాధించాల్సిందే ఎక్కువగా ఉంది. అంతర్జాతీయ శాంతి భద్రతలను పరిరక్షించటమన్న ప్రధాన ధ్యేయాన్ని పూర్తిగా సాధించలేక పోయింది. భద్రతా సంఘంలో అగ్రరాజ్యాలకున్న వీటో అధికారం వాటి సంకుచితత్వానికి రక్షాకవచంలాగా ఉంది. సమితిలోని దేశాలకు భిన్న సిద్ధాంతాలు, దృక్పధాలు, ధోరణులు ఉండటం వల్ల అవి ఒకే తాటిమీద నడవలేక పోతున్నాయి. పరస్పర వ్యతిరేకాభిప్రాయాలున్న దేశాల మధ్య సామరస్య సాధన కష్టమే కదా? సమితి స్థాపన నాటినుండి వచ్చిన చరిత్రాత్మక పరిణామాలలో సమితి సభ్యత్వం పెరుగుదల ఒక ముఖ్యమైన విషయం. దానితో పాటు దాని కార్యనిర్వహణ ధోరణిలో కూడా మార్పు చేర్పులు స్థానం పొందాయి. భద్రతా సంఘం చేతకాని తనం వల్ల సాధారణ సభ ఎలా అయితే ప్రాముఖ్యత సంతరించుకుందో, అలాగే చర్చల ద్వారా సాధారణ సభ సమస్యలను పరిష్కరించ లేకపోయినందువల్ల సమితి ప్రధానకార్యదర్శి ప్రాముఖ్యత పెరిగి అంతర్జాతీయ రాజకీయాలలో అతడు విశిష్టవ్యక్తిగా ఆవిర్భవిస్తున్నాడు. మానవాళి కంతటికీ వర్తించే విషయాలపై ఐక్యరాజ్యసమితి ఎన్నో అంతర్జాతీయ ఒడంబడికలకు రూపకల్పన చేసింది. ఐక్యరాజ్య సమితి జయాపజయాలు విచారిస్తున్నప్పుడు, ఈ సంస్థ సార్వభౌమాధికారంగల ప్రపంచ వ్యవస్థ కాదన్న విషయాన్ని మనం గుర్తుంచుకోవల్సి ఉంది. సాంఘిక, ఆర్థిక, మానవతా విషయాలలో సమితి కొన్ని విజయాలను సాధించింది. రాజకీయ విషయాలలో సంతృప్తికరంగా అంతగా విజయం

BRAOU

సాధించలేక పోతున్నది. వైఫల్యాలు అనేకం ఉన్నా, సమితి సాధించిన విజయాలూ లేకపోలేదు. చాలా ప్రాంతాలలో రాజకీయ ఉద్రిక్తతలను తగ్గించడంలో కృతకృత్యురాలైంది. చాలాసార్లు వివాదాలను విస్తృతం కానివ్వలేదు. రాజకీయేతర విషయాలలో సమితి సాధించిన విజయాలు ఎక్కువ. సమితి అంగాలు, ఉప అంగాలు, వివిధ కమీషన్లు, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో గణనీయమైన కృషి చేస్తున్నాయి. ఈ సంస్థలన్నీ రాజకీయేతరాలే అయినప్పటికీ, అవి రాజకీయాలకు అతీతంగా లేవు. వీటిలో చాలా సంస్థల ప్రధాన కార్యాలయాలన్నీ పెట్టుబడిదారీ దేశాల్లోనే ఉన్నాయి. ఇవి పశ్చిమ దేశాల రాజధానుల్లో ఉన్నందువల్ల ఆ దేశాల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. సంపన్న బీదదేశాల మధ్య గల వ్యత్యాసాలు ఐక్యరాజ్య సమితి నిర్వహణలో ప్రధానమైన పాత్రను నిర్వహిస్తున్నాయి.

**అభ్యాసాలు**

ఐక్యరాజ్య సమితి ప్రధాన లక్ష్యాలు ఏమిటి?

ఐక్యరాజ్య సమితి సాధించిన విజయాలు పేర్కొనండి.

## 2.6 అగ్రరాజ్యాలు, ప్రచ్ఛన్న యుద్ధం

ఆధునిక యుగంలో అగ్రరాజ్యాల అవతరణ మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాల కాలం నుండి ఆరంభమైందని చెప్పవచ్చు. ఈ రెండు యుద్ధాలలో పెద్ద దేశాలు కూటాలుగా తయారై పోరాడాయి. మొదటి ప్రపంచ యుద్ధం, దాని తరువాత

BRAOU

జరిగిన వర్సైల్స్ ఒప్పందం ప్రపంచ రాజకీయాలలో గొప్ప మార్పులను తెచ్చి పెట్టాయి. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత జరిగిన విజ్ఞాన శాస్త్ర ప్రగతి, నూతన మారణాయుధాలు అధికమై ఆత్మ రక్షణ యుద్ధ భావన అంతరించి ఆక్రమణ యుద్ధ ప్రశస్తి ఆచరణలోకి వచ్చింది. రెండవ ప్రపంచ యుద్ధం అంతర్జాతీయ రాజకీయ రంగాన్ని ద్విధ్రువ రాజకీయ రంగంగా మార్చింది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత పరిస్థితులలో అమెరికా సంయుక్త రాష్ట్రాలు, సోవియట్ రష్యా అంతర్జాతీయ రాజకీయాల్లో చురుకుగా పాల్గొనటంతో అగ్రరాజ్యాల యుగం ఆరంభమైంది. క్రమంగా అగ్రరాజ్యాల ప్రాధాన్యం పెరిగి ప్రచ్ఛన్న యుద్ధానికి దారితీసింది. అంతర్జాతీయ రాజకీయ విద్యార్థుల దృష్టిలో అగ్రరాజ్యాలు అంటే తమ సైనిక శక్తి, అణుశక్తి, ఆర్థిక పారిశ్రామిక శక్తితో ఇతర దేశాలను ప్రభావ పరచగల రాజ్యాలు. వాటికి అత్యున్నతమైన సాంకేతిక పరిజ్ఞానం ఉంది. తమకు గల శక్తి సామర్థ్యాలలో ప్రపంచంలో ఎక్కడ సంఘర్షణ జరిగినా, తమ ఉనికిని, ప్రాముఖ్యతను వెల్లడించుకోగల సంసిద్ధత, సామర్థ్యాలు కలిగి ఉన్నాయి. ఆధునిక యుగంలో పైన వివరించిన, శక్తి సామర్థ్యాలు ఒక అమెరికా, సోవియట్ రష్యాలకు మాత్రమే ఉన్నాయి. వాటివద్ద ప్రపంచ మారణహోమానికి కావల్సినన్ని ఆయుధాలు ఉన్నాయి. రెండవ ప్రపంచయుద్ధం తరువాత సోవియట్ రష్యా తన ప్రాబల్య పరిధిని తూర్పు యూరోపియన్ రాజ్యాలకు విస్తరించడానికి అనువైన విదేశాంగ విధానాన్ని అవలంబించింది. ఆ ప్రాంతంలోని దేశాలతో ఏర్పడిన కూటమికి సోవియట్ రష్యా నాయకత్వం వహించింది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత సోవియట్ రష్యా పశ్చిమ యూరోపియన్ రాజ్యాలను ఆక్రమిస్తుందన్న భయం ఆధారంగా అమెరికా సైనిక వ్యూహం రూపొందింది. వివిధ ప్రాదేశిక పరిస్థితులలో రెండు అగ్రరాజ్యాల మధ్య ఉన్న విభేదాలను వాటికి ఉన్న ప్రాధాన్యతలను బట్టి తెలుసుకోవచ్చు. యుద్ధానంతరం ప్రపంచపు భౌగోళిక వ్యూహంలో సోవియట్ రష్యా కేంద్రీకృత రాజ్యాలకు నాయకత్వం వహించింది. అమెరికా ఆ కేంద్రం చుట్టూ ఉన్న రాజ్యాలకు నాయకత్వం వహించింది. ఈ రెండు రాజ్యాల మధ్య రాజకీయ సిద్ధాంతపరమైన విభేదాలు ఉన్నాయి. ఇవి ఈ రాజ్యాలు పరస్పర శత్రుత్వ భావాన్ని కల్పించు కోటానికి దారితీశాయి. ఈ విధంగా ప్రపంచాన్ని రెండు పక్షాలుగా విభజించటాన్ని ప్రముఖ చరిత్రకారుడు ఆర్నాల్డ్ టాయన్బీ ద్విపక్ష రాజకీయాలుగా వర్ణించారు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో ఏర్పాటైన సైనిక ఒప్పందాలు అంతర్జాతీయ రాజకీయాలలో అగ్రరాజ్యాల ప్రాబల్యాన్ని సూచిస్తున్నాయి. ఇవి చేసిన ప్రయత్నాలు, వీటి ప్రాబల్యం, ప్రభావం ఎంత తీవ్రంగా ఉన్నాయంటే, రాజనీతి శాస్త్ర పరిభాషలోనే ఒక రాజ్య స్వతంత్ర ప్రతిపత్తిని సూచించే జాతీయ సార్వభౌమత్వం భావనకు అర్థం లేకుండా పోయింది.

BRAOU

ప్రఖ్యాత పాత్రికేయుడు వాల్టర్ లిప్‌మన్ రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అమెరికా సోవియట్ రష్యాల ద్వైపాక్షిక సంబంధాలలో ఉత్పన్నమైన ఉద్రిక్తతలను సంఘర్షణలను వర్ణించటానికి "ప్రచ్ఛన్నయుద్ధం" (Cold war) పదం ఉపయోగించారు. ప్రత్యక్ష సాయుధ సంఘర్షణ లేకుండా రెండు శత్రు రాజ్యాల మధ్య సంఘర్షణ స్థితిని సూచించే విధంగా అంతర్జాతీయ సంబంధాలలో ప్రచ్ఛన్న యుద్ధం భావన ప్రాచుర్యంలోకి వచ్చింది. కాని వాస్తవంలో ప్రముఖ అమెరికన్ ఆర్థిక శాస్త్రవేత్త బెర్నార్డ్‌బ్రూచ్ 1947లో మొదటసారి బహిరంగంగా గ్రీసు టర్కీ దేశాలకు సహాయమందిస్తున్న ట్రూమన్‌పథకం గురించి ఉపన్యసిస్తూ "ప్రచ్ఛన్న యుద్ధం" అనే నామకరణం చేశారు. కమ్యూనిజం వ్యాప్తి ప్రమాదం నుండి రక్షించుకోవటానికి ఇంగ్లీషు మాట్లాడే ప్రజలందరూ ఏకం కావాలని అమెరికాలోని మిస్సోరి రాష్ట్రంలో ఉన్న ఫుల్టన్ కళాశాలలో బ్రిటిష్ నాయకుడు విన్‌స్టన్ చర్చిల్ చేసిన ఉపన్యాసంతో ప్రచ్ఛన్న యుద్ధం ఆరంభమైందంటారు. పీటర్ హాజిలిప్ లూయిస్ నిర్వచనంలో రెండు అగ్రరాజ్యాల నాయకత్వంలో ఏర్పడ్డ కూటాల మధ్య యుద్ధవాతావరణం కల్పించే ఉద్రిక్తత, ప్రపంచ రాజ్యాల మీద దాని ప్రభావం ప్రచ్ఛన్న యుద్ధం. స్వరక్షణార్థం యుద్ధ గమనాన్ని పరికిస్తున్నట్లు కనిపించే అగ్రరాజ్యాలకు యదార్థంలో దురాక్రమణ భావప్రేరితమైన ఆలోచనలున్నాయి. ఒక్క వాక్యంలో చెప్పాలంటే వాస్తవంలో యుద్ధం కోసం నిత్యం చేసే సన్నాహాలే ప్రచ్ఛన్నయుద్ధం. కొందరి దృష్టిలో ప్రచ్ఛన్న యుద్ధం రాజకీయ శక్తిని గురించిన పోరాటం, సిద్ధాంతాల జీవన మార్గాల పోరాటం, జాతీయ ప్రయోజనాల ఆలోచనలు. చాలామంది దృష్టిలో ప్రచ్ఛన్నయుద్ధం పూర్వకాలపు సమతౌల్య భావన. ఇది రెండు అగ్రరాజ్యాల మధ్య కొనసాగిన పోటీ. ఇందులో సిద్ధాంతాల ప్రమేయం లేదు. ప్రచ్ఛన్న యుద్ధం

ప్రారంభానికి ఎవరు బాధ్యులన్న ప్రశ్నకు జవాబు లేదు. 1917లో సోవియట్ రష్యా విప్లవం ప్రచ్ఛన్న యుద్ధానికి నాందిగా కొందరు భావిస్తున్నారు. 1918లో సోవియట్ రష్యాలో పశ్చిమ రాజ్యాల వారి జోక్యమే ప్రచ్ఛన్న యుద్ధాన్ని ఆరంభించిందని కొందరు పేర్కొంటున్నారు. మరి కొందరు రెండవ ప్రపంచ యుద్ధ పరిస్థితులలో జరిగిన జర్మనీ విభజనను ప్రచ్ఛన్న యుద్ధానికి నాంది అంటున్నారు. రష్యా సామ్రాజ్యవాదం కమ్యూనిజం సిద్ధాంత వ్యాప్తి ప్రమాదం, అమెరికా రష్యాల మధ్య ప్రపంచాధిపత్యం కోసం పోటీ, అన్నీ ప్రచ్ఛన్న పరస్పర అనుమానాలు, శత్రుత్వ భావనలు, నిర్ణయాతీత సంఘర్షణలు రెండవ ప్రపంచ యుద్ధానంతరం మిత్ర పక్షాల విచ్ఛిత్తికి కారణమయ్యాయి. సోవియట్ రష్యా అమెరికాల మధ్య గల విభేదాలు, కేవలం రెండు అగ్రరాజ్యాలు తమ ప్రాబల్య స్థితిని కాపాడుకొనే ప్రయత్నాలు సూచించటమేగాక, రెండు పరస్పర వ్యతిరేక సిద్ధాంతాలైన కమ్యూనిజమ్, పెట్టుబడిదారీ విధానాల వైరుధ్యాలను కూడా ప్రస్ఫుటం చేస్తున్నాయి. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత మిత్రరాజ్యాల యుద్ధ లాభాలను పంచుకోవటానికి చేసిన ప్రయత్నాలలో సైద్ధాంతిక సంఘర్షణ మరింత తీవ్ర స్థాయికి చేరుకొంది. ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణానికి దారితీసిన పరిస్థితులను కొంతవరకు రెండు అగ్రరాజ్యాల మధ్య ఏర్పాటయిన యుద్ధ కాలపు శిఖరాగ్ర సమావేశాల నుండి గుర్తించవచ్చు. 1945లో అమెరికా ప్రయోగించిన అతి ప్రమాదకరమైన ఆటంబాంబు దౌత్యవ్యవహారాలలో నూతన దృక్కోణాన్ని ప్రవేశపెట్టి అగ్రరాజ్యాలు రెండింటికి సమానమైన భయ భ్రాంతులను కలుగజేసింది. పరస్పర అనుమానాలు, అంగీకారానికి రావడానికి సిద్ధపడకపోవటం, సమస్యల అవగాహనలో సామర్థ్యం లోపించటం, సాధారణ స్పర్థలు, అగ్రరాజ్యాల మధ్య ఉద్రిక్తత వృద్ధికి ప్రధాన కారణాలు. రెండవ ప్రపంచ యుద్ధ పరిసమాప్తి తరువాత సోవియట్ రష్యాపట్ల తమకు గల భయాలను, అనుమానాలను దాచుకోవటానికి పాశ్చాత్య రాజ్యాలు ఎలాంటి ప్రయత్నాలు చేయలేదు. సోవియట్ రష్యాచుట్టూ ఒక 'ఇనుపతెర' ఉందని బ్రిటిష్ ప్రధాని చర్చిల్ అనేకసార్లు వ్యాఖ్యానించారు. అంతేగాక సోవియట్ రష్యా నాశనంతో కమ్యూనిజం కూడా నశించి పోతుందన్న భావం ఆ కాలంలో ప్రబలంగా ఉండేది. యుద్ధానంతరం యూరోపులోని రాజ్యాల ఆర్థిక వ్యవస్థల పునర్నిర్మాణానికి అమెరికా అనుసరించిన విధానాలు ప్రచ్ఛన్న యుద్ధ ఉద్రిక్తతలకు సమిధలయ్యాయి. 1950 దాకా యూరోపు ఖండానికే పరిమితమైన ప్రచ్ఛన్న యుద్ధం ఆ తరువాత ఆసియా ఖండానికి కూడా వ్యాపించింది. 1953లో సోవియట్ నాయకుడు స్టాలిన్ మరణించారు. సోవియట్ రష్యాలో కొత్త నాయకత్వం ఆవిర్భవించింది. తూర్పు పశ్చిమ దేశాలమధ్య సుహృద్భావ సంబంధాలు నెలకొనడం ఆరంభమైంది. స్టాలిన్ మరణానంతరం సోవియట్ రష్యా నాయకత్వం పశ్చిమ దేశాల పట్ల అంత కఠినంగా వ్యవహరించలేకపోయింది. 1955 నాటి సూయజ్ కాలువ వివాదం, 1956 నాటి హంగరీ సంక్షోభం ఉభయ కూటాలను కొంత వరకు ఆలోచనలో పడవేశాయి. కాని, అగ్రరాజ్యాల మధ్య వైరం పూర్తిగా తొలగిపోలేదు. అవి తమ మిత్రదేశాలపై పట్టును సడలించలేదు. క్షిపణుల విషయంలో అమెరికాకు గల ఆధిక్యాన్ని స్పుత్నిక్‌ల ప్రయోగంతో సోవియట్ రష్యా అధిగమించింది. 1962లో ఇండియా-చైనా యుద్ధం, క్యూబా క్షిపణుల సంక్షోభం తల ఎత్తాయి. పశ్చిమ రాజ్యాల కూటమిలోని ఫ్రెంచి నాయకుడు చార్లెస్ డీగోల్ వ్యతిరేక భావాలను ప్రదర్శించారు. కమ్యూనిస్టు రాజ్యాల కూటమిలో చైనా స్వతంత్రంగా వ్యవహరించసాగింది. క్యూబా క్షిపణుల సంక్షోభం అణు యుద్ధ ప్రమాదాన్ని ప్రపంచానికి తెలియచెప్పింది. అణుయుద్ధ పరిణామాల తీవ్రతను అర్థం చేసుకొన్న అగ్రరాజ్యాలు తమ సంబంధాలలో కొంత సడలింపులను ప్రదర్శించాయి. అత్యవసర పరిస్థితిలో అగ్రరాజ్యాల అధినేతల పరస్పర వ్యక్తిగత సంభాషణలకు వీలుగా మాస్కో-వాషింగ్టన్ నగరాల మధ్య సరాసరి టెలిఫోను సంబంధాలు ఏర్పాటయ్యాయి.

1960-70 దశకంలో పెట్టుబడిదారీ రాజ్యాలకు, సోషలిస్టు రాజ్యాలకు మధ్య వర్తక వాణిజ్యాలు వృద్ధి చెందాయి. వాటిమధ్య సాంస్కృతిక సంబంధాలు మెరుగయ్యాయి. క్రీడల నుండిరాజకీయాల వరకు అన్ని రంగాలలోను పరస్పర అవగాహన వృద్ధి చెందసాగింది. స్టాలిన్ మరణానంతరం రష్యన్ నాయకత్వం ఉభయ కూటాల మధ్య శాంతియుత సహజీవనం సాధ్యమన్నారు. అణు యుద్ధం ప్రపంచ నాశనకారి కనుక సహజీవనం సరియైనదేనని ఉభయ కూటాలు అంగీకరించాయి. ఇవన్నీ రెండు అగ్రరాజ్యాల మధ్య స్నేహ పూర్వక వాతావరణ కల్పనకు దోహదపడ్డాయి. దేశాల మధ్య చెడిపోయిన సంబంధాలు తిరిగి సత్సంబంధాలుగా మారే తొలి దశను సయోధ్యగా విమర్శకులు వర్ణిస్తున్నారు. సయోధ్య

BRAOU

అంటే ఉద్రిక్తతల సడలింపు అని అర్థం. అంతర్జాతీయ రాజకీయ రంగంలో అమెరికా సోవియట్ రష్యాల మధ్యపుట్టిన ప్రచ్ఛన్న యుద్ధ ప్రమాదం సడలిపోవటాన్ని పరిశీలకులు సయోధ్యగా పేర్కొంటున్నారు. 1980-90 దశకం చివరలో పోలెండ్‌లో రష్యా జోక్యం చేసుకోవటంతోను, తనకు అనుకూలంగా ఉన్న ప్రభుత్వాన్ని సమర్థించే ఉద్దేశంతో ఆఫ్ఘనిస్తాన్ కు సైన్యాలు పంపటంతోనూ సయోధ్యకు కొంత భంగం కలిగిన మాట వాస్తవమే. రష్యా చర్యలు ఐక్యరాజ్య సమితిలోని అధిక సంఖ్యాకుల విమర్శలకు గురి అయ్యాయి. ఈ విధంగా అగ్రరాజ్యాల సంబంధాలలో తిరిగి ఉద్రిక్తతలు పెరగటంతో సోవియట్ రష్యా విధానాల పట్ల అభ్యంతరం తెలుపుతూ 1980లో మాస్కోలో జరిగిన ఒలంపిక్ క్రీడలలో పాశ్చాత్య దేశాలు పాల్గొనలేదు. సోవియట్ రష్యాలో నాయకత్వం చేపట్టాక వివిధ అంతర్జాతీయ సమస్యల పట్ల గోర్బచేవ్ రాజీ మార్గాలను అనుసరించాడు. అగ్రరాజ్యాల లోని అంతరంగిక సమస్యలు కూడా వాటి మధ్య సయోధ్య పెరగటానికి దోహదంచేశాయి. వివిధ కారణాల వల్ల రెండు అగ్రరాజ్యాలలోను ఆర్థిక సంక్షోభాలు తల ఎత్తాయి. 1990 ఆరంభం నుండి తూర్పు యూరోపు సోవియట్ యూనియన్‌లలో అనూహ్యమైన మార్పులు సంభవించాయి. తూర్పుయూరోపు రాజ్యాలు సోవియట్ రష్యా నుండి స్వతంత్రత ప్రకటించుకొని ప్రజాస్వామ్య మార్గాన్ని చేపట్టాయి. సోవియట్ రష్యాలో గోర్బచేవ్ ప్రవేశపెట్టిన బహిరంగత్వం, పునర్నిర్మాణాల ప్రభావం చివరకు సోవియట్ యూనియన్ విచ్ఛిన్నానికి దారితీశాయి. సోవియట్ రష్యా అంతర్ధానంతో అగ్రరాజ్యాల వ్యవస్థలో ఒక మూల స్తంభం కూలిపోయింది. ద్వితీయ ప్రపంచ యుద్ధ కాలంనుండి ఉన్న ద్విధ్రువ రాజకీయాల వ్యవస్థ ఏక ధ్రువ రాజకీయ వ్యవస్థగా మారింది.

ప్రచ్ఛన్న యుద్ధం ముఖ్య లక్షణాలలో సైద్ధాంతిక సమరం చాలా ప్రధానమైంది. ఒక అగ్రరాజ్యం స్వతంత్ర దేశాల భావనను బలపరిస్తే, మరొకటి అంతర్జాతీయ కార్మిక ఉద్యమాలను బలపరిచింది. ఒకరు ప్రజాస్వామ్య విలువలకు, సంపూర్ణాధికార తత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్నామంటే, మరొకరు పెట్టుబడిదారీ విధానానికి, సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నామన్నారు. ఆధునిక ప్రసార సాధనాల ద్వారా పరస్పర వ్యతిరేక ప్రచారాల్లో పోటీ ఏర్పడింది. ప్రతి కూటమి వ్యతిరేక కూటమిని యుద్ధోన్మాదులని, సామ్రాజ్యవాదులని చిత్రించటం జరిగింది. ప్రచ్ఛన్న యుద్ధం వల్ల అంతర్జాతీయ సంబంధాలలో యూరోపు ఖండం ప్రాముఖ్యత తగ్గింది. ఐక్యరాజ్య సమితి సమావేశాలను కూడా ప్రచ్ఛన్న యుద్ధచ్ఛాయలు ప్రభావితం చేశాయి.

B R A O U

**అభ్యాసం**

'ప్రచ్ఛన్న యుద్ధం' అనే భావనను వివరించండి.

## 2.7 అలీనోద్యమం

రెండవ ప్రపంచ యుద్ధం పర్యవసానంగా బలహీన పడిన యూరోపియన్ రాజ్యాలు తమ వలసలను కొనసాగించలేని పరిస్థితికి దిగజారి పోయాయి. యుద్ధం ఆ రాజ్యాల ఆర్థిక పరిస్థితిని బాగా బలహీన పరచింది. పర్యవసానంలో వలస, విధానం దుర్బలమై ఒక్కొక్క వలస ప్రాంతం స్వతంత్ర రాజ్యం కావటం ఆరంభం అయింది. పూర్వం యూరోపియన్ రాజ్యాల వలస ప్రాంతాలు సార్వభౌమత్వ రాజ్యాలుగా అవతరించాయి. యుద్ధానంతర పరిస్థితిలో ఏర్పడిన ప్రచ్ఛన్న యుద్ధ దశలో కొత్తగా స్వతంత్రం సంపాదించుకొన్న రాజ్యాలు తమ విధానాన్ని నిర్ణయించుకోవలసి వచ్చింది. అలా విమోచనం చెందిన చాలా రాజ్యాలు ప్రచ్ఛన్న యుద్ధంలో నిమగ్నమైన అగ్రరాజ్యాల కూటాలలో దేనిలోనూ చేరరాదని నిర్ణయించుకొన్నాయి. ఈ నేపథ్యంలో అయిదో దశకం చివర నాటికి అంతర్జాతీయ రాజకీయ రంగంలో 'ఆలీనోద్యమం' భావనకు బాగా ప్రాచుర్యం లభించింది. వందల సంవత్సరాలుగా వలస పాలనలో మగ్గిపోయిన దేశాలు విముక్తి చెందాక తమ వ్యక్తిత్వాన్ని, స్వాతంత్ర్యాన్ని పరిరక్షించుకోవటం, ఏ రూపంలోనైనా సామ్రాజ్యవాద, జాతివాద ధోరణులను తిరస్కరించటం ప్రారంభించాయి. అగ్రరాజ్యాల ఆధిపత్య స్పర్థలో భాగస్వాములు కాకుండా,తమ శక్తి సంపన్నతలన్నింటిని ప్రజల ఆశయాల సాధనకు వినియోగించటం సరియైన మార్గమని భావించాయి. ఆరంభంలో అలీన విధానాన్ని తటస్థ విధానంగా భావించేవారు. అది నిషేధాత్మక స్వభావం గలది. యుద్ధం జరుగుతున్నప్పుడు ఏ పక్షంలోనూ చేరకుండా ఉండటాన్ని తటస్థ విధానం అంటారు. ఒక రాజ్య స్వాతంత్ర్యాన్ని, సమగ్రతను సంరక్షించటానికి, రెండుగాని అంతకు మించిన సంఖ్యలోని రాజ్యాలుగాని ఒడంబడటాన్ని తటస్థీకరించటమంటున్నారు. ఇందుకు స్విట్జర్లాండు ఆస్ట్రియాలు ఉదాహరణలు. అలీన విధానం రెండవ ప్రపంచ యుద్ధం తరువాతనే ప్రారంభమైంది. కొత్తగా స్వాతంత్ర్యం పొందిన ఆసియా, ఆఫ్రికా రాజ్యాలు, అవి పొందిన స్వాతంత్ర్యాన్ని సంరక్షించుకోవాలనే కాంక్ష, వాటి రాజకీయ సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలనే అభిలాషల ఫలితమే అలీన విధానం. రాజకీయ ఆర్థిక స్వాతంత్ర్యాలకు భద్రత ఉండే ప్రపంచ నిర్మాణమే అలీన విధానపు ఆశయం. యుద్ధానంతరం రెండు అగ్ర రాజ్యాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం బాగా ప్రజ్వరిల్లుతున్న రోజుల్లో అలీన విధానం రూపం సంతరించుకొంది. విముక్తి పొందిన ఆసియా ఆఫ్రికా రాజ్యాలు అంతర్జాతీయ రాజకీయాలలో నిర్మాణాత్మకమైన పాత్ర నిర్వహించటానికి అలీన విధానం బాగా తోడ్పడింది. ఉభయ అగ్ర రాజ్యాల మధ్య సయోధ్య ఏర్పడటంలోనూ,అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థికాభివృద్ధికి కృషి చేయటంలోను అలీన విధానం క్రియాశీల పాత్ర నిర్వహించింది.

ఆసియా రాజ్యాల దృఢ వైఖరులను వెల్లడించటానికి 1949 ఆరంభంలో భారత ప్రధాని నెహ్రూ ఢిల్లీలో సమావేశం ఏర్పాటు చేశారు. నెహ్రూ ఏర్పరచిన సమావేశంలో నూతన ఆసియా ఆవిర్భావాన్ని ప్రపంచం గుర్తించింది. 1955లో ఇండోనేసియా లోని బాండుంగ్ నగరంలోజరిగిన ఆసియా-ఆఫ్రికా రాజ్యాల మహాసభ అలీన విధానంలో మొదటి మెట్టు. అది ప్రత్యేకంగా అలీన దేశాల సమావేశంగా ఏర్పాటు కాలేదు. మొత్తం 20 దేశాలు సమావేశంలో పాల్గొన్నాయి. మొదటిసారిగా అలీన విధానం అంతర్జాతీయ వేదికపై చర్చకు వచ్చింది. ఆఫ్రికా, ఆసియా రాజ్యాల మధ్య ఆర్థిక, సాంస్కృతిక సహకారానికి, మానవ హక్కుల సంరక్షణకు, రాజ్యాల స్వయం నిర్ణయాధికారానికి కృషి చేయాలని సమావేశం నిర్ణయించింది. అలీన విధానం అవలంబిస్తున్న రాజ్యాలు అంతర్జాతీయ సమాజంలో కలిసికట్టుగా వ్యవహరించటానికి ప్రాతిపదికగా బాండుంగ్ సమావేశాన్ని ఉపయోగించు కున్నాయి. భారత ప్రధాని నెహ్రూ, ఇండోనేషియా అధ్యక్షులు సుకర్నో, యూగోస్లావియా నాయకుడు టిటో, ఈజిప్టు అధ్యక్షుడునాజర్, శ్రీలంక ప్రధాని సిరిమావో బండారునాయకే, ఘనా నాయకుడు ఎన్క్రుమాలు అలీన విధానాన్ని కూలంకషంగా చర్చించి నూతన దృక్కోణాలను నిర్ణయించారు. అలీన విధానాన్ని అవలంబించే రాజ్యాలు సైనిక కూటాలలో సభ్యత్వం లేని శాంతికాముక రాజ్యాల కూటమి అని తెలియజెప్పారు. ప్రపంచ రాజకీయాలలో మూడో కూటమిగా ఏర్పడటం తమ ఉద్దేశం కాదన్నారు. అలీన విధానం అవలంబించే దేశాలకు "పంచశీల" సూత్రాలు మార్గదర్శకాలన్నారు.

BRAOU

అంతర్జాతీయ రాజకీయాలలో అలీన విధానం చాలా ప్రముఖమైన పాత్ర నిర్వహించింది. ఇది ఒక రకంగా రాజకీయ ఉద్దేశాలతో కూడుకొన్నదే అయినప్పటికీ, ఇటీవలి కాలంలో ఆర్థికపరమైన రూపాన్ని సంతరించుకొంది. ఆరంభంలో దీన్ని ఉభయ సైనిక కూటాలు చాలా నిశితంగా విమర్శించాయి. ఆనాటి అమెరికా విదేశాంగశాఖ కార్యదర్శి డల్లెస్ అలీన విధానాన్ని "గోడమీద పిల్లివాటం", "తటస్థ విధానం", "తెలుపు నలుపుల విచక్షణ గ్రహించక పోవటం", "అవినీతికరమైన విధానం" అనే మాటలను వాడి తీవ్రంగా విమర్శించారు. తమ కూటమిలో చేరని అలీన విధానం అలవంబించే రాజ్యాలను పశ్చిమ దేశాలు కమ్యూనిస్టు కూటమి రాజ్యాలని విమర్శించాయి. సోవియట్ రష్యా కూడా అలీన విధానం పాటించే దేశాలు పూర్వపు వలస ఆధిపత్య రాజ్యాల ఉపగ్రహాలని వర్ణించింది. విదేశాంగ విధానంలో సాధనంగా భారతదేశం అలీన విధానాన్ని అవలంబించటంతో చాలా దేశాలు అలీన విధానాన్ని అభిమానించటం ప్రారంభించాయి. అంతర్జాతీయ రాజకీయ రంగంలో అలీన విధానం పాటించిన దేశాలు నిర్వహించిన పాత్రను బట్టి మనం కొన్ని విషయాలను గ్రహించవచ్చు. అవి :

1. ప్రపంచ శాంతి భద్రతలను పరిరక్షించటం,

2. జాతీయ స్వాతంత్ర్యోద్యమాలను బలపరచటం.

3. చాలినంతగా ఆర్థిక సామాజికాభివృద్ధి సాధనకు కృషిచేయటం.

4. అంతర్జాతీయ సంబంధాలలో ప్రజాస్వామ్య ప్రాచుర్యానికి కృషి చేయటం.

ఈ సూత్రాలన్నీ ఐక్యరాజ్య సమితి ఛార్టర్‌లో అంగీకరించిన విషయాలకు లోబడినవే. ప్రపంచ దౌత్య సంబంధాలలో అలీన విధానం ఒక విశిష్ట భావన. ప్రచ్ఛన్న యుద్ధపు ఉద్రిక్తతలు సడలటానికి శాంతిప్రియ దేశాలు అవలంబించిన విధానం. మొదటిసారిగా అలీన విధానాన్ని పాటిస్తున్న దేశాలు 1961 సెప్టెంబరులో యుగోస్లావియా రాజధానిలో మొదటి సారిగా సమావేశమయ్యాయి. దానిలో 25 దేశాలు పాల్గొన్నాయి. అగ్రరాజ్యాల సైనిక స్థావరాలు లేని, సైనిక ఒప్పందాలలో సభ్యులుకాని రాజ్యాలను సభ్యత్వం స్వీకరించమని ఆహ్వానించారు. అప్పటినుండి అలీన దేశాలు నాల్గేండ్లు కొకసారి సమావేశమయ్యే సంప్రదాయం మొదలైంది. 25 దేశాలతో ప్రారంభమైన అలీనోద్యమంలో ఇప్పటికి 103 రాజ్యాలు సభ్యత్వం స్వీకరించాయి. అలీన దేశాల వివిధ శిఖరాగ్ర సమావేశాలను విశ్లేషించినప్పుడు కాలక్రమంలో అలీన భావం విస్తృతమైనట్లు విశదమవుతున్నది. మూడవ ప్రపంచ ప్రజల ఆశయాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న అలీన విధానం అంతర్జాతీయ శాంతి అవగాహనకు గణనీయమైన కృషి చేసింది. అలీనోద్యమం అంతర్జాతీయ రాజకీయాల్లో నిర్మాణాత్మకమైన నైతిక శక్తిగా ఆవిర్భవించింది. వ్యక్తిగతంగానూ, సమైక్యంగానూ అలీన దేశాలు ప్రపంచ ఉద్రిక్తతలు సడలటానికి చేసిన కృషి అమోఘమైంది. చిన్నరాజ్యాల సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతల పరిరక్షణ బాధ్యతను ఈ ఉద్యమం చేపట్టింది. అలీన దేశాల కృషి పర్యవసానంగా ప్రపంచంలో వలసల నిర్మూలనం జరిగి అగ్రరాజ్యాల కూటాలవైపు దేశాల ధ్రువీకరణం బలహీనమైనందనవచ్చు. కూటాల విధానాలలో భిన్నత్వాలు ఉన్నవన్న నగ్నసత్యాన్ని నిరూపించి అది ప్రపంచ శాంతికి దోహదకారి కాదన్న విషయాన్ని అలీన విధానం ప్రజలకు నచ్చ చెప్పింది. వలస విమోచనం పొందిన రాజ్యాలు తమకు ఇష్టం వచ్చిన విధానాన్ని అవలంబించే హక్కులకు మద్దతునిచ్చింది.

పరస్పర విరుద్ధ అంతర్జాతీయ రాజకీయాలు, ప్రచ్ఛన్న యుద్ధం, సైనిక కూటాలు, సిద్ధాంతాల వ్యాప్తుల నేపథ్యంలో అలీన భావం అవతరించింది. వాస్తవానికి అలాంటి రాజకీయ వాతావరణానికి అలీన భావన ఆవిర్భావం ప్రతిచర్య. ఆ భావం అవతరించిన నాటినుండి నేటి వరకు అంతర్జాతీయ రాజకీయ పరిస్థితులలో ఎన్నో మార్పులు సంభవించాయి. ద్విధ్రువ ప్రపంచం ఏక ధ్రువ ప్రపంచంగా మారింది. అలీన విధానం చైతన్యవంతమైంది. మారిన అంతర్జాతీయ పరిస్థితులలో కూడా దానికి ఎంతో ప్రాముఖ్యం, విలువ ఉన్నాయి. అంతర్జాతీయ రాజకీయాలలో సంభవించిన మార్పుల కనుగుణంగా

BRAOU

అలీన విధాన ధ్యేయాలలో కూడా కొన్ని మార్పులు వచ్చాయి. ప్రపంచ రాజకీయాల పాత్రను, సైనిక విధానాన్ని, ప్రచ్ఛన్న యుద్ధాన్ని వ్యతిరేకించటంకన్నా ఆకలి, అనారోగ్యం, అనావృష్టి, దుర్భర దారిద్ర్యం మొదలైన పరిస్థితులను రూపుమాపటానికి సంక్షేమాభివృద్ధి వైపు అలీన దేశాలు తమ దృష్టిని మళ్ళించాయి. అలీన విధానం ఒక అంతర్జాతీయ వ్యవస్థ కాదు. అది ఒక ఉద్యమం. దాన్ని అనుసరిస్తున్న రాజ్యాలు తరచుగా శిఖరాగ్ర సమావేశాలు జరిపేవి. దీనికి సంస్థాగత నిర్మితి లేదు. శిఖరాగ్ర సమావేశం జరిగే దేశం అధినేతనే అలీనశిఖరాగ్ర సమావేశం అధ్యక్షునిగా ఎన్నుకొంటుంది. మరొక శిఖరాగ్ర సమావేశం జరిగేదాక పూర్వపు అధ్యక్షులే సంధాన కర్తగా వ్యవహరిస్తుంటారు. శిఖరాగ్ర సమావేశం జరిగిన దేశమే దీనికి కార్యాలయ సహకార మందిస్తుంది. అందువల్ల దీన్ని అలీనోద్యమంగా వ్యవహరిస్తున్నారు.

**అభ్యాసం**

అలీనోద్యమ ప్రారంభానికి దోహదం చేసిన అంతర్జాతీయ పరిస్థితులేవి ?

BRAOU

## 2.8. మూడో ప్రపంచం - సమస్యలు

ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం స్వాతంత్ర్యం పొందిన ఆసియా, ఆఫ్రికా ఖండాలు లాటిన్ అమెరికా రాజ్యాల సముదాయాన్ని మొట్టమొదటిసారి అల్జీరియా రచయిత ఫ్రాంజ్ ఫెనాన్ తృతీయ ప్రపంచం (Third World) అని వర్ణించారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న వలస ప్రాంతాలను ప్రపంచంలో ఒక ప్రత్యేక రాజకీయ ప్రాంతంగా ఆయన భావించారు.

మూడవ ప్రపంచం అనే పదం అంతర్జాతీయ రాజకీయాల పరిభాషలో బాగా వాడుకలో ఉంది. రాజనీతి శాస్త్రజ్ఞులు, అంతర్జాతీయ సంబంధాల రచయితలు మూడవ ప్రపంచాన్ని రకరకాలుగా వర్ణించారు. కాని రచయితలలో ఏకాభిప్రాయం లేదు. వలసవాద రాజ్యాల నుండి విమోచనం పొంది, వలస వ్యతిరేక విధానం, అలీన విధానం, అభివృద్ధి చెందకపోవటం, అధిక జనాభా, జాతిపరమైన విభేదాలు మొదలైన రాజకీయ ఆర్థిక సమస్యలతో కూడుకున్న రాజ్యాల సమూహాన్నే మూడవ ప్రపంచం అనే పదం స్పష్టంగా వ్యక్త పరుస్తుంది. ప్రచ్ఛన్నయుద్ధ పర్యవసానంగా ఏర్పడిన సైనిక కూటాలలో చేరకుండా స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అనుసరించే ఆసియా, ఆఫ్రికా దేశాలతో పాటు, కమ్యూనిస్టు దేశాలతో సహా అభివృద్ధి చెందని దేశాల సమూహాన్ని తృతీయ ప్రపంచంగా కొందరు పేర్కొంటున్నారు. బ్రేనికోజియర్ అనే రచయిత దృష్టిలో సైనిక కూటాలతో చేరినా చేరకపోయినా కమ్యూనిస్టేతర ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలు తృతీయ ప్రపంచం అన్నారు - తృతీయ

ప్రపంచం ఏదనే విషయంలో అంగీకారం లేనప్పటికీ, పూర్వపు వలస పాలన నుండి విముక్తి పొంది, స్వతంత్ర రాజ్యాలుగా ఉన్న వాటిని తృతీయ ప్రపంచంగా విస్తృతార్థంలో వాడవచ్చు. ఇర్వింగ్ లూయీ హోర్విట్స్ 'Three Worlds Development' అనే గ్రంథంలో తృతీయ ప్రపంచాన్ని అభివృద్ధి ప్రాతిపదికగా నిర్వచించారు. పోటీలలో ఉన్న పెట్టుబడిదారీ విధానం ముఖ్య లక్షణంగా గల పశ్చిమ యూరోపు, అమెరికా, జపానులను ఆయన మొదటి ప్రపంచంగా పేర్కొన్నారు. సోవియట్ రష్యా కమ్యూనిస్టు కూటమిలోని రాజ్యాలను రెండవ ప్రపంచంగా పేర్కొన్నారు. వలస ఆధిపత్య కబంధ హస్తాల నుండి విమోచనం పొంది, ఒకే విధమైన అభివృద్ధి సమస్యలను ఎదుర్కొంటూ, అభివృద్ధి మార్గాలను అవలంబించే దేశాలను మూడవ ప్రపంచంగా పేర్కొన్నారు. లాటిన్ అమెరికా,ఆఫ్రికా, ఆసియా ఖండాలు రాజ్యాలు ఒక ప్రత్యేకమైన అవశ్యకపూర్వమైన సఖ్యతను పెంపొందించుకున్నాయి. అభివృద్ధి చెందటం వాటి లక్ష్యం. ఈ దేశాలు పశ్చిమదేశాల నుండి సహాయం పొందుతూ, అగ్రరాజ్యాల ప్రచ్ఛన్నయుద్ధ సంఘర్షణలకు దూరంగా ఉంటూ అలీన విధానం అవలంబిస్తున్నాయి. చైనా నాయకుడు మావో అమెరికా ,సోవియట్ యూనియన్‌లను మొదటి ప్రపంచంగానూ, జపాను, యూరోపు, కెనడాలను రెండవ ప్రపంచంగానూ, వర్ణిస్తూ, ఇటీవలికాలంలో వలస పాలన నుండి విముక్తి చెంది అభివృద్ధి చెందుతున్న లాటిన్ అమెరికా, ఆఫ్రికా, ఆసియా రాజ్యాలను తృతీయ ప్రపంచంగా పేర్కొన్నారు. అభివృద్ధి మార్గంలో ఆసియా,ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలు ఎదుర్కొంటున్న రాజకీయ, ఆర్థిక, సాంఘిక సమస్యలన్నీ ఒకేరకమన్న భావన తృతీయ ప్రపంచ సిద్ధాంతానికి దారితీసింది.రెండవ ప్రపంచ యుద్ధం తరువాత కొత్తగా ఆవిర్భవించిన దేశాల్లో సాధారణంగా ఒకే రకమైన ఆర్థిక సమస్యలుండటం వల్ల, ఆర్థికాంశాలను దృష్టిలోపెట్టుకుని,వీటన్నింటిని మూడవ ప్రపంచంగా పిలుస్తున్నారు.

1961లో ఐక్యరాజ్యసమితి తీర్మానం ప్రపంచాన్ని మూడు ఆర్థిక విభాగాలకింద విభజించింది. మొదటి వర్గంలో ప్రభుత్వేతర రంగం బాగా అభివృద్ధి చెందిన దేశాలు, రెండవ వర్గంలో ప్రభుత్వాధీనంలో ఉన్న ఆర్థిక వ్యవస్థలున్న దేశాలు, మూడవ వర్గంలో ప్రాథమిక వస్తువులైన వ్యవసాయోత్పత్తులు, ఖనిజాలు, నూనె, రాగి, ఇనుము, ప్రత్తి, జనుము మొదలైనవి ఉత్పత్తి చేసే దేశాలు. మూడవ ప్రపంచం తక్కువ పారిశ్రామీకరణ చెందినదిగా; తక్కువ పెరుగుదల, తక్కువ సగటు ఆదాయం ఉండి ఆర్థికంగా మొదటి, రెండో ప్రపంచాలమీద ఆధారపడే లక్షణాలు కలదిగా గుర్తించారు. మూడవ ప్రపంచాన్ని గురించిమేధావులు తమ రాతల్లో,వేదికలపై మాటల్లో సుదీర్ఘమైన చర్చలు చేస్తున్నారు. తృతీయ ప్రపంచ సమస్యలు నిరంతర ప్రజాజీవన సమస్యలు. ఈ సమస్యల పరిష్కార మార్గాన్వేషణయే తృతీయ ప్రపంచ రాజ్యాల నిరంతర సమస్య.

BRAOU

వలస ఆధిపత్యం నుండి విముక్తిపొందిన రాజ్యాలు ఆర్థికంగా స్వాతంత్ర్యం అనుభవించలేకపోతున్నాయి. వలస వాద దేశాల ప్రభావం వల్ల విముక్తి చెందిన తృతీయ ప్రపంచ రాజ్యాల బానిస మనస్తత్వంలో గణనీయమైన మార్పులు రావడం లేదు. వలస దేశాల విధానం వల్ల తృతీయ ప్రపంచ రాజ్యాలు ఆర్థిక రంగంలో బాగా నష్టపోయాయి. పేదరికం,వలస విధానపు వారసత్వ మని విజ్ఞులు వర్ణించారు. వలస, జాత్యంహకార విధానాల కొనసాగింపు వల్ల మూడవ ప్రపంచ దేశాలలో జాతీయ భావం పెల్లుబికి తమ దేశ ఆర్థిక పటిష్టతపైననే తమ జాతి గౌరవం ఉంటుందన్న నగ్న సత్యాన్ని గుర్తించాయి. తృతీయ ప్రపంచంలోని చాలా రాజ్యాలు రాజకీయ విమోచనం పొందినప్పటికీ ఆర్థిక అసక్తులవల్ల పారిశ్రామికంగా అభివృద్ధిచెందిన మొదటి ప్రపంచ రాజ్యాలపై ఆధారపడుతున్నాయి. పర్యవసానంగా వాటి సార్వభౌమత్వం నామమాత్రమై పోయింది.

1960 నాటి నుండి తృతీయ ప్రపంచం అనే పదం బాగా వాడుకలోకి వచ్చింది. తృతీయ ప్రపంచ రాజ్యాలు తమ స్వాతంత్ర్య రక్షణకు, అభివృద్ధి సాధనకు ఆర్థికాభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా చేసుకున్నాయి. ఆర్థికాభివృద్ధి సాధనకు అలీన విధానాన్ని సాధనంగా ఎంచుకున్నాయి. అందువల్ల ఆదిలో తృతీయ ప్రపంచమనగానే అలీన దేశాలన్న భావం బలపడింది. ఒకప్పుడు వీటినే అభివృద్ధి చెందుతున్న రాజ్యాలని వర్ణించేవారు. 'అభివృద్ధిచెందని' అనే పదబంధం తరచుగా వాడుతుండటం వల్ల మూడవ ప్రపంచం భావన ఆర్థిక స్వరూపాన్ని సంతరించుకొంది. ఆదిలో ఏర్పడిన తృతీయ ప్రపంచ భావనలో

మార్పులు వచ్చాయి. ఒక రచయిత రాజ్య సమాజాలను ఆర్థిక రాజకీయ ప్రాతిపదికలపై విభజించారు. మరొక రచయిత సంపదను కోల్పోయి, దారిద్ర్యాన్ని మూటకట్టుకొన్న రాజ్యాల కలయిక తృతీయ ప్రపంచమన్నారు. భారత దేశంలో జన్మించి ప్రఖ్యాత బ్రిటిష్ శాస్త్రవేత్తగా పేరొందిన నాయిపాల్ కరిబియన్ రాజ్యాలను తృతీయ ప్రపంచంలో గల మరో తృతీయ ప్రపంచంగా పేరొ ంటూ, ఆర్థిక వ్యత్యాసాల దృష్ట్యా నాల్గవ ప్రపంచం ఆవిర్భవించలేదన్నారు. తృతీయ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలలో కొన్ని వ్యత్యాసాలున్నాయి. కొన్ని దేశాలు పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో, కొన్ని సామ్యవాద ఆర్థిక వ్యవస్థలో, మరికొన్ని మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో ఉన్నాయి. తృతీయ ప్రపంచం ఒకే స్వభావం కల సమూహం కాదు. ఇది మూడు ఖండాలకు విస్తరించి, వివిధ రాజకీయ వ్యవస్థలలో, వివిధ సిద్ధాంతాలతో ఉంది. దేశాల అభివృద్ధి స్థాయిలలోనూ తేడాలున్నాయి. వాటి విదేశాంగ విధానాలలోనూ భిన్నత్వాలు ఉన్నాయి.

తృతీయ ప్రపంచ దేశాల ప్రజల ప్రధాన సమస్య పేదరికం. ఇందుకు మూల కారణం జనాబా పెరుగుదల. ఈ శతాబ్దాంతానికి ప్ర ంచ జనాభా 50 శాతం పెరుగుతుందని, పెరగనున్న జనాభాలో 90శాతం మూడవ ప్రపంచానికి సంబంధించి ఉ ంటుందని నిపు ణుల అంచనా. ఇప్పటికే తృతీయ ప్రపంచంలో చాలా మంది ఆహార లోపం వల్ల బాధపడుతున్నారు. ఆహార పదార్థాల కొరత వల్ల ఈ సమస్య మరింత క్లిష్టతను సంతరించుకొంది. దానికితోడు అభివృద్ధి చెందుతున్న దేశాలలో మరణాల సంఖ్య తగ్గుతుండడం వల్ల జనాభా వృద్ధి ఒక సమస్య అయింది. తృతీయ ప్రపంచంలోని 18 దేశాలలో జనాభా పెరుగుదలకు తగ్గట్టుగా ఆహారోత్పత్తి జరగటం లేదు. జనాభాలోని 60శాతం మంది తగినంత ఆహారం లేక, నిరంతర పోషకాహార లోపం వల్ల వేలాదిగా మరణిస్తున్నారు. పరిసరాల పరిశుభ్రతా స్థాయి చాలా తక్కువగా ఉంటోంది. వ్యక్తిగత అస్వస్థతకు చికిత్సా సౌకర్యాలు చాలా తక్కువగా ఉన్నాయి. తృతీయ ప్రపంచ రాజ్యాలలో ఆరోగ్య సౌకర్యాల విషయంలో ఉన్న అసమానతలను మించినవి వేరే లేవు. లభ్యం కాగల భూమిని, సహజ వనరులను సక్రమంగా వినియోగించడం వల్ల పెరుగుతున్న జనాభా సమస్య తీవ్రతను తృతీయ ప్రపంచం ఎదుర్కొనవచ్చు. జనాభా, ఆహార సమస్యలపై అన్ని రాజ్యాలు కలసికట్టుగా వ్యవహరించాల్సి ఉంటుంది.

వ్యవసాయమే ప్రధానమైనప్పటికీ కొన్ని మూడవ ప్రపంచ రాజ్యాలు కొంత పారిశ్రామికాభివృద్ధి సాధించాయి. పారిశ్రామికాభివృద్ధి తృతయ ప్రపంచ అభివృద్ధి చర్యలలో చాలా ప్రధానమై . పొందుతున్న సహాయాన్ని చాలా వరకు పారిశ్రామికీకరణకు ఉపయోగించటం . తోంది. అయితే తృతీయ ప్రపంచ రాజ్యాలు తమ పారిశ్రామికాభివృద్ధికి పశ్చిమ రాజ్యాల అభివృద్ధి వ్యూహాలనే అనుసరిస్తున్నాయి. అందువల్ల అవి సరైన ప్రగతిని సాధించలేకపోతున్నాయి. అభివృద్ధి చెందే దేశాలను తమ చెప్పు చేతల్లో ఉంచుకోవటానికి పాశ్చాత్య దేశాలు పక్షపాత వైఖరిని అవలంబిస్తున్నాయి. భారీ పరిశ్రమల స్థాపన, పారిశ్రామికాభివృద్ధికి కావలసిన సాంకేతిక సహాయం అందించటానికి షరతులు విధిస్తున్నాయి.

మూడవ ప్రపంచంలోని చాలా రాజ్యాల భౌగోళిక స్వరూపానికి వలసవాదమే ప్రధాన కారణం. స్వలాభాపేక్షతోనే సామ్రాజ్యవాద దేశాలు వలసలను సృష్టించాయి. ఈ వలసల ఏర్పాటులో పూర్వపు భాగాలలోని ప్రజల ప్రమేయం లేకుండా కొత్త ప్రాదేశిక సరిహద్దులను ఏర్పరిచాయి. ఈ విధంగా చేయటం వలన కొత్తగా స్వాతంత్ర్యం పొందిన దేశాలు సమైక్య సాధనను ప్రధానసమస్యగా ఎదుర్కోవాల్సి వస్తున్నది. సామ్రాజ్యవాదులు ఏర్పరచిన సరిహద్దుల వల్ల తృతీయ ప్రపంచ రాజ్యాలమధ్య సరిహద్దు వివాదాలు తలెత్తాయి. సుదీర్ఘ వలస పాలన వల్ల చాలా దేశాలు తమ వలస పాలకుల రాజకీయవ్యవస్థలనే రూపొందించుకొన్నాయి. అందువల్ల సాంప్రదాయక విధేయతలు తీవ్రవిఘాతానికి గురి అయ్యాయి. మూడవ ప్రపంచ దేశాలలో రాజకీయ చైతన్యం చాలా తక్కువ స్థాయిలో ఉండటం కూడా ఒక సమస్య అయ్యింది. చాలా దేశాలలోని స్వాతంత్రోద్యమాలు ప్రజా ఉద్యమాలుగా చిత్రించుకొన్నా, వాస్తవంలో ప్రజలకు భాగస్వామ్యం లేదు. కొన్ని దేశాలలోని పాలకులు తమ స్థాన ప్రాబల్యానికి మొదటి ప్రపంచం మీద ఆధారపడ వలసి వస్తున్నది. ఆ రాజ్యాలలోని సామాజిక

BRAOU

పరిస్థితులే విదేశీ రాజకీయ జోక్యాలకు ప్రధాన కారణాలు. విదేశీ జోక్యం వల్ల తృతీయ ప్రపంచ రాజ్యాలలోని ఆర్థిక, సాంఘిక వ్యవస్థల స్థిరత్వానికి భంగం కలుగుతోంది. అగ్రదేశాలు అందించే సైనిక సహాయం కూడా తృతీయ ప్రపంచ రాజ్యాలు ఎదుర్కొంటున్న సమస్యలలో ఒకటి. అంతేకాకుండా చాలా దేశాలలో సైనిక వ్యయంలో పెరుగుదల ఉంటోంది. అగ్రరాజ్యాలు రెండింటి సైనిక వ్యయం రాజ్యాల్లో అది 6 నుండి 14 శాతానికి పెరిగింది. విదేశాలనుండి లభిస్తున్న సహాయం, దేశంలోని వనరులలో చాలా భాగాన్ని సైనిక వ్యయం కింద ఖర్చు పెట్టడంతో అభివృద్ధి పనులు సవ్యంగా జరగటం లేదు. పర్యవసానంలో తృతీయ ప్రపంచ రాజ్యాల మధ్య సంఘర్షణలు మొదలవుతున్నాయి. అగ్ర రాజ్యాల ప్రాబల్య పోటీకి మూడవ ప్రపంచ రాజ్యాలు యుద్ధ భూములుగా మారుతున్నాయని భావించవచ్చు. తృతీయ ప్రపంచ దేశాలు తమ మధ్య సఖ్యతకు వివిధ సంస్థలను ఏర్పరచుకొన్నప్పటికీ, అవి అగ్రరాజ్యాల రాజకీయ చదరంగంలో పావులుగా మారుతున్నాయి. కార్యసాధకమైన ఆర్థిక వ్యవస్థ, నిజమైన రాజకీయ స్వాతంత్ర్యం తృతీయ ప్రపంచ రాజ్యాల సమస్యలకు పరిష్కార మార్గాలు.

పైన వివరించిన సమస్యలతో పాటు తృతీయ ప్రపంచ రాజ్యాలు నయా వలస వాద సమస్యను కూడా ఎదుర్కోవాల్సి వస్తుంది. రెండవ ప్రపంచ యుద్ధ పరిసమాప్తితో సామ్రాజ్యాలు అంతరించాయి. వాటితోపాటు వలస వాదం కూడా అంతరించింది. ప్రత్యక్ష వలస పాలన పోయింది. కాని చాలా బలవత్తర దేశాలు ప్రపంచ రాజకీయాలలో తృతీయ ప్రపంచ రాజ్యాలకు సమాన అవకాశాలు ఉండరాదని, ప్రపంచ సంపదలో వాటికి న్యాయమైన పంపిణీ జరగరాదని భావిస్తున్నాయి. ఇవి ఆర్థిక, దౌత్య పద్ధతుల ద్వారా తృతీయ ప్రపంచ రాజ్యాలను అదుపు చేయ ప్రయత్నిస్తున్నాయి. నవీన వలస వాద భావం 1960లో వాడుకలో వచ్చింది. వలస రాజ్యాల నుండి విమోచనం పొంది స్వతంత్ర రాజ్యాలుగా అవతరించిన పూర్వపు వలసలు పరోక్షంగా ఇతర దేశాల రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సైనిక, సాంకేతిక శక్తుల అజమాయిషీకి లోను గావటం వల్ల వాటి రాజకీయ స్వాతంత్ర్యం లాంఛన ప్రాయమైపోయింది. నిరంతరం ఆర్థికంగా ఆధారపడేటట్లు చేయటం, ఆర్థికవర్గాలు ఏర్పడటం, భారీ పెట్టుబడుల ద్వారా, దొడ్డిదారిన ఆర్థిక రంగంలో ప్రవేశించటం, అప్పులు, సహాయాలు, అసమాన మారకరేట్లు మొదలైన మార్గాల ద్వారా పూర్వపు వలసలను తమ ఆధిపత్యంలో ఉంచుకోవటానికి సామ్రాజ్యవాద దేశాలు ప్రయత్నిస్తున్నాయి. ఇవే నవీన వలసవాదపు ప్రత్యేక లక్షణాలు. అభివృద్ధి చెందుతున్న దేశాల బలహీనతలే నవీన వలస వాదం ఆవిర్భవించటానికి ప్రధాన కారణం. పూర్వపు వలస విధానం ఇపుడు లేదు. పాత వలస ప్రాంతాలు విమోచనం చెంది కొత్త సార్వభౌమత్వ రాజ్యాలుగా అవతరించాయి. ప్రపంచ రాజకీయ వ్యవస్థలో ఈ రాజ్యాలకు సమాన స్థాయి లభించింది. అయితే ఈ కొత్త రాజ్యాలు పాత అంతర్జాతీయ ఆర్థిక చట్రంలోనే పనిచేస్తున్నాయి. ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ కొత్త దేశాల ఆర్థిక వ్యవస్థను పాశ్చాత్య పారిశ్రామిక దేశాలు నియంత్రిస్తున్నాయి. కొత్త అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థను కోరుతున్న రాజ్యాలు, ఆర్థిక సంబంధాలలో సమత్వం కోసం పారిశ్రామికీకరణ చెందిన దేశాలపై ఆధారపడకుండా ఉండే నిమిత్తం కొత్త ఆర్థిక వ్యవస్థను కోరుకుంటున్నాయి. ప్రపంచయుద్ధాల మధ్య కాలంలో తన మూలధన పెట్టుబడులను అపారంగా విస్తరింపచేసిన అమెరికా సంయుక్త రాష్ట్రాలు రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అతి పెద్ద పెట్టుబడిదారీ దేశ స్థాయికి ఎదిగింది. ఆసియా ఖండంలో ఒక పెద్ద పెట్టుబడిదారీ దేశంగా అవతరించిన జపాను ఇతర పశ్చిమ దేశాలతో పాటు తృతీయ ప్రపంచ దేశాలను నవీన వలస విధానం ద్వారా దోపిడీ చేయడంలో భాగస్వామి అయ్యింది.

సామ్రాజ్యవాద దేశాలు వివిధ పద్ధతులలో శ్రేష్ఠ వర్గానికి తగిన సౌకర్యాలను రక్షణలను కల్పించటం ద్వారా పూర్వపు వలసలలో తమకు అనుగుణమైన ఆర్థిక, సామాజిక వ్యవస్థలు కొనసాగే ప్రయత్నాలు చేస్తున్నాయి. వివిధ కపట మార్గాల ద్వారా తృతీయ ప్రపంచ రాజ్యాలలో తమకు అనుగుణంగా ప్రభుత్వాల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నాయి. సామ్రాజ్యవాద దేశాలు, అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు అందించే సహాయంవల్ల ఆయా దేశాల్లో ఆర్థిక అసమానతలు ఏర్పడటమేకాక, అవి నిరంతరం సామ్రాజ్యవాద దేశాలపై ఆధారపడేందుకే తోడ్పడుతున్నాయి. ఎన్నో షరతులతో ఇస్తున్న సహాయం సంపన్న

BRAOU

దేశాల, విదేశ విధానాల లక్ష్యసాఫల్యతకు ఆయుధంగా ఉపయోగపడుతోంది. ఇవిగాక సంపన్న దేశాల వాణిజ్య సంస్థలు రాజ్యాల సరిహద్దులను దాటి అంతర్జాతీయంగా అనేక రాజ్యాలతో వ్యాపార సంబంధాలు ఏర్పరచుకొంటోంది. వీటిని బహుళ జాతి సంస్థలని పిలుస్తున్నాయి. (multi National Corporations), ఉత్పత్తులు, పెట్టుబడులు కేంద్రీకృతమవుతున్నాయి. కేంద్రీకృతమైన మార్గదర్శకత్వం బహుళజాతి సంస్థల ప్రధాన లక్షణం. వివిధ దేశాలలో అధిక లాభాలు ఆర్జించటమే వాటి ధ్యేయం అభివృద్ధి చెందుతున్న దేశాలలో పెట్టుబడి పెట్టిన అమెరికా ఎన్నో రెట్లు లాభాలను పొందుతోంది. తృతీయ ప్రపంచం లోని సార్వభౌమత్వం కల్గిన కొన్ని రాజ్యాల ఆదాయాలకన్నా ఈ బహుళజాతి సంస్థల ఆదాయం ఎక్కువగా ఉంటోంది. ఇవి ఆయా రాజ్యాల ప్రభుత్వ విధాననిర్ణయాలను ఎంతగానో ప్రభావితం చేస్తున్నాయి. బహుళజాతి సంస్థలు అభివృద్ధి చెందుతున్న దేశాలలోని స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానం వాటికి తగిన స్థాయిలో ఉపయోగపడకుండా చేస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలలో లభించే శిక్షణ, సాంకేతిక పరిజ్ఞానాలను వెనుకబడిన దేశాలు సమకూర్చుకోలేవు. పర్యవసానంలో మూడవ ప్రపంచ దేశాలు నుండి మేధావులు, సంపన్న దేశాలకు వలస వెళుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం కొరతతో సమాన స్థాయిలో బేరమాడలేని దేశాలపై బహుళ జాతి సంస్థలు తమ అధికార ప్రాబల్యాన్ని విస్తృత పరచుకొంటున్నాయి. కొన్ని సందర్భాలలో అవి ఇతర సంపన్న దేశాలలోని పురాతన, నిరుపయోగ సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశాలకు అందించటం ద్వారా తమ ఆధిపత్యాన్ని నిలుపుకుంటున్నాయి. నవీన వలస విధానం మూడవ ప్రపంచ దేశాలు శాశ్వతంగా వెనుకబడిన దేశాలుగా కొనసాగేందుకు దోహదపడుతున్నది.

**అభ్యాసం**

మూడవ ప్రపంచ దేశాలను ఏ ప్రాతిపదిక మీద గుర్తిస్తారు ?

BRAOU

## 2.9. ముఖ్య విషయాలను గుర్తుంచుకొందాం.

- మానవుని సామాజిక జీవస్వభావ పర్యవసానమే నడుస్తున్న ప్రపంచ చరిత్ర.
- జీవన పరిస్థితుల మెరుగుదలకు చేసిన ప్రయత్నాలు సఫలం కాలేకపోతున్నా మానవుని ఆశయాలకు అంతం అన్నది లేకుండా పోయింది.
- గతం కంటె ప్రస్తుత శతాబ్దపు చరిత్ర ఎన్నో విధాలుగా ప్రముఖమైంది.

* రెండు ప్రపంచ యుద్ధాలు జరిగాయి. మున్నెన్నడూ జరగనంతమారణహోమం,ఆస్తినష్టం జరిగింది. మరో ప్రపంచ యుద్ధ ప్రమాదచ్ఛాయల్లో మానవుని మనుగడ ప్రశ్నార్థకమై పోయింది.

* మరో ప్రపంచ యుద్ధమే సంభవిస్తే ఫలితాలు చూడడానికి మానవ సాక్ష్యులు ఉండరన్న భయమే దేశాల మధ్య సయోధ్యకు కారణ భూతమైంది. మహాయుద్ధాలు లేకున్నా, స్థానికమైన యుద్ధాలు సంభవించాయి. దేశాల మధ్య వివాదాలను శాంతి పూర్వకంగా పరిష్కరించుకోటానికి దేశాలు సన్నద్ధతను క్రియాశీలకంగా ప్రదర్శించాయి.

* అగ్రరాజ్యాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధంవల్ల అంతర్జాతీయ సంబంధాలలో యూరోపు ఖండం ప్రాధాన్యత తగ్గింది.

* అలీన విధానం ఒక ఉద్యమంగా అవతరించింది. అయితే మానవ జీవన సమస్యలు సమసి పోలేదు. పాత సమస్యలకు పరిష్కారం లభించగానే కొత్త సమస్యలు ఆవిర్భవిస్తున్నాయి. ప్రపంచ ప్రజల మధ్యగల అసమానతలు కొత్త సమస్యలకు కారణమౌతున్నాయి.

* మూడవ ప్రపంచ దేశాలు నవీన వలస విధానం వల్ల ఎప్పటికీ వెనుకబడిన దేశాలుగా కొనసాగే ప్రమాదంలో ఉన్నాయి. నిరంతర ప్రయత్నాలను నిలుపుచేయకుండా మానవుడు మంచి జీవనం కోసం కృషి చేస్తుండటం గమనించ దగ్గ విషయం.

## 2.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

*30 పంక్తులలో జవాబులు రాయండి.*

1. రెండు ప్రపంచ యుద్ధాల ఫలితాలను సమీక్షించండి.
2. తృతీయ ప్రపంచ దేశాల వెనుకబాటుకు కారణాలను విశదీకరించండి.

*15 పంక్తులలో జవాబులు రాయండి.*

1. జాతి రాజ్యం అంటే ఏమిటి?
2. అలీనోద్యమం గురించి వివరించండి.

BRAOU

**పారిభాషిక పదాలు**

| | | |
|---|---|---|
| Cold War | = | ప్రచ్ఛన్న యుద్ధం |
| Polarisation | = | ధ్రువీకరణం |
| Bi-Polarworld | = | ద్విధ్రువ ప్రపంచం |
| Uni-Polar World | = | ఏక ధ్రువ ప్రపంచం |
| Information Explosion | = | సమాచార విస్ఫోటనం |
| Nation State | = | జాతి రాజ్యం |

| | | |
|---|---|---|
| Colonial State | = | వలస రాజ్యం |
| Colony | = | వలస |
| Imperialism | = | సామ్రాజ్యవాదం |
| Whitemans Burden | = | తెల్లవారి బాధ్యత |
| Policy of Isolation | = | ఏకాంత విధానం |
| Self Determination | = | స్వయం నిర్ణయం |
| Appeasement Policy | = | సంతృప్తి పరిచే విధానం |
| Bilateral | = | ద్వైపాక్షిక |
| Unilateral | = | ఏక పక్ష |
| Multilateral | = | బహుపక్ష |
| Super Powers | = | అగ్రరాజ్యాలు |
| Non alignment | = | అలీన విధానం |
| Neutrality | = | తటస్థ విధానం |
| MultinationalCorporation | = | బహుళజాతి సంస్థ |
| Dveloping Countries | = | అభివృద్ధిచెందుతున్న దేశాలు/వర్ధమాన దేశాలు |
| Underdeveloped | = | అభివృద్ధి చెందని |
| Colonialism | = | వలస వాదం |
| New Colonialism | = | నయా వలస వాదం |

BRAOU

# భాగం 3 భారతదేశం : భౌగోళిక పరిస్థితులు, సహజ వనరులు

విషయ క్రమం


3.0 ఉద్దేశం

3.1 ప్రవేశిక

3.2 నైసర్గిక స్వరూపం

3.3 నదీ వ్యవస్థ

3.4 శీతోష్ణస్థితి

3.4.1 ఉపవాతావరణ ప్రాంతాలు

3.4.2 వర్షపాతం

అభ్యాసాలు

3.5 నేలలు

3.6 అడవులు

3.7 వన్యప్రాణులు

అభ్యాసాలు

3.8 వ్యవసాయం

3.8.1 ముఖ్యమైన పంటలు

3.8.2 పశు సంపద

3.8.3 సేద్యపు నీటి పారుదల వ్యవస్థ

3.9 ఖనిజ సంపదలు

3.10 రాష్ట్రాలు - జనాభా

అభ్యాసాలు

3.11 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

3.12 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 3.0. ఉద్దేశం

ఈ భాగం చదవడం పూర్తయ్యే సరికి మీరు ;

- భారతదేశ నైసర్గిక స్వరూపం
- వివిధ ప్రాంతాలందలి శీతోష్ణస్థితి, వర్షపాతం
- అడవులు, వన్య ప్రాణులు
- దేశంలోని ముఖ్య పంటలు, పశుసంపదలు
- దేశంలోని ఖనిజ సంపదలు
- దేశంలోని మొత్తం రాష్ట్రాలకు సంబంధించి కొన్ని వివరాలు, జనాభా

మొదలైన అంశాలను గ్రహించగలుగుతారు. వివరించగలుగుతారు.

## 3.1 ప్రవేశిక

ప్రపంచ దేశాలలో భారతదేశం ఏడవ పెద్ద దేశం - దీని విస్తీర్ణం 32,87,2631 చదరపు కిలోమీటర్లు. ఇది ఉత్తర భూగోళంలో పూర్తిగా ఇమిడి ఉంది. దీనికి ఉత్తరాన హిమాలయ పర్వతాలు, దక్షిణాన హిందూ మహాసముద్రం, తూర్పున బంగాళా ఖాతం, పశ్చిమాన అరేబియా సముద్రాలు సరిహద్దులు. భారతదేశం $8^{0}4^{1}$ నుండి $37^{0}6^{1}$ ఉత్తరా అక్షాంశాల మధ్య, $68^{0}7^{1}$ నుండి $97^{0}25^{1}$ తూర్పు రేఖాంశాల మధ్య ఉంది. ఉత్తరాన కాశ్మీరు నుండి దక్షిణాన కన్యాకుమారి వరకు వ్యాపించిన పొడవు 3,214 కి.మీ. తూర్పు కొన నుండి పశ్చిమ కొన వరకు వ్యాపించి ఉన్న పొడవు 2,933 కి.మీ. దేశ సరిహద్దు రేఖ పొడవు 15,200 కి.మీ. లక్ష దీవులు, అండమాన్, నికోబార్ ద్వీపాలను కలుపుకొని ఉన్న కోస్తా తీరం పొడవు 751.56 కి.మీ. ఉంది.

BRAOU

## 3.2 నైసర్గిక స్వరూపం

పర్వతాలు, సముద్రాలు భారతదేశాన్ని ఆసియా లోని ఇతర ప్రాంతాలనుండి వేరు పరచి ఒక ప్రత్యేక భౌగోళిక ప్రతిపత్తిని ఇస్తున్నాయి. మూడు దిక్కుల్లోను సముద్రాలు, ఒక దిక్కున పర్వతాలు ఉన్నందున ద్వీప కల్పం అని దీనిని వ్యవహరిస్తాం. భారతదేశాన్ని మూడు సహజ సిద్ధ మండలాలుగా విభజన చేశారు.

అవి : అ) ద్వీపకల్ప త్రికోణ పీఠభూమి ప్రాంతం

ఆ) అధి ద్వీప కల్పంగా పేర్కొనబడే హిమాలయ పర్వత ప్రాంతం

ఇ) గంగా, సింధూ మైదాన ప్రాంతం.

నైసర్గికంగా ద్వీపకల్పం అతి పురాతన పీఠభూమి. ఉత్తరాది చివరనున్న ఒండ్రు మన్ను మైదాన ప్రాంతాల నుండి ప్రారంభం అవుతుంది. ఈ పీఠభూమికి ఒకవైపున పశ్చిమ కనుమలు మరొక వైపున తూర్పు కనుమలున్నాయి. పశ్చిమ కనుమలకు, అరేబియా మహాసముద్రానికి మధ్యన సన్నటి ఏటవాలుగా ఉండే కోస్తా ప్రాంతం ఉంది. అలాగే తూర్పు

కనుమలూ, బంగాళాఖాతం మధ్యన విస్తృతమైన కోస్తా ప్రాంతం ఉంది. పశ్చిమ కనుమలు నీలగిరి కొండల వద్ద తూర్పు కనుమలను కలుస్తాయి. పశ్చిమ కనుమలు నర్మదా నది నుండి కన్యాకుమారి వరకు విస్తరించి ఉన్నాయి. ప్రధాన నదులు గోదావరి, కృష్ణా, కావేరి పశ్చిమ కనుమలలో పుట్టి తూర్పుగా ప్రవహిస్తూ బంగాళాఖాతంలో కలుస్తున్నాయి. తూర్పుకనుమలు ఒరిస్సా ఉత్తర అంచునుంచి ప్రారంభమై ఆంధ్ర తీర ప్రాంతాల గుండా వెళ్ళి తమిళనాడులో నీలగిరులను కలుస్తాయి. పశ్చిమకోస్తా ఉత్తర భాగాన్ని కొంకణ కోస్తా అని, దక్షిణ భాగాన్ని మలబారు కోస్తా అని పిలుస్తున్నారు. అలాగే తూర్పు కోస్తాను కోరమాండల్ కోస్తా అంటారు. ద్వీపకల్ప ప్రాంతంలో ఆరావళి, వింధ్య, సాత్పుర పర్వత శ్రేణులను కూడా ప్రత్యేకంగా పేర్కొనవచ్చు. ఆరావళి పర్వతాలు రాజస్థాన్‌లో, వింధ్య పర్వతాలు గుజరాత్, మధ్యప్రదేశ్, బీహారులలో, సాత్పుర పర్వతాలు గుజరాత్, మధ్యప్రదేశ్‌లో విస్తరించి ఉన్నాయి.

అధి ద్వీప కల్ప ప్రాంతంలో హిమాలయ పర్వతాలు పూర్తిగా అమరి ఉన్నాయి. ఇవి ఇటీవల కాలంలో ఆవిర్భవించిన పర్వతాలు.

గంగా, సింధూ మైదాన ప్రాంతం ఇటీవల కాలంనాటి ఒండ్రుతో పరచుకొని విశాలంగా ఉంటుంది. ఉత్తర పర్వత ప్రాంతానికి, దక్షిణ ద్వీపకల్ప ప్రాంతానికి మధ్యన ఉన్న అగాధ ప్రదేశం, ఈ గంగా సింధూ మైదాన ప్రాంతం.

## 3.3. నదీ వ్యవస్థ

BRAOU

భారతదేశంలోని నదులను వాటి పుట్టుకను బట్టి రెండు తరగతులుగా విభజింపవచ్చు.

అ) హిమాలయాల్లో పుట్టిన నదులు

ఆ) ద్వీపకల్ప పీఠభూమిలో పుట్టిన నదులు

హిమాలయాల్లో పుట్టిన నదులను జీవనదులంటారు. వర్షాల ద్వారానూ, మంచు కరగడం వల్లనూ నీరు ఎప్పుడూ ప్రవహిస్తుంది. గంగా, సింధూ, బ్రహ్మపుత్ర నదులు, హిమాలయాల్లో పుట్టిన నదులు. సింధూనది, టిబెటు లోని మానస సరోవరం దగ్గర పుట్టి పాకిస్తాన్‌లోని కరాచీ పట్టణానికి తూర్పున అరేబియా మహాసముద్రంలో కలుస్తుంది. జీలం,చినాబ్, రావి, బియాస్ మొదలైనవి సింధూ నదికి ఉపనదులు. గంగానది ఎగువ హిమాలయాల్లో పుట్టి ఉత్తరప్రదేశ్, బీహారు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో ప్రవహించి బంగ్లాదేశ్ లోని చాంధీపూర్ వద్ద బంగాళా ఖాతంలో కలుస్తుంది. బంగ్లాదేశ్‌లో గంగా నదిని పద్మ అనే పేరుతో పిలుస్తారు. యమున, గోమటి, రామగంగ, గండక్, కోశి దీని ఉపనదులు. బ్రహ్మపుత్ర నది కూడా సింధూనదిలాగే మానస సరోవరం వద్ద పుట్టి అస్సాం రాష్ట్రం ద్వారా బంగ్లాదేశ్ చేరి గంగానది (పద్మ) చేరి తద్వారా బంగాళాఖాతంలో కలుస్తుంది. లోహిత్ దీని ఉపనది.

ద్వీపకల్ప పీఠభూమిలో ముఖ్యమైన నదులు గోదావరి, కృష్ణా, కావేరి, మహానది, నర్మద, తపతి, సబర్మతి. గోదావరి, కృష్ణా, కావేరి, మహానది పశ్చిమ దిశనుండి తూర్పుకి ప్రవహిస్తాయి. నర్మద, తపతి నదులు తూర్పునుండి పశ్చిమ దిశకు ప్రవహిస్తాయి.

గోదావరి ద్వీపకల్ప నదులన్నింటిలోకి పెద్దది. మహారాష్ట్రలోని నాసిక్ వద్ద పుట్టి ఆంధ్రప్రదేశ్‌లోని బంగాళా ఖాతంలో కలుస్తుంది. మాస్‌ప్రభ,పెన్ గంగ, వైన గంగ దీని ఉపనదులు. కృష్ణానది మహారాష్ట్రలోని మహాబలేశ్వరం వద్ద పుట్టి ఆంధ్రప్రదేశ్ బంగాళాఖాతాన్ని చేరుతుంది. కోయ్నా, ఘాట్‌ప్రభ, మాల్‌ప్రభ, భీమ, తుంగభద్ర, మూసీ, మున్నేరు, కృష్ణానదికి ఉపనదులు. కావేరి నది బ్రహ్మగిరిలో పుట్టి తమిళనాడులోని కావేరి పట్టణం వద్ద బంగాళాఖాతంలో చేరుతుంది. కృష్ణా,

కావేరి నదులకు మధ్య సమాంతరంగా పెన్నా(ర్) నది ప్రవహిస్తుంది. ఇది పడమటి కనుమల్లో పుట్టి ఆంధ్రప్రదేశ్‌లో నెల్లూరుకు దగ్గరగా బంగాళాఖాతంలో చేరుతుంది. మహానది మధ్యప్రదేశ్‌లో పుట్టి ఒరిస్సాలో బంగాళా ఖాతం చేరుతుంది. మహానదికి, గంగానదికి మధ్యన సువర్ణరేఖ, బ్రాహ్మణి సమాంతరంగా ప్రవహిస్తుంది.

నర్మదా నది మధ్యప్రదేశ్‌లోని అమర్ కంటక్ వద్ద పుట్టి గుజరాత్‌లో అరేబియా సముద్రంలో కలుస్తుంది. తపతి నది మధ్యప్రదేశ్‌లోని బీటల్ ప్రాంతంలో పుట్టి నర్మదానదికి సమాంతరంగా ప్రవహించి అరేబియా సముద్రం చేరుతుంది. సబర్మతి నది రాజస్థాన్ లోని ఆరావళి పర్వతాలలో పుట్టి అరేబియా సముద్రంతో కలుస్తుంది. మాహినది ఎగువ వింధ్య పర్వతాలలో పుట్టి గల్ఫ్ ఆఫ్ కాంబే వద్దకు చేరుతుంది.

మైదాన ప్రాంతాలలో పుట్టిన నదులు చాలా తక్కువ. పశ్చిమ రాజస్థాన్‌లోని 'లుని' ఇటువంటిది. ఇది వర్షాధారంతో ప్రవహిస్తుంది. సముద్రంలో కలువకుండానే దీని జలాలు ఇంకి పోతాయి. లుని, రాణా ఆఫ్ కచ్ ప్రాంతానికి నీరు అందిస్తుంది.

## 3.4 శీతోష్ణస్థితి

భారతదేశం ఈశాన్య నైరుతి ఋతుపవనాల మూలంగానూ, మూడు వైపుల సముద్రం ఉండటం వలనూ దాదాపు దేశమంతటా సమశీతోష్ణస్థితి నెలకొని ఉంది. ఈ దేశ వాతావరణాన్ని ఉష్ణప్రాంత వాతావరణంగా పేర్కొనవచ్చు. నాలుగు ప్రధాన ఋతువులున్నాయి. అవి శీతాకాలం ( డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి); వేసవి కాలం (మార్చి, ఏప్రిల్, మే); నైరుతి ఋతుపవన కాలం (జూన్, జూలై, ఆగస్టు,సెప్టెంబరు); వాయువ్య ఋతుపవన కాలం (అక్టోబరు, నవంబరు).

### 3.4.1 ఉపవాతావరణ ప్రాంతాలు

దేశంలోని వివిధ ప్రాంతాల వాతావరణ పరిస్థితులను బట్టి ఏడు ఉపవాతావరణ ప్రాంతాల్ని గుర్తించవచ్చు.

**(అ) పర్వత వాతావరణం :** కారాకోరం హిమాలయం పర్వత ప్రాంతాలందు ఈ వాతావరణాన్ని గమనించవచ్చు. పగటి ఉష్ణోగ్రత, సాధారణ వర్షపాతం త్వరితంగా మార్పులకు లోనవుతాయి.

**(ఆ) తేమ ఉండే సబ్‌ట్రాపికల్ వాతావరణం :** హిమాలయాల దక్షిణ ప్రాంతంలో, రాజస్థాన్‌లోనిఆరావళి కొండల తూర్పు, పంజాబు, ఉత్తరప్రదేశ్,బీహారు,పశ్చిమ బెంగాలు, అస్సాం రాష్ట్రాలలోనిమైదాన ప్రదేశాలలో ఈ వాతావరణం ఉంటుంది. శీతాకాలం పొడిగా ఉండి పొగమంచు మాత్రం పడుతుంది. వేసవిలో వేడి ఎక్కువగా ఉంటుంది.

**(ఇ) సమశీతోష్ణస్థితి ఎడారి ప్రాంతం :** రాజస్థాన్ పశ్చిమ ప్రాంతాలలో, పాకిస్థాన్ సరిహద్దు వెంబడి, కచ్‌లోని పశ్చిమ ప్రాంతం వెంబడి ఈ వాతావరణం కనిపిస్తుంది.

**(ఈ) ట్రాపికల్, సబ్ ట్రాపికల్ స్టెప్పీ (Steppe) వాతావరణం :** పంజాబు, పశ్చిమ ప్రాంతాలలోను, హర్యానాలోను ఇటువంటి వాతావరణం ఉంది. ఉష్ణోగ్రత ఎడారుల్లో మాదిరి ఉంటుంది, కానీ మరీ అంత తీవ్రత ఉండదు. పశువులను, గొర్రెలను మేపేందుకు వీలుగా ఉంటుంది.

**(ఉ) సమశీతోష్ణ అడవుల వాతావరణం :** బొంబాయికి పశ్చిమాన ఉన్న కనుమల ప్రాంతంలోనూ, పశ్చిమ కోస్తాలోని దిగువ భాగాన, అస్సాంకు దక్షిణ భాగాన ఈ వాతావరణం ఉంది. ఇక్కడ ఉష్ణోగ్రత, వర్షపాతం రెండూనూ ఎక్కువగానే ఉంటాయి.

BRAOU

**(ఊ) సమశీతోష్ణస్థితిలోని గడ్డి మైదానాలు పచ్చిక బయళ్ళకు అనువైన వాతావరణం :** మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడుల్లో విస్తరించిన ఈ ప్రాంతాలలో వర్షపాతం తక్కువ, స్థిరంగా ఉండదు. మెట్టవ్యవసాయానికి అనుకూలంగా ఉంటుంది.

**(ఎ) సమశీతోష్ణస్థితి పొడి, తేమ వాతావరణం :** దేశంలోని ద్వీపకల్ప పీఠభూమి ప్రాంతంలో ఈ వాతావరణం ఉంది. శీతాకాలంలో, వేసవి కాలంలో కూడా వాతావరణం పొడిగా ఉంటుంది.

### 3.4.2 వర్షపాతం

దేశంలో ప్రధానంగా నైఋతి ఋతుపవనాల వల్ల వర్షాలు పడతాయి. ఇవి దేశమంతటా సమంగా పడవు. ఈశాన్య రాష్ట్రాల్లోనూ, పశ్చిమ కనుమల్లోనూ, పశ్చిమ కోస్తా ప్రాంతంలోనూ, హిమాలయాల్లోనూ భారీ వర్షాలు పడతాయి. వర్షపాతం ఏటా 200 సెంటీమీటర్లు కంటే ఎక్కువగా ఉంటుంది. మేఘాలయాలోని కొన్ని ప్రాంతాలలో ప్రపంచంలోనే అత్యధిక వర్షపాతం పడుతుంది. రాజస్థాన్‌లోను, కచ్, లడక్ ప్రాంతాలలో వర్షపాతం 50 సెంటీమీటర్ల కంటే తక్కువగా ఉంటుంది.

దేశంలో అనేక ప్రాంతాలకు వర్షపాతం నైరుతి ఋతుపవనాల వలన జూన్ నుండి సెప్టెంబరు వరకు ఉంటుంది. తమిళనాడులో మాత్రం ఈశాన్య ఋతుపవనాల వలన అక్టోబరు నుండి డిసెంబరు వరకు వర్షపాతం ఉంటుంది. వర్షపాతం పరిమాణాన్ని బట్టి దేశాన్ని నాలుగు భాగాలుగా విభజించవచ్చు.

1. **అధిక వర్షపాత ప్రాంతాలు :** కోస్తాలోని మైదాన ప్రాంతాలు, పశ్చిమ కనుమలు, మేఘాలయ కొండప్రాంతాలు, హిమాలయాల్లోని దక్షిణ ప్రాంతలోయలు, అధిక వర్షపాతం పడే ప్రాంతాలు. వర్షపాతం 200 సెంటీమీటర్లు కంటే ఎక్కువ. దట్టమైన సతత హరితారణ్యాలను ఈ ప్రాంతాలలో చూడవచ్చు.

2. **ఒక మాదిరి వర్షం పడే ప్రాంతాలు :** మహారాష్ట్రలోని తూర్పు ప్రాంతాలు, ఒరిస్సాలోనూ, ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరప్రాంతం, తమిళనాడులోని దక్షిణ ప్రాంతం, ఉత్తరప్రదేశ్‌లోని పశ్చిమ ప్రాంతాలు ఒక మాదిరి వర్షాలు పడే ప్రాంతాలు. ఏటా వర్షపాతం 100 సెంటీమీటర్ల నుండి 200 సెంటీ మీటర్ల మధ్యన ఉంటుంది.

3. **తక్కువ వర్షపాత ప్రాంతాలు :** రాజస్థాన్‌లోని తూర్పు ప్రాంతాలు, పంజాబు, హర్యానాలలోని కొన్ని ప్రాంతాలు, ద్వీపకల్ప పీఠభూమిలోని చాలా ప్రాంతాలలో వర్షపాతం 50 సెంటీమీటర్ల నుండి 100 సెంటీమీటర్లు లోపున ఉంటుంది.

4. **పొడి ప్రాంతాలు :** కాశ్మీరులోని ఉత్తర ప్రాంతం, రాజస్థాన్‌లోని థార్ ఎడారి ప్రాంతం, పశ్చిమ కనుమల్లోని కొంత ప్రాంతం పొడి ప్రాంతాలు. ఇక్కడ వర్షపాతం 50 సెంటీమీటర్ల కంటే తక్కువ.

**అభ్యాసాలు**

భారతదేశం సరిహద్దులను రాయండి.

BRAOU

దేశంలోని ముఖ్యమైన నదుల పేర్లను కొన్నింటిని రాయండి.

## 3.5 నేలలు

భారత వ్యవసాయ పరిశోధన మండలి (I. C. A.R.) దేశంలోని నేలలను 8 రకాలుగా గుర్తించింది.

### 1 నల్లరేగడి నేలలు

దక్కను పీఠభూమి ప్రాంతంలో కన్పిస్తాయి. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, మధ్యప్రదేశ్‌లలో విస్తరించి ఉన్నాయి. ఇవి తేమను చాలాకాలం నిల్వ ఉంచుకొంటాయి. ప్రత్తి పండించేందుకు అనువైనవి.

### 2 ఎర్రనేలలు

తమిళనాడు, కర్నాటకలలో ఎక్కువగానూ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సాలలోని కొన్ని ప్రాంతాలలోనూ విస్తరించి ఉన్నాయి. సారవంతమైనవి కావుకానీ, ఎరువులు ఉపయోగించి సారవంతంగా మార్చవచ్చు.

### 3 ఒండ్రు మట్టి నేలలు

దేశ ఉత్తర ప్రాంతంలోని మైదానాలలోనూ, నదుల డెల్టా (Delta) ప్రాంతాల్లోనూ విస్తరించి ఉన్నాయి. కొండప్రాంతాలనుంచి ఒండ్రుమట్టి నదుల ద్వారా మైదానాలకుచేరి నిక్షేపింపబడుతుంది. ఈ నేలల్లోకి ప్రతిఏటా క్రొత్తగా మట్టి వచ్చి చేరుతున్నందున బాగా సారవంతంగా ఉంటాయి.

### 4 అటవీ భూములు

అస్సాం, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్నాటకలోని కొన్ని ప్రాంతాలలో విస్తరించి ఉన్నాయి. అడవులలోని ఆకులు కుళ్ళి ఈ రకం నేలలు ఏర్పడతాయి.

### 5 లేటరైటు నేలలు (Laterite Soils)

ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండి, వర్షాలు ఎక్కువగా పడే ప్రాంతాల్లో ఈ నేలలు ఏర్పడతాయి. దేశంలో పశ్చిమ, తూర్పు కనుమల ప్రాంతాలలోను, పశ్చిమ బెంగాలు, ఒరిస్సా, నాగాలాండ్, మేఘాలయ, అస్సాం, ఆంధ్రప్రదేశ్‌లలోని కొన్ని కొండ ప్రాంతాల్లోనూ కన్పిస్తాయి.

### 6 ఎడారి నేలలు

రాజస్థాన్‌లోని థార్ ఎడారి ప్రాంతంలో కన్పిస్తాయి. సాధారణంగా వర్షపాతం తక్కువగా ఉండి, నీరు తక్కువగా ఉండే ప్రాంతాల్లో కన్పిస్తాయి.

### 7 క్షారగుణం ఉన్న నేలలు

ఉత్తర ప్రదేశ్, పంజాబు, రాజస్థాన్‌లలోని వర్షపాతం తక్కువగా ఉండే ప్రాంతాలలో ఈ నేలలు కన్పిస్తాయి. కాల్షియం, సోడియంలు ఎక్కువగా ఉంటాయి.

### 8 చిత్తడి నేలలు

ఒరిస్సా, పశ్చిమ బెంగాలు, బీహారు, తమిళనాడు, కేరళలోని కొన్ని ప్రాంతాలలో ఈ నేలలను చూడవచ్చు. నల్లగా ఉండి ఆమ్లగుణం కలిగి ఉంటాయి.

## 3.6 అడవులు

వర్షపాతం, ఉష్ణోగ్రత, నేలలను బట్టి వృక్షసంతతి వృద్ధి చెందుతుంది. అలాంటి ప్రాంతాలను అడవులు అంటారు. వర్షాలు తగ్గిపోయి, పొడి వాతావరణం ఎక్కువైన కొద్దీ అడవులు నశించి, గడ్డి పెరిగే ప్రాంతాలుగాను, ఎడారులు గాను మారిపోతాయి. అడవులలో ప్రధానంగా కలప ఉండే చెట్లు ఉంటాయి. చిట్టడవులలో పొదలు ఎక్కువగా ఉండి అక్కడక్కడ పెద్ద చెట్లు ఉంటాయి. అడవులను సతత హరిత అరణ్యాలు (Evergreen), ఆకు రాల్చే (Deciduous) అరణ్యాలుగాను గుర్తించవచ్చు. సతతహరితారణ్యాలలో చెట్లు అన్నీ ఒక్కసారి ఆకులు రాల్చక పోవడం వలన ఎప్పుడూ పచ్చగా ఉంటాయి.

భారతదేశంలో అడవులు ఎక్కువగా కొండ ప్రాంతాలు, మారుమూల ప్రదేశాలందు విస్తరించి ఉన్నాయి. దేశమంతటా సమంగా లేవు. వాతావరణంలో సమతుల్యం దెబ్బతినకుండా ఉండాలంటే దేశం మొత్తం విస్తీర్ణంలో 33.3 శాతం అడవులు ఉండాలి. కాని, దేశంలో ప్రస్తుతం 23 శాతం అడవులో (65 మిలియన్ హెక్టార్లు) మాత్రమే ఉన్నాయి. ప్రపంచ జనాభాలో భారతదేశం వాటా 16 శాతం అయితే, ప్రపంచ అడవుల్లో భారతదేశం వాటా 2 శాతం మాత్రమే. ప్రపంచ సరాసరి ఉత్పత్తి హెక్టారుకు 2.1 క్యూబిక్ మీటర్లుంటే, భారతదేశంలో 0.5 క్యూబిక్ మీటర్లు మాత్రమే.

ప్రభుత్వ లెక్కల ప్రకారం 15.54 మి.హె. (మిలియన్ హెక్టార్లు) తో మధ్యప్రదేశ్ అడవుల విస్తీర్ణంలో మొదటి స్థానంలో ఉంది. తర్వాత స్థానాలలో మహారాష్ట్ర (6.4 మి.హె), ఆంధ్రప్రదేశ్ (6.36 మి.హె), ఒరిస్సా (6.0 మి.హె), అరుణాచల్ ప్రదేశ్ (5.15 మి.హె), ఉత్తరప్రదేశ్ (5.12 మి.హె)లు వస్తాయి. మిగతా రాష్ట్రాలలో 5 మి.హె. కంటే తక్కువగా అడవుల విస్తీర్ణం ఉంది. అండమాన్, నికోబార్ దీవుల్లో, మొత్తం విస్తీర్ణంలో 80-90 శాతం అడవులున్నాయి మణిపూర్, సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్, త్రిపురలో మొత్తం విస్తీర్ణంలో 50 నుండి 80 శాతం అడవులున్నాయి. అతి తక్కువగాఉన్న రాష్ట్రాలు, గుజరాత్, రాజస్థాన్, పంజాబు, హర్యానా. దేశం మొత్తం ఆడవుల విస్తీర్ణం 65 మి.హె. ఉంటే 23 మి.హె.లో మాత్రమే టేకు, సాల్ ఇతర వృక్షాలున్నాయి. దేశంలో ముఖ్యమైన అడవులను 6 రకాలుగా విభజించవచ్చు.

### 3.6.1 సతత హరితారణ్యాలు

వర్షపాతం 200 సెంటీమీటర్లు కంటే హెచ్చుగా ఉండే ప్రాంతాలలో ఉంటాయి. ఆకులను వివిధ కాలాల్లో

BRAOU

రాలుస్తాయి. ఈ అడవులు ఎప్పుడూ పచ్చగా ఉంటాయి. మనదేశంలో పశ్చిమ కనుమల్లో, తూర్పు హిమాలయాల కింద అస్సాం, అండమాన్ నికోబార్‌లో విస్తరించి ఉన్నాయి. ఇక్కడ పెద్ద పెద్ద వృక్షాలు ఉంటాయి. కలప చాలా విలువైంది. వీటిలో మెహగని, ఎబోని, ఎర్రచందనం, తీగలు, మెత్తని కలపనిచ్చే చెట్లు, వెదురు ప్రధానంగా ఉంటాయి.

### 3.6.2 ఆకురాల్చే అడవులు

వర్షపాతం 100 నుండి 200 సెంటీమీటర్లు మధ్యన ఉండే ప్రాంతాలలో ఉంటాయి. శీతాకాలానికి ముందు వేసవి కాలంలో ఆకులను రాల్చివేస్తాయి. దక్కను పీఠభూమి పశ్చిమ ప్రాంతం, ఈశాన్య భారతం, హిమాలయాల్లో ఈ అడవులున్నాయి. ముఖ్యంగా టేకు, సాల్, గంధం, ఏబోని, దేవదారు వృక్షాలు పెరుగుతాయి.

### 3.6.3 పొదలతో నిండి ఉండే అడవులు

వర్షపాతం 100 సెంటీమీటర్లకంటే తక్కువగా ఉండే ప్రాంతాలలో ఉంటాయి. పంజాబు, రాజస్థాన్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, ఇంకా ద్వీపకల్ప పీఠభూమిలోని కొండప్రాంతాలలోని పొడి వాతావరణం ఉన్న ప్రదేశాలలో విస్తరించి ఉన్నాయి. తుమ్మ, ఈత మొదలైన ముళ్ళు ఉన్న చెట్లు పెరుగుతాయి.

### 3.6.4 ఎడారి వృక్ష జాతులుండే అడవులు

వర్షపాతం 25 సెంటీమీటర్ల కంటే తక్కువగా ఉండే రాజస్థాన్, సింధు, పంజాబ్, దక్షిణప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి. ముళ్ల చెట్లతో నిండిన పొదలు, అడవిరేగు ఎక్కువగా ఉంటాయి. వేళ్ళు లోతుగా పోతాయి. చెట్టుకు చెట్టుకు మధ్య దూరం ఎక్కువ.

### 3.6.5 పర్వత ప్రాంత అడవులు

దక్షిణ భారత దేశంలోని 1500 మీటర్లు కంటే ఎత్తైన కొండలపైన, హిమాలయాలపైన 100 మీటర్లు ఎత్తున ఉన్న ప్రదేశాల్లో విస్తరించి ఉన్నాయి. ఈ అడవులలో ఆకురాల్చే చెట్లు, శిఖరాకృతిలో ఉన్న చెట్లు పెరుగుతాయి. ఓక్, రోపాల్, ఫిన్స్, సిల్వర్ ఫిన్స్, చెర్నెట, వార్నెటు వంటి చెట్లు పెరుగుతాయి.

### 3.6.6 కోస్తా అడవులు

కోస్తా ప్రాంతాలల్లోనూ, నదీ పరివాహక మైదాన ప్రాంతాల్లోనూ ఉన్నాయి. సుంద్రీ, సరివి రకాల చెట్లు పెరుగుతాయి.

## 3.7 వన్య ప్రాణులు

వన్యప్రాణులంటే కేవలం అడవులందు నివసించే జంతువులే కాకుండా అనేక రకాలయిన పక్షులు, క్రిమికీటకాలు కూడా చెప్పుకోవచ్చు. దేశం విస్తారంగా ఉండటం వల్ల, వివిధ వాతావరణ పరిస్థితులవల్ల, భౌగోళిక పరిస్థితులు అనువుగా ఉండటం వల్ల వివిధ రకాల వన్యప్రాణులు అపారంగా ఉన్నాయి. మనదేశంలో సుమారు 50 వేల రకాల క్రిమికీటకాలు, 6 వేల రకాల వెన్నుముక లేని జంతువులు, 140 రకాల ఉభయ చరాలు, 420 రకాల సరీసృపాలు, 1200 రకాల పక్షులు, 350 రకాల క్షీరదాలు, వివిధరకాల చేపలు ఉన్నాయి. క్షీరదాల్లో కృష్ణజింకలు, కాశ్మీరి జింకలు, నాలుగు కొమ్ములున్న లేళ్ళు, ఏనుగులు, అడవి దున్నలు, దుప్పులు, అడవి గాడిదలున్నాయి. పులి జాతీయ జంతువు. మనదేశంలోని సింహజాతి ప్రత్యేకమైంది. ఆఫ్రికా అడవులలో తప్ప ప్రపంచంలో ఎక్కడా కనిపించదు. దేశం ఈశాన్య ప్రాంతంలో ఖడ్గమృగం ఉంది.

BRAOU

అడవి పందులు, కుందేళ్ళు దేశమంతటా విస్తరించి ఉన్నాయి. చీమలను తినే పంగోలియన్ జంతువు కూడా మనదేశంలో ఉంది.

కోస్తా ప్రాంతంలో మొసళ్ళు ఉన్నాయి. ఉప్పు నీటిలో సంచరించే మగ్గల్, మంచినీటిలో ఉండే ఘరియాల్ ముఖ్యమైనవి. త్రాచుపాము, కొండచిలువ, కట్లపాము, పొడపాము దేశమంతా విస్తరించి ఉన్నాయి.

వేటాడే జంతువులలో సింహం, చిరుతపులులు, మచ్చల చిరుతపులులు, పెద్దపులులు, మంచుపులులు, అడవి పిల్లులు, తోడేళ్ళు, నక్కలు, ముంగిసలు ఉన్నాయి. గోధుమ రంగు ఎలుగుబంట్లు, నల్ల ఎలుగుబంట్లు, వివిధ రకాల కోతులు కూడా విస్తారంగా కన్పిస్తాయి.

మనజాతీయ పక్షి నెమలి. ఇంకా కోళ్ళు, అడవి కోళ్ళు, కోకిలలు, వివిధ రకాల పావురాళ్ళు, కొంగలు, బాతులు విస్తారంగా సంచరిస్తున్నాయి. మరికొన్ని రకాల ప్రత్యేకమైన పక్షులు శీతాకాలంలో భారతదేశం వస్తాయి.

ప్రభుత్వ లెక్కల ప్రకారం అంతరించిపోయే 70 జాతుల క్షీరదాలు, 16 జాతుల సరీసృపాలు, 38 జాతుల పక్షులను గుర్తించారు. ప్రతి సంవత్సరం ఈ జాబితా పెరుగుతూనే ఉంటుంది. ముఖ్యంగా గుర్తించిన జంతువులు మంచుపులి, కస్తూరి మృగం, కొన్నిరకాల లేళ్ళు, కుందేళ్ళు, తోడేళ్ళు, చిరుతపులి, అడవి మేకలు, ఏనుగులు, ఎడారి నక్కలు, కొన్ని రకాల కోతులు, అడవి దున్నలు, కొన్నిరకాల పిల్లులు, కొండ గొర్రెలు, డాల్ఫిన్ చేపలు, ఎలుగుబంట్లు, నల్లమెడకొంగలు, అడవి కోళ్ళు, మొసళ్ళు, అనేక రకాల తాబేళ్ళు ఉన్నాయి. పరిసరాలను సమతుల్యంలో ఉంచడంలో వన్యప్రాణుల పాత్ర చాలా క్లిష్టమైంది. దీనిని గుర్తించి వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని రూపొందించడం జరిగింది. దీని ద్వారా దేశంలో వివిధ ప్రాంతాలలో 45 జాతీయ పార్కులు, 207 అభయారణ్యాలు, 35 జంతుప్రదర్శనశాలలు ఏర్పాటు చేయడం జరిగింది. వీటి అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సహాయం చేస్తున్నాయి.

## అభ్యాసాలు

సతత హరితారణ్యాలంటే ఏమిటి ?

BRAOU

అంతరించిపోతున్న జంతువులను కొన్నింటిని పేర్కొనండి.

## 3.8 వ్యవసాయం

భారతదేశంలో వ్యవసాయ పనులు నీటిపారుదల సౌకర్యాన్ని బట్టి జరుగుతుంటాయి. సంవత్సరం పొడవునా నీటిపారుదల ద్వారా పండించే పంటలను జెయిడ్ (Zaid) పంటలు అంటారు. ఇవి వరి, వేరుశనగ, మొక్కజొన్న, ఆకుకూరలు, కాయగూరలు మొదలయినవి. నీటి పారుదల సౌకర్యం లేని ప్రాంతాలలో ప్రతి సంవత్సరం రెండు ప్రధాన వ్యవసాయక ఋతువులున్నాయి.

అవి :

1) ఖరీఫ్ (పంటకాలం : జులై నుండి అక్టోబరు)

2) రబీ (పంటకాలం : అక్టోబరు నుండి మార్చి)

**ఖరీఫ్ :** నైరుతి ఋతుపవనాలు ప్రారంభంలో జూన్ మాసం నుండి మొదలవుతుంది. జూన్, జులై మాసాల్లో విత్తనాల్ని నాటుతారు. సెప్టెంబరు, అక్టోబరు మాసాలనుండి కోతలకు వస్తాయి. ఎక్కువ నీటి అవసరమున్న పంటలు, వరి, చెఱకు, జనపనార, ప్రత్తి, పొగాకు మొదలైన పంటలు పండిస్తారు.

**రబీ :** ఈశాన్య ఋతుపవనాలు ప్రారంభం అక్టోబరు నుండి మొదలవుతుంది. అక్టోబరులో విత్తనాలు నాటి మార్చి, ఏప్రిల్ మాసాల్లో కోతలు కోస్తారు. తక్కువ నీటి అవసరం ఉన్న గోధుమ, బార్లీ, ఆవాలు, లిన్సీడ్మొదలైనవి పండిస్తారు.

మనదేశ వ్యవసాయ రంగంలో హరిత విప్లవం ద్వారా ఎంతో ప్రగతిని సాధించటం జరిగింది. భారత వ్యవసాయ పరిశోధనా మండలి తన పరిశోధనల ద్వారా వివిధ అధిక దిగుబడులను ఇచ్చే విత్తనాలు, వివిధ వాతావరణ పరిస్థితులకు సరిపడే విత్తనాలను రూపొందించారు. ఇలాంటి విత్తనాలను, సేంద్రీయ ఎరువులను ఉపయోగించి ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా మనదేశంలో అధిక దిగుబడులను పొందుతున్నారు.

BRAOU

### 3.8.1 ముఖ్యమైన పంటలు

పంటలను ముఖ్యంగా ఆహార పంటలు, వాణిజ్య పంటలుగాను వ్యవహరిస్తాం. ఆహార ధాన్యాలు: వరి, గోధుమ, జొన్న, మొక్కజొన్న, రాగి, బార్లీ, కందులు, మినుములు, పెసలు, శనగలు మొదలైనవి. వాణిజ్య పంటలు: పొగాకు, ప్రత్తి, జనపనార, చెఱకు, వేరుశనగ, నువ్వులు, ఆముదాలు, ప్రొద్దు తిరుగుడు, సోయాబీన్, కొబ్బరి, తేయాకు, కాఫీ, రబ్బరు, మిరప, పసుపు, అల్లం, యాలకులు, మిరియాలు, మామిడి, నారింజ, అరటి, ఆపిల్, జీడిమామిడి మొదలైనవి.

**1. వరి :** మనదేశంలో దాదాపు 20 శాతం వ్యవసాయ విస్తీర్ణంలో వరి పండిస్తున్నారు. ప్రపంచ దేశాలలో చైనా తరువాత రెండవస్థానం భారతదేశానిదే. ప్రపంచంలో 20 శాతం ఉత్పత్తి భారత దేశంలో జరుగుతుంది. దేశంలోని అన్ని ప్రాంతాల్లో కూడా వరి పండిస్తున్నారు. వరి పంటకు నీటి సరఫరా నిరంతరంగా ఉండాలి. 80 శాతం ఉత్పత్తి పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, బీహారు, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాలనుండి జరుగుతుంది. ఒరిస్సా, అస్సాం, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, హర్యానా, కేరళ రాష్ట్రాల నుండి కూడా చెప్పుకోదగ్గ రీతిలో వరి ఉత్పత్తి జరుగుతుంది.

**2. గోధుమ :** మనదేశంలో రెండవ ముఖ్యమైన ఆహార పంట. 10 శాతం వ్యవసాయ విస్తీర్ణంలో పండిస్తున్నారు. ప్రపంచ ఉత్పత్తిలో అమెరికా, చైనా తరువాత మనదేశం మూడవ స్థానంలో ఉన్నది. సుమారు 85 శాతం ఉత్పత్తి ఉత్తరప్రదేశ్, పంజాబు, బీహారు, మధ్యప్రదేశ్, హర్యానా, రాజస్థాన్‌లలో ఉంటుంది. మిగతా ఉత్పత్తి పశ్చిమబెంగాల్, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, జమ్మూ కాశ్మీరులనుండి జరుగుతుంది.

**3. తృణ ధాన్యాలు :** సజ్జలు, జొన్నలు, మొక్కజొన్న, రాగులను తృణ ధాన్యాలుగా పరిగణింపవచ్చు. సజ్జలు ముఖ్యంగా రాజస్థాన్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, హర్యానా, పంజాబు, ఆంధ్రప్రదేశ్, కర్నాటకలో పండిస్తారు. జొన్నలు ప్రధానంగా మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్నాటకలో పండిస్తారు. మొక్కజొన్న దేశంలోని అన్ని ప్రాంతాలలో పండిస్తారు. ప్రధానంగా ఉత్తరప్రదేశ్, పంజాబు, బీహారు, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో అధికంగా పండిస్తారు. రాగి పంటను కర్నాటక, తమిళనాడుల్లో అధికంగా పండిస్తారు. ఉత్తరప్రదేశ్, బీహారు, గుజరాత్‌లో కూడా రాగి పండిస్తారు.

BRAOU

**4. బార్లీ :** ప్రపంచంలో 10 శాతం ఉత్పత్తి భారతదేశంలో జరుగుతోంది. దీన్ని నీటి సౌకర్యం ఉన్న ప్రాంతాలలో ఎక్కువగా పండిస్తారు. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లలో అధికంగా పండిస్తున్నారు. బీహారు, మధ్యప్రదేశ్, హర్యానా, పంజాబు, హిమాచల్‌ప్రదేశ్, పశ్చిమబెంగాల్‌లోని కొన్నిప్రాంతాలలో కూడా పండిస్తారు.

**5. పప్పుధాన్యాలు :** ప్రోటీనులు అధికంగా ఉండే పంటలు శనగ, కంది, పెసర, మినుములను పప్పుధాన్యాలుగా వ్యవహరిస్తాం. శనగలను ప్రధానంగా మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హర్యానా, పంజాబుల్లో అధికంగా పండిస్తారు. బీహారు, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లోని కొన్ని ప్రాంతాలలో కూడ శనగలు పండిస్తున్నారు. శనగల తరువాతి స్థానం కందులదే. కందులను అన్నిరకాల నేలల్లోనూ ఖరీఫ్ పంట కాలంలో పండిస్తారు. కొన్ని ప్రాంతాల్లో రబీ పంటగానూ వేస్తారు. ఎక్కువ ఉత్పత్తి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌ల నుండి జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, బీహారు, గుజరాత్‌లలోని కొన్ని ప్రాంతాలలో కూడా పండిస్తారు. మినుములు, పెసలు సాధారణంగా ఖరీఫ్ కాలంలో మిశ్రమ పంటలుగా వేస్తారు. దీనిని వర్షాధార పరిస్థితులలో పండిస్తారు. ఖరీఫ్ కాలంలో ఉత్పత్తి మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, కర్నాటకల్లో ఎక్కువ. రబీ కాలంలో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహారు, ఒరిస్సాల నుండి ఉత్పత్తి ఎక్కువగా ఉంటుంది.

**6. చెఱకు :** ప్రపంచ ఉత్పత్తిలో భారత దేశం బ్రెజిల్ తరువాత రెండవస్థానంలో ఉంది. చెఱకునుండి చక్కెర, బెల్లం, ఖండసారి ఉత్పత్తి చేయవచ్చు. నీటి అవసరం ఎక్కువ. అందువల్ల ఎక్కువ వర్షపాతం, నీటిపారుదల సౌకర్యం ఉన్న ప్రదేశాలలో మాత్రమే పంపిస్తారు. దాదాపు 50 శాతం ఉత్పత్తి ఉత్తరప్రదేశ్ నుండి జరుగుతుంది. మహారాష్ట్ర,

తమిళనాడు, కర్నాటక తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. బీహారు, గుజరాత్, హర్యానా, పంజాబు, ఒరిస్సాలలోని కొన్ని ప్రాంతాలలో కూడ సాగు చేస్తున్నారు.

**7. ప్రత్తి :** ఉత్పత్తిలో అమెరికా, చైనా తరువాత భారతదేశం మూడవ స్థానంలో ఉంది. నల్లరేగడి భూముల్లో బాగా పండుతుంది. మధ్య స్థాయిలో నీటి సరఫరా అవసరం. పొడి ప్రాంతాలలో కూడా పండించవచ్చు. ఎక్కువగా గుజరాత్‌లో తర్వాతి స్థానాలలో మహారాష్ట్ర, పంజాబు, ఆంధ్రప్రదేశ్, హర్యానాలో పండిస్తున్నారు. కర్నాటక తమిళనాడు, మధ్యప్రదేశ్‌లలో కూడా కొన్ని ప్రాంతాలలో పండిస్తారు.

**8. జనుము :** ప్రపంచంలో 50 శాతం ఉత్పత్తితో భారతదేశం ప్రథమ స్థానంలో ఉంది. ఒండ్రుమట్టి నేలల్లో బాగా పండుతుంది. నీటి అవసరం ఎక్కువ. తరువాత నార తీసేందుకు కూడ నీరు కావాలి. పశ్చిమ బెంగాలు నుండి సుమారు 70 శాతం ఉత్పత్తి అవుతోంది. తరువాతి స్థానాల్లో బీహారు, అస్సాం, ఒరిస్సాలున్నాయి.

**9. పొగాకు :** ప్రపంచంలో అమెరికా, చైనాల తర్వాత మూడవస్థానం భారతదేశానిదే. నాటు, వర్జీనియా రకాలు పండిస్తారు. వర్జీనియా రకం శ్రేష్టమైంది. దీనిని నీటిపారుదల సౌకర్యం ఉన్న ఇసుక నేలలు, నల్లరేగడి భూముల్లో పండిస్తారు. ఆంధ్రప్రదేశ్ (50% ), గుజరాత్ (30% ) లలో ఎక్కువగా పండిస్తారు. ఉత్పత్తిలో సుమారు 80 శాతం ఈ రెండు రాష్ట్రాలనుండి జరుగుతుంది. తమిళనాడు, కర్నాటక, పశ్చిమబెంగాల్, బీహారు, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్‌లో కూడా కొన్ని ప్రదేశాలలో పండిస్తున్నారు.

**10. రబ్బరు :** ప్రపంచ ఉత్పత్తిలో 5వ స్థానంలోభారతదేశం ఉంది. నీటి సౌకర్యం ఉన్న సారవంతమైన నేలల్లో పండిస్తారు. కొండచరియల్లో ముఖ్యంగా 300 మీటర్లు ఎత్తున ఉన్న ప్రాంతాలలో బాగా పండుతుంది. సుమారు 95 శాతం ఉత్పత్తి కేరళనుండి జరుగుతుంది. తమిళనాడు, కర్నాటక, అండమాన్ నికోబార్ దీవులనుండి మిగతా ఉత్పత్తి అవుతోంది.

**11. కాఫీ :** ప్రపంచంలో 2 శాతం ఉత్పత్తి మాత్రమే భారతదేశంలో జరుగుతుంది. ఎక్కువ భాగం విదేశాలకు ఎగుమతి జరుగుతుంది. ముఖ్యంగా అరబికా, రోబస్టా రకాలను పండిస్తున్నారు. ఎత్తైన కొండ చరియల్లో పండిస్తారు. దేశంలో సగం దిగుబడి కర్నాటక నుండి లభిస్తుంది. మిగతాది కేరళ, తమిళనాడులనుండి ఉత్పత్తి అవుతుంది. $15^0$ C నుండి $28^0$ C మధ్య ఉష్ణోగ్రత ఉండే ప్రాంతాలలో బాగా పండుతుంది.

BRAOU

**12. తేయాకు :** ప్రపంచ ఉత్పత్తిలో 35 శాతం ఉత్పత్తితో భారతదేశం అగ్రస్థానంలో ఉంది. చైనీసు, అస్సామీసు రకాలు భారతదేశంలో పండిస్తారు. కొత్తగా సేద్యం క్రిందకు వచ్చిన అడవి నేలలు, కొండచరియల్లో పండిస్తారు. నీటి సరఫరా పుష్కలంగా ఉండాలి. ఎక్కువ ఎత్తైన ప్రాంతాలలో పండిన తేయాకు ఎక్కువ నాణ్యత కలిగి ఉంటుంది. 75 శాతం అస్సాం, పశ్చిమ బెంగాలు రాష్ట్రాల నుండి ఉత్పత్తి అవుతుంది. 20 శాతం తమిళనాడు, కేరళల నుండి, మిగతాది కర్నాటక, త్రిపుర, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్‌ల నుండి ఉత్పత్తి అవుతుంది.

**13. నూనె గింజలు :** ప్రపంచంలో నూనె గింజల ఉత్పత్తిలో భారతదేశం అగ్రస్థానంలో ఉంది. దేశంలో ప్రధానంగా వేరుశనగ, లిన్ సీడ్, నువ్వులు, రేప్‌సీడు, మస్టర్డ, ఆముదాలు, నైగల్ సీడు, శాఫ్ పువ్వులు, ప్రత్తి గింజలు, సోయా చిక్కుళ్ళు గంధపు నూనె, ప్రొద్దు తిరుగుడు పువ్వుల నుండి నూనె ఉత్పత్తి జరుగుతుంది.

వేరుశనగ ప్రధానమైన పంట. సుమారు 45 శాతం నూనె ఉత్పత్తి వేరుశనగ నుండి జరుగుతుంది. మన దేశ అవసరాలకు ఇక్కడ ఉత్పత్తి అవుతున్న వేరుశనగ నూనె సరిపోక విదేశాల నుండి దిగుమతి చేసుకొంటున్నాం. దేశంలో ముఖ్యంగా కోరమాండల్ బొంబె, బోల్డు, స్పానిష్ పీనట్, రెడ్‌నట్ రకాలు పండుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ (23శాతం), గుజరాత్ (19 శాతం) తమిళనాడు, (19 శాతం), కర్నాటక (14 శాతం), మహారాష్ట్ర (19శాతం)లలో ప్రధానంగా ఉత్పత్తి

అవుతుంది. మిగతాది ఒరిస్సా, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లలో ఉత్పత్తి అవుతుంది.

లిన్‌సీడ్ ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, బీహారులనుండి; నువ్వులు ఉత్తరప్రదేశ్, ఒరిస్సా, రాజస్థాన్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లనుండి, రేప్‌సీడు;మస్టర్డ్ ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, పంజాబు, మధ్యప్రదేశ్‌లనుండి; ఆముదాలు గుజరాత్, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, ఒరిస్సాలనుండి; నైగర్ సీడు ఒరిస్సా, మధ్యప్రదేశ్, బీహారు, మహారాష్ట్రల నుండి; శాఫ్ పువ్వులు మహారాష్ట్రనుండి, ప్రత్తి గింజలు గుజరాత్, మహారాష్ట్ర, పంజాబు, ఆంధ్రప్రదేశ్, హర్యానా, కర్నాటకల నుండి; సోయా చిక్కుళ్ళు మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్‌లనుండి; గంధపు నూనె కర్నాటక నుండి, ప్రొద్దు తిరుగుడు మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌లనుండి ప్రధానంగా ఉత్పత్తి అవుతున్నాయి.

### 3.8.2 పశుసంపద

భారతదేశంలో వ్యవసాయ రంగంలోనూ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలోనూ పశుసంపద ప్రముఖ స్థానం ఆక్రమించింది. సన్నకారు రైతులకూ, వ్యవసాయ కార్మికులకూ జీవనభృతి వీటి ద్వారా కలుగుతుంది. ఇవి పాలు, మాంసం ద్వారా పోషక పదార్థాలను అందిస్తున్నాయి. పశువులపేడ, కృత్రిమ ఎరువుగానూ, బయోగ్యాసు తయారు చేసేందుకూ ఉపయోగపడుతోంది. 1982 సంవత్సరపు ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు 19.2 కోట్లు గేదెలు, దున్నలు, 7.0 కోట్లు ఆవులు, ఎద్దులు, 9.5 కోట్లు మేకలు, 4.9 కోట్లు గొర్రెలు, 21 కోట్లు కోళ్ళు, ఇతరపెంపుడు పక్షులు ఉన్నట్లు తెలుస్తోంది.

పశువులు ఉత్తరప్రదేశ్‌లో 15 శాతం, మధ్యప్రదేశ్‌లో 14 శాతం, బీహారులో 9.2 శాతం, మహారాష్ట్రలో 8.8 శాతం, రాజస్థాన్‌లో 7.5 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 7.3 శాతం, పశ్చిమ బెగాల్‌లో 6.5 శాతం, తమిళనాడు నుండి 6.2 శాతం ఉన్నాయి. మిగతా 25.2 శాతం ఒరిస్సా, కర్నాటక, గుజరాత్, అస్సాం, హర్యానా, పంజాబు, హిమాచల్ ప్రదేశ్‌లో ఉన్నాయి. గిల్ సాహివాల్, సింధి, దేవేని, ముఖ్యమైన పాలిచ్చే జాతులు. నగోరి, బచేరి, మాల్వి, కెన్యారియా, ఖేరిఖడ్, హల్లికర్, అమృత మహల్, ఖిల్లారి, బర్గూర్, సిరిజాతులు కరువు పరిస్థితులను తట్టుకొని మెట్టసేద్యానికి ఉపయోగపడ్తాయి. ధార్‌పరేకర్, కంక్రేజ్, హర్యానా, మేవతి, రత్, నిమారి, దంగీ, గావ్‌లావ్, కిష్ణాలోయ, ఒంగోలు జాతుల పశువులు పాలుబాగా ఇస్తాయి. సేద్యానికి కూడా పనికి వస్తాయి. ప్రపంచస్థాయిలోనే మేలుజాతి ఆవులు ముర్రా, భద్వారి, జఫర్‌బంది, సూర్తి, నాగపూరి, నీలిరావి, మెహసనా రకాలు భారతదేశంలో ఉన్నాయి.

గేదెలు, దున్నలు కూడ ఉత్తరప్రదేశ్‌లో ఎక్కువగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, పంజాబు, రాజస్థాన్, బీహారు, మహారాష్ట్ర, గుజరాత్, కర్నాటక, తమిళనాడు తరువాత స్థానాలలో ఉన్నాయి. మన దేశంలో 61 శాతం పాల ఉత్పత్తి గేదెల నుండి జరుగుతుంది.

గొర్రెలు దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయి. గొర్రె మాంసం, ఉన్ని, చర్మాలకు ప్రాధాన్యం ఉంది. మేలురకం జాతులు ఉత్తరప్రాంత చలిప్రదేశాలలో ఉన్నాయి. ముఖ్యమైన రకాలు కాశ్మీరి లోయ, భదర్వా, భహర్వాల్, రాంపూర్, భూసాయర్, జై సల్మీరీ, మల్పూరీ, సోనాడి, పుగల్, మర్రా, బికనేరి, లోహి, డెక్కను, నెల్లూరు, మంగ్ బందరు, ఆంధ్రప్రదేశ్‌లలో ఎక్కువగా ఉన్నాయి. రాజస్థాన్, గుజరాత్, జమ్మూ కాశ్మీరు, బీహారు, మధ్యప్రదేశ్ తరువాత స్థానాలందున్నాయి.

మేకల నుండి పాలు, మాంసం, వెంట్రుకలు, చర్మం ఉత్పత్తి జరుగుతుంది. దేశంలో ముఖ్యమైన జాతులు చంబా, గద్దె, చేగు, కాశ్మీరీ, పష్మిన, జమునా పరిబార్బరీ, బీటల్, మర్వారీ, మేహసనా, కథియం వారి జల్వాడి, బరారీ, సూర్తి మొదలైనవి డెక్కను, బీహారులలో అధికం. తరువాత స్థానాలలో వరసగా రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాలు, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, గుజరాత్, అస్సాం, పంజాబు రాష్ట్రాలున్నాయి.

BRAOU

### 3.8.3 సేద్యపు నీటి పారుదల వ్యవస్థ

భారతదేశ నీటి పారుదల వ్యవస్థలో బావులు ప్రధాన పాత్ర వహిస్తున్నాయి. తరువాత వరుసగా కాలువలు, చెఱువులు ఉన్నాయి. బావుల ద్వారా భూగర్భ జలం అందుబాటులో ఉంటుంది. ఉపరితల బావులు, గొట్టపు బావులు ఉపయోగించి వ్యవసాయం చేయటం జరుగుతుంది. భూగర్భజలం ఎక్కువగా ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాలందు మాత్రమే వినియోగిస్తున్నారు. బావుల నుండి సాధారణంగా మానవ లేదా జంతు లేదా యాంత్రిక శక్తిని ఉపయోగించి నీటిని తోడి పొలాలకు వినియోగిస్తారు. ఉత్తర ప్రదేశ్‌లో బావుల ద్వారా సేద్యం ఎక్కువగా జరుగుతుంది. తరవాత స్థానాల్లో వరసగా పంజాబు, హర్యానా, రాజస్తాన్, మహారాష్ట్ర, తమిళనాడు, గుజరాత్‌లు వస్తాయి.

కాలువల ద్వారా 20 మిలియన్ హెక్టార్లలో పంటలు పండిస్తున్నారు. పంజాబు, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలలో మైదాన ప్రాంతాలలో ఎక్కువగా కాలువల ద్వారా సేద్యం చేస్తున్నారు. దేశంలో కాలువల ద్వారా సేద్యం చేసే రాష్ట్రాలు విస్తీర్ణం వారీగా వరసగా ఉత్తరప్రదేశ్, పంజాబు, హర్యానా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడులున్నాయి.

చెఱువుల ద్వారా సేద్యం చేసే రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ప్రధమ స్థానంలో ఉంది. తరువాత వరసగా, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాలు, కర్నాటక రాష్ట్రాలున్నాయి.

పంజాబు, హర్యానా, పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడులలోని ప్రాంతాలు మాత్రమే సంతృప్తికరమైన నీటి పారుదల వ్యవస్థను కలిగి ఉన్నాయి. నీటి పారుదల వ్యవస్థలో మూడు తరగతులవారీ ప్రాజెక్టులను ఏర్పరుస్తారు. అవి : బహుళార్థక సాధక ప్రాజెక్టు (ఆయకట్టు భూమి 10 వేల హెక్టార్ల కంటే ఎక్కువ), మధ్య తరహా ప్రాజెక్టు (ఆయకట్టు భూమి, 2 వేల నుండి 10 వేల హెక్టార్ల మధ్యన), చిన్న తరహా ప్రాజెక్టు (ఆయకట్టు భూమి 2 వేల హెక్టార్ల కంటె తక్కువ).

**ముఖ్యమైన నీటిపారుదల ప్రాజెక్టులు**

| | పేరు | నది | రాష్ట్రం |
|---|---|---|---|
| 1) | నాగార్జున సాగర్ | కృష్ణా | ఆంధ్రప్రదేశ్ |
| 2) | తుంగభద్ర | కృష్ణా | ఆంధ్రా, కర్నాటక |
| 3) | గండకి | గంగ | బీహార్, ఉత్తరప్రదేశ్ |
| 4) | కోసి | కోసి | బీహారు |
| 5) | కక్రపార | తపతి | గుజరాత్ |
| 6) | మాహి | మాహి | గుజరాత్ |
| 7) | ఎగువకృష్ణ | కృష్ణా | కర్నాటక |
| 8) | ఘాట్‌ప్రభ | ఘాట్‌ప్రభ | కర్నాటక |
| 9) | మాల్‌ప్రభ | మాల్‌ప్రభ | కర్నాటక |
| 10) | తవా | తవా | మధ్యప్రదేశ్ |
| 11) | చంబల్ | చంబల్ | మధ్యప్రదేశ్, రాజస్థాన్ |
| 12) | భీమ | భీమ | మహారాష్ట్ర |

B R A O U

| | | | |
|---|---|---|---|
| 13) | జయక్‌వాడి | గోదావరి | మహారాష్ట్ర |
| 14) | హిరాకుడ్ | మహానది | ఒరిస్సా |
| 15) | భాక్రానంగల్ | సట్లెజ్ | పంజాబు, హర్యానా, రాజస్థాన్ |
| 16) | బియాస్ | బియాస్ | పంజాబు, హర్యానా, రాజస్థాన్ |
| 17) | ఇందిరాకాలువ | బియాస్ | రాజస్థాన్ |
| 18) | పరంబికులమే అలిమార్ | స్థానిక నదులు | కేరళ |
| 19) | సర్దాసహాయక్ | ఘాగ్రా, శారదా | ఉత్తరప్రదేశ్ |
| 20) | రామగంగ | గంగ | ఉత్తరప్రదేశ్ |
| 21) | సబర్మతి | సబర్మతి | గుజరాత్ |
| 22) | ధవళేశ్వరం | గోదావరి | ఆంధ్రప్రదేశ్ |
| 23) | శ్రీరాం సాగర్ | గోదావరి | ఆంధ్రప్రదేశ్ |
| 24) | దామోదర్ | దామోదర్ | బీహారు, పశ్చిమబెగాలు |
| 25) | ఫరక్కా | గంగ | పశ్చిమ బెంగాలు |
| 26) | భద్రా | భద్రా | కర్నాటక |
| 27) | బర్గి | బర్గి | మధ్యప్రదేశ్ |
| 28) | తెహ్రీ | భగీరధి | ఉత్తరప్రదేశ్ |

BRAOU

## 3.9 ఖనిజ వనరులు

భారతదేశంలో వివిధ రకాల ఖనిజాలు అధికంగా విస్తరించి ఉన్నాయి. అన్నిప్రాంతాలలో సమంగా లేక వివిధ ప్రాంతాలందు వివిధ ఖనిజాలు నిక్షేపింపబడినాయి. మనదేశంలో ఫెర్రసు ఖనిజాలు అధికంగా ఉన్నాయి. దామోదర లోయలో ఖనిజాలు విస్తారంగా ఉన్నాయి. దక్షిణ ప్రాంతంలో తక్కువగా ఉన్నాయి. జమ్మూ కాశ్మీరు, పంజాబు, హర్యానా, ఉత్తరప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, త్రిపుర, నాగాలండ్, రాష్ట్రాల్లో మరీ తక్కువగా ఉన్నాయి. ఖనిజాలను నాలుగు తరగతులుగా వర్గీకరించవచ్చు. అవి : ఇంధన ఖనిజాలు, ఫెర్రసు లోహ ఖనిజాలు, నాన్ ఫెర్రసు లోహ ఖనిజాలు, ఇంధనేతర లోహేతర ఖనిజాలు.

1) **ఇంధన ఖనిజాలు :** పెట్రోలియం, సహజ వాయువు, బొగ్గు, అణు ఇంధన ఖనిజాలైన మోనజైటు, బెరీలియం, జిర్కోనియం ఇల్మనైటు, యురేనియం మొదలైనవి ఈ తరగతిలోకి వస్తాయి. బొగ్గు పశ్చిమ బెంగాల్‌లో రాణిగంజ్, బీహారులో జరియాం, ఆంధ్రప్రదేశ్‌లో సింగరేణి ప్రాంతాలలో ఎక్కువగా ఉంది. లిగ్నైటు రకం తమిళనాడులో నైవేలి వద్ద దొరుకుతుంది. దేశంలోని మొత్తం బొగ్గు ఉత్పత్తిలో 37 శాతం బీహారునుండి, 18 శాతం పశ్చిమ బెంగాలు నుండి ఉత్పత్తి చేస్తున్నారు. పెట్రోలియం, సహజవాయువు నిక్షేపాలు భారతదేశంలో అస్సాంలోని దిగ్‌బాయి, గుజరాత్‌లోని కాంబే, మహారాష్ట్రలోని బొంబే హై ప్రాంతాల నుండి అధికంగా ఉత్పత్తి జరుగుతోంది. కృష్ణా, గోదావరి, కావేరి, పశ్చిమ ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్‌లోని సరిహద్దు ప్రాంతాలలో నిక్షేపాలున్నట్టు కనుగొన్నారు. అణు ఇంధన ఖనిజాలు దేశంలో చాలా తక్కువగా ఉన్నాయి. యురేనియం బీహారులోని జాడుగుడా ప్రాంతం నుండి ఉత్పత్తి చేస్తున్నారు. ఇతర ఇంధన ఖనిజాలు కొన్ని సముద్ర తీర

ప్రాంత ఇసుకనందు ఉన్నాయి అని కనుగొన్నారు. మోనోజైటును కేరళ రాష్ట్రం లోని తీరప్రాంత ఇసుక నుండి ఉత్పత్తి చేస్తున్నారు.

**2) ఫెర్రసు లోహఖనిజాలు :** ఇనుము, మాంగనీసు, క్రోమైటు, పైరైటు మొదలైన ఖనిజాలు ఈ తరగతిలో ఉన్నాయి. ఇనుము ఒరిస్సాలోని సుందర్‌గర్, సంబల్‌పూర్, కోయిన్ జైర్, మయూర్ బంజ్, ప్రాంతాల్లో, బీహారులోని సింగ్‌భుమ్ వద్ద, మధ్యప్రదేశ్‌లోని బైలదిల్ల, దుర్గ్ జిల్లాలోను అధికంగా నిక్షేపింపబడింది. ఈ ప్రాంతాలో అధికంగా ఉత్పత్తి చేస్తారు. దేశంలో మొత్తం ఉత్పత్తిలో 96 శాతం ఒరిస్సా, బీహారు, మధ్యప్రదేశ్, కర్నాటక, గోవా రాష్ట్రాలనుండి అవుతుంది. మాంగనీసు మహారాష్ట్రలోని నాగపూర్ -బందార ప్రాంతం నుండి, మధ్యప్రదేశ్‌లోని బాలఘాట్ వద్దనుండి అధికంగా ఉత్పత్తి జరుగుతుంది. ఇక ఒరిస్సా, కర్నాటక, రాజస్థాన్ రాష్ట్రాలలో కూడ ఉంది. క్రోమైటు ఖనిజం ప్రధానంగా ఒరిస్సాలోని ఢైనకనాల్, కోయిన్ జార్ ప్రాంతంలో అధికంగా ఉత్పత్తి అవుతుంది. ఇంకా మహారాష్ట్రలోని ఉత్తర రత్నగిరి, బీహారులోని సింగ్‌భుమ్, కర్నాటకలోని మైసూరు, హస్సన్ ప్రాంతాలలో, ఆంధ్రప్రదేశ్‌లో పశ్చిమ గోదావరి, తమిళనాడుల్లో సేలం ప్రాంతాలలో కూడా లభిస్తోంది. పైరైటు ఖనిజం బీహారు, రాజస్థాన్ రాష్ట్రాలలో అధికంగా దొరుకుతుంది.

**3) నాన్ - ఫెర్రసు లోహ ఖనిజాలు :** రాగి, బంగారం, వెండి, ప్లాటినం, జింకు, సీసం, తగరం, అల్యూమినియం, టంగ్‌స్టన్ ఖనిజాలు ఈ తరగతిలోకి వస్తాయి. రాగి ఉత్పత్తి దేశంలో తగినంత లేదు. రాగి ధాతు నిల్వలు బీహారులోని సింగ్ భుమ్, రాజస్థాన్‌లోని కెత్రీ, మధ్యప్రదేశ్‌లోని బాలఘాట్, ఆంధ్రప్రదేశ్‌లోని అగ్నిగుండాల, కర్నాటకలోని చిత్రదుర్గ ప్రాంతాలలో దొరుకుతుంది. సిక్కిం, ఉత్తరప్రదేశ్‌లోని కూడ నిల్వలున్నాయి. బంగారం ఉత్పత్తి దేశంలో చాలా తక్కువ. కర్నాటకలోని కోలార్, హట్టి, ఆంధ్రప్రదేశ్‌లోని రామగిరి ప్రాంతాలలో లభిస్తోంది. వెండి రాజస్థాన్‌లోని జావర్ గనులనుండి సీసం, జింక్ ధాతువుల విశ్లేషణ ద్వారా ఉప ఉత్పత్తిగా లభిస్తోంది. అలాగే కోలార్, హట్టి బంగారు గనుల్లో కూడ ఉప ఉత్పత్తిగా దొరుకుతుంది. సీసం, జింకు ఖనిజాలు సాధారణంగా కలిసి జంటగా ఏర్పడి ఉంటాయి. రాజస్థాన్‌లోని జావర్, ఉదయపూర్, ప్రాంతాలనుండి వెలికి తీస్తున్నారు.

BRAOU

అల్యూమినియం ఖనిజమైన బాక్సయిట్ దేశంలో అధిక మొత్తంలో ఉన్నట్లు కనుగొన్నారు. అనేక ఇతర ఖనిజాలనుండి అల్యూమినియం లబిస్తుంది. కాని, బాక్సయిట్ నుండి మాత్రమే ఎక్కువ ఉత్పత్తి అవుతుంది. భారత దేశం తూర్పు తీరం వెంబడి ఉత్తర ఆంధ్రా, దక్షిణ ఒరిస్సా ప్రాంతంలో అధిక మొత్తంలో నిక్షేపాలున్నట్లు కనుగొన్నారు. ప్రస్తుతం మనదేశంలో ఉత్పత్తి బీహారులోని పాలమావు, రాంచీ, షాబాదులలో, మధ్యప్రదేశ్‌లోని బిలాస్‌పూర్, జబల్‌పూర్, బాలఘాట్, బస్తర్ ప్రాంతాలలో, మహారాష్ట్రలోని కొల్హాపూర్, ధానా, సతారా, రత్నగిరి ప్రాంతాలలో, గుజరాత్‌లోని కచ్, జామ్‌నగర్ ప్రాంతాలలో, తమిళనాడులోని సేలం ప్రాంతాలలో జరుగుతుంది.

**4. ఇంధనేతర, లోహేతర ఖనిజాలు :.** మాగ్నసైటు, సున్నపురాయి, డోలమైటు, మైకా, కమ్మెనైటు, సిల్లిమనైటు, జిప్సం, అపటైటు, వజ్రం, ఫాస్ఫేటు, లవణం ఈ తరగతిలోకి వస్తాయి. మాగ్నసైటు తమిళనాడులోని చాక్ కొండలలో, ఉత్తరప్రదేశ్‌లోని అల్మోరాలలో దొరుకుతుంది. మైకా బీహారులోని హజారి బాగ్, గయలల్లో, ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరులో, రాజస్థాన్‌లోని అజ్మీరు ప్రాంతాలలో దొరుకుతుంది. సున్నపురాయి ఆంధ్రప్రదేశ్‌లోని కడప, కర్నూలు, ఖమ్మం, కృష్ణా, గుంటూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలలో, మధ్య ప్రదేశ్‌లోని బిలాస్‌పూర్, జబల్‌పూర్, రేవా, సాత్నా రామాపూర్ జిల్లాలో, తమిళనాడులోని సేలం, తిరుచునాపల్లి, రామనాథపురం, కోయం బత్తూరు, మధురై జిల్లాలలో, రాజస్థాన్‌లోని అజ్మీరు, జైపూర్‌లలో, ఒరిస్సాలోని సుందరగడ్, సంబల్‌పూర్, కలహండి జిల్లాలలో దొరుకుతుంది. సిల్లమనైటు, కయనైటు బీహారులోని సింగ్‌భుమ్ ప్రాంతంలో అధికంగా దొరుకుతుంది. జిప్సం రాజస్థాన్‌లో అధికంగా ఉత్పత్తి అవుతుంది. వజ్రాలు మధ్యప్రదేశ్‌లోని వజ్రకరూర్ ప్రాంతంలో అప్పుడప్పుడు దొరుకుతుంటాయి. అపటైటు బీహారులోని

సింగ్‌భుమ్, ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ పట్టణం జిల్లాలలో దొరుకుతుంది. ఫాస్ఫేటు రాజస్థాన్‌లోని ఉదయపూర్, ఉత్తరప్రదేశ్‌లో డెహ్రాడూన్ ప్రాంతంలో దొరుకుతుంది. లవణాన్ని సముద్రతీర ప్రాంతాలలో ఎక్కువగా ఉత్పత్తి చేస్తున్నారు. గుజరాత్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలలో అధికంగా ఉత్పత్తి చేస్తున్నారు.

## 3.10 రాష్ట్రాలు - జనాభా

భారత దేశంలో 26 రాష్ట్రాలు, 6 కేంద్రపాలిత ప్రాంతాలున్నాయి. మనదేశ రాజధాని ఢిల్లీ నగరం, దేశ విస్తీర్ణం 3,287,263 చదరపు కిలో మీటర్లు. దీనిలో 78,114 చ.కి. పాకిస్థాన్ ఆధీనంలో ఉంది. 5,180 చ.కి. చట్ట వ్యతిరేకంగా పాకిస్థాన్ చైనాకి ఇచ్చింది. 37,555 చ.కి. చైనా ఆధీనంలో ఉంది. 1991 లెక్కల ప్రకారం దేశ జనాభా 84.4 కోట్లు. వీరిలో పురుషులు 43.8 కోట్లు, స్త్రీలు 40.6 కోట్లు. గ్రామీణ జనాభా 62.7 కోట్లు. పట్టణ జనాభా 21.7 కోట్లు. కార్మికులు మొత్తం 30.7 కోట్లుంటే అందులో పురుషులు 21.8 కోట్లు, స్త్రీలు 8.9 కోట్లు. ప్రతి వేయి మందికి పుట్టుక రేటు 32.5 ఉంటే, మరణాల రేటు 11.4 ఉంది. సగటు ఆయుఃప్రమాణం 58.2 సం॥. ఇది పురుషులలో 57.7 ఉంటే, స్త్రీలలో 58.7 ఉన్నది. అక్షరాస్యత శాతం సగటున 52.1 శాతం ఉంటే, పురుషుల్లో 63.9 శాతం, స్త్రీల్లో 39.4 శాతం ఉంది. విస్తీర్ణంలో మధ్యప్రదేశ్ పెద్ద రాష్ట్రం, గోవా చిన్న రాష్ట్రం. ఉత్తరప్రదేశ్‌లో జనాభా ఎక్కువ, సిక్కింలో తక్కువగా ఉన్నారు.

**ఆంధ్రప్రదేశ్ :** విస్తీర్ణం 2,75,068 చ.కి.. రాజధాని హైదరాబాదు, భాషలుః తెలుగు, ఉర్దూ, జనాభా 66,304, 854, పురుషులు 33623738, స్త్రీలు 32681116, అక్షరాస్యత శాతం 45.11, తలసరి ఆదాయం 4507 రూపాయలు, ఇతర ముఖ్య పట్టణములు విశాఖ పట్టణం, విజయవాడ, తిరుపతి.

**అరుణాచల్‌ప్రదేశ్ :** విస్తీర్ణం 83,743 చ.కి.. రాజధాని ఇటానగర్, భాషలుః మున్పా, అకా, మిజిషేర్‌డుక్‌పెన్, నిషి, అపటాని, హిల్‌మిరి, తగిన్, అరు, ఇడు, డిగారు, మిజికాంటీ, సింగ్‌ఫో, టాంగ్సా, నాక్టె, వాంచూ. మొ॥. జనాభా 8,58,398 పురుషులు 4,61,242, స్త్రీలు 3,97,150 అక్షరాస్యత శాతం 41.22, తలసరి ఆదాయం 4176 రూ॥

**అస్సాం :** విస్తీర్ణం 78,438 చ.కి.. రాజధాని డిస్పూరు, భాష అస్సామీసు, జనాభా 22,294,562, పురుషులు 11,579,693, స్త్రీలు 10,714869, అక్షరాస్యత శాతం 53.42, తలసరి ఆదాయం 3179 రూ॥. ఇతర ముఖ్యపట్టణాలుః గౌహతి.

BRAOU

**బీహారు :** విస్తీర్ణం 1,73,877 చ.కి. రాజధాని పాట్నా. భాష హిందీ. జనాభా 86,338,853, పురుషులు 45,147,280, స్త్రీలు 41,191,573, అక్షరాస్యత శాతం 38.54, తలసరి ఆదాయం 2112 రూ॥ ఇతర ముఖ్య పట్టణాలుః గయ, బొకారో, జమ్‌షెడ్‌పూర్, రాంచి, నలంద.

**గోవా :** విస్తీర్ణం 3,702 చ.కి. రాజధాని పనాజి, భాషలు కొంకణి, మరాఠీ, జనాభా 1,168,622, పురుషులు 5,93,563, స్త్రీలు 5,75,059, అక్షరాస్యత శాతం 76.96, తలసరి ఆదాయం 6939 రూ॥. ఇతర ముఖ్యపట్టణాలుః గోవా, వాస్కోడిగామ.

**గుజరాత్ :** విస్తీర్ణం 1,96,024 చ.కి. రాజధాని గాంధీనగర్, భాష - గుజరాతీ, జనాభా 41,174,060, పురుషులు 21,272,388, స్త్రీలు 19,901,672, అక్షరాస్యత శాతం 60.91, తలసరి ఆదాయం 5406/- రూ॥ ఇతరముఖ్య పట్టణాలుః అహ్మదాబాదు, భావనగర్, రాజ్‌కోట్, సూరత్.

**హర్యానా :** విస్తీర్ణం 44,212 చ.కి. రాజధాని-చండీఘర్. భాషలు హిందీ, జనాభా 16,317,715, పురుషులు 8,705,379,

స్త్రీలు, 7,612,336, అక్షరాస్యత శాతం 55.33, తలసరి ఆదాయం 8690/- రూ॥ ఇతర ముఖ్య పట్టణాలు: కర్నాలు, ఫరీదాబాదు, హిస్సారు.

**హిమాచల్ ప్రదేశ్ :** విస్తీర్ణం 55,673 చ.కి. రాజధాని సిమ్లా, భాషలు: హిందీ, పహారీ, జనాభా 5,111,079, పురుషులు 2,560,804, స్త్రీలు 2,550185 అక్షరాస్యత శాతం 63.54, తలసరి ఆదాయం 4005/- రూ॥ ఇతర ముఖ్య పట్టణాలు : కులూ, లోహల్, స్పిటీ.

**జమ్మూ, కాశ్మీరు :** విస్తీర్ణం 2,22,236 చ.కి. రాజధాని శ్రీనగర్ (వేసవి కాలం), జమ్మూ (చలికాలం), భాషలు : ఉర్దూ, కాశ్మీరు, డాంగ్రీ, లడకీ, జనాభా 7,718,700, అక్షరాస్యత శాతం 26.17, తలసరి ఆదాయం 3240/- రూ॥ ఇతరముఖ్యపట్టణాలు: లడక్, అనంతనాగ్, ఉద్ధంపూర్.

**కర్నాటక :** విస్తీర్ణం 1,91,791 చ.కి. రాజధాని బెగుళూరు. భాష - కన్నడం, జనాభా 44,817398, పురుషులు 22,861,409, స్త్రీలు 21,955, 989, అక్షరాస్యత శాతం 55.98, తలసరి ఆదాయం 4075/- రూ॥. ఇతర ముఖ్యపట్టణాలు: మైసూరు, బీదరు, రాయచూర్, బళ్ళారి.

**కేరళ :** విస్తీర్ణం 38,863 చ.కి. రాజధాని త్రివేంద్రం, భాష -మళయాళం, జనాభా 29,011,237, పురుషులు 14,218,167, స్త్రీలు 14,793,070, అక్షరాస్యత శాతం 90.59, తలసరి ఆదాయం 5065/- రూ॥. ఇతర ముఖ్య పట్టణాలు: ఎర్నాకులం, కొన్నూరు, త్రిచూరు.

**మధ్యప్రదేశ్ :** విస్తీర్ణం 4,43,446 చ.కి. రాజధాని భోపాల్, భాష - హిందీ, జనాభా 66,135,862, పురుషులు, 34,232,048, స్త్రీలు 31,903,814, అక్షరాస్యత శాతం 43.45, తలసరి ఆదాయం 2878/- రూ॥. ఇతర ముఖ్య పట్టణాలు: గ్వాలియర్, ఇండోర్, ఉజ్జయిని, సాగర్, విదీష.

**మహారాష్ట్ర :** విస్తీర్ణం 3,07609 చ.కి. రాజధాని ముంబాయి. భాష - మరాఠీ, జనాభా 78,706,719, పురుషులు 40,652,056, స్త్రీలు 38,054,663, అక్షరాస్యత శాతం 63.10, తలసరి ఆదాయం 6184/- రూ॥. ఇతర ముఖ్యపట్టణాలు: నాగపూర్, పూనా, నాశిక్, వార్ధా.

**మణిపూర్ :** విస్తీర్ణం 22,327 చ.కి. రాజధాని ఇంఫాల్, భాష - మణిపురి, జనాభా 1,826,714, పురుషులు 913,511, స్త్రీలు 895,203, అక్షరాస్యత శాతం 60.96, తలసరి ఆదాయం 3502/- రూ॥.

**మేఘాలయ :** విస్తీర్ణం 22,429 చ.కి. రాజధాని షిల్లాంగ్, భాష - కాశీ, ఘరో, ఆంగ్లం, జనాభా 1,760,626, పురుషులు 904,308, స్త్రీలు 856,318, అక్షరాస్యత శాతం 48.26, తలసరి ఆదాయం 3250/- రూ॥

**మిజోరం :** విస్తీర్ణం 21,081 చ.కి. రాజధాని ఐజ్వాలు, భాషలు మిజో, ఆంగ్లం, జనాభా 686,217, పురుషులు 356,672, స్త్రీలు 324,545, అక్షరాస్యత శాతం 82.27, తలసరి ఆదాయం 4077/- రూ॥.

**నాగాలాండ్ :** విస్తీర్ణం 16,579 చ.కి. రాజధాని కోహిమా. భాషలు : ఆంగ్లము, ఏవో, కోంన్యాక్, అనగామి, సీమ, లోథా, జనాభా 1,215,573. పురుషులు 643,273, స్త్రీలు 572,300, అక్షరాస్యత శాతం 61.30, తలసరి ఆదాయం 3464/- రూ॥.

**ఒరిస్సా :** విస్తీర్ణం 1,55,707 చ.కి. రాజధాని భువనేశ్వర్, భాష - ఒరియా, జనాభా 31,512,070, పురుషులు

BRAOU

15,949,904, స్త్రీలు 15,532,166 అక్షరాస్యత శాతం 48.65, తలసరి ఆదాయం 3066/- రూ॥ ఇతరముఖ్య పట్టణాలుః కటక్, పూరి.

**పంజాబు** : విస్తీర్ణం 50,362 చ.కి. రాజధాని చండీఘర్. భాష - పంజాబీ, జనాభా 20,190,795, పురుషులు 10,695,136, స్త్రీలు 9,495,659, అక్షరాస్యత శాతం 57.14. తలసరి ఆదాయం 7081/- రూ॥. ఇతర ముఖ్య పట్టణాలుః పాటియాల, జలంధర్, అమృతసర్.

**రాజస్థాన్** : విస్తీర్ణం 3,42,239 చ.కి. రాజధాని జైపూర్, భాషలు - హిందీ, రాజస్థానీ, జనాభా 43,880, 640, పురుషులు 22,935,895, స్త్రీలు 20,944,745, అక్షరాస్యత శాతం 38.81, తలసరి ఆదాయం 2923/- రూ॥ ఇతర ముఖ్య పట్టణాలు : అజ్మీరు, జోధ్‌పూర్, ఉదయపూర్, జైసల్మీర్.

**సిక్కిం** : విస్తీర్ణం 7,096 చ.కి. రాజధాని గ్యాంగ్‌టక్, భాషలు : లెప్చా, భూటియా, హిందీ, నేపాలీ, లింభూ, జనాభా 403,612, పురుషులు 214,723, స్త్రీలు 188,889, అక్షరాస్యత శాతం 56.53, తలసరి ఆదాయం 4396/- రూ॥.

**తమిళనాడు** : విస్తీర్ణం 1,30,058 చ.కి. రాజధాని మద్రాసు, భాషలు - తమిళం, జనాభా 55,638,318, పురుషులు 28,217,947, స్త్రీలు 27,420,371, అక్షరాస్యత శాతం 63.72, తలసరి ఆదాయం 3894/- రూ॥. ఇతర ముఖ్య పట్టణాలు మదురై, కోయంబత్తూరు, తంజావూరు.

**త్రిపుర** : విస్తీర్ణం 10,486 చ.కి. రాజధాని అగర్తలా, భాషలు : బెంగాలి, కకేబార్క్, మణిపురి, జనాభా 2,744,827, పురుషులు 1,410,545, స్త్రీలు 1,334,282, అక్షరాస్యత శాతం 60.39, తలసరి ఆదాయం 2866/- రూ॥.

**ఉత్తరప్రదేశ్** : విస్తీర్ణం 2,94,411 చ.కి. రాజధాని లక్నో, భాషలు : హిందీ, జనాభా 138,760,417, పురుషులు 73,745,994, స్త్రీలు 65,014,423, అక్షరాస్యత శాతం 41.71, తలసరి ఆదాయం 2866/- రూ॥. ఇతర ముఖ్యపట్టణాలుః ఆగ్రా, అలహాబాదు, అలీఘర్, డెహ్రాడూన్, ఝాన్సి, కాన్పూరు, మీరట్, నైనిటాల్, వారణాసి.

**పశ్చిమ బెంగాలు** : విస్తీర్ణం 88,752 చ.కి. రాజధాని కలకత్తా. భాష - బెంగాలి, జనాభా 67,982,732, పురుషులు 35,461,898, స్త్రీలు 32,520,834, అక్షరాస్యత శాతం 57.72, తలసరి ఆదాయం 3963/- రూ॥. ఇతరముఖ్య పట్టణాలుః హౌరా, డార్జిలింగ్.

**ఢిల్లీ** : విస్తీర్ణం 1,483 చ.కి. రాజధాని ఢిల్లీ. భాషలుః హిందీ, పంజాబీ, ఉర్దూ. జనాభా 9,370,475, పురుషులు 5,120,733, స్త్రీలు 4,249,742, అక్షరాస్యత శాతం 76.09, తలసరి ఆదాయం 5315/- రూ॥.

## కేంద్రపాలిత ప్రాంతాలు

**అండమాన్ నికోబార్ దీవులు** : విస్తీర్ణం 8,249 చ.కి. రాజధాని పోర్టుబ్లెయిర్, భాషలు బెంగాలి, హిందీ, నికోబరీసు, తమిళం, మళయాళం, జనాభా 277,989 పురుషులు, 152,737 స్త్రీలు అక్షరాస్యత శాతం 73.74, తలసరి ఆదాయం 6751 రూ॥.

**చండీఘర్** : విస్తీర్ణం114 చ.కి. రాజధాని చండీఘర్. భాషలు హిందీ,పంజాబీ, జనాభా 640,725, పురుషులు 357,411, స్త్రీలు 283,314, అక్షరాస్యత శాతం 78.73.

**దాద్రా నాగర్ హవేలి** : విస్తీర్ణం 491 చ.కి. రాజధానిసిల్వాస్సా, భాషలుః భిలి, భిలోడి, గుజరాతీ, హిందీ, జనాభాః

BRAOU

1,38,542, పురుషులు 70,927, స్త్రీలు 67,615. అక్షరాస్యత శాతం 39.46.

**డామన్ , డైయ్యూ :** విస్తీర్ణం 112 చ.కి. రాజధాని డామన్, భాషలు గుజరాతీ, మరాఠీ, జనాభా 101,439, పురుషులు 51452, స్త్రీలు 49,987, అక్షరాస్యత శాతం 73.58.

**లక్షద్వీప్ :** విస్తీర్ణం 32 చ.కి. రాజధాని కవరత్తీ, భాషః మళయాళం, జనాభా 51681, పురుషులు 26,582, స్త్రీలు 25,099, అక్షరాస్యత శాతం 79.23.

**పాండిచ్చేరి :** విస్తీర్ణం 492 చ.కి. రాజధాని పాండిచ్చేరి, జనాభా 7,89,416, పురుషులు 398,324, స్త్రీలు 391,092. భాషలు : తమిళం, తెలుగు, మళయాళం, అక్షరాస్యత శాతం 74.91, తలసరి ఆదాయం 5637/- రూ॥ఇతరముఖ్యపట్టణాలు: కరైకాల్, మహే, యానం.

**అభ్యాసాలు**

రబీ పంటలు ఏ కాలంలో పండిస్తారు.

నాన్ ఫెర్రస్ లోహ ఖనిజాలను కొన్నింటిని రాయండి.

BRAOU

## 3.11 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- ప్రపంచదేశాలలో భారతదేశం ఏడవ పెద్ద దేశం. మూడు దిక్కులా సముద్రాలు, ఒక దిక్కున పర్వతాలు వున్నందువల్ల దీనిని ద్వీపకల్పం అంటారు.
- భారతదేశంలోని నదులు రెండు రకాలు : 1. హిమాలయాల్లో పుట్టిన నదులు. 2. ద్వీప కల్ప భూమిలో పుట్టిన నదులు.
- భారతదేశ వాతావతావరణాన్ని ఉష్ణప్రాంత వాతావరణంగా పేర్కొనవచ్చు.
- నైఋతి ఋతు పవనాల వల్ల ఈ దేశంలోవర్షాలు పడుతాయి.
- భారత వ్యవసాయ పరిశోధన మండలి దేశంలోని నేలలను 8 రకాలుగా గుర్తించింది.
- అడవుల్లో రెండు రకాలున్నాయి : సతత హరితరణ్యాలు, ఆకురాల్చే అడవులు.
- భారతదేశంలో వన్యప్రాణులు అపారంగా వున్నాయి. జాతీయ జంతువు పులి. జాతీయ పక్షి నెమలి.
- దేశంలో రెండురకాల పంట రకాలున్నాయి. ఖరీఫ్, రబీ. వరి,గోధుమ, తృణ ధాన్యాలు,చెఱకు, ప్రత్తి, పొగాకు మొదలైనవి పండిస్తున్నారు.
- భారతదేశంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పశుసంపదకు చాలా ప్రాతినిధ్యం వుంది.
- భారతదేశ నీటి పారుదల వ్యవస్థలో బావులకు ఎక్కువ ప్రాధాన్యం వుంది.
- వివిధ రకాల ఖనిజాలు దేశంలో అన్ని ప్రాంతాల్లో లభిస్తున్నాయి.
- భారతదేశంలో 26 రాష్ట్రాలు, 6 కేంద్ర పాలిత ప్రాంతాలు వున్నాయి.

## 3.12 మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

30 పంక్తుల్లో జవాబులు రాయండి.

1) భారతదేశం నైసర్గిక స్వరూపం, నదీవ్యవస్థను వివరించండి.

2) భారతదేశంలోని ఖరీఫ్ పంటలను కొన్నింటిని గురించి క్లుప్తంగా రాయండి.

15 పంక్తుల్లో జవాబులు రాయండి.

1) భారతదేశంలోని సేద్యపు నీటి పారుదల ప్రాజెక్టులను గురించి రాయండి.

2) భారతదేశంలోని ఖనిజ వనరులను పేర్కొనండి.

# భాగం 4 భారతదేశం : సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులు

విషయ క్రమం


4.0 ఉద్దేశం

4.1 ప్రవేశిక

4.2 భారత రాజ్య స్వరూపం

అభ్యాసం

4.3 భారత రాజకీయ వ్యవస్థ

అభ్యాసం

4.4 సామాజిక వ్యవస్థ

4.5 ఆర్థిక పరిస్థితులు

4.6 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

4.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 4.0. ఉద్దేశం

ఈ భాగం చదివింతర్వాత మీరు ;

భారతదేశ రాజకీయ, సామాజిక, ఆర్థిక వ్యవస్థల స్వరూపాన్ని స్థూలంగా వివరించగలుగుతారు.

BRAOU

## 4.1 ప్రవేశిక

ప్రాచీన నాగరిక దేశాల్లో భారతదేశం ఒకటి. ఈ దేశం చారిత్రకంగా ప్రపంచ నాగరికతలో తనవంతు భాగాన్ని నిర్వహిస్తూ తన ప్రత్యేక వ్యక్తిత్వాన్ని ప్రకటించుకొంది. విదేశాలతో వర్తక వాణిజ్య సంబంధాలు అనాదిగా వృద్ధి చెందుతూ వచ్చాయి. ఉపఖండంగా బయటి వారికి ఒక నిర్భేద్య భూభాగంగా వర్థిల్లింది. భౌగోళిక కారకాలు భారతదేశాన్ని ఆసియా ఖండం నుంచి వేరు పరచటం వల్ల, విదేశీయుల రాక చాల పరిమితంగా ఉండేది. వాయవ్య ప్రాంతం ద్వారా విదేశీయులు దేశంలోకి చొరబడ్డారు. అలా వచ్చిన విదేశీ విజేతలందరు ఇక్కడనే స్థిరపడి భారతీయులలో ఏకమయ్యారు. సామ్రాజ్యాలు స్థాపించారు. వీరందరూ భూమార్గాన్నే దేశంలోకి చొరబడ్డారు. యూరోపు ఖండంతో జరిగిన సంఘటనల పర్యవసానంలో 15,16 శతాబ్దాలలో యూరోపియన్ జాతులు సముద్ర మార్గంగుండా దేశంలోకి వర్తకం నెపంతో జొరబడ్డారు. వీరు వర్తకం ద్వారా భారతదేశాన్ని ఒక వాణిజ్య ప్రాంతంగా మలచదలచారు. వీరు స్థిరపడలేదు. ఇక్కడి వారితో ఏకం కాలేదు. వాణిజ్య ప్రయోజనాల పరిరక్షణకు రాజకీయ ప్రాబల్యం అయాచితంగా తోడైంది. రాజకీయ ఆధిపత్యం పెంచుకొన్నారు. ఫలితంగా స్వతంత్ర భారతదేశం బ్రిటిష్ వలస ప్రాంతంగా మారిపోయింది. వందసంవత్సరాల కాలంలో (1757 - 1857) బ్రిటిష్ వారు భారత దేశంలో తమ ఉనికిని విస్తృత పరచుకోవటంతో పాటుగా రాజకీయ అధికారాన్ని చేజిక్కించుకొన్నారు. ప్రథమ

స్వాతంత్ర్య సంగ్రామం (1857) బ్రిటీష్ వారి ప్రత్యక్ష పరిపాలనకు స్వస్తి పలికింది. స్వదేశీ రాజుల ఉనికికి రాజకీయ అభయం లభించింది. అందువల్లనే 1857 తరువాత భారతదేశంలో రెండురకాల రాజకీయ వ్యవస్థలు వర్ధిల్లాయి. ఒకటి బ్రిటీష్ వారి ప్రత్యక్ష యాజమాన్యంలోని బ్రిటీష్ ఇండియా ప్రాంతాలు. రెండు బ్రిటీష్ వారి రాజకీయ వ్యాప్తి నుంచి తప్పించుకొన్న 600 కు పైగా స్వదేశీ సంస్థానాల ప్రాంతాలు. ఈ రాజకీయ పరిణామాలు భారతదేశంలోని వివిధ భిన్నత్వాలకు తోడుగా అభివృద్ధి పరమైన భిన్నత్వాన్ని కూడా జతపరిచాయి. రాజకీయ వ్యవస్థపై గల ఆధిపత్యంతో బ్రిటీష్ వారు భారతదేశ సంపదను కొల్లగొట్టగలిగారు. ఇందుకు అనుగుణంగా రాజకీయ వ్యవస్థను తమకు అనుగుణంగా తీర్చిదిద్దుకున్నారు. తమకు లాభం కలిగించే రీతిలో ఉపయోగించుకొన్నారు. భారత దేశంలో నెలకొన్న రాజకీయ వ్యవస్థ బ్రిటీష్ వారు సాధించుకొన్న ఆర్థిక ఆధిపత్యపు పర్యవసానమే.

1858 తరువాత పెల్లుబికిన జాతీయ స్వాతంత్ర్యోద్యమం వల్ల ప్రజల్లో రాజకీయ అవగాహన పెంపొందింది. బ్రిటీష్ వారి ఆర్థిక విధానాలు, దోపిడీ పట్ల, విలువల పట్ల, సంస్థల పట్ల వ్యతిరేకత పెరిగింది. పర్యవసానంలో జాతీయతా భావ వ్యాప్తి బాగా వృద్ధి చెందింది. రక్తపాతరహితంగా సుదీర్ఘ పోరాటాల ఫలితంగా బ్రిటీష్ వలస పాలన నుండి భారతదేశం విమోచనం పొందింది. భారత జాతీయ స్వాతంత్ర్యోద్యమం ప్రపంచంలోని ఇతర వలస ప్రాంతాలలో జరిగిన జాతీయోద్యమాలకు భిన్నంగా శాంతియుతమైన అహింసా పద్ధతుల ద్వారా కొనసాగింది. బ్రిటీష్ పాలన నుండి భారతదేశం రాజకీయ స్వాతంత్ర్యాన్ని పొందింది. బ్రిటీష్ వారి వలస విధాన పర్యవసానంగా భారతదేశంలో అభివృద్ధి ఒక ప్రత్యేక సరళిలో జరిగింది. దేశంలో అభివృద్ధి లక్ష్యాలను విదేశీ పాలకులే నిర్ణయించారు. పర్యవసానంలో స్వాతంత్ర్యానంతరం దేశం అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వచ్చింది. దేశంలోని ప్రజల పరస్పర చర్యల ఫలితాలే సామాజిక, ఆర్థిక, మత వ్యవస్థలు. ఈ వ్యవస్థల పరిసరాల వాతావరణంలోనే రాజకీయ వ్యవస్థ మనుగడ ఉంటుంది. మానవ వ్యవస్థల విలువలకు, రాజకీయ జీవన రంగంలోని విలువలకు చాల దగ్గర సంబంధాలున్నాయి. ఈ వ్యవస్థలలోని విలువలు పరస్పర ప్రభావాలకు గురౌతుంటాయి. భారత రాజ్య స్వభావాన్ని దేశంలోని సామాజిక, ఆర్థిక వ్యవస్థల అధ్యయనం ఆధారంగా బాగా అవగాహన చేసుకోవచ్చు. పురాతన సాంప్రదాయక, సామాజిక నిర్మితికి నేటి భారతదేశ రాజకీయ వ్యవస్థ వారసురాలైంది. అందువల్ల భారతదేశాన్ని అవగాహన పరచుకోవటానికి దేశంలో గల సామాజిక, ఆర్థిక, వ్యవస్థల విశ్లేషణ చాలా సహాయకారిగా ఉంటుంది.

BRAOU

## 4.2 భారత రాజ్య స్వరూపం

భారత రాజకీయ వ్యవస్థలో సాంప్రదాయక లక్షణాలు ఉన్నాయని, చాలా వెనుకబడిందని అందరూ అంగీకరిస్తున్నారు. సాధారణంగా వెనుకబడిన రాజకీయ వ్యవస్థ ఇతర సామాజిక ఆర్థిక వ్యవస్థలతో సమ్మిళితమై ఉంటుంది. అంటే మతం, కులం, ప్రాంతం, భాష వంటి కారకాలకు రాజకీయాధికారాన్ని నిర్దేశించటంలో నిర్ణయాత్మకమైన పాత్ర ఉంటుంది. రాజకీయ అధికారం సామాజిక, ఆర్థిక అధికారాల నుంచి వేరై, ప్రజల పూర్తి విధేయతనూ, విశ్వాసాన్ని పొందగలిగితే దాన్ని ఆధునిక రాజకీయ వ్యవస్థ అంటారు. భారతదేశం ఆధునికీకరణ చెందక పోవటానికి కారణాలు వెదకటంలో భిన్న దృక్పధాలన్నీ తప్పని చెప్ప వీలులేదు. భారతదేశాన్ని సమగ్రంగా పరిశీలించటమంటే చారిత్రక దృక్పధంతో పరిశీలించటం. చారిత్రాత్మకంగా రాజకీయ వ్యవస్థ ఎలా పరిణామం చెందిందో తెలుసుకొంటే తప్ప ఇప్పటి పరిస్థితి విశ్లేషణ పూర్తికాదు. తరచుగా ప్రాచీన చరిత్రనే పరిగణిస్తారు. కాని 300 సంవత్సరాల వలస పాలన ప్రభావాన్ని విస్మరిస్తుంటారు. ఇతర మూడవ ప్రపంచ రాజ్యాలతో పాటు భారత దేశం కూడా వలస పాలన కాలం చాలా విశేషమైన మార్పులను తీసుకొని వచ్చింది. ఆరంభంలో పాశ్చాత్య వలస వాదుల వర్తకులే భారతదేశంపై ఆధిపత్యాన్ని సంపాదించారు. వలస ఆర్థిక వ్యవస్థ వికాసం నేపధ్యంలోనే వలస రాజ్య వికాసాన్ని పరిశీలించాలి. వలస రాజ్యం స్థానిక ప్రజల మనుగడ కోసం రూపొందలేదు. సామ్రాజ్య వాద దేశపు పాలక వర్గ ప్రయోజనం కోసం ఏర్పడింది. ఒక దేశంపై ఇంకొక దేశం అధికారం చెలాయించటం కోసం రూపొందింది.

ఆర్థిక దోపిడికి అనువైన వాతావరణం కల్పించటం బ్రిటీష్ ఇండియా ప్రధమ లక్ష్యమైంది. అందువల్ల భారతదేశ ప్రజల సంక్షేమాన్ని, అభివృద్ధిని వలస పాలకులు ఎప్పుడూ పట్టించుకోలేదు. ఆరంభ దశలో భారతదేశంపై రాజకీయ ఆధిపత్యం సంపాదించుకోవడానికి బ్రిటీష్ వారు పూర్తిగా సైనిక శక్తిపై ఆధారపడ్డారు. రాజకీయ ఆధిపత్యం సంతరించుకొన్నాక దాన్ని నిలుపుకోవటానికి వారు నిర్బంధ యంత్రాంగం పైననే ఎక్కువగా ఆధారపడ్డారు. తమపై జరిగిన తిరుగుబాట్లను కర్కశంగా అణచివేశారు. తమ ప్రాబల్యం కొనసాగించేందుకు ఇండియన్ పీనల్ కోడ్ వంటి చట్టాలకు రూపకల్పన చేశారు.

స్థానిక ప్రజల సంస్కృతి తమదానికన్నా తక్కువ స్థాయికి చెందిందన్న భావం బ్రిటీష్ వారికి ఉండేది. భారతీయ భాషలకు బదులుగా ఇంగ్లీషు భాష అధ్యయనాన్ని ప్రోత్సహించి దానికి అధికార భాషా స్థానాన్ని కల్పించారు. పాశ్చాత్యుల సంస్కృతి విలువలు భారతీయ సంస్కృతి విలువలకంటే ఉన్నతమైనవన్న గుర్తింపు కలుగ చేశారు. పర్యవసానంలో భారతీయులు తమ భాషా సంస్కృతులను పక్కకు నెట్టి పాశ్చాత్య భావాలకు దాసులయ్యారు. బ్రిటీష్ వారిని అనుసరిస్తేనే బాగా అభివృద్ధి చెందగలమన్న భావానికి బలం చేకూరింది. ఈ విధంగా భారతీయులలో ఉన్న భారతీయత ప్రత్యేకతను చెరిపి వేసి, సామ్రాజ్య పాలకులు, వారిలో బానిస మనస్తత్వాన్ని కలిగించారు. ఈ విధంగా వలస పాలకులు తమకొక మద్దతు వర్గాన్ని సృష్టించుకొన్నారు. వలస పాలకులు తమ మనుగడ నిమిత్తం దేశంలో కేంద్రీకృత పాలన వ్యవస్థను నెలకొల్పారు. వలస రాజ్యం సామ్రాజ్య వాద దేశ పాలక వర్గ ప్రయోజనాల కోసం రూపు దిద్దుకొంది. స్థానిక ప్రజల మనుగడ సంక్షేమం కోసం రూపొందలేదు. ఒకదేశంపై ఇంకొక దేశం అధికారం నిర్వహించటానికి రూపొందింది. ఆర్థికంగా సామ్రాజ్య వాద దేశాల దోపిడీకి గురికావటానికే వలసలు ఏర్పడ్డాయి. కాబట్టి భారత ప్రజల సంక్షేమాన్ని అభివృద్ధిని వలస రాజ్యం ఎప్పుడూ పట్టించుకోలేదు. వలస రాజ్యానికి, ఆర్థిక వ్యవస్థకు దగ్గర సంబంధం ఉంది. ఇలాంటి వ్యవస్థ సామ్రాజ్య వాద ఆర్థిక దోపిడీకి ప్రత్యక్షంగా తోడ్పడుతుంది. వలసల సంపదను కొల్లగొట్టటానికి అనువైన పరిస్థితులనే సృష్టిస్తుంది.

BRAOU

వలస పాలకులు అప్పుడప్పుడు సంక్షేమ కార్యక్రమాలను చేపట్టినా వాటి అంతర్యం తమ ప్రభావాన్ని సంరక్షించుకొనటం. వలస రాజ్య విధానాల వెనుక ఉన్న అసలు లక్ష్యాలను విస్మరించటానికి వీలులేదు. తమ ఆధిపత్య మనుగడకు ఆరంభంలో సైనిక శక్తి మీద ఆధారపడిన బ్రిటీష్ పాలకులు తరువాత కాలంలో తమకు మద్దతు వర్గాన్ని ఏర్పరచుకొనే ఉద్దేశంతో సంఘ సంస్కరణల విధానాన్ని చేపట్టారు. ఇంగ్లీషు విద్యా విధానాన్ని ప్రవేశ పెట్టటం ద్వారా ప్రజలలో భారతీయత ప్రత్యేకతను చెరిపివేసి బానిస మనస్తత్వాన్ని పెంపొందించారు. ఒక కొత్త వర్గాన్ని రూపొందించటమే ఇంగ్లీషు విద్యా విధానపు ప్రధమ లక్ష్యమైంది. ఇలా రూపొందిన కొత్త వర్గం బ్రిటీష్ ఔన్నత్యాన్ని అంగీకరించింది. బ్రిటీష్ వారిని అనుకరించటం వల్లనే అభివృద్ధి చెందగలమన్న భావనకు స్థానం లభించింది. ఆరంభంలో వర్తకం ప్రాధాన్యత పొందటం వల్ల బ్రిటీష్ వారు అధికారాన్ని విస్తరించే ప్రయత్నం చేయలేదు. వర్తకం నిమిత్తం మారుమూల గ్రామాలకు చొచ్చుకొని పోయినప్పుడు తమకు స్థానికులకు మధ్య గల అఖాతాన్ని తొలగించి సామాజిక ఆమోదం పొందే ప్రయత్నం చేయక తప్పలేదు. తమ ప్రయోజనాల సంరక్షణ ప్రయత్నాలలో భాగంగా విభజించి పాలించే ప్రయత్నం చేపట్టారు. ఒక వర్గాన్ని ఇంకొక వర్గంపై సంధించి తమను రక్షించుకొనే నిమిత్తం మతతత్వాన్ని బ్రిటీష్ వారు పెంపొందించారు. హిందువులకు ముస్లింలకు కలతలు పెంచి వైషమ్యాలను సృష్టించారు. తెగలకు తెగలకు మధ్య వైరుధ్యం కల్పించారు. కుల వ్యవస్థలో వర్గాలను వాడుకొనే ప్రయత్నాలు చేశారు. ఈ వైరుధ్యాలను బ్రిటీష్ వారు ప్రత్యక్షంగా సృష్టించలేదు. నివురు గప్పిన నిప్పులాగా ఉన్న విరోధాలను బయటికి తీసి అగ్గికి ఆజ్యం పోసినట్లు బ్రిటీష్ పాలకులు పెంచి పోషించారు.

ఆంగ్ల విద్యా వ్యాప్తితో పాటు దేశంలోని భూభాగాలన్నింటిని కలిపే రవాణా సౌకర్యాలు ప్రధానంగా రైలు మార్గాలను నిర్మించటంతో రాకపోకలు సులువయ్యాయి. రవాణా సౌకర్యాల వృద్ధితో వివిధ ప్రాంతాల ప్రజల మధ్య పరిచయాలు పెరిగి అవగాహన సాన్నిహిత్యం ఏర్పడ్డాయి. వారందరూ సమానమైన అనుభవాల్లోని సాధక బాధకాలు తెలుసుకోగల్గారు. మొదటిసారిగా

అధిక సంఖ్యాక ప్రజలు ఒకే విధమైన పాలనానుభవాన్ని పొందటం జాతీయోద్యమ వ్యాప్తికి దోహదపడింది. రాజకీయంగా ప్రజలను చైతన్య వంతులను చేసి తద్వారా జాతీయతా భావాన్ని పెంపొందించటంలో భారత జాతీయ కాంగ్రెసు ఆసక్తి చూపింది. లక్ష్యసాధనకు రాజ్యాంగబద్ధమైన శాంతియుత విధానాలను అనుసరించటానికి ఆరంభంలో కాంగ్రెసు నాయకత్వం ఉద్యమించింది. ప్రారంభ కాలంలో భారత జాతీయ కాంగ్రెసు నాయకత్వం ప్రధానంగా మధ్య తరగతి ఆంగ్ల విద్యావంతులచేతుల్లో ఉండేది. మొదటి ప్రపంచ సంగ్రామ ఆరంభంలో జాతీయోద్యమాన్ని బలహీన పరచే ఉద్దేశ్యంతో బ్రిటిష్ వారు దేశంలో మింటో - మార్లే సంస్కరణలు ప్రవేశపెట్టారు. యుద్ధం అందించిన సహకారానికి బ్రిటిష్ ప్రభుత్వం మాంట్‌ఫర్డ్ సంస్కరణలను ప్రవేశపెట్టింది. ఈ రెండు సంస్కరణల చట్టాల ద్వారా దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలను నెలకొల్పారు. జాతీయోద్యమంలో గాంధీ ప్రవేశంతో నూతన శకం ఆరంభమైంది. అహింసా పద్ధతిలో సత్యాగ్రహం ఉద్యమం కాంగ్రెసుకు లక్ష్య సాధనాలయ్యాయి. భారతీయులలోని సమైక్యతను భంగపరచే విధంగా మతపరమైన విభేదాలకు బ్రిటిష్ వారు ఆజ్యం పోశారు. దేశంలో సమాఖ్య ప్రభుత్వం ఏర్పాటుకు చర్యలు చేపట్టినా 'విభజించి పాలించు' (Divide and Rule) ప్రాతిపదికన రాజకీయ విభేదాలు తలెత్తాయి. రెండవ ప్రపంచ యుద్ధ పరిసమాప్తిలో బ్రిటిష్ వారు భారతదేశానికి స్వేచ్ఛను కల్పించే ప్రయత్నాలు ప్రారంభించారు. మత సామరస్యం కొరవడటంతో చివరకు మత ప్రాతిపదికతో భారత దేశాన్ని విభజించి స్వాతంత్ర్యం ప్రదానం చేశారు.

**అభ్యాసం**

బ్రిటిష్ కాలం నాటి భారతదేశ స్వరూపాన్ని సమీక్షించండి.

BRAOU

## 4.3 భారత రాజకీయ వ్యవస్థ

భారత దేశానికి ఎలాంటి రాజ్యాంగాన్ని సమకూర్చాలన్న ప్రశ్నను మొట్ట మొదటగా రాజ్యాంగ నిర్మాతలు ఎదుర్కొన్నారు. దేశానికి సరిపోగల వివిధ ప్రత్యామ్నాయాలను పరిశీలించారు. భారతీయ జన జీవన అభివృద్ధికి, రక్షణకు రాజ్యాంగంలో రాచబాట వేయాల్సిన ఆవశ్యకతను కూడా గుర్తించారు. స్వాతంత్ర్య సాధనలో రాజకీయ విప్లవం అంతమై సామాజిక, ఆర్థిక విప్లవం ఆరంభించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. దేశంలో సామాజిక పునర్నిర్మాణానికి అవసరమైన సామాజిక విప్లవాన్ని చేపట్టాల్సి వచ్చింది. జాతి, మత, కుల విభేదాలు మూఢాచారాలతో మగ్గిన మధ్యయుగపు జన జీవన సరళికి స్వస్తి పలికి వ్యక్తి సామర్థ్యం, లౌకిక విద్య ఆధారంగా అధునిక సమాజ నిర్మాణానికి పునాదులు వేయటమే సామాజిక విప్లవ లక్ష్యం. అందువల్లనే సామాజిక విప్లవం ప్రధాన ఆవశ్యక విషయంగా భావించారు. సామాజిక విప్లవ ఆదర్శాలకు అద్దం పట్టే విధంగా రాజ్యాంగాన్ని రూపొందించాల్సిన బాధ్యతను కూడా వారు గుర్తించారు. సామాజిక పునర్నిర్మాణంతో పాటు భారత దేశ ఆర్థికాభివృద్ధి సాధన ఆవశ్యకతను కూడా గుర్తించటం జరిగింది. ప్రణాళికా బద్ధమైన శాస్త్రీయ వ్యవసాయిక, పారిశ్రామికాభివృద్ధికి

దోహద పడే విధంగా తీర్పి దిద్దాలని భావించారు. అసమానతలు లేని, ప్రాథమిక అవసరాలను తీర్చగల సంక్షేమ రాజ్య స్థాపన వారి ధ్యేయం.

కేంద్రీకృత వ్యవస్థలో తప్ప భారతదేశ సమైక్యత, సమగ్రతలను సాధించలేమని రాజ్యాంగ సభ సభ్యులు, జాతీయ నాయకులు భావించారు. ప్రభుత్వం బలహీనంగా ఉంటే సాయుధ తిరుగుబాటు ద్వారా బలవంతంగా ప్రభుత్వాన్ని కూలదోసే అవకాశాలుంటాయని సభ్యులు భావించారు. జవహర్ లాల్ నెహ్రూ సర్దార్ పటేల్ కేంద్రీకృత రాజ్యాంగాన్ని సమర్థించారు. దేశంలో సామాజిక విప్లవానికి, ఆర్థిక ప్రగతికి కేంద్రీకృత వ్యవస్థ అవసరమని వారు వాదించారు. 1909, 1919, 1935 సంస్కరణల చట్టాల ద్వారా నెలకొన్న ప్రజా ప్రాతినిధ్య సంస్థలలో పనిచేసిన భారత నాయకులు యూరోపియన్ పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలకు ఆకర్షితులయ్యారు. ఆ ఆకర్షణే జాతీయ నాయకులను ఉదార వాద ప్రజాస్వామ్యం వైపు బాగా ఆకర్షించింది. స్వాతంత్ర్యానికి పూర్వం పొందిన పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థల అనుభవాన్ని ఎందుకు విడిపెట్టాలన్న ప్రశ్న ఉదయించింది. ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కూడా ఉదారవాద ప్రజాస్వామ్య వ్యవస్థలనే బలపరచారు. పార్లమెంటరీ సంస్థలపై ఆయన అచంచల విశ్వాసాన్ని ప్రకటించుకొన్నారు కూడా. ఆ విశ్వాసానికి సామ్యవాదం, ఉదారవాదాల పట్ల నిబద్ధత తోడైంది. రాజ్యాంగ సభ సభ్యులలో పరస్పర విరుద్ధ భావాలు కలిగిన వారున్నప్పటికీ, రాజ్యాంగానికి అధిక సంఖ్యాకుల ఆమోదాన్ని లభింపచేయటంలో పరస్పరం సహకరించుకొన్నారు.

బ్రిటిష్ వలస పాలన వారసత్వంగా వారు భారతదేశ పరిపాలనకు ప్రసాదించిన వరాల మూటగా పార్లమెంటరీ సంస్థలు మనదేశంలో రూపం సంతరించుకొన్నాయి. మనం రూపొందించుకొన్న పార్లమెంటరీ వ్యవస్థకు బ్రిటన్‌లో ఉన్న పార్లమెంటరీ వ్యవస్థకు రూప సామీప్యం ఉన్నప్పటికీ, వ్యవహారాల నిర్వహణలో రెండింటి మధ్య భేదాలున్నాయి. ఈ రెండు దేశాలలో పార్లమెంటరీ వ్యవస్థలు రూపొందిన చారిత్రక, సామాజిక, సాంస్కృతిక నేపథ్యాలు ఒకేరకమైనవి కావు. దేశంలోని అత్యున్నత ప్రాతినిధ్య శాసన వర్గమైన పార్లమెంట్‌లో ప్రజల అధికారమంతా నిక్షిప్తమై ఉంది. అత్యున్నత శాసన వర్గంగానూ, ప్రజా సంక్షేమ ధర్మకర్తగానూ, ప్రభుత్వ అధికార కేంద్రంగానూ భారత రాజ్యాంగం పార్లమెంట్‌ను వ్యవస్థీకరించింది. అది ప్రజాభిప్రాయ వేదిక.

BRAOU

దేశంలో రెండు రాజకీయ పార్టీల వ్యవస్థ నెలకొనక పోవటం, పార్టీల వ్యవస్థ పటిష్ఠతను సంతరించుకోక పోవటం, పార్టీలలో క్రమ శిక్షణలోపం, పార్టీ ఫిరాయింపులు, నిరక్షరాస్యత, లంచగొండితనం, రాజకీయ నాయకుల నైతిక పతనం మొదలైన అంశాలన్నీ పార్లమెంట్ సార్వభౌమాధికార క్షీణతకు దోహదం చేస్తున్నాయని మనం పేర్కొనవచ్చు. ప్రధాన రాజకీయ పార్టీలలోనే కాకుండా అన్ని రాజకీయ పార్టీలలోను విచ్ఛిన్న కర శక్తుల వృద్ధి కూడా పార్లమెంట్ బలహీన పడటానికి దోహదకారి అవుతోంది. సిద్ధాంతాల కన్నా రాజకీయ అవసరాలకే అధిక ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతోంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పార్టీల పాత్రను కూడా తక్కువగా అంచనా వేయ వీలులేదు. గత నలభై సంవత్సరాలలో పార్లమెంట్ పాత్ర విషయంలో చాలా మార్పులు సంభవించాయి. పార్లమెంట్ వ్యవస్థ ఆవిర్భవించిన తొలి సంవత్సరాలలో ఉన్నట్లుగా ఈనాడు లేదు. ఇలాంటి మారుతున్న సరళి మనదేశపు ప్రత్యేకతగాదు. ప్రపంచ వ్యాప్తంగా పార్లమెంటరీ సంస్థలు క్రమక్రమంగా తమ పటుత్వాన్ని కోల్పోతున్న విషయాన్ని మనం గుర్తుంచుకోవాల్సి ఉంది. ఆధునిక కాలంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్య కలాపాల విస్తరణవల్ల చాలా దేశాలలో పార్లమెంటులు శాసనాలు నిర్మించే ప్రత్యేక నైపుణ్యతలను తగు మోతాదులో సంతరించుకోవటం లేదు. పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికైన వారి వ్యక్తిత్వాలు కూడా పార్లమెంట్ వ్యవహార సరళిని ప్రభావితం చేస్తున్నాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్య విజయానికి అత్యున్నతమైన బాధ్యతా భావం, రాజ్యాంగ నైతికత చాలా అవసరం. అధికారంలో ఉన్న పాలక పార్టీ, ప్రతిపక్ష స్థానంలో ఉన్న పార్టీలు రాజకీయ క్రీడను నియమ బద్ధంగా నిర్వహించాల్సి ఉంటుంది.

పార్లమెంట్ ప్రత్యక్షంగా పరిపాలన చేయదు. దేశానికి అవసరమైన విధానాలను రూపొందించటం, శాసనాలను ప్రతిపాదించి వాటికి పార్లమెంట్ ఆమోదం పొందటం దేశ ప్రధానమంత్రి ప్రధాన బాధ్యత. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో కార్య నిర్వాహక వర్గం పార్లమెంట్ కు బాధ్యత వహిస్తుంది. మంత్రులు వ్యక్తిగతంగానూ సమిష్టిగానూ పార్లమెంటుకు బాధ్యత వహిస్తారు. మంత్రి వర్గ నాయకుడుగా ప్రధాన మంత్రి తోటి మంత్రుల కార్యకలాపాలను సమన్వయ పరుస్తుంటారు. రాజ్యాధిపతికి మంత్రి మండలికి, పార్లమెంటుకు మధ్య ప్రధాని వారధిగా వ్యవహరిస్తుంటారు. కాబినెట్ నిర్వహణ ప్రధాని వ్యక్తిత్వంపై ఆధారపడి ఉంటుంది. ప్రధానికి రాష్ట్రపతికి మధ్య అప్పుడప్పుడూ భేదాభిప్రాయాలు ఉత్పన్నమైనప్పటికీ అవేమీ రాజ్యాంగ సంక్షోభానికి దారి తీయ లేదు.

**అభ్యాసం**

భారత దేశంలోని పార్లమెంటరీ వ్యవస్థను గురించి రాయండి.

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

## 4.4 సామాజిక వ్యవస్థ

BRAOU

మనదేశంలో రాజకీయ, ఆర్థిక, సామాజిక కార్యకలాపాలు వ్యవస్థల మధ్య తేడాలను గుర్తించటం కష్టం. సామాజిక ఆర్థిక స్థాయి రాజకీయ అధికారాన్ని నిర్ణయిస్తుంది. అదే విధంగా మతం కులం వంటి సాంప్రదాయిక వ్యవస్థలు రాజకీయాల్లో నిర్వహించే కీలకమైన పాత్రను విశ్లేషణకి, సామాజిక ఆర్థిక ప్రక్రియలను పరిగణన లోనికి తీసుకోవటం చాలా అవసరం.

సామాజిక అసమానతలు ఉండి, వర్గ స్వభావ అస్తిత్వం బలంగా ఉన్నప్పుడు వ్యవస్థలో అధికారం అసమానతలను బలపరచడానికే దోహద పడుతుంది. మనం ఆధునిక రాజకీయ వ్యవస్థలనే నిర్దేశించుకొన్నప్పటికీ,అవి సాంప్రదాయక వ్యవస్థలను సంరక్షించే సాధనాలు అయ్యే అవకాశం ఉంది. మన దేశ సామాజిక వ్యవస్థలో కులం చాలా ప్రధాన పాత్ర వహిస్తోంది. మనదేశంలో ఉన్న కుల వ్యవస్థ మరే ఇతర సమాజాలలోనూ లేదు. బ్రిటిష్ వారు రాక పూర్వం కులం గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో అంతర్భాగంగా కొనసాగుతుండేది. బ్రిటిష్ వారుదేశంలో పారిశ్రామిక వ్యవస్థను ప్రవేశపెట్టారు. దానివల్ల గ్రామీణ వృత్తులు దెబ్బతిన్నాయి. కొత్త వృత్తులు ఆవిర్భవించాయి. రవాణా సమాచార సౌకర్యాలు వృద్ధి చెందాయి. అప్పటి దాకా లేని కొత్త చట్ట బద్ధసంస్థలు రూపం సంతరించుకొన్నాయి. పర్యవసానంలో గ్రామాలకు ఉన్న స్వయం సమృద్ధి,స్వయం ప్రతిపత్తి దెబ్బతిన్నాయి. బ్రిటిష్ విధానాల వల్ల ఉపాధి కోల్పోయిన చేతి వృత్తుల వారు,వ్యవసాయ కూలీలు పట్టణాలకు తరలి పోవటం ప్రారంభించారు. పట్టణాలలో సాంప్రదాయక పద్ధతులలో కులవ్యవస్థ కొనసాగించటం సాధ్యపడలేదు. అంటే నిర్దుష్టమైన వృత్తులను కొనసాగించే యూనిట్లుగా కులాలు కొనసాగలేదు. సాంప్రదాయక ఆర్థిక వ్యవస్థ క్షీణించసాగింది. ఆంగ్ల విద్యా విధానం ప్రారంభంలోను, కొత్త ఆర్థిక కార్యకలాపాలు అవతరించటంతోనూ కొత్త మార్పులు స్థానం పొందాయి.

Dr. BRAOU LIBRARY Acc. No. Class No. 115094 659.2 PRA

అయితే ఇన్ని మార్పులు సంభవించినా కులవ్యవస్థ కొనసాగుతూ వస్తూనే ఉంది. బ్రిటిష్ వారు దేశంలో చేపట్టిన సామాజిక సంస్కరణలు కాని, జాతీయోద్యమం కాని కులవ్యవస్థ నిర్మూలనకు కృషిచేయలేదు. ఫూలే, అంబేద్కర్ వంటి కొందరిని మినహాయిస్తే ప్రధానంగా సంఘ సంస్కరణోద్యమాలన్నీ అగ్ర వర్ణాలకు చెందినవారు కొనసాగించినవే.

సంఘ సంస్కర్తలు , విద్యాధికులు ఎక్కువ భాగం అగ్రవర్ణాల వారు కావటం వల్ల,వారిపైనే ఆధారపడి కులాలకు చెందిన సమస్యల నివృత్తికి కృషిచేశారు. వీరు ప్రధానంగా కుటుంబ వ్యవస్థను సంస్కరించే ప్రయత్నంచేశారు. కుల వ్యవస్థ నిచ్చెనలో దిగువనున్న వారిపైన సానుభూతి ప్రకటించినా కుల వ్యవస్థ నుంచి విముక్తం చేసే ప్రయత్నాలు చేయలేదు. జాతీయోద్యమం కూడా అగ్రవర్ణాల విద్యాధికుల మీదనే ఆధారపడింది. ఇతర కులాల వారిని ద్వేషించక పోయినా,వారిని విస్మరించింది. విద్యా, పాలన రంగాలలో అగ్రవర్ణాల వారి ఆధిపత్యంఉండేది. బ్రిటిష్ పాలకులు భారతీయులను గ్రూపుల సమూహాల సభ్యులుగానే గుర్తించారు. కులపరమైన వర్గ అస్తిత్వాన్ని, కుల చైతన్యాన్ని బలపరచి తమ అధికారాన్ని నిలబెట్టుకోవాలని చూశారు. ఈ నేపథ్యంలోనే స్వాతంత్ర్యానంతరం వచ్చిన రాజకీయాలలో కులం ప్రజా సమీకరణకు ఒక సాధనంగా పనికొచ్చింది. కుల వ్యవస్థను రాజకీయాలలో ఉపయోగించటం వల్ల రెండు పరిణామాలు తలెత్తే అవకాశం ఉంది. ఇది ప్రజాస్వామిక వ్యవస్థను పటిష్ఠం చేయటానికి ఉపయోగపడుతుంది. అయితే కుల మతాలతో సంబంధం లేని లౌకిక వర్గ రాజకీయాల అవతరణకు ఒక ఆటంకంగా పరిణమించగలదు. ఈ రెండు అంశాల గురించి విపులీకరించే ముందు కుల వ్యవస్థలోవచ్చిన కొన్ని మార్పుల గురించి ప్రస్తావించక తప్పదు.

స్వాతంత్రోద్యమ కాలంలో చెలరేగిన రైతాంగ ఉద్యమాల ఫలితంగా జమీందారీ జాగీర్దారీ వ్యవస్థ రద్దు అయింది. ఉద్యమాలు బలంగా ఉన్నచోట్ల చిన్న రైతులు లాభం పొందారు. అలా కాని ప్రాంతాలలో పూర్వపు జమీందార్లు, జాగీర్దార్లు, ధనిక రైతాంగ వర్గం ఆవిర్భవించారు. స్వాతంత్ర్యం వచ్చాక ధనిక రైతాంగమే గ్రామీణ జీవితంపై పట్టును సంపాదించింది. వీరిపైనే తక్కిన వారు ఆధారపడాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. రుణాల మంజూరికి ఉపాధి కల్పనకు బీద రైతులు, కూలీలు సంపన్న రైతాంగ వర్గం మీద ఆధారపడాల్సి వచ్చింది. గ్రామస్థులకు, పాలనా యంత్రాంగానికి; గ్రామానికి, బయటి ప్రపంచానికి మధ్య సంబంధం కూడా వారి ద్వారానే సమకూరేది. ప్రభుత్వ పాలన యంత్రాంగంలో పనిచేసేవారు ఈ సంపన్న రైతాంగ వర్గాలకు చెందినవారే కాబట్టి వీరు కులపరమైన సంబంధాల ద్వారా తమ ఆధిపత్యాన్ని నిలుపుకొనే ప్రయత్నాలు చేశారు. రాజకీయ యంత్రాంగంపై ఉన్న ఆధిపత్యాన్ని గ్రామీణ ప్రాంతాలపై కల అధికారాన్ని కాపాడుకోవటానికి వాడుకొన్నారు. ఈ క్రమంలో కులపరమైన అస్తిత్వం, చైతన్యం బలపడటమే కాకుండా కులపరమైన సామాజిక అసమానతలు కూడా కొనసాగాయి. 1970 దశకంలో ప్రభుత్వం వివిధ కారణాల వల్ల అనుసరించిన అనేక విధానాల వల్ల వెనుకబడిన కులాల నుండి ఆర్థికంగా బలపడిన వర్గ మొకటి రూపొందింది. ఇందుకు తోడుగా భూసంస్కరణలు, సన్నకారురైతుల అభివృద్ధి పథకాలవల్ల గ్రామీణ ఆర్థిక రంగంలో పెద్ద మార్పులు సంభవించాయి. భూసంస్కరణల చట్టాల వల్ల భూమి పంపకాలు జరగక పోయినా, చట్టం తెచ్చిన ఒత్తిడి వల్ల భూస్వాములు కొందరు మిగులు భూములను అమ్ముకోవటం మొదలుపెట్టారు. ఈ భూములను కొన్నవారు ఎక్కువ భాగం మధ్యతరగతి రైతులు, వెనుకబడిన కులాలవారు. వీరు సమర్థవంతంగా ఆధునిక పద్ధతులనుపయోగించి వ్యవసాయం చేసి ఆర్థిక శక్తిని పెంపొందించుకోగల్గారు. పర్యవసానంలో అంత వరకు ఉన్నత కులాలవారు చెలాయిస్తూ వచ్చిన అధికారం కోసం వెనుకబడిన కులాల వారు పోటీ పడటం ప్రారంభించారు. అందువల్ల సాంప్రదాయక అగ్ర కులాల వారికీ వెనుకబడిన కులాల వారికీ మధ్య వైరుధ్యం తలెత్తడం ప్రారంభమైంది. ఉత్తర భారతదేశంలో ఈ వైరుధ్యం తీవ్రంగా ఉంది. దక్షిణ భారతదేశంలో అంత తీవ్రంగా లేదు. భారతదేశ రాజకీయాలలో ఈ వైరుధ్యం అపరిష్కృతంగా మిగిలి ఉంది. ఈ క్రమంలో తరతరాలుగా అణిగివున్న ప్రజలు రాజకీయాలలో పాల్గొనటానికి కులం ఒక సాధనంగా పనికి వచ్చింది. కులం ప్రజాస్వామిక ప్రక్రియలను బలపరచటానికి తోడ్పడింది. పర్యవసానంలో ఉద్యోగాలలో స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు కల్పించటం ప్రారంభమైంది.

BRAOU

మన దేశపు సమాజంలో కులంతో పాటు ప్రధాన పాత్ర నిర్వహించిన మరో సంస్థ మతం. బ్రిటీష్ పాలకుల కంటే ముందునుంచి కూడా మతం భారతీయ సమాజంలో చాలా కీలకమైన పాత్రను నిర్వహించింది. బ్రిటీష్ పాలనలో గాని ఆ తరువాత గాని మతం ప్రాముఖ్యత అంతరించి పోలేదు. మతం వ్యక్తి జీవితంలోని ప్రయివేట్ అంశంగా మారలేదు. విభిన్న రూపాలలో మతం రాజకీయాలను ప్రభావితం చేస్తోంది. లౌకిక వాదం భారత రాజ్యాంగపు మూల స్తంభాలలో ఒకటి. యూరోపులో లౌకికవాద మంటే రాజకీయాలకూ మతానికీ ఏమీ సంబంధం లేదన్నది అర్థం. సాంస్కృతిక పునరుజ్జీవనం, మత సంస్కరణోద్యమం పారిశ్రామిక విప్లవం వల్ల మతానికి రాజకీయాలకు ఉన్నసంబంధం తెగిపోయింది. ఇందుకు భిన్నంగా మన దేశంలో మతం ప్రాముఖ్యత తగ్గలేదు. 1970 దశకం నుంచి రాజకీయాలలో మత ప్రమేయం బాగా వృద్ధి చెందుతూ వస్తోంది. కేంద్రంలోనూ వివిధ రాష్ట్రాలలోనూ అంతరంగిక వైరుధ్యాలు, అవినీతి ఆరోపణలు, నిరంకుశ పాలన పద్ధతుల వల్ల ప్రభుత్వాలకు ప్రజల మద్దతు అంతంత మాత్రంగానే ఉంటోంది. తత్ఫలితంగా ప్రభుత్వాలు మత తత్వాన్ని ఎదుర్కొని లౌకిక రాజకీయ ఆచరణను పెంపొందించే శక్తిని కోల్పోతున్నాయి. పెరుగుతున్న ఆర్థిక సంక్షోభం వల్ల అభివృద్ధి పథకాలను రూపొందించి బీదరికాన్ని, నిరుద్యోగ సమస్యను నిర్మూలించి ప్రజల మద్దతును పొందగలిగే శక్తిని వ్యవస్థ కోల్పోతోంది. అందువల్ల లౌకిక వాదం పట్ల ఉన్న నిబద్ధతను వదలుకొని చాలా రాజకీయ పార్టీలు మత పరంగా ప్రజలమద్దతును పొందాలని చూస్తున్నాయి. ఏవో కొన్ని రాజకీయ పార్టీల కుట్రల వల్ల మతతత్వం వృద్ధి చెందటం లేదు. మతం రాజకీయాలలో ప్రవేశించటానికి నిర్దిష్టమైన సామాజిక-ఆర్థిక పరిస్థితులు దోహదం చేస్తున్నాయి. భారత సామాజిక జీవనంలో మతం ప్రాధాన్యత నానాటికి వృద్ధి చెందుతోంది. ఈ నేపథ్యంలో ఆయా పరిస్థితులను బట్టి శ్రేష్టవర్గాలు (Elites) మతం ఆధారంగా రాజకీయ కార్యాచరణను రూపొందించు కొంటూ వస్తున్నాయి. మతపరమైన రాజకీయ కార్యాచరణ రూపొంది, బలం పుంజుకొన్నప్పుడు లౌకిక పరమైన రాజకీయాలను బలపర్చి, వివేచన ఆధారంగా సామాజిక వ్యవస్థలను మార్చవలసిన రాజకీయ వ్యవస్థ ఆ పనిని నిర్వహిస్తోందా లేదా ఒత్తిడులకులోనై రూపాంతరం చెందుతోందా అన్నదే ప్రధాన సమస్య. మన దేశంలో రెండవదే జరుగుతోంది. పర్యవసానంలో లౌకిక వాదాన్ని నీరుకార్చి, సామాజిక వ్యవస్థను పునః వ్యవస్థీకరించాల్సిన బాధ్యతలను రాజకీయ వ్యవస్థ వదిలేస్తున్నది. మరొక పక్క లౌకిక వాదాన్ని కాపాడే పేరుతో ప్రభుత్వాలు నిరంకుశాధికారాలను పెంచుకొంటున్నాయి. ఈ రోజు భారత రాజకీయ వ్యవస్థ మద్ధతును కాపాడుకోవటమెట్లా, సామాజిక మార్పును తేవటమెట్లా అనే సమస్యను పరిష్కరించుకోలేక పోతోంది.

**అభ్యాసం**

రిజర్వేషన్ పద్ధతికి దోహదం చేసిన పరిస్థితులను పేర్కొనండి.

BRAOU

## 4.5. ఆర్థిక పరిస్థితులు

దుర్భర దారిద్ర్యం 1947 నాటి భారతదేశ ప్రత్యేక లక్షణం. జాతీయ నికర ఆదాయం ఆనాటి చాలా దేశాలలో కంటే ఎక్కువగా ఉంది. ఆదాయం సంపదల పంపిణీ బాగా అభివృద్ధి చెందిన దేశాలలోకంటె ఎక్కువ అసమానంగా ఉంది.ఈ అసమానతలు భారత సామాజిక వ్యవస్థ ప్రత్యేక లక్షణం. భారతదేశ ఆర్థిక వ్యవస్థకు ప్రాతిపదిక వ్యవసాయం. దేశంలోని శ్రామిక శక్తిలో దాదాపు 72 శాతం మందికి వ్యవసాయమే వృత్తి. కాని, వ్యవసాయ రంగ ఉత్పత్తులు జాతీయాదాయంలో కేవలం సగం మాత్రమే ఉన్నాయి. వ్యవసాయ రంగానికే ఎక్కువ మంది శ్రామికులు అంకితమై ఉండటానికి అధునాతన పెట్టుబడిదారీ వ్యవస్థ కారణం కాదు. అధిక జనాభా ఇందుకు ప్రధాన కారణం. భారతదేశంలోని వ్యవసాయ రంగంలో ఉన్న చాలా మందికి స్వంత భూములులేవు. అందువల్ల వారు తమ ఉపాధికి వ్యవసాయ రంగం మీదనే ఆధారపడవలసి వస్తోంది. అభివృద్ధి చెందిన దేశాల మీద ఆధారపడి ఉండటం భారతదేశ ఆర్థిక వ్యవస్థ మరో లక్షణం. దేశంలోని చాలా ప్రాథమిక ఉత్పత్తులు అభివృద్ధి చెందిన దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. అభివృద్ధి చెందిన దేశాల ఉత్పత్తులను మనం దిగుమతి చేసుకొంటున్నాం. ఈ విషయంలో వ్యాపార సమతౌల్యపు లోటు (Balance of Trade) ప్రధానంగా బహిర్గతమవుతూంది. ఇంతేకాక దేశంలోని వనరుల పై కొంత వరకు విదేశీ యాజమాన్యం కొనసాగుతుండటం గమనించదగిన విషయం. దేశంలో గుర్తించదగిన ఆర్థిక ద్వైదీభావ స్వభావం ఉంది. ఆధునిక విదేశీ సాంకేతిక పరిజ్ఞానంపై ఆధారపడిన పెట్టుబడిదారీ రంగం, కేవలం కొన్ని నగర ప్రాంతాలకు ప్రధానమైన ముడిసరుకులు లభించే ప్రాంతాలకు కేంద్రీకృతమై ఉంది. మిగతా దేశం ప్రధానంగా సాంప్రదాయక, స్వదేశీయ పెట్టుబడిదారీ యుగపు పూర్వ స్థితిలోనే ఉంది.

భారతదేశంలోని మొత్తం నికరంగా పంటవేసే భూమిలో 31 శాతం ప్రాంతంలోనే సరైన వర్షపాతముంది. కేవలం 20 శాతం నికర సాగుభూమికి ప్రణాళికా మాత్రమే సాగునీటి సౌకర్యం ఉంది. చాలా ప్రాంతాల్లో వ్యవసాయం వర్షాధారంగానే సాగుబాటవుతోంది. వ్యవసాయం ఆదాయం కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతోంది. భూమిఉన్న వారిలో 10 శాతం మందికి 50 శాతం భూమిపై ఆధిపత్యం ఉంది. వ్యవసాయోత్పత్తులను పెంచడానికి ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయాల ఫలితంగా సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమైంది. పారిశ్రామిక వస్తువులతో సరిపోల్చి చూస్తే వ్యవసాయ ఉత్పత్తుల ధరలు స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి ఏడో దశకం మొదటి అర్ధ భాగం వరకు బాగా పెరిగాయి. కాని 1975 తరువాత నుంచి పారిశ్రామిక వస్తువుల ధరలు వ్యవసాయోత్పత్తుల కంటే ఎక్కువగా పెరగటం ప్రారంభమైంది. అంతేగాక అప్పటినుండి వ్యవసాయరంగానికి శ్రామిక శక్తిని ఇముడ్చుకోగలిగే శక్తి గణనీయంగా తగ్గింది. అందువల్లనే వ్యవసాయ రంగం నుంచి వ్యవసాయేతర అసంఘటిత రంగాలలోని తరలింపు పెరుగుతున్నది. అందుకే పట్టణాలకు వలస పెరిగి రోజువారీ కూలి పని చేసుకొనే అసంఘటిత రంగ కార్మికుల సంఖ్య పెరుగుతోంది. వీరి జీతాలలోను పెరుగుదల లేదు. ఫలితంగా పట్టణాల్లో తీవ్రంగా వ్యత్యాసాలు పెరుగుతున్నాయి.

ప్రజాస్వామ్యానికి ఆర్థికాభివృద్ధికి అవినాభావ సంబంధం ఉందని చెప్పవచ్చు. ఒక దేశం ఎంతగా అభివృద్ధి చెందితే, అంతగా దేశంలో ప్రజాస్వామ్యం జీవించే అవకాశాలు మెరుగవుతాయన్నది నిర్వివాదాంశం. ఆర్థిక ప్రజాస్వామ్యం లేని రాజకీయ ప్రజాస్వామ్యం నిరర్థకమైనదే. భారతదేశం రాజకీయ ప్రజాస్వామ్యాన్నే ఏర్పరచింది. కాని ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పలేదన్న భావన ప్రబలంగా ఉంది. అభివృద్ధి చెందుతున్న అనేక ఇతర దేశాల్లోలాగా భారతదేశం కూడా ప్రణాళికలకా విధానాన్ని అభివృద్ధి వ్యూహంగా ఎన్నుకొంది. విస్తృత ప్రణాళికా విధానానికి ఉపక్రమించటం ద్వారా దేశంలో అత్యధిక సంఖ్యాక పేద ప్రజల జీవితాలలో నూతన కాంతులను ప్రసరింప చేయటాన్ని ధ్యేయంగా ఎంచుకొంది. ఆర్థికాభివృద్ధి సాధనకు ఆర్థిక రంగంలో స్వయం సమృద్ధి, సత్వర ఆర్థికాభివృద్ధి, పేదరికం నిర్మూలన, సామాజిక న్యాయం, సుస్థిర ప్రభుత్వ స్థాపన పాలకుల దృష్టిని ఆకర్షించాయి. అమెరికా రష్యాల విధానాలలోని మంచిని మేళవించిన వినూత్న విధానమే

BRAOU

ఆసియా ఆఫ్రికా దేశాల అభివృద్ధికి సరియైన వ్యూహమన్నదే పండిట్ నెహ్రూ ఆలోచనా విధానంలోని మౌలికాంశం. సమాజంలో నెలకొని ఉన్న తీవ్ర ఆర్థిక సామాజిక అంతరాలను తుదముట్టించాలనే ఉద్దేశ్యంతో రాజ్య ఆధ్వర్యంలో రూపొందించే ప్రణాళికా విధానమే సరియైనదని నెహ్రూ భావించారు. 1955 సంవత్సరంలో ఆవడిలో జరిగిన భారత జాతీయ కాంగ్రెసు "సామ్యవాద రీతి సమాజ స్థాపన" తన లక్ష్యంగా తీర్మానించింది. దీనిని దృష్టిలో ఉంచుకొని 1948వ సంవత్సరపు పారిశ్రామిక విధానంలో అనేక మార్పులు చేర్పులు చేసి 1956లో నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొందించారు. మిశ్రమ ఆర్థిక వ్యవస్థ, సామ్యవాదరీతి సమాజ స్థాపనా లక్ష్యాలకు ఈ నూతన పారిశ్రామిక విధానం ద్వారా ఆచరణాత్మక రూపం కల్పించటానికి ప్రయత్నం జరిగింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ నూతన విధానం, దేశ ఆర్థిక ప్రగతిలో ప్రభుత్వ రంగానికి గొప్ప ప్రాముఖ్యతను సంతరించి పెట్టింది. సామ్యవాదరీతి సమాజ స్థాపన ప్రధాన లక్ష్యం ఆర్థికాభివృద్ధి ఫలితాలను సమాజంలోని అట్టడుగు వర్గాల వారికి అందుబాటులో తేవటమే. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని మన ప్రణాళికలు పేదరిక నిర్మూలన కార్యక్రమానికి ఇతోధికమైన ప్రాముఖ్యత నిచ్చాయి.

ఇటీవలి కాలంలో తూర్పు యూరోపియన్ రాజ్యాలతో పాటుగా సోవియట్ రష్యాలో చోటు చేసుకున్న మార్పు చేర్పులు భారతదేశ ఆర్థిక విధానంలో కూడా మార్పులకు మూలకాలయ్యాయి. ఇప్పటి వరకు అమలు జరిగిన ప్రణాళికల ప్రాధాన్యతలను పరిశీలిస్తే ఒకసారి వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇస్తే మరొకసారి ప్రభుత్వ రంగ సంస్థలకు ప్రాధాన్యమిచ్చాయి. సాంఘిక సమానత్వమే పంచవర్ష ప్రణాళికల, ప్రజాస్వామ్య వ్యవస్థల ధ్యేయం. అభివృద్ధితో పాటు సాంఘిక న్యాయం ముఖ్యమనే విషయాన్ని ప్రతి పంచవర్ష ప్రణాళికలోనూ కేంద్ర బిందువుగా నిర్ణయించారు. తొమ్మిదో దశకం నుండి భారతదేశం ఆర్థిక రంగంలో సరళీకృత విధానాన్ని ప్రవేశపెట్టింది.

మతపరమైన నిర్హేతుక నమ్మకాలు, మూఢ విశ్వాసాలు, శ్రమశక్తి విలువను తక్కువ అంచనా వేసే ఆలోచనలు, దృక్పథాలు, విలాసవంతమైన జీవనసరళి మొదలైనవి భారతదేశ ఆర్థికాభివృద్ధికి అవరోధంగా ఉన్నాయని ప్రపంచ ప్రఖ్యాత ఆర్థిక శాస్త్రవేత్త గున్నార్ మిర్దల్ అన్నారు. వీటికంటే ముఖ్యంగా భారతదేశం సత్వర ఆర్థికాభివృద్ధిని సాధించక పోవటానికి సాధు స్వభావం గల రాజ్యమే కారణమని మిర్దల్ వ్యాఖ్యానించారు.

BRAOU

**అభ్యాసం**

భారతదేశంలో ప్రజాస్వామ్యానికి ఆర్థిక స్వభావం కన్న రాజకీయ స్వభావమే ఎక్కువ - వివరించండి.

## 4.6 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

★ బ్రిటిష్ వారు తమకు అనువుగా రాజకీయ వ్యవస్థను భారతదేశంలో తీర్చిదిద్దారు.

★ స్వాతంత్ర్యోద్యమంలో ప్రజల్లో రాజకీయ అవగాహన పెంపొందింది.

★ భారతదేశ రాజకీయ వ్యవస్థలో సంప్రదాయక లక్షణాలున్నాయన్నది అందరూ అంగీకరించే సత్యం.

★ స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగాన్ని రూపొందించేప్పుడు సామాజిక విప్లవ ఆదర్శాలను దృష్టిలో ఉంచుకున్నారు.

★ మనం రూపొందించుకున్న పార్లమెంటరీ వ్యవస్థకూ బ్రిటన్‌లో గల పార్లమెంటరీ వ్యవస్థకూ సామీప్యం ఉన్నా విధుల నిర్వహణల్లో భేదాలు ఉన్నాయి.

★ మన దేశంలో రాజకీయ వ్యవస్థకూ విశ్లేషణకు సామాజిక ఆర్థిక ప్రక్రియలను పరిగణనలోకి తీసుకోవాలి.

★ మన సమాజంలో కులం, మతం ప్రత్యేకమైన పాత్రల్ని నిర్వహిస్తున్నాయి. రాజకీయాలలో వాటి ప్రమేయం ఎక్కువైంది. ఈ వైరుధ్యాలను తొలగించాల్సిన వ్యవస్థ వాటి ప్రభావానికే లోనవుతుండడం గమనార్హం.

★ భారతదేశంలో తొమ్మిదోదశకంనుండి ఆర్థిక రంగంలో సరళీకృత విధానం అమలు పరుస్తున్నారు.

## 4.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

*30 వాక్యాలలో జవాబులు రాయండి.*

1. భారతదేశ రాజకీయ వ్యవస్థ స్వరూపాన్ని విశదీకరించండి.
2. భారతదేశంలోని ఆర్థిక వ్యవస్థను సమీక్షించండి.

*15 వాక్యాలలో జవాబులు రాయండి.*

1. భారతదేశ సమాజంలో కులం మతం ఎలాంటి నిర్ణయాత్మక పాత్రను నిర్వహిస్తున్నాయి?
2. రాజకీయ వ్యవస్థలో భాగమైన పార్లమెంటరీ విధానాన్ని గురించి రాయండి.

BRAOU

# ఖండం - II ఆంధ్రప్రదేశ్: చరిత్ర, సంస్కృతి

ఆంధ్రప్రదేశ్‌లో భావజాలం ప్రజాస్వామికీకరణం కావటం ప్రారంభమై ఎన్నేళ్లో కాలేదు. ఈ కొత్త చైతన్యం ఎన్ని రకాలుగా పురివిప్పుకొందో ఈ ఖండం వివరిస్తుంది. పునాది అంశాలైన రాజకీయ, ఆర్థిక సామాజిక వ్యవస్థల్లో మార్పులు ఉద్యమాలుగా ఎలా ఆవిష్కృతమయ్యాయో ఉపరితలాంశాలైన సాహిత్యాది కళారంగాల్లో అవి ఎలా ప్రతిఫలించాయో తెలుసుకోవటానికి ఈ ఖండం ఉపకరిస్తుంది. అందుకు అనుగుణంగా ఈ ఖండంలో 5 భాగాలున్నాయి. అవి :

5. నేపథ్యం (1956 వరకు) ఆంధ్రోద్యమ చరిత్ర.
6. భౌగోళిక పరిస్థితులు, సహజవనరులు.
7. సామాజిక ఆర్థిక వ్యవస్థలు.
8. లలిత కళలు.
9. భాష, సాహిత్యం.

BRAOU

BRAOU

# భాగం - 5 నేపథ్యం - ఆంధ్రోద్యమ చరిత్ర (1956 వరకు)

విషయ క్రమం


5.0 ఉద్దేశం

5.1 ప్రవేశిక

5.2 ఆంధ్రుల చారిత్రక మహాప్రస్థాన దశల వివరణ

5.3 చైతన్య దశ

- 5.3.1 నూతన ఆర్థిక ప్రణాళికలు
- 5.3.2 నూతన ఆంగ్ల విద్యా విధానం, క్రైస్తవ మిషనరీల ప్రభావం
- 5.3.3 నూతన విద్యా వ్యాప్తిలో భారతీయుల కృషి
- 5.3.4 గ్రంథాలయోద్యమం నిర్వహించిన పాత్ర
- 5.3.5 పత్రికా రంగం
- 5.3.6 వీరేశలింగం సంఘసంస్కరణ కార్యక్రమాల్లో ప్రవేశించడం

  అభ్యాసాలు

5.4 భావనా దశ

- 5.4.1 తెలంగాణాలో భాషా దుస్థితి
- 5.4.2 ఆంధ్ర రాష్ట్రంపై వందేమాతరోద్యమం ప్రభావం
- 5.4.3 అఖిలాంధ్ర మహాసభలు

  అభ్యాసం

5.5 ఉద్యమ దశ

- 5.5.1 ఆంధ్రోదమం - విస్తృతి
- 5.5.2 జాతీయోద్యమ దశలో ఆంధ్రుల ఉప జాతీయోద్యమం

  అభ్యాసం

5.6 పోరాట దశ

- 5.6.1 నిరసన స్వరాలు
- 5.4.2 ప్రకాశంగారి అసమ్మతి పత్రం
- 5.6.3 పొట్టి శ్రీరాములు నిరాహార దీక్ష
- 5.6.4 నైజాం ప్రాంతంలోని ఆంధ్రమహాసభ కార్యకలాపాల్లో నిషేధాజ్ఞాలు
- 5.6.5 ఆంధ్రప్రదేశ్ అవతరణ
- 5.6.6 పెద్ద మనుషుల ఒప్పందం

  అభ్యాసం


BRAOU

5.7 ప్రత్యేక తెలంగాణ ఉద్యమం

5.8 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

5.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

## 5.0. ఉద్దేశం

ఆంధ్రజాతి వికాసం విస్తరించిన తీరులో వివిధ దశలను గురించి ఈ భాగం చదివిం తర్వాత మీరు తెలుసుకోగలుగుతారు. ఇంకా కింది అంశాలను మీరు గ్రహించ గలుగుతారు :

- 19వ శతాబ్దం నాటి ఆర్థిక పరిస్థితులు
- విద్యా విధాన నిర్వహణలో క్రైస్తవ మిషనరీల కృషి
- మధ్య తరగతి మేధావుల ఆవిర్భావం, సాంఘిక సాహిత్య రంగాల్లో సాధించిన విషయాలు
- సంఘ సంస్కరణోద్యమ ప్రాధాన్యత
- ఆంధ్రదేశంపై వందేమాతరం ఉద్యమం ప్రభావం పరిశీలన
- ప్రత్యేకాంధ్ర రాష్ట్ర ఆవిర్భావానికి దోహదం చేసిన పరిస్థితులు
- తెలంగాణా ప్రాంతంలో ఆంధ్రోద్యమం.

## 5.1 ప్రవేశిక

ఆంధ్రులచారిత్రక మహా ప్రస్థానంలో గమనార్హమైన ఘట్టాలు ఎన్నో ఉన్నాయి. వీటి మూలంగా ఆంధ్రజాతి వికాసం గూర్చి తెలుసుకోవచ్చు. ఈ విషయంగా నాలుగు ముఖ్యమైన చారిత్రక దశలను పరిశీలించాలి. అవి : 1) చైతన్యదశ. 2) భావన దశ 3) ఉద్యమ దశ 4) పోరాట దశ

చైతన్యదశను ఒక సంధి దశగా పేర్కొనవచ్చు. బ్రిటీషు వారు ప్రవేశపెట్టిన సంస్కరణలు రెండు రకాలుగా పనిచేశాయి. 1) విధ్వంసాత్మక పాత్ర. 2) పునర్వికాస పాత్ర. 19వ శతాబ్దంలో బ్రిటీష్ వారు ప్రవేశపెట్టిన నూతన ఆర్థిక ప్రణాళికలు ప్రజల్లో అసంతృప్తిని కలిగించాయి. మద్రాసు ప్రెసిడెన్సీలో రైత్వారీ పద్ధతి మొదట ప్రజాశ్రేయకంగా కనబడ్డా, చివరకు ఆర్థిక పీడనగా మిగిలిపోయింది.

మన దేశంలో ప్రవేశపెట్టిన నూతన ఆంగ్ల విద్యావిధానం సాంప్రదాయక విద్యా వ్యవస్థను కూకటి వేళ్ళతో పెకలించి వేసింది. విద్యావిధాన నిర్వహణలో క్రైస్తవ మిషనరీల ప్రభావం తీవ్ర పరిణామాలకు దారి తీసింది. 1854 ఉడ్స్ పథకం ప్రకటించే వరకు మద్రాసు ప్రభుత్వం విద్యా విషయకంగా అనిశ్చిత ధోరణిని ప్రదర్శించింది. దీనికి వ్యతిరేకంగా ఎంతో కల్లోలం ప్రజల్లో రేగింది. మిషనరీల విద్యా సంస్థలకు తోడు భారతీయుల కృషి మూలంగా కూడా ఆంధ్ర దేశంలో విద్యాభివృద్ధి కొనసాగింది. నూతన విద్యా వ్యాప్తి మూలంగా ఆంధ్ర సమాజంలో నూతన విద్యాధిక మధ్య తరగతి వర్గం ఒకటి ఆవిర్భవించింది. వీరు నూతన భావాలను సమాజంలో వ్యాపింప చేసే బాధ్యతను తీసుకున్నారు. ఈ బాధ్యతా నిర్వహణ మనకు నాలుగు ప్రధాన రంగాల్లో కన్పిస్తుంది. అవి : 1) సాహిత్య భాషా సంస్కరణ, 2) సాంఘిక సంస్కరణ, 3)

BRAOU

పత్రికా రంగం, 4) గ్రంథాలయోద్యమం.

వీరేశలింగం భావాలు బెంగాల్, మహారాష్ట్ర సంస్కరణ వాదుల్లాగే సంస్కరణోద్యమానికి దారితీశాయి. మానవుని గూర్చి సమాజాన్ని గూర్చి ఆనాటి ప్రజల్లో జాగృతిని కలిగించటమే సంఘ సంస్కరణోద్యమాల ప్రధాన విజయం.

19వ శతాబ్దిలోవచ్చిన చైతన్యం 20వ శతాబ్ది ప్రథమ దశకంలోనే ఆంధ్రాభిమానానికి బీజాలు నాటింది. వందేమాతర ఉద్యమం ఫలితంగా ఆంధ్రుల్లో ఆంధ్రరాష్ట్రంపై మక్కువ ప్రారంభమైంది. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర భావన అంకురించి, వికసిస్తున్న దశలో సమకాలీన తెలుగు కవులు సైతం ఆ భావనతో ప్రేరణ పొంది రచనలు సాగించారు.

ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం వివిధ ప్రాంతాల్లో జరిగింది. 1913లో బాపట్లలో మొదటి అఖిలాంధ్ర మహాసభ జరిగిన తరువాత గుంటూరు, విజయవాడ, గోదావరి, విశాఖ జిల్లాల్లో ప్రత్యేకాంధ్రకు అనుకూలత ఏర్పడింది. తర్వాత నెల్లూరులోనూ, కడపలోనూ, మిగిలిన ప్రాంతాల్లోనూ వివిధ సభలు జరిగాయి.

1920 తిలక్ మరణం తరువాత జాతీయోద్యమ నాయకత్వాన్ని గాంధీ చేపట్టడం జరిగింది. సహాయ నిరాకరణోద్యమం మూలంగా ఆంధ్రోద్యమం వెనుకబడ్డా, బెజవాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్‌మహాసభ వీరిలో జాతీయ చైతన్యాన్ని కల్గించింది. ఉన్నవ గారి 'పుల్లరి' సత్యాగ్రహం, దుగ్గిర చీరాల, పేరాల ఉద్యమం, పర్వతనేని పెదనింపాడు పన్నుల నిరాకరణ, రేపల్లె రేటు చెల్లింపుదార్ల ఆందోళన దేశం మొత్తం దృష్టిని ఆకర్షించాయి. జాతీయోద్యమ దశలో కూడా ఆంధ్రులు తమ ఉప జాతీయోద్యమాన్ని మరవలేదు. ఆంధ్ర, రాయలసీమల మధ్య కొన్ని దురూహలు ఏర్పడ్డా, రెండు ప్రాంతాల నాయకులూ దాన్ని పోగొట్టాలని నడుం కట్టారు.

ప్రత్యేకాంధ్ర రాష్ట్రం కోసం 1948 నుంచి పోరాటం విజృంభించింది. దీని కోసం ఒక సంఘాన్ని నియమిస్తామని నెహ్రూ హామీ ఇచ్చారు. ఆ ప్రకారం 1949 లో రాష్ట్ర విభజన సంఘం ఏర్పడింది. త్రిపురనేని రామస్వామి, రాయప్రోలు సుబ్బారావు, తమ భావాలను కవితల రూపంలో తెల్పారు. ప్రకాశం గారి అసమ్మతి పత్రం దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం ఆంధ్రరాష్ట్ర స్థాపనను వాయిదా వేసింది. పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్షతో ఇది తీవ్ర రూపం దాల్చింది.

BRAOU

తెలంగాణా ప్రాంతంలో ఆంధ్రోద్యమం రెండు కోణాల్లో సాగింది. అవి: 1) నిజాం వ్యతిరేక పోరాటం; 2) విశాలాంధ్రోద్యమం, నైజాం ప్రాంతాల్లోని, ఆంధ్ర మహాసభ కార్యకలాపాలపై నిషేధాలుండేవి. 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు తర్వాత డిసెంబరులో ఫజల్ ఆలీ నేతృత్వంలో భాషా ప్రయుక్త రాష్ట్ర పరిశీలన సంఘాన్ని కేంద్ర ప్రభుత్వం నియమించింది. 1956 లో "పెద్దమనుషుల ఒప్పందం" జరిగింది. 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించింది. శ్రీశ్రీ "పదవోయి తెలుగువాడ, అదే నీ తెలుగుమేడ, సంకెళ్ళు లేని నేల, సంతోష చంద్రశాల" అని ఎలుగెత్తి సంతోషాన్ని తెల్పాడు. 1969లో ప్రత్యేక తెలంగాణా ఉద్యమం తలెత్తింది. అయినా ఎందరో మహానుభావుల కృషి మూలంగా ఈ విశాల రాష్ట్రం నిలిచింది.

## 5.2 ఆంధ్రుల చారిత్రక మహా ప్రస్థాన దశల వివరణ

ఐతరేయం నుండి ఆంధ్రోద్యమం వరకు ఆంధ్రుల చారిత్రక మహా ప్రస్థానంలో గమనార్హమైన ఘట్టాలెన్నో ఉన్నాయి. వీటిని మనం నిశితంగా పరిశీలిస్తే తెలుగు జాతి ప్రభావాన్ని, ప్రాముఖ్యాన్ని, చేతనను, వ్యక్తిత్వ పరిణామాన్ని, అభివృద్ధి పరిణామాన్ని, అంచనా వేయగలం. ఆధునిక యుగంలో ఆంధ్ర జాతి వికాసం విస్తరించిన తీరులో ఎంతో విలక్షణత ఉంది. బ్రిటీష్ పరిపాలకుల వలస పాలన దీనికొక ప్రధానమైన కారణం. ఆంధ్రుల్లో చైతన్యానికి వలస పాలనే నికషోపలంగా

పనిచేసిందని చెప్పలేం. కాని, దాని మూలంగా సమాజంలో మార్పు వేగం పుంజుకొంది. ఆంధ్రోద్యమాన్ని పరిశీలించే ముందు దానికి మార్గనిర్దేశం చేసినప్రధాన దశలను, ఆ దశల దిశ మార్చిన పరిణామాలను మనం పేర్కొనాలి. ఈ విషయంగా మనం నాలుగు ముఖ్యమైన చారిత్రక దశలను పరిశీలించాలి. అవి : 1) చైతన్య దశ 2) భావన దశ 3) ఉద్యమ దశ 4) పోరాట దశ

## 5.3 చైతన్య దశ

పందొమ్మిదో శతాబ్దం చివరకు బ్రిటీష్ వారి వలస పాలన భారతదేశంలో వేళ్లూనుకొని పోయింది. వారి అధికారం పూర్తిగా విస్తరించడం మూలాన అంతవరకు భారతీయులు అంతంత మాత్రంగా అనుభవిస్తున్నరాజకీయ, ఆర్థిక స్వాతంత్ర్యాలు కొడిగట్టడం ప్రారంభించి, త్వరలోనే కొండెక్కాయి. అది ఒక సంధి దశ. ఈ కాలంలో బ్రిటీష్‌వారు అనేక కొత్త సంస్కరణలను దేశంలో ప్రవేశ పెట్టారు. ఈ కొత్త పోకడలు దేశంలో ఒకవైపు విధ్వంసాత్మక పాత్రను, మరోవైపు పునర్వికాస పాత్రను పోషించాయి. తద్వారా సాంఘిక మార్పుకు విదేశీయుల పాలన కింద నాంది వాచకాలు పలికాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఛిద్రమై పోయింది. జాతీయ స్థాయిలో ఆర్థిక ఏకీకరణ, నూతన ప్రయాణ, వార్తా సౌకర్యాలు, ఇంగ్లీషు విద్య ద్వారా దేశంలోకి ప్రవేశించిన పాశ్చాత్య భావాలు ప్రజల్లో సాంఘిక మార్పుపై మక్కువను పెంచడం ప్రారంభించాయి. నూతన ఇంగ్లీషు విద్యా విధానం వల్ల సమాజంలో ఒక కొత్త మధ్య తరగతి వర్గం జీవం పోసుకొంది. అది సాంఘిక మార్పును ప్రజల దగ్గరికి తీసుకువెళ్ళే బాధ్యతను స్వీకరించింది. అయితే బ్రిటీష్ వలస వాదం విధించిన పరిమితుల మూలంగా ఈ మార్పు తన గమనానికి అవసరమైన త్వరణాన్ని (Momentum) సాధించుకోలేక పోయింది.

### 5.3.1 నూతన ఆర్థిక ప్రణాళికలు

పందొమ్మిదో శతాబ్దంలో బ్రిటీష్ పాలకులు ప్రవేశపెట్టిన నూతన ఆర్థిక ప్రణాళికల మూలంగా ప్రజల్లో క్రమంగా ఆర్థిక అసంతృప్తి జ్వాలలు భగ్గుమనడం ప్రారంభించాయి. మద్రాసు ప్రెసిడెన్సీలోని రైత్వారీ పద్ధతి పైకి ప్రజాస్వామికంగా కనబడ్డా చివరకు అది ఆర్థిక పీడనలో మరో ఘనమైన ప్రయోగంగా మిగిలిపోయింది. రైతుల పరిస్థితి దిగజారడం ప్రారంభించింది. వారి కడగండ్లను మద్రాసు దేశీయ జనసంఘం (Madras Native Association) లాంటి సంస్థలు ప్రభుత్వ దృష్టికి తీసుకవెళ్ళాయి. గోదావరి ఆనకట్ట లాంటి నూతన సౌకర్యాలు ఏర్పర్చినపుడల్లా ప్రభుత్వం తదనుగుణంగా శిస్తును భారీగా పెంచడం ప్రారంభించింది. చిలకమర్తి వారు పేర్కొన్నట్లు "గడ్డి మాత్రమే మిగిలించు కాపువాడు సేద్యమున తాను పశువులు భక్షించు కొరకు" అన్నంతగా రైతుల పరిస్థితి దిగజారింది. దీనికి తోడు నూతన న్యాయవ్యవస్థ. ఉప్పువంటి సాధారణ వస్తువులపై అసాధరణంగా పన్నుల వడ్డింపు మొదలైన వాటితో సమాజం మొత్తంలో ఆర్థిక అసంతృప్తి ప్రారంభమైంది. దానిలో భాగంగానే ఆంధ్ర ప్రాంతం నుండి బ్రిటిష్ వారి నిరంకుశ చర్యలను నిరసిస్తూ, తమ కష్టాలను ఏకరువు పెడ్తూ, పుంఖాను పుంఖాలుగా మహజర్లు పంపారు. పందొమ్మిదో శతాబ్దం మధ్య భాగానికి ఈ అసంతృప్తిని మద్రాసు దేశీయ జనసంఘం తన రాజకీయ కార్యక్రమంలో భాగంగా చేసింది.

దేశంలో ప్రవేశ పెట్టిన నూతన ఆంగ్ల విద్యా విధానం, అంతవరకు ఇక్కడ బలంగా పాతుకు పోయిన సాంప్రదాయక విద్యా వ్యవస్థను కూకటి వేళ్ళతో పెకలించింది. దాంతో సాంప్రదాయక విద్యకు, దానిపై పూర్తి ఆధిపత్యం ఉన్న బ్రాహ్మణ వర్గాల ప్రభావానికి మంగళం పాడడం ప్రారంభమైంది. నూతన ఆంగ్ల విద్య కూడా వలస పాలకుల అవసరాల మేరకే రూపు దిద్దుకొంది. ఈ విధాన సృష్టికర్త మెకాలే అభిప్రాయం ప్రకారం ఆంగ్ల విద్యా విధానంలో తర్ఫీదు పొందిన భారతీయులు రంగు, రూపుల్లో మాత్రమే భారతీయతను ప్రతిబింబిచారు. వారి ఆలోచనల్లో, ఆశయాల్లో పాశ్చాత్య సంస్కృతీ మానస పుత్రులుగా మారారు. ఈ విశ్వాసంతోనే వలస పాలకులు ఈ విద్యను పెంచి పోషించడం ప్రారంభించారు. ఈ విద్యా

BRAOU

విధానం ద్వారా వారు సాధించదల్చుకున్న ప్రధాన విషయమమేమంటే, ఆంగ్ల విద్యలో తర్ఫీదు పొందిన భారతీయులను వలస పాలన నిర్వహణలో దిగువ తరగతి ఉద్యోగులుగా నియమించి, తద్వారా వలస పాలన నిర్వహణ భారాన్ని వీలైనంత వరకు తగ్గించడమే.

## 5.3.2 నూతన ఆంగ్ల విద్యా విధానం, క్రైస్తవ మిషనరీల ప్రభావం

విద్యా విధాన నిర్వహణలో క్రైస్తవ మిషనరీల ప్రభావం చాల తీవ్ర పరిణామాలకు దారితీసింది. ముఖ్యంగా మద్రాసు ప్రెసిడెన్సీ ప్రాంతంలో వలస పాలకుల ద్వంద్వ విధానాల వల్ల విద్యా రంగంలో క్రైస్తవ ప్రచారకులు విజృంభించారు. 1854 ఉడ్స్ పథకం ప్రకటించే వరకు మద్రాసు ప్రభుత్వం విద్యా విషయకంగా అనిశ్చిత ధోరణిని ప్రదర్శించింది. దీంతో మిషనరీలకు విద్యా రంగంలో ప్రధాన పాత్ర లభించింది. పరోక్షంగా ప్రభుత్వం సైతం వీరిని ప్రోత్సహించింది. మిషనరీ పాఠశాలల ద్వారా క్రైస్తవ నీతులను బోధిస్తే , ఆ సంస్కృతి విలువలు జీర్ణించుకున్న భారతీయులతో ఘర్షణ నివారింపగలదన్న భావం కూడా ప్రభుత్వాన్ని పురి కొల్పింది. ఉదాహరణకు పందొమ్మిదో శతాబ్ద మధ్య భాగంలో మద్రాసు గవర్నరుగా పనిచేసిన ట్వీడేల్, మిషనరీ చర్యలకు దాదాపుగా ప్రత్యక్షమద్దతు ప్రకటించాడు. దీంతో ప్రజల్లో ఎంతో కల్లోలం రేగింది. దీనికి ప్రతిచర్యగా మిషనరీలను నిరసిస్తూ ప్రభుత్వానికి విన్నపాలు పంపడం, సమకాలీన పత్రికలైన 'పురుషార్థ ప్రదాయిని' వంటి వాటిలో వీరి చర్యలను తెగనాడుతూ, వ్యాసాలను ప్రచురించి ప్రజలను జాగృతం చేయడం ప్రారంభమైంది. అంతేకాకుండా, హిందూ విద్యార్థుల కోసం ప్రత్యేక పాఠశాలలు ప్రారంభించారు. నెల్లూరు, మచిలీపట్నం, విజయనగరం మొదలైన ప్రదేశాల్లో హిందూ పాఠశాలలను నెలకొల్పారు. ఈ చర్యలేవీ మిషనరీ విద్యా సంస్థలకు సరితూగక పోయినా అవి ఆనాటి ప్రజల్లో మతపరంగా చైతన్యాన్ని కల్గించాయి. వీటికి తోడు వెంకటగిరి, పిఠాపురం, విజయనగరం మొదలైన సంస్థాన అధీశులు తమ తమ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారు. వీరేశలింగం వంటి సంస్కర్తలు స్త్రీల విద్య కోసం, స్త్రీలను చైతన్య వంతులను చేయడం కోసం కృషి చేసి తమ వంతు బాధ్యతను విజయవంతంగా నిర్వహించారు.

## 5.3.3. నూతన విద్యా వ్యాప్తిలో భారతీయుల కృషి

19వ శతాబ్దంలో చివరి నాటికి ఆంధ్రదేశంలో దాదాపు సంతృప్తికరమైన రీతిలో విద్యావ్యాప్తి జరిగింది. ఒక వైపు మిషనరీ విద్యా సంస్థలు; మరోవైపు భారతీయుల కృషి; రాజమండ్రి, బళ్ళారి, బరంపురం, విశాఖపట్నం, విజయనగరం, కాకినాడ, మచిలీపట్నం మొదలైన ప్రాంతాల్లో కళాశాలల స్థాపన - ఇవన్నీ కలిపి ఆంధ్రదేశంలో విద్యాభివృద్ధికి దోహదం చేశాయి. 1881 నాటికి ఆంధ్రదేశంలో అక్షరాస్యత శాతం సగటున 5 శాతానికి చేరింది. ఆంధ్ర దేశ విద్యారంగం చరిత్రలో మరో చైతన్య జనకమైన అంశం ఉంది. 19వ శతాబ్ది మధ్య భాగం నుండి ఆంధ్రలో వివిధ ప్రాంతాల ప్రజలు తామే సొంతంగా పాఠశాలలు స్థాపించుకోడం ప్రారంభించారు. నూతన విద్యా వ్యవస్థలో కుల, మత, తారతమ్యాలకు తావు లేకపోవడం, ఆంగ్ల విద్యకు పెరుగుతున్న ఆదరణ మొదలైన అంశాలు దీనికి దారి తీశాయి. ఇంత కాలంగా తమ పిల్లలకు సమాన విద్యావకాశాలు కొరవడ్డం, బ్రాహ్మణేతర వ్యవసాయిక కులాలకు కంటగింపుగా, కొరవగా ఉండేది. ఆంగ్ల విద్యా విధానంలో అలాంటి సమానత లభించింది. గోదావరి ప్రాంతంలోప్రథమంగా రైతు వర్గానికి చెందిన బ్రాహ్మణేతర కులాల వారు తమ మీద తామే కొంత అదనపు పన్ను (Rate) విధించుకొని, దాన్ని పాఠశాలల నిర్వహణకు ఉపయోగించదలచారు. ఈ కారణం చేతనే వీటిని "శిస్తు పాఠశాలలు" (Rate Schoools) అని పిలవడం జరిగింది. ఈ పాఠశాలల స్థాపనలో ఆనాడు రాజమండ్రి విభాగానికి సబ్‌కలెక్టరుగా ఉన్న జి.ఎస్. టేలర్ ప్రజలతో ఎంతో సహకరించాడు. రాను రాను ఈ ప్రయోగం అనాడు మద్రాసు ప్రెసిడెన్సీలో భాగమైన ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలన్నిటికీ వ్యాపించింది. అనతి కాలంలోనే ప్రెసిడెన్సీ మొత్తం ఈ పాఠశాలలు వెలిశాయి. ప్రభుత్వ అజమాయిషీ కింద, ప్రజల నిర్వహణలో ఇవి పనిచేశాయి. తెలుగు మాట్లాడే ప్రాంతాల్లో ఈ విద్యా సంస్థల్లో అధిక భాగం బ్రాహ్మణేతర విద్యార్థులు ఉండేవారు. బ్రాహ్మణ విద్యార్థుల సంఖ్య

BRAOU

చాలా తక్కువ. అంటే ఈ పాఠశాల కార్య నిర్వహణ మండలాల్లో కూడా బ్రాహ్మణుల సంఖ్య అతి స్వల్పం. ఆనాడు సమాజంలో విస్తరిస్తున్న జాగృతికి, అందునా బ్రాహ్మణేతర కులాల్లోని చైతన్యానికి ఈ శిస్తు పాఠశాలలు మచ్చు తునకలు.

నూతన విద్యా వ్యాప్తి మూలంగా ఆంధ్ర సమాజంలో నూతన విద్యాధిక మధ్య తరగతి వర్గ మొకటి ఆవిర్భవించింది. ఈ మధ్య తరగతి మేధావులు ఎక్కువగా న్యాయవాద, అధ్యాపక వృత్తుల్లోనో లేదా పత్రికా రంగంలోనో ఉన్నారు. సమాజంలో నూతన భావాలను వ్యాపింపచేసే బృహత్తర బాధ్యతను వీరు తమ భుజస్కంధాలపై తీసుకున్నారు. ఈ బాధ్యతా నిర్వహణ మనకు నాలుగు ప్రధాన రంగాల్లో కన్పిస్తుంది. అవి: 1) సాహిత్య, భాషా సంస్కరణ, 2) సాంఘిక సంస్కరణ, 3) పత్రికా రంగం, 4) గ్రంథాలయోద్యమం.

సాహిత్య రంగంలో, భాషా సంస్కరణ విషయంలో 19వ శతాబ్ది చివర తమ ముద్రను పదిలంగా వేసినవారు గురజాడ, గిడుగులు. సంస్కరణ భావాలను సాహిత్యంలో ప్రవేశపెట్టి, వాటికి ప్రత్యేక స్థానం గురజాడ కలిగిస్తే, సాంప్రదాయక భాషను సంస్కరించాలన్న ఆశయాన్ని ఉద్యమ స్థాయికి తీసుకు వెళ్ళిన వాడు గిడుగు రామ్మూర్తి పంతులు. గురజాడ అప్పారావు "కన్యాశుల్కం" నాటకంలో సంస్కరణకు పెద్ద పీట వేసి, నాటక భాషలో మాండలికాల్ని ప్రవేశపెట్టాడు. 'ముత్యాలసరాల' ద్వారా సాహిత్యానికి పట్టిన సాంప్రదాయిక సర్ప పరిష్వంగాన్ని ఛేదించాడు. అగ్నికి వాయువులాగా గిడుగువారి వ్యవహారిక భాషోద్యమం తోడైంది. తర్వాతి కాలంలో వీరేశ లింగం వంటి వారు కూడా వ్యవహారిక భాషకు తమ మనః పూర్వక మద్దతు నందించారు. 20వ శతాబ్ది ప్రథమార్థానికి సాహిత్యంలో వాడుక భాష ప్రయోగం సాధారణమైంది. శ్రీపాద సుబ్రమణ్యశాస్త్రి, చలం వంటి రచయితలకు, శ్రీశ్రీ వంటి కవులకు సరియైన నేపథ్యమిదే. సాహిత్య, భాషా సంస్కరణోద్యమాల మూలంగా ఎక్కడో ఆకసపు దారిలో హడావుడిగా వెళ్లిపోతున్న సాంప్రదాయిక సాహిత్య, భాషా రథ చక్రాలు భూమార్గం పట్టాయి.

BRAOU

### 5.3.4 గ్రంథాలయోద్యమం నిర్వహించిన పాత్ర

సమాజంలో ఆనాడు వెల్లివిరుస్తున్న చైతన్యానికి గ్రంథాలయోద్యమం మరో సజీవ ఉదాహరణ. 1839 నాటికే రాజమండ్రిలో ఒక ప్రజా పఠనీయ స్థలం ఉండేది. 1850లో వెంకటగిరి జమీందారు రాజకుమార యాచేంద్ర, "సరస్వతీ విలాస" మనే పేరుతో గ్రంథాలయాన్ని స్థాపించాడు. ఆ తర్వాత గుంటూరులోని దివ్యజ్ఞాన సమాజంవారి గ్రంథాలయం (1882), విశాఖలో సరస్వతీ విలాస గ్రంథాలయం (1990), విజయనగరంలో సింహచలపతిరావు గ్రంథాలయం (1894), కోపల్లెలో ఎ.ఒ.హ్యూమ్ గ్రంథాలయం, ఉండిలో నౌరోజీ క్లబ్బు (1895), భీమవరం తాలుకా కుముద వల్లిలో వీరేశలింగ కవి సమాజం (1897), విజయనగరంలో విజ్ఞాన చంద్రికా మండలి గ్రంథాలయం (1898) మొదలైన గ్రంథాలయాల స్థాపన జరిగింది. అత్యంత ప్రసిద్ధి చెందిన గౌతమీ గ్రంథాలయం కూడా 1898లో జీవం పోసుకుంది. రాయలసీమ ప్రాంతంలో కూడా 1892 నాటికి పులివెందుల్లో సరస్వతీ విలాసమనే పేర గ్రంథాలయాన్ని స్థాపించారు. తెలంగాణాలో కూడా 19వ శతాబ్దాంతానికి సికిందరాబాదులో శంకరానంద గ్రంథాలయాన్ని ముదిగొండ శంకరారాధ్యుడు ప్రారంభించాడు. త్వరితగతిన వ్యాపిస్తున్న జాగృతికి ఈ గ్రంథాలయాల స్థాపన మంచి ఉదాహరణ. గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికంగా విస్తరించిన ఈ గ్రంథాలయాలు, ఆనాడు మధ్య తరగతి మేధావులు నూతన విజ్ఞానాన్ని ఆ ప్రాంతాలకు తోడ్కొని వెళ్ళారని చెప్పడానికి ప్రబల తార్కాణం. గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరు నాగభూషణం, కొమర్రాజు లక్ష్మణరావు, సురవరం ప్రతాపరెడ్డి మొదలైన మధ్య తరగతి విద్యాధికులందరూ ఈ ఉద్యమానికి మూల స్తంభాలుగా పనిచేసిన వారే. వారి కృషి ద్వారా సంఘ చైతన్యానికి దారులు తీసినవారే.

### 5.3.5 పత్రిక రంగం

19వ శతాబ్దిలో ఊపిరి పోసుకున్న అనేక తెలుగు పత్రికలు ఆనాటి సమాజంలోని ప్రజాభిప్రాయానికి సంస్కరణ

భావాలకు అద్దం పట్టాయి. నూతన విద్య వ్యాపించి, సంస్కరణోద్యమాలకు దారి తీయడం, క్రైస్తవ మిషనరీలు విచక్షణా రహితంగా భారతీయుల మత విశ్వాసాల మీద దాడి చేయడం, బెంగాలులో బెంగాలీ పత్రికా రచన వృద్ధి చెందడం మొదలైన అంశాలు తెలుగు పత్రికా రంగాన్ని ప్రభావితం చేశాయి. "వృత్తాంతిని", "వర్తమాన తరంగిణి" పత్రికలు 19వ శతాబ్ది పూర్వార్ధంలోనే సంస్కరణ ఆవశ్యకతను నొక్కి చెప్పి, క్రైస్తవ మిషనరీల ఆగడాలను, దుశ్చర్యలను తీవ్రంగా ఖండించాయి. 19వ శతాబ్ది ఉత్తరార్థంలో అనేక తెలుగు పత్రికల స్థాపన జరిగింది. మద్రాసు నుండి 17 పత్రికలు ఆంధ్రదేశంలోని వివిధ మారుమూల ప్రాంతాల నుండి దాదాపు 40 పత్రికలను ప్రచురించేవారు. 1885 కు ముందు స్థాపించిన పత్రికల సమాచారం మాత్రమే ఇది. జాతీయ కాంగ్రెసు స్థాపన జరిగి, జాతీయోద్యమం ఊపందుకున్న తర్వాత తెలుగు పత్రికలు లెక్కలేనన్ని వెలువడ్డాయి. పురుషార్థ ప్రదాయిని, ఆంధ్రభాషా సంజీవని, స్వధర్మ ప్రకాశిని, వివేకవర్ధిని, సకల విద్యాభివర్ధిని, హాస్య సంజీవిని, వర్తమాన రత్నాకరము, ప్రబంధకల్పవల్లి, యదార్థవాది, సతీహిత బోధిని, అముద్రిత గ్రంథ చింతామణి, ప్రథమ రాజకీయ పత్రిక ఆంధ్రప్రకాశిక మొదలైన ప్రసిద్ధ తెలుగు పత్రికలన్నీ 1885 ముందు ప్రచురితమైనట్టివే. ఆనాటి ప్రజాభిప్రాయానికి ఇవన్నీ అద్దం పట్టాయి. వివేక వర్ధని లాంటి పత్రికలు సంస్కరణే ధ్యేయంగా ప్రచురణ ప్రారంభించాయి. సమాజంలోని దురాచారాలను ఎదుర్కోవడమే కాక, శాస్త్రీయ విజ్ఞానాన్ని ప్రజలకు అందించడంలో దాదాపుగా పై పత్రికలన్నీ కృషి చేశాయి. ఆనాటి వలస పాలనలో లోపభూయిష్టమైన అంశాలన్నింటినీ పత్రికలు విమర్శించాయి. తర్వాతి కాలంలో రాజకీయ స్పృహను ప్రజలకు కలిగించడంలో తెలుగు పత్రికలు చిరస్మరణీయమైన కృషిని చేశాయి.

సాంఘిక సంస్కరణ విషయంలో ఆంధ్రదేశంలో 19వ శబాబ్దిలోనే ఉద్యమస్థాపన, నిర్వహణ జరిగింది. 19 వ శతాబ్ది మార్పుల నేపథ్యంలో ఆంధ్ర సమాజం కూడా కొన్ని మార్పులకు లోనవడం ప్రారంభించింది. దీనికి కారణం, కేవలం బ్రిటిష్ వలస పాలనలో సంభవించిన వ్యవస్థాగతమైన, ఆలోచనాత్మక పరిణామాలు కాని, ఆంగ్ల విద్య ద్వారా ప్రాప్తించిన హేతువాద, ఉదార వాద భావాలు కాని కాదు. అంతకు ముందే సమాజంలో మొగ్గతొడిగిన సంప్రదాయ వ్యతిరేక భావాలు, తర్వాతి కాల సాంఘిక మార్పులకు తమ వంతు నేపథ్యాన్ని అందించాయి. వేమన రచనలు, బ్రాహ్మణ వాద సాంప్రదాయకతను నిరసించిన వీరశైవం, శ్రీవైష్ణవ మత శాఖలు దీనికి ఉదాహరణలు. 19శతాబ్ది సాంఘిక సంస్కరణ ఉద్యమాలు వీటి నుంచి ఎంతోఉత్తేజం పొందాయి. ఆంధ్రలో సంస్కరణోద్యమాలకు కందుకూరి వీరేశలింగం (1848-1919) ఆద్యుడని చెప్పడం అసత్యం కాకపోయినా, ఆయనకు మునుపే సమాజంలో సంస్కరణ భావాలను వెదజల్లిన రచనలు వెలువడ్డాయి. ఏనుగుల వీరస్వామయ్య, వెన్నెలకంటి సుబ్బారావు, సామినేని ముద్దు నరసింహనాయుడు, జియ్యర్ సూరి మొదలైన వారి రచనలు వీరేశలింగానికి ముందే సంస్కరణలను ప్రభోదించే గట్టి ప్రయత్నం చేశాయి. ఇటువంటి భావాలనే కాకినాడ లిటరరీ సమాజం వంటి సాంఘిక సంస్థలు కూడా ప్రచారం చేశాయి.

BRAOU

## 5.3.6 వీరేశలింగం సంఘ సంస్కరణ కార్యక్రమాల్లో ప్రవేశించటం

వీరేశలింగం భావాలలో 1870 నాటికి పటిష్టమైన రూపును సంతరించుకొన్నారు. బెంగాలు, మహారాష్ట్ర సంస్కరణ వాదుల్లాగే ఆయన సంస్కరణోద్యమాన్ని ఆచరణలోపెట్టేముందు హేతువాద, శాస్త్రీయ భావాలను సమాజంలో ప్రచారం చేయడానికి సంకల్పించాడు. దీనికి సాహిత్యాన్ని మార్గంగా ఎన్నుకొని, భాషను సరళీకృతం చేసి నవల, నాటకం, ప్రహసనాల ద్వారా సంస్కరణ భావాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళాడు. అంతేకాక, ఆయన ప్రచురించిన పత్రికలను కూడా ఈ మహత్కార్యానికి వినియోగించాడు. ఆయన సంస్కరణ ఉద్యమాల్లో మౌలికాంశం స్త్రీ సమస్యలకు చెందింది. బాల్య వివాహాలు, కన్యా శుల్కం, విధవా వివాహాలు, స్త్రీ విద్య మొదలైన అంశాలు వీరేశలింగం చేపట్టిన సంస్కరణల్లో ప్రధాన భాగాలు. సాంఘిక సంస్కరణ తర్వాతే రాజకీయ సంస్కరణ జరగాలని, సాంఘిక మార్పు ద్వారా వచ్చిన జాగృతే రాజకీయ స్వాతంత్ర్యానికి సంరక్షక కవచమని ఆయన భావన.

మానవుని గుర్చి సమాజాన్ని గుర్చి ఆనాటి ప్రజల్లో జాగృతిని కల్గించడమే సంఘ సంస్కరణోద్యమాల ప్రధాన విజయం. సంస్కరణల ఆవశ్యకతను గుర్తించిన ఆనాటి సమాజంలో చైతన్యం ప్రారంభమైంది. కుల వ్యవస్థలో మార్పు రాకపోయినా, ప్రార్థనా సమాజం, బ్రహ్మసమాజం చేపట్టిన మత సంస్కరణల వల్ల కుల పట్టింపుల్లో సడలింపు వచ్చింది. సమాజంలో సాంఘిక చైతన్యాన్ని కలిగించి, తద్వారా రాజకీయ చైతన్యానికి ఈ సంస్కరణ ఉద్యమాలు దారి చూపాయి. 19వ శతాబ్దాంతానికి జిల్లా స్థాయిలో జరిగిన సాంఘిక సభలు (District Social Conferences) రాజకీయ విషయాలపై తమ అభిప్రాయాలను వ్యక్తీకరించడమే, దీనికి ప్రబల తార్కాణం. ఆంధ్రదేశంలోని జాతీయోద్యమ దశకు సంస్కరణోద్యమాలు కచ్చితమైన నేపథ్యాన్ని అందించాయనే విషయాన్ని మనం ఈ ఉదాహరణ ద్వారా చెప్పుకోవచ్చు. తొలిదశలోనే జాతీయోద్యమ నాయకత్వం కూడా సంస్కరణోద్యమాల భాగస్వాముల నుండే లభ్యమైందనే విషయం మనం గమనించాలి. 19వ శతాబ్ది ఆంధ్రదేశ మేధో నిర్మాణంలో ఈ సంస్కరణోద్యమాల ప్రభావం అంతర్లీనమై పోయింది.

**అభ్యాసాలు**

నూతన విద్యా విధానం ద్వారా ఆంగ్లేయులు సాధించదలచిన ఆర్థిక ప్రయోజనం ఏమిటి?

నూతన విద్యావ్యాప్తి మూలంగా వెలుతురు ప్రసరించిన సామాజిక రంగాలను పేర్కొనండి.

BRAOU

నాటి పత్రికలు ప్రచారం చేసిన అధునిక భావాలను వివరించండి.

______________________________________________________________

______________________________________________________________

______________________________________________________________

______________________________________________________________

______________________________________________________________

______________________________________________________________

______________________________________________________________

______________________________________________________________

______________________________________________________________

______________________________________________________________

## 5.4 భావనా దశ

19వ శతాబ్దిలో వచ్చిన చైతన్యం 20వ శతాబ్ది ప్రథమ దశకంలోనే ఆంధ్రాభిమానానికి బీజాలు నాటింది. 1903-04 మధ్య గుంటూరులో యువజన సాహితీ సమితి (Young Men Literary Association) ఏర్పడింది. జొన్నవిత్తుల గురునాథం, చల్లా శేషగిరిరావు, గొల్లపూడి సీతారామ శాస్త్రి, ఉన్నవ లక్ష్మీనారాయణ, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య మొదలైన వారు దీనిలో సభ్యులు. ఆర్థిక,రాజకీయ విషయాలను అందులో చర్చించేవారు. అంతేకాక, దేశాభివృద్ధికి భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడాలని వీరు కోరారు. అనాడు ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఆంధ్రులు ద్వితీయ శ్రేణి ప్రాముఖ్యం కలవారుగా పరిగణింపబడడం చాలా మందిని కలచి వేసింది. మద్రాసు రాష్ట్రంలో ఆంధ్ర ప్రాంతం విస్తీర్ణం 58శాతం. తెలుగువారు, 40శాతం. ఆంధ్రులను మద్రాసీలుగానే గుర్తించారు. ఉద్యోగం, విద్య, వ్యవసాయం, పరిశ్రమలు, సైనిక రంగాల్లో ఆంధ్రులపట్ల నిరాదరణ ఉండేది. 1910 నాటికి సబ్‌కలెక్టరు, డిప్యూటీ కలెక్టరు, జిల్లా మున్సిఫ్, జడ్జీలు, జిల్లా రిజిస్ట్రార్, విద్యాశాఖ ఉన్నతోద్యోగాలు, రాష్ట్ర ఉన్నతోద్యోగాల్లో ఆంధ్రులు కేవలం 67 మంది మాత్రమే ఉంటే, ఆంధ్రేతరులు 255 మంది ఉండేవారు. 1915 నాటికి మద్రాసు రాష్ట్రంలోని 31 కళాశాలల్లో కేవలం 8 మాత్రమే ఆంధ్రదేశంలో స్థాపితమైనాయి. ఈ విధంగా దాదాపు అన్నిరంగాల్లో ఆంధ్రులది వెనుకబాటుతనమే అయింది. వృత్తి విద్యా కోర్సులకు సంబంధించిన అన్ని విద్యా సంస్థలు మద్రాసులోనే కేంద్రీకృతమై ఉన్నాయి. అదే సమయంలో తమిళ ప్రాంతాల్లో విద్యా, పారిశ్రామికాభివృద్ధులు, నిరాటంకంగా జరిగాయి. ఈ దుస్థితి ఆంధ్రులను గాభరా పరచింది. ప్రత్యేక రాష్ట్రంలోనే తెలుగువారికి న్యాయం జరగగలదనీ, వారి భాషా సంస్కృతులు పరిరక్షితం కాగలవనీ తెలుగువారు భావించడం ప్రారంభించారు.

### 5.4.1 తెలంగాణాలో తెలుగు భాషా దుస్థితి

తెలుగువారి భాషాభివృద్ధులను గూర్చి ఆ సమయానికే నైజాం ప్రాంతాల్లో కూడా ఆలోచన ప్రారంభమైంది. మునగాల జమీందారు రంగారావు, కొమర్రాజు లక్షణరావు, హైదరాబాదు తరచూ వస్తుండడం మూలానా వారికి తెలంగాణాలో తెలుగు భాష దుస్థితిని గూర్చి అవగాహన కలిగింది. ఈ దుస్థితిని తొలగించడానికి వీరిరువురు రావిచెట్టు రంగారావు, ఆదిపూడి సోమనాథరావు, మైలవరపు నరసింహ్మశాస్త్రి మొదలైన వారితో కలిసి 1901లోనే హైదరాబాదులో శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయాన్ని స్థాపించారు. ఆంధ్ర భాషలో గ్రంథాల ప్రచురణ నిమిత్తం రంగారావు, లక్మణరావు ద్వయం గాడిచర్ల హరిసర్వోత్తమరావు,

అయ్యదేవర కాళేశ్వరరావు లతో కలిసి విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలిని 1906లో ఏర్పాటు చేశారు. ఈ మండలి దాదాపు పది సంవత్సరాల కాలంలో 30 గ్రంథాలను వివిధ విషయాలపై ప్రచురించింది. ఈ మండలి ప్రకటించిన అన్ని గ్రంథాలల్లోను చిలుకూరి వీరభద్రరావు రచించిన "ఆంధ్రుల చరిత్ర" చాలా ముఖ్యమైంది. ఆంధ్రులలో నిబిడీకృతమైన ఆంధ్రాభిమానాన్ని తట్టి లేపడంలో ఈ గ్రంథం ఎంతో శ్లాఘనీయమైన కృషి చేసింది.

బెంగాలులో 1905 లో ప్రారంభమైన వందేమాతరం ఉద్యమం ఆంధ్రదేశంలో రాజకీయ చైతన్యానికి నాంది పలికింది. ఈ కాలంలోనే ప్రత్యేకాంధ్ర రాష్ట్ర భావన మొలకెత్తింది. సమకాలీన పత్రిక లైన ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక, దేశాభిమాని, దేశమాత,దర్బారు, ఆంధ్రకేసరి మొదలైనవి ఈ భావనను బలపరుస్తూ వ్యాసాలు ప్రకటించాయి. రాజమండ్రి లాంటి చోట్ల ఈ వందేమాతరం ఉద్యమంలో విద్యార్థులు చాల చురుగ్గా పాల్గొన్నారు. వందేమాతరం ఉద్యమ కాలంలోనే 1907-08 ల్లో మచిలీపట్నంలో జరిగిన ఆంధ్ర మహాసభలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం నిర్మించాలనే అభిప్రాయం ప్రథమంగా వ్యక్తమైంది. తమ విశిష్ట వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకొని, తెలుగువారి ప్రయోజనాలను, సంస్కృతిని పరిరక్షించుకోడానికి ఆంధ్రోద్యమ భావన కంకణం కట్టుకుంది. ఇది వేర్పాటు వాదం కాదనీ, జాతీయోద్యమం శాఖకు అనుసంధానమైన ఉప జాతీయోద్యమం అనీ పట్టాభి సీతారామయ్య దీన్ని వర్ణించారు. 1911 నాటికి బెంగాలు ఉద్యమం ఫలించి, ఆ రాష్ట్ర విభజన రద్దు కావడం తెలుగు వారికి ఆదర్శప్రాయమైంది. 1910 నాటికి వివిధ జిల్లాల్లో జరిగిన జిల్లా మహాసభల్లో ఉన్నవ లక్ష్మీనారాయణగారు ప్రథమంగా ప్రత్యేక రాష్ట్ర వాంఛను తీర్మానించారు. అయితే, ఆ తీర్మానం వీగిపోయింది.

## 5.4.2 ఆంధ్రరాష్ట్రంపై వందేమాతర ఉద్యమం ప్రభావం

BRAOU

వందేమాతర ఉద్యమ ఫలితంగా ఆంధ్రుల్లో ఆంధ్ర రాష్ట్రంపై మక్కువ ప్రారంభమైంది. అలాంటి కోరికను ప్రథమంగా 1911 డిసెంబరులో ఢిల్లీ దర్బారుకు హాజరైన ఆంధ్ర ప్రతినిధులు బ్రిటిష్ ప్రభుత్వానికి తెలుపుకున్నారు. ఉన్నవ లక్ష్మీనారాయణ, జొన్నవిత్తుల గురునాథం గార్లు ఆనాటికి తెలుగు ప్రజలంతా కలిసి వుండే ప్రాంతాన్ని ఒక చిత్రపటంగా రూపొందించారు. దానిలో మద్రాసు రాష్ట్రంలో, నిజాం పాలనలో, మైసూర్ సెంట్రల్ ప్రావిన్సెస్‌లో ఉన్న తెలుగు ప్రాంతాలన్నింటిని కలిపి ఒకే రాష్ట్రంగా చిత్రించారు. 1912లో కొండా వెంకటప్పయ్య ప్రచురించిన "ఆంధ్రోద్యమము" అనే గ్రంథంలో ఈ చిత్రపటాన్ని జతపరచారు. ఈ గ్రంథంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల వాదనను ప్రస్ఫుటంగా ప్రకటించడం జరిగింది. అదే సంవత్సరంలో జరిగిన కృష్ణా, గుంటూరు జిల్లా సంయుక్త సభల సమావేశంలో గుంటూరు ప్రతినిధులు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ప్రస్తావనను తీసుకొని వచ్చారు. ఈ విషయాన్ని కూలంకషంగా చర్చించే నిమిత్తం తీర్మానాన్ని వాయిదా వేయాలని ఆ సభలో నిర్ణయించారు. ఆ సమావేశం ముగిసిన వెంటనే ఉన్నవ, కొండా వెంకటప్పయ్య, గురునాథం, వింజమూరి భావనాచార్యులు, చల్లా శేషగిరిరావు మొదలైన వారు కలిసి మొట్ట మొదటి అఖిలాంధ్ర సమావేశం ఏర్పాటు చేయడానికి, ఒక స్థాయి సంఘాన్ని వెంకటప్పయ్య గారి కార్యదర్శిత్వంలో నియమించారు. వీరు గురునాథం గారితో కలిసి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఆవశ్యకతను వివరిస్తూ ఆంగ్ల, తెలుగు భాషల్లో చిన్న పుస్తకాన్ని ప్రచురించారు. ప్రథమ అఖిలాంధ్ర మహాసభకు వేదిక సన్నద్ధమైంది.

## 5.4.3 అఖిలాంధ్ర మహా సభలు

ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర భావన అంకురించి, వికసిస్తున్న దశలో సమకాలీన తెలుగు కవులు సైతం ఆ భావనతో ప్రేరణ పొంది రచనలు సాగించడం ప్రారంభించారు. 1904లోనే ఆదిపూడి సోమనాథరావు బందరు నుండి "అమలగుణ సాంద్రులారయో ఆంధ్రులార"! అని ఆంధ్రుల అభిమానాన్ని ఉద్దేశించి గళం విప్పారు. ఆ వెనువెంటనే మంగిపూడి వెంకట శర్మగారు మొదటిసారిగా తమ "ఆంధ్రమాత" కవిత ద్వారా ఆంధ్రమాతృస్తవం ప్రారంభించారు. ఆయన "ఆంధ్రదేశ ప్రశంస" పద్యాల్లో ఆంధ్రమాత ప్రాచీన వైభవ స్తుతి పరాకాష్టనందుకొంది. అదే రీతిలో 1911లో గడ్డం కొండారెడ్డిగారు "ఆంధ్రమాతృస్తవము"

ప్రకటించారు. అదే సంవత్సరంలో పిప్పర సోదర కవుల "ఆంధ్రమాతృసమాశ్వాసము" అనే కవిత వెలుగు చూసింది. ఈ కవితలో ఆంధ్ర మహాసభ లక్ష్యాన్ని సూచించారు. మండపాక పార్వతీశ్వరశాస్త్రి గారు "ఆంధ్రసంవత్సరాది" అనే ఖండికలో ఉగాది ఉపోదయాన్ని ప్రత్యేకాంధ్ర నవోదయంతో సరిపోలుస్తూ "ఆంధ్ర ప్రత్యేక రాష్ట్రాసక్తి చాటించె మీద పికంబులు పంచమ స్వనమున" అని ప్రకటించారు. 1917లోగాడె జగన్నాథస్వామి ఆంధ్రాభిమానాన్ని తన "ఆంధ్రదేశ ప్రశంస"లో ఉచ్ఛస్థితికి తీసుకొని వెళ్ళారు. మద్రాసు రాష్ట్రంలో ఆంధ్రుల బాధలను నెమరు వేసుకుంటూ ఆయన "ఆంధ్రమాత చెన్నరాష్ట్రంబునను జేరి చెడగనేల, వంగ దేశంబువలె స్వయం వ్యక్తిగల్గి" వర్థిల్లాలని ఉద్ఘాటించారు. బెంగాలు విభజన వ్యతిరేకాందోళన ఫలిత ప్రభావం ఈ కవితలో ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. కవులు ఆంధ్రాభిమానాన్ని మాత్రమే కాక తొలి ఆంధ్ర మహాసభలందు కొరవడ్డ ఉత్సాహాన్ని ఎత్తి చూపే ప్రయత్నం చేశారు. బడమగుంట శివరామయ్య గారు రాసిప "ఆంధ్రమాతృ విలాపము" ఇలాంటి కవితే. ఆయన వంగ దేశీయుల లాగే ఆంధ్రుల్లో కూడా ఉద్యమ స్థాయిలో కదలికరావాలని తన కవిత ద్వారా ప్రబోధించారు.

ఇంతకు ముందే పేర్కొన్నట్లు, మొదటి అఖిలాంధ్ర మహాసభకు ఏర్పాట్లన్నీ పూర్తై 1913లో ఆ సభ బాపట్లలో జరిగింది. 800 మంది ప్రతినిధులు, నాగపూర్, వరంగల్, హైదరాబాద్ నగరాల నుండి పరిశీలకులు వచ్చారు. బి.యన్. నరసింహేశ్వరశర్మ గారు అధ్యక్షత వహించారు. ప్రత్యేకాంధ్ర తీర్మానాన్ని వేమవరపు రామదాసు పంతులు ప్రతిపాదిస్తే న్యాపతి సుబ్బారావు, మోచర్ల రామ చంద్రరావు వంటి వారు వ్యతిరేకించారు. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర భావన ఆనాటి పరిస్థితుల్లో అనుచితమని, దీని తర్వాత సభలో చర్చకు వాయిదా వేయాలని తీర్మానించారు. ఆ తీర్మానాన్ని సభ ఆమోదించి, దీనిపై ప్రజాభిప్రాయాన్ని సేకరించాలని పేర్కొంది. దీనిలో భాగంగా తెలుగు జిల్లాలన్నింటిలో దీనిపై చర్చ ప్రారంభమైంది. గుంటూరు, విజయవాడ, గోదావరి, విశాఖ జిల్లాల్లో ప్రత్యేకాంధ్రకు అనుకూలత వచ్చింది. నెల్లూరులో ప్రత్యేకాంధ్ర సమయ మింకా రాలేదని అనేకులు పేర్కొన్నారు. రాయలసీమ ప్రాంతంలో స్తబ్దత నెలకొన్నందు వల్ల కొండా వెంకటప్పయ్య గారి అధ్యక్షతన ఒక ప్రతినిధి వర్గం అక్కడ పర్యటించి ప్రత్యేకాంధ్ర ఆవశ్యకతను వివరించింది. ఈ కార్యకలాపాలన్నింటి మూలంగా ప్రత్యేకాంధ్ర రాష్ట్ర భావన ఉద్యమ రూపాన్ని సంతరించుకోవడానికి సిద్ధమైంది.

BRAOU

**అభ్యాసం**

ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కావాలని ఆంధ్రులు ఎందుకు కోరుకున్నారు ?

## 5.5 ఉద్యమ దశ

బాపట్లలో జరిగిన ప్రథమాంధ్ర మహాసభ తర్వాత కార్యకలాపాలు ఊపందుకున్నాయి. ఆంధ్ర రాష్ట్ర భావనను బలపరుస్తూ పట్టాభి సీతారామయ్య "హిందూ" పత్రికలో వ్యాసాలు ప్రకటించాడు. ఇతర ఆంగ్ల పత్రికలు సైతం ఈ వాదాన్ని బలపరచాయి. కలకత్తా నుండి వెలువడే"హిందూస్థాన్ రెవ్యూ", మద్రాసు నుండి ప్రచురితమయ్యే మరో పత్రిక "ఇండియన్ పేట్రియట్" ప్రత్యేకాంధ్ర రాష్ట్రాన్ని సమర్థిస్తూ వార్తలు రాశాయి. రాయప్రోలు సుబ్బారావు "నాదుజాతి నాదేశము నాదు భాష, అను అహంకార దర్శనమందు ఆంధ్ర" అని ఆంధ్ర జాత్యభిమానాన్ని అత్యంత స్పష్టంగా ప్రకటించారు. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర భావన త్వరితగతిన వేగం పుంజుకోనారంభించింది. ఈ నేపథ్యంలో 1911లో బెజవాడలో ద్వితీయాంధ్ర మహాసభ జరిగింది. న్యాపతి సుబ్బారావుగారు అధ్యక్షత వహించారు. వేలాది మంది ప్రజలు, ప్రతినిధులు సభకు హాజరైనారు. ఈ సభలో మరలా ప్రత్యేకాంధ్ర తీర్మానాన్ని ప్రతిపాదించారు. మునుపటి సభలో వ్యతిరేకంగా ఉన్న సుబ్బారావు, మోచర్ల రాంచంద్రరావు లాంటివారు ఈసారి తీర్మానాన్ని ఆమోదించారు. "మద్రాసు రాజధాని లోని తెలుగు జిల్లాలను ప్రత్యేక రాష్ట్రంగా చేయటం వాంఛనీయం. సమితులను స్థాపించుట మొదలగు మార్గములచే ఈ చర్య విషయమున ప్రజాభిప్రాయములను ఏకముఖము గావించుట యావశ్యకము" అని తీర్మానించారు. ప్రత్యేక ఆంధ్ర భావన క్రమంగా ఘనీభవించడం ఈ తీర్మానం చే గమనించవచ్చు. మరుసటి సంవత్సరం, అంటే 1915లో , విశాఖ పట్నంలో జరిగిన మూడో ఆంధ్ర మహాసభ ఈ తీర్మానాన్ని మరింత సూటిగా తయారు చేసింది. ఈ సభ పానగల్లు రాజాగారి అధ్యక్షతన జరిగింది. మద్రాసు రాజధానిలోని పదకొండు తెలుగు జిల్లాలను ప్రత్యేక రాష్ట్రంగా రూపొందించడం యుక్తం, న్యాయం, అవశ్యకమని తీర్మానించారు. ఇదే తీర్మానాన్ని మరింత స్పష్టంగా 1916 కాకినాడలో నాలుగో ఆంధ్రమహాసభలో ప్రకటించారు. " యుద్ధానంతరం సాధ్యమైనంత త్వరలో ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తూ" సభవారు తీర్మానించారు. ఈ ప్రత్యేక తీర్మానాలతో ఆంధ్ర రాష్ట్ర భావన ఉద్యమ రూపును సంతరించుకొంది. కాకినాడ సభలో అనేకమంది ప్రతినిధులతో, ఆనాటి ప్రముఖ కవులు కూడా పాల్గొన్నారు. అలాటి వారిలో తిరుపతి వెంకటకవులు ద్వయంలో ఒకరైన దివాకర్ల తిరుపతి శాస్త్రి ఒకరు. ఆసభ వాతావరణం, ఆంధ్రోద్యమ స్ఫూర్తితో ఉత్తేజితులై అయన ఆశువుగా పద్యాలు చెప్పారు. "మన పురోవృద్ధి సాధనం బాలోచించు, సభ లిట్టు లేటేట జరుగుగాక.... సామ్రాజ్య సభలోన నీరీతి మొక్కటి తీర్పుగాక" అన్న ఆశాభావాన్ని ఘంటా పథంగా పేర్కొన్నారు. భాషా ప్రయుక్త రాష్ట్రాలను ఆంగ్ల ప్రభుత్వం వారు త్వరలోనే చేయాలని కూడా అయన తన ఆశువుల్లో అభ్యర్థించారు. ఆంధ్రోధ్యమం మెల్లమెల్లగా పరుగులిడటం ప్రారంభమైంది.

BRAOU

### 5.5.1 ఆంధ్రోధ్యమం విస్తృతి

ఆంధ్రోద్యమాన్ని మరింత పటిష్టం చేయడానికి 1917లో బి.యన్.శర్మగారి అధ్యక్షతన ఆంధ్ర రాజకీయ సమితి ఏర్పడింది. దీని వెనువెంటనే, అదే సంవత్సరంలో నెల్లూరులో ఐదో ఆంధ్రమహాసభ జరిగింది. ప్రముఖ న్యాయవాది, గురజాడ అప్పారావుగారి ఆప్త మిత్రుల్లో ఒకరైన వంగోలు వెంకటరంగయ్య ఆహ్వాన సంఘ అధ్యక్షునిగా, మహాసభల సమావేశానికి కొండా వెంకటప్పయ్య అధ్యక్షులుగా ఉన్నారు. ఈ సభలోని ఆంధ్రోద్యమంలో కొన్ని అపస్వరాలు విన్పించాయి. మొదటి నుంచి నెల్లూరు, రాయలసీమ ప్రతినిధుల్లో ఈ ఉద్యమంపై అంత సదవగాహనలేదు. పైగా, రాయలసీమలో తమిళుల ప్రభావం అధికంగా ఉండేది. వీరందరూ కలిసి తీర్మానాన్ని వ్యతిరేకించినా, ప్రత్యేకాంధ్ర తీర్మానం నెగ్గింది. అదే సంవత్సరంలో మాంటెగూ రాజ్యాంగ సంస్కరణలను పరిశీలించడానికి భారతదేశం వచ్చాడు. అప్పటికే ప్రత్యేకాంధ్ర రాష్ట్రంపై చాలా వరకు ఏకాభిప్రాయం సాధించిన ఆంధ్ర మహాసభ సభ్యులు అయన్ను కలిసి, తమ ఉద్దేశాన్ని తెలియచేయాలని భావించారు. మొదట్లో వీరికి అనుమతి నిరాకరించినా, కొంత ఆందోళన తర్వాత ఆంధ్ర మహాసభ రాయబార వర్గాన్ని కలుసుకునేందుకు అవకాశం వచ్చింది. మాంటెగూను కలవడానికి విజయవాడలో ప్రత్యేకాంధ్ర మహాసభను జరిపి, న్యాపతి

సుబ్బారావు ఆధ్వర్యంలో రాయబార వర్గాన్ని నియమించింది. వీరు 1917 డిసెంబరులో మాంటెగూను కలిసి ప్రత్యేకాంధ్ర రాష్ట్రావశ్యకతను వివరించారు. నెల్లూరు సభ తర్వాత, 1918లో కడపలో ఆరో ఆంధ్రమహాసభ జరిగింది. అదే సంవత్సరం జరిగిన మరో ముఖ్య సంఘటన, కేంద్ర శాసన సభలో బి.యన్. శర్మ భాషా ప్రయుక్త రాష్ట్రాల నిర్మాణాన్ని బలపరుస్తూ తీర్మానాన్ని ప్రవేశపెట్టడం. జిన్నా శ్రీనివాసశాస్త్రి వంటివారు ఈ తీర్మానాన్ని వ్యతిరేకించారు. చివరకు అది వీగి పోయింది. ఈ నేపథ్యంలో కృష్ణా, విశాఖ జిల్లాల సంఘాలు ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని నిర్ణయించాయి. 1919లో అనంతపురంలో , 1920లో మహానంది లో జరిగిన ఆంధ్ర మహాసభలు ఆంధ్రరాష్ట్ర తీర్మానాన్ని మరలా ఆమోదించి ఆంధ్రుల ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసాయి.

1920 నాటికి తిలక్ మరణం, జాతీయోద్యమ నాయకత్వం గాంధీ చేపట్టడంలో జాతీయోద్యమంలో మార్పులు ప్రారంభమైనాయి. అఖిల భారత కాంగ్రెసు మహాసభల్లో మొదటి నుండి ఆంధ్ర ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. 1911లోనే ప్రత్యేకాంధ్ర తీర్మానాన్ని కాంగ్రెస్ సభలో ప్రవేశపెట్టితే దాన్ని తమిళులు అడ్డుకొన్నారు. తిరిగి, పట్టాభి సీతారామయ్య 1918లో, తిలక్ సహకారంతో మద్రాసులో తెలుగు మాట్లాడే వారితో ఒక ప్రత్యేక ఆంధ్ర కాంగ్రెస్ నిర్మాణానికి కృషిచేశాడు. ఈ ప్రత్యేకాంధ్ర కాంగ్రెస్ కమిటీకి 1921లో అఖిల భారత కాంగ్రెస్ మహాసభ తన అంగీకారం తెల్పింది. దాదాపు 1930 వరకు కూడా కాంగ్రెస్ సభలతు అనుబంధంగానే ఆంధ్ర మహాసభలు జరుగుతూ వచ్చాయి.

గాంధీ నాయకత్వంలోకాంగ్రెస్ సహాయ నిరాకరణోద్యమం ప్రారంభించింది. ఆనాటి నుండి ఆంధ్రోద్యమం కొంత మరుగున పడింది. పైగా, బెజవాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ మహాసభ, ఆంధ్రుల్లో జాతీయ చైతన్యం కలిగించింది. ఉన్నవగారి "పుల్లరి" సత్యాగ్రహం, ఆంధ్రరత్న దుగ్గిరాల "చీరాల-పేరాల" ఉద్యమం, పర్వతనేని వీరయ్య గారి "పెదనందిపాడు పన్నుల నిరాకరణ", రేపల్లె రేటు పేయర్ల ఆందోళనలతో దేశం మొత్తం దృష్టిని ఆకర్షించారు. ఈ ఉద్యమం ఆంధ్ర,రాయలసీమల్లోని ప్రధాన కేంద్రాలకు విస్తృతమైంది. సైమన్ కమీషన్ బహిష్కరణలో ప్రకాశం, ఉప్పు సత్యాగ్రహ పోరాటంలో ఆంధ్రులు కనబరచిన స్వాతంత్ర్యేచ్ఛ బ్రిటీష్ ప్రభుత్వాన్ని కలవర పరచింది. ఆంధ్రులు ముక్తకంఠంతో కోరుతున్న ప్రత్యేకాంధ్రను ఆంగ్లేయులు తిరస్కరించడానికి ఇదొక ప్రధాన కారణం కావచ్చునని విమర్శకులు అభిప్రాయం. లేకుంటే 1935 నాటికి ఒరిస్సాకు రాష్ట్రప్రతిపత్తినిచ్చిన ఆంగ్ల ప్రభుత్వం, ఆంధ్రులకోర్కెను తిరస్కరించింది. ఒరిస్సా రాష్ట్రం ఏర్పడేటప్పుడు పర్లాకిమిడి లాంటి ప్రాంతాలను తెలుగు ప్రాంతాల్లో, అంటే ఉమ్మడి మద్రాసులో చేర్చాలని గిడుగురామ్మూర్తిగారు చేసిన కృషిని మనం తప్పక జ్ఞాపకముంచుకోవాలి. 68 సంవత్సరాల వయస్సులో ఉత్తర కోస్తాఆంధ్రలో తెలుగువారికి నాయకత్వం వహించి, ఆయన బ్రిటిష్‌వారు ఏర్పరచిన ఓడోనెల్‌సరిహద్దు సంఘం ముందు సాక్ష్యాలుచూపించి, పర్లాకిమిడి ముమ్మాటికి తెలుగు ప్రాంతమేనని సంఘం వారిచేత ఒప్పించి, అనుకూలంగా తీర్పు పొందాడు. పైగా, అక్కడ జరిగిన బోర్డు ఎన్నికల్లో తన ప్రియ మిత్రుడైన పర్లాకిమిడి రాజాను సైతం ధిక్కరించి ఆయన పార్టీకి వ్యతిరేకంగా తెలుగువారి పార్టీ అభ్యర్థులను నిలబెట్టడంలో ఎంతో కృషిచేశాడు. చివరకు తెలుగువారే మెజార్టీ సభ్యులుగా ఎన్నికైనా, సమస్య తీరక పోవడంలో తెలుగు ప్రతినిధి బృందం కూర్మా వెంకటరెడ్డి నాయుడుగారి అధ్వర్యంలో లండన్ వెళ్ళి సంయుక్త పార్లమెంటు సంఘం ముందు సాక్ష్యాలు చెప్పి, సంఘ సభ్యులను కూడా తృప్తి పరచారు. అయితే బ్రిటీష్ వారి తొత్తుగా ఉండి, కాంగ్రెస్ ఉద్యమాన్ని అణచివేస్తానని పర్లాకిమిడి రాజా బానిస పలుకులు పలుకడంతో పర్లాకిమిడిని ఒరిస్సాలో చేర్చే విధంగా ఆంగ్లేయులు నిర్ణయం తీసుకున్నారు. ఒరిస్సా విషయంపై చర్చలు జరుగుతున్నపుడే ఆంధ్రమహాసభ ప్రతినిధులు కూడా తమ ప్రత్యేకాంధ్ర కోర్కెను మోసుకుని లండన్ వెళ్ళారు. బొబ్బిలిరాజా,మోచర్ల రామచంద్రరావు, వి.పి. పాత్రో, వివి.గిరి మొదలైన వారు వి.వి.జోగయ్యతో కలిసి వెళ్ళి ఆంగ్లేయులకు తమ ప్రత్యేక రాష్ట్రవాంఛను వివరించారు. అయితే పర్లాకిమిడి రాజా లాగా మీరెవ్వరూ విదేశీ ప్రమాణాలు చేయకపోవడంతో వీరి రాయభారం విఫలమైంది. 1935లో రాయబారులు వెళ్ళిన దారి వెంటనే తిరిగి వచ్చారు.

BRAOU

## 5.5.2 జాతీయోద్యమ దశలో ఆంధ్రులు - ఉపజాతీయోద్యమం

పైనపేర్కొన్నట్లు, జాతీయోద్యమ దశలో కూడా ఆంధ్రులు తమ ఉప జాతీయోద్యమాన్ని మరవలేదు. అయితే, స్వరాజ్యంలో స్వరాష్ట్రమనే భావన రావడంతో ప్రత్యేకాంధ్ర ఉద్యమం తాత్కాలికంగా నీరుకారిపోయింది. ఇంతేకాక, బ్రాహ్మణేతరోద్యమం ఘనీభవించి "జస్టిస్" పార్టీగా అవతరించి, మద్రాసు రాష్ట్ర రాజకీయాల్లో కొంతకాలం ప్రముఖ పాత్ర పోషించింది. ఆపార్టీలోని తెలుగు సభ్యులు ప్రత్యేకాంధ్రపై పెద్దగా ఆసక్తి కనబర్చలేదు. 1921 నుండి జస్టిస్ పార్టీలో మద్రాసులోఎందరో ప్రముఖ ఆంధ్రులున్నా, ఆంధ్రోద్యమానికి అవసరమైనంత మద్దతు లభించలేదు. 1927లో మద్రాసు శాసనసభలో సుబ్బారాయన్ మంత్రి వర్గ హయాంలో ప్రత్యేకాంధ్ర రాష్ట్ర తీర్మానం ఆమోదింపబడ్డపుడు కూడా జస్టిస్ పార్టీ సభ్యులు తటస్థంగా ఉండిపోయారు. జస్టిస్ పార్టీ మంత్రి వర్గ హయాంలో ఆంధ్రులు సాధించిన ఏకైక విజయం ఆంధ్ర విశ్వవిద్యాలయం ఏర్పాటు అయితే, ఇది ఎంతో మోదాన్ని సమకూర్చినాకొంత భేదాన్ని కూడా మిగిల్చింది.

ఆంధ్ర విశ్వవిద్యాలయ ఏర్పాటు ఆంధ్ర, రాయలసీమ ప్రాంత ప్రజల మధ్య అపోహలు మిగిల్చింది. మొదటినుంచి ఆంధ్రలో ఒక ప్రత్యేక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని ఆంధ్ర మహాసభ కోరుతూనే వచ్చింది. 1917-21 సంవత్సరాల మధ్య కాలంలో మద్రాసు శాసనసభలో దీనిపై తీర్మానం ఆమోదం పొందిన కొన్ని సంవత్సరాల్లో విజయవాడ కేంద్రంగా 1926లో ఆంధ్ర విశ్వ విద్యాలయం ఏర్పాటయింది. మొట్టమొదటి ఉపాధ్యక్షుడుగా కట్టమంచి రామలింగారెడ్డి నియుక్తుడైనాడు. అయితే, విశ్వ విద్యాలయ కేంద్రం గురించి వివాదాలు ప్రారంభమైనాయి. చివరకు, విశాఖపట్నం ప్రధాన కేంద్రంగా ఎన్నుకోబడింది. రాయలసీమలోని కళాశాలల్ని ఆంధ్ర విశ్వవిద్యాలయ పరిధి నుండి తొలగించేట్లు చిత్తూరుకు చెందిన బొల్ల మునుస్వామి నాయుడు తీర్మానాన్ని శాసనసభలో ఆమోదింపచేశాడు. ఆంధ్ర విశ్వవిద్యాలయం చివరకు ఆంధ్రకే పరిమితమైంది. దీంతో రాయలసీమ ప్రజలకు సర్కారు జిల్లాల పట్ల ఆగ్రహం కలిగి, ఆంధ్రుల రాజకీయనాయకత్వంపై అనుమానాలు ప్రారంభమైనాయి. గాడిచర్ల, కడప, కోటిరెడ్డి, ఎం. అనంతశయనం అయ్యంగార్, కల్లూరి సుబ్బారావు, కట్టమంచి మొదలైన వారి అనునయులు కూడా మొదట్లో పనిచేయలేదు. 1930 ప్రాంతంలో కడపనుండి పప్పూవారి రామాచార్లు సంపాదకత్వంలోవెలువడిన"సాధన" వంటి పత్రికలు తమ సంపాదకీయాల్లో "ఒకవేళ ఆంధ్రరాష్ట్రం వస్తే తమిళులు వదిలినా మమ్ము ఆంధ్రులు వదలేట్లు లేరు. ఇంతవరకు అయ్యరులు పాలించారు. ఇప్పుడిక పంతుల్లు పాలిస్తారు. మా బీద మండల ధనం ఉత్తర సర్కారులకు ప్రవహించి పోవుచున్నది" అని శరాలుఎక్కుపెట్టాయి. ఈ కుపిత విమర్శలను సమకాలీకులు ఖండించినా, రాయలసీమ వాసుల్లో అనుమానాలు పోలేదు. ఈ నేపథ్యంలో 1934లో, 1935లో ప్రత్యేక రాయలసీమ సభలు జరిగాయి. వీటిల్లో ఆంధ్రోద్యమ ఊసేఎత్తలేదు. పైగా1935 కడపలోజరిగిన సభలోప్రత్యేకాంధ్రరాష్ట్రం అనే ఆలోచనను వ్యతిరేకించాలని తీర్మానించడం జరిగింది. ఆ వెనువెంటనే 1937లో ఎన్నికలు జరిగి, రాజగోపాలాచారి ముఖ్యమంత్రిగా మద్రాసులో మంత్రి వర్గం ఏర్పడింది. ఆయన మంత్రి మండలిలోని 10 మందిక్యాబినెట్ మంత్రుల్లోను, ముగ్గురు మాత్రమే తెలుగువారు. ప్రకాశం, బెజవాడ గోపాల్‌రెడ్డి, వి.వి.గిరి - ముగ్గురూ ఆంధ్రప్రాంతానికి చెందినవారే. రాయలసీమకు ప్రాతినిధ్యంశూన్యం. ఆంధ్రోద్యమాన్నినీరు గార్చడానికి రాజాజీ పన్నిన పన్నాగమే ఇదని విమర్శలు వచ్చాయి.

ఆంధ్ర, రాయలసీమల మధ్య దురూహలు పోగొట్టే నిమిత్తం ప్రయత్నాలుప్రారంభమైనాయి. 1937లోఆంధ్రమహాసభల రజతోత్సవాలు విజయవాడలో జరిగాయి. ఈ సభలను ఉపయోగించుకొని ఆంధ్ర, రాయలసీమ విభేదాలను రూపుమాపాలని రెండు ప్రాంతాల నాయకులు నడుం కట్టారు. చిత్రమేమిటంటే, రజతోత్సవ సభలను ప్రారంభించిన హాలహర్వి సీతారామిరెడ్డి, సభలకు అధ్యక్షత వహించిన కడప కోటిరెడ్డి ఇరువురూ రాయలసీమ ప్రముఖులే. వారు తమ ఉపన్యాసాల్లో రాయలసీమ ప్రజల అనుమానాలను వ్యక్తీకరించి, రాయలసీమ ప్రాంత రక్షణకు కొన్ని హామీలు కోరారు. ఈ రక్షణల హామీల విషయం పరిశీలించడానికి ఒక సంఘాన్ని నియమించారు. ఈ సంఘంలో ఆంధ్ర,రాయలసీమ ప్రాంతాలకు చెందిన ప్రముఖ సభ్యులందరూ ఉన్నారు. 1937 నవంబరులో నియమితులైన సభ్యులు మద్రాసులోని కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి

BRAOU

నివాస గృహమైన, శ్రీబాగ్‌లో సమావేశమై ఒక అంగీకారానికి వచ్చారు. అందుచేతనే దీనికి "శ్రీబాగ్" ఒప్పందం అని పేరొచ్చింది. ఈ ఒప్పందం ప్రకారం విశ్వవిద్యాలయం కేంద్ర మొకటి అనంతపురంలో ఏర్పాటు కావాలని, నీటి పారుదల, శాసనసభ ప్రాతినిధ్య విషయాల్లో రాయలసీమకు సమాన ప్రాతినిధ్యం ఇవ్వాలని అంగీకారం కుదిరింది. దీనితో ఆంధ్ర, రాయలసీమల మధ్య అపోహలు తొలగిపోయాయి. ఆ వెనువెంటనే మద్రాసు శాసనసభలో ఆంధ్రరాష్ట్ర తీర్మానం ప్రతిపాదించమని ఆంధ్రులు రాజగోపాలచారిని కోరారు. ఆయన ఆంధ్ర, కేరళ, తమిళ, కర్ణాటక రాష్ట్రాలు ఏర్పాటు చేయాలని తీర్మానం ప్రవేశపెట్టి ఆంధ్ర రాష్ట్ర ప్రాధాన్యాన్ని తగ్గించాడు. కానీ, ఈ తీర్మానాన్ని ఆంగ్ల ప్రభుత్వం నిరాకరించింది. దీనికి నిరసనగా బులుసు సాంబమూర్తి తన స్పీకర్ పదవికి రాజీనామా చేశాడు. ఈలోగా 1939లో రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమై ఆంధ్రోద్యమం తిరిగి కొంతకాలం మరుగున పడింది.

కాంగ్రెస్‌నాయకత్వం వల్ల ఆంధ్రోద్యమం వెనుక పడుతున్నదేమోనని కొందరు భావించడం ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకత్వం మార్చాలని కూడా కొందరు కోరారు. ఈ విమర్శల నేపథ్యంలో 1941లో ఆంధ్ర మహాసభలు విశాఖపట్నంలో జరిగి, ఏ పార్టీకి చెందని విజయానంద గజపతి అధ్యక్షుడైనాడు. ఈ సమావేశం ప్రత్యేక రాష్ట్రమేర్పడకుండా ఆంధ్ర బడ్జెట్టును అస్తి, అప్పులను వేరుగా ఉంచాలని కూడా తీర్మానం చేసింది. 1942లో ఆయన మహాసభ ప్రతినిధిగా క్రిప్స్‌రాయబార సంఘాన్ని, బ్రిటిష్ పార్లమెంటరీ రాయబార వర్గాన్ని కలుసుకొని ఆంధ్ర రాష్ట్రావశ్యకతను వివరించారు. గజపతి అధ్యక్షునిగా ఉన్నపుడే, 1943లో రాయలసీమలో ఏర్పడ్డ కరువుకు సంబంధించి ఆంధ్ర మహాసభ కార్యకర్తలు పెద్ద ఎత్తున సహాయక చర్యలు చేపట్టి అందరి అభిమానానికి పాత్రులైనారు. ఇంతలో 1946లో దేశంలో సాధారణ ఎన్నికలు జరిగి అనేక చోట్ల కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలేర్పడ్డాయి. మద్రాసులో కూడా ప్రకాశం గారి నాయకత్వంలో కాంగ్రెస్ మంత్రివర్గం ఏర్పడింది. వెంటనే 1947లోమరలా భాషా ప్రయుక్త రాష్ట్రాల తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీన్నిరాజ్యాంగ నిర్ణాయక సంఘానికి పంపినా దాన్ని స్వతంత్ర భారత రాజ్యాంగంలో చేర్చలేదు. ఇక భాషా ప్రయుక్త రాష్ట్రాలకు పోరాటమే శరణ్యమనే భావన ఎక్కువకావడం ప్రారంభమైంది.

**అభ్యాసం**

జాతీయోద్యమం వెంటే ప్రత్యేక రాష్ట్రోద్యమం ఉపజాతీయోద్యమంగా ఎలా కొనసాగింది ?

## 5.6 పోరాట దశ

ప్రత్యేకాంధ్ర రాష్ట్రం కోసం స్వాతంత్ర్యానంతర కాలంలో పోరాటం తీవ్రమైంది. 1948లో భారత ప్రధాని నెహ్రూ విశాఖపట్నం సందర్శించినపుడు,మొట్టమొదటి సారిగా కాంగ్రెసేతర పక్షాలన్నీ నిరసన ప్రదర్శనను నిర్వహించాయి. ఆంధ్ర రాష్ట్ర విషయం స్థూలంగా పరిశీలించటానికి ఒక సంఘం ఏర్పడగలదని నెహ్రూ హామీ ఇచ్చారు. అదే సమయంలో

BRAOU

కన్నడిగులు, మహారాష్ట్రులు సైతం ప్రత్యేక రాష్ట్రాల కోసం వత్తిడి తెచ్చారు. వీటి ఫలితంగా 1948 జూన్‌లో యస్.కె.ధార్ నాయకత్వంలో ఒక త్రిసభ్య కమిటీ ఏర్పడింది. ధార్ కమీషన్ తన నివేదికను సమర్పించింది. దాంతో అందరూ అసంతృప్తికి లోనైనారు. అనేక చోట్ల నిరసన ప్రదర్శనలు ప్రారంభమైనాయి. ఈ అలజడిని గమనించిన కేంద్రం నెహ్రూ అధ్యక్షునిగా, పటేల్, పట్టాభి సభ్యులుగా జైపూర్ కాంగ్రెస్ సభలోఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ నివేదిక జె.వి.పి. రిపోర్టుగా ప్రసిద్ధి పొందింది. ఈ నివేదిక 1949 ఏప్రిల్ నాటికి సిద్ధమైంది. భాషా రాష్ట్రాలు దేశాభివృద్ధికి మంచిది కాదని పేర్కొంటూనే, అత్యధిక ప్రజల అభిప్రాయాలు ఇందుకు సుముఖంగా ఉంటే, దాన్ని సానుభూతితో పరిశీలించడం జరుగుతుందని హామీ ఇచ్చింది. ఆంధ్ర విషయంలో మాత్రం, మద్రాసు నగరాన్ని ఆంధ్రులు వదులుకోవడానికి ఒప్పుకుంటే రాష్ట్రనిర్మాణం చేయవచ్చని నివేదిక అభిప్రాయ పడింది. దీంతో మరోసారి ప్రాంతీయ భేదాలు తలెత్తాయి.

### 5.6.1 నిరసన స్వరాలు

మద్రాసు లేకుండా ఆంధ్రరాష్ట్రాన్ని రాయలసీమ ప్రజలు అంగీకరించక పోవచ్చు. దీనికితోడు మద్రాసును వదులుకోవడానికి ప్రకాశం ఒప్పుకోలేదు. అప్పట్లోఆంధ్ర కాంగ్రెస్ అధ్యక్షునిగా ఉన్న ఆచార్యరంగా, జె.వి.పి. నివేదికను చర్చించడానికి 1949లో బెజవాడలో అఖిలాంధ్ర కాంగ్రెస్ సర్వసభ్య సమావేశంఏర్పాటు చేసి,మద్రాసు నగరంపై తమ హక్కులను ఆంధ్రులు వదులుకోవడం అసాధ్యంగా కనిపిస్తున్నదని మొదట తీర్మానించారు. అనంతరం అఖిలాంధ్ర సమావేశం జరిగింది. మద్రాసు తాత్కాలిక రాజధానిగా వివాదరహితమైన 12 తెలుగు జిల్లాలలో ప్రత్యేకాంధ్ర రాష్ట్రనిర్మాణం జరగాలని, వివాదగ్రస్త ప్రాంతాలను నిర్ణయించడానికి సరిహద్దు సంఘు నిర్ణాయక సంఘం ఏర్పాటు అవసరమని మహాసభ అభిప్రాయ పడింది. అదే సంవత్సరం సెప్టెంబరు నెలలో గాడిచర్ల హరిసర్వోత్తమరావు గారి నాయకత్వాన ప్రతినిధి వర్గం కేంద్ర కాంగ్రెసు నాయకుల మద్దతుకు రాయబారానికి వెళ్ళి ఆనాటి హోమ్ శాఖామాత్యులు సర్దార్ పటేల్‌కు తమ వాదనను వినిపించింది.

ఈ రాయబారాల తర్వాత, చివరకు కేంద్ర ప్రభుత్వ సూచనలతో మద్రాసురాష్ట్రప్రభుత్వం 8 మంది సభ్యులతో 1949లోవిభజన సంఘాన్ని నియమించింది. ఈ సంఘం సభ్యుల్లో కూడా మద్రాసు నగరంపై అభిప్రాయ భేదాలు వచ్చాయి. మద్రాసు నగరంలో 30శాతం మంది తెలుగు వారు ఉన్నారు. సైమన్ కమీషన్ వ్యతిరేక ప్రదర్శనకు ఆంధ్రులు నాయకత్వం వహించినందువల్ల జనాభాలెక్కల్లో అనేక మంది ఆంధ్రులను తెలుగువారిగా నమోదు చేయలేదని ప్రకాశం వాదన. ఉప్పుసత్యాగ్రహాన్ని కూడా నగరంలో ఆంధ్రులే నిర్వహించారు. ఈ కారణాల వల్ల నగర విషయంలో,ఆస్తుల పంపక విషయంలో తెలుగు వారికి పూర్తి లబ్ధి చేకూరాలని ప్రకాశం గారు వాదించారు. ఆయన తన అసమ్మతిని "డీసెంట్ నోట్" రూపంలో సమర్పించారు. దీన్ని ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ అంగీకరించింది. దీనికి తోడు రాజాజీ, కామరాజ్‌నాడార్ మద్దతుతోనే "తమిళమురసు" పత్రిక ఆంధ్రులపై ద్వేషం రెచ్చగొట్టే విధంగా వ్యాసాలు రాయడం జరిగిందని విమర్శకుల భావన. దీనికి ప్రతిగా త్రిపురనేనిరామస్వామిచౌదరి వంటి హేతువాద రచయితలు కూడా మితిమీరిన, హద్దులుమీరిన స్వాభిమానంతో కవితలు ప్రచురించడం ప్రారంభించారు. ఆయన ఒకానొక గీతంలోతమిళులపై ద్వేషాన్ని వెళ్ళ గక్కుతూ

" చెన్నపురము మాదేరా
చెంగల్ పట్టుమాదేరా
కాదని వాదుకు వస్తే తంజావూర్ దాకా మాదేరా
దేవకోట మాదేరా
పుదుక్కోట మాదేరా
కాదనివాదుకు వస్తే కాంచీ దాకా మాదేరా!"

అంటూ కదం తొక్కారు. రాయప్రోలుసుబ్బారావు "త్యాగరాజు కీర్తనలను దృష్టిలో ఉంచుకొని "తన గీతి అరవ

BRAOU

జాతిని పాటకులనుగా దిద్ది వర్ధిల్లిన తెలుగువాణి" అని అంటారు. అదే రీతిలో జాషువా గారు "అరవ పాటలకు తరచుగా ప్రాణమువోసి,కులికే నీ చిన్నారి తెలుగువాణి" అని తమిళాన్ని ఎద్దేవ చేయడం ప్రారంభించారు. అదే పద్ధతిలో శ్రీనివాస సోదర కవులు కూడా కవితలను రచించారు. ఈ అభిమానాతిరేకం కర్లపాలెం కృష్ణారావు కవితలో, మిగతా ప్రజలందరినీ కూడా గేలిచేసి, చిన్నచూపు చూసే స్థాయికి పోయింది. "తెలుగు " అనే భావమే ఆయన్ను ప్రేరేపించింది. ఈ ప్రేరేపణతోనే

"తెలుగు నాడును గొల్వరా తమ్ముడా
తెలుగుగాలిని పీల్చరా
తెలివి గల వాళ్ళంతా తెలుగు వారేనోయ్ తమ్ముడా"

అనిగానం చేశాడు. ఇలాటి ధోరణులకు ఆంధ్రోద్యమమే పునాది అని వేరే చెప్పనక్కర లేదు.

## 5.6.2 ప్రకాశం గారి అసమ్మతి పత్రం

ప్రకాశంగారి అసమ్మతి పత్రం, మద్రాసు విషయంలో తీవ్ర విభేదాలను సాకుగా తీసుకుని కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రస్థాపనను వాయిదా వేసింది. ప్రత్యేకాంధ్ర ఉద్యమానికి మరల సమరం ప్రారంభమైంది. 1951 ఆంధ్ర కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఎన్నికల్లో ఇవి పరాకాష్టనందుకొన్నాయి. పట్టాభి సీతారామయ్య అభ్యర్థి సంజీవరెడ్డి, ప్రకాశంగారి అభ్యర్థిఅయిన రంగాపై విజయం సాధించారు. దీనితో ప్రకాశం, రంగా విడిపోయి "కిసాన్ మజ్దూర్" పార్టీని స్థాపించారు. ఈ విభేదాలకు తోడు మరలా రాయలసీమ వారిలో అనుమానాలు ప్రారంభమైనాయి. 1948 రాయలసీమ మహాసభ అనంతపురంలో ఏర్పాటైంది. అఖిలాంధ్ర రాష్ట్రం ఏర్పడాలని తీర్మానిస్తూనే, అందులో "శ్రీబాగ్" ఒడంబడికను ఉదహరించాలని పేర్కొంది. దీనికి తోడు తమిళనాయకులు కొందరు రాయలసీమ పెద్దలను చేరదీసి, ఆంధ్రరాష్ట్రానికి వ్యతిరేకంగా పురిగొల్పారని ఆరోపణలు వచ్చాయి. రాజకీయ వాదుల స్వార్థం, ప్రాంతీయ ధోరణులు, లక్ష్య సాధనపై ఉమ్మడి దృష్టి లోపం మొదలైన కారణాలతో ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు అవరోహణ క్రమంలో పడింది. ఇన్ని సమస్యలతో ప్రత్యేక రాష్ట్రం రాదని, ఇక గాంధీగారి అహింసాయుత సత్యాగ్రహం. ఆత్మ బలదానమే దీనికి మార్గమని నమ్మి, సర్వోదయ నాయకులైన గొల్లపూడి సీతారామశాస్త్రి (స్వామి సీతారామ్) 1951 ఆగష్టు 15న ప్రత్యేకాంధ్రను కోరుతూ ఆమరణ నిరాహార దీక్షను చేపట్టారు. ఆ సంవత్సరం అక్టోబరు రెండులోగా ప్రత్యేకాంధ్ర రాష్ట్రం ఏర్పడాలని, మద్రాసునగర భవితవ్యం తరువాత మూడేళ్ళలోపు నిర్ణయించాలని ఆయన ప్రకటించాడు. సీతారాం దీక్షతో రాష్ట్రంలో ఆందోళన ప్రారంభమైంది. విద్యార్థులు అన్ని విద్యాలయాల్లో ఆంధ్రాభ్యుదయ వారోత్సవాలు నిర్వహించారు. రాష్ట్రాందోళన కార్యక్రమంలో వారు వెన్నుదన్నుగా నిల్చారు. చివరకు, ఆచార్యవినోబాబావే జోక్యంతో స్వామి సీతారం 36 రోజులతర్వాత దీక్ష విరమించాడు. ఉద్యమం నీరు కారింది. ఈ సమయంలో ప్రధాని నెహ్రూ 1951 డిసెంబరులో నరసరావుపేట, గుంటూరు, ఏలూరు, తాడేపల్లి గూడెం వంటి పట్టణాల్లో పర్యటించారు. ఆయనకు వెళ్ళిన ప్రతిచోటా నిరసనలు ఎదురైనాయి. ఆంధ్ర రాష్ట్రం కావాలంటూ ఉద్యమకారులు నినాదాలు చేశారు. ఆంధ్రులందు పూర్తి ఏకాభిప్రాయం ఉంటే రాష్ట్రం త్వరలోనే ఏర్పడగలదని నెహ్రూ పేర్కొన్నాడు. ఈలోగా 1952 ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల నాటికి ఆంధ్రకాంగ్రెస్, కమ్యూనిస్టులు, సోషలిస్టులు రంగంలో ఉన్నారు. సంవత్సరం క్రితమే ప్రకాశం,రంగా గార్లు కలిసి పెట్టిన పార్టీ బాలరిష్టాలతో మరణించింది. దీంతో ప్రకాశం "ప్రజాపార్టీ" పేరుతో,రంగా "కృషి కార్‌లోక్" పార్టీ పేరుతో వేరు కుంపట్లు వెలిగించారు. ఈ విభేదాల మధ్య ఎన్నికల్లో కాంగ్రెస్ 43, కమ్యూనిస్టులు 41, ప్రకాశం గారు 20, రంగాగారు 15, ఇతరులంతాకలసి 27 సీట్లు గెలుచుకున్నారు. ప్రకాశం,రంగాలు కమ్యూనిస్టులతో కలసి "యునైటెడ్ డెమాక్రట్ ఫ్రంట్" ఏర్పడ్డా, గవర్నర్ రాజగోపాలచారికే ప్రభుత్వం అప్పగించారు. రాజాజీ మరలా తన వివాదగ్రస్త పాత్రను పోషించడం ప్రారంభించి, తమిళులకు న్యాయం చేయబూనుకున్నాడు. అనేక ప్రాజెక్టులను మద్రాసు తరలించ నిర్ణయించారు. దీంతో అసంతృప్తి జ్వాలలు భగ్గుమన్నాయి. మరలా గాంధేయ మార్గం ప్రధానమైంది. చివరి వరకు పోరాటం అనే భావంతో పొట్టి

BRAOU

శ్రీరాములు ఆమరణ దీక్ష ప్రారంభించాడు. అదే సమయంలో తెలుగు కవులు ఆంధ్రోద్యమ తత్వాన్ని పతాక స్థాయికి తీసుకువెళ్ళారు. వేములపల్లి శ్రీకృష్ణగారి గేయం "చేయెత్తిజైకొట్టు తెలుగోడా" కర్తవ్య ప్రబోధంచేసింది. జంపన చంద్ర శేఖరరావు తన "ఆంధ్రజ్వాల" గేయంలో కన్నీరు, రక్తాన్నీ కలిపి కొత్త టానిక్ చేసి, ఆంధ్రులను ఉత్తేజ పరచారు. తన కవితలో ఆయన ఇలా పేర్కొన్నారు.

"నేనుతెలుగువాడను - తల్లి నేల కొరకు
రాల్చు కన్నీళ్ళి రత్నాలరాసులగును
నేను తెలుగు వీరుడ - తల్లి నేల కొరకు
కార్చు రుధిరమ్మెస్వాతంత్ర్య సుధలనొసగు "

## 5.6.3. పొట్టి శ్రీరాములు నిరాహారదీక్ష

పొట్టి శ్రీరాములు ప్రముఖ గాంధీ శిష్యులు. శ్రీరాములు వంటి వారు పదిమందితో స్వరాజ్యం ఒక్క రోజులో సాధించగలనని గాంధీ గారే గర్వంగా చెప్పారు. స్వపరిపాలనలో కూడా పొట్టి శ్రీరాములకు స్వరాష్ట్ర సంపాదనకు 58 రోజులు పట్టింది. 1952 అక్టోబరు 19న ప్రారంభించిన నిరాహారదీక్ష ఆయన ప్రాయోప వేశంతో డిసెంబరు 15న ముగిసింది. ఆంధ్ర అగ్ని గుండం అయింది. గాంధీగారి వాదం మరణించడంతో అదే స్థానంలో విధ్వంసం విచ్చలవిడి అయింది. రుధిరమే కాక ప్రాణాలుపొయ్యాయి. కేంద్రం కళ్ళుకిందికి దిగాయి. చివరకుతన్ను తాను నిజమైన ప్రజాస్వామ్య వాదిగా రుజువు చేసుకొంటూ, 1952 డిసెంబరు 19న నెహ్రూ లోక్‌సభలో ప్రత్యేకాంధ్ర ప్రకటన చేశారు. రాష్ట్ర నిర్మాణానికి జస్టిస్ కైలాస్ నాథ్ వాంఛూకమిటీనీ 1953లో నియమించారు. కమిటి శ్రీకాకుళం, విశాఖపట్నం, ఉభయ గోదావరులు, కృష్ణ, గుంటూరు, నెల్లూరు, చిత్తూరు ,కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలు, బళ్ళారిలోని ఆలూరు, ఆదోని, రాయదుర్గ తాలూకాలతో రాష్ట్ర నిర్మాణాన్ని సూచించింది. ఇదే సమయంలో మరలా రాజధాని విషయంలో విభేదాలు తలెత్తాయి. చివరకు ప్రకాశం గారు కర్నూలును రాష్ట్రరాజధానిగా పేర్కొంటూ తీసుకున్న నిర్ణయంతో, ఆయనే ముఖ్యమంత్రిగా 1953 అక్టోబరు 1న ప్రత్యేకాంధ్ర రాష్ట్రం ఏర్పడింది. తొలిశాసనసభ సమావేశాల్లో మరలా రాజధాని విషయమై వాగ్వివాదాలు జరిగాయి. దీనికి సమాధానంగా ప్రకాశం రాష్ట్ర భవిష్యత్తునువిప్పి చెప్పారు. "కర్నూలు పట్టణం శాశ్వత రాజధాని కాదు. ఇది తాత్కాలికమైంది. నాకు త్వరలో విశాలాంధ్ర రాగలదన్న విశ్వాసం వున్నది. అపుడు మనకు శాశ్వత రాజధానిగా హైదరాబాదు ఉంటుంది. అది 2, 3 ఏండ్ల కన్నా ఎక్కువ కాలం పట్టదు కూడ" అని ప్రకాశం పేర్కొన్నాడు. ఆనాటికే తెలంగాణాలో విశాలాంధ్రకై నాయకులు చేస్తున్న కృషి తప్పక ఫలిస్తుందనే నమ్మకంతోనే ప్రకాశం ఆ విధంగా సూచించాడు. ఆయన నమ్మకం వమ్ముకాలేదు.

తెలంగాణా ప్రాంతంలో ఆంధ్రోద్యమం రెండు కోణాల్లోసాగింది. ఒకటి నిజాం వ్యతిరేక పోరాటం. రెండు విశాలాంధ్రోద్యమం. నిజాం పరిపాలనలో ఆంధ్ర భాషా, సంస్కృతులకు స్థానం పూజ్యం అయింది. ఆ పరిస్థితిని పోగొట్టే దిశలో 1901లో ఏర్పడ్డ శ్రీకృష్ణ దేవరాయ ఆంధ్రభాషా నిలయం. ఆ తర్వాత విజ్ఞాన చంద్రికా మండలి కొంత కృషి చేశాయి. 1921 నవంబరులో ప్రథమంగా ఆంధ్ర జనసంఘం ఏర్పడింది. మరుసటి సంవత్సరంలోనే, అంటే 1922లో కె.వి.రంగారెడ్డి అధ్యక్షతన సంఘం సమావేశం జరిపి, నియమావళిని ఏర్పరుచుకొని, నిజాం రాష్ట్రాంధ్ర జనసంఘం పేరుతో చెలామణికావడం ప్రారంభమైంది. మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, మాదుముల నరసింగరావు, ఆదిరాజు వీరభద్రరావు వంటి ప్రముఖులు ఇందులో సభ్యులు. ఈ జన సంఘమే రానురాను విశాల ప్రాతిపదికపై నిజాం రాష్ట్రాంధ్ర సంఘంగా తెలంగాణా మొత్తం శాఖలుగా ఏర్పడి, ఉద్యమాన్ని ఉధృతం చేసింది. మొదట్లో గ్రంథాలయాలు, కళాశాలలు, పాఠశాలలు, విద్యార్థులకు చేయూత, చరిత్ర గ్రంథాలు ప్రచురణ, వెట్టిచాకిరి నిరసన, కర పత్రాలు, పుస్తకాల ద్వారా విజ్ఞానాన్ని వ్యాపింప చేయడం మొదలైన విద్యా , వైజ్ఞానిక సమస్యలను మాత్రమే సంఘం చేపట్టింది. రాను రాను రాజకీయ మార్గంలో ప్రవేశించింది. ఈ

ఉద్యమానికి మద్దతుగా "నీలగిరి పత్రిక", 1926లో స్థాపితమైన "గోలకొండ" వంటి పత్రికలు పెట్టని కోటగా నిలచాయి.

### 5.6.4 నైజాం ప్రాంతంలోని ఆంధ్ర మహాసభ కార్యకలాపాలపై నిషేధాజ్ఞలు

నైజాం ప్రాంతంలోని ఆంధ్ర మహాసభ కార్యకలాపాలపై నిషేధాజ్ఞాలుండేవి. 1931లో నిజామాబాద్‌లో మాదుముల నరసింగరావు అధ్యక్షతన సమావేశమైన ఆంధ్రమహాసభ నిజాం రాష్ట్రాంధ్రుల ఆశయాన్ని సూచన ప్రాయంగా తెలిపింది. వెంటనే హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెస్ నిర్మాణాన్ని చేపట్టారు. కానీ, 1938లో నిజాం ప్రభుత్వం దీన్ని నిషేధించింది. ఆ తర్వాత ఐదు సంవత్సరాలకు, 1943లోఆంధ్ర సారస్వత పరిషత్ ఏర్పడి తెలుగు భాషా, సంస్కృతుల వికాసానికి నిజాంపాలిత తెలంగాణాలో చారిత్రక కృషిసల్పింది. తరువాయి మూడు సంవత్సరాలకే (1947) స్వాతంత్ర్యం వచ్చింది. కానీ నిజాంలొంగలేదు. ఆ తరుణంలో నిజాం సైనికులు, మతాభినివేశంతో రజాకార్లు ప్రజలను క్రూరంగా హింసించడం ప్రారంభించారు. దీనికి వ్యతిరేకంగా కమ్యూనిస్ట్‌ల పిలుపుతో 1947 సెప్టెంబరులో ప్రజాసాయుధ పోరాటం ప్రారంభమైంది. నిజాం నిరంకుశత్వాన్ని పారదోలటమే ప్రజాపోరాట లక్ష్యమని కమ్యూనిస్ట్ పార్టీ, ఆంధ్ర మహాసభలు పిలుపునిచ్చాయి. నిజాం చిత్ర హింసల రాజ్యంలో సామాన్య మానవుడు సైతం కవిత్వాలు చెప్పి రక్తాన్ని ఉడుకెత్తించినవారే. యాదగిరి "బండెనక బండికట్టి .... నైజాము సర్కరోడా, గోలకొండ ఖిల్ల కింద గోరీ కడ్తం కొడుకో" అంటూనిరసన గీతం విన్పించాడు. "లాఠీ దెబ్బల లక్ష్యమేమీ, కఠినశిక్షయె కాదు కాదు,చావుకైనను జంకనీయదు" అంటూ కాళోజీనారాయణ రావు గర్జించాడు. మరోప్రజాకవి దాశరధి "పెన్నును గన్నుగా" ప్రయోగించాడు. "ఓ నిజాం పిశాచమా! కానరాడు, నిన్ను బోలినరాజు మాకెన్న డేని, తీగలను తెంపి అగ్నిలో దింపినావు, నా తెలంగాణ కోటి రత్నాల వీణ" అని ఆయన చేసిన ప్రబోధం జైలు గోడలను చీల్చుకు వచ్చింది. ప్రజల చెవుల్లో ప్రతి ధ్వనించింది. ఆనాడు నిజాం వ్యతిరేకంగా జరిగిన గెరిల్లా పోరాటాన్ని కె.వి. రమణారెడ్డి, గంగినేని సోమసుందర్‌వంటి ఇతర కవులు సమర్థించారు. ఆరుద్ర "త్వమేవాహం" రచనకు తెలంగాణా విప్లవ పోరాటమే ప్రోద్బలం. ప్రజా పోరాటం ఫలించి 1948లో పోలీసు చర్య అనంతరం విశాలాంధ్ర మహాసభలు ప్రారంభమైనాయి. 1950లో వరంగల్లులో జరిగిన సభలో హైదరాబాదు రాజధానిగా విశాలాంధ్ర నిర్మాణం జరగాలని తీర్మానించారు. 1952 ఎన్నికల్లో హైదరాబాదు రాష్ట్రంలో బూర్గుల రామకృష్ణారావు నాయకత్వంలో కాంగ్రెస్ మంత్రి వర్గమేర్పడి విశాలాంధ్రపై చర్చ ముమ్మరమైంది.

### 5.6.5 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు, 1956లో ఆంధ్రప్రదేశ్ ఆవతరణ

1953లో ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు తర్వాత అదే సంవత్సరం డిసెంబరులో ఫజల్ ఆలీ నేతృత్వంలో భాషా సంయుక్త రాష్ట్రాల కమిటీని కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ 1954లో హైదరాబాదు పర్యటించి వివిధ వర్గాల అభిప్రాయం స్వీకరించింది. తన నివేదికలో హైదరాబాదు రాష్ట్ర విభజనను (తెలుగు, కన్నడ, మరత్వాడా ప్రాంతాలుగా) విశాలాంధ్ర స్థాపననూ ఆమోదించింది. కానీ, చిత్రంగా సమైక్య రాష్ట్రంలో ఆర్థిక, విద్యా రంగాల్లో వెనుకబడిన తెలంగాణాకు అన్యాయం జరుగుతుందన్న కె.వి. రంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డిల వాదనను కూడా బలపరిచింది. కాబట్టి 1961లో ఏర్పడే తెలంగాణా శాసనసభలో మూడింట రెండు వంతుల మంది సభ్యులు సమర్థిస్తే, తెలంగాణా ప్రాంతాన్ని ఆంధ్ర రాష్ట్రంలో సంలీనం చేయొచ్చని, అంత వరకు అది ప్రత్యేక రాష్ట్రంగా ఉండాలని ఈ సంఘం సిఫారస్సు చేసింది. ఈ నివేదికలోని ప్రత్యేక తెలంగాణా అంశాన్ని కమ్యూనిస్టులు, తెలంగాణాలోని అత్యధిక కాంగ్రెస్ సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించి, హైదరాబాదు శాసనసభలో విశాలాంధ్ర తీర్మానాన్ని ప్రవేశపెట్టి 103-229 ఓట్లతో దానిని గెలిపించారు. అప్పటికే రంగారెడ్డి, చెన్నారెడ్డి మొదలైన ప్రత్యేక తెలంగాణా నాయకులమధ్య అభిప్రాయ భేదాలు తొలగించడానికి రెండు ప్రాంతాల ప్రతినిధులతో కాంగ్రెసు' అధిష్ఠాన వర్గం ఢిల్లీలో సమావేశంఏర్పాటు చేసింది. 1956 ఫిబ్రవరి లో జరిగిన ఈ సమావేశంలో ఒక ఒప్పందం కుదిరి దానికి "పెద్ద మనుషుల ఒప్పందం" అని పేరు వచ్చింది.

BRAOU

## 5.6.6 పెద్ద మనుషుల ఒప్పందం

పెద్ద మనుషుల ఒప్పంద సంఘంలో ఆంధ్ర ప్రాంతాల నుండి ముఖ్యమంత్రి బెజవాడ గోపాలరెడ్డి, సంజీవ రెడ్డి, గౌతులచ్చన్న, అల్లూరి సత్యనారాయణరాజు, తెలంగాణా నుండి హైదరాబాదు ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, కొండా వెంకటరెడ్డి, మర్రిచెన్నారెడ్డి, జె.వి. నరసింగరావు సభ్యులుగా ఉన్నారు. రాష్ట్రపరిపాలన, తెలంగాణా అభివృద్ధి, సాధారణ, సాంకేతిక విద్యలు, ఉద్యోగాలు, ఉర్దూభాష, వ్యావసాయిక భూములు, తెలంగాణా ప్రాంతీయాభివృద్ధి మండలి, రాష్ట్ర ప్రభుత్వ మంత్రి వర్గంలో ఆంధ్ర తెలంగాణాల నిష్పత్తి మొదలైన అంశాలపై ఈ ఒప్పందం ద్వారా రెండు వర్గాల వారు అంగీకారానికి వచ్చారు. ఒప్పందంపై సంతకాలు జరిగి విశాలాంధ్ర ఏర్పాటుకు ప్రయత్నాలు ప్రారంభమైనాయి. ఈ విశాలాంధ్ర రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ పేరున నీలం సంజీవరెడ్డి తొలి ముఖ్యమంత్రిగా 1956 నవంబరు1న అవతరించి, కార్య నిర్వహణ ప్రారంభించింది. ఆంధ్ర ప్రదేశ్ అవతరణ ఎంతో మందిని ఉత్తేజితుల్ని చేసింది. అందరూ ముక్త కంఠంతోవిశాలాంధ్ర గానం ప్రారంభించారు. దాశరధి "ఎన్నినాళ్ళస్వప్నమిది సత్యమైనది, ఎన్నినాళ్లపిలుపుకిది జవాబు" అని హర్షాతిరేకంవ్యక్తంచేశాడు. సి. నారాయణరెడ్డికి అదొక "మహానుభవము, ఒక రసావత్సరము"గా తోచింది. ప్రతి ఆంధ్రుని హృదయాన్ని తన హృదయంలో నింపుకొని అయన

" ఈ యపూర్వ ఘటన తోడ
ఎగసి ఎగసి నా ఊహలు
మిన్నందెను నే నైతి స
మీచీన మహారేఖగ
ప్రాచీనాంధ్ర పతాకగ "

అని తన భావావేశాన్నిప్రకటించాడు. మహాకవి శ్రీశ్రీ "పదవోయి తెలుగువాడ, అదే నీ తెలుగు మేడా, సంకెళ్ళులేని నేల, సంతోష చంద్రశాల" అని బంధ విముక్తమై ఆంధ్రప్రదేశ్‌గా అవతరించిన విశాలాంధ్రను వేనోళ్ళ పొగిడాడు.

## 5.6.7 ప్రత్యేక తెలంగాణా ఉద్యమం

ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డ తర్వాత 1969లో ప్రత్యేక తెలంగాణా, 1972లోప్రత్యేకాంధ్రోద్యమాలు వచ్చాయి. 1956లో కుదిరిన "పెద్దమనుషుల ఒప్పందం" దొడ్డ మనుషుల ఒప్పందంగా పూర్తిగా రూపు దిద్దుకోలేదని ఈ ప్రత్యేక ఉద్యమాలు రుజువు చేశాయి. అయితే, అనేకుల కృషి వల్ల ఈ ఉద్యమాలు రెండూ త్వరలోనే సమసిపోయి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనేక రంగాల్లో అభివృద్ధిని సాధించి పురోగమిస్తోంది. విశాలాంధ్ర ఏర్పాటుకు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కృషి చేసిన మహానుభావుల నందరినీస్మరించి, నివాళులర్పించడం ఆంధ్రులందరి ధర్మం.

### అభ్యాసాలు

పెద్దమనుషుల ఒప్పందం లోని ముఖ్యాంశాలేమిటి?

BRAOU

## 5.7 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- ఆంధ్రుల చారిత్రక మహాప్రస్థానంలో గమనార్హమైన ఘట్టాలున్నాయి. అవి 1. చైతన్యదశ, 2. భావనాదశ, 3. ఉద్యమదశ, 4. పోరాట దశ
- బ్రిటీష్‌వారుప్రవేశపెట్టిన నూతన ఆర్థిక ప్రణాళికలు ప్రజల్లో అసంతృప్తి రేకెత్తించటం.
- నూతన ఆంగ్ల విద్యా విధానం, సాంప్రదాయక విద్యా వ్యవస్థను కూకటి వేళ్ళతో పెకళించివేయటం.
- వీరేశలింగం భావాలు సంస్కరణోద్యమానికి దారితీయడం.
- ప్రత్యేకాంధ్రరాష్ట్ర భావం వికసిస్తున్న దశలోప్రేరణ పొందిన కవుల రచనలు.
- జాతీయోద్యమ దశలో ఉపజాతీయోద్యమం.
- ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం పోరాటం సల్పటం - పొట్టి శ్రీరాములు దీక్ష.
- తెలంగాణా ప్రాంతంలో ఆంధ్రోద్యమం, ప్రాంతీయ భేదాలు తల ఎత్తటం, సమైక్య భావంతో ఆంధ్రరాష్ట్ర అభ్యుదయానికి పునరంకితం కావటం.

## 5.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

*30 పంక్తులలో జవాబులు రాయండి.*

1. 19వశతాబ్దం నాటి ఆర్థిక, సాంఘిక పరిస్థితులను వివరించండి.
2. ప్రత్యేకాంధ్రరాష్ట్ర ఆవిర్భావానికి దోహదం చేసిన పరిస్థితుల్ని అంచనా వేయండి?

*15 పంక్తులలో జవాబులు రాయండి.*

1. ఆంధ్ర దేశంపై వందేమాతర ఉద్యమ ప్రభావాన్ని వివరించండి.
2. తెలంగాణా ప్రాంతంలో ఆంధ్రోద్యమం గురించి రాయండి.

BRAOU

# భాగం - 6 ఆంధ్రప్రదేశ్ - భౌగోళిక పరిస్థితులు, సహజ వనరులు

## విషయ క్రమం

6.0 ఉద్దేశం

6.1 ప్రవేశిక

6.2 శీతోష్ణస్థితి, వర్షపాతం

6.3 నదీ వ్యవస్థ, సరస్సులు

6.4 నేలలు

6.5 అడవులు

6.6 వన్య ప్రాణులు

6.7 వ్యవసాయం

6.7.1 ముఖ్యమైన పంటలు

6.7.2 పశు సంపద

6.7.3 సేద్యపు నీటి పారుదల వ్యవస్థ

అభ్యాసాలు

6.8 భూగర్భ స్వరూపం - ఖనిజాలు

6.9 జనాభా - జిల్లాల సమాచారం

అభ్యాసాలు

6.10 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

6.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 5.0. ఉద్దేశం

ఈ భాగం చదవడం పూర్తయ్యేసరికి మీరు :

- రాష్ట్రంలోని శీతోష్ణస్థితి, వర్షపాతాలను వివరించ గలుగుతారు.
- నదులు, సరస్సులు,నేలలు, అడవులు, వన్య ప్రాణులను గురించి తెలుసుకుంటారు.
- రాష్ట్రంలోని వ్యవసాయిక పంటల గురించి, పశుసంపద గురించి, నీటి పారుదల వ్యవస్థ గురించి, మీకు అవగాహన ఏర్పడుతుంది.
- భూగర్భ స్వరూపం,రాష్ట్రంలోని ఖనిజ సంపదల గురించి వివరించ గలుగుతారు.
- రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సంబంధించిన సమాచారాన్ని అక్కడి జనాభా వివరాలను తెలుసుకుంటారు.

## 6.1 ప్రవేశిక

భారతదేశంలోని రాష్ట్రాలలో విస్తీర్ణం, జనాభా సంఖ్యని బట్టి ఆంధ్రప్రదేశ్ ఐదవ పెద్ద రాష్ట్రం. ఆంధ్రప్రదేశ్ $12^0 40^1$ నుంచి $19^0 15^1$ ఉత్తర అక్షాంశాల మధ్య $76^0 50^1$ నుంచి $84^0 45^1$ తూర్పు రేఖాంశాల మధ్యన ఉన్నది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విస్తీర్ణం 2,75,068 చ.కి. ఉంది. తూర్పున బంగాళాఖాతం, పశ్చిమాన మహారాష్ట్ర, కర్ణాటక, ఒరిస్సా, దక్షిణాన తమిళనాడు రాష్ట్రాలు సరిహద్దులుగా ఉన్నాయి. 976 కి.మీ. కోస్తాప్రాంతంలో విస్తరించిన ఆంధ్రప్రదేశ్ భారతదేశ ఉత్తర, దక్షిణ ప్రాంతాలకు వారధి లాంటిది. వరంగల్లు, ఖమ్మం జిల్లాల ద్వారా హిందీ ప్రాంతంతో దీనికి ప్రత్యక్ష సంబంధం ఉంది. రాజకీయంగా రాష్ట్రం మూడు ప్రాంతాలుగా ఉంది. (1) కోస్తా : నెల్లూరు నుండి శ్రీకాకుళం వరకు 9 జిల్లాలు, (2) తెలంగాణా : పది జిల్లాలు, (3) రాయలసీమ: 4 జిల్లాలు ఉన్నాయి. రాష్ట్రాన్ని భౌగోళికంగా మూడు ప్రాంతాలుగా విభజింప వచ్చు. అవి (1) తూర్పు కనుమలు, (2) పశ్చిమ కనుమలు, (3) తీర మైదాన ప్రాంతాలు. తూర్పు కనుమల సరాసరి ఎత్తు 600-1200 మీ. , పశ్చిమ కనుమల సరాసరి ఎత్తు 200-1100 మీ. తూర్పు కనుమలలోని ఎత్తైన పర్వతం మహేంద్ర గిరి (150మీ.) కడపలోని పాలకొండలు, నెల్లూరు లోని వెలిగొండ, చిత్తూరులోని శేషాచలం హార్సిలీ హిల్స్, కర్నూలులోని నల్లమల, విశాఖ పట్టణం లోని సింహాచలం తూర్పు కనుమలలోనివి.

## 6.2 శీతోష్ణస్థితి, వర్షపాతం

ఆంధ్రప్రదేశ్ శీతోష్ణస్థితి సమ శీతోష్ణఋతుపవన రకానికి చెందింది. రాష్ట్ర వాతావరణాన్ని మూడు కాలాలుగా గుర్తించారు. మార్చి నుండి జూన్ వరకు వేసవి కాలం, జూలై నుంచి అక్టోబర్ వరకు వర్షాకాలం, నవంబర్ నుండి ఫిబ్రవరి వరకు చలికాలం, మే నెలలో ఉష్ణోగ్రత అధికంగానూ, జనవరి నెలలో తక్కువగానూ ఉంటుంది. వేసవి కాలంలోగరిష్ట ఉష్ణోగ్రత $37^0C$ నుండి $44^0C$ మధ్య మారుతూ ఉంటుంది. గుంటూరుజిల్లా రెంటచింతల, ఖమ్మం జిల్లా భద్రాచలం, కరీంనగర్ జిల్లా రామగుండం, కృష్ణా జిల్లా విజయవాడలో గరిష్ట ఉష్ణోగ్రత $50^0C$ వరకు కొన్ని సందర్భాలలో రికార్డు అయ్యింది. చలి కాలంలో ఉష్ణోగ్రత $16^0C$ నుండి $19^0C$ మధ్యన ఉంటుంది. సముద్ర మట్టానికి దూరంగా వెళ్ళే కొద్దీ వేసవి కాలంలో వేడిమి, చలికాలంలో చలి అధికంగా ఉంటుంది.

BRAOU

ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు ఒకే విధంగా ఉండవు. ఒక సంవత్సరం వర్షాలు అధికం అయ్యి వరదలు వస్తే, మరొక సంవత్సరం అనావృష్టి వలన కరువు కాటకాలు వస్తుంటాయి. రాష్ట్రానికి వర్షాలు తెచ్చేది నైరుతి, ఈశాన్య ఋతుపవనాలు. నైరుతి ఋతు పవనాల వల్ల (జూన్ నుండి సెప్టెంబర్ వరకు) కురిసే వర్షాలను తొలకరి అంటారు. ఈశాన్యఋతుపవనాల వలన (అక్టోబరు నుండి నవంబర్ వరకు) దక్షిణ ఆంధ్రాలో వర్షాలు ఎక్కువ. రాష్ట్రంలో సాధారణ సంవత్సర వర్షపాతం సుమారు 890 మిల్లీ మీటర్లు. బంగాళా ఖాతంలో ఏర్పడే వాయు గుండాల వలన అక్టోబరు, నవంబరు మాసాలలో పెనుగాలులతో కూడిన తుఫానులు తరుచూ సంభవిస్తుంటాయి.

## 6.3 నదీ వ్యవస్థ, సరస్సులు

ఆంధ్రప్రదేశ్ లోని నదులు పశ్చిమ కనుమలలో పుట్టి తూర్పుగా ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తాయి. రాష్ట్రంలో ముఖ్యమైన నదులు: కృష్ణా, గోదావరి, పెన్నా, తుంగభద్రా, మంజీరా, వంశధార, ప్రాణహిత, మూసీ, నాగావళి.

కృష్ణానది పొడవు 1200 కి.మీ. రాష్ట్రంలో 730 కి.మీ. ప్రవహిస్తుంది. మహబూబ్ నగర్ జిల్లాలో ప్రవేశించి, కృష్ణాజిల్లా లోని హంసలదీవి వద్ద బంగాళాఖాతంలోకలుస్తుంది. కృష్ణాజిల్లా పులిగడ్డ వద్ద రెండుగా చీలిపోతుంది. మధ్యన ఉన్న

ప్రాంతాన్ని దివిసీమ అంటారు. తుంగభద్ర, మూసీ, భీమ, మున్నేరు దీని ఉపనదులు.

దక్షిణ భారత దేశంలో అతిపెద్ద నది గోదావరి. దీని పొడవు 1584 కి.మీ. ఆంధ్రప్రదేశ్‌లో ఆదిలాబాద్ జిల్లా బాసర వద్ద రాష్ట్రంలో ప్రవేశించి రాజమండ్రి వద్ద రెండుగా చీలిపోతుంది. ఆంధ్రప్రదేశ్‌లో 772 కి.మీ. ప్రవహిస్తుంది. ఈ రెండు నదులను వశిష్ఠ గోదావరి, గౌతమి గోదావరి అంటారు. వీటి మధ్య ప్రాంతాన్ని కోనసీమ అంటారు. వశిష్ఠ గోదావరి నరసాపురం వద్ద, గౌతమి గోదావరి యానాం వద్ద బంగాళా ఖాతంలో కలుస్తాయి. పెన్న గంగ, ప్రాణహిత, ఇంద్రావతి, శేషణి, మంజీరా, కిన్నెర సాని దీని ఉపనదులు.

పెన్నా లేదా పినాకిని నది కర్ణాటక లోని కోలారు జిల్లాలో పుట్టిరాష్ట్రం లోని నెల్లూరు జిల్లా ఊటుకూరు వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. కుందేరు,చెయ్యేరు, పాపాగ్ని, చిత్రావతి దీని ఉపనదులు.

తుంగభద్ర - పశ్చిమ కర్ణాటకలోపుట్టిన తుంగ, భద్ర అనే రెండు చిన్న నదులు. ఇవి షిమోగాకు దిగువన కలిసి తుంగభద్రగా కర్నూలు పశ్చిమ సరిహద్దుగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించి, సంగమేశ్వర్ వద్ద కృష్ణా నదిలో కలుస్తుంది.

తెలంగాణాలో ముఖ్యమైన నది మంజీరా. మహారాష్ట్రలోని బాలాఘాట్ జిల్లాలో పుట్టి మెదక్ జిల్లాలో ఆంధ్రప్రదేశ్ చేరి మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో ప్రయాణించి గోదావరిలో కలుస్తుంది. దీని పొడవు 640 కి.మీ.

వంశధార నది ఒరిస్సాలో పుట్టి శ్రీకాకుళం జిల్లాలో ఆంధ్రప్రదేశ్ చేరి కళింగ పట్టణం వద్ద బంగాళా ఖాతంలో చేరుతుంది. దీని పొడవు 244 కి.మీ.

ప్రాణహిత నది మధ్య ప్రదేశ్‌లో పుట్టి ఆదిలాబాద్ జిల్లాలో ప్రవహించి గోదావరిని చేరుతుంది.

మూసీనది హైదరాబాద్‌కు దగ్గరగా వున్న అనంతగిరి కొండల్లో పుట్టి హైదరాబాద్‌లో ఉస్మాన్‌సాగర్ లో కలిసి అక్కడి నుండి ముందుకు సాగి నల్గొండ జిల్లాలో 64 కి.మీ. ప్రవహించి, ఆలేరుని కలుపుకొని వజీరాబాద్ వద్ద కృష్ణాలో కలుస్తుంది. సకలవాణి, ఇసి దీని ఉపనదులు.

నాగావళి ఒరిస్సాలో పుట్టి ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాలో బంగాళా ఖాతంలో చేరుతుంది. ఒట్టిగడ్డ, జంఝావతి, స్వర్ణముఖి, వేదవతి లాంటి చిన్న నదులు నాగావళిని ఉపనదులుగా ఉన్నాయి.

పైన పేర్కొన్న నదులు కాకుండా వివిధ జిల్లాల్లో చిన్న చిన్న నదులు, వాగులు, అనేకం ఉన్నాయి. కరీంనగర్ జిల్లాలోని మూసీవార్, మహబూబ్‌నగర్ జిల్లాలోని దిండి, వరంగల్ జిల్లాలోని పాలేరు, శ్రీకాకుళం జిల్లాలోని బాహుద,వరహాల గడ్డ, ఉత్తర మహేంద్ర, విశాఖ జిల్లాలోని మాచ్‌ఖండ్, చంపావతి, గోస్థని, శారద, తాండవ, తూర్పుగోదావరి జిల్లాలోని ఏలేరు, పశ్చిమగోదావరి జిల్లాలోని ఎర్రకాలువ,తమ్మిలేరు, జిల్లేరు, కృష్ణా జిల్లాలోని బుడమేరు, గుంటూరు జిల్లాలోని నాగులేరు, ప్రకాశం జిల్లాలోని గుండ్లకమ్మ, మూసి,పాలేరు, నెల్లూరు జిల్లాలోని మున్నేరు, ఉప్పుటేరు, చిత్తూరు జిల్లాలోని స్వర్ణముఖి, కర్నూలు జిల్లాలోని హంద్రీ, కుందేరు, సగిలేరు, కడప జిల్లాలోని పాపాగ్ని, చిత్రావతి, చెయ్యేరు, ఆదిలాబాద్ జిల్లాలోని కడెం, పెనుగంగ, ఖమ్మం జిల్లాలోని వైరా, నల్గొండ జిల్లాలోని పెద్దవాగు, ఆలేరు మొదలైన నదులు వాగులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రవహిస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో రెండు ముఖ్యమైన సరస్సులు ఉన్నాయి. ఒకటి కొల్లేరు, రెండవది పులికాట్ సరస్సు. కొల్లేరు మంచినీటి సరస్సు. ఇది కృష్ణా, గోదావరికి దక్షిణంగాను, కైకలూరుకు ఉత్తరంగానూ ఉంటుంది. చేపల పరిశ్రమకు, రెండవ పంటగా వరి సాగుకు ఉపయోగపడుతుంది. చలికాలంలోకొల్లేటి కొంగలు సుదూర ప్రాంతాలైన ఉత్తర ఆసియా నుంచి కొల్లేరుకువలస వస్తాయి.



BRAOU

పులికాట్ ఉప్పునీటి సరస్సు. నెల్లూరు జిల్లాకు, తమిళనాడు రాష్ట్రానికి సరిహద్దున ఉంది. అధిక భాగం ఆంధ్రప్రదేశ్‌లో ఉంది. చేపల పరిశ్రమకు ప్రసిద్ధి.

## 6.4 నేలలు

విభిన్న వాతావరణ పరిస్థితుల వలన, రకరకాల రాళ్ళనుండి నేలలు ఏర్పడుతాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కింద వివరించిన నేలలు ఉన్నాయి.

### ఒండ్రు మట్టి నేలలు

ఇవి ముఖ్యంగా కృష్ణా, గోదావరి డెల్టా ప్రాంతంలోఉన్నాయి. ప్రతి సంవత్సరం క్రొత్త ఒండ్రు వచ్చి చేరుతుంది. అందువలన ఈ నేలలు బాగా సారవంతమైనవి. కృష్ణా, గోదావరి జిల్లాల్లో విస్తరించి ఉన్నాయి.

### నల్లరేగడి నేలలు

రాష్ట్రంలో దాదాపు 50 శాతం విస్తీర్ణంలో ఉన్నాయి. పొటాష్, కాల్షియం ఎక్కువగా ఉండి, నైట్రోజన్, కార్బన్‌లు తక్కువగా ఉంటాయి. ప్రత్తి, నూనెగింజలు, కాయ ధాన్యాలు పండించడానికి ఈ నేలలు అనువైనవి. గుంటూరు, ప్రకాశం, కర్నూలు, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో విస్తరించి ఉన్నాయి.

### ఎర్ర మట్టి నేలలు

రాష్ట్రం మొత్తం మీద 31 శాతం ఎర్రమట్టి నేలలు ఉన్నాయి. ఇనుము, మెగ్నీషియం, కాల్షియం అధికంగా ఉంటాయి. వేరు శెనగ పంటకు అనుకూల మైనవి. రాయలసీమ, తెలంగాణా ప్రాంతాలందు విస్తరించి ఉన్నాయి.

### ఇసుక నేలలు

ముఖ్యంగా తూర్పు, పశ్చిమ కనుమలలోని కొండ ప్రాంతాలలో, కోస్తా ప్రాంతాలలో విస్తరించి ఉన్నాయి. ఐరాన్ ఆక్సైడ్ అధికంగా ఉంటుంది. అధిక వర్షపాతం ఎండలతో కూడిన వాతావరణం సాగు చేసేందుకు అవసరం.

### క్షార మృత్తిక నేలలు

ఇవి ఎక్కువగా కోస్తా ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి. వ్యవసాయానికి అంతగా పనికిరావు. ఇప్పుడిప్పుడు రొయ్యల పెంపకానికి ఉపయోగిస్తున్నారు.

### అభ్యాసం

ఆంధ్రప్రదేశ్‌ని రాజకీయంగాను, భౌగోళికంగాను ఎన్ని ప్రాంతాలుగా విభజించారు? అవి ఏవి?

BRAOU

## 6.5 అడవులు

ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 63,775 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో మాత్రమే అడవులున్నాయి. రాష్ట్ర భూభాగంలో అడవుల శాతం 23 మాత్రమే. భారతదేశంలో అటవీ విస్తీర్ణంలో మధ్యప్రదేశ్, ఒరిస్సా, మహారాష్ట్రల తరవాత ఆంధ్రప్రదేశ్ నాలుగవ స్థానంలోఉంది. రాష్ట్రంలో 53 శాతం అటవీ విస్తీర్ణంతో ఖమ్మం జిల్లా ప్రథమ స్థానంలోఉంది. రాష్ట్రంలో నాలుగు రకాల అడవులు ఉన్నాయి.

### 6.5.1. సమశీతోష్ణ సతతారణ్యాలు

ఇవి శ్రీకాకుళం, విశాఖ పట్టణం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో విస్తరించి ఉన్నాయి.

### 6.5.2 ఆకు రాల్చు అడవులు

ఇవి ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, కడప, కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో విస్తరించి ఉన్నాయి.

### 6.5.3 పొదలలో నిండిన అడవులు

కడప, కర్నూలు, ప్రకాశం, అనంతపూర్, చిత్తూరు జిల్లాల్లో విస్తరించి ఉన్నాయి.

### 6.5.4 కోస్తా తీర ప్రాంత అడవులు

కృష్ణా , గోదావరి డెల్టా తీర ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి.

వెదురు, వంట చెరుకు, బీడీ ఆకులు, అడ్డాకులు, బంక, తేనె, చింతపండు, ఉసిరికాయలు, కుంకుడు కాయలు ప్రధానంగా అడవుల నుండి లభిస్తున్నాయి. టేకు, మద్ది, ఇప్ప, చిరుమాను, భిల్లుడు, చంద్రజాతి వృక్షాలు ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, మెదక్ జిల్లాలోని అడవుల్లో విరివిగా ఉన్నాయి. మామిడి, జామ, మండతంగేడు, ఎర్ర కర్ర జాతి చెట్లు తూర్పు కనుమలలో విస్తరించి ఉన్నాయి. ఎర్రచిందనం, గంధపు చెట్లు చిత్తూరు జిల్లాలోని పాలకొండ, శేషాచలం అడవుల్లో దొరుకుతాయి.

## 6.6. వన్య ప్రాణులు

తెలంగాణా ప్రాంతపు దట్టమైన అడవులలో పెద్ద పులులు, చిరుతలు, అడవి దున్నలు, ఎలుగు బంట్లు ఉన్నాయి. గోదావరి దక్షిణ ప్రాంత అడవులలో మచ్చల జింకలు, అడవి కుక్కలు, అడవి దున్నలు సంచరిస్తున్నాయి. శివంగులు ప్రధానంగా విశాఖ, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లోని అడవులలో ఉన్నాయి. రకరకాల జింకలు, లేళ్ళు, ఎలుగుబంట్లు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అడవుల్లో ఉన్నాయి. ఏనుగులు చిత్తూరు జిల్లాలోని అడవుల్లో విరివిగా ఉన్నాయి. వివిధ జాతుల పక్షులు అనేకం రాష్ట్రంలో ఉన్నాయి.

వన్య ప్రాణులను కాపాడటం కోసం రాష్ట్రంలో 20 ప్రాంతాలను అభయారణ్యాలుగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఏనుగుల కోసం చిత్తూరు జిల్లాలో కాండిన్య వన్య ప్రాణి అభయారణ్యం ఏర్పాటు చేసారు. పులుల కోసం నల్లమల అడవులలో అభయారణ్యం ఏర్పాటు చేసారు. చిత్తూరు, కడప జిల్లాలోని శేషాచలం కొండల్లో జాతీయ పార్కు ఏర్పాటు చేసారు.

BRAOU

విశాఖపట్టణం , తిరుపతి, హైదరాబాదులలో జంతుప్రదర్శన శాలలున్నాయి. ఇతర ముఖ్యమైన సంరక్షణ కేంద్రాలు:

(1) ప్రాణహిత కేంద్రం, ఆదిలాబాద్ జిల్లాలో ఉంది.

(2) సివేలం కేంద్రం ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలో ఉంది.

(3) ఏటూరునాగారం కేంద్రం వరంగల్ జిల్లాలో ఉంది.

(4) మంజీరా మొసళ్ళ కేంద్రం మెదక్ జిల్లాలో ఉంది.

(5) పాకాల, పోచారం కేంద్రాలు వరంగల్ జిల్లాలో ఉన్నాయి.

(6) పులికాట్, నేలపట్టు పక్షుల కేంద్రాలు నెల్లూరు జిల్లాలోఉన్నాయి.

(7) నాగార్జున సాగర్ - శ్రీశైలం కేంద్రం కర్నూలు, నల్గొండ జిల్లాలో ఉంది.

(8) పాపికొండల కేంద్రం ఖమ్మం, గోదావరి జిల్లాల్లో ఉంది.

(9) కిన్నెర సాని, షామీర్‌పేట కేంద్రాలు మెదక్ జిల్లాలో ఉంది.

(10) కోరింగ లేళ్ళ పార్క్ కాకినాడ వద్ద ఉంది.

(11) కొల్లేరు పక్షుల కేంద్రం పశ్చిమ గోదావరి జిల్లాలో ఉంది.

(12) విజయా విహార పార్కు నాగార్జున సాగర్ వద్ద ఉంది.

## 6.7 వ్యవసాయం

BRAOU

ఆంధ్రప్రదేశ్‌లో జల వనరులు, మంచి సాగు భూమి ఉన్నందు వల్ల 70 శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. రాష్ట్ర విస్తీర్ణంలో మొత్తంలో (274.4 లక్షల హెక్టార్లు) సుమారు 23 శాతం (62.87 లక్షల హెక్టార్లు) అటవీ భూమి. మొత్తం సాగుభూమి 1.32 లక్షల హెక్టార్లు. ఇందులో 86 లక్షల హెక్టార్లలో ఆహార ధాన్యాలు, 46 లక్షల హెక్టార్లలో ఇతర ధాన్యాలు పండిస్తున్నారు. రాష్ట్రంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి 1956-57లో 59.17లక్షల టన్నుల నుండి 1993-94కు 122.77 లక్షలకు పెరిగింది. పెరుగుతున్న జనాభా అవసరాలను తీర్చేందుకు 2000 సంవత్సరం నాటికి 185 లక్షల టన్నుల ఉత్పత్తి అవసరం, అని ప్రభుత్వం చెబుతోంది. పట్టుపురుగుల పెంపకం, రొయ్యలు, చేపల పెంపకం, పశుసంవర్ధన రాష్ట్రంలో వేగంగా వృద్ధి చెందుతున్నాయి.

### 6.7.1. ముఖ్యమైన పంటలు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రధానంగా వరి, జొన్న, గోధుమ, కొఱ్ఱ, పెసలు, కంది, సెనెగ, మినుము, ఉలవలు, అలసందలు, వేరు సెనగలు, ఆముదాలు, ధనియాలు, ప్రత్తి , చెరుకు, పొగాకు,మిరప, పసుపు మొదలైన వివిధ రకాల పండ్లు, ఫలాలు పండిస్తున్నారు.

### వరి

రాష్ట్రంలో మొత్తం పంట భూమిలో సుమారు 30 శాతం వరి పండిస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో వరి పండిస్తున్నారు. విస్తీర్ణ శాతాన్ని బట్టివరసగా పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కృష్ణ , నెల్లూరు జిల్లాలు అధిక్యతలో ఉన్నాయి.

ఖరీఫ్, రబీ రెండు కాలాల్లో వరి పండిస్తున్నారు. మూడింట రెండు వంతులు ఖరీఫ్ కాలంలో పండిస్తున్నారు. హెక్టారుకు అధిక దిగుబడి పశ్చిమ గోదావరి జిల్లాలో జరుగుతుంది. వివిధ వరి దిగుబడి విత్తనాలు అందుబాటులో ఉన్నప్పటికీ స్థానిక వ్యవసాయ పరిస్థితులను బట్టి మసూరి, జయ, తెల్లహంస, సోనా, కావేరి, పద్మ, రత్న, ఐ.ఆర్. 8 రకాలు పండిస్తున్నారు.

**జొన్న:** వరి తర్వాత ప్రధాన ఆహార పంట. సుమారు 13.5 శాతం విస్తీర్ణంలో జొన్న పండిస్తున్నారు. భారతదేశంలో విస్తీర్ణం, ఉత్పత్తిలో కూడా రాష్ట్రం నాల్గవ స్థానంలో ఉంది. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో పండిస్తున్నప్పటికి రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, కర్నూలు జిల్లాల్లో ఎక్కువగా పండిస్తున్నారు. కర్నూలు జిల్లాలో హెక్టారుకు హెచ్చు దిగుబడి వస్తుంది. సహజంగా వర్షాధారం కిందనే పండిస్తున్నారు.

**మొక్కజొన్న :** రాష్ట్రంలోని ముఖ్యమైనపంటల్లో మొక్కజొన్న ఒకటి. దేశంలో విస్తీర్ణం రీత్యా ఆరవ స్థానంలో, ఉత్పత్తి రీత్యా ఐదవ స్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉంది. ప్రధానంగా కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో అధికంగా పండిస్తున్నారు. ఎక్కువగా ఖరీఫ్ కాలంలో పండుతుంది. మొక్కజొన్నను కొన్ని ప్రాంతాల్లో ఆహార ధాన్యం గానూ, పట్టణాలలో చిరుతిండి గానూ, పచ్చి కంకులలను పశుగ్రాసంగానూ ఉపయోగిస్తున్నారు. పలురకాల పరిశ్రమల్లో మొక్కజొన్న పిండిని వాడతారు.

**సజ్జ :** జొన్న తరువాత ముఖ్యమైన పంట సజ్జ. దేశం మొత్తం మీద విస్తీర్ణంలో దిగుబడిలో కూడా ఆరవ స్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉంది. రాష్ట్రంలో ప్రకాశం, నెల్లూరు, కడప, శ్రీకాకుళం, జిల్లాల్లో అధికంగా పండిస్తున్నారు. అధిక భాగం ఖరీఫ్ కాలంలో పండిస్తున్నారు. ఇది ఎక్కువగా వర్షాధారపు పంట. కొన్ని ప్రాంతాలలో మిశ్రమ పంటగా జొన్నతోగాని, వేరు శెనగతో గాని పండిస్తున్నారు.

**గోధుమ :** దేశంలో, గోధుమ ముఖ్య ఆహార పంట, అయినప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లో 0.1 శాతం విస్తీర్ణంలో మాత్రమే పండిస్తున్నారు. ఉత్పత్తి రీత్యా దేశంలో 16 వ స్థానంలో ఉంది. రంగారెడ్డి, మెదక్, ఆదిలాబాద్,నిజామాబాద్ జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో పండిస్తున్నారు.

**రాగి:** ఇది కూడా ముఖ్యమైన ఆహారపంట. దేశంలో ఆంధ్రప్రదేశ్ ఉత్పత్తి విస్తీర్ణం రీత్యా మూడవ స్థానంలో ఉంది. శ్రీకాకుళం, విశాఖపట్టణం, ప్రకాశం, అనంతపూర్, చిత్తూరు, మహబూబ్‌నగర్ జిల్లాలు ఉత్పత్తికి ప్రధాన కేంద్రాలు. ఖరీఫ్,రబీ రెండు కాలాల్లో పండిస్తారు. వీటిని వర్షాధారం, నీటి పారుదల ద్వారా పండిస్తున్నారు.

**కొర్ర :** ఇదికూడా ఆహార పంట. ప్రకాశం, కర్నూలు, అనంతపూర్, కడప, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పండిస్తున్నారు. ఖరీఫ్ కాలంలో పండిస్తున్నారు.

**పెసలు :** దీన్ని మిశ్రమ పంటగా పండిస్తున్నారు. అనావృష్టికి తట్టుకుని, అన్ని కాలాలందు పండుతుంది. శ్రీకాకుళం, తూర్పు, పశ్చిమ గోదావరి, నెల్లూరు, కృష్ణా జిల్లాలో అధికంగా పండిస్తారు. హెక్టారుకు అధిక ఉత్పత్తి శ్రీకాకుళం జిల్లాలో జరుగుతుంది.

**కంది :** రాష్ట్రంలో అంతటా పండిస్తున్నారు. ఎక్కువగా మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, అనంతపూర్, ప్రకాశం, గుంటూరు, కర్నూలు, మెదక్, ఖమ్మం జిల్లాల్లో పండిస్తున్నారు. మిశ్రమ పంటగా వర్షాధారంగా పండిస్తారు. హెక్టారుకు అధిక దిగుబడి గుంటూరు జిల్లాలో జరుగుతుంది.

**సెనగలు :** ప్రధాన రబీ పంట. మెదక్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, గుంటూరు, కడప జిల్లాల్లో పండుతుంది.

BRAOU

సెనగ పంటకు ఇతర పప్పు ధాన్యాలకున్నంత ప్రాముఖ్యత లేదు.

**మినుము :** మిశ్రమ పంటగానూ, ప్రత్యేక పంటగానూ పండిస్తారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలలో పండిస్తున్నారు. శ్రీకాకుళం, కృష్ణా, గుంటూరు, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో పండిస్తున్నారు. హెక్టారుకు అధిక ఉత్పత్తి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో జరుగుతుంది.

**ఉలవలు :** పప్పు ధాన్యాలలో పెసర తరువాత స్థానం దీనిదే. ప్రధానంగా పశుగ్రాసం కోసం, పశువుల తిండి కోసం పండిస్తారు. రాష్ట్రం అంతటా పండిస్తారు. శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, ప్రకాశం, కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పండిస్తారు. హెక్టారుకు అధిక దిగుబడి మహబూబ్‌నగర్ జిల్లాలో జరుగుతుంది.

**అలసందలు :** మిశ్రమ పంటగా రాష్ట్రం అంతటా పండిస్తున్నారు. ప్రధానంగా విశాఖపట్నం, ఖమ్మం, పశ్చిమగోదావరి, కర్నూలు, కరీంనగర్ జిల్లాల్లో పండిస్తున్నారు.

**వేరుశెనగ :** నూనె గింజల పంటలోఇది ప్రధానమైన పంట. దేశంలో ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. ఎక్కువగా ఖరీఫ్ పంటగా వర్షాధారంపైపండిస్తున్నారు. నీటి వసతి ఉన్న చోట రబీ పంటగా పండిస్తున్నారు. రాష్ట్రంలో గుత్తి, తీగ, ధార్మా తీగ అని మూడు రకాలు పండిస్తారు. గుత్తి వేరుశనగ స్వల్ప కాలపు పంట. వర్షాధారం, నీటి సరఫరా ద్వారా పండిస్తారు. అధిక వర్షపాతం ఉన్న మెట్ట ప్రాంతాలలో పండిస్తారు. ప్రధానంగా చిత్తూరు, కర్నూలు, కడప, విజయనగరం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పండిస్తారు.

**ఆముదాలు :** దేశంలో అత్యధిక విస్తీర్ణంలో పండించే రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. మిశ్రమ పంటగానూ, ప్రత్యేక పంటగానూ పండిస్తారు. తక్కువ వర్ష పాతం గల మెట్ట ప్రాంతాలు అనువైనవి. "అరుణ" అనే మెట్ట రకపు విత్తనాన్ని అధికంగా సాగుబడి చేస్తున్నారు. నల్గొండ, మహబూబ్‌నగర్, ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో అధికంగా పండిస్తున్నారు.

**ధనియాలు :** ముఖ్యమైన మసాలా దినుసు. కడప, కర్నూలు, అనంతపూర్, జిల్లాలో ఎక్కువగానూ, మెదక్, ప్రకాశం, గుంటూరు జిల్లాలో ఒక మాదిరిగానూ పండిస్తున్నారు.

**ప్రత్తి :** మొత్తం పంట విస్తీర్ణం లో 4 శాతం భూమిలో పండిస్తున్నారు.వివిధ రకాల సంకర జాతి విత్తనాలను ఉపయోగించి అధిక దిగుబడులను పొందుతున్నారు. కీటకాలను అదుపులో పెట్టలేక కొన్ని ప్రాంతాలలో సాగుబడి నిలిపి వేసారు. మెట్ట ప్రాంతాల్లో వర్షాధారంతోనూ, నీరు లభించే ప్రాంతాలలో సాగునీటితోనూ పండిస్తున్నారు. గుంటూరు, ప్రకాశం, నల్గొండ, ఖమ్మం,కడప, కర్నూలు, అనంతపూర్ జిల్లాలో ఎక్కువగా సాగు చేస్తున్నారు.

**చెరుకు :** ప్రధానంగా నీటి పారుదల ద్వారా పండిస్తారు. కో-419 రకం రాష్ట్రంలో అధికంగా పండిస్తున్నారు. ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల్లో కో-997 రకం సాగు చేస్తున్నారు. ఉత్పత్తిలో 40 శాతం పంచదార ఖండసారి తయారీకి ఉపయోగిస్తున్నారు. మిగతా దానిని బెల్లం తయారీకి ఉపయోగిస్తున్నారు. శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా , చిత్తూరు, నిజామాబాద్, మెదక్ జిల్లాలో సాగు చేస్తున్నారు.

**పొగాకు :** దేశం ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్‌దే ప్రధాన స్థానం లో ఉంది. వర్జీనియా, లంక, నాటు రకం పొగాకు పండిస్తున్నారు. ప్రకాశం, గుంటూరు, ఖమ్మం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ప్రధానంగా పండిస్తున్నారు. ఇది ప్రధానమైన వాణిజ్య పంట.

**మిరప :** దేశంలో విస్తీర్ణం రీత్యా, ఉత్పత్తి రీత్యా ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉంది. ఎక్కువగా గుంటూరు.

BRAOU

ప్రకాశం, కృష్ణా, పశ్చిమగోదావరి, ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో పండిస్తారు.

**పసుపు :** ఇది కూడా ప్రధానమైన వాణిజ్య పంట. కడప, కర్నూలు, నిజామాబాద్ జిల్లాల్లో ఎక్కువగా పండిస్తారు.

**పండ్లు, ఫలాలు :** ఆంధ్రప్రదేశ్‌లో అరటి, మామిడి, చీనా, ద్రాక్షా, జామ, నిమ్మ, నారింజ, బత్తాయి, కమలాలు పండిస్తున్నారు. అరటిని తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, విశాఖపట్నం జిల్లాల్లో అధికంగా పండిస్తారు. శ్రేష్టమైన మామిడి పండ్లకు ఆంధ్రప్రదేశ్ ప్రసిద్ధి. బనగానపల్లి, సువర్ణరేఖ, మలగూబ, నీలాలు, బెంగుళూరు రసాలు పండించే రకాలు. కృష్ణా, పశ్చిమగోదావరి, చిత్తూరు, ఖమ్మం జిల్లాల్లో అధిక విస్తీర్ణం లో పండిస్తున్నారు. నిమ్మ కాయలను అనంతపూర్, కడప, పశ్చిమగోదావరి, నెల్లూరు జిల్లాల్లో పండిస్తున్నారు. బత్తాయి, కమలాలు కొండ ప్రాంతాలలో అధికంగా పండిస్తున్నారు. ద్రాక్ష ఎక్కువగా రంగారెడ్డి, జిల్లాలోనూ, అనంతపూర్ జిల్లాలోనూ పండిస్తున్నారు. జామ తూర్పుగోదావరి, గుంటూరు, అనంతపూర్, కృష్ణా,మెదక్ జిల్లాల్లో పండిస్తున్నారు.

## 6.7.2. పశుసంపద

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మేలుజాతి పశు సంపదకు, పాల వెల్లువకు ప్రసిద్ధి. భారత దేశంలోని వివిధ రాష్ట్రాలతో పోలిస్తే గేదలు, గొర్రెల సంఖ్యలో ద్వితీయ స్థానంలోనూ, కోళ్ళ సంఖ్యలో ప్రథమ స్థానం లోనూ ఉంది. 1993 సం॥ లెక్కల ప్రకారం ఆవులు, ఎద్దులు, దున్నలు, గేదెలు కలిపి సుమారు 200 లక్షలున్నాయి. గొర్రెలు, మేకలు 120 లక్షలు, గుర్రాలు 7 వేలు, పందులు 6.74 లక్షలు, కోళ్ళు 511.25 లక్షలు ఉన్నాయి.

రాష్ట్రంలోని పశువుల్లో ఒంగోలు జాతి ముఖ్యమైంది. ఎద్దులు భారీగా ఉండి, బరువులు లాగుతాయి. ఒంగోలు జాతి పశువుల్లో పాడి తక్కువ. ఇవి కోస్తా జిల్లాల్లో ఎక్కువగా ఉన్నాయి. దూపాడు జాతి పశువులు కర్నూలు జిల్లాలో ఎక్కువ. ఇవి పనికి బాగా ఉపయోగపడతాయి. పాడి తక్కువ. మహబూబ్‌నగర్ జిల్లాలో మాల్వి జాతి ఎక్కువ. మెదక్ జిల్లాలో ఉన్న దేవుని జాతి పాడికీ, పనికీ కూడా ఉపయోగపడతాయి. రాయలసీమ లోని అనంతపూర్, చిత్తూరు, కర్నూలు జిల్లాలో హళికార్ జాతి పశువులున్నాయి. ఇవి బండ్లు బాగా లాగుతాయి. పాడికి పనికిరావు.

BRAOU

గుర్తింపబడిన గేదె జాతి రాష్ట్రం అంతటా విస్తరించి ఉన్నాయి. పాడి గేదెలుహైదరాబాద్ , కృష్ణా, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, గుంటూరు జిల్లాల్లో ఎక్కువ. హైదరాబాద్‌లో మేలైన ముర్రాజాతి గేదెలు అధిక సంఖ్యలో ఉన్నాయి. గొర్రెలు, మేకలూ రాష్ట్రం అంతటా విస్తరించి ఉన్నాయి. గొర్రెలు ఎక్కువగా మహబూబ్‌నగర్, అనంతపూర్ జిల్లాల్లో, మేకలు అనంతపూర్, చిత్తూరు, నల్గొండ జిల్లాల్లోను అధికంగా ఉన్నాయి.

రాష్ట్రంలోకోళ్ళ పరిశ్రమ హైదరాబాద్, కృష్ణా, గుంటూరు, నెల్లూరు, చిత్తూరు, వరంగల్ జిల్లాల్లో బాగా అభివృద్ధి చెందింది.

## 6.7.3 నీటిపారుదల వ్యవస్థ

ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగానికి కావాల్సిన నీటిని ప్రధానంగా నదులు నుండి చెరువులు, బావుల ద్వారాను పొందుతున్నారు. నీటి పారుదల గల భూమిలో సగం పైగా భూమికి నదులపై ఆనకట్టలు నిర్మించి సరఫరా చేస్తున్నారు. కోస్తా ప్రాంతంలో కాలువలు ప్రధాన పాత్ర వహిస్తున్నాయి. రాయలసీమ, తెలంగాణాలలో బావులు ప్రముఖ పాత్రను వహిస్తున్నాయి.

కృష్ణా నదిపై నల్గొండ జిల్లా నందికొండ వద్ద నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మించి, కుడి కాలువ (జవహర్ కాలువ)ద్వారా

గుంటూరు, ప్రకాశం జిల్లాలకు, ఎడమ కాలువ ద్వారా (లాల్ బహదూర్ కాలువ) నల్గొండ, కృష్ణా, ఖమ్మం జిల్లాలకు నీరు సరఫరా చేస్తున్నారు. విజయవాడ వద్ద కృష్ణా కాలువపై ప్రకాశం బ్యారేజి నిర్మించి గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాలకు నీరు అందిస్తున్నారు. కృష్ణానదిపై మహబూబ్ నగర్ వద్ద ప్రియదర్శిని-జూరాల ప్రాజెక్ట్ నిర్మించి సేద్యపు నీటిని పొందుతున్నారు. పోచంపాడు వద్ద గోదావరి నదిపై శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు నిర్మించి, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాలకు నీరు అందిస్తున్నారు. అలాగే రాజమండ్రి వద్ద గోదావరి మీదనే ధవళేశ్వరం ఆనకట్ట నిర్మించి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలకు నీరు సరఫరా చేయడం జరుగుతుంది.

పెన్నానదిపై సోమశిల ప్రాజెక్టు నిర్మించి నెల్లూరు జిల్లాకు సాగునీరు అందిస్తున్నారు. మంజీరా నదిపై సింగూరు ప్రాజెక్టు నిర్మించి మెదక్ జిల్లాకు నీరు అందిస్తున్నారు. ఏలేరు పై ప్రాజెక్టు నిర్మించి తూర్పుగోదావరి జిల్లాకు, విశాఖ స్టీలు పరిశ్రమకు నీరు అందిస్తున్నారు. కర్నూలు, కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు నీటి పారుదల సౌకర్యాన్ని , మద్రాసు నగరానికి మంచి నీటిని సరఫరా చేసేందుకు తెలుగు గంగ నిర్మాణంలో ఉంది.

శ్రీకాకుళం జిల్లాలో వంశధార ప్రాజెక్టు ద్వారా సాగునీటిని పొందుతున్నారు. కర్నూలు-కడప కాలువ ద్వారా కర్నూలు-కడప జిల్లాలకు సాగునీరు సరఫరా చేస్తున్నారు.

పోలవరం ప్రాజెక్ట్ , సుంకాశిల, గాలేరు-నగరి, హంద్రీ-నీవా నదీజల స్రవంతి పథకాలను కేంద్ర ప్రభుత్వ అనుమతి కోసం సమర్పించారు. ఎత్తి పోతల పథకం ద్వారా చిన్న కాలువలు, నదుల ద్వారా రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో సాగునీటిని పొందుతున్నారు.

**అభ్యాసం**

ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రంలో జంతు సంరక్షణ కేంద్రాలను కొన్నింటిని రాయండి.

## 6.8 భూగర్భ స్వరూపం - ఖనిజాలు

ప్రపంచంలోని అతి పురాతన భూభాగాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి. అతి ప్రాచీనమైన పురాతన శిలాసముదాయాలు లేదా ఆర్కియన్ సముదాయం తెలంగాణా అంతటా, రాయలసీమ నైరుతీ దిక్కున, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం,

BRAOU

ప్రకాశం జిల్లాల్లో ఉంది. అతి పురాతనమైన ఖోండలైటు సముదాయం గోదావరికి ఉత్తర దిక్కున తూర్పు కనుమలుగా ఉంది. ఖోండ లైటు ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి, ఖమ్మం, కృష్ణా జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఉంది. ఈ రాళ్ళలో క్రోమైటు, బాక్సైటు ముడి ఇనుము ఖనిజ నిల్వలు ఉన్నాయి.

ధార్వారు సముదాయాల శిలలు ముఖ్యంగా తూర్పుకనుమల ప్రాంతాలలోని కొన్ని ప్రదేశాల్లో ప్రకాశం, నెల్లూరు, అనంతపూర్, మహబూబ్‌నగర్, కరీంనగర్ జిల్లాల్లోని కొన్ని ప్రదేశాలలో ఉన్నాయి. ఈ సముదాయంలో గ్రనేట్ శిలలున్నాయి. చెప్పుకోదగ్గ ఖనిజ నిలవలు లేవు, కడపరాళ్ళ సముదాయం కడప, కర్నూలు, అనంతపూర్ జిల్లాల్లో అధికంగానూ, మహబూబ్‌నగర్, నల్గొండ, గుంటూరు, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లోనూ ఉన్నాయి. సున్నపురాయి, బైరైట్సు, యాస్‌బెస్టాస్, సీసం, రాగి, ఖనిజ నిల్వలున్నాయి. ప్రకాశం జిల్లాలో పలక రాళ్ళు ఉన్నాయి.

గోదావరి-ప్రాణహిత లోయలో గొండ్వానా శిలలున్నాయి. ఇసుకరాళ్ళు, బంకమన్ను, రాళ్ళ రూపంలో ఈ శిలా సముదాయం ఉంటుంది. ఈ శిలలో బొగ్గు నిల్వలు ఉన్నాయి. గొండ్వానా శిలలు అనంతపురం, భూగర్భ పొర అయిన దక్కను శిలా సముదాయం తెలంగాణా, వాయువ్య పశ్చిమ సరిహద్దుల్లో ఉంది. ఇటీవలి కాలంలో ఏర్పడిన శిలలు ముఖ్యంగా కోస్తా తీర ప్రాంతంలో, డెల్టా ప్రాంతాలలో కనిపిస్తాయి.

### 6.8.1 ఖనిజాలు

**ఇనుము :** ఖమ్మం జిల్లా, ఇల్లందు, కృష్ణాజిల్లా నందిగామ, వరంగల్ జిల్లా మహబూబాబాద్, ప్రకాశం జిల్లా ఒంగోలు, కర్నూలు జిల్లాడోన్, అనంతపూర్ జిల్లా రాయదుర్గ్, కడప జిల్లా రాజంపేట, ప్రాంతాలలో ఇనుము నిక్షేపాలున్నట్లు కనుగొన్నారు. ఈ నిక్షేపాలను వెలికి తీయడం లేదు.

**రాతినార (యాస్‌బెస్టాస్)** దేశంలో ఎక్కువ నిల్వలున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. "క్రైసోటైల్" రకం లభిస్తుంది. ఈ నిక్షేపాలుముఖ్యంగా కడప జిల్లా పులివెందుల, కర్నూలు జిల్లా డోన్, అనంతపూర్‌జిల్లా తాడిపత్రి,మహబూబ్‌నగర్‌జిల్లాకోల్హాపూర్ ప్రాంతాల్లో ఉన్నాయి.

**బొగ్గు :** రాష్ట్రంలో సింగరేణి కాలరీసు అనే సంస్థ బొగ్గు వెలికి తీస్తుంది. గోదావరి లోయ ప్రాంతంలో నిక్షేపాలున్నాయి. రామగుండం, గోదావరిఖని, కొత్తగూడెం ప్రాంతాల నుండి వెలికి తీస్తున్నారు. ముఖ్యంగా ఖమ్మం, ఆదిలాబాద్, కరీంనగర్, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో బొగ్గు నిల్వలున్నాయి.

**ముగ్గురాయి (బెరైటు ) :** ముగ్గు రాతి నిల్వల్లో దేశంలోఆంధ్రప్రదేశ్‌దే అగ్రస్థానం. కడపజిల్లా పులివెందుల, రాజంపేట, అనంతపూర్ జిల్లా తాడిపత్రి, కర్నూలుజిల్లా డోన్, ఖమ్మం జిల్లా ఖమ్మం, ఇల్లందు, మహబూబ్‌నగర్ జిల్లా కొల్హాపూర్ ప్రాంతాలలో నిక్షేపాలున్నాయి.

**రాగి-సీసం :** గుంటూరు జిల్లా అగ్ని గుండాల ప్రాంతంలో నిక్షేపాలున్నాయి. ఖమ్మం జిల్లా మైలారం వద్ద కూడా ఉన్నట్లు కనుగొన్నారు.

**బంగారం:** అనంతపూర్ జిల్లా రామగిరి, చిత్తూరు జిల్లా చిగురుగుంట ప్రాంతాలలో తక్కువ రకం బంగారం నిల్వలున్నాయి.

**వజ్రాలు :** అనంతపూర్‌జిల్లాలోని వజ్రకరూర్ ప్రాంతంలో దొరుకుతుంటాయి.

BRAOU

**సున్నపురాయి :** కర్నూలు, కడపలో అధికంగా దొరుకుతుంది. సిమెంటు, పేపరు, చక్కని పరిశ్రమల్లో వాడే ఉన్నత శ్రేణి రాష్ట్రంలో ఉంది. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లా తాండూరు, కర్నూలుజిల్లా బేతంచర్ల, కడప జిల్లా కమలాపురం, గుంటూరు జిల్లా పిడుగురాళ్ళ, నల్గొండ జిల్లా జగ్గయ్యపేట, ముక్త్యాల ప్రాంతాలలో సిమెంటు గ్రేడు నిల్వలున్నాయి.

**మాంగనీసు,అభ్రకం, బాక్సైటులు :** మాంగనీసు శ్రీకాకుళం జిల్లాలోని సాలూరు, చీపురుపల్లి,ప్రకాశంజిల్లా మార్కాపూర్, చిత్తూరు, కడప, కర్నూలు, ఆదిలాబాద్ జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో దొరుకుతుంది. అభ్రకం ముఖ్యంగా నెల్లూరు జిల్లా గూడూరు, రాపూరు, విశాఖ జిల్లా శృంగవరపు కోట వద్ద కృష్ణా, పశ్చిమగోదారి, ఖమ్మం, వరంగల్ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో దొరుకుతుంది. బాక్సైటు నిల్వలు ఆంధ్రప్రదేశ్ లోని ఉత్తర కోస్తా,ప్రాంతంలో అధికంగా ఉన్నట్లు కనుగొన్నారు. ఇంకా వెలికి తీయడం లేదు.

**క్లే, ఎపటైటు, ఇసుక :** ఇటుకలు, పింగాణీ పాత్రలు తయారుచేసేమన్ను లేక క్లే ముఖ్యంగా విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కడప, కర్నూలు, నెల్లూరు, ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో దొరుకుతుంది. ఎపటైటు, విశాఖపట్నం జిల్లా కాశీపట్నం వద్ద దొరుకుతుంది. దీనిని ఫాస్ఫేటు ఎరువుల తయారీకి వాడతారు. ఇసుకను ప్రకాశం జిల్లా చీరాల పరిసరాల నుండి సేకరిస్తుంటారు. దీనిని గాజు పరిశ్రమ, లోహ పరిశ్రమల్లోవాడతారు.

**ఇల్మనైటు, గ్రాఫైటు, స్టీయటైటు :** ఇల్మనైటు అనబడే టైటానియం ఖనిజం కోస్తాతీర ప్రాంతాలలో ఉన్నట్లు కనుగొన్నారు. గ్రాఫైటు ఖమ్మం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో దొరుకుతుంది. దీనిని పెయింట్లు, మూసలు, ఎలక్ట్రోడు బ్యాటరీలు తయారీకి వాడతారు. స్టీయటైటు కడప రాళ్ళ సముదాయంలో సున్నపురాయిలో కలిపి దొరుకుతుంది.

**గ్రనైటు రాళ్ళు :** హైదరాబాదు, మహబూబ్‌నగర్, నల్గొండ, నిజామాబాద్, ఆదిలాబాదు, శ్రీకాకుళం, ప్రకాశం జిల్లాల్లో అధికనిక్షేపాలున్నాయి. ప్రకాశం జిల్లా చీమకుర్తి వద్ద ప్రపంచంలోనే మేలైన గలాక్సీ గ్రానైట్లున్నాయి.

**చమురు - సహజ వాయువు :** కృష్ణా,గోదావరి పరీవాహక ప్రాంతం లోని అవక్షేప శిలలో చమురు -సహజ వాయువు ఉన్నట్లు కనుగొన్నారు. కోస్తాతీర మంతటా పరిశోధిస్తున్నారు. రాజోలు, నరసాపూర్, కాకినాడ, అమలాపురం ప్రాంతాల్లో సహజ వాయువును వెలికి తీస్తున్నారు.

BRAOU

## 6.9. జనాభా - జిల్లాల సమాచారం

1992-93 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అర్థ గణాంక శాఖ వెలువడించిన లెక్కల ప్రకారం రాష్ట్రంలో మొత్తం సుమారు 665 లక్షల జనాభా ఉన్నారు. వీరిలో పురుషులు 337.2 లక్షలు, స్త్రీలు 327.8 లక్షలు, గ్రామీణ జనాభా 486.2 లక్షలు, పట్టణ జనాభా 178.6 లక్షలు. షెడ్యూలు కులాల వారు 105.9 లక్షలు, షెడ్యూలు తెగల వారు 42 లక్షలున్నారు. శ్రామికులు 285 లక్షలున్నారు. వీరిలో కర్షకులు 79 లక్షలు, వ్యవసాయ కూలీలు 116 లక్షలు. వ్యవసాయేతర కార్మికులు 90లక్షలున్నారు. రాష్ట్రంలో అక్షరాస్యత శాతం 44 ఉంది. పురుషులలో 55.1, స్త్రీలలో 32.7 శాతం ఉంది.

రాష్ట్రంలో మొత్తం 23 జిల్లాలున్నాయి. వీటిలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాతో కూడిన ప్రాంతాన్ని కోస్తా ఆంధ్రగా పిలుస్తారు.

కర్నూలు, కడప, చిత్తూరు, అనంతపూర్ జిల్లాలను కలిపి రాయలసీమ అంటారు. రంగారెడ్డి, హైదరాబాదు, నిజామాబాద్, మెదక్, మహబూబ్ నగర్, నల్గొండ, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలను కలిపి తెలంగాణాగా

వ్యవహరిస్తారు.

రాష్ట్రంలో మొత్తం మండలాల సంఖ్య 1110, గ్రామ పంచాయతీలు 19,497, గ్రామాలు 26,613. పట్టణాలు 264, నియోజక వర్గాలు (లోకసభ 42), శాసనసభ నియోజక వర్గాలు 294. రాజ్యసభ సభ్యులు 18 మంది ఉంటారు.

**శ్రీకాకుళం :**

ముఖ్యపట్టణం శ్రీకాకుళం, జనాభా 23.21 లక్షలు, విస్తీర్ణం 5.8 వేల చ.కి. కోస్తా తీరం పొడవు 190 కి.మీ. ముఖ్యంగా వరి, చెరకు, వేరుశెనగ పండిస్తారు. శ్రీముఖ లింగం, పొందూరు, శ్రీకూర్మం దర్శనీయ ప్రదేశాలు.

**విజయనగరం :**

ముఖ్యపట్టణం : విజయనగరం, జనాభా 21.10 లక్షలు. విస్తీర్ణం 6.5వేల చ.కి. ముఖ్యంగా వరి, చెరకు, వేరుశెనగ, మిరప,పొగాకు జొన్న పంటలు పండిస్తారు. బొర్రా గుహలు, బొబ్బిలి దర్శనీయ ప్రదేశాలు.

**విశాఖపట్నం :**

ముఖ్యపట్టణం: విశాఖపట్నం. జనాభా 32.8లక్షలు, విస్తీర్ణం 11.2 వేల చ.కి. వరి, చెరకు, వేరు శెనగ, మిరప, మొక్కజొన్న, జొన్న,పొగాకు పండిస్తారు. విశాఖపట్నం, భీమునిపట్నం, సింహాచలం, అరకు లోయ దర్శనీయ ప్రదేశాలు.

**తూర్పుగోదావరి :**

ముఖ్యపట్టణం : కాకినాడ, జనాభా 45.41 లక్షలు. విస్తీర్ణం 10.8 వేల చ.కి. వరి, చెరకు,అరటి, కొబ్బరి,మామిడి పంటలు పండిస్తారు. ద్రాక్షా రామం, రాజమండ్రి, అన్నవరం దర్శనీయ స్థలాలు.

**పశ్చిమ గోదావరి :**

ముఖ్యపట్టణం : ఏలూరు, జనాభా 35.17 లక్షలు. విస్తీర్ణం 7.7 వేల చ.కి. వరి, చెరకు, వేరు శెనగ, పొగాకు ముఖ్యమైన పంటలు. ద్వారాకా తిరుమల దర్శనీయ స్థలం.

**కృష్ణా :**

ముఖ్యపట్టణం: మచిలీపట్నం. జనాభా 36.98 లక్షలు విస్తీర్ణం 8.7 వేల చ.కి.మీ వరి, చెరకు, వేరుశనగ, మిరప ప్రధాన పంటలు. శ్రీకాకుళం, విజయవాడ, కొండపల్లి,కూచిపూడి దర్శనీయ స్థలాలు.

**గుంటూరు :**

ముఖ్యపట్టణం : గుంటూరు, జనాభా 41.06లక్షలు, విస్తీర్ణం 11.4 వేల చ.కి.మీ. వరి,చెరకు,పొగాకు,ప్రత్తి,మిరప, పసుపు,వేరుశెనగ పండిస్తారు. అమరావతి, ధరణి కోట,ఎత్తిపోతల, మంగళగిరి,మాచర్ల దర్శనీయ స్థలాలు.

**ప్రకాశం :**

ముఖ్యపట్టణం: ఒంగోలు, జనాభా 27.59 లక్షలు. విస్తీర్ణం 17.6 వేల చ.కిమీ. వరి, సజ్జ,జొన్న, ప్రత్తి, పొగాకు, ప్రధాన పంటలు. సింగారాయకొండ, మార్కాపూర్, చీరాల దర్శనీయ స్థలాలు.

BRAOU

**నెల్లూరు :**

ముఖ్యపట్టణం : నెల్లూరు, జనాభా 23.92 లక్షలు, విస్తీర్ణం 13.1 చ.కి.మీ. వరి, జొన్న, వేరు శెనగ ప్రధాన పంటలు. శ్రీహరికోట, నేలపట్టు, వెంకటగిరి దర్శనీయ స్థలాలు.

**కర్నూలు :**

ముఖ్యపట్టణం : కర్నూలు, జనాభా 29.73 లక్షలు. విస్తీర్ణం 17.7 వేల చ.కి.మీ. వరి, జొన్న, సజ్జ, వేరుశనగ ప్రధానపంటలు. మంత్రాలయం, అహోబిలం, మహానంది, శ్రీశైలం దర్శనీయ స్థలాలు.

**అనంతపూర్ :**

ముఖ్యపట్టణం : అనంతపూర్, జనాభా 31.83 లక్షలు,విస్తీర్ణం 19.1 వేల చ.కి.మీ. వరి, సజ్జ, జొన్న,రాగి, వేరుశెనగ, ప్రత్తి ముఖ్య పంటలు. లేపాక్షి, పుట్టపర్తి దర్శనీయ స్థలాలు.

**చిత్తూరు :**

ముఖ్య పట్టణం : చిత్తూరు , జనాభా32.61 లక్షలు, విస్తీర్ణం 15.2 వేల చ.కి.మీ. వరి, చెరకు, వేరుశనగ ప్రధాన పంటలు. తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, హార్స్లీ కొండలు దర్శనీయ స్థలాలు.

**కడప :**

ముఖ్యపట్టణం : కడప, జనాభా 22.67 లక్షలు, విస్తీర్ణం 15.4 వేల చ.కి.మీ. వరి, జొన్న, చెరకు, వేరుశనగ, ప్రధాన పంటలు. సురభి, తాళ్లపాక, గండికోట దర్శనీయ స్థలాలు.

**రంగారెడ్డి :**

ముఖ్యపట్టణం : వికారాబాద్, జనాభా 25.51 లక్షలు,విస్తీర్ణం 7.5 వేలచ.కి.మీ. వరి, జొన్న, వేరుశెనగ ప్రధాన పంటలు. కీసరగుట్ట, దర్శనీయ స్థలం.

**హైదరాబాద్ :**

ముఖ్య పట్టణం : హైదరాబాద్, జనాభ 31.45 లక్షలు, విస్తీర్ణం 0.02వేల చ.కి.మీ. చార్మినార్, పబ్లిక్ గార్డెన్స్, సాలార్‌జంగ్ మ్యూజియం, గోల్కొండ, జూలాజికల్‌పార్క్, గండిపేట, టాంక్‌బండ్, కులీకుతుబ్ షా సమాధులు దర్శనీయ స్థలాలు.

**నిజామాబాద్ :**

ముఖ్య పట్టణం : నిజామాబాద్, జనాభా 20.37 లక్షలు, విస్తీర్ణం 8 వేల చ.కి.మీ. వరి, జొన్న, వేరుశనగ రాగి ప్రధాన పంటలు, శ్రీరాంసాగర్, బోధన్, అచ్చంపేట వర్శనీయ స్థలాలు.

**మెదక్ :**

ముఖ్యపట్టణం: సంగారెడ్డి, జనాభా 22.69 లక్షలు, విస్తీర్ణం 9.7 వేల చ.కి.మీ. వరి, జొన్న, సజ్జ,రాగి, వేరుశెనగలు ప్రధాన పంటలు, జోగిపేట, కొండాపూర్, జహీరాబాద్ దర్శనీయ స్థలాలు.



BRAOU

**మహబూబ్‌నగర్ :**

ముఖ్యపట్టణం : మహబూబ్‌నగర్, జనాభా 30.77 లక్షలు, విస్తీర్ణం 18.4 వేలచ.కి.మీ. వరి,సజ్జ,రాగి, వేరుశనగ ప్రధానమైన పంటలు. గద్వేలు, అలంపూర్, పిల్లలమర్రి దర్శనీయ స్థలాలు.

**నల్గొండ :**

ముఖ్యపట్టణం : నల్గొండ, జనాభా 28.52 లక్షలు, విస్తీర్ణం 14.2 వేల చ.కి.మీ. వరి, జొన్న, సజ్జ,వేరు శెనగ ప్రధానమైన పంటలు, యాదగిరి గుట్ట,భువనగిరి, నాగార్జునసాగర్,కొలనుపాక దర్శనీయ స్థలాలు.

**వరంగల్ :**

ముఖ్యపట్టణం : వరంగల్, జనాభా 28.18 లక్షలు, విస్తీర్ణం 12.9వేల చ.కి.మీ. వరి,జొన్న, మిరప,ప్రత్తి, వేరుశనగ ప్రధానమైన పంటలు. పాలంపేట, వరంగల్,దర్శనీయ స్థలాలు.

**ఖమ్మం :**

ముఖ్యపట్టణం : ఖమ్మం, జనాభా 22.15 లక్షలు, విస్తీర్ణం 16వేల చ.కి.మీ. వరి,జొన్న, సజ్జ, వేరుశనగ ప్రధానమైన పంటలు. భద్రాచలం, కొత్తగూడెం,కాళేశ్వరం దర్శనీయ స్థలాలు.

**కరీంనగర్ :**

ముఖ్యపట్టణం : కరీంనగర్, జనాభా 30.37 లక్షలు, విస్తీర్ణం 11.8 వేల చ.కి.మీ. వరి, జొన్న, వేరు శెనగ ప్రధానమైన పంటలు. వేములవాడ, కాళేశ్వరం, రామగుండం దర్శనీయ స్థలాలు.

BRAOU

**ఆదిలాబాద్ :**

ముఖ్యపట్టణం: ఆదిలాబాద్, జనాభా 30.37 లక్షలు, విస్తీర్ణం 16.1 వేల చ.కి.మీ. వరి, జొన్న, మిరప, వేరుశెనగ, ముక్యమైన పంటలు. బెల్లంపల్లి, నిర్మల్,సిరిపూర్, కుంతల గ్రామం, మందమర్రి దర్శనీయ స్థలాలు.

**అభ్యాసాలు**

ముగ్గురాయి (బ్రైటు) ఆంధ్రప్రదేశ్‌లో ఏఏ ప్రాంతాలలో దొరుకుతుంది?

ఆంధ్రప్రదేశ్‌లోఎన్ని జిల్లాలున్నాయి? మొత్తం జనాభా ఎంత?

## 6.10. ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం.

* ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణంలో భారతదేశంలోనే అయిదవ పెద్ద రాష్ట్రం.
* రాజకీయంగా రాష్ట్రం కోస్తా, రాయలసీమ, తెలంగాణా అనే ప్రాంతాలుగా విభజితమైంది.
* ఆంధ్రప్రదేశ్ శీతోష్ణస్థితి సమశీతోష్ణ ఋతుపవన రకానికి చెందింది.
* రాష్ట్రంలో సంవత్సరవర్షపాతం సాధారణంగా సుమారు 890 మి.మీ.
* రాష్ట్రంలో ముఖ్యమైన నదులు: కృష్ణా, గోదావరి, పెన్నా, తుంగభద్ర, మంజీరా, వంశధార, ప్రాణహిత, మూసీ, నాగావళి.
* ఆంధ్రప్రదేశ్ ఒండ్రు మట్టినేలలు, నల్లరేగడి నేలలు, ఎర్రమట్టి నేలలు, ఇసుక నేలలు, క్షారమృత్తిక నేలలున్నాయి.
* అడవుల్లో, సమశీతోష్ణ సతతారణ్యాలు, ఆకురాల్చే అడవులు, పొదలలోనిండిన అడవులు, కోస్తాతీర ప్రాంత అడవులున్నాయి.
* ఆంధ్రప్రదేశ్‌లో వన్య ప్రాణులు, సంరక్షణ కేంద్రాలు ఉన్నాయి.
* 70శాతం వ్యవసాయంపై ఆధారపడతారు. సాగుభూమి 1.32 కోట్ల హెక్టార్లు.
* మేలుజాతి పశు సంపదకు పాలవెల్లువకు ఆంధ్రప్రదేశ్ ప్రసిద్ధి.

BRAOU

## 6.11 మాదిరి పరీక్షాప్రశ్నలు

కింది వాటికి 30 పంక్తులలో జవాబులు రాయండి.

1. ఆంధ్రప్రదేశ్ నదీ వ్యవస్థను వివరించండి.

2. ఆంధ్రప్రదేశ్ లోని అడవుల గురించి, వన్యప్రాణుల సంరక్షణ కేంద్రాలను గురించి రాయండి.

కింది వాటికి 15 పంక్తులలో జవాబు రాయండి.

1. ఆంధ్రప్రదేశ్‌లోని సేద్యపు నీటి పారుదల ప్రాజెక్టుల గురించి రాయండి.

2. ఆంధ్రప్రదేశ్‌లోని ఖనిజ సంపద గురించి వివరించండి.

BRAOU

# భాగం: 7 ఆర్థిక సామాజిక వ్యవస్థలు

## విషయ క్రమం


7.0 ఉద్దేశం

7.1 ప్రవేశిక

7.2 ఆర్థిక వ్యవస్థ

7.3 ఆంధ్రప్రదేశ్‌లోని ఆర్థిక వ్యవస్థ

అభ్యాసం

7.4 సామాజికవ్యవస్థ

7.4.1 కుల వ్యవస్థ

7.4.2 సాంఘిక దురాచారాలు

7.4.3 విద్య

7.4.4 ఉద్యమాలు

అభ్యాసం

7.5 తెలంగాణాలోఆర్థిక సామాజిక వ్యవస్థలు

అభ్యాసం

7.6 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

7.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 7.0. ఉద్దేశం

ఈ భాగం చదివాక మీరు -

ఆంధ్రదేశపు ఆర్థిక సామాజిక వ్యవస్థలు గూర్చి, అందులో ప్రధానంగా 20వ శతాబ్దపు పూర్వభాగాన్ని గురించి, వివరించ గలుగుతారు.

## 7.1 ప్రవేశిక

ఆర్థికసామాజిక వ్యవస్థలకు సన్నిహిత సంబంధం వుంది. రాజకీయ వ్యవస్థ ఒక బండికిఇరుసు లాంటిదైతే, ఆ బండికున్న రెండు చక్రాలు సామాజిక, ఆర్థిక వ్యవస్థలు. వీటికున్న పరస్పర సంబంధం గురించి, సామాజిక శాస్త్రవేత్తలు, ఆర్థిక పరమైన అంశాలను పునాదిగాను, సామాజిక, సాంస్కృతిక, న్యాయ పరిపాలన విషయాలను ఉపరితలంగాను పేర్కొన్నారు. ఈ

రెంటికి వున్న గతి తార్కిక సంబంధం మానవ చరిత్రను అవగాహన చేసుకోవడానికి ఎంతో ఉపకరిస్తుంది. సమాజ పరిణామ క్రమంలో, వేరు వేరు దశల్లో, అప్పుడు నెలకొన్న ఉత్పత్తి శక్తుల, ఉత్పత్తి సంబంధాల పరస్పర ప్రభావం మానవజాతి చరిత్రను ఒక మెట్టు ముందుకు తీసుకెళ్ళింది. ఈ క్రమంలోనే ఆంధ్రదేశ చరిత్రలో, ఆధునిక యుగంలో వుండిన సామాజిక ఆర్థిక స్థితి గతులను అంచనా వేయాల్సి ఉంటుంది.

## 7.2 ఆర్థిక వ్యవస్థ

ఒక విశాల దేశంలోని ఒక ప్రాంతపు రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పరిస్థితులను ఆ దేశపు విశాల పరిధిలో భాగంగా అధ్యయనం చేయాల్సి వుంటుంది. దేశ చరిత్రలు, వాటి పెంపుధల, వాటి జిగిబిగి, ప్రాంతీయ చారిత్రక స్థితిగతులపై ఆధారపడి సంపన్న మౌతాయి. భారతదేశంపై ఆంగ్లేయుల ఆధిపత్యం 18వ శతాబ్దపు మధ్య భాగంలో ప్లాసీ (Plassy) యుద్ధం తర్వాత ఆరంభమైంది. తమ ఆధిపత్యాన్ని, వలస దోపిడిని కొనసాగించేందుకు ఆంగ్లేయులు, ఆర్థిక, రాజకీయ సామాజిక రంగాల్లో కొన్ని మౌలిక సంస్కరణలను ప్రవేశపెట్టారు. వీటి ఫలితంగా ఆధునిక రాజకీయ ఆర్థిక సిద్ధాంతమైన పెట్టుబడిదారీ విధానం భారతదేశంలో మొదలైంది. ఈ నూతన ఉత్పత్తివిధానం మధ్యయుగ సమాజానికి గండికొట్టి ఆధునిక భారతదేశ చరిత్రకు పునాది వేసింది. కార్ల్‌మార్క్స్ (Karl Marx) దీన్ని భారతదేశానికి బ్రిటీషువారు చేసిన ద్వంద్వ ప్రయోజనాలుగా చెప్పారు. ఒకటి, పాత వ్యవస్థను ధ్వంసం చేయడం, రెండు, నూతన సమాజానికి నాంది పలకడం. వలస వాదపు మూడవ దశలో (1857 తర్వాత) - పెట్టుబడిదారి ఆర్థిక దశ - కంపెనీ పరిపాలన అంతమొంది ఆంగ్ల ప్రభుత్వమే ప్రత్యక్షంగా భారతదేశ పరిపాలనను చేపట్టిన తర్వాత వలస దోపిడి మరింత అధికమైంది. దేశంలో లభించే వనరుల్ని, శ్రమశక్తిని కొల్లగొట్టడం, ఇంగ్లండ్‌లో ఉత్పత్తి అయిన సరుకులను భారతీయమార్కెట్లలో కుమ్మరించడం, ఆ తర్వాత భారతదేశంలోనే పెట్టుబడులు పెట్టిపరిశ్రమలను అభివృద్ధి చేయటం - రైల్వేలు, ఇతర రవాణా సౌకర్యాలు కీలక పరిశ్రమలైన ఉక్కు, ఇనుము మొదలయినవి - స్థాపించడం ద్వారా ఈ దోపిడి ఇబ్బడి ముబ్బడిగా పెరిగింది. వ్యవసాయ రంగంలో వలస పాలకులు ప్రవేశపెట్టిన నూతన భూ విధానాలు - జమిందారీ, రైత్వారీ, మహల్వారీ - భూమిపై భారతీయులకు సంపూర్ణ హక్కు ప్రతిపాదించింది. ఈ విధానాలు వ్యవసాయంలో వ్యాపారీకరణకు దారితీసి రైతులను పేద రైతులుగా దిన భత్యపు వ్యవసాయ కూలీలుగా మార్చివేశాయి.

## 7.3 ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక వ్యవస్థ

పైనేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్‌లోని ఆర్థికపరిస్థితులను అంచనా వేసినప్పుడు, ఇక్కడ ప్రవేశపెట్టిన భూ విధానాలు అంతకు ముందున్న జమిందార్లను గానీ, భూస్వాములను గానీ పూర్తిగా నిర్మూలించలేక పోయాయి. వాళ్ళకుండిన అధికారం,ప్రైవేటు సైన్యాలు పోయాయేతప్ప భూమిపై వారికున్న యాజమాన్యపు హక్కుతో శిస్తులు వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లించే సదుపాయం వాళ్ళకే వుండేది. ఆంధ్రదేశంలోని జమిందార్లలో ఎక్కువభాగం క్షత్రియ, వెలమ, కమ్మ మొదలైన బ్రాహ్మణేతర కులాలకు చెందినవారు. డబ్బు, కులం ద్వారా వచ్చిన సాంఘిక స్థాయి రెండూ కలిసి సమాజంలోవారికి అధిక పలుకుబడి వుండేది.

సమాజంలో వ్యవసాయం ప్రధానవృత్తి. ఐతే రైతు జీవితం ఎంతో దయనీయంగా వుండేది. మూడు రకాలైన దోపిడీల మధ్య (బ్రిటిష్ వారు - జమిందార్లు, పాలెగాళ్ళు) వీరు నలిగిపోయారు. అప్పటి జనాభాలో భూమిపై ఆధారపడిన ప్రజలు సుమారుగా 48 శాతం వుండేవారు. వీరిలో ఖచ్చితంగా వ్యవసాయం చేస్తున్న రైతులు, కూలీలు దాదాపు 70 శాతం ఉండేవారు. వీరుకాకుండా వ్యవసాయేతర వృత్తుల మీద ఆధారపడేవారు గణనీయమైన సంఖ్యలో ఉండేవారు. సమాజంలో వంశపారంపర్యంగా సేవలు చేసేవాళ్ళు - చాకలి, మంగలి, వడ్రంగి, చర్మకారుల్లాంటి వాళ్ళు ఉండేవారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో వీరికి జీతభత్యాలు

BRAOU

ఉండేవి కావు. కొంత మంది ఇనాములు, మిగిలినవారు సంవత్సరానికొకసారి రైతులు ఇచ్చే ధాన్యంపై ఆధారపడేవాళ్ళు.

మొత్తం మీద రైతాంగం, అన్ని రకాల రెవెన్యూ సెటిల్మెంట్స్ కింద ఆర్థిక భారంతో చితికి పోయింది. అధిక శిస్తులు, శిస్తు వసూళ్ళలో కఠినత్వం, వడ్డీ వ్యాపారుల ఆగడాలు, వీటితో సతమతమై, తుదకు తిండికి సరిపడా ఆహార ధాన్యాలు ఉండేవికావు. దీనికి తోడు శిస్తు బకాయిలు వున్నప్పుడు రైతుల కొద్దిపాటి ఆస్తిపాస్తులు జప్తు చేసేవాళ్లు. విచిత్రమేమంటే, అపుడున్న మూడు ప్రెసిడెన్సీ రాష్ట్రాలలో కల్లా మద్రాసు రాష్ట్రంలోనే భూమి శిస్తు ఎక్కువగా వుండేది. ఈ విధమైన అత్యంత దోపిడీతో కూడిన తమ ప్రాంతాలను వదిలిపెట్టి ప్రజలు వలస వెళ్ళేవారు. ఈ పరిస్థితుల్లో గ్రామీణ రుణ భారం కూడా విపరీతంగా పెరిగింది. మూలిగే నక్క పై తాటిపండు చందాన, అప్పుడు తరచూ సంభవిస్తున్న కరువులు వ్యవసాయ దార్లకు మరింత కష్టాన్ని కల్గించాయి. 19వ శతాబ్దంలో ఎక్కువగానూ, 20వ శతాబ్దపు మొదటి మూడు దశకాల్లో ఈ కరువులు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రజలను విపరీతమైన బాధలకు గురిచేశాయి. ఇంతకూ బ్రిటిష్‌వారు ప్రవేశపెట్టిన శాశ్వత శిస్తు పద్ధతి లేక రైత్వారీ పద్ధతి అటు జమిందార్లను, ఇటు రైతులను, ఇద్దరినీ కుంగదీసింది. జమిందారీ ప్రాంతాలైన కోస్తా జిల్లాల్లో ప్రభుత్వానికి చెల్లించాల్సిన ధనం (పేష్కష్) చెల్లించనందువల్ల వారి ఎస్టేట్లు వేలం వేశారు. ఈ పద్ధతులు భూమిపై సొంత హక్కును రైతులకు లేకుండా చేయడమే కాక జమిందార్లక్కూడా ఊహాజనితమైన హక్కులనే ఇచ్చిందని విమర్శకులు అభిప్రాయపడ్డారు. ఇక, రైత్వారీ విధానంలో రైతుల పరిస్థితి మరింత హేయ స్థితికి దిగజారింది. భూమిశిస్తు విపరీతంగా ఉండింది. ఇది దాదాపు ఒక ఎకరాకు 30 నుండి 50 రూపాయల్దాకా విధించబడింది. శిస్తు బకాయిలు చెల్లించలేక రైతులు వడ్డీ వ్యాపారుల చేతుల్లో చిక్కుకొని ఆ షావుకార్లే భూస్వాములైనారు. ఈ స్థితి దాదాపు దేశానికి స్వాతంత్ర్యం లభించేదాకా కొనసాగింది. వాణిజ్య పంటలు పండించడం ప్రారంభించి అప్పుడప్పుడు గణనీయమైన ఆదాయాన్ని పొందినా, అదికూడా ఆచరణలో, ధరల అస్థిరీకరణ వల్ల రైతులు మరింతగా నష్టపోయారు.

బ్రిటీషువారి పరిపాలనలో వ్యవసాయభివృద్ధికి మొదట్లో పెద్ద ప్రాధాన్యం లభించలేదు. ఐతే 1850 తర్వాత ఆనకట్టల నిర్మాణం, వరదల నివారణ, నౌకల రవాణాకు కావల్సిన కాలవలు ఏర్పర్చటం జరిగింది. ఈ మార్పు వ్యవసాయాభివృద్ధికి దోహదం చేస్తే భూమి శిస్తు పెరుగుతుందని, ప్రజల్లో తమ పాలన పట్ల సానుకూలత పెరుగుతుందని వలస పాలకులు గుర్తించారు. సర్ ఆర్థర్ కాటన్ చొరవ వల్ల గోదావరి ఆనకట్ట 1852లోనూ, కృష్ణనదికి ఆనకట్ట 1855 లోనూ పూర్తయ్యాయి. దీనివల్ల వరదల పాలిటపడ్డ ఆ రెండు నదుల డెల్టా ప్రాంతాల్లో కరువులు పోయి భూమి సస్యశ్యామలమైంది. వ్యవసాయం అభివృద్ధి చెందింది. దేశం లోతట్టు ప్రాంతాల నుండి పత్తి, పొగాకు లాంటి వాణిజ్య పంటలను రేవు పట్టణాలకు తరల్చేందుకు అనువుగా ఈ ఆనకట్టల కాల్వలను జల రవాణా మార్గాలుగా ఉపయోగించారు. గోదావరి, కృష్ణా జిల్లాలు ధాన్యాగారాలుగా పేరెన్నిక గన్నాయి. కోస్తా ప్రాంతంలో వాణిజ్యం విస్తరించింది. జనాభా పెరిగింది. గోదావరి ప్రాంతంలో ఆనకట్ట నిర్మాణానికి ముందు ఎగుమతి చేస్తున్న సరుకుల విలువ సాలుకు సగటున 6 లక్షల రూపాయలు ఉండేది. ఆ తర్వాత అది 40 లక్షల రూపాయలకు పెరిగింది. దీనివల్ల ధనిక, మధ్య తరగతి రైతులు బాగా లాభపడ్డారు. రోడ్లు పెరిగాయి. పాఠశాలలు ఎక్కువయ్యాయి. ఈ ప్రాంతాన్ని మద్రాసుతో కలపడానికి ఈస్ట్ కోస్ట్ రైల్వే అనే రైలు మార్గం ఏర్పడింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఈ ప్రాంతం సృష్టించిన సంపద, తద్వారా పుట్టుకొచ్చిన మధ్య తరగతి, అటు సంస్కరణోద్యమాల్లోను ఆ తర్వత జాతీయోద్యమం లోను గణనీయమైన పాత్ర వహించింది. రాజధాని నగరమైన మద్రాసుతో సంబంధం ఏర్పడ్డం వల్ల నూతన భావాలు అక్కడ నుండి వ్యాపించడానికి దారి తీసింది.

ఆంధ్రప్రదేశ్‌లో 19వ శతాబ్దపు అంతం దాకా ఒక్క చేనేత పరిశ్రమ మినహా చెప్పుకోతగ్గ మరే ఇతర పరిశ్రమలు లేవు. ఐతే 20వ శతాబ్దారంభానికి కొన్ని వ్యవసాయాధార పరిశ్రమలు మొదలయ్యాయి. బియ్యం, పప్పు ధాన్యాలు, నూనె గింజలు, రాగులు, చక్కెర మొదలైన వాటిని ఈ జాబితాలో చేర్చవచ్చు. కాని, ఎంతో ప్రసిద్ధమైన నూలు, జౌళి పరిశ్రమలు క్రమేపి క్షీణించి,

BRAOU

లక్షల మంది చేనేతపారిశ్రామికులు పట్టణాలకు జీవన భృతి కోసం తరలిపోయారు. కోస్తా తీరంలో పేరెన్నిక గన్న రేవు పట్టణాలు, విశాఖపట్నం, కాకినాడ, మచిలీపట్నం మొదలైనవి క్షీణించాయి. ఈ కాలంలో పారిశ్రామిక కార్మికులు ఎక్కువగా ఆంధ్రప్రదేశ్‌లో లేరు. ఇనుము, ఉక్కు, రాగి మొదలైన లోహ పరిశ్రమల్లో పనిచేసేవాళ్ళు నామ మాత్రమే. గృహనిర్మాణం పరిశ్రమలో పనిచేసే కార్మికులు మాత్రం ఎక్కువ మంది ఉండేవారు.

ఆంధ్రప్రదేశ్‌లో పట్టణీకరణ 19వ శతాబ్దపు ఉత్తరార్థంలో ఆరంభమైంది. 20వ శతాబ్దం నాటికి అనేక పట్టణాలు ఏర్పడ్డాయి. వ్యవసాయంపై ఒత్తిడి ఎక్కువైనందువల్ల, వెనుకబడిన కులాలపై, దళితులపై సామాజిక పీడన పెరిగినందువల్ల, ధనిక వర్గాలు విద్యా ఉద్యోగ వ్యాపార సౌకర్యాల కోసంపట్టణాలకు వలస వెళ్ళారు. రైలు మార్గం పొడవునా కొత్త వ్యాపార కేంద్రాలు వచ్చాయి. పరిశ్రమకు కావాల్సిన పెట్టుబడి లభించడంతో ధనిక భూస్వాములు కూడా పట్టణాలకు తరలిపోయారు. ఇది విద్యాధిక పట్టణ మధ్యతరగతి ఆవిర్భావానికి తోడ్పడింది. ఈ వర్గం ఉదారవాద ప్రజాతంత్ర విలువల కోసం పోరాడింది. సమాజానికి వ్యక్తిని కేంద్ర బిందువుగా చేసి అతనిని గౌరవించింది. అంతేగాని మతాధికారానికి కాదు. వీరు ప్రధానంగా బుద్ధి జీవులు కాబట్టి బౌద్ధిక స్వాతంత్ర్యానికి, సామాజిక చలన శీలతకు (Social Mobility) తోడ్పడ్డారు. కొత్త భావాలను ప్రజల్లో వ్యాపింజేసే వాహికలుగా తయారయ్యారు.

**అభ్యాసం**

బ్రిటిష్ పాలనలో దేశంలో వ్యవసాయ రంగం పరిస్థితిని సమీక్షించండి.

BRAOU

## 7.4 సామాజిక వ్యవస్థ

ఆర్థిక వ్యవస్థతో పాటు, భారతదేశంలో, వలస పాలన కాలంలో, సామాజిక వ్యవస్థ కూడ అనేక మార్పులకు లోనైంది. మార్పులను పరిశీలించి, బేరీజు వేసే ముందు, అప్పటి సామాజిక వ్యవస్థ స్వరూపాన్ని తెలుసుకోవాల్సి ఉంటుంది.

### 7.4.1 కుల, ఉప కుల వ్యవస్థ

భారతీయ సమాజంలో అంతర్భాగంగా, ఆంధ్రప్రదేశ్‌లోని సమాజం అనేక కులాల, ఉప కులాల మధ్య తరతమ భేదాలతో ఉండేది. గ్రామీణ సమాజం అనేక కులాల సమ్మేళనంగా ఉండేది. ఒక్కొక్క కులం తరతరాలుగా వస్తున్న తనవృత్తిని చేసుకుంటూ, ఒక నిర్ణీత స్థాయిని సమాజంలో కలిగి ఉండేది. కాలక్రమేణా, అనేక చారిత్రక కారణాల వల్ల ముఖ్యంగా భౌగోళిక

విస్తరణ,చేతి వృత్తుల పెరుగుదల - అనేక ఉప కులాలు ఏర్పడ్డాయి. అనేకమైన ఈ ఉపకులాల మధ్య పరస్పర వివాహ భోజన సంబంధాలు కూడా ఉండేవి కావు. కులం సమాజాన్ని ఖండ ఖండాలుగా విడగొట్టి సామాజిక భావన, సామాజిక చైతన్యం పెంపొందకుండా చేసింది. ఈ కులవ్యవస్థ మొత్తం సమాజంలోని ప్రజలను మూడు భాగాలుగా విభజించింది. హెచ్చు లేక అధిక హక్కులు కలవాళ్ళు, కొద్ది హక్కులు గలవాళ్ళు, అసలు హక్కులు లేని వాళ్ళు - అస్పృశ్యులు గా యీ విభజన జరిగింది. మతపరమైన హక్కులు ఉండడం వల్లనూ, సాంప్రదాయక జ్ఞానంపై పట్టువల్లనూ, బ్రాహ్మణులు సామాజిక చట్రంలో పై అంతస్తులో ఉండేవారు. బ్రాహ్మణులకు మాన్యాలు, శ్రోత్రియాలూ, అగ్రహారాలూ వుండేవి. అందువల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో వారు భూకామందుల్లో ఒకరుగా ఉండేవారు. పైన పేర్కొన్నట్లుగా, మతపరమైన కర్మ కాండల్లో ఆధిక్యం వల్లా, జ్ఞానంపై ఉన్న గుత్తాధిపత్యం వల్లా, సమాజంలో అత్యంత గౌరవాన్ని పొందుతూ, నీతి, నియమ విషయాల్లో వారు చెప్పిందే ఆఖరు మాటగా చెలామణి అయ్యేది. బ్రాహ్మణుల్లో రెండు శాఖలుండేవి . నియోగులు, వైదికులు. వేదాధ్యయనం, పురోహిత విధుల నిర్వహణ, నీతి సూత్రాల రక్షణ వైదికుల జీవన విధానంగా ఉండేది. నియోగులు మతాతీతంగా ఉంటూ, లౌకిక విషయాల్లో ఆరితేరారు. పదవి, అధికారం అనే విషయాల్లో ప్రాబల్యాన్ని పొందారు. గ్రామస్థాయిలోని పరిపాలనలో గ్రామ కరణాలైనారు. ఇంగ్లీషు భాష నేర్చుకోవడంలో కంపెనీ పరిపాలనలో ముఖ్యమైన దుబాసీలుగా పనిచేయడంలో, ఉద్యోగాలు సంపాదించడంలోముందున్నారు. ఈ సందర్భంగా ఏనుగుల వీరా స్వామయ్య, వెన్నెలకంటి సుబ్బారావు, కాంద్రెగుల జోగిపంతులు, బుర్రా లచ్చన్న లాంటి వాళ్ళను గుర్తుంచుకోవాలి.

బ్రాహ్మణుల తర్వాత వాళ్ళు వైశ్యులు లేక కోమట్లు. వీరు బ్రాహ్మణులలాగే మత కర్మలను ఆచరిస్తూ, వితంతు వివాహాలను అనుమతించకుండా, బాల్య వివాహాలకు సమ్మతించారు. ఇది సాంస్కృతీకీకరణ (Sanskritisaton) లో భాగంగా గమనించాలి. వీరి ప్రధాన వ్యాపకం వ్యాపారం. అయినా వీరిలో చాలామంది వడ్డీ వ్యాపారులుగానూ, బ్యాంకర్లు గానూ ఉండేవారు. సహజమైన చొరవలో, వీరు వర్తక, వాణిజ్యావకాశాలు ఉన్న ప్రాంతాలకు వెళ్ళడానికి వెనుకాడేవారు కారు. పందొమ్మిదో శతాబ్దపు చివరి భాగానికి, మద్రాసు నగరంలో పనిచేస్తున్న అనేక భారతీయ వాణిజ్య ఏజన్సీ సంస్థలు, ఆంధ్రదేశపు కోమట్లు స్థాపించినట్టివే!

వైశ్యుల తర్వాత వాళ్ళు శూద్రులు. వీరిలో అనేక కులాలున్నాయి. ఇవి రెడ్డి, కమ్మ, కాపు, తెలగ, బలిజ, రాజు, విశ్వబ్రాహ్మణ, దేవాంగ, పద్మసాలి, మంగలి, చాకలి, కుమ్మర మొదలైనవి. ఈ కులాలు ప్రధానంగా వ్యవసాయం, చేతివృత్తులు చేసుకొనేవి. వీరి సామాజిక, స్థాయి, బ్రాహ్మణుల, వైశ్యులకు దిగువునా, అస్పృశ్యులకు పైనా ఉండేది. రెడ్లు, కమ్మలు, వెలమలు ప్రధానంగా వ్యవసాయ కులాలకు చెందినవారు. సామాజిక ఉత్పత్తి వీరి చేతిలో ఉన్నందున, వీరికి సమాజంలో ప్రాముఖ్యం లభించింది.

శూద్రుల తర్వాత సామాజిక బృందం అస్పృశ్యులు. సామాజిక నిమ్నోన్నత స్థాయిలో వీరు అట్టడుగున ఉన్నవారు. అస్పృశ్యులుగా పరిగణింపబడ్డారు. వీళ్ళను పంచములని అనేవారు. వీరినే నేడు దళితులు అని అంటున్నారు. వీరు వేరుగా, గ్రామానికి దూరంగా నివసించేవాళ్ళు. దాదాపు బానిసలుగా పరిగణించబడ్డారు. మధ్య యుగాల్లో వీరిని 'గోసంగులు' అనేవాళ్ళు. 'లెంకలు' అని కూడా పిలిచేవాళ్ళు. 'లెంక' అంటే దాసుడని అర్థం. తమ శారీరక శ్రమతో సామాజిక ఉత్పత్తికి వీరు ప్రముఖంగా తోడ్పడ్డారు. తద్వారా, ఆంధ్రదేశపు గ్రామీణ జీవితంలో వీరు ప్రధానమైన పాత్రను నిర్వహించారు. ఆర్థికంగా, సామాజికంగా వీరు అట్టడుగు మెట్టుపై ఉండేవారు. భూమిలేని నిరుపేద వ్యవసాయ కూలీలుగా ఉండేవారు. వీరికి సామాజిక స్థాయీ, సామాజిక హక్కులూ వుండేవికావు. అయితే, ఈ బ్రిటీషు ప్రభుత్వమూ, మిషనరీలూ చేసిన కృషివల్ల వీరిలో సామాజిక స్పృహ, స్థాయి, క్రమంగా వృద్ధి చెందుతూ వచ్చింది.

పైన చెప్పిన కులవ్యవస్థ, అప్పటి సామాజిక వ్యవస్థలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించింది. ఈ కులాలకు వేరు, వేరు

BRAOU

ఆచార ప్రవర్తనా నియమావళులు వుండేవి. అయితే ఇరవయ్యో శతాబ్దపు మొదటి నుండి దశకాల్లో, ఆంధ్రదేశంలో 'తక్కువ కులాల వాళ్ళు', ఆచార వ్యవహారాల్లో, మతకర్మల్లో, 'ఉన్నత కులాల వాళ్ళను' అనుసరించడానికి ప్రయత్నించారు. దీన్నే 'సాంస్కృతీ కరణ' (Sansktitisaton) అని చెప్పు కొంటాం. ఒక కులంగానీ లేదా ఉపకులంగానీ, తన ఆర్థిక స్థాయిని పెంచుకున్నప్పుడు, ఈ 'సాంస్కృతీకరణ' కృషి మొదలయ్యేది. ఇందులో భాగంగా అవమానకరమూ, అపవిత్రమూ అనిపించే వృత్తులు వదిలేసి, మాంసాహారాన్ని వదిలి పెట్టి, బాల్య వివాహాలు చేస్తూ, వితంతు పునర్వివాహాలూ, జంతు బలులూ, మద్యపానమూ మానివేశారు. ఆంధ్రదేశంలో బ్రాహ్మణేతరుల మధ్య కూడా ఎంతో భేదం ఉండేది. వీరిలో కుడిచేతి కులాలు (వలంగాయ్), ఎడమచేతి కులాలు (ఇడంగాయ్) అనే విభజన ఉండేది. ఈ విభజన కొన్ని వందల సంవత్సరాలుగా అమల్లో ఉన్నట్లు శాసనాధారాలు ఉన్నాయి. ముఖ్యంగా, ఆర్థిక వైరం మీద ఈ విభజన ఆధారపడినా, ఇది వివిధ సాంఘిక, మత రూపాల్లో వ్యక్తీకరించబడింది. కుడిచేతి కులాలు ప్రధానంగా వ్యవసాయిక వృత్తులు అవలంబించగా, ఎడమచేతి కులాలు ముఖ్యంగా చేతి వృత్తుల కులాలు. వీరి మధ్య విపరీతమైన ఘర్షణలు చెలరేగేవి. హింసాకాండకు ఈ ఘర్షణలు దారితీసేవి. వ్యాజ్యాలతో న్యాయస్థానాలు నిండిపోయి ఉండేవి.

కులభేదాల్లో, వాటికి సంబంధించిన విధి నిషేధాల గురించి గల సంప్రదాయిక భావాల్లోమార్పు వచ్చి, సామాజిక చలనశీలత (Social Mobility) వచ్చాక కూడా కులభేదాలు, పైకి కనిపించకున్నా, మనుషుల అంతరాంతరాల్లో కొనసాగుతూనే ఉండేవి. ఈ విభేదాలు మనుషుల మనస్సుల మీద తమ పట్టువదల్లేదు. ఆంగ్ల విద్య ప్రవేశపెట్టడం, అంతకు ముందున్న ఆర్థిక వ్యవస్థలో మార్పులు రావడం, పట్టణాలు పెరగడం, వీటన్నింటి ఫలితంగా వివిధ కులాల మధ్య సామాజిక సంబంధాలకు ఎక్కువ అవకాశాలు ఏర్పడ్డాయి. అందువల్ల కుల కట్టుబాట్లు కొంత వరకు సడలిపోయినాయని చెప్పక తప్పదు.

## 7.4.2 సాంఘిక దురాచారాలు

సాంఘిక దురాచారాలు సమాజాన్ని పట్టి పీడిస్తూఉండిన కాలమది. వీటిని మత, సామాజిక, ఆర్థిక దురాచారాలుగా విభజించి వచ్చు. సామాజిక దురాచారాల్లో అత్యంత క్రూరమైంది సహగమనం. అలాగే నిప్పుల మీద నడవడం, కొక్కేనికి వేలాడ్డం (Hook Swinging) ఇలాంటివే. ఈ దురాచారాలు ఆంధ్రదేశంలో వ్యాప్తి చెంది ఉండేవి. ఆర్థిక దురాచారాల్లో అత్యంత హేయమైన గృహ బానిసత్వం (domestic slavery) కూడా సమాజంలో ఉండేది. ప్రధానంగా వీరిలో వ్యవసాయ కార్మికులు ఉండేవారు. బ్రిటీష్ పరిపాలనలో ఈ దురాచారాలు, కొంతవరకు, వారుచేసిన చట్టాల ఫలితంగా తగ్గినా సహగమనం మినహా మిగతా అన్ని దురాచారాలు కొనసాగుతూనే వుండేవి. ముఖ్యంగా గృహబానిసత్వం ఇంకా కొనసాగుతోంది.

సమాజంలో స్త్రీల హీనస్థితి మధ్య యుగాల్లోనే ఒక అవమాన దశకు చేరుకుంది. పితృస్వామ్య భావజాలంలో స్త్రీలు అత్యంత హీనమైన దోపిడీకి గురి అయినారు. ముస్లిం, పాలకులు, ఆ తరువాత వచ్చిన బ్రిటీష్ వారు కూడ తమ స్వార్థ ప్రయోజనాల వల్ల సంపూర్ణంగా నూతన ఉన్నత సామాజిక అభివృద్ధి దశను ప్రవేశ పెట్టలేదు. 1857 తిరుగుబాటు తరువాత వలస పాలకులు తమ పాలనకు భారతీయుల అండదండలు ఎంతో అవసరమని భావించి, చరమావస్థలో వున్న ఫ్యూడల్ వ్యవస్థకు పునః ప్రతిష్ఠ చేశారు. అందువల్ల, సామాజిక రుగ్మతలూ, దురాచారాలూ యధాతథంగా కొనసాగాయి. శాసనాల ద్వారా వాటిని నిర్మూలించడానికి చేసిన ప్రయత్నాలు కొంతవరకే ఫలించాయి. ప్రజామోదం పొందని , వారి ఆదరణకు నోచుకోని శాసనాలు చేయడం వల్ల ఫలితం చేకూరదు. అంతేగాక, అవసాన దశలో ఉన్న సామాజిక వ్యవస్థను తమ స్వార్థ రాజకీయ ప్రయోజానాల కొరకు కొనసాగిస్తూ, మరోవైపు ఆ వ్యవస్థకు సంబంధించిన దురాచారాలను నిర్మూలించడానికి శాసనాలు చేయడం పాలకుల ద్వంద్వ స్వభావాన్ని తెలియ జేస్తుంది.

ఆంధ్ర సమాజాన్ని పట్టి పీడించిన దురాచారాల్లో ముఖ్యమైనవి: కన్యాశుల్కం, సానివృత్తి, బాల్య వివాహాలు. బాల్య

BRAOU

వైధవ్యం కన్యాశుల్కం మూలంగా కలిగినదే. ఇక వితంతువుల పరిస్థితి. ముఖ్యంగా ఉన్నత కులాల్లో, హృదయ విదారకంగా ఉండేది. గ్రామాల్లో కింది కులాలని చెప్పబడే వాటిల్లో వితంతు వివాహాలు జరుగుతూ ఉండేవి. కాని ఉన్నత కులాల్లో మాత్రం అవి బొత్తిగా లేవు. ఇక దేవదాసీ వ్యవస్థ ఒక కొత్త కులంగానే (భోగంవాళ్లు) రూపొందింది. వాళ్ళకు సంబంధించిన సొంత ఆచారాలు, ప్రవర్తన పద్ధతి, వారసత్వ నియమ నిబంధనలు ఉండేవి. దేవాలయంలోనే ఏదో ఒక దేవుడిని 'వివాహం' చేసుకొని వేశ్యావృత్తిలో జీవిస్తూ నృత్య ప్రదర్శనలు ఇచ్చేవారు. నృత్య సంగీతాల్లో ప్రావీణ్యం పొందిన వారు వీరిలో ఉండేవారు. అయితే, సామాజికులను సంతృప్తి పరచడానికి వీరు అభ్యంతరకమైన, అశ్లీలమైన ప్రదర్శనలు ఇవ్వడం వల్ల, అంతంత మాత్రంగా ఉండిన నైతిక విలువలు మరింత క్షీణించాయి.

ప్రజలు విద్యావంతులు కానందున, అనేక మూఢ విశ్వాసాలు సమాజంలో ఉండేవి. శకునాలను పాటిస్తూ, దెయ్యాలు ఉన్నాయని నమ్మేవాళ్లు. శిశు జననం నుండి మనిషి మరణం దాకా అనేక కర్మకాండలను మతం విధించింది. వీటిని పాటించకుండా ఉండటం కష్టమైంది. స్త్రీలు తమ పిల్లల ఆరోగ్యం కొరకు గుడ్డి నమ్మకాలపై ఆధారపడేవారు. పిల్ల ఆరోగ్యం చెడిపోయినప్పుడు ఏ దేవతకో, దేవుడికో మొక్కుకునేవారు. పిల్లలకు టీకాలు వేయించేవారు కారు. వేయిస్తే అమ్మవారికి కోపం వస్తుందని భయపడేవారు. హిందూ మతం విధించిన ఖర్చుతో కూడిన అనేక కర్మ కాండలను సమాజంలో ధనిక వర్గాల వారు మాత్రమే చేస్తుంటే, డబ్బులేని బీదా, బిక్కి జనం వీటికి దూరంగా ఉండేవారు.

### 7.4.3 విద్య

సమాజంలో విద్య, బ్రిటీషు పాలన ఆరంభంలో ఏ కొద్ది మందికో పరిమితమై ఉండేది. వీధి బళ్లు అనబడే పాఠశాలల్లో బోధించే విద్య ఎంతో అశాస్త్రీయమైన పద్ధతిలో ఉండేది. మన్రో (Munro) మద్రాసు రాష్ట్ర గవర్నరుగా ఉండిన కాలంలో (1820-27), విద్యా విధానం గురించి ఆయన కొన్ని చర్యలు చేపట్టాడు. ఆ మేరకు జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు పంపాడు. వారు దేశంలో పేదరికం పెరిగి నందువల్ల దేశీయ విద్యా వ్యవస్థ క్షీణ దశలో ఉందని అభిప్రాయ పడ్డారు. చిలక పలుకుల్లా పద్యాలను కంఠస్థం చేయడం, అతి ప్రాథమిక మైన గణితం నేర్పడం, చదవడానికీ, రాయడానికీ సరిపోయేంత వరకు విద్య నేర్పడం రివాజుగా ఉండేది. ఈ స్థితి నుండి మన్రో విద్యా వ్యవస్థను కొంత మేరకు సంస్కరించాడు. మొత్తం మద్రాసు రాష్ట్రానికి ఒక 'పౌర విద్యా సమితి' స్థాపించబడింది. దీని ఆధ్వర్యంలో ప్రతి జిల్లాకు రెండు ప్రధాన పాఠశాలలు, ప్రతి తాలూకాకు ఒక నిమ్న పాఠశాలను నెలకొల్పారు. ఈ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు చేశారు. ' పాఠ్య పుస్తక సంఘం' అనేదాన్ని కూడా ఏర్పాటు చేశారు. వీటి నిర్వాహణకు సంవత్సరానికి 50,000 రూపాయలు మంజూరు చేశారు. అయితే మన్రో తరువాత ఈ పథకం నీరుగారి పోయింది.

వలస పాలకులు నూత విద్యా విధానాన్ని ప్రవేశపెట్టడానికి రెండు ముఖ్య కారణాలు ఉన్నాయి. ఒకటి, కింది స్థాయి పరిపాలన నిర్వహణ కొరకు కావలసిన సిబ్బందిని సంపాదించడం. రెండు, ప్రజల్లో పాశ్చాత్య విజ్ఞానాన్ని వ్యాప్తి చేయడం, ఈ లక్ష్య సాధనకు సంవత్సరానికి యాభైవేల రూపాయలు కేటాయించినా అది పూర్తిగా ఖర్చు పెట్టబడలేదు. పైగా, బెంగాల్, బొంబాయి రాష్ట్రాలతో పోల్చినప్పుడు ఇది చాలా తక్కువ. 1854 "ఉడ్స్ డిస్‌పాచ్" (Woods Despatch) తరువాత విద్య క్రమంగా పై వర్గాల నుండి కిందికి వ్యాపిస్తుందనే విధానం ఆశించిన ఫలితాలను సాధించలేదు. దీనివల్ల ఆంధ్రదేశంలోవిద్యాభివృద్ధి బాగా దెబ్బతింది. అయితే గోదావరి ప్రాంతంలో స్థాపించబడ్డ రేట్ స్కూళ్లు (రైతులు ప్రత్యేక పన్ను చెల్లించడం ద్వారా స్థాపించబడ్డ స్కూళ్లు), ఆ తరువాత కాలంలో మొత్తం ఆంధ్రదేశానికి వ్యాప్తి చెంది, విద్యాభివృద్ధి కి తోడ్పడ్డాయి. ఇంతేకాక విద్యావ్యాప్తిలో ప్రభుత్వంతో పాటు మిషనరీలు కూడా ముఖ్యపాత్ర వహించారు. 1836 తరువాత ఈ మిషనరీ పాఠశాలలు వ్యవస్థీకృతమయ్యాయి. వీరు బాలురకు, బాలికలకు కూడా పాఠశాలలు ప్రారంభించారు. తెలుగులో పుస్తకాలు ప్రచురించారు. మతాంతరీకరణ వీరి ప్రధాన లక్ష్యం. అయినప్పటికీ, విద్యా వ్యాప్తికి వీరు చేసిన కృషి శ్లాఘనీయం.

BRAOU

19వ శతాబ్దపు అంతానికి ఆంధ్రదేశంలో మొత్తం నాలుగు కళాశాలలు ఉండేవి. ఇవి 1857లో స్థాపించబడిన మద్రాసు విశ్వ విద్యాలయానికి అనుబంధమయ్యాయి. ఈ జరిగిన విద్యా వ్యాప్తి ప్రధానంగా పట్టణాలకు పరిమితమైంది. అంతేకాక ఇది సమాజంలోని -ఉన్నత, మధ్య తరగతులకు మాత్రమే విస్తరించింది. ఉన్నత విద్యలో మాత్రం పైచేయి బ్రాహ్మణులదే. అయినా ప్రాథమిక విద్యలో ఇతర కులాల వాళ్లు గణనీయమైన అభివృద్ధి సాధించారు. దళిత వర్గాల్లో మాత్రం విద్య చాలా వరకు మృగ్యం గానే ఉండిపోయింది. దీనికి కారణం వారి బీదరికం, సామాజిక పీడన.

## 7.4.4 ఉద్యమాలు

స్వాతంత్ర్యానికిపూర్వం ఆంధ్రదేశంలోని సామాజిక వ్యవస్థను ప్రబలంగా ప్రభావితం చేసిన రెండు ఉద్యమాల గురించి మనం చెప్పుకోవాలి. ఇందులో మొదటిది, సాంస్కృతిక 'పునరుజ్జీవన'మని మనం చెప్పుకుంటున్న సాంఘిక సంస్కరణోద్యమాలు. ఇక రెండవది, జాతీయోద్యమం. ముందుగా మనం సంస్కరణోద్యమాలను గురించి తెలుసుకుందాం. వలస సంస్కృతికి వ్యతిరేకంగా ఒక లక్ష్యంతో, మరోవైపు వెనుకబడిన భారతీయ సమాజాన్ని సంస్కరించాలన్న ధ్యేయంతో, రెండు విధాలుగా సంస్కరణోద్యమాలు సాగాయి. ఆధునిక కాలానికి అనుగుణంగా, ఆంధ్రదేశ సమాజాన్ని మలచి మార్చడంవీటి ధ్యేయం. హేతువాద చింతన, శాస్త్రీయ అవగాహన వీటి ప్రధాన సూత్రాలు. ఈ కొలబద్దలతో, వీరేశలింగం, రఘుపతి వేంకటరత్నం లాంటి మేధావి సంస్కర్తలు సంఘ సంస్కరణకు, దానిలో భాగంగా మత సంస్కరణకు, పాటు పడ్డారు. సాంఘిక దురాచారాలను నిర్మూలించడం, మూఢ విశ్వాసాలను తొలగించడం వీరు చేసిన కృషిలో ముఖ్య భాగమైంది. మత విషయాల్లో సార్వత్రిక వాదాన్ని (universalism) వీరు ప్రవేశపెట్టారు. సకల ప్రపంచానికీ, మతాలు, పేర్లు వేరైనా, దేవుడు ఒక్కడేనని, అతడు నిర్గుణుడని, నిరాకారుడని, సర్వవ్యాపి అని నమ్మారు. విగ్రహారాధనను ఖండించారు. బహు దేవతారాధనను నిరసించారు. అలాగే సాంఘిక విషయాల్లో అజ్ఞానాన్ని పారద్రోలడానికి, విజ్ఞతతో కూడిన విచక్షణ శక్తిని పొందడానికి సార్వజనీన విద్య ఒక్కటే పరిష్కార మార్గమని నమ్మారు. విద్యావ్యాప్తి, అందులోనూ ముఖ్యంగా స్త్రీ విద్య, వీరి ప్రధాన ఆశయమైంది. వీరి దృష్టిలో సమాజంలోస్త్రీ అత్యంత హేయమైన పీడనకు దోపిడీకి గురైంది. స్త్రీ సముద్ధరణ ప్రధాన ధ్యేయంగా సాంఘిక సంస్కరణల కోసం ఉద్యమాలు ప్రారంభించి, పత్రికలు స్థాపించి, గ్రంథాలు ప్రచురించి అవిరళ కృషి చేశారు. ప్రజల ఆలోచనా విధానంలో ఒక భావ విప్లవాన్ని తీసుకు రావడానికి ఎనలేని కృషి చేశారు. భాషను సరళీకరించి ప్రజలకు అవసరమైన సాహిత్యాన్ని సృష్టించారు. మొత్తం సామాజిక జీవనాన్ని ప్రజాతంత్రపరం చేయడానికి వీరు చేసిన కృషి ఆంధ్రదేశ సమాజాన్ని ఆధునికీకరణ వైపు మళ్ళించింది. వలస సంస్కృతికి, దాని ఆర్థిక పీడనకు గండి కొట్టడంలో వీరు కొంత వరకూ కృతకృత్యులయ్యారు. అనేక సాంఘిక పరమైన, విద్యాపరమైన సంస్కృతీ పరమైన సమాజాలను స్థాపించడం ద్వారా ఆ తరువాత వచ్చిన జాతీయోద్యమానికి నాంది పలికారు.

పందొమ్మిదో శతాబ్దాంతంలో జాతీయోద్యమం ప్రారంభమైనా, ఇరవయ్యో శతాబ్దం మొదటి దశకంలోనే అది ఆంధ్రదేశంలో ఊపందుకొంది. స్వదేశీ ఉద్యమం 1905లో మొదలైనపుడు, మేధావులు, విద్యార్థి, యువజన, మధ్య తరగతి వర్గాలు ఇందులో చురుగ్గా పాల్గొన్నాయి. జాతీయోద్యమ విజృంభణలో సమాజాన్ని సంస్కరింప పూనుకొన్న సాంఘిక ఉద్యమాలు తగ్గు ముఖం పట్టాయి. జాతి విముక్తి ప్రధాన ధ్యేయంగా, జాతీయోద్యమం క్రమేపీ సమాజంలోని అన్ని వర్గాలకూ విస్తరించి, ప్రజా జీవితంలోని అన్ని కోణాలను ప్రభావితం చేసింది. 1910 తర్వాత ప్రత్యేక రాష్ట్రం కోసం ఆంధ్రోద్యమం మొదలైంది. (ఈ ఉద్యమాన్ని గూర్చిన సమగ్ర సమాచారాన్ని వేరే భాగంలో వివరించడం జరిగింది.) ఈ రెండు ఉద్యమాలు, స్వభావంలో ప్రధానంగా రాజకీయ పరమైనవే అయినా, ఇవి ఆంధ్ర దేశపు సమాజాన్ని, ప్రజా జీవితాన్ని కుదిపి వేశాయి. జాతీయమైన ఉద్యమాల రూపంగా కాకున్నా, సామాజిక సంస్కరణ కోసం వ్యక్తుల, సంస్థల కృషి కొనసాగింది. రాజకీయ ఉద్యమాల్లో అంతర్భాగంగా సంస్కరణాభిలాష కొనసాగింది. జాతీయోద్యమం వటవృక్షం లాంటిది కావటం వల్ల, ప్రజల అకాంక్షలను, ఆశలనన్నింటినీ తనలో ఇముడ్చుకొంది. రాజకీయ స్వాతంత్ర్యం కోసం ఒకవైపు పోరాడుతూనే ,మరోవైపు సామాజిక పునర్నిర్మాణానికి అనేక కార్యక్రమాలు చేపట్టారు. అస్పృశ్యతా నివారణతో పాటు హరిజనోద్ధరణ, గ్రామ

BRAOU

పునర్నిర్మాణంలో భాగంగా కుటీర పరిశ్రమల పునరుద్ధరణ, మద్య నిషేధం, దేవదాసీ వ్యవస్థ నిర్మూలనల కోసం కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ ఉద్యమాల్లోకి అసంఖ్యాకంగా, అన్ని వర్గాల ప్రజలు అత్యుత్సాహంగా ప్రవేశించారు.

సామాజిక చైతన్యం పురి విప్పింది. సాహిత్యం ఒక సాధనంగా చేబూని, ఈ సమస్యలన్నింటిపై విస్తారమైన సృజనాత్మక సాహిత్య సృష్టి జరిగింది. మత విభేదాలు, కుల కట్టుబాట్లు సడలాయి. ప్రపంచంలో, అనేక ప్రాంతాల్లో జరుగుతున్న విప్లవాలు, పోరాటాలు భారతీయుల్ని , ప్రత్యేకించి ఆంధ్రులను, జాగృత మొనర్చాయి. ముఖ్యంగా ఈ సందర్భంలో చెప్పుకోదగ్గవి సామ్యవాద భావాలు. రష్యాలో బోల్షివిక్ విప్లవం విజయవంతమైనాక, సోవియట్ రాజ్యం, దాని ఆర్థిక, సామాజిక విధానాలు ప్రజల దృష్టిని ఆకర్షించాయి. ఆర్థిక అసమానతలు తొలగాలనీ, సాంఘిక న్యాయం అందరికి అందించగలగాలనీ, అంతర్జాతీయంగా దుష్ట శక్తులైన ఫాసిజం, నాజీజంలకు వ్యతిరేకంగా పోరాడాలన్న నిశ్చయంతో వామపక్ష ఉద్యమాలు ముందుకొచ్చాయి. తెలుగువారి సాంఘిక జీవనంపై ఈ ఉద్యమాల ప్రభావం ఎంతైనా ఉంది. అసంపూర్ణంగా మిగిలిపోయిన ఆధునికీకరణ ప్రక్రియను తిరిగి ఆరంభించి, సాంస్కృతిక పునరుజ్జీవన భావజాలానికి పునః ప్రతిష్ఠ చేశాయీ ఉద్యమాలు. సామ్యవాద భావాలతో కూడిన సాహిత్యం సృష్టించి ప్రజా కళలను పునరుద్ధరించి, తెలుగు నాట గ్రామ గ్రామాన గ్రంథాలయాలు నెలకొల్పి, యువకులను సమీకరించి, జాతీయోద్యమంలో భాగంగా ఉంటూ, ఆంధ్రదేశ సమాజంలో ఉన్న అంతర్గత వైరుధ్యాల పరిష్కారానికి కృషిచేశాయి.

19వ శతాబ్దపు సంస్కరణోద్యమాలు, ఇరవయ్యో శతాబ్దపు జాతీయోద్యమం - ఈ రెండు ఉద్యమాల ఫలితంగా ఆంధ్రదేశంలోని సామాజిక వ్యవస్థలో చెప్పుకోదగ్గ చలన శీలత కలిగి, ప్రాజ్ఞ వాతావరణం ఏర్పడ్డానికి దోహదం కలిగింది. పెట్టుబడిదారీ సమాజం పూర్తిగా రూపుదిద్దుకోని మాట నిజమే అయినా, ప్రజాతంత్ర విప్లవం ఫలశ్రుతి పొందకపోయినా, ఆ మార్గంలో సమాజం పయనించడం మొదలైంది. స్వాతంత్ర్యానంతర భారతీయ సమాజం, అర్ధాంతరంగా ఉండిపోయిన, ఈ రెండు గమ్యాల విషయంలో ఏం చేసింది, ఎలా పరిణామం చెందిందన్న ప్రశ్నలు, వేరే చర్చనీయాంశాలు.

**అభ్యాసాలు**

ఆంధ్రప్రదేశ్‌లో కుల వ్యవస్థను క్లుప్తంగా వివరించండి.

BRAOU

ఆంధ్రోద్యమం ప్రభావం గురించి రాయండి.

## 7.5. తెలంగాణాలో ఆర్థిక సామాజిక వ్యవస్థలు

ఆంధ్రప్రదేశ్ ఏర్పడక పూర్వం తెలంగాణా ప్రాంతం హైదరాబాద్ సంస్థానంలో (రాష్ట్రంలో) భాగంగా ఉండేది. తెలంగాణా ప్రాంతాన్ని అసఫ్ జాహి వంశస్థులు రెండు శతాబ్దాలకు పైగా (1724-1948) పరిపాలించారు. ఈ వంశానికి చెందిన రాజులు ప్రజామోదాన్ని పొందలేక పోయారు. వీరి హయాంలో హైదరాబాద్ రాజ్యం అన్ని రంగాల్లోనూ వెనుకబడింది. ఈ రెండు శతాబ్దాల పరిపాలన కాలంలో అభివృద్ధి ముఖ్యంగా సాగిన సంస్కరణలూ సాలార్‌జంగ్ (1853-1883) ప్రవేశపెట్టినటువంటివి. ఆ తరువాత కొంత వరకు ఆఖరి నిజాం, ఉస్మాన్ ఆలీఖాన్, పరిపాలన కాలంలో, ఆర్థికాభివృద్ధి, విద్యా వ్యాప్తి జరిగింది.

హైదరాబాద్ రాష్ట్రంలో పలు భాషలు మాట్లాడే ప్రజలు ఉండేవారు. వీరు ఆంధ్రులు, మహారాష్ట్రులు, కన్నడిగులు. అయితే జనాభాలో సగానికిపైగా తెలుగువారు ఉండేవారు. దురదృష్టం ఏమిటంటే, తెలుగు భాష పూర్తిగా నిరాదరణకు గురైంది. కొద్దిమంది మాట్లాడే పర్షియన్, ఉర్దూ భాషలను మాత్రమే అధికార భాషలుగా గుర్తించారు. ప్రభుత్వ ఉద్యోగుల్లో అధిక భాగం ఉత్తర భారతదేశం నుండి లేదా మహారాష్ట్ర ప్రాంతం నుండి వచ్చినవారు. తెలంగాణా ప్రాంతానికి చెదిన తెలుగువారు పాలకుల నిరాదరణకు గురయ్యారు. దీనివల్ల మీర్ మహమ్మదాలీ కాలంలో ఇది 'ముల్కీ-నాన్‌ముల్కీ' (స్థానికులు - స్థానికేతరులు) అనే వివాదంగా పరిణమించింది. దీంతో, ఆఖరి నిజాం ప్రభువు ఉస్మాన్ ఆలీఖాన్ ముల్కీలకే (స్థానికులు) ప్రభుత్వ పదవులు లభించేటట్లు ఉత్తర్వులు జారీ చేశాడు. ఈ సమస్య ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డ తరువాత కాలంలో కూడా వివాదాస్పదంగా తయారై అనేక అలజడులకు, ప్రాంతీయ తత్వానికి దోహదం కావడం మనం గమనించాలి. హైదరాబాద్ రాష్ట్రంలో అధిక సంఖ్యాకులు హిందువులు కాగా, అత్యంత మైనారిటీలో ఉన్న ముస్లిములు పాలకులు. అయితే వీరి మధ్య చాలా వరకు మతపరమైన విద్వేషాలు లేకుండా స్నేహంగా కలిసి ఉండేవారు. దీనికి ఉదాహరణగా కొందరు ప్రముఖులైన హిందువులు - చందులాల్, కిషన్ ప్రసాద్ మొదలైనవారు - ఆనాడు అత్యంత ఉన్నత పదవులను పరిపాలన యంత్రాంగంలో పొందగలిగారు. వీరి మధ్య వివాహ సంబంధాలు కూడా ఉండేవి. ఈ విధంగా వివిధ సంస్కృతుల సమన్వయం, సమ్మేళనం మనం చూడవచ్చు.

ఆర్థిక పరిస్థితులను గురించి అంచనా వేసినప్పుడు, అసఫ్‌జాహీల పరిపాలనలో జమిందారీ పద్ధతి బాగావేళ్లూనుకొంది. భూమిలో సగ భాగం జాగీర్దార్ల ఆధీనంలో ఉండేది. వారి చేతిలో శాంతి భద్రతలకు సంబంధించిన బాధ్యతలూ అధికారాలతో పాటు న్యాయాధికారాలు కూడా ఉండేవి. స్థానికంగా వారే సర్వసత్తాక ప్రభువులుగా ఉండేవారు. భూమిపై యాజమాన్యం

BRAOU

రైతులకు ఉండేది కాదు. జాగీర్దార్లు నియంతలై సర్వ హక్కులను అనుభవిస్తూ, ప్రజలపై విపరీతంగా పన్నులను విధించి, వారిని వెట్టి చాకిరీకి గురిచేసి హింసించేవారు. ఆర్థిక దోపిడీ ఆనాడు ప్రబలంగా ఉండేది. పరిపాలన యంత్రాంగపు అన్ని దొంతర్లలో ఉండే అధికార్లు ప్రజల్ని నిర్దాక్షిణ్యంగా దోపిడీ చేసి పీడించేవారు. నిజాం అధికారం కింద పని చేస్తున్న జాగీర్దార్లు, జమిందార్ల మధ్య చెలరేగిన అంతఃకలహాలు ఆనాటి ఆర్థిక, సామాజిక వ్యవస్థలను మరింత ఛిన్నాభిన్నం చేశాయి.

వ్యవసాయదార్లకు అవసరమైన సేద్యపు నీటి సరఫరా ప్రాజెక్టులు కొంతవరకు వీరి పరిపాలనలో కొనసాగాయి. 'మీర్ ఆలాం' అనే తటాకాన్ని, గండిపేట చెరువుగా ప్రసిద్ధి చెందిన ఉస్మాన్ సాగరాన్ని వీరు నిర్మించారు. ఈ క్రమంలోనే ఉస్మాన్ అలీఖాన్ నిజాంసాగర్‌ను కూడా నిర్మించాడు. ఇదొక గొప్ప సేద్యపు నీటి ప్రాజెక్టు. హిమాయత్ సాగర్ కూడా ఇతడే నిర్మించాడు. ఇవి మినహా తెలంగాణా భూభాగంలో ప్రజలకు అవసరమైన నీటి పారుదల సౌకర్యాలు కల్పించలేదు. అందువల్లనే కరువులు,కాటకాలతో తెలంగాణా ప్రాంతం కుంగిపోయింది.

పై విధంగానే హైదరాబాద్ రాష్ట్రంలో ఒక క్రమ పద్ధతిలో పరిశ్రమలు, వర్తక వాణిజ్యాలు అభివృద్ధిచెందలేదు. కానీ, ఆఖరి నిజాం ఉస్మాన్ అలీఖాన్ తన హయాంలో కొన్ని కుటీర పరిశ్రమలు యంత్ర పరిశ్రమలు స్థాపించాడు. చేనేత, పట్టు పరిశ్రమలకు గద్వాల, సిద్ధిపేట, ఔరంగాబాద్ పట్టణాలు పేరు గాంచాయి. పంచదార పరిశ్రమ (బోధన్), కాగితపు పరిశ్రమ (సిరిపూర్ కాగజ్ నగర్), సిగరెట్ల పరిశ్రమ (చార్మినార్ ఫ్యాక్టరీ), అజాంజాహి బట్టల మిల్లు (వరంగల్) ఈ సందర్భంగా చెప్పుకోదగ్గ పరిశ్రమలు. ఈ విధమైన పారిశ్రామిక ప్రగతి వల్ల అనేక వేల మంది కార్మికులకు జీవన భృతి కలిగింది.

తెలంగాణాలో రవాణా సౌకర్యాల అభివృద్ధి ఎక్కువగా జరగలేదు. కానీ, సాలార్ జంగ్ దివాన్‌గా ఉన్నప్పుడు హైదరాబాద్ నుండి షోలాపూర్ వరకూ ప్రధాన రహదారీ నిర్మాణం జరిగింది. ఆ విధంగానే తెలంగాణా ప్రాంతంలోని జిల్లా కేంద్రాలను కలుపుతూ రహదార్లను కూడా వేయడం జరిగింది. ఆంధ్ర ప్రాంతాన్ని కలుపుతూ కొన్ని రహదార్లు నిర్మించినా ఇవి చాలా తక్కువ మాత్రమే. రైలు మార్గాలకు సంబంధించి హైదరాబాద్‌ను బొంబాయితోనూ, మద్రాసుతోనూ సంధించడం జరిగింది. 1878లో సాలార్‌జంగ్ హైదరాబాద్ నుండి వాడి వరకూ రైలు మార్గాన్ని పూర్తి చేశాడు. ఆ తరువాత హైదరాబాద్ - విజయవాడలను కలుపుతూ రైలు మార్గం ఏర్పడింది. ఈ రవాణా సౌకర్యాలు అతి స్వల్పంగా ఉండి హైదరాబాద్ రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి దోహదం చేయలేక పోయాయి.

BRAOU

ఆంధ్ర ప్రాంతంలో లాగా తెలంగాణాలో సాంస్కృతిక, రాజకీయ చైతన్యం త్వరగా రాలేదు. దీనికి కారణం హైదరాబాద్ స్వదేశీ సంస్థాన రాజ్యం కావడం ఒకటి. అక్కడి విద్యా, వైజ్ఞానిక ప్రగతికి కావలసిన చర్యలు ప్రభుత్వం చేపట్టక పోవడం మరొక కారణంగా భావించాల్సి ఉంటుంది. రాజకీయంగా నిరంకుశమైనరాజ్యం ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో మరింత వెనుకబడి ఉండేది. కానీ భారత దేశంలోని ఇతర ప్రాంతాల్లో సంభవించిన, నూతన భావాలతో కూడిన ఉద్యమాలు, చైతన్యం హైదరాబాద్ రాష్ట్ర ప్రజలను కూడా జాగృత మొనర్చాయి. 1883లో చందా రైల్వే ప్రణాళికపై వచ్చిన ప్రజా నిరసన ఈ ప్రాంతంలో పొటమరించిన మొట్టమొదటి ప్రజాభిప్రాయ చర్యగా భావించవచ్చు. భారత జాతీయ కాంగ్రెస్ (1885) ఏర్పడ్డ తరువాత జాతీయోద్యమ భావాలు నిజాం రాజ్యంలో ప్రచారం కావడం ఆరంభమైంది. ఈ భావ ప్రసారానికి తోడ్పడిన వారిలో ప్రథమంగా చెప్పుకోదగ్గ వ్యక్తి డా॥ అఘోరనాథ చటోపాధ్యాయ (ప్రముఖ కవయిత్రి, జాతీయవాది సరోజినీ నాయుడు తండ్రి). అయితే సాంస్కృతిక చైతన్యం, దానితో పాటు రాజకీయ చైతన్యం కూడా 1892లో ఆర్య సమాజం శాఖ హైదరాబాద్‌లో ఏర్పడ్డంతో ప్రారంభమైంది. 1901లో హైదరాబాద్‌లోని తెలుగువారి కృషి వల్ల, శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం అనే తెలుగు గ్రంథాలయం ప్రథమంగా వెలిసింది. ఆ తరువాత 1906లో విజ్ఞాన చంద్రికా మండలి అనేసంస్థను కొమర్రాజు వేంకట లక్ష్మణరావు స్థాపించారు. ఆ తరువాత, 1920 నుండి (1919లో ఉస్మానియా విశ్వవిద్యాలయం స్థాపించారు) జాతీయ ఉద్యమం జవ సత్వాలను పుంజుకొని, వార్తా పత్రికలు, ప్రారంభమై జాతీయ భావ ప్రభావ రాజకీయ చైతన్యం ఇనుమడించింది. ఆంధ్ర

జన సంఘం అనే సంస్థ తెలుగువారి సాంస్కృతిక, సాంఘిక, ఆర్థిక వికాసానికి అవిరళ కృషి సల్పింది. 1930లో ఆంధ్రజన సంఘం ఆంధ్ర మహాసభగా మారింది. మరొక వైపు హైదరాబాద్ రాష్ట్రంలో ఆంధ్రోద్యమం, ఈ రెండు ఉద్యమాలు తెలంగాణాలో తెలుగువారి ఆర్థిక,సామాజిక అభివృద్ధికి కృషి చేశాయి.

## అభ్యాసం

తెలంగాణాలో సాంస్కృతిక పరిస్థితులను సమీక్షించండి.

## 7.6 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం.

★ పునాది అంశాలు, ఉపరితల అంశాలకు మధ్య ఉన్న గతి తార్కిక సంబంధం మానవ చరిత్రను అవగాహన చేసుకోవటానికి ఎంతో ఉపకరిస్తుంది.

★ ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక వ్యవస్థ వ్యవసాయ ప్రధానమైంది. పట్టణీకరణ తరువాత అక్కడ పరిశ్రమలు ఆధారంగా కొత్త కార్మిక వర్గాలు, మధ్య తరగతి ఉద్యోగి వర్గాలు ఏర్పడ్డాయి.

★ ఆంధ్ర ప్రదేశ్‌లోనిసమాజం అనేక కులాలు, ఉప కులాల మధ్య తరతమ భావాలతో ఉండేది. వలస పాలనలతో విద్యా విధానం భావ చైతన్యానికి దోహదం చేసింది.

★ జాతీయోద్యమం, ప్రత్యేక రాష్ట్రోద్యమం, సంఘ సంస్కరణోద్యమాలు ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక వ్యవస్థను ప్రభావితం చేశాయి.

★ తెలంగాణాలో అసిఫ్‌జాహీల పరిపాలనలో, నిజాం అధికారం కింద ఆనాటి ఆర్థిక సామాజిక వ్యవస్థలు ఛిన్నా భిన్నం అయ్యాయి.

★ ఆంధ్రోద్యమం, జాతీయోద్యమం తెలంగాణా సామాజిక జీవనాన్ని బాగా ప్రభావితం చేశాయి.

BRAOU

## 7.7. మాదిరి పరీక్షా ప్రశ్నలు

*0 పంక్తులలో జవాబులు రాయండి.*

1. ఆంధ్ర ప్రదేశ్‌లోనిసామాజిక వ్యవస్థను గూర్చి వివరించండి.
2. ఆంధ్ర ప్రదేశ్ ఆర్థిక వ్యవస్థపై వలసవాద ప్రభావాన్ని గురించి రాసి, అది చెందిన మార్పుల గురించి రాయండి.

*15 పంక్తులలో జవాబులు రాయండి.*

1. నిజాం రాష్ట్రంలోని తెలంగాణా ప్రాంతపు సామాజిక, ఆర్థిక వ్యవస్థల గూర్చి రాయండి.
2. ఆంధ్ర దేశంలో విద్యా విధానం పెంపొందిన తీరు గూర్చి రాయండి.

BRAOU

# భాగం 8 లలిత కళలు

విషయ క్రమం


8.0 ఉద్దేశం

8.1 ప్రవేశిక

8.2 సంగీతం

8.2.1 కర్ణాటక సంగీతం

8.2.2 వాద్య సంగీతం

8.2.3 గాత్ర, వాద్య కళాకారులు

అభ్యాసం

8.3 చిత్ర లేఖనం

8.3.1 రేఖా చిత్రం

8.3.2 వర్ణ చిత్రం

8.3.3 చిత్ర లేఖనం - విస్తృతి

8.3.4 పునరుజ్జీవనయుగం - ఆధునిక రీతులు

అభ్యాసం

8.4 శిల్ప కళ

8.4.1 ప్రాచీనత

8.4.2 మౌలిక సూత్రాలు

8.4.3 శిల్పకళా పరిణామం

8.4.4 శిల్పకళా ప్రయోగాలు

అభ్యాసం

8.5 నాటకం

8.5.1 నాటక కళావికాసం

8.5.2 వాస్తవిక, వాస్తవికేతర శైలులు

8.5.3 తెలుగులో నాటకం

అభ్యాసం

8.6 నృత్యం

8.6.1 నృత్య వికాసం

8.6.1 శాస్త్రీయ, శాస్త్రీయేతర నృత్య శైలులు


BRAOU

8.6.3 వివిధ ప్రాంతాలలో శైలులు

8.7 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

8.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

## 8.0. ఉద్దేశం

ఈ భాగం చదివిన తరువాత చిత్ర లేఖనం, శిల్పకళ, నాటకం, నృత్యం మౌలిక లక్షణాలను, వికాసాన్ని మీరు వివరించ గలుగుతారు.

## 8.1 ప్రవేశిక

లలిత కళలను సామాన్యంగా మూడు విధాలుగా వర్గీకరించవచ్చు: 1. దృశ్య కళలు, 2. శ్రవ్య కళలు, 3. మిశ్రమ కళలు.

వాస్తుశిల్పం, శిల్పం, చిత్ర లేఖనం మొదలైనవి దృశ్య కళలు కాగా సంగీతం, సాహిత్యం శ్రవ్య కళలకీ, నాటకం, నృత్యం మిశ్రమ కళలలోకీ వస్తాయి. ఆధునిక యుగంలో యాంత్రిక ప్రమేయమైన జీవన సరళిలో సినిమా, టెలివిజన్, రేడియో మొదలైన వాటిని యాంత్రిక కళల్లాగా పరిగణించవచ్చు. సాధారణ జనజీవన శైలిలో ఈ లలిత కళల పాత్ర వర్తమాన వ్యవహారాల్లో మంచి ప్రాముఖ్యత సంతరించు కోవడంతో ఈ కళల పట్ల సద్విమర్శ, సదావగాహనల అవసరాన్ని మీరు గమనించే ఉంటారు. లలిత కళల మౌలికమైన , ప్రాధమికమైన అంశాల పరిచయం, ఆ అవసరార్థం మీరు తెలుసుకుంటారు.

## 8.2. సంగీతం

శ్రవ్య కళలు అంటే చెవితో విని రసానందం పొందే కళలు. వీటిలో సంగీతం ప్రధానమైంది. ప్రపంచంలో అతి ప్రాచీనమైన కళైన ఈ కళ భారతదేశంలో అత్యంత ప్రీతి పాత్రమైన సమగ్ర కళగా పేరొందింది. అంటే సాహిత్యం, నృత్యంతో కలిపి పూర్వీకులు ఒక 'సమగ్రకళ' గా భావించేవారు.

"గీతం, వాద్యంచ నృత్యంచత్రయం సంగీత ముచ్యతే" అని పూర్వీకులు పేర్కొన్నారు. కాలక్రమేణా సాహిత్యం, సంగీతం, నృత్యం దేనికదే విడివిడిగా ప్రత్యేకమైన కళలుగా అభివృద్ధి చెందాయి.

### 8.2.1. కర్ణాటక సంగీతం

సార్వత్రికమైన ఈ సంగీతకళ పరిణామ దశలో అనేక మార్పులు చెందుతూ ప్రత్యేకమైన, శాస్త్రబద్ధమైన కళగా వృద్ధి చెందింది. ఈ సంగీతకళ రెండు విధాలుగా ప్రయోగంలో ఉంది.

1. వాద్య సంగీతం 2. గాత్ర సంగీతం

సంగీతం శ్రవ్యకళ కావడం వల్ల అది ధ్వని ప్రధానమైనది. తద్వారా సంగీతానికి శృతి, స్వరం, లయ అనేవి మౌలికమైన అంశాలు అయినాయి. ఈ విధంగా స్వర, లయబద్ధమైన సంగీతకళ భారత దేశంలో రెండురకాలుగా అభివృద్ధి చెందింది.

BRAOU

1.  కర్ణాటకం  2.  హిందూస్తానీ

ఇలా రెండు రకాలుగా మార్పు చెందక ముందు పూర్తి భారతీయ సంగీతంగా ఒకే బాణీలో ఉండేది. అయితే భారత దేశంలో పర్షియన్ల సంస్కృతి ప్రభావంతో కొన్ని కొన్ని మార్పులతో ఉత్తర భారత దేశంలో అది హిందూస్తానీగా స్థిరపడి పోయింది. దక్షిణ భారతదేశంలో కర్ణాటకంగా ఉండి పోయింది. ఈ పర్షియన్ల ప్రభావం దక్షిణ భారతంలో తక్కువ ఉండనీయడం కానీయండి. దక్షిణ భారతీయులు ఈ సంస్కృతి ప్రభావానికి లొంగక పోవడం కానీండి, కారణాలు ఏమైనా ఈ కర్ణాటక సంగీతం దక్షిణ భారత దేశంలోనే అత్యంత జనాదరణ పొందింది. అనేకమంది కళాకారులు, సాహితీవేత్తలు, శాస్త్రకారులు కర్ణాటక సంగీత అభివృద్ధికి విశేషంగా కృషి చేసారు. వారి కృషి ఫలితమే మేళ కర్తలు.

రాగాలు, సంగీత సాధనకు కావలసిన అభ్యాసాలు, పదాలు, గీతాలు, వర్ణనలు, కీర్తనలు మొదలైన వాటితో ఈ కర్ణాటక సంగీతాన్ని 72 మేళకర్తల చట్రంలో ఇమిడ్చిన వారు వేంకటమణి. మేళ కర్తలను 'జనక రాగాలుగా' కూడా పిలుస్తారు. జనక రాగాల్లో ఉండే స్వర స్థానాల ప్రయోగంలో అవరోహణ, ఆరోహణాది క్రమంలో మార్పులు చేసుకుంటూ ప్రయోగిస్తే మరొక క్రొత్త రాగం పుడుతుంది. అలా పుట్టిన కొత్త రాగాలను 'జన్యరాగాలు' గా పిలుస్తారు.

స్వర స్థానంలో ప్రధానంగా ఏడు ఉంటాయి. ఈ ఏడింటికి పేర్లున్నాయి.

వీటిని స,రి,గ,మ,ప,ద,ని  అంటారు.

స - షడ్జమల  మ - మధ్యమం

రి - రిషభం  ప - పంచమం

గ - గాంధారం  ద - ధైవతం

ని - నిషాదం

BRAOU

అయితే రిషభం, గాంధారం, మధ్యమం, ధైవతం నిషాద స్థానాలు రెండు రెండు ఉంటాయి. అంటే రెండు రిషభ స్థానాలు, రెండు గాంధార స్థానాలు రెండు మధ్యమం, రెండు ధైవతం, రెండు నిషాద స్థానాలు సప్త స్వరాలకు తోడై మొత్తం 12 స్వర స్థానాలు అవుతాయి. సంగీత ప్రక్రియ మొత్తం ఈ 12 స్వరస్థానాల సమ్మేళనంతోనే నిండి ఉంటుంది. అయితే జనక రాగాలు అంటే మేళకర్తలను సంపూర్ణ రాగాలని కూడా పిలుస్తారు. అంటే ఒక మేళ కర్త రాగంలో ఏడు స్వరాలు ఆరోహణ, అవరోహణలో గానీ, స్వర స్థానాల సంఖ్యలో కూడిక కానీ, తీసివేత గానీ ఉండకూడదు. అలా ఒకటో, రెండో స్వర స్థానాలు వర్జించిగానీ, ఒకటో, రెండో స్వర స్థానాలు గానీ కలిపితే కొత్త రాగం పుడుతుంది. దానినే 'జన్యరాగం' అనీ 'వక్రరాగం' అన అంటారు.

ఉదా ॥ స  రి  గ  మ

షడ్జమం, చతుశృతి రిషభం, అంతర శుద్ధమధ్యమం గాంధారం.

ప  ద  ని

పంచమం, చతుశృతి ధైవతం, కైశికి నిషాదం.

ఆరోహణ, అవరోహణల్లో ఇవే స్వర స్థానాలు ఏడు సంపూర్ణంగా ఉన్నది మేళకర్త. పైన చెప్పిన స్వర స్థానాలు 28వ

మేళకర్త అయిన 'హరి కాంభోజి' రాగానివి.

అయితే ఈ రాగంలోని శుద్ధమం, కైశికి నిషాదం స్థానాలను తీసివేస్తే అది "మోహన రాగం" అవుతుంది.

స రి గ

షడ్జమం, చతుశ్రుతి రిషభం, అంతర గాధారం

స ద

పంచమం, చతుశ్రుతి ధైవతం

మ,ని, స్వర స్థానాలు తీసినప్పుడు పై స్వరాలు మిగిలి పోతాయి. ఇవి కూరిస్తే వచ్చిన 'మోహన రాగం' జన్యరాగం అవుతుంది. సంగీతానికి భాషతో ప్రమేయం లేదు. ఏ ప్రాంతం వారైనా, ఏ భాష వారైనా సంగీతం విని ఆనందించగలరు. సంగీత ప్రక్రియ ఒక సార్వ జనీనకమైన భాష. అయితే ఈ స్వరాలకు ఏ ప్రాంతం వాళ్ళు ఆ ప్రాంతం భాషను వాడుకోగా స్వర స్థానాల్లో మాత్రం మార్పు కనబడదు.

ఈ కింది పట్టికలో 12 స్వరస్థానాలు వివిధ భాషల్లో వివిధ బాణీల్లో ఏవిధంగా ఉంటుందో మీరు గమనించవచ్చు.

## ద్వాదశ స్వర స్థానాలు

| నెం. | సప్త స్వరాల పేర్లు | 12 స్వర స్థానాలు | హిందూస్తానీ సంగీతం | కర్ణాటక సంగీతం | యూరోపియన్ సంగీతం |
|---|---|---|---|---|---|
| 1. | షడ్జమం | 1 | ప | స | C |
| 2. | రిషభం | 2 | కోమల్ రి | శుద్ధరి | D Flat |
| | | 2 | తీవ్ర రి | చతుశ్రురితి | D Sharp |
| 3. | గాంధారం | 4 | కోమల్గ | సాధారణ గ | E Flat |
| | | 5 | తీవ్రగ | అంతరగ | E Sharp |
| 4. | మధ్యమం | 6 | కోమల్ మ | శుద్ధ మ | F Flat |
| | | 7 | తీవ్ర మ | ప్రతి మ | F Sharp |
| 5. | పంచమం | 8 | ప | ప | g |
| 6. | ధైవతం | 9 | కోమల్ ద | శుద్ధ ద | A Flat |
| | | 10 | తీవ్ర ద | చతుశ్రుఅతి | A Sharp |
| 7. | నిషాదం | 11 | కోమల్ ని | కైశికి ని | B Flat |
| | | 12 | తీవ్రని | కాకలి ని | B Sharp |

BRAOU

ఇప్పుడు గమనించవలసిన విసయం ఇంకొకటి ఉంది. ఈ స్వర స్థానాలు పన్నెండే అయినప్పటికి, వేంకటమఖి ప్రముఖులు ఈ స్థానాలకు కటపయాది సంఖ్యలో ఇమడ్చడానికి గాను 16 పేర్లు నిర్ణయించారు. స్వరస్థానాలు పన్నెండే అయినప్పటికీ పేర్లు 16 ఉన్నాయి.

అవి :

| | | |
|---|---|---|
| (1) | షడ్జమం | - స |
| (2) | శుద్ధ రిషభం | |
| (3) | చతుశ్రృతి రిషభం | |
| (4) | షట్శృతి రిషభం | |
| (5) | శుద్ధ గాంధారం | |
| (6) | సాధారణ గాంధారం | |
| (7) | అంతర గాంధారం | |
| (8) | శుద్ధ మధ్యమం | |
| (9) | ప్రతి మధ్యమం | |
| (10) | పంచమం | - ప |
| (11) | శుద్ధ దైవతం | |
| (12) | చతుశ్శృతి దైవతం | |
| (13) | షట్శృతి దైవతం | |
| (14) | శుద్ధ నిషాదం | |
| (15) | కైశికి నిషాధం | |
| (16) | కాకలి నిషాధం | |

ఈ స్వర స్థానాలు 3 స్థాయిల్లో ఉంటాయి.

(1) మంద్రం (2) మధ్యమం (3) తార

గాత్ర సంగీతం ఈ 3 స్థాయిల్లో సంగీత ప్రసారం ఉండగా, వాద్య సంగీతంలో అంటే తంత్రీ వాద్యాలు వేణువుమొదలైన వాటిలో అనుమంద్రం, అతి తారస్థాయి కూడా ఉంటాయి. గాత్ర సంగీతంలో ఈ రెండు స్థాయిల్లో ప్రసారం చెయ్యడం కష్టమైనప్పటికీ కొందరు సాధకులు ఇప్పటికీ ప్రయత్నిస్తూనే ఉన్నారు. కాల బద్ధమైన ఈ కళా ప్రక్రియకు లయ ప్రాణమవుతుంది. ఈ లయకు అనుగుణంగా సంగీతం ప్రయుక్తమవుతుంది. లయ మూడు విధాలు.

1. విలంబిత 2. మధ్య 3. ధృత

ఈ లయ నడిపే విధానం రెండు రకాలుగా ఉంటుంది.

1. సమ 2. విషమ వీటినే గతులంటారు.

ఈ లయ గమనాన్ని కొలిచే కొలబద్ద తాళం

లఘువు, ద్రుతం, అనుద్రుతం అనేవి ఈ తాళానికి అంగాలు. వీటిని ఒక మాత్ర లేదా అక్షరగతిలో కొలుస్తారు. ఆ విధంగా చూస్తే కర్ణాటక సంగీతంలో 7 తాళాలు ప్రామాణికమైనాయి.

| | | | |
|---|---|---|---|
| (1) | ధ్రువ | (2) | మధ్య |
| (3) | రూపక | (4) | త్రిపుట |
| (5) | జంపె | (6) | అట |
| (7) | ఏక | | |

ఈ సప్త తాళాలు 5 జాతులపై ఆధారపడి మొత్తం 35 తాళాలుగా ఏర్పడతాయి. 5 జాతుల పేర్లు ఇవి. (1) తిశ్ర (2) చతురస్ర (3) ఖండ (4) మిశ్రమ (5) సంకీర్ణం

ఈ విధమైన ప్రమాణాలలో శాస్త్ర బద్ధమైన ఈ కర్ణాటక సంగీతం అనేక మంది మహామహుల కృషితో ఎంతో అభివృద్ధి చెందింది. పూర్వ గీతం, వాద్యం, నృత్యం కలిసి ఒక సమగ్ర కళగా సంగీతం భావించబడేది అని ముందు అనుకున్నాం.

BRAOU

ఈ విధంగా మూడు ప్రక్రియల్లో సంగీతాన్ని ప్రయోగించిన ప్రముఖులు, కర్ణాటక సంప్రదాయాలలో "సంగీత త్రిమూర్తులు", అపారమైన గౌరవ పురస్కారాలను అందుకున్న మహనీయులు ముగ్గురు. (1) త్యాగరాజు (2) ముత్తు స్వామి దీక్షితులు (3) శ్యామ శాస్త్రి. వీరు సంగీత కళను విశిష్టంగా పరిశోధించి అత్యంత విలువలతో సాహిత్య సేవ చేసి ప్రముఖ వాగ్గేయ కారులుగా వినుతిక్కెకారు.

### 8.2.2 వాద్య సంగీతం

గాత్ర సంగీతం లానే, వాద్య సంగీతం కూడా ఆంధ్ర దేశంలో ఎంతో విశిష్టతను సంపాదించుకుంది. వాద్యాలు నాలుగు రకాలు.

(1) తతం... అంటే తంత్రులలో చేసినవి. వీణ సితార మొదలైనవి.

(2) అవనద్ధం... అంటే చర్మంతో తయారు చేయబడినవి... మృదంగం... తబలా మొదలైనవి.

(3) ఘనం... లోహంతో తయారు చేయబడినవి. తాళము మొదలైనవి.

(4) సుషిరం... అంటే గాలి ఆధారంగా ప్రయోగింపబడేవి. సన్నాయి, వేణువు మొదలైనవి.

### 8.2.3 గాత్ర, వాద్య కళా కారులు

పారుపల్లి రామకృష్ణయ్య పంతులు, మంగళం పల్లి బాల మురళీ కృష్ణ, నూకల చిన సత్యనారాయణ, నేదునూరి కృష్ణమూర్తి వంటి గాత్ర సంగీత కళాకారులకు జన్మనిచ్చిన ఆంధ్రదేశం కోలంక, ఎల్లా వెంకటేశ్వర రావు వంటి మార్దంగికులకు, ద్వారం వెంకట స్వామి నాయుడు, పేరి సుబ్బారావు, వంటి వాయులిన్ కళాకారులకు, ఈమని శంకరశాస్త్రి, చిట్టి బాబుల వంటి వైణికులకు కూడా జన్మ స్థలం. కేవలం సంగీత కళాకారులకే కాక రక రకాల వాయిద్యాల పరికరాల తయారీకి కూడా ఆంధ్రదేశం పెట్టింది పేరు. మన రాష్ట్రంలో బొబ్బిలి, నూజివీడులలో తయారు చేయబడే వీణ ఆ ఊళ్ళ పేర్లతో ప్రసిద్ధి పొందాయి. ఆనాటి త్యాగ రాజు, అన్నమయ్య, రామదాసు మొదలైన మహామహులు పలికిన ఓంకార నాదం సంగీత ప్రపంచంలో ఇప్పటికీ మారుమ్రోగుతోంది. మంగళం పల్లి బాలమురళి, మాండలిన్ పై కర్ణాటక బాణీ సంగీత ప్రయోక్త శ్రీనివాసు మొదలైన వారు మన రాష్ట్రంలోనే కాకుండా దేశ విదేశాలలో కర్ణాటక సంగీతాన్ని వినిపించి బహు ముఖంగా ప్రచారం చేస్తున్న మహనీయులు.

BRAOU

**అభ్యాసం :**

కర్ణాటక సంగీత వికాసాన్ని సమీక్షించండి.

## 8.3. చిత్ర లేఖనం

దృశ్య కళల్లో అతిప్రాచీనమైంది చరిత్ర పూర్వయుగం. అంటే పురాతన రాతి యుగం నుంచీ మానవుని జీవితంతో పెన వేసుకుని సాగుతూ వస్తున్నది ఈ చిత్ర కళ.

తన ఉనికినీ, ఉద్వేగాన్నీ ప్రపంచానికీ, చుట్టు ప్రక్కల పరిసరాలకీ, తన జీవితానికీ ఉన్న సంబంధ బాంధవ్యాలనూ; అర్థం చేసుకునే ప్రయత్నం, అర్థాన్ని చెప్పే ప్రయత్నంలోనూ మానవుడు ఈ చిత్రకళను ప్రధానంగా ఒక మాధ్యమంగా చేసుకున్నాడు. ఆ విధంగా మానవుడి జీవితానికీ ఈ కళకూ ఒక విడదీయరాని సంబంధం ఏర్పడింది.

పూర్వకాలంలోనే మానవుడికి చిత్ర లేఖనంతో పరిచయం, నిపుణత ఉంది అనడానికి అతి ప్రాచీనమైన మట్టి పాత్రలు అవశేషాలుగా త్రవ్వకాల్లో బైట పడడం, వాటి మీద ఉన్న రేఖా చిత్రాలు, వేలిముద్రలు వగైరాలు నిదర్శనాలు. అనేకమంది శాస్త్రజ్ఞుల పరిశోధనల ఫలితమే ఇది. మానవుడు తన ఆలోచనలను సంకేత రూపంలో ఇతరులకు తెలియ జేయడానికి ఈ రేఖా చిత్రాల రూపంలో లిపిని కూడా వాడేవాడని అనేకమంది శాస్త్రజ్ఞుల అభిప్రాయం. ఇప్పటికీ చైనా దేశపు లిపిలో ఈ విధానమే కనబడుతుంది. పరిణామ క్రమంలో ఒక ప్రత్యేకమైన రీతినీ, శైలినీ పొందుపరచుకుంటూ, అనేక సాంప్రదాయాల సంస్కృతుల సమ్మేళనంతో ఒక సార్వజనీనమైన, ప్రతిభా వంతమైన మాధ్యమంగా ఈ కళ రూపు దిద్దుకుంది.

అయితే మొదటి నుంచి ఈ చిత్రకళకూ, శిల్పకళకూ ఒక అవినాభావ సంబంధం కొనసాగుతూనే ఉంది. కొంత పొడుగు, కొంత వెడల్పు గల ఒక ఉపరితలం మీద చిత్రకళ ప్రయోగం జరపవచ్చు. పొడుగు, వెడల్పులే కాకుండా లోతును కూడా కల్పి ఒక ఘన పదార్థంతో శిల్పకళ ప్రయోగం జరపబడుతుంది. కళను ప్రయోగం జరిపే పరికరాలు, ఆధార భూమికలు వేరైనప్పటికి భావాన్ని అందించే వస్తువులు మాత్రం ఒక్కటే అవ్వడం ఈ రెండిటి మధ్య ఉండే అనుబంధాన్ని నిర్వచిస్తుంది. ఒక చిత్ర కళకు సంబంధించిన మౌలికాంశాల విషయానికొస్తే ఇది ప్రధానంగా రెండు రకాల్లో ప్రయోగంలో ఉంది.

(1) రేఖా చిత్రాలు (2) వర్ణచిత్రాలు

అచ్చంగా గీతలను ఉపయోగించి చిత్రం గీస్తే అది రేఖా చిత్రం అవుతుంది. రేఖలతో పాటుగా రంగులను కూడా వాడితే అది వర్ణ చిత్రం అవుతుంది.

చిత్రకళ ప్రయోగపరిధిలో పరిణామ క్రమంలో అనేక మార్పులు, ప్రయోగాలు జరగడం వల్ల రేఖలు లేకుండానే అచ్చంగా రంగులతో వేసే చిత్రాలు కూడా ఉన్నాయి. అయితే ఈ రేఖా చిత్రాలు ప్రపంచంలో కనబడే దృశ్యాలను సూచన ప్రాయంగా అంటే కండలేని అస్థిపంజరంగా గోచరింపచేస్తే, వర్ణచిత్రాలు ఒక సమగ్ర రూపంలో వెలుగు, చీకటిల మధ్య ఉండే వ్యత్యాసాల కలయికలను రంగులతో నిర్దేశిస్తూ వేయడం వల్ల మరింత సుందరంగా అనిపిస్తాయి.

### 8.3.1 రేఖా చిత్రాలు :

ఈ రేఖలు చిత్రకళలోని మౌలికమైన అంశాలు. ఇవి రెండు రకాలు :

(1) సరళ రేఖ (2) వక్రరేఖ

ఈ రెండు రకాల గీతల సమ్మేళనంలో ఒక దృశ్యాన్ని కల్పించడంలోనే చిత్రకారుడు తన నైపుణ్యాన్నీ, శైలినీ ప్రకటించుకుంటాడు. ఈ రెంటి మధ్య ఉండే విభేదాల్లో సౌందర్యాన్ని గుర్తించి వాటిని ఒక దృశ్య రూపంలో చిత్రకారుడు

BRAOU

ప్రయోగించడమే ఈ కళ ప్రత్యేకత. ఇక ఈ సరళ రేఖలు మళ్ళీ మూడు రకాలుగా విభజింపవచ్చు.

(1) నిలువు గీత (2) అడ్డగీత (3) మూలగీత

పూర్తిగా సరళ రేఖలతోనూ, అచ్చంగా వక్రరేఖలతోనూ చిత్రకారులు ప్రయోగాలు జరుపుతున్నారు. పూర్తిగా సరళ రేఖలతో ప్రయోగం జరిపితే ఆ దృశ్యంలోని వంపులన్నీ కోణాలుగా అనిపిస్తే, వక్రరేఖలతో గీసిన చిత్రంలో అవి గుండ్రంగా అనిపిస్తాయి.

ఇలా వివిధ ఆకారాల సమ్మేళనంతో సౌందర్యాన్ని అందించే ప్రయత్నంలోనే ఒక ప్రత్యేకమైన శైలినీ, నిపుణతనూ చిత్ర కారుడు ఆదేశిస్తాడు. ఇలా విభిన్నరీతిలో, వినూత్న రీతిలో ఈ రేఖలను ఉపయోగించి సౌందర్య భావనతో ఒకానొక భావాన్ని చిత్రకారుడు చూపరులకు అందిస్తాడు. మానవుని ఉద్వేగాలకు, స్వభావాలకు, ఈ రేఖలకు ఉన్న సంబంధాన్ని అలంకారికులు నిరూపించ ప్రయత్నం చేస్తారు. నిలువు గీతలు పురుష లక్షణాలని అడ్డగీతలు స్త్రీ లక్షణాలని; గతికీ, బలానికీ ప్రతీకగా నిలువుగీతలని, శాంతికీ, సాత్వికతకూ అడ్డగీతలనీ; ఈ రెంటిలో ఉండే లక్షణాల కలయిక, అంటే నిలువు గీతలోని పటుత్వం, అడ్డగీతలోని లాలిత్యం, రెంటి కలయిక ప్రతీకగా, మూలరేఖలు నిలుస్తాయి అనీ అలంకారికులు ప్రకటిస్తారు.

### 8.3.2 వర్ణచిత్రం

ఇక వర్ణ చిత్రాల విషయానికొస్తే ప్రాథమికమైన రంగులు మూడు.

(1) ఎరుపు (2) నీలం (3) ఆకుపచ్చ

వెలుగుకీ, రంగులకూ ఉన్న అవినాభావ సంబంధం ఈ వర్ణచిత్రాలకు ఊపిరి వంటిది. సంగీతంలో ఏడు స్వరాలు ప్రకృతి నుండి అందినట్లే, ఈ ఏడు రంగులు కూడా ఇంద్రధనుస్సు నుంచి గోచరిస్తాయి.

(1) ఊదా (2) నీలి (3) నీలం (4) ఆకుపచ్చ
(5) పసుపు (6) నారింజ (7) ఎరుపు

ఈ ఏడు రంగులనూ మేళవిస్తే అసంఖ్యాకమైన రంగులు ఏర్పడతాయి. ఇలా అనేక రంగుల మధ్య గోచరించే సౌందర్యతను చిత్రకారుడు బేరీజు వేసి తాను ఊహించిన భావాలను ఒక దృశ్య రూపంలో ప్రేక్షకులకు అందిస్తాడు. ఇలా అందజేసే ప్రయత్నంలోనే కళాకారుడు మనిషి తన జీవితంలో ఎదుర్కొనే ఉద్వేగ లక్షణాలను, ఉద్వేగ ప్రేరణలనూ తనకీ చుట్టు ప్రక్కల మసిలే పరిసరాలకూ ఉన్న సంబంధ బాంధవ్యాల మీద వ్యాఖ్యానం చేస్తూ, చిత్రకళ ద్వారా సార్థకంగా ప్రయోగిస్తాడు.

ఇలా ప్రయోగించడంలో పరిణామ క్రమంలో చిత్రకారుడు కొన్ని సూత్రాలను ఏర్పరచుకున్నాడు. ఒక దృశ్యాన్ని ఒక చట్రంలో ఇమడ్చడానికి సంయోగం (Composition) అన్నది ప్రాథమికమైంది. ఈ సంయోగం నియామకంలోని ప్రాథమిక సూత్రాలు ఇవి :

(1) అభిరుచి కేంద్రం (Point of Interest)
(2) భారతౌల్యం (Balance)
(3) వ్యత్యస్తరమ్యత (Contrast)
(4) సమ్మతి భావం (Symontic)
(5) దృష్టి ప్రక్రమం (Perspective)

BRAOU

ఒక చట్రంలో ఒక దృశ్యాన్ని బంధించినప్పుడు ముందుగా చిత్రకారుడు పాటించేది అభిరుచి కేంద్రం (Point of Interest). ఇది చిత్రంలోని మధ్య భాగంలో ఉండకూడదని శాస్త్రజ్ఞుల నియమం. సమ్మతి భావం ఏర్పరచడానికి చిత్రపటంలో నిలువున మధ్యగా గానీ, అడ్డంగా మధ్యగా గానీ ఈ కేంద్రం ఉండాలన్నది వారి నిర్ణయం. తద్వారా భారతౌల్యం (Balance) సాధించడానికి ఒక ఆధార మేర్పడుతుంది. దీనివల్ల దృశ్యంలో చిత్రకారుడు సృజనాత్మకతతో నిర్ణయించుకోవాలి. కేవలం ఉండాలన్నట్లుగా కాక, దృశ్య భారాన్ని, వస్తువుని బట్టి దానికి అనుగుణంగా అంతర్లీనంగా ఏర్పాటు చేసుకోవాలి. అప్పుడు చూపరులకు ఆ చిత్రం సుందరంగా ఉండి రసస్ఫూర్తిని కలుగజేస్తుంది.

ఈ చిత్రకళలోమరో ప్రధానమైన అంశం వ్యత్యస్త రమ్యత (Contrast) . రంగుల మధ్య ఉండే వ్యత్యాసాలను సౌందర్య దృష్టిలో వెలుగునీడల దృక్కోణంలో చిత్రకారుడు సంపూర్ణంగా అవగాహన చేసుకొని ప్రయోగించినప్పుడు, ఈ వ్యత్యస్త రమ్యత ఏర్పడుతుంది. తద్వారా చిత్రంలో దృష్టిలో ప్రక్రమమును (Visual perspective) చిత్రకారుడు సాధించి ఎత్తుపల్లాలు, దూరత సామీప్యతను ప్రదరిస్తాడు. కళాకారుని కౌశలాన్ని నిర్ణయించడానికి ఇది ముఖ్యమైన అంశం.

### 8.3.3. చిత్ర లేఖనం - విస్తృతి

ప్రపంచంలో ఆది మానవ యుగంలో అన్ని ప్రాంతాల్లో ఒకే ఉద్దేశ్యంలోప్రేరితమై ఏర్పడిన ఈ చిత్రకళ క్రమంగా అభివృద్ధి చెంది ఆయా ప్రాంతాల నాగరికత, సంస్కృతుల ననుసరించి అనేక సాంఘిక, రాజకీయ ప్రభావాలకు లోనై ఎన్నో మార్పులు చెందుతూ, మరెన్నో రీతులు, సాంప్రదాయాలూ బాణీలు ఏర్పరచుకుంటూ వచ్చింది.

చారిత్రక యుగారంభానికి కారణమైన లిపి వాడుక మొదట్లో ఈ చిత్రముల రూపంలోనే ఉండేది. తమ ఉద్దేశ్యాలను ఇతరులకు తెలియజేయడానికి ఆయా భావాల ప్రతిరూపాలను బొమ్మలుగా ఆకుల మీదనో, రాతిమీదనో అందించేవారు. క్రమంగా కొన్ని భావాలకు సంకేతాలుగా కొన్ని చిత్రాలు పరిణమించాయి. ఈ చిత్రాలు సంక్షిప్త రూపంలో ఉండడం వల్ల వివిధ చిత్ర లిపులుగా మార్పుచెంది పరిణామ దశల్లో దృశ్య ప్రాధాన్యత తగ్గి ధ్వని ప్రాధాన్యత పెరిగిం తర్వాత అనేక రకాలైన లిపులు వాడుకలోకి వచ్చాయి. అనేక శాస్త్రజ్ఞుల, పరిశోధకుల కృషి వల్ల మనకు చరిత్రకు పూర్వపు చిత్రకళా వైభవాన్ని గురించి తెలుసుకోడానికి ప్రధానంగా నాలుగు పూర్వయుగ సంస్కృతులు ఆధారాలు అయ్యాయి. అవి :

(1) నైలునదిని ఆనుకొని ఉన్న ఈజిప్టు సంస్కృతి

(2) యూప్రటిస్-టైగ్రస్ నదుల మధ్య ఉన్న సుమేరియన్ సంస్కృతి

(3) సింధూనదీ తీర ప్రాంతంలో విలసిల్లిన సింధూనాగరికత

(4) యాంగ్-ట్సీ నదీ ప్రాంతంలో అభివృద్ధి చెందిన చైనా నాగరికత

ఈజిప్టు సంస్కృతి తర్వాత గ్రీకు సంస్కృతికి దోహదకారిణి అయితే, సుమేరియన్ నాగరికత మొసపు టేమియాకి, సింధూనాగరికత, వైదికనాగరికతకూ, చైనా నాగరికత తూర్పు ప్రపంచంలోని భాగోస్క్రి ప్రజలకు మార్గదర్శకాలయినాయి.

ఆ ఆధారాలు కేవలం చిత్రకళకే కాకుండా తక్కిన కళలైన శిల్ప, వాస్తు, నాటకం తదితర కళలకు కూడా వర్తిస్తాయి.

భారతదేశంలో చిత్రకళ ప్రాశస్త్యం గురించి తెలుసుకోడానికి సింధూ లోయలో దొరికిన ఆనాటి మట్టి పాత్రలే ఆధారాలు. పానపాత్ర, జాడీ, మూకుడు లాంటి పాత్రల మీద ఉన్న రేఖా చిత్రాలు, ఎరుపు నీలం రంగులు వాడినట్లు పరిశోధకులు చెప్తారు. ఇంతకుమించి చిత్రకళా పరిణితిని గురించి ప్రత్యక్షమైన ఆధారాలు దొరకలేదంటారు. అయితే వేదకాలంలోని ఆనాటి ప్రజలకు సౌందర్యారాధన మక్కువ ఉన్నట్లుగా, ఋగ్వేదంలోని కొన్ని ఋక్కుల ఆధారంగా చిత్రకళ ఉండేదని

BRAOU

శాస్త్రజ్ఞుల అభిప్రాయం.

ఆ తర్వాతి కాలంలోఅంటే సుమారు క్రీ.పూ. 525 నుంచి క్రీ.శ. 622 వరకు భారత దేశంలో చిత్రకళ బాగా ఆదరించబడినట్లు ఆధారాలు ద్వారా స్పష్టమైంది. అప్పటి వైదిక, బౌద్ధ సారస్వతాల వల్ల ఇది తెలుస్తుంది. బౌద్ధుల సాహిత్యంలోని ఆమ్రపాలి వృత్తాంతం, వైదిక సారస్వతమైన మహాభారతం లోని ఉషాకన్య చెలికత్తె చిత్రలేఖ వృత్తాంతం, వాత్స్యాయనుని కామ సూత్రాల్లో చెప్పిన 64 కళల్లో చిత్ర లేఖనం గురించి ప్రస్తావించడం, విష్ణు ధర్మోత్తర పురాణంలో చిత్రకళ మూల సూత్రాల వివరణ, ముద్రారాక్షస నాటకంలో యమరటాల, జానపద చిత్రాల ప్రసక్తి మొదలైన ఆధారాల వల్ల భారతదేశంలోని చిత్రకళావైభవాన్ని గురించి మనకు తెలుస్తుంది.

ఇక ఆనాటి చిత్రకళలో బట్టలపై వేయబడిన చిత్రాల్ని "పటము" లుగా పిలిచేవారు. ఇప్పటి జానపద సాంప్రదాయ ధోరణిలో కబడే పట చిత్రాలు (Scroll Painting) ఆ కోవకు చెందినవే. అయితే ఇవి ఎక్కువ కాలం సంరక్షించుకునే వీలులేక పోవడం వల్ల ఆనాటి చిత్రకళా నిపుణతను తెలుసుకోవడం కష్టమే. అయినప్పటికీ ఇప్పటికీ అందుబాటులో సురక్షితంగా ఉన్న కొండల్లోని గుహల్లో ఉన్న చిత్రకళా వ్యాసంగం ఒక్కటే ప్రత్యక్షాధారమైంది. ఈ కోవలోకి వచ్చేవే అజంతా, ఎల్లోరా చిత్రాలు. ఇవి తరువాత కాలంలో వచ్చే చిత్రకళా సాంప్రదాయాలను అత్యంత బలీయంగా ప్రభావితం చేసాయి. తరువాతి ఇస్లాముల మత రాజ్యం జోక్యంతో ప్రాచీన భారతీయ చిత్రకళా సంస్కృతి మార్పులు చెంది కొత్త సాంప్రదాయాలకు దారులు తీసింది.

పర్షియన్ల సంస్కృతీ మేళవింపుతో మొగలాయి చిత్రకళా సాంప్రదాయం, దక్కనీ చిత్రకళా సాంప్రదాయంప్రముఖమైంది.

ఆ తర్వాత యూరోపియన్ల చిత్రకళా సాంప్రదాయాల పరిచయం భారత దేశంలోనికళాకారులకు కలిగింది. భారతీయ చిత్రకళా రీతిని ప్రచారం చెయ్యడానికి పూనుకున్న మహనీయులు రాజా రవివర్మ, అవనీంద్రనాథ్ ఠాగూర్, నందలాల్ బోస్, సురేంద్రనాథ్ మొదలైన వారు ఈ బాణీలో ప్రసిద్ధులు.

## 8.3.4 పునరుజ్జీవన యుగం - ఆధునిక రీతులు

పునరుజ్జీవన కాలంలో యూరపుఖండంలోని ఇటలీ, ఫ్రాన్స్ తదితర దేశాలలో అజరామరమైన కీర్తి ప్రతిష్ఠలు సంపాదించిన కళాస్రష్టలు ముగ్గురు ప్రసిద్ధులు :

(1) లియోనార్డో డావిన్సీ (2) మైఖెల్ ఏంజిల్ (3) రేఫిల్

ఈ కళాకారులు బహుముఖమైన రీతిలో చిత్రకళా సాంప్రదాయాల్ని నెలకొల్పారు. తరువాత 19వ శతాబ్దంలో ఈ కళలో అనేక ఆధునిక రీతులు ప్రవేశించాయి. వీటికి ఆద్యులు ఫ్రెంచి కళాకారులు.

ప్రసిద్ధ కళాకారుడు క్లాడీమానే సూచించిన Impressionism (అనుభవనా వాదం) ను అనుసరించిన కామిల్లీస్సార్, అగస్ట్ రెనాయిర్, ఎడగార్‌డెగాస్ మొదలైన వారు ప్రసిద్ధులు.

ఈ వాదాన్నే అనుసరించి మరికొంత, కొత్త మార్పులతో నవ్యాను భావనా వాదాన్ని సూచించిన వాడు జార్జెగ్ సురత్. అతని సూచనే Pointationism (బిందు వాదం). కాలక్రమేణా అనుభావనా వాదాన్ని అనుసరించి కొత్తకోణాల్లో కృషి చేసిన కళాకారులు సిజానే, పాల్ గూగుయెన్,వింసెట్ వాంగో ప్రముఖులు. వీరి చిత్రకళా నైపుణ్యం మరికొన్ని వాదాలకు దారితీసింది.

BRAOU

చేయబడిన శిల్పాలు అనేకం కనబడతాయి. దీన్ని బట్టి శిల్ప కళకు, అప్పటి వ్యవస్థలోని మానవుని నిత్య జీవన సరళికీ, దైనందిన జీవితానికీ అత్యంత సన్నిహిత బాంధవ్యం ఉండేది అన్నది స్పష్టమౌతుంది. తర్వాత మౌర్యుల కాలంలో ముఖ్యంగా అశోకుని కాలంలోని శిల్ప కళ భారతదేశపు విశేషంగా చెప్పుకోవచ్చు. ఏకశిలా స్తంభాలు అప్పటి శిల్ప కళా విశేషం. రాం పూర్, కౌదీయ నంద నగర్, రుమ్మిండి, సారానాథ్, సాంచీ మొదలైన చోట్లు అనాటి శిల్ప కళా చాతుర్యానికి నిదర్శనాలు. ఈ ఏక శిలా స్తంభాల క్రింది భాగంలో బోర్లించిన కమలము, ఫలకమూ, జంతు విగ్రహం అద్భుత మైన శిల్ప కళా నైపుణ్యానికి ప్రతీకలు.

గుడ్డపై కథా గమనాన్ని సూచించే చిత్రకళ సాంప్రదాయాన్ని అనుసరించి ఉల్బణ శిల్పాల ద్వారా ఒక రీతిని శిల్పకళలో ప్రవేశపెట్టడం జరిగింది. సాంచీలోని స్తంభాల కింది భాగంలో కనబడే రేఖా శిల్పాలు, బార్హుత్ లోని యక్ష, యక్షిణీ విగ్రహాలు, భువనేశ్వర్ లోని శిల్పాలు దీనికి నిదర్శనాలు. అప్పటికీ, సమకాలీనంగా ఆంధ్ర దేశ సందర్భానికి వస్తే శ్రీకాకుళం, భట్టిప్రోలు, అమరావతి, జగయ్యపేట మొదలైన ప్రాంతాల్లో దొరికిన పురావస్తు అవశేషాల వల్ల, ఇక్కడ కూడా శిల్పకళ బాగా రాణించినట్లు తెలుస్తుంది. ఇక్కడ ప్రత్యేకంగా చెప్పుకోవలసింది అమరావతి శిల్ప కళ గురించి, బుద్ధుని జాతక కథలు, శిల్పాల ద్వారా ప్రకటించడం శిల్పుల విశేషమైన ప్రక్రియగా అనక తప్పదు.

అమరావతి, నాగార్జున కొండ, పెదగంజాం, శాలి హుండం, గుంటుపల్లి, అల్లూరు, విద్యాధరం మొదలైన ప్రదేశాల్లో కేవలం ఉల్బణ శిల్పాలే కాక బుద్ధుని శిల్పాలు అనేక ప్రమాణాల్లో దొరికాయి. ఇవన్నీ కూడా అమరావతి శిల్ప రీతిని అనుసరించి ఉన్నాయని విజ్ఞుల అభిప్రాయం. తర్వాత భారతదేశంలో ఇస్లాం మత సంస్కృతీ ప్రభావం వల్ల శిల్పకళకు ఆదరణ తక్కువైనా మసీదులూ, రాజ భవనాల లోపలి వైపు రేఖాలంకరణల రూపంలోనూ, తీగల రూపంలోనూ, జాలీల అమరింపుల్లోనూ ఈ కళా రీతిని ఉపయోగించుకోవడం జరిగింది.

హిందూ బౌద్ధదేవాలయాల ఆదరణలో రాతిలోనే కాకుండా, ఇతర లోహాలలో దేవతల విగ్రహాలు, అర్చన కోసం, అనేక ప్రమాణాల్లో చేస్తూ వచ్చారు. ఈ వ్యవహారమంతా ప్రాచీన శిల్ప శాస్త్ర పరిధిని, సూత్రాలను దృష్టిలో ఉంచుకొని శిల్పులు తయారు చేయడం వల్ల భారతదేశంలో ఏ ప్రాంతపు అర్చనా శిల్పాలైనా ఒకే రీతిలో కనబడతాయి.

క్రమ పరిణామంలో మెల్లిగా కొన్ని కుటుంబాలకు ఇది కుల వృత్తి అయ్యింది. అయినప్పటికీ, కొంతలో కొంత సృజనాత్మకతను జోడించి కొన్ని అపురూప కళాఖండాలు శిల్పులు తయారు చేసారు. గుడి గోపురాల మీద చెక్కిన శిల్పాలు, నంది విగ్రహాలు మొదలైనవి దీనికి నిదర్శనాలు. అన్ని కళల్లాగే , ముఖ్యంగా చిత్ర కళతో పాటుగా పాశ్చాత్య నాగరికత, సంస్కృతి, తత్వ ధోరణులను అనుసరించి భారతదేశంలోని కళా కారులు ఈ కళను సాధన చేస్తూ వస్తున్నారు.

BRAOU

### 8.4.4 శిల్ప కళ - ప్రయోగాలు

అనుభావనా వాదం (Impressionism) పరిభావనా వాదం (Post- Impressionism) స్థూలతా వాదం (Cubism) భావి వాదం (Futurism) విభావనా వాదం (Expressionism) అధి వాస్తవికతా వాదం (Surrealism) సం రచనా వాదం (Constructionlism) మొదలైనవి ఈ కొత్త పోకడలు. ఇప్పటి ఆధునిక శిల్పం, చిత్ర లేఖనం లాగానే నైరూప్య భావన (Abstract) ను అనుసరించి సాధన చేయడం ఉంటుంది.

చిత్ర లేఖనంలో సూత్రాలతో పాటుగా, వాస్తుసూత్రాలనుకూడా అనుసరించి, ఇసుక, కంకర, సిమెంటు, ఉక్కు తీగలు మొదలైనవి సాధనాలుగా ఉపయోగిస్తూ శిల్ప కళలో అనేక వినూత్న ప్రయోగాలు జరుగుతున్నాయి.

అన్ని కళల్లో లాగానే, ఈ కళలో కూడా ప్రయోగాలు జరుగుతున్నప్పటికీ, సర్వసాధారణంగా ప్రజలందరికీ అర్థమయ్యే

విధంగా అనేక శిల్పులు విగ్రహాలను తయారు చేసి వాణిజ్య పరంగా అభివృద్ధి చెందుతూ ప్రజాదరణ పొందుతున్నారు. చిత్ర కళలో కూడా వాణిజ్య పరమైన అవసరాల కోసం చిత్రాలు గీసి అనేక శిల్పులు తమ నైపుణ్యాన్నీ శైలినీ ప్రకటించుకుంటున్నారు.

చివరగా శిల్పాల్లోఉండే రకాలను ఒక్కసారి మననం చేసికొంటే, అన్ని వైపుల నుండీ చూడగలిగే శిల్పాలతో బాటు ఒక వైపునుంచే చూడగలిగే శిల్పాలు ఉంటాయి. వాటిని "ఉల్బణ శిల్పములు" అంటారు. ఇవి మూడు రకాలు.

(1) అల్పోల్బణ శిల్పం - Bass Relief ఒక ఆధారం మీద కొంత ఉబ్బెత్తుగా నిర్మించేశిల్పం.

(2) అధికోల్బణ శిల్పం - High Relief ఆధారం మీద మరికొంత ఉబ్బెత్తుగా నిర్మించే శిల్పం.

(3) కర్పిత రేఖా శిల్పం - (Inside Drawing) ఆధారం మీద లోతుగా శిల్పా కృతిని తెలిపేట్లుగా గీతలు చెక్కడం.

ఇవి సర్వ సాధారణంగా శిల్పాలలో మనం గమనించవలసిన రకాలు.

**అభ్యాసం**

శిల్ప కళలో శిల్పి పాటించే మౌలిక సూత్రాలేమిటి?

BRAOU

## 8.5 నాటకం

"నాటకం" అనేది ఒక సమాహార కళ. దృశ్య, శ్రవ్య కళల మిశ్రమ కళ "నాటకం". దృశ్య కళల్లోని వాస్తు, శిల్ప, చిత్ర లేఖనాలు, శ్రవ్య కళల్లోని సంగీతం సాహిత్యాలే కాక మరెన్నో ఇంకా మరెన్నో కళారూపాల సమ్మేళనంతో ఉండే జీవకళ ఈ "నాటకం".

### 8.5.1 నాటక కళ - వికాసం

ప్రపంచంలో ఈ నాటక కళ ఆవిర్భావం గురించి ఎంతో మంది పరిశోధకులు అనేక సిద్ధాంతాలు ప్రతిపాదించారు. శాస్త్రజ్ఞులకు దొరికిన ఆధారాల ప్రకారం గ్రీసు దేశంలో క్రీస్తు పూర్వం 6, 5 శతాబ్దాల్లోనూ, భారత దేశంలో కూడా సమకాలీనం గానే నాటక కళ ఆవిర్భవించి ప్రజాదరణ పొందింది అని నిర్ణయించారు.

భారత దేశంలో భరతుని నాట్య శాస్త్ర రచనా కాలం గురించి సరియైన ఆధారాలు లేక పోవడం వల్ల, ఇక్కడ నాటక కళావిర్భావం, పరిశోధకుల అంచనాల మేరకు క్రీ.శ. 2వ శతాబ్దం ముందే ఉండి, ఉండవచ్చునని శాస్త్రజ్ఞుల అభిప్రాయం. అయితే ఈ కళ ప్రపంచంలో ముందుగా ఆదరించబడింది గ్రీకు భారతీయ సంస్కృతుల్లోనే అన్నది వారి ఏకాభిప్రాయం.

ప్రజాస్వామిక దేశమైన గ్రీసు దేశంలో అక్కడి ప్రజలు విన్యాసంలో కొలిచే "సన్యాధి దేవత" (డయోనిసిస్) ఉత్సవాలలో గ్రీకు నాటక ఆవిర్భావం జరిగింది. గ్రీకు నాటక సాహితీ వేత్తల్లో ఈశ్కలస్, యూరిపిడస్, సోఫోక్లీస్ మొదలైన వారు ప్రసిద్ధులు. వారు తమ నాటక రచనా పటిమతో ఇతి వృత్త నిర్మాణంలోనూ, వస్తువు, స్థల, కాలైక్యతను సాధించి , పరిపుష్టమైన నాటక సాహిత్యాన్ని ప్రపంచానికి అందించారు. గ్రీకు ప్రజల విశ్వాసం మేరకు అక్కడ "విషాద నాటకాలకు" ఎక్కువ ఆదరణ లభించేది.

భారతనాటక సాహితీవేత్తల్లో భాణుడు, కాళిదాసు, శూద్రకుడు, విశాఖ దత్తుడు, శ్రీహర్షుడు మొదలైన వారు సంస్కృత నాటక ప్రపంచాన్ని ఏలిన ప్రముఖులు.

భారత ప్రజల విశ్వాసం మేరకే ఇక్కడి నాటక సారస్వతంలో సుఖాంతాలకే ప్రాముఖ్యత ఆదరణ లభించింది. ఒక్క భాసుని రచనలు మాత్రం దీనికి విరుద్ధంగా నడిచినాయి.

గ్రీకునాటక సిద్ధాంత సూత్రాలను ప్రతి పాదించినది అరిస్టాటిల్ అయితే భారత దేశ నాటకానికి భరతుడు సిద్ధాంతకర్త. ఇద్దరూ నాటక కళ ప్రయోగ సిద్ధిని దృష్టిలో ఉంచుకొని పాటించవలసిన సూత్రాలను నిర్దేశించారు. అయితే ఇద్దరి ఉద్దేశం ఒక్కటే. అది రససిద్ధి.

పూర్వ కాలం నుంచీ ప్రేక్షకులకు ఇలా రససిద్ధిని కలుగజేస్తూ అభివృద్ధి చెందుతూ వస్తున్నది ఈ నాటక కళ.

## 8.5.2 వాస్తవిక, వాస్తవికేతర శైలులు

నాటక కళ ప్రయోగాలలో కూడా వివిధ ప్రాంతాల్లో వివిధ రకాలైన ప్రభావాలతో అనేక రీతుల్లో మార్పు చెందుతూ, ఇతర కళారూపాల్లాగానే ప్రత్యేకమైన శైలినీ, శిల్పాన్ని ప్రకటిస్తూవచ్చింది. నాటక ప్రయోగం ప్రధానంగా రెండు శైలుల్లో ఉంటుంది:

(1) వాస్తవికతా శైలి (Representation of Realistic)

(2) వాస్తవికేతర శైలి (Representational, Conventional of Non-realistic)

ఒక నాటక రచనలోని ధోరణిని బట్టి దర్శకుడు ఈ శైలిని ఎన్నుకుంటాడు. ఆ శైలిని బట్టి నాటక ప్రయోగంలోని అంశాలు నియుక్తమవుతాయి. అంటే నటనా రీతి, దర్శకత్వ రీతి, ఆహార్యం, దుస్తుల రూప కల్పన, రంగ స్థల ఉద్దీపనం, రంగ స్థలాలంకరణ, దృశ్య పరికల్పన మొదలైనవి ప్రయోగ శైలికి అనుగుణంగా ప్రయుక్తమవుతాయి.

### వాస్తవికతా శైలి

వాస్తవికతా శైలిలోని నాటక రచన ప్రయోగంలో కూడా అదే శైలిని ఆహ్వానిస్తుంది. అంటే దృశ్య పరికల్పన మొదలుకొని, నటన, ఆహార్యం, తదితర అంశాలన్నింటినీ సహజమూ, వాస్తవమూ అనే భ్రమను (illusion) కల్గించేట్లు జాగ్రత్తలు తీసుకొని ఆ నాటకాన్ని ప్రయోగించవలసి ఉంటుంది. ఈ శైలిలో సాగిన నాటక రచనలోని ఇతి వృత్త నిర్మాణం కార్య కారణ బద్ధమైన సంబంధాలతో ఉండి,స్థల,వస్తు, కాల ఏకతను పాటిస్తూ లోకసహజమైన పాత్రలతో నిండి, లోక

సహజమైన భాషతో ఉంటుంది. ఇలా సాగిన నాటక రచన ప్రయోగంలో కూడా అంతే విలువలు, అంతే సహజంగా అనిపించే భ్రమను కలుగ జేస్తూ ప్రదర్శింపబడాలి.

### వాస్తవికేతర శైలి

ఇది రెండవ రకం. ఈ శైలితో దృశ్య పరికల్పన వాస్తవమైనది, సహజమైనది అనే భ్రమను కల్పింప వీలులేనిది. స్థల, కాల, వస్తువుల ఐక్యతను పాటించకుండా సాగిన నాటక రచనలు. పద్యములూ, పాటలతో కూడి ఉన్నది. ఆధునిక వాదాలైన Expressionism, Epic theatre, ఆధునిక వీధి నాటకాలు లాంటివి ఈ శైలిలోనే ప్రయోగింపబడతాయి.

ఈ శైలిలో భాగం పంచుకునే కళాకారులకు,సాంకేతికులకు, తమతమ నైపుణ్యాన్ని, విశిష్ట రీతిలో ప్రదర్శించడానికి మంచి అవకాశం,విస్తృత పరిధీ కల్గుతుంది. వస్తువు స్వరూప, స్వభావాల్ని బట్టి మౌలికంగా నాటక ప్రయోగంలోని అంశాలన్నిటా, ప్రయోగం నియుక్త మవుతుంది.

## 8.5.3 తెలుగులో నాటకం

భారత దేశంలో సంస్కృత నాటకం క్రీ.శ. 7వ శతాబ్దపు ప్రాంతాల్లో అంతరించి పోయింది. విదేశీ సంస్కృతుల ప్రభావం వల్ల, విదేశీ పాలకుల ప్రభావం వల్ల ఈ నాటక కళ కుంటు బడింది. ఇతర ప్రాంతీయ, సాహిత్య ప్రక్రియలతో బాటుగా దేశంలో అన్ని ప్రాంతాల్లోనూ, పురాణ, ఇతి హాసాలు, సంస్కృత నాటకాలు, కావ్యాలు అనువదించబడ్డాయి. అయితే ఇవి కావ్య రూపాల్లోనే పరిమిత మయినాయిగానీ, దృశ్య కావ్య రూపంలో అంటే నాటక రూపంలో రాలేదు.

భారతదేశంలో ఆంగ్ల విద్యా వ్యాసంగం వల్ల, తెలుగుపై కూడా ఆంగ్ల సాహిత్య ప్రభావం పడింది. దీంతో సంస్కృత నాటక అనువాదాలతో బాటుగా, ఆంగ్ల నాటకాను వాదాలు, అనుకరణలు, కొన్ని స్వతంత్ర రచనలు వచ్చాయి.

తెలుగులో మొట్ట మొదటి సారిగా ఈ నాటక రచనకూ, ప్రదర్శనాలకూ దారి తీసినవారు, విద్యా వంతులు, ఆంగ్ల భాషలో కూడా పండితులే కావడం విశేషం. కోరాడ రామచంద్ర శాస్త్రి, కొక్కొండ వెంకటరత్నం పంతులు, పరవస్తు వెంకట రంగాచార్యులు, వావిలాల వాసుదేవ శాస్త్రి తెలుగునాట నాటక రచనారంభకులైతే, కందుకూరి, కొండుభట్ల సుబ్రమణ్యశాస్త్రి, నాదెళ్ళ పురుషోత్తమ కవి, వడ్డాది సుబ్బారాయుడు, తెలుగునాట నాటక ప్రదర్శనారంభకులు అయినారు.

తెలుగు స్వతంత్ర రచనగా వెలువడ్డ మొట్ట మొదటి నాటకం "మంజరీ మధుకరీయం" ఇది 1860 ప్రాంతాల్లో రచితం. దీని రచయిత శ్రీకోరాడ రామ చంద్ర శాస్త్రిగారు. అయితే దీని ప్రచురణ మాత్రం 1908లో జరిగింది. రచనగా ఇది తొలి నాటకం అయితే తొలసారిగా ప్రదర్శితమైన తొలి తెలుగు నాటకం కందుకూరి వీరేశలింగం పంతులు గారు రచించిన "వ్యవహార ధర్మ బోధిని". ఇది 1880వ సంవత్సరంలో ప్రదర్శింపబడింది.

నూరేళ్లు పైబడ్డ మన తెలుగు నాటక చరిత్రను పరిశీలిస్తే ముఖ్యంగా ఐదు రీతుల్లో దాన్ని వర్గీకరించవచ్చు :

(1) పద్య నాటకం, (2) సురభి నాటకం, (3) ఆంధ్రప్రదేశ్ కళాపరిషత్ (4) ప్రజా నాట్యమండలి నాటక ఉద్యమం

(5) ఆంధ్రా యూనివర్శిటీ ప్రయోగాత్మక నాటక సమితి. ఆంధ్ర నాట్య సంఘాల నాటక ఉద్యమాలు.

### పద్య నాటకం

ధార్వాడ నాటక సమాజాలు తెలుగు నాట నాటకాలు ప్రదర్శించడంతో తెలుగు నాటకాల ప్రదర్శనకూడా ఆరంభమైంది.

BRAOU

వారు ప్రదర్శించి వదిలి వెళ్ళిన పాకల్లోనే తెలుగు నాటక ప్రదర్శనలు జరిగాయి. పార్సీ నాటక ప్రయోగరీతులు ధార్వాడ సమాజాల వారు అనుకరిస్తే, ధార్వాడ వారి రీతులు తెలుగు వారు అనుసరించారు. 1884 కాలం నాటికి పార్సీ, ధార్వాడ వారి ప్రభావంతో తెలుగు నాటక ప్రదర్శనల్లో అభినయంలో, ఆహార్యంలో మార్పులు చోటు చేసుకున్నాయి. 1880లో చిలకమర్తి లక్ష్మీ నరసింహం పంతులుగారు హిందూనాటకోజ్జీవన సమాజం స్థాపించి గయోపాఖ్యానం, పారిజాతాప హరణం, ప్రసన్నయాదవం నాటకాలను రాసి ప్రదర్శించారు. సులభంగా అర్థం అయ్యే పదాల్ని, తక్కువ సంగీతం జోడించి పాడడం ఈ ప్రదర్శనల్లోని ప్రత్యేకత. తరువాత ధర్మవరం రామకృష్ణ మాచార్యులు గారి చిత్ర నళినీయ నాటక ప్రదర్శనతో ఆంధ్ర దేశంలో వచన నాటకాలు అంతరించి పద్య నాటకం మొదలైంది. ఛందో బద్ధమైన పద్యాలను, పాటలను ఈ నాటకంలో చొప్పించడం ద్వారా రాగయుక్తంగా వాటిని పాడడం ప్రారంభమైంది. గుంటూరు హరి ప్రసాదరావు గారు ఈ పద్ధతిని ఆంధ్ర దేశ మంతటా వ్యాపింపజేసారు. దీంతో దేశంలోని మరే భాషలోనూ లేని నూతన ప్రక్రియ తెలుగునాట "పద్య నాటకం"గా రూపుదిద్దుకుంది. నాటకంలో పద్యానికి, సంగీతానికి ప్రాముఖ్యం పెరిగి సాత్వికాభినయనానికి చోటు లేకుండా పోయింది. సంగీతం రాని వాడికి నటుడిగా గుర్తింపు లేకుండా పోయింది. ఇలా ప్రారంభ మైన పద్యనాటక ప్రక్రియ ఔత్సాహిక సమాజాల ద్వారా ప్రాచుర్యం పొందుతున్న సమయంలోనే వ్యాపార దృష్టితో నాటక సమాజాలు వెలిసాయి. రాజమండ్రిలో 1906లో ధరణీ ప్రగడ సూరయ్యగారి మానేపల్లి కంపెనీ,1911లో గున్నేశ్వరపు నాగేశ్వర్రావు గున్నే నాగేశ్వర్రావు కంపెనీ వ్యాపార పద్ధతిలో నాటక సమాజాలు నిర్వహించారు. జీతాలపై నటుల్ని నియమిచడం, బొంబాయి నుంచి చిత్ర కారుల్ని పిలిపించి తెరలపై దృశ్య చిత్రాలు వేయించడం, నైజాం ప్రాంతం నుంచి సంగీత విద్వాంసుల్ని రప్పించి హిందుస్తానీ బాణీలో పద్యాల్ని పాడడంలో నటులకు శిక్షణనిప్పించడం మొదలైన వాటితో వ్యాపార ధోరణితో తెలుగు పద్య నాటకాన్ని శాసించడం మొదలు పెట్టారు. దాంతో తెలుగు నాటకం సంగీత నాటకంగా గోచరించేది. తరువాత, ఇలా వ్యాపార దృష్టితో కదులుతున్న పద్య నాటకం కాంట్రాక్టర్ల రాకతో మరికొన్ని విపరీత ధోరణులకు దారి తీసింది. కాంట్రాక్టరు ఒక ప్రముఖమైన, ప్రాచుర్యం పొందిన నాటకాన్ని, దాన్నిప్రదర్శించే ఊరు,నాటకం, లోని పాత్రధారులుగా పేరొందిన వివిధ ప్రాంతాల్లోని నటులను ఎన్నుకొని ప్రేక్షకులను ఆకట్టుకుని కేవలం లాభాల దృష్టితో ప్రదర్శనలు నిర్వహించడం వల్ల, ప్రదర్శనా ప్రయోగంలో ఎన్నో లోటుపాట్లు జరిగేవి. ప్రదర్శించే నాటకం ఒకటే అయినా, వివిధ రచయితల పాఠ్య భాగాన్ని వేరు వేరు ప్రాంతాల్లో, వేరువేరు నటులు, విడివిడిగా తయారవ్వడం, రిహార్సిల్స్ లేకుండా సరాసరి రంగ స్థలం మీదకు చేరి ప్రదర్శించడం వల్ల నాటక ప్రదర్శన సరిగ్గా ఉండేదికాదు .ఇలా అస్తవ్యస్తంగా ఉన్న పద్య నాటక ప్రదర్శనలు ఒక ప్రక్క జరుగుతున్నప్పటికీ, తెలుగునాటక రచనా శిల్పాలలో మార్పులు తెచ్చిన మహనీయులు గురజాడ అప్పారావు.

## సురభి నాటక ఉద్యమం

క్రీ.శ. 1877 ప్రాంతాల్లో పార్సీవారి నాటక సమాజాలు ఆంధ్ర దేశంలో పర్యటించి ప్రదర్శనలిచ్చిన తర్వాత, వారు అనుసరించిన ప్రయోగ రీతుల్లో సాంకేతిక పరమైన విశేషాలను వ్యాపార నాటక రంగం అనుకరించింది. హిందూస్తానీ, పార్సీ బాణీలలో సంగీతం, స్త్రీ పాత్రలు స్త్రీలే ధరించడం, వైరు వర్కు మొదలైనవి వీరు ప్రవేశపెట్టినవే. అయితే 1889-95 మధ్య మహారాష్ట్ర దేశం నుంచి తోలుబొమ్మలాట బృందాలుగా ఆరె మరాఠీ కుటుంబాలు సురభి గ్రామానికి వలస వచ్చారు. ఆ తర్వాత అక్కడి ప్రాంతీయుల సహకారంతో ఒక నాటక సమాజం స్థాపించారు. పార్సీవారి సాంకేతిక ... అనుసరించి స్త్రీ పాత్రలు స్త్రీలే ధరించి ప్రదర్శించారు. వనారస కుటుంబంలోని పాపాభాం ... నాటక రంగంలో అడుగుపెట్టిన తొలి మహిళా కళాకారులు. ఆ తర్వాత వనారస ... సురభి నాటక సమాజం స్థాపించడం జరిగింది. వారి కుటుంబ సభ్యులే నాటక సమాజంలో సభ్యులుగా ఉంటూ అద్భుతమైన సాంకేతిక విలువలు నాటక ప్రయోగంలోకి చొప్పించి తెలుగు నాట వృత్తి నాటక సమాజంగా పేరు పొందారు. అలా మొదలైన సురభి సాంప్ర... తెలుగుదేశం మంతటా అనేక సురభి సమాజాల పేర ప్రాచుర్యమైంది. కరెంటు, తీగల సాయంతో వింతలు రంగస్థల దృశ్య

BRAOU

పరికల్పనలో ప్రత్యేకమైనబాణీ సృష్టించి"సురభీ బాణీ"గా ఏర్పడి ఇప్పటికీ అశేష జనాదరణ పొందుతోంది. మాయా బజారు, కృష్ణ లీలలు మొలదలైనవి వీరి ప్రసిద్ధనాటకాలు.

## ఆంధ్రప్రదేశ్ నాటక కళా పరిషత్తు

1930 అంటే జాతీయోద్యమం జరుగుతున్న రోజుల్లో బళ్ళారిరాఘవ, పి.వి. రాజమన్నార్ మొదలైన ప్రముఖులతో ఔత్సాహిక నాటక రంగం పునరుద్ధరింపబడింది. అప్పట్లో సమకాలీనంగా స్థానం నరసింహారావు, మాధవపెద్ది వెంకట్రామయ్య, గోవింద రాజులు సుబ్బారావు, పులిపాటి వెంకటేశ్వర్లు మొదలైన ప్రముఖులతో తెనాలిలో స్థాపించిన "రామ విలాస సభ" ప్రదర్శించిన రోషనారా, ప్రతాపరుద్రీయం, కన్యాశుల్కం నాటకాలు ప్రాచుర్యం పొందడం, బళ్ళారి రాఘవ ప్రదర్శించిన రామరాజు, ప్రహ్లాదనాటక ప్రదర్శనల్తో ఔత్సాహిక నాటక రంగం మళ్ళీ జీవం పోసుకుంది. 1929 ప్రాంతంలో ఔత్సాహికనాటక కళోద్ధారణకు "ఆంధ్రనాటక కళాపరిషత్తు" తెనాలిలో ప్రారంభమైంది. శ్రీ మల్లాది విశ్వనాథ శర్మ, దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు, ఆచంట వేంకట సాంఖ్యాయన శర్మ, చట్టి చిన పూర్ణయ్య పంతులు, దనారన గోవిందరావు, కొత్తపల్లి లక్ష్మయ్య ఈ సంస్థ ఆవిర్భావానికి కారకులు.

నాటక రచనా శిల్పం, నటనా రీతులు, ప్రదర్శనా శైలులు మొదలైన అంశాలపైన చర్చా గోష్టులు నిర్వహించి ఔత్సాహిక నాటక రంగానికి శాస్త్రీయమైన దృక్పథం పరిచయం చేయాలన్నది ఈ పరిషత్తు ఆశయం. ఈ ఆశయం మేరకు ఆంధ్ర దేశమంతటా చర్చా గోష్టులను సమర్థంగా నిర్వహించారు. తర్వాత 1944-45లో శ్రీ ఎం.ఆర్. అప్పారావు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ నాటక కళా పరిషత్తు తన కార్య కలాపాలను విస్తృతం చేసి పోటీలు, నాటక ఉత్సవాలు జరిపి ఔత్సాహిక నాటక రంగానికి మరో కొత్త ఊపిరి పోసింది. పరిషత్తు నిర్వహించే ప్రదర్శనల్లో ఔత్సాహిక సమాజాలు పాల్గొనడానికి పరిషత్తు నియమించిన కొన్ని నిబంధనలు తెలుగు నాటక ఉద్యమంలోకి నిష్ణాతులైన కళాకారులు వెలుగు లోకి రావడానికి దోహదపడింది. అయిదేళ్ళ క్రితం రాసిన నాటకాలను ప్రదర్శించకుండా నిరోధించడంతో కొత్త నాటకాలు రావడం, ఒక నటుడు ఒక నాటకం, నాటికలోనే పాల్గొనాలి అనే నిబంధన వల్ల అనేక మంది కొత్త నటులకు అవకాశం కల్గడం, స్త్రీ పాత్రలన్నీ స్త్రీలే వెయ్యాలి అన్న నిబంధన వల్ల కళాకారిణులు పాల్గొనడం ఏటేటా పరిషత్తుపోటీలు వేర్వేరు ప్రాంతాల్లో జరగాలి అన్న నియమం ప్రకారం ఒక ప్రాంతంలోని కళాకారులకూ,రచయితలకూ వేరొక ప్రాంతపు కళాకారుల నైపుణ్యం, ప్రయోగ శీలత్వం, పరిచయం కావడం, పరస్పరం అవగాహన పెంచుకోవడం లాంటి కొత్తధోరణి రావడంతో అనేక మంచి నాటకాలు వెలుగు చూసాయి. ఈనాడు అనేక గ్రామాల్లో ఇదే రీతిలో అనేక పరిషత్తులు ఉద్భవించడానికి ఆంధ్రప్రదేశ్ నాటక కళాపరిషత్తు మార్గదర్శకమైంది. ఈనాటికి దాదాపు 170 సమాజాలు ఆంధ్ర నాటక కళాపరిషత్తుకు అనుబంధ సంస్థలు . ఈ పోటీనాటక పరంపర కొంత కాలం సజావుగానే జరిగినా, కొన్నివెర్రితలలు వేయడం తెలుగు ఔత్సాహిక నాటక రంగంలో జరిగింది. అయినప్పటికీ సామాజిక స్పృహకలిగిన సమస్యలు ఇతి వృత్తాలుగా మలచిన తెలుగు నాటకాలు అనేకం రావడానికి కారణమైన ఆంధ్రప్రదేశ్ నాటక కళా పరిషత్తు తెలుగు నాటక రంగానికి చేసిన సేవ గణనీయమైందని చెప్పక తప్పదు

## ప్రజానాట్య మండలి

1929-30 ప్రాంతాల్లో ఒక పక్క జాతీయోద్యమం ఉధృతంగా జరుగుతుంటే సామాజిక వ్యవస్థలో అంతరాలను ఎత్తి చూపి విప్లవం ద్వారా వ్యవస్థలో మార్పులు తేవాలి అనే సిద్ధాంతాన్నిప్రచారం చేయడానికి నాటక కళను ఒక మాధ్యమంగా తీసుకుని కొనసాగిన సంస్థ ప్రజా నాట్య మండలి. నమ్మిన సిద్ధాంతాల మేరకు అత్యంత క్రమ శిక్షణ, నడవడికతో అనేక నాటకాలను ఊరూరా ప్రదర్శించారు. ఈసంస్థ కళాకారులు, సుంకర, వాసిరెడ్డిల "మాభూమి", " ముందడుగు" అత్యంత ప్రజాదరణ పొందిన నాటకాలు. సామాన్య మానవుడిలో సామాజిక స్పృహనూ, చైతన్యాన్నీ పెంపొందింపచేసే ప్రయత్నం ఈ

BRAOU

నాటక ప్రదర్శనాల ద్వారా జరిగింది. దీనిని ప్రజలు విశేషంగా ఆదరించారు. శ్రీకోడూరి అచ్చయ్య, డాక్టర్ గరిక పాటి రాజారావు ప్రభృతులు ఈ ఉద్యమం ద్వారా ప్రేక్షక లోకానికి పరిచితులు.

## ఆంధ్ర యూనివర్శిటీ ప్రయోగాత్మక సమితి

1940లో శ్రీ కె.వి. గోపాలస్వామి నేతృత్వం లో ఆరంభమైన ఈ సంస్థ కొన్ని ప్రత్యేకమైన ఆశయాలతో ప్రారంభమైంది. కొత్త నాటకాలు ప్రదర్శించడం నాటకానికి సంబంధించిన అన్ని అంశాల్లోనూ కళాశాల విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథంతో శిక్షణ ఇవ్వడం, కొత్త ప్రయోగాలు చేయడం, వివిధ శైలుల్లో నాటక ప్రయోగంచేయడం అందుకు తగ్గ రంగస్థల పరికరాలను, దృశ్య పరికల్పననూతయారు చేయడం వంటి ఆదర్శాలతో ఉద్భవించిన ఈ సంస్థ రెండు దశాబ్దాలుగా ఎన్నో ప్రయోగాలు చేసి తెలుగునాటక రంగానికి గొప్ప సేవ చేసింది. రెండు దశాబ్దాలు సాధారణ ప్రేక్షకుల కోసమే కాక ప్రత్యేకం స్త్రీలు, పిల్లల కోసం కూడా అనేక ప్రయోగాలు చేసి నాటక కళ ప్రచారానికి ఎంతో దోహదం చేసింది. తర్వాత 1964 నాటికి ఆంధ్రా యూనివర్శిటీలో రంగ స్థల కళల శాఖ ఉద్భవించడంతో అందులో ఈ సంస్థ విలీనం అయ్యింది.

1960లో శ్రీ అబ్బూరి రామకృష్ణారావు గార్కి నేతృత్వంలో శ్రీ ఎ.ఆర్. కృష్ణ నిర్దేశకత్వంలో "ఆంధ్ర ప్రదేశ్ నాట్య సంఘం" ఆవిర్భవించింది. భారతీయ నాట్య సంఘం అనుబంధ సంస్థగా ఏర్పడ్డ ఆంధ్ర ప్రదేశ్ నాట్య సంఘం కూడా మరి కొన్ని సదాశయాలతో ఏర్పడి తెలుగు నాటక రంగానికి గొప్ప సేవ చేసింది. నాటక రంగంలోని అన్ని అంశాల్లోనూ ఔత్సాహికులకు శాస్త్రీయ పరమైన శిక్షణ జరపడం కోసం ఒక శిక్షణా సంస్థ, శిక్షణ పొందిన విద్యార్థులచే కొత్త పోకడలతో నాటక ప్రయోగాలు చేసి ప్రదర్శనలు ఇవ్వటం, ఆంధ్ర ప్రదేశ్ సంగీత నాటక అకాడమీ సహకారంతో ప్రతి ఏడు నాట కోత్సవాలు రాష్ట్రంలోని ఐదు ప్రాంతాల్ని ప్రధానకేంద్రాలుగా విభజించి జరపడం, ప్రేక్షక సభలు, నాట్య గోష్ఠులు రచయితలు, దర్శకుల,నటుల గోష్ఠులు, సమావేశాలు జరపడం, ప్రపంచ నాటక దినోత్సవం జరపడంవంటి ఆదర్శ ప్రాయమైన, అర్థవంతమైన కార్యక్రమాలు నిర్వహించి తెలుగునాటక వికాసానికి ఎంతో తోడ్పడింది. భారతదేశంలో కీర్తి ప్రతిష్ఠలు అందుకున్న విజయ్ టెండూల్కర్, బాదల్ సర్కార్, గిరీష్ కర్నాడ్ వంటి ప్రముఖుల నాటకాలు తెలుగు వారికి పరిచయం చేయటం లాంటి మంచి కార్యక్రమాలు రూపొందించి తెలుగు ప్రేక్షక లోకానికి ఆధునిక నాటక రీతుల్ని అందించిన ఘనత దక్కించుకుంది.

BRAOU

### అభ్యాసం

వాస్తవిక, వాస్తవికేతర శైలులకి తేడాలు గుర్తించండి.

## 8.6 నృతం

నృత్యం కూడా ఒక ముఖ్యమైన ప్రదర్శన కళ. అంగికం, వాచికం, సాత్వికం, ఆహార్యం అనే నాలుగు విధాలైన అభినయాలతో ఏర్పడేదే నృత్యకళ. అంగికా భినయం ద్వారా లయ విన్యాసాల్ని చేస్తూ, వాచికం ద్వారా ఓ అర్థవంతమైన ప్రదర్శనకు నాంది పలుకుతూ, ఆహార్యం ద్వారా దేశకాల సంస్కృతులనే కాక, పాత్ర స్వరూపాల్ని తెలియజేస్తూ, సాత్వికాభినయంతోఈ ప్రక్రియ స్వభావాన్ని తెలియ జేస్తుంది నృత్యం.

### 8.6.1 నృత్య వికాసం

మానవ సంస్కృతితో బాటుగా పెరిగిన నృత్య కళను యావత్ ప్రపంచంలోనూ చూడవచ్చు. అయితే అన్ని కళల్లాగే భారతీయ నృత్యాలు తమ విశిష్టతకు పేరు పొందాయి. దేశ, కాలమాన ప్రభావాల వల్ల మన దేశంలోని ఒక్కో రాష్ట్రంలోనూ ఒక్కో నృత్య శైలి ఆవిర్భవించి, వృద్ధి చెందింది. కూచిపూడి, భరత నాట్యం, ఒడిస్సీ,కథాకళి,మణిపూరి,కథక్,చౌ,మోహినీ అట్టం మొదలైనవి నేడు వెలుగు చూస్తున్న భారతీయ నృత్య శైలులు. శాస్త్రీయ శైలులుగా ప్రతి రాష్ట్రంలోనూ, జానపద సంప్రదాయ, గిరిజన నృత్య రీతులు,ఆయా రాష్ట్రాలు సంస్కృతీ, సంప్రదాయాలను తమలో నిక్షిప్తం చేసుకుని, తమ ఉనికిని ప్రపంచానికి తెలియజేస్తున్నాయి.

ఆటవిక సమాజంనుండి సభ్య సమాజం వరకూ మానవ జాతి పొందిన పరిణామాలపై ఆధారపడి నృత్య కళ కూడా తనవిభిన్న రూపాల్ని వివిధ స్థాయిల్లో చూపుతూ వచ్చింది. నృత్య కళ రూపానురూపాలను పరిశీలించి నట్లయితే మత సంబంధమైన నృత్యాలు, ఆలయ నృత్యాలు, దర్బారు నృత్యాలు, బృంద నృత్యాలు ఇలా ఎన్నో రీతులు వెలికి వస్తాయి. నృత్య పరిశోధకుల అధ్యయనాలపై ఆధారపడి నృత్యాలను ఈ విధంగా వర్గీకరించవచ్చు: ఆటవిక, జానపద నృత్యాలు, సాంప్రదాయ నృత్యాలు, శాస్త్రీయ నృత్యాలు. ఈ రీతుల్ని దగ్గరగా చూసినట్లయితే భారతీయ నృత్య కళ ఎంత గొప్పదో తెలుస్తుంది. మూడు వర్గాలుగా చెప్పుకున్న ఈ రీతుల బాటలో నడిచేవే ఈ క్రింద పేర్కొంటున్న నృత్య సంప్రదాయాలు. అవి: మత పరమైన నృత్యాలు, సంఘ సంబంధమైన నృత్యాలు, ఆలయ నృత్యాలు, ప్రబంధ నృత్యాలు, దర్బారు నృత్యాలు, భాగవతాలు మొదలైనవి. మత సంబంధమైన నృత్యాల జాబితా లోకి దాదాపు అన్నిరీతులు వస్తాయి. నృత్య కళ అనుకరణ నుంచి, ఆరాధన నుంచి ఆవిర్భవించడమే దీని వెనకనున్న కారణం. భజనలు, హరికథలు మొదలుకొని సంప్రదాయ భాగవతాలు, శాస్త్రీయ నృత్య శైలులు ఇవన్నీ కూడా మతపరమైనవే. అయితే ప్రస్తుత ప్రదర్శను, పరిసరాల్ని బట్టి ఇవి కచేరి లేదా ప్రదర్శనలుగా మతపరమైన తంతు నుంచి విడి వడ్డాయి. విపులంగా చెప్పాలంటే దైవ పరమైన ఉత్సవాలలో నేటికీ ఓ తంతుగా ప్రదర్శింపబడే రీతులు కొన్నైతే అలాగే మొదలైనా ప్రేక్షకుల కోసమే చేస్తున్నది మరికొన్ని . ఉదాహరణకు "చైత్ర పర్వం" సందర్భంగా ప్రదర్శింపబడే "ఛా" నృత్యం, నేడు సాధారణ సందర్భాలలో వేదిక మీదకూడ ప్రదర్శింపబడుతుంది. ఇక సంఘ పరమైన నృత్య వర్గానికి వచ్చినట్లయితే పండుగలు, ఉత్సవాలు సందర్భంగా చేసే గొబ్బిళ్ళు,కోలాటం, చెక్క భజన, పంట నృత్యం ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. ఉల్లాసం కోసంచేసే నృత్యాలు కొన్ని అయితే, వినోదంతో బాటుగా మంచి చెడులను బోధించేవి మరికొన్ని. ఈ రెండప కోవకు చెందినవే భాగవతాలు. ఇవి ముఖ్యంగా పురాణ గాథలను ఇతి వృత్తాలుగా చేసుకుని పాడే బహు పాత్రలు గల "నృత్య-నాటకాలు". ఈ ఇతి వృత్తాలు తెలియజేసే ముఖ్య విషయం ధర్మం ఎల్లప్పుడూ విజయాన్ని సాధిస్తుందని. చిందు భాగవతం మొదలుకొని కూచిపూడి భాగవతం వరకు ఆంధ్ర దేశంలో ఎన్నోరకాల భాగవతాలు ఉన్నాయి. నృత్య నాటక సాంప్రదాయం భారతదేశంలో ఓ ప్రత్యేక స్థానాన్ని నెలకొల్పుకొంది. అయితే భాగవత సాంప్రదాయాలన్నీ శాస్త్రీయం కాదు. కూచిపూడి శైలి మాత్రం శాస్త్రీయంగా ఎదిగింది. కేరళలోని వివిధ సాంప్రదాయాల నృత్య నాటికల నుంచి కొన్ని అంశాలను ఎన్నుకొని శాస్త్రీయమైన రీతిలో ప్రయోగించిన ఓ సంపూర్ణ నృత్య నాటక

BRAOU

సాంప్రదాయంగా గుర్తింపు పొందింది.

### 8.6.2 శాస్త్రీయ - శాస్త్రీయేతర నృత్య శైలులు

నృత్య కళను గురించిన అధ్యయనంలో శాస్త్రీయ శైలులు, శాస్త్రీయేతర శైలులు మధ్య వ్యత్యాసం ప్రస్తావన ముఖ్యమైనవి. భరతముని తన నాట్య శాస్త్రంలో ధర్మల పేరిటలోకంలో కానవచ్చే కళా రూపాల్ని ఈ విధంగా "లోకధర్మ" "నాట్యధర్మ" అని విభజించాడు. లోకానుకరణంగా సాగే నాట్య కళల్లో లోక విధానానికి,లోక సహజంగా ఉండే హావ భావాలలోనూ, స్త్రీపాత్రలను స్త్రీలు, పురుష పాత్రలను పురుషులు చేసే నాట్యాన్ని లోక ధర్మరీతి అని, అలాకాక లోకాను కరణకు అయినప్పటికీ, ఊహకూ, భావుకతకూ ప్రాధాన్యత నిస్తూ తమవి కాని స్వరూపాలను ధరించి, అంటే స్త్రీ పాత్రలను పురుషులు, పురుషుల పాత్రలను స్త్రీలు ధరిస్తూ ఆంగికాభినయం ద్వారా లేని వస్తువులను ఉన్నట్లుగా చూపుతూ వాస్తవికతా సారూప్యతలను మించి,మరింత సృజనాత్మకతకు ఎక్కువ తావిస్తూ సాగేది నాట్య ధర్మ అని నిర్వచించాడు. ఇంతకు ముందు మనం పరిశీలించిన నృత్య రీతుల్ని కూడా ఈ రెండు ధర్మలలో ఏదో ఒక వర్గం లోకి చేరుతాయి.

నృత్యం అనే ప్రదర్శన కళలో ప్రదర్శింపబడే అంశాల్నీ, తీరునీ బట్టి మూడు విధాలుగా ఉంటుంది. నృత్యం, నాట్యం, సాహిత్యం. భావ ప్రాధాన్యం లేకుండా కేవలం లయ తాళాలను అనుసరించి సాగే అంగ విన్యాసాన్ని నృత్తం అంటారు. ఈ నృత్యం నర్తకునికి లయపై గల నేర్పుని తెలియజేయడానికి అవకాశ మిస్తుంది. నేటి భారతీయ శాస్త్రీయ నృత్యశైలులన్నిటా నృత్త ప్రధానమైన అంశాలు ఉంటాయి. అంతేగాక పండుగల్లో జరిగే ఊరేగింపుల్లో చేసే లయ విన్యాసం, పులి వేషం, బతకమ్మ గరగలు మొదలైనవి ఈ నృత్త విన్యాసాలే. వారు ప్రదర్శించే తీరు,సందర్భాన్ని బట్టి ఈ విన్యాసాలు శాస్త్రీయ, శాస్త్రీయేతర వర్గాలుగా గుర్తించబడతాయి. భరతుడు పేర్కొన్న ఉద్ధతమైన తాండవ శైలిని వీటికి దగ్గరగా పోల్చుకోవచ్చు.

ఇక నృత్యం గురించి పరిశీలించినట్లయితే నృత్యం భావానా ప్రియం. రస భావాదులు మెండుగా ఉండే సాహిత్యంలో ఉండే గాథనో, ఘట్టాన్నో అభినయం చేయడమే నృత్యం. ఇందులో ఆంగికంతో బాటు వాచిక సాత్వికాలకు కూడా ప్రాధాన్యం ఉంటుంది. ఏకాహార్యంతో అంటే ఒకే ఆహార్యాన్ని ధరించి, సాగే వివిధ నృత్య అంశాలను కలిగి ఉన్న నేటి శాస్త్రీయ నృత్య శైలు లన్నీ కూడా ఈ కోవకు చెందినవే. భరతుడు పేర్కొన్న కోమలమైన లాస్యం, నృత్యానికి దగ్గరగా ఉంటుందనడం సత్య దూరం కాదు.

భరతముని ప్రస్తావించిన నాట్యం ఒక సమాహార కళ. ఇందులో చతుర్విధాభినయాలు ప్రయోగించుకుంటూ ఒక నిర్దిష్టమైన ఇతివృత్త నిర్మాణానికీ ప్రదర్శనకూ యోగ్యత కల్పించబడింది. విభిన్న పాత్రలతో కూడిన పురాణేతిహాసాలను ఒక కళాకారుడు ఒక్కో పాత్రను ధరించి చేసే నృత్య నాటకాలు ఈ వర్గానికి చెందుతాయి. పాత్రల స్వరూప స్వభావాలను తెలియజేసే ఆహార్యం ఇందులో ముఖ్య పాత్రను వహిస్తుంది. ఉదాహరణకు, కేరళ లోని ప్రసిద్ధ నాట్యశైలి కథాకళిలో పాత్ర ప్రవేశించగానే అది నాయకుడో, ప్రతి నాయకుడో, దుష్ట పాత్రో ఆహార్యాన్ని బట్టి తెలుస్తుంది.

పైన ప్రస్తావించిన నృత్త - నృత్య-నాట్యాలను అనుసరించి విభజించినట్లయితే నేటి శాస్త్రీయ నృత్య శైలులను ఈ విధంగా గుర్తించవచ్చు. భరత నాట్యం, మోహినీ ఆట్టం, ఒడిస్సీ,కథక్, మణిపురి, చౌలు నృత్యాలుగానూ కథాకళి, కూచిపూడి నాట్యాలుగానూ గుర్తింపవచ్చు. అయితే మణిపురి, చౌలలోనృత్య నాటికలను ప్రదర్శించే సాంప్రదాయం, అదే విధంగా కూచిపూడిలో నృత్తాంశాలను ప్రదర్శించడం పరిపాటి.

### 8.6.3 వివిధ ప్రాంతాల్లో శైలులు

ముందుగా చెప్పుకున్నట్లుగా ఈ శైలులు మన దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఆవిర్భవించాయి. వీటిని ఇంకా వివరంగా



BRAOU

పరిశీలిద్దాం.

తమిళనాడులోభరత నాట్యం, కేరళలో కథాకళి,మోహిని అట్టం, ఒరిస్సాలో ఒడిస్సీ, ఉత్తర భారతదేశంలో కథక్,తూర్పున కరాళ నృత్యమైన "ఛౌ" "మణిపురి" ఆంధ్రలో కూచిపూడి, ఆంధ్ర నాట్యం ఈ విధంగా వెలుగులోకి వచ్చినవే. అయితే పెరుగుతున్న ప్రస్తుత అవకాశాలను బట్టి నేడు ఏ శైలి యైనా, దేశంలోని ఏ ప్రాంతంలోనైనా నేర్చుకోగలగడం నేటి కళాకారుల అదృష్టం. అయినప్పటికీ ఈ నృత్య శైలులు పోకడలలో తమ జన్మభూమి ముద్రను తెలియజేస్తూనే ఉంటాయి. ఆలయ, ఆస్థాన, ఆట భాగవతాల ద్వారా నృత్య కళ ఆంధ్ర దేశంలో వేళ్ళూనుకుంది. భాగవతులు ఆడే ఆట మన రాష్ట్రంలో వివిధ స్థాయిల్లో కనిపిస్తుంది. ఈ భాగవతుల్ని నాట్య మేళాలుగా కూడా పిలుస్తారు. ఈ మేళాలు రెండు విధాలు, అవిః (1) నాట్య మేళం (2) నట్టువ మేళం. నృత్య నాటికలుగా చేసే ఈ బహుపాత్ర ప్రదర్శనల్ని నాట్యానికి ఉత్తమ ఉదాహరణలుగా చెప్పుకుంటారు. వీటికి భిన్నంగా నట్టువ మేళాలు ఉంటాయి. ఇందులో ఏకాహార్యంలో చేసే నృత్య శైలి ప్రాధాన్యం వహిస్తోంది. ఆలయ ఆస్థానాలు, జమిందారీలలో స్త్రీలు చేసే శైలులు ఈ కోవకు చెందినవే.

మన రాష్ట్రంలో విభిన్న భాగవతాలు చూడొచ్చు. వీధి భాగవతాలుగా పిలువబడే భాగవతాలు ఉన్నాయి. వారు కూచిపూడి భాగవతులు, కోట కొండక పత్రాల భాగవతులు, యానాది భాగవతులు, చెంచుభాగవతులు, గొల్ల భాగవతులు, నక్కల భాగవతులు మొదలైన వారు.

కృష్ణా జిల్లాలోని కూచిపూడి గ్రామంలో ఆవిర్భవించింది కూచిపూడి భాగవతం అని ప్రచారంలో ఉంది. బ్రాహ్మణ కుటుంబాలకు చెందిన పురుషులు ఈ కళను కొన్ని శతాబ్దాల నుంచీ ప్రదర్శిస్తూ వస్తున్నారు. స్త్రీ పాత్రలను కూడా పురుషులే ప్రదర్శించే ఈ నాట్య సాంప్రదాయాన్ని జాతీయ, అంతర్జాతీయ శిఖరాలకు తీసుకు వెళ్ళిన వారు కూడా ఈ ప్రదర్శకులే. గురువులుగా నర్తకులుగా కూచిపూడి నాట్య సంప్రదాయాన్ని శాస్త్రీయ పథంలో నిలిపిన కుటుంబాలు, భాగవతుల చింతా, వేదాంతం, వెంపటి, యేలేశ్వరపు, మహంకాళీ, పసుమర్తి వారు. తెలుగు సంస్కృతిని ప్రతి బింబించి, తెలుగు దనంతో నిండి ఉండే కూచిపూడి తెలుగు సాహిత్యంలో విశిష్టమైన పాత్రగా నిలిచిన సత్యభామను తనదిగా చేసుకుంది. శ్రీకృష్ణుని లీలను, వర్ణనలను భారతీయ శాస్త్రీయ నృత్యాలన్నింటి లోనూ చూడడం కద్దు. అయితే సత్యభామ పాత్రకు కూచిపూడి వారిచ్చిన ప్రత్యేక స్థానం ఇతర రాష్ట్రాలకు చెందిన శైలుల్లో కనబడదు. ఈ కూచిపూడిశైలి ఆవిర్భవించడానికి కారకుడు సిద్ధేంద్ర యోగి అని కూచిపూడి వారు చెప్తారు. సిద్ధేంద్రుని కాలం నికరంగా ఎవరూ చెప్పలేక పోయినా ఆయన 11-14 శతాబ్దాల మధ్యవాడుగా ప్రతీతి. ఈతడు రచించిన "పారిజాతాపహరణం" అనే నృత్య నాటిక కూచిపూడి వారికి ఎనలేని కీర్తిని సంపాదించింది.

పారిజాతాపహరణం, ఉషాపరిణయం, తారకాసురవధ, భక్త ప్రహ్లాద, ఇలా సాగే నృత్య నాటికలలో పదాలు, శబ్దాలు, నారాయణ తీర్థుల వారి తరంగాలు కూడా ప్రదర్శించడం పరిపాటి. ఇది మారుతున్న కాలమాన పరిస్థితులననుసరించి మారుతూ వచ్చింది, ఈ కూచిపూడి నృత్యశైలి. వీరి కళా నైపుణ్యాన్ని మెచ్చి గోల్కొండ నవాబు అబుల్‌హసన్ తానీషా అగ్రహారాన్ని బహుమతిగా ఇచ్చాడని ప్రతీతి.

నర్తకులే గానం చేస్తూ, వచనం కూడా చెపుతూ చేసే కూచిపూడి నృత్య-నాటకాలు క్రమేణా నృత్యాంశాలకి పరిమితమై పోయాయి. ప్రస్తుతం నృత్య నాటికలు చేస్తున్నప్పటికీ వచనం ప్రాధాన్యం తగ్గింది. గాన సహకారాన్ని, గాయకులు అందిస్తున్నారు. ప్రస్తుత పంథాకి నాంది పలికిన వారు కీ.శే. వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రి. వీరు కూచిపూడిని నృత్యశైలిగా దిద్దడంలోనేగాక, స్త్రీలకు ఈ కళ నేర్పి, విస్తృతంగా ప్రచారం చేసారు. నేడు ఎందరో పేరెన్నికగన్న నృత్యాంగనలు, నాట్యాచార్యులు వీరి శిష్య ప్రశిష్యులే.

BRAOU

వేదాంతం సత్యనారాయణ శర్మగారు నాట్యం చేసి స్త్రీ పాత్ర పోషణకి ప్రఖ్యాతినార్జిస్తే వేదాంతం ప్రహ్లాద శర్మ, వెంపటి పెదసత్యం, భాగవతుల రామకోటయ్య, యేలేశ్వరపు సూర్య ప్రకాశ శర్మ మొదలైనవారు నాట్యం నేర్పి, శిష్యుల ద్వారా తమ ప్రతిభను చూపారు. శ్రీ వెంపటి చిన సత్యం ఈ కళకు కొత్త పోకడలను చూపితే శ్రీ కోరాడ నరసింహారావు, శ్రీసి.ఆర్. ఆచార్య, శ్రీ నటరాజ రామకృష్ణ, శ్రీ చింతా వారు గురువులుగా తమ వంతు సేవలందించారు.

కూచిపూడి ఆట భాగవత సాంప్రదాయానికి చెందినదైతే, ఆలయ, ఆస్థానాలలో చేసే కచేరి సాంప్రదాయాన్ని ఆంధ్ర దేశంలో నిలిపిన వారు కళాకారిణులు మాత్రమే. కళావంతుల కుటుంబాలకు చెందిన వీరు ఆలయాలలో ఆస్థానాలలో లాస్య ప్రధానమైన శైలిని ప్రదర్శించేవారు. శ్రీకూర్మం, పిఠాపురం, శ్రీకాకుళం, మాచర్ల, ధర్మపురి, బాపట్ల, శింగరాయకొండ, శ్రీకాళహస్తిలలోని శైవ,వైష్ణవ ఆలయాలలో నృత్యాన్ని ఆరాధనలో భాగంగా ఈ కళాకారులు సమర్పించే వారు. అదే విధంగా తుని, పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ, అమలాపురం,ముమ్మిడి వరం, మానేపల్లి, మండపేట మొదలైన ప్రాంతాల్లో, జమిందారీల ఆదరణకు నోచుకున్నది ఆస్థాన నర్తనం.

ఈ ఆలయం, ఆస్థానాల నృత్య రీతులను సమగ్రంగా పరిశోధించి , క్రోడీకరించి, పొందు పరచి లాస్య నర్తన సాంప్రదాయాన్ని అందించిన మహనీయులు శ్రీ నటరాజ రామకృష్ణ . ప్రస్తుతం రెండున్న దశాబ్దాలుగా "ఆంధ్రనాట్యం" పేరుతో అమిత జనాదరణ పొందుతున్నదీనృత్య కళ.

**అభ్యాసం**

నృత్తం, నృత్యం, నాట్యం-మూడింటికీ మధ్య సూక్ష్మ భేదాలను వివరించండి.

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

## 8.7 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం.

★ లలిత కళలను మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి : (1) దృశ్య కళలు, (2) శ్రవ్య కళలు, (3) మిశ్రమ కళలు.

★ భారతీయ సంగీతం కర్ణాటక, హిందూస్తానీ అనే రెండు రకాలుగా మార్పు చెందింది.

★ చిత్ర లేఖనంలో రెండు ముఖ్యమైన రకాలు: రేఖా చిత్రం, వర్ణ చిత్రం.

★ వెలుగు చీకట్ల మధ్య ఉన్న భేదం, నీడల క్రమ తీక్షణత, క్రమ లాలిత్యం, స్పర్శనీయత, లయ మొదలైనవి ప్రతి

BRAOU

శిల్పి పాటించే మౌలిక అంశాలు.

★ నాటకం ఒక సమాహార కళ. ఇందులో ప్రధానంగా వాస్తవికతా శైలి, వాస్తవికేతర శైలులకు సంబంధించిన భేదాలున్నాయి.

★ ఆంగికం, వాచికం, సాత్వికం, ఆహార్యం అనే నాలుగు విధాలైన అభినయాలతో ఏర్పడినదే నృత్యకళ. నృత్యంలో శాస్త్రీయ, శాస్త్రీయేతర శైలులు ఉన్నాయి.

## 8.8. మాదిరి పరీక్షా ప్రశ్నలు

**30 పంక్తులలో జవాబులు రాయండి.**

1. లలిత కళలను సంక్షిప్తంగా పరిచయం చేయండి.
2. దృశ్య, శ్రవ్య, మిశ్రమ కళల భేదాల్ని సోదాహరణంగా వివరించండి.

**15 పంక్తులలో జవాబు రాయండి.**

1. రేఖా చిత్రానికి , వర్ణ చిత్రాలకి భేదమేమిటి?
2. కూచిపూడి నృత్య ఆవిర్భావ, వికాసాలను సమీక్షించండి.

BRAOU

# భాగం - 9 భాష - సాహిత్యం

## విషయ క్రమం


9.0 ఉద్దేశం

9.1 ప్రవేశిక

9.2 తెలుగు భాష - పుట్టు పూర్వోత్తరాలు

9.2.1 తెలుగు భాష - పూర్వ యుగం

9.2.2 తెలుగు భాష - మధ్యయుగం

9.2.3 తెలుగు భాష - ఆధునిక యుగం

అభ్యాసాలు

9.3 తెలుగు సాహిత్యం - పుట్టు పూర్వోత్తరాలు

9.3.1 మౌఖిక వాఙ్మయం

9.3.2 పూర్వ యుగ సాహిత్యం

9.3.3 మధ్యయుగ సాహిత్యం

9.3.4 ఆధునిక సాహిత్యం

9.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

9.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 9.0. ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు తెలుగు భాష స్వరూపంలో మార్పులు, తెలుగు భాషా సాహిత్య ప్రక్రియ పరిణామాలు తెలుసుకో గలుగుతారు.

## 9.1 ప్రవేశిక

వర్తమాన వ్యవహారాలలో భాషకూ, సాహిత్యానికీ ఎంతటి ప్రాముఖ్యత ఉందో మీరు గమనించి ఉంటారు. ఇప్పటి ఆధునిక జీవన విధానంలో వస్తున్న అనేక మార్పులు వేగానికి అనుగుణంగా ప్రజావాహినిలో సమాచారం ప్రసరించడంలో ఒక భాషలో, సంభవించే మార్పులు, చేర్పులు అతి సహజం. అవి సజీవ భాష లక్షణం, కర్తవ్యం అవుతాయి. అన్ని ప్రధాన భాషల్లాగానే తెలుగు భాష, సాహిత్య రంగాలలో కూడా ఇదే జరిగింది. భావ ప్రకటనకు భాష ఒక మాధ్యమం అయితే ఆ భావ ప్రకటనకూ, ప్రక్షేపణకూ, అనేక మాధ్యమాలు, సందర్భాలు కాలాను గుణంగా పెరుగుతూ పోతున్నాయి. పూర్వకాలంలో కేవలం మౌఖికంగా, అనుశ్రుతంగా వస్తున్న సారస్వతం కాలక్రమేణా శ్రవ్య కావ్యాల్లోకి, దృశ్య కావ్యాల్లోకి, ఆ తర్వాత తర్వాత

పత్రికలు, రేడియో, టెలివిజన్, సినిమా మొదలైన మాధ్యమాల ద్వారా ప్రజలలోకి చేరుకుంటూ వస్తోంది. అయితే ఎప్పటికప్పుడు ఇలా దశల వారీగా ఆయా మాధ్యమాలలో ఉండే సాంకేతిక గుణాల పరిధిని బట్టి భాషను ప్రయోగించడంలోనూ, సాహిత్య ప్రక్రియలు అందించడంలోనూ అనేక మార్పులు చోటు చేసుకున్నాయి.

మొదట్లో కేవలం ఇతిహాసాలు, పురాణాలతోనే, ఒక పరిధిని ఏర్పరుచుకున్న సాహిత్య వ్యాసంగం కాల క్రమేణా వస్తున్న అనేక రాజకీయ, సాంఘిక, ఆర్థిక మార్పుల కనుగుణంగా, విస్తృతం చేసుకుంటూ, అనేక సాహిత్య ప్రక్రియల్లోకి, వివిధ రంగాల్లోకి విస్తరించింది. అప్పటి నన్నెచోడుడు, నన్నయ్యల నుండి నేటి శ్రీశ్రీ, విశ్వనాథ మొదలైన వారి దాకా తెలుగు భాషా సాహిత్య చరిత్ర అనేక మార్పులు, చేర్పులు చేసుకుంటూ, లిపిలో, శైలిలో ఇంకా అనేక అంశాలలో అభివృద్ధి చెందుతూ వచ్చింది. ఈ సందర్భంలో తెలుగు భాష, సాహిత్య చరిత్రను పరియం చేసుకుందాం.

## 9.2 తెలుగు భాష - పుట్టు పూర్వోత్తరాలు

గత శతాబ్దంలో మొదటి కాలంలో అనేక మంది భాషా శాస్త్రవేత్తలు ప్రపంచ లోని భాషల మీద పరిశోధన చేస్తున్న ప్రయత్నంలో ఆయా భాషల మధ్య ఉండే పోలికలను, లక్షణాలను, గుణాలను విశ్లేషించి వాటిని కొన్ని కుటుంబాలుగా వర్గీకరించారు. ఈ వర్గీకరణలో ద్రావిడ భాషా కుటుంబం ఒకటి. ద్రావిడ భాషా కుంటుంబాన్ని మూడు ఉప కుటుంబాలుగా విభజించారు. తమిళ, తుళు మొదలైనవి దక్షిణ భాషలు. కూడఖీ, మాల్తో, బ్రాహుయీ మొదలైనవి ఉత్తర ద్రావిడ భాషలు.

మధ్య ద్రావిడ కుటుంబానికి చెందిన భాషలు 11గా గుర్తించారు. అవి: తెలుగు, గోండీ, కొండ, పెంగో, మండ, కూయి, కువి, కోలామీ, నాయకీ, పర్జీ, గదబ.

క్రీ.పూ. 200 ఏళ్లనాటికి సింధూ నదీ లోయలో వ్యాపించిన నాగరికత ద్రావిడ నాగరికత అనీ అంతకు ముందు దాదాపు క్రీ.పూ. 6000ఏళ్ళ నాటికి మూల ద్రావిడమనే భాష వీటికి మాతృక అనీ, కాలక్రమేణా అవి ఉప కుటుంబాలుగానూ, మరీ చిన్న కుటుంబాలుగానూ చీలిపోయి ఉండవచ్చునని చారిత్రకులు అభిప్రాయపడుతున్నారు.

ఈ పరిణామాల్లో క్రీ.పూ. 1500 ఏళ్ళ నాటికే ఈ మధ్య ద్రావిడ భాష మరికొన్ని ఉపకుటుంబాలుగా చీలిపోవడం, అందులో తెలుగు మొదటి శాఖ అవడం జరిగింది అన్నది పరిశోధకుల విశ్వాసం. ఈ విశ్వాసాన్ని బలపరిచే ఈ కింది అంశాల్ని పరిశీలిద్దాం.

### 9.2.1 తెలుగు భాష - పూర్వయుగం

క్రీ.శ. ఒకటవ శతాబ్దానికి చెందినదిగా భావిస్తున్న హాలుని గాథా సప్తశతిలో అత్త, అమ్మ, పొడి, మొదలైన తెలుగు పదాలుండడం.

క్రీ.పూ. 200 నుండి క్రీ.శ 200 ఏళ్ళ మధ్య కాలంలో "నాగబు" అన్న తెలుగు పదం ఉండడం, అలాగే అదే కాలానికి సంబంధించినదిగా పరిగణింపబడ్డ అనేక ప్రాకృత, సంస్కృత శాసనాలల్లో మహా కాండరూరే ('కొండూరు) దాలూరే (దాలురు) కుందూరు, పెణుకపర్రు, తాణికొన్ట మొదలైన తెలుగు ఊర్లపేర్లు, కొందరు వ్యక్తుల పేర్లు దొరకడం.

క్రీ.శ. 12 శతాబ్దానికి చెందిన హేమ చంద్రుడు తన "దేశినామమాల"లో ప్రాకృతం లో దొరికే అక్క, అత్త, పసిండి, ఊరో మొదలైన తెలుగు పదాలను దేశ్య పదాలుగా గుర్తించడం.

ఈ ఆధారాల వల్ల క్రీ.శ. మొదటి శతాబ్దానికి చాలా ముందే తెలుగు భాష మామూలు జనభాషగా బహుళంగా

BRAOU

ప్రచారంలో ఉండేదనిపిస్తుంది. అయితే కాలానుగుణంగా సాగిన ప్రవాహంలో సాహిత్య భాషగా తెలుగు భాష అభివృద్ధి చెందింది. తెలుగు భాషను కావ్య రచనకు విస్తృతంగా ఉపయోగించిన మొట్టమొదటి వ్యక్తిగా నన్నయకు గౌరవం ఆపాదించడం జరిగింది. ఈయన 11వ శతాబ్దానికి చెందినవాడు. అయితే అంతకు ముందు 15 శతాబ్దాలుగా జన భాషగా ప్రచారంలో ఉన్న తెలుగు భాషలో మౌలిక వాఙ్మయం ఖచ్చితంగా ఉండి ఉండాలని పరిశోధకులు భావించారు. నన్నయను ఆది మహాకవిగా గౌరవించడానికి కారణం ఆయన రచించిన మహాభారతం దొరకడం. అయితే, ఈ రచనకు ముందు భాషా స్వరూపం ఎలా ఉండేది అనే జిజ్ఞాసతో రెండు రకాలైన శాసనాల ద్వారా పరిశోధకులు విశ్లేషించారు.

అవి : 1. గద్య శాసనాలు, 2. పద్య శాసనాలు. సుమారు 250 కి పైగా శిలా, తామ్ర శాసనాలను పరిశోధించిన మల్లంపల్లి సోమశేఖర శర్మ, కోరాడ రామకృష్ణయ్య, చిలుకూరి నారాయణరావు, కోరాడ మహదేవ శాస్త్రి, బూదరాజు రాధాకృష్ణ మొదలైన పరిశోధకులు తెలుగు భాషా స్వరూపాన్ని నిరూపించారు.

క్రీ.శ. 575 నాటి కడప జిల్లా, ఎర్ర గుడిపాడుకు సంబంధించిన పూర్తి తెలుగు శాసనం గద్యంలోనూ, క్రీ.శ. 848కి చెందిన పండరంగని అద్దంకి శాసనం ఛందోబద్ధమైన పద్యంలోనూ దొరకడం వల్ల భాష స్వరూపంలో మార్పు తెలిసింది. నన్నయ్యకు ముందే ఆవిర్భవించిన ఈ స్వరూపంలో ఉన్న కావ్య భాషా శైలిని పండితులు ఆదరించడం, ఆ ఒరవడిలోనే నన్నయ్య భారతాన్ని తెనిగించడం జరిగింది అన్న విషయం రూఢీ అయ్యింది.

## 9.2.2 తెలుగు భాష - మధ్యయుగం

BRAOU

అయితే కావ్య భాష ఒక ప్రత్యేకమైన శైలిని, స్వరూపాన్ని నన్నయ కాలానికి అంటే 11వ శతాబ్దానికి మొదటి కాలంలో సంతరించుకొంటే, వాడుక భాష మాత్రం మరిన్ని మార్పులు, చేర్పులు చేసుకుంటూ ముందుకు సాగింది. నన్నయ కాలం తర్వాతి శాసనాల్లో అప్పటి సమకాలీన వాడుక భాషకూ, రాజకీయమైన పరిమిత ప్రయోజనాన్ని సాధించే శాసనాల్లో కనబడే భాషకూ ఖచ్చితంగా తేడా ఉంది. అలాగే వచన శాసనాల్లోని భాషకూ, పద్య శాసనాల్లోని భాషకు, అవి ఏర్పాటు చేసే రాజకీయ వ్యవహారాల సందర్భాన్ని బట్టి స్వరూపంలో తేడా ఉంది. ఈ తేడావల్ల తెలుగు భాష దాదాపు క్రీ.శ. 15, 16 శతాబ్దాల దాకా రెండు రకాలైన శైలుల్ని ఏర్పరచుకుంది.

అవి : 1. కావ్య శైలి, 2. వాడుక శైలి

పండితులు భాషను శాసించిన పద్ధతి వల్ల కావ్య భాషాశైలి, వాడుక భాషా శైలికి చాలా దూరమై పోయింది. క్రీ.శ 10 నుండి 16వ శతాబ్ది మధ్య కాలంలో అనేకానేక సాంఘిక, రాజకీయ, వ్యాపార, మతపరమైన సంఘటనలు దేశంలో జరగడంతో తెలుగు భాషలో మరిన్ని మార్పులు చోటు చేసుకున్నాయి.

వైష్ణవ, వీరశైవ మతాల ప్రభావంతో కన్నడ, తమిళ పదాలు, ముస్లింల పాలన ప్రభావం తో పర్షియన్ పదాలు, అరబిక్ పదాలు తెలుగు భాషలో కలిసిపోయాయి. దాంతో 16వ శతాబ్దం మొదటి రోజులకి ఇప్పటి ఆధునిక భాషా స్వరూపం ఏర్పడడానికి ఈ మార్పులే దోహదం చేశాయి. ఈ మార్పుల వలన పాల్కురికి సోమనాథుడు, తిక్కన, శ్రీనాథుడు, అన్నమయ్య, క్షేత్రయ్య మొదలైన వారి కవిత్వ ధోరణిలో కావ్య శైలిలో వాడుక భాషా ప్రయోగం జరిగింది. తద్వారా ఆధునిక భాషా శైలి క్రీ.శ. 16వ శతాబ్దానికే తెలుగులో పునాది చేసుకుందని పండితులు నిర్ణయించారు. క్రీ.శ.13,14 శతాబ్దాలకు చెందినదిగా భావిస్తున్న ఏకామ్రనాథుడి ప్రతాప చరిత్ర, మొదటి వచన రచనగా పండితులు పేర్కొంటారు. అయితే వచనంలో సాగిన ఈ గ్రంథం లోని భాష కావ్య భాషా శైలిని పోలి ఉందని పరిశోధకుల నిర్ణయం. అయితే, వచన రచనలో పూర్తిగా వ్యవహార భాష పదజాలంతో ప్రయోగించబడిన మొదటి రచన విశ్వనాథ నాయకుడి స్థానపతి రచించిన "రాయవాచికం"

క్రీ.శ. 16వ శతాబ్దం నాటిదని చారిత్రకుల అభిప్రాయం. క్రీ.శ. 16 నుండి 18వ శతాబ్దాల మధ్య కాలంలో కావ్య భాషా శైలిలోకి వాడుక భాషా పదాలు విరివిగా వాడడం జరిగింది. ఈ కాలంలో వచ్చిన సాహిత్య ప్రక్రియల్లో, యక్షగానాలల్లో, పాత్రోచిత భాషను ప్రయోగించుకోవడం వల్ల వ్యావహారిక భాష, మాండలిక పదాలు చోటు చేసుకున్నాయి.

ఈ కాలం నాటికి పర్షియన్, అరబిక్ పదాలు తెలుగు భాషలో చోటు చేసుకొన్నాయి. క్రీ.శ. 15వ శతాబ్దంలో భారతదేశంలో వ్యాపార నిమిత్తమై తరలి వచ్చిన పోర్చుగీసు వారితో పెరిగిన సంబంధాల వల్ల తెలుగు భాషలో వారి ప్రభావం బలంగా పడింది. కమీజు, బొత్తం, గిడ్డంగి, మేస్త్రీ, బాల్చీ, ఫాదరి, ఏసోబు, పటాలం, సార్జంటు, సబ్బు, మేజా, పీపాలాంటి ఎన్నో పదాలు జీవన సరళిలో అనేక సందర్భాలలో నాటుకు పోయాయి.

### 9.2.3 తెలుగు భాష - ఆధునిక యుగం

క్రీ.శ. 18వ శతాబ్దం నుంచి క్రైస్తవుల సాహిత్యం రావడంతో పోర్చుగీసు, డచ్ పదాలు మొదలైనవి తెలుగు వ్యావహారిక భాషలో చొచ్చుకుపోయి ఆధునిక దశలో తెలుగు భాషలో జరగబోయే మరిన్ని మార్పులకు నాంది పలికాయి. అలా 17,18 శతాబ్దాలలో కావ్య భాషాశైలి సంప్రదాయ రచనల్లో కనబడ్డా, వాడుక భాషా పదాలు, అన్యదేశాలు, మాండలికాలు విరివిగా జొరబడ్డాయి. వచన రచనల్లో వాడుక భాష సంప్రదాయం బాగా పాతుకు పోయింది. ఇటువంటి వ్యవహారిక పదాలను వాడడం నిషేధించాలనే నిబంధనలు లక్షణ గ్రంథాల్లో సూచించడం, 13వ శతాబ్దంలో కేతన కాలం నుండీ మొదలైనప్పటికీ, కావ్య భాషలోని వ్యావహారిక పదాలు చాలా వరకు వ్యాప్తిలోకి వచ్చాయి. ఇదిలా సాగుతుంటే మరోపక్క మౌలికంగా జానపద సాహిత్యంలో జన సామాన్య భాష బహుళంగా ప్రచారంలో ఉండడం జరుగుతూ వచ్చింది. క్రీ.శ. 18వ శతాబ్దంలో ఇంగ్లీషు వాళ్ళ ప్రమేయంతో శాసనాలలో అధికారిక వ్యవహార పత్రాలలో ఇంగ్లీషు పదాలు వచ్చి చేరాయి. ఇంగ్లీషులో తెలుగు భాషకు వ్యాకరణాలు రావడం; ప్రజలు అధికారులకు సమర్పించుకునే వినతి పత్రాలలో విధిగా వాడుక భాషను వాడాలనే నియమాలు; ముద్రణ సౌకర్యాలు ప్రారంభం కావడం మొదలైన వాటివల్ల వాడుక భాషా శైలి బాగా పాతుకు పోయింది. అయితే క్రీ.శ. 1850 తర్వాత చిన్నయ సూరి తెలుగు సారస్వత జగత్తులోకి ప్రవేశించిన తర్వాత కావ్య భాష మళ్ళీ ఊపిరి పోసుకుంది. అందరూ కావ్య భాషను గౌరవించారు. ఆధునిక సాహిత్య ప్రక్రియలు నాటకం, నవలల్లాంటివి వస్తున్నా, తెలుగు పాఠ్య గ్రంథాలు మొదలైనవన్నీ కావ్య భాషలోనే రావడం మొదలైంది. ఈ మార్పుల వల్లనే పాఠ్య గ్రంథాలలో వ్యవహారిక భాషను ఉపయోగించి రచన చేయాలనే ఆలోచన ఒక ఉద్యమంగా మళ్ళీ సాగింది. 1857 నాటికి మద్రాసు, కలకత్తా, బొంబాయిల్లో విశ్వ విద్యాలయాలు ఏర్పడడం, ఇంగ్లీషు భాషా ప్రచారం జోరుగా సాగడం, బళ్ళారి, తిరుపతి, విశాఖపట్టణం, మొదలైన చోట్ల ముద్రణా సౌకర్యాలు ఏర్పడడం, క్రైస్తవ మత ప్రచారాలకు జన సామాన్య తెలుగును ప్రచార సాధనంగా వాడుకోడం మొదలైన విశేషాల వల్ల తెలుగు భాష ప్రయోగం మరిన్ని ఇతర రంగాలకు విస్తృతంగా వ్యాపించింది. క్రైస్తవ పత్రికలతోపాటు, సత్యదూత, హితవాది, వృత్తాంతి మొదలైన పత్రికలు ప్రజల్లోకి రావడంతో ప్రచారంలో వాడుక భాషా శైలిని బాగా ప్రయోగించడం జరిగింది. నవల,కథానిక, నాటకం, జీవిత చరిత్ర, స్వీయ చరిత్ర వ్యాసం, విమర్శ మొదలైన ఇతర సాహిత్య ప్రక్రియల్లో తెలుగు భాష ప్రయోగం, వినియోగం పెరిగిపోయింది. సాహిత్య సంస్థలు, సాహిత్య పత్రికలు భాష పట్ల కొత్తకొత్త ఆలోచనలను ప్రతిపాదించడానికి వేదికలయినాయి. తద్వారా ఆధునికమైన ప్రమాణ భాష ఒకటి స్థిరపడింది. ఆంధ్రరాష్ట్రం ప్రత్యేకం అవడంతో, తెలుగుభాష అధికార భాష అయ్యింది. బోధనాభాష అయ్యింది. ఇలా అన్ని రంగాలలో ప్రవేశించిన తెలుగు భాష ఆధునిక భాషా లక్షణాలను ప్రామాణిక భాష లక్షణాలను సంతరించుకుంది. భాషావేత్తల అభిప్రాయాల మేరకు ఆధునిక భాషకు మూడు ప్రధాన లక్షణాలుండాలి అవి:

(1) ఒక స్థిరమైన ప్రామాణికత అంటే స్థానికమైన యాస, మాండలికాల ప్రభావం ఎక్కువ లేకుండా వుండడం.

(2) ఆధునిక శాస్త్ర విజ్ఞాన సముపార్జన, ప్రచారానికి తగిన పదజాలం రచనా విధానాన్ని పెంపొందించుకోవడం.

(3) సమగ్రమైన లిపిని సాధించుకోవడం.

ఈ లక్షణాలతో తెలుగు భాష ఆధునికతను సంతరించుకొంది. ఇలా చరిత్ర గతిలో దేశంలో జరిగిన అనేక అంశాల ప్రభావంతో కాలానుగుణంగా తెలుగు భాష అంచెలంచెలుగా అభివృద్ధి చెంది ఎప్పటి కప్పుడు తటస్థించే సామాజిక ప్రయోజనాలకు అనుగుణంగా మార్పులు చెందుతూ, సంప్రదాయకతకూ ఆధునికతకూ ఎప్పటికప్పుడు తల ఒగ్గుతూ అనేక భాషా వేత్తలు, పరిశోధకులు, పండితుల కృషితో అన్ని రంగాల్లోకి జీవభాషగా ప్రవహిస్తోంది.

## అభ్యాసం

ఆధునిక భాష లక్షణాలు ఎలాగుంటాయి ?

BRAOU

## 9.3 తెలుగు సాహిత్యం - పుట్టు పూర్వోత్తరాలు

తెలుగులో సాహిత్య ఆరంభ దశ తెలుసుకోవడానికి ముందు సాహిత్యం అంటే కేవలం లిపిలో ఉన్నదే అని కాకుండా అను శ్రుతంగా ప్రజల్లో విస్తృతంగా వ్యాపించిన మౌఖిక వాఙ్మయం కూడా అని గ్రహించాలి. అందులో కూడా కవితా స్ఫూర్తి, సందర్భం, లయల నియమాలు మొదలైనవి ఉంటాయి. అయితే ఇతర దేశాల్లో జరిగినట్లుగా అప్పటి సామాన్య ప్రజల నిత్య జీవన సరళిలో ఉత్పన్నమయిన ఈ మౌఖిక సాహిత్యం సంకలన రూపంలో - నిక్షిప్తం చేయడం తెలుగు దేశంలో జరగలేదు.

### 9.3.1 మౌఖిక వాఙ్మయం

క్రీ.పూ. 2 నుండి క్రీ.శ. 6వ శతాబ్దాల మధ్య కాలంలోనిగా భావించే కొన్ని ఆధారాల వల్ల అప్పటి సామాన్య జనంలో ఈ సాహితీ ప్రక్రియలు ఉండి ఉండేవి. అని పరిశోధకులు నిర్ణయించారు. ఆ కాలానికి సంబంధించిన సంస్కృత, ప్రాకృత శాసనాల్లోని తెలుగు పదాలు, హాలుని గాథాసప్తశతి లోని తెలుగు మాటలు,పాటలు, లయల నియమాలు, ఛందస్సు మొదలైనవి గమనించాలి. అలాగే 11వ శతాబ్ది నుండి కనబడే కావ్యాల్లో ముందు తరాల సామాన్య జనుల పద గేయాల ప్రసక్తి మొదలైన ఆధారాలతో తెలుగులో మౌఖిక సాహిత్యం గుర్తించవచ్చు. సామాన్య జనులు వారి నిత్య జీవన విధానంలో జరిగే వివాహాది తంతుల్లో సాధారణంగా దొర్లే పద గేయాలు ఖచ్చితంగా వాఙ్మయంగా ఉండేదని మనం కూడా ఊహించవచ్చు.

### 9.3.2 పూర్వ యుగ సాహిత్యం

అప్పటి సమకాలీన సారస్వతం, సంస్కృతం, ప్రాకృతం, అర్ధమాగధి, పాళీ భాషల్లో ఉండేది. తెలుగు జన భాష అయితే, పండితులది సంస్కృతం, రాజభాష ప్రాకృతం అవ్వడంతో, రాజులు, మతాధికారులు రాజోద్యోగులు విద్యా వంతులు సంస్కృత ప్రాకృతాలనే బాగా ఆదరించేవారు. మత ప్రచారాలకు, తదితర రాజకీయ వ్యవహారాలకు, సాహితీ వ్యాసంగాలకు ఈ రెండు భాషలనే వాడేవారు.

వైదిక వాఙ్మయం, శాస్త్రాలు, కళలు, అష్టాదశ పురాణాలు, రామాయణం, భారతం, ఇతిహాసాలు, కాళిదాసు మొదలైన వారు రచించిన నాటకాలు,కావ్యాలు కోకొల్లలు. వీటిని సంస్కృతం తెలిసిన వారందరూ ఆదరిస్తే జాతక కథలు, త్రిపిటకములు అనే బుద్ధుని ఉప దేశాల సంగ్రహం, సుత్తములు అనే బౌద్ధ ధర్మాల ప్రచారం సాగే గ్రంథాలు సేతు బంధం లాంటి కావ్యాలు, నాటకాలు, పాళీ, ప్రాకృత భాషలు తెలిసిన రాజులు, బౌద్ధ మతస్థులు ఆదరించేవారు. జైన వాఙ్మయం సంస్కృత, ప్రాకృతాల్లో "అర్థ మాగధి" అనే భాషలో ప్రచారంలో ఉండేది. తుమ్మెద పదాలు, వెన్నెల పదాల్లాంటి పద సాహిత్యం సామాన్య జనుల గుండెల్లో ప్రవహించేది. అయితే ఈ దశలో గ్రంథ రచన గాని, పరిపాలన వ్యవహారాల వ్యవస్థలో తెలుగు భాష ఉందనీ అనీ అనడానికి ఆధారాలు లేవంటారా పరిశోధకులు. ఆ తర్వాతి కాలం అంటే క్రీ.శ. 6వ శతాబ్ది నుండి 10వ శతాబ్దం మధ్య కాలంలో తెలుగులో సాహిత్య ప్రక్రియ మూడు రకాలుగా ఉండేదని పరిశోధకులు నిరూపించారు. అవి :

(1) శాసన కవిత్వం (2) పద గేయ రూప కవిత్వం (3) కావ్య రూప కవిత్వం.

#### శాసన కవిత్వం

BRAOU

క్రీ.శ. 575 నుండి పూర్తి తెలుగులో ప్రకటించబడిన శాసనాలు దొరకడంతో తెలుగు సాహిత్య స్వరూపాన్ని పరిశోధకులు విశ్లేషించారు.

(1) గద్య శాసనాలు

(2) పద్య శాసనాలు

పద్యంలో ప్రకటించబడిన శాసనాలు క్రీ.శ. 848 నుండి మొదలైనాయి. క్రీ.శ. 848 కి చెందిన పండరంగని అద్దంకి శాసనంలో తరువోజలో పద్యం, అప్పటి కాలానికి చెందిన విజయాదిత్యుని కందుకూరు శాసనంలో సీస పద్యం, యుద్ధ మల్లుని బెజవాడ శాసనంలో అయిదు మధ్యాక్కరలు మొదలైనవి పరిశీలిస్తే అప్పటి కవిత దేశీ రూపంలో ఉండేది అని గ్రహించవచ్చు.

ఇవికాక సంస్కృత వృత్తాల ఛాయల్నిఇమిడ్చుకున్న పాతలూరు శాసనంలో చంపక మాల విరియాల గూడూరు శాసనంలో మూడు చంపకమాలలు రెండు ఉత్పల మాలలు మొదలైన పద్యాల్ని పరిశీలించి అప్పటికి తెలుగులో సాహిత్యం గ్రంథ రచన స్థాయిలో ఉండేదని పరిశోధకులు నిర్ణయించారు. అయితే గద్య శాసనాలు కూడా గేయ రూపంలో ఉండేవని కొన్ని ఆధారాల వల్ల తెలుస్తుంది.

#### పద గేయ రూప కవిత్వం

తెలుగులో కవిత్వాన్ని మొదట చాళుక్యులు ప్రోత్సహించారు. తెలుగు కవిత దేశి రూపంలో అప్పుడే మొదలయింది. అయితే ఈ దేశీ కవిత రెండు రూపాల్లో ఉండేది. అవి: (1) పదాలు, (2) పాటలు. తుమ్మెద, ప్రభాత, వెన్నెల, నివాళి,

గొబ్బి మొదలైనవి పదాలయితే, లాలి, జోల, ఏల, ఊయల వంటివి పాటలు అయినాయి. ఈ పాటలు ఏకపద, ద్విపద, త్రిపద, చతుష్పదాలుగా వాడుకలో ఉండేవని తెలుస్తుంది. అలాగే జనసామాన్యంలో ప్రబలి ఉన్న దేశీ కవిత్వంతో పాటు, పండితులు సంస్కృత పదాలు, దేశీ రచనల్లో పదాలను కలిపి మణి ప్రవాళ పద్ధతిలో ఉపయోగించి సాహిత వ్యాసంగాన్ని కొనసాగించారు. దీన్ని బట్టి నన్నయకు ముందే తెలుగు కవిత్వపు తాలూకు వాసనలు ఉన్నాయని తెలుస్తుంది. అంతే కాకుండా క్రీ.శ. 11వ శతాబ్దానికి చెందిన వాంచియార్ అనే కవి తెలుగు ఛందో గ్రంథాన్ని రచించినట్లు సంస్కృత భాషలో తెలుగు లక్షణ గ్రంథం ఒకటి ఉండేదని పరిశోధకులు నిరూపించారు.

## కావ్య రూప కవిత్వం

ఈ కాలంలో నన్నయకు పూర్వం కొందరు కవులు కావ్య రచన చేసి ఉండవచ్చని సాహిత్యాధారం వల్ల తెలుస్తుంది. వేటూరి ప్రభాకర శాస్త్రి సంపాదిత ప్రబంధ రత్నావళి, నిడదవోలు వెంకటరావు గారి తెలుగు కవుల చరిత్ర, మడికి సింగన సకల నీతి సమ్మతం అనే సంకలన గ్రంథంలో కావ్య రచనా వ్యాసంగం ఆ కాలంలో ఉండేదని నిరూపించారు.

ప్రబంధ రత్నావళి పద్మకవి విరచిత జినేంద్ర పురాణం నుండి ఒక సీస పద్యం, సర్వ దేవుని ఆది పురాణం నుంచి ఒక సీస పద్యం ఉదహరించబడ్డాయి. కన్నడ కవులు అయిన పంపపొన్న కవులు జన్మరీత్యా తెలుగు వారేనని, మడికి సింగన సకల నీతి సమ్మతంలో గజాంకుశుడనేది కవి పేరు కాదని, బిరుదేనని, శాసనాధారాలతో అతను నారాయణుడని నిడదవోలు వెంకట్రావు నిరూపించడంతో బాటుగా కావ్యాలు లభించక పోయినా, క్రీ.శ. 898 కి చెందిన శ్రీపతి పండితుడు క్రీ.శ. 973కి చెందిన అయ్యభట్టు మొదలైన శాసన కవులు నన్నయ్యకు ముందు తెలుగులో సాహితీ సేవ చేసారని పలువురు పరిశోధకుల అభిప్రాయం.

ఈ కాలంలో తెలుగు కవిత మొదట చాళుక్య రాజుల ప్రోత్సాహంతో దేశి రూపంలో మొదలై తర్వాత కన్నడ కవుల ప్రభావంతో మార్గ పద్ధతిని అవలంబించి నన్నయ భారత రచనా కాలానికి ఒక సమగ్ర రూపాన్ని పొంది ఉండవచ్చని పలువురి అభిప్రాయం.

BRAOU

## 9.3.3 మధ్య యుగ సాహిత్యం

ఇక తర్వాత క్రీ.శ. 11వ శతాబ్దం లో దొరికినటువంటిది నన్నయ రచించిన భారతమే కాబట్టి ఆంధ్ర సాహిత్య చరిత్ర అప్పటి నుంచే ప్రారంభమయింది అనుకోవాలి. క్రీ.శ. 11వ శతాబ్దం నుండి క్రీ.శ. 16వ శతాబ్దం వరకు తెలుగు సాహిత్యంలో రెండు మార్గాలు కనబడతాయి. అవి:

(1) సంస్కృత సాహిత్యాన్ని అనుసరిస్తూ మార్గ కవిత్వం.

(2) జనవాడుకలో ప్రసరించిన దేశీ కవిత్వం

ఇతి హాసాలు, పురాణాలు, కావ్య ప్రబంధాలు, క్షేత్ర మహత్యాలు, ద్వ్యార్థి కావ్యాలు, అచ్చ తెలుగు కావ్యాలు కథా కావ్యాలు, శాస్త్ర వాఙ్మయం వంటివి మార్గ కవితా పద్ధతికి చెందినవైతే, ద్విపద కావ్యాలు, శతకాలు,ఉదాహరణలూ, రగడలూ, యక్షగానాలూ వంటివి దేశి కవితా పద్ధతికి చెందినవి.

నన్నయ భారత రచనకు పూనుకుని ఆది, సభా పర్వాలను, అరణ్య పర్వంలో కొంత భాగాన్ని మాత్రం తెనిగించాడు. తన రచనలో సంస్కృత భాషా లక్షణ ప్రభావాన్ని కనబరుస్తూ, తత్సాలు, పదాలు, సంస్కృత శ్రుతాల గుణాలను, చంపూ కావ్య నిర్మాణ పద్ధతిని అవలంబించి స్వచ్ఛమైన మార్గ కవితా పద్ధతిని చాటి చెప్పాడు. ఈ పద్ధతినే నన్నయ తదుపరి పెద్ద

లందరూ అత్యంత శ్రద్ధాసక్తులతో పాటించి తమ తమ సాహితీ వ్యాసంగాన్ని కొనసాగించారు. నన్నయ నిలిపి వేసిన రచనను తిక్కన ఆయన రచనా పద్ధతినే పాటించి విరాట పర్వం నుంచి స్వర్గారోహణ పర్వం దాకా 15 పర్వాలను తెనిగించాడు. అయితే స్వభావ సిద్ధమైన ఊహాశక్తి, నాటకీయతా స్ఫూర్తి గలిగిన వాడుగా సంభాషణలను కొనసాగించడంలో దేశీతనాన్ని ప్రకటించాడు అన్నది పండితుల అభిప్రాయం. నన్నయ సగం రచించి నిలిపి వేసిన అరణ్య పర్వాన్ని ఎఱ్ఱన పూర్తి చేయడంతో కవిత్రయం విరచిత భారతం తెలుగు సాహిత్య చరిత్రలో ప్రతిష్ఠింపబడింది.

ఇలా సంస్కృత భాషా సాంప్రదాయానికి తెలుగు సాహిత్య జగత్తులో విశిష్టమైన ప్రాధాన్యత నన్నయ అనంతరం వచ్చిన కవుల రచనల్లో కనబడుతుంది. తిక్కన నిర్వచనోత్తర రామాయణం, గోన బుద్ధా రెడ్డి రంగనాథ రామాయణం, పిల్లల మఱ్ఱి పిన వీరభద్రుని జైమినీ భారతం, చంపూ కావ్య రూపంలో వెలసిన మొట్టమొదటి తెలుగు రామాయణం, భాస్కర రామాయణం తెలుగు కవయిత్రి మొల్ల రచించిన ఆరుకాండల పద్యకావ్యం రామాయణం, అయ్యల రాజు రామభద్రుని రామాభ్యుదయం అనే ప్రబంధం లాంటివి కవితా రీతిలో నన్నయ సాంప్రదాయాన్ని అనుసరించినా, అక్కడక్కడా దేశీయ విధానం పలుకుబళ్ళు, ఛందస్సులు వాడిన తీరులో గోచరిస్తుంది.

ద్విపద శైవ పురాణాలుగా ప్రసిద్ధి చెందిన పాల్కురికి సోమనాధుని బసవ పురాణం, పండితారాధ్యుని చరిత్ర, పిడపర్తి సోమనాధుని ప్రభులింగ లీల మొదలైనవి స్వతంత్ర దేశీ పురాణాలు.

ఇలా పురాణ సాహిత్యంతోబాటు ఈ దశలో కావ్య ప్రబంధాలు అనేకం వచ్చాయి. పురాణంలో ఒక ప్రసిద్ధ కథను తీసుకుని వివిధ రకాలైన వర్ణనాలంకారాలతోను, పాత్ర చిత్రీకరణ, రసభావ ప్రధానం మొదలైన వాటితో కథా విధానాన్ని పాటించడం కావ్య పద్ధతి. ఇదే తెలుగు సాహిత్యంలో ప్రబంధ పద్ధతిగా పిలువబడింది.

నన్నెచోడుని కుమార సంభవం మొదటి తెలుగు కావ్యం. శ్రీనాధుని శృంగార నైషధం, పిల్లల మఱ్ఱి పినవీర భద్రుని శృంగార శాకుంతలం, అల్లసాని పెద్దన మను చరిత్ర, నంది తిమ్మన పారిజాతాపహరణం, కృష్ణ దేవరాయల ఆముక్త మాల్యద, రామరాజు భూషణుని వసుచరిత్ర, పింగళి సూరన కళాపూర్ణోదయం, ప్రభావతి ప్రద్యుమ్నం, కందుకూరి రుద్రకవి నిరంకుశోపాఖ్యానం, మాదయ గారి మల్లన రాజశేఖర చరిత్రం, సంకుసాల నృసింహకవి కవి కర్ణ రసాయనం చింతపూడి వల్లభాచార్యుని రాధామాధవం మొదలైన వాటితో ప్రబంధ సాహిత్యం తెలుగు సాహిత్య చరిత్రలో వినుతికెక్కింది.

దీంతో బాటుగా క్షేత్ర మహత్మ్యాలు ఒక ప్రత్యేక సాహిత్య ప్రక్రియగా తెలుగు సాహిత్యంలోవెల్లి విరిసింది. మొట్టమొదటి క్షేత్ర పురాణమైన ఎఱ్ఱన నృసింహ పురాణం మొదలుకుని, శ్రీనాధుని ఖండాను వాదాలైన భీమేశ్వర పురాణం, కాశీ ఖండాది పురాణాలు, భైరవ కవి శ్రీరంగ మహత్యం, ధూర్జటి కాళహస్తి మహత్యం, తెనాలి రామలింగడి పాండురంగ మహత్యం మొదలైనవి ఈ కోవకు చెందినవి. ఈ స్థల పురాణాలలో ఆయా కవుల భక్తి విశ్వాసాలు, కథా కథన చాతుర్యం, శిల్పం మొదలైనవి ప్రతి బింబిస్తాయి.

వీటితో బాటుగా అనేక పండితులు సాహిత్య పరిశ్రమతో కొనసాగించిన వ్యాసంగంలో ద్వ్యార్థికావ్యాలు, శతకాలు, కథా కావ్యాలు, శాస్త్ర వాఙ్మయం, ఉదాహరణలు, రగడలు, యక్షగానాలు లాంటివి వివిధ లక్షణాలతో ఇతర సాహిత్య ప్రక్రియలుగా అభివృద్ధి చెందాయి.

ఇక క్రీ.శ. 16 నుండి 18వ శతాబ్దంలో తెలుగు సాహిత్యంలో మరిన్ని రకాలైన పోకడలు, ప్రక్రియలు కన్పిస్తాయి. ఈ దశలో తంజావూరు, మధుర మొదలైన రాజ్యాల్లో జరిగిన సాహిత్య పోషణ విశిష్టమైంది. అయితే ఈ దశలో జరిగిన అనేక రాజకీయ, సాంఘిక పరిస్థితులు అప్పటి కవులందరినీ రక రకాలుగా ప్రభావితం చేయడంలో కొన్ని విచిత్ర ధోరణులు తెలుగు

BRAOU

సాహిత్యంలో కనబడతాయి. సాంఘిక దురాచారాలు, మూఢ నమ్మకాల పట్ల నిరసన తెలిపే వేమన, పోతులూరి వీరబ్రహ్మం లాంటి వారి కవిత్వం, రాజాశ్రిత కవులు పాటించిన పచ్చి శృంగార కవిత్వం మొదలైన పోకడలన్నీ సాహిత్యంలో కనబడతాయి. వ్యక్తిగత నమ్మకాలు, సాంఘిక, రాజకీయ అంశాలు ఎన్నో తెలుగు సాహిత్యాన్ని శాసించడంతో దీన్ని క్షీణ దశగా పరిగణించారు.

అయితే తంజావూరుని పాలించిన విజయ రాఘవుని పోషణలో కాళకవి రాజ గోపాల విలాసం అనే కావ్యం, వెంకటపతి విజయ రాఘవ చంద్రికా విహారం అనేపదాలు, పురుషోత్తమ దీక్షితులు రాసిన "తంజాపురాన్న దాన మహా నాటకం" లాంటి ప్రహసనం, రంగాజమ్మ మన్నారు దాస విలాసం నాటకం మొదలైన వాటితో బాటుగా శహాజీ రాసిన సతీ దాన శూరం లాంటి యక్ష గానాలు మొదలైనవి ఉత్తమ విలువలు ఆపాదించదగిన సాహిత్య ప్రక్రియలు.

## 9.3.4 ఆధునిక సాహిత్యం

ఇక తెలుగు సాహిత్య చరిత్రతో 19వ శతాబ్దం చాలా కీలక పాత్ర వహించింది. 19-20వ శతాబ్దాలలో దేశంలో జరిగిన అనేక సాంఘిక, రాజకీయ పరిణామాలలో కొత్త భావాలు, కొత్త ధోరణులు, పోకడలు, ప్రయోగాలు అనేకం చోటు చేసుకున్నాయి.

ఈ దశలో జరిగిన సంఘ సంస్కరణోద్యమాలతో బాటుగా, భాషా, సాహిత్య ఉద్యమాలు, గ్రంథాలయోద్యమాలూ, వామపక్ష ఉద్యమాలూ వివిధ భాషల సాహిత్య భావాలతో వస్తువులోనూ, రూపాల్లోనూ, శైలిలోనూ ప్రక్రియల్లోనూ అనేక మార్పులు చోటు చేసుకున్నాయి.

సి.పి. బ్రౌన్ సేవతో బ్రౌణ్య నిఘంటువు, తెలుగు వ్యాకరణం చిన్నయ సూరి బాల వ్యాకరణం; వృత్తాంతి, హితవాది, వివేక వర్ధిని లాంటి పత్రికలు, తెలుగులో నవల, నాటకం, జీవిత చరిత్ర లాంటి ప్రక్రియలకు శ్రీకారం చుట్టిన కందుకూరి రచనలూ, ఇంగ్లీషు సాహిత్యాను వాదాలు,బ్రాహ్మ వివాహం, వ్యవహార ధర్మబోధిని లాంటి ప్రహసనాలూ, గురజాడ కన్యాశుల్కం లాంటి నాటకం, దేశమును ప్రేమించుమన్నా వంటి దేశభక్తి గీతాలతో బాటుగా, రాయప్రోలు, అబ్బూరి రామకృష్ణరావు, దువ్వూరి రామిరెడ్డి, దేవుల పల్లి కృష్ణశాస్త్రి లాంటి భావ కవులు, పఠాభి, శ్రీశ్రీ లాంటి అభ్యుదయ కవుల సేవలో భాగంగా ఫిడేలు రాగాలు డజన్, నయాగరా, మహాప్రస్థానం లాంటి ఉత్తమ రచనలు, తెలుగులో వెలుబడ్డాయి. ఇంతే కాక దిగంబర కవిత్వం, జరూక్ శాస్త్రి, తిలక్, ఆరుద్ర, దాశరథి, కాళోజీ, సి. నారాయణరెడ్డి మొదలైనవారి వచన కవిలతో కవిత్వం విలసిల్లింది.

ఇక విమర్శకు వస్తే ఆధునిక విమర్శకు శ్రీకారం చుట్టిన కట్టమంచి రామలింగా రెడ్డి మొదలకుని అనంత కృష్ణ శర్మ, మానేపల్లి రామకృష్ణకవి, విశ్వనాథ సత్యనారాయణ ఇంకా ఎందరెందరో, సాహితీ విమర్శకులు, ఉద్దండ పండితులు, మరెంతో మంది పరిశోధకుల పరిశ్రమ, వ్యాసంగాలతో తెలుగు సాహిత్య చరిత్ర అనేక ప్రక్రియల్లో ప్రయోగాలు జరిపే ప్రయోక్తలతో సుసంపన్నమై అంతర్జాతీయ సాహిత్య చరిత్రలో సమున్నత స్థానాన్ని సంతరించుకుంది.

## అభ్యాసం

మధ్యయుగ సాహిత్యంలో ప్రధానంగా కనిపించే ప్రక్రియల్ని పేర్కొనండి.



BRAOU

## 9.4 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం.

★ ఆధునిక జీవన విధానంలో వస్తున్న వేగవంతమైన మార్పుల కనుగుణంగా భాషా సాహిత్యాలలోనూ మార్పు సంభవిస్తుంది.

★ నన్నయ్యకు ముందే వున్న కావ్య భాషా స్వరూపాన్ని మనం శాసనాల ఆధారంగా గుర్తించవచ్చు.

★ 11వ శతాబ్ది నుంచి 15, 16 శతాబ్దాల వరకు భాషలో రెండు ప్రధాన శైలులు కన్పిస్తాయి. అవిః కావ్యశైలి, వాడుక శైలి.

★ ఆధునిక యుగంలో కొత్త భావనలు, ఆలోచనల వాహికగా, భాష కొంత ఆధునికం అయ్యింది. ఆధునిక ప్రామాణిక భాష ఒకటి ఏర్పడింది.

★ మౌఖిక సాహిత్యం మొదటిది. లిఖిత సాహిత్యం ఆనవాళ్ళు నన్నయ్యకు ముందు శాసనాల్లో కన్పిస్తాయి.

★ 11వ శతాబ్ది నుంచి 16, 17 శతాబ్దాల వరకు సాహిత్యంలో కావ్య, ప్రబంధ, శతకాది రచనలు కన్పిస్తాయి. యక్షగానాది ప్రక్రియలూ కన్పిస్తాయి.

★ ఆధునిక యుగంలో సాహిత్యంలో నాటకం, నవల, కథానిక, వ్యాసం, కవిత్వం లాంటి ప్రక్రియలు వ్యాప్తి పొందుతూ వచ్చాయి.

## 9.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

30 పంక్తుల్లో సమాధానాలు రాయండి

1. నన్నయకు పూర్వం భాషా స్వరూపం ఎలా ఉందో తెలుసుకోవడానికి ఆధారాలేవి ?

2. మధ్యయుగ సాహిత్యం లోని వైవిధ్యాన్ని సోదాహరణంగా వివరించండి.

15 పంక్తులలో సమాధానాలు రాయండి.

1. మధ్యయుగంలోని భాషా స్వరూపంలో ప్రధానంగా కన్పించే పోకడలేవి ?

2. ఆధునిక సాహిత్య స్వరూపాన్ని సమీక్షించండి.

BRAOU

BRAOU

# ఖండం – III ఆంధ్రప్రదేశ్ రాజకీయార్థిక నిర్మితులు

రాష్ట్ర రాజకీయ వ్యవస్థ బహు ముఖాలను వివరంగా తెలియజేప్పేందుకు ఈ ఖండంలో ప్రయత్నించాం. 70 శాతం గ్రామీణ జనాభా ఉన్న భారతదేశంలో రాజ్యాంగ పరిధిలో అతి ప్రాముఖ్యం సంతరించుకున్న పంచాయతీ రాజ్ వ్యవస్థను గురించి, స్థానిక, ప్రభుత్వ రంగ సంస్థల నిర్వహణల గురించీ స్థూలంగా తెలుసుకోవటం అత్యావశ్యకం అని భావించి వాటి గురించి వివరించాం. ఈ ఖండంలో 5 భాగాలున్నాయి. అవి:

10. రాజకీయ వ్యవస్థ.
11. పరిపాలనా వ్యవస్థ
12. స్థానిక సంస్థలు
13. ఆర్థిక ప్రణాళికా వ్యవస్థలు
14. ప్రభుత్వ రంగ సంస్థలు.

BRAOU

BRAOU

# భాగం - 10 రాజకీయ వ్యవస్థ

## విషయ క్రమం

10.0 ఉద్దేశం
10.1 ప్రవేశిక
10.2 స్వాతంత్ర్యానికి పూర్వపు రాజకీయ వ్యవస్థ
అభ్యాసం
10.3 ఆంధ్ర ప్రదేశ్ ఏర్పాటుకు పూర్వం రాజకీయ వ్యవస్థ
10.4 రాష్ట్ర రాజకీయ వ్యవస్థ
10.4.1 గవర్నరు
10.4.2 ముఖ్యమంత్రి
10.4.3. మంత్రులు - మంత్రి వర్గం
10.4.4. సచివాలయం
అభ్యాసం
10.5 రాజకీయ పార్టీలు - రాజకీయాలు
10.6 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం
10.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 10.0. ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు -

* స్వాతంత్ర్యానికి పూర్వపు రాష్ట్ర రాజకీయ వ్యవస్థను,
* ప్రస్తుత రాష్ట్ర రాజకీయ వ్యవస్థను గురించి వివరించగలుగుతారు.

## 10.1 ప్రవేశిక

భిన్నత్వాలకు నిలయమైన మన దేశాన్ని రాజ్యాంగ నిర్మాతలు "రాష్ట్రాల యూనియన్" (Union of States) గా రూపొందించారు. స్వాతంత్ర్య సంగ్రామంలోనూ, దేశాభివృద్ధి కార్యక్రమాలలోను రాష్ట్రాలు అత్యంత ప్రముఖ పాత్రను నిర్వహించాయి. దేశ రాజకీయ వ్యవస్థ పరిపూర్ణ అవగాహనకు రాష్ట్ర రాజకీయ వ్యవస్థ అధ్యయనం చాలా దోహదకారిగా ఉంటుంది. మన దేశ రాజ్యాంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఒకే విధమైన వ్యవస్థా రూపం ఉంది. ఒకే విధమైన నిర్మితులు ఉన్నప్పటికీ ఆచరణలో మాత్రం వాటి మధ్య పూర్తి సారూప్యత లేదు. రాష్ట్రాలన్నింటిలో రాజకీయ స్వరూప స్వభావాలు ఒకే విధంగా

లేవు. ప్రతి రాష్ట్రం తనదైన ప్రత్యేక రాజకీయ ప్రవర్తనా సరళిని సంతరించుకొంది. రాష్ట్ర రాజకీయ వ్యవస్థ ఒక విధంగా జాతీయ, స్థానిక రాజకీయాల సంగమ స్థానం. అవి రెండూ పరస్పరాధార భూతమైన స్వరూప స్వభావాలు కలవి. భారత జాతీయ జీవనానికి రాష్ట్ర రాజకీయ జీవనాన్ని ఒక సూక్ష్మ రూపంగా భావించవచ్చు. భారత రాష్ట్రాల యూనియన్ కేంద్రీకృత స్వభావాన్ని కలిగి ఉంది. ఈ కేంద్రీకృత స్వభావం వివిధ రాజకీయ పార్టీల వ్యవస్థను కూడా కేంద్రీకృతమైనవిగా తీర్చిదిద్దింది. రాష్ట్రాల రాజకీయాలను అవగాహన చేసుకోవటానికి వివిధ రాజకీయ పార్టీల ప్రభావాలను పరిశీలించటం చాలా అవసరం. రాష్ట్ర ప్రభుత్వాల మీద కేంద్ర ప్రభుత్వ నియంత్రణ అజమాయిషీ ఎక్కువగా ఉంది. రాష్ట్రాలలో ఏర్పడిన బాధ్యతాయుత ప్రభుత్వాలను, రాజ్యాగ బద్ధంగా పాలించ లేకపోతున్న వన్న మిషతో రద్దుచేసే అధికారం కేంద్రానికి ఉంది. రాష్ట్రాధినేత గవర్నరు. ఆయన కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి. ఆయన సాధారణంగా కేంద్ర ప్రభుత్వ అభిప్రాయాలకు అనుగుణంగా వ్యవహరిస్తాడు. గవర్నరు ద్వారా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యవహారాలలో జోక్యం కలుగజేసుకోవచ్చు. రాష్ట్ర ముఖ్యమంత్రిని గవర్నరు నియమిస్తారు. రాష్ట్ర రాజకీయాలలో ముఖ్యమంత్రిది చాలా కీలకమైన స్థానం.

భారతదేశ రాష్ట్రాలలో అక్షర క్రమంలో ఆంధ్రప్రదేశ్ మొట్ట మొదటిది. మన దేశంలో రాష్ట్రాల పునర్విభజనకు, భాషా రాష్ట్రాల వాదనకు తెలుగు వారే పునాదులు వేశారు. రాజకీయ సుస్థిరతలో కూడా మనదే అగ్ర తాంబూలం. చారిత్రక కారణాల వల్ల వేర్వేరు రాజకీయ వ్యవస్థలుగా వ్యవస్థీకృతమైన తెలుగువారు రాజకీయ ఉద్యమాల వల్లనూ, పొట్టి శ్రీరాములు ఆత్మాహుతివల్లనూ, నాయకుల మధ్య అవగాహన ఫలితంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సమైక్యమయ్యారు. రెండు సార్లు రాష్ట్ర విచ్ఛిత్తికి ఉద్యమాలు చెలరేగాయి. రాష్ట్రాధినేతను ఈ ఉద్యమాలు ప్రశ్నించాయి కూడా. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రూపొందించిన రాజకీయ వ్యవస్థను అవగాహన చేసుకొనే ప్రయత్నం చేద్దాం.

## 10.2 స్వాతంత్ర్యానికి పూర్వపు రాజకీయ వ్యవస్థ

భిన్నత్వాలకు నిలయమైన భారతదేశం చరిత్రలో రాజకీయంగా ఒకే పాలకుని కింద లేదు. కేంద్రీకృత పాలనా వ్యవస్థ స్థాపనకు మొఘలు చక్రవర్తులు ప్రయత్నించారు. వారు తమ ఏలుబడి ప్రాంతాన్ని భాగాలుగా చేసి సుబేదార్లను నియమించి పాలించారు. మొఘులుల నుండి రాజకీయాధికారం పొందిన బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ కూడా మొఘలు చక్రవర్తుల సంప్రదాయాన్నే ఆదిలో అనుసరించింది. కంపెనీ మొదటగా తన పాలన క్రిందకు వచ్చిన మద్రాసు, కలకత్తా, బొంబాయి ప్రాంతాలను విడి విడిగా ఒక ప్రెసిడెంట్ అధ్యక్షతన గల కౌన్సిల్ పాలన క్రిందకు తెచ్చారు. అందువల్లనే వీటిని ప్రెసిడెన్సీలని వ్యవహరించేవారు. ఈ ప్రెసిడెంట్‌లే తరువాత కాలంలో గవర్నర్లు అయ్యారు. ఈ మూడు ప్రెసిడెన్సీల గవర్నర్లను లండన్‌లోని బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ డైరక్టర్ల బోర్డు నియమించేది. ఆరంభంలో బ్రిటీష్ వారు ఎలాంటి కేంద్ర ప్రభుత్వ వ్యవస్థను ఏర్పరచలేదు. మూడు ప్రెసిడెన్సీల గవర్నరులు ఎవరికి వారే స్వతంత్రంగా వ్యవహరించేవారు. వీరి మధ్య సమన్వయం చేయటానికి ఎలాంటి వ్యవస్థా రూపొందలేదు. పాలనా వ్యవహారాల సమన్వయానికి రెగ్యులేటింగ్ చట్టం ద్వారా కలకత్తా గవర్నరును, గవర్నర్ జనరల్‌గా నిర్దేశించారు. ఈ విధంగా దేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భావన రూపొందింది. కంపెనీ పాలన విస్తరించిన కొద్దీ కొత్త పాలిత ప్రాంతాలు రాష్ట్రాలుగా రూపొందాయి. స్వదేశీ రాజులపై విజయం సాధించి కంపెనీ ఏర్పాటు చేసిన ప్రాంతాలే రాష్ట్రాలు. అవి యాధృచ్ఛికంగా ఏర్పాటయ్యాయి. వాటికి హేతుబద్ధమైన ప్రాతిపదిక ఏదీ లేదు. కంపెనీకి లాభాలు రావటమే రాష్ట్రాల ఏర్పాటుకు ప్రధాన కారణం. 1851 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంతో బ్రిటీష్ వారి వ్యాప్తి నిలిచిపోయింది. పర్యవసానంలో స్వదేశీ సంస్థానాల స్వతంత్రతను కాపాడుతామని, వాటి ప్రాదేశిక సమగ్రతను భంగం చేయమని బ్రిటీష్ ప్రభుత్వం వాగ్దానం చేసింది. ఫలితంగా మన దేశంలో 600కు పైగా చిన్న పెద్ద స్వదేశీ సంస్థానాలు బ్రిటీష్ ఆధిపత్యానికి లొంగిన "స్వతంత్ర రాజ్యాలు"గా మిగిలిపోయాయి. ఇలా మిగిలిపోయిన స్వదేశీ సంస్థానాల రక్షణ, విదేశీ వ్యవహారాలు, రవాణా సౌకర్యాల నిమిత్తం బ్రిటీష్ ప్రభుత్వం ప్రత్యేక సంబంధాలను ఏర్పాటు

BRAOU

చేసింది. ఈ ప్రత్యేక సంబంధాల్ని కలిపి బ్రిటీష్ సర్వోన్నతాధికారంగా (British Paramountacy Power) వ్యవహరించేవారు.

1858 నుండి దేశానికి స్వాతంత్ర్యం వచ్చే వరకు బ్రిటీష్ వారి ప్రత్యక్ష పాలిత ప్రాంతాలు, స్వదేశీ సంస్థానాలు దేశంలో ఉండేవి. బ్రిటీష్ వారి ప్రత్యక్ష పాలనా ప్రాంతాలలో ఒకే విధమైన ప్రభుత్వ వ్యవస్థ ఉండేది. స్వదేశీ సంస్థానాలలో పరిపాలనా వ్యవస్థలు ఒకే విధంగా లేవు. వాటి అభివృద్ధి సరళి కూడా ఒకే విధంగా లేదు. చారిత్రకమైన భిన్నత్వాలకు తోడుగా పాలనా సంబంధమైన భిన్నత్వాలు కూడా చోటు చేసుకున్నాయి.

తెలుగు భాష మాట్లాడే ప్రాంతాన్ని మొదట శాతవాహనులు, కాకతీయులు పాలించారు. తరువాత విలసిల్లిన విజయనగర సామ్రాజ్య కాలంలో తెలుగు వారి వైభవం అత్యున్నత శిఖరాలను అందుకొంది. విజయనగర సామ్రాజ్యంతో పాటుగా కృష్ణానదికి ఉత్తర భాగాన ముస్లిం సామ్రాజ్యం విలసిల్లింది. విజయనగరం సామ్రాజ్య పతనానంతరం గోలకొండ కుతుబ్ షాహీల పాలన ఆరంభమైంది. కుతుబ్‌షాహీలను ఓడించి ఔరంగజేబు ఈ ప్రాంతాన్ని తన సామ్రాజ్యంలో కలుపుకున్నారు. ఔరంగజేబు మరణానంతరం మొఘలు చక్రవర్తుల సుబేదారు నిజామ్ ఉల్‌ముల్క్ ఆసఫ్‌జాహీ పాలనను నెలకొల్పారు. నేటి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలను 18వ శతాబ్దంలో ఉత్తర సర్కారులుగా వ్యవహరించేవారు. తెలుగు దేశపు తీర ప్రాంతంలో వర్తక స్థావరాలు ఏర్పరచుకోవటానికి గోల్కొండ ప్రభువులు యూరోపియనులకు అనుమతి ఇచ్చారు. ఈ ఉత్తర సర్కారు జిల్లాలే మొట్ట మొదటిగా బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ పాలనలోకి వచ్చాయి. భూమిశిస్తు వసూళ్ళకు కంపెనీ ఈ జిల్లాలలో "జమిందారీ" పద్ధతిని ప్రవేశపెట్టింది. 18వ శతాబ్దం చివరలో లార్డ్ వెల్లస్లీ ప్రవేశపెట్టిన సైన్య సహకార పద్ధతిలో నిజాం రాజు చేరి ఇంగ్లీషు సైన్యం పోషణ నిమిత్తం కడప, బళ్ళారి,కర్నూలు, అనంతపురం, జిల్లాలను ఈస్టిండియా కంపెనీకి దత్తం చేశారు. ఆనాటి నుంచి ఈ జిల్లాలను దత్త మండలాలు (Ceded Districts) గాను రాయలసీమగాను వ్యవహరించసాగారు. టిప్పు సుల్తానుతో నిజాం రాజు సహకరించాడన్న నెపంతో నెల్లూరు, చిత్తూరు జిల్లాలను కంపెనీ తన ఆధీనంలోకి తీసుకొంది. ఈ జిల్లాలో కంపెనీ జమిందారీ పద్ధతికి బదులుగా రైత్వారీ పద్ధతిని ప్రవేశపెట్టింది. తెలంగాణాకు చెందిన జిల్లాలు హైద్రాబాదు సంస్థానంలో అంతర్భాగంగా ఉండిపోయాయి. తెలంగాణాలో నిజాం రాజు జమీందారీ, జాగీర్దారీ, రైత్వారీ పద్ధతులన్నింటిని అమలు పరిచారు.

సర్కారు,రాయలసీమ జిల్లాలు మద్రాసు ప్రెసిడెన్సీలో అంతర్భాగంగా ఉండేవి. మద్రాసు రాష్ట్రం లోని తెలుగు జిల్లాలను విడదీసి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని ఈ శతాబ్దపు రెండవ దశాబ్దం నుంచి ఉద్యమం ప్రారంభమైంది. మద్రాసు రాష్ట్రాన్ని విడగొట్టడానికి జరిగిన ప్రయత్నాలలో రాయలసీమ నాయకులు మొదటి నుంచి కలసి రాలేదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే సర్కారు జిల్లాల నాయకుల ప్రాబల్యం పెరుగుతుందన్న అనుమానం వారిని పీడించింది. చివరకు 1953లో పొట్టి శ్రీరాములు ఆత్మాహుతి పర్యవసానంగా కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. 1858లో తరువాత దేశ రాజకీయ పరిస్థితులలో హైద్రాబాదు స్వతంత్ర సంస్థానంగా కొనసాగింది. సంస్థానంలో ప్రజలకు ఎలాంటి ప్రజాస్వామ్య హక్కులు ఉండేవికావు.

బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ పాలన కాలంలో రాష్ట్ర పరిపాలనకు సంబంధించిన వ్యవహారాలన్నింటిని గవర్నరు, ఆయన కౌన్సిల్ సభ్యులు కలసి నిర్వహించేవారు. రాష్ట్ర రాజధానీ నగరం మదరాసులో సెక్రటేరియట్, వివిధ పాలనా నిర్వహణ శాఖలు వ్యవస్థీకృతమై ఉండేవి. 1911-12లో మదరాసు సెక్రటేరియట్‌లో ప్రధాన కార్యదర్శితో కలసి మొత్తం ఐదుగురు ప్రభుత్వ కార్యదర్శులుండేవారు. జిల్లా కలెక్టరులు, భూమ్యాదాయ విషయాల పర్యవేక్షణకు ప్రత్యేకంగా ఒక రెవిన్యూ బోర్డు ఉండేది. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో ప్రభుత్వ కార్యదర్శుల సంఖ్య ఐదు నుండి ఎనిమిదికి పెరిగింది.

BRAOU

మొదటి ప్రపంచ యుద్ధం, ప్రభుత్వ వ్యవహారాల విస్తృతి, ప్రజాస్వామ్య వ్యవస్థల ప్రారంభం ప్రభుత్వ యంత్రాంగ విస్తృతికి దోహదం చేసాయనవచ్చు. ఈ పాలనా యంత్రాంగమే కొద్ది మార్పు చేర్పులతో 1953 దాకా కొన సాగింది.

హైద్రాబాదు సంస్థానంలో 19వ శతాబ్దపు ఆరంభంలో ప్రభుత్వ ఆదాయపు జమా ఖర్చుల వివరాలు, ప్రభుత్వం ఇచ్చే జాగీరుల నగదుల మొదలైన రికార్డులు భద్రపరిచే కార్యాలయాలు ఉండేవి. 1863లో ఒక సెక్రటేరియట్‌ను ఏర్పరచారు. నిజాం రాజు తన మంత్రులను నియమించుకొనేవారు. సంస్థాన పాలనలో రాజుకు సలహా ఇచ్చేటందుకు పరస్పరం సంప్రదించుకోవటానికి 1893లో ఒక కాబినెట్ కౌన్సిల్ ఏర్పాటైంది. 1914లో నిజాం రాజు కాబినెట్ కౌన్సిల్‌ను రద్దుచేసి పరిపాలనను స్వయంగా నిర్వహించారు. తరువాత కాలంలో సంస్థాన పాలనకు ఎనిమిది మందితో కూడిన ఒక ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఏర్పాటైంది. తరువాత మళ్లీ కాబినెట్ కౌన్సిల్‌ను పునరుద్ధరించారు. 1948 దాకా ఇలాంటి పాలన యంత్రాంగమే ప్రభుత్వ వ్యవహారాలను నిర్వహించింది. 1948లో పోలీసు చర్య జరిగిన తరువాత రాష్ట్ర సెక్రటేరియట్‌ను, ప్రభుత్వ కార్యదర్శులను వ్యవస్థీకరించడం జరిగింది. సంస్థాన పాలనలో ఎలాంటి ప్రజాస్వామ్య సంస్థలు నెలకొనలేదు.

1909 సంవత్సరపు మింటో-మార్లే సంస్కరణలు దేశంలో మొట్ట మొదటిగా గవర్నరు కౌన్సిల్‌కు ప్రజాప్రతినిధులు సభ్యులుగా ఉండే సూత్రాన్ని అంగీకరించాయి. 1919 సంవత్సరపు మాంటేగ్-చెమ్సుఫోర్డ్ చట్టం రాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిళ్ళకు కొన్ని అధికారాలను ఇచ్చింది. ఈ చట్టం రూపొందించిన ద్వంద్వ ప్రభుత్వం (Dyarchy) వల్ల రాష్ట్ర ప్రభుత్వపు కొన్ని అధికారాల విషయంలో మంత్రులు కార్యనిర్వాహక వర్గంగా శాసన మండలికి బాధ్యత వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మదరాసు రాష్ట్ర ప్రజలు వారి నాయకులు ఎన్నికలు, శాసనసభ సభ్యత్వం, శాసన సభలు పనిచేసే తీరుపట్ల కొంత అనుభవాన్ని సంపాదించుకోగల్గారు. 1919 చట్టం క్రింద జరిగిన ఎన్నికలలో కాంగ్రెసు పాల్గొనలేదు. కాంగ్రెసులోని కొంతమంది "స్వరాజ్య పార్టీ" ని ఏర్పరచుకొని ఎన్నికలలో పోటీచేసి గెలుపొందారు. 1917లో మదరాసులో ఏర్పడిన సౌత్ ఇండియా లిబరల్ ఫెడరేషన్ (దీనినే జస్టిస్ పార్టీ అంటారు) ఎన్నికలలో పోటీ చేసింది. దాని నాయకులు మంత్రి పదవులనధిష్టించారు కూడా. దీంట్లో ఎక్కువ మంది జమీందార్లు చేరటం వల్ల దీన్ని జమిందార్ల పార్టీ అని కూడా వ్యవహరించేవారు. 1935 సంస్కరణల చట్టం అమలు తరువాత జరిగిన ఎన్నికలలో కాంగ్రెసు అభ్యర్థులను నిలిపి పోటీ చేసింది. ఎన్నికలలో మెజారిటీ స్థానాలు పొందింది. రాజగోపాలాచారి ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన మంత్రి వర్గంలో రెవిన్యూ మంత్రిగా టంగుటూరి ప్రకాశం ఉండేవారు. రెండవ ప్రపంచ యుద్ధం ఆరంభంతో రాజగోపాలాచారిమంత్రి వర్గం రాజీనామా చేసింది. తిరిగి 1948 ఆరంభంలో జరిగిన ఎన్నికలలో కాంగ్రెసు పార్టీ గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పరచింది. ఈ మంత్రి వర్గం కాలంలోనే మదరాసు రాష్ట్రంలో జమిందారీల రద్దు చట్టాన్ని ఆమోదించి అమలు చేసారు. మదరాసు రాష్ట్ర ముఖ్యమంత్రి పదవికి జరిగిన పోటీలలో ముగ్గురు నాయకులు మారారు.

కొత్త రాజ్యాంగం అమలు తరువాత 1952లో ఎన్నికలు జరిగేదాకా ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర నిర్మాణం విషయంలో ఆందోళనలు జరుగుతూ వచ్చాయి. ఎన్నికలకు ముందు కాంగ్రెసు నుండి నాయకులు చీలిపోయి క్రొత్త పార్టీలను వ్యవస్థీకరించుకొన్నారు. ఎన్నికల తరువాత రాజకీయ శక్తుల పునరేకీకరణ జరిగింది. దేశానికి స్వాతంత్ర్యం రావటంతో పాటుగా తెలంగాణా ప్రాంతానికి స్వాతంత్ర్యం రాలేదు. దేశ స్వాతంత్ర్యం తరువాత 14 నెలలకు పోలీసు చర్య ద్వారా హైద్రాబాదు సంస్థానం విమోచనం చెందింది. పోలీసు చర్య వెంటనే సంస్థానంలో మిలటరీ ప్రభుత్వాన్ని భారత ప్రభుత్వం ఏర్పరచింది. మిలటరీ గవర్నర్‌గా జనరల్ చౌదరీ వ్యవహరించారు. సంస్థాన విమోచనంలో అంతర్భాగం జరిగిన పోరాటంలో కమ్యూనిస్టులు విమోచనం తరువాత కూడా తమ కార్యకలాపాలను కొనసాగించారు. కమ్యూనిస్టుల నినాదమైన "దున్నేవాడిదే భూమి" భావాన్ని అమలు పరచేందుకు తొలి చర్యగా మిలటరీ ప్రభుత్వం తెలంగాణాలో జమిందారీ జాగీర్దారీ విధానాన్ని రద్దు చేసింది. గ్రామాలు కౌలుకు తీసుకున్న రైతులు జాబితాను తయారుచేయించి వారిని రక్షిత కౌలుదార్లుగా ప్రభుత్వం ప్రకటించింది. రాజ్యాంగం రూపొందక ముందే దేశం మొత్తం మీద విప్లవాత్మకమైన భూసంస్కరణల విధానాన్ని రాష్ట్రంలోఅమలు

BRAOU

పరిచారు. దేశం గణతంత్ర రిపబ్లిక్‌గా ప్రకటించాక నామినేటెడ్ మంత్రి వర్గం ఏర్పడింది. నిజాం రాజు హైద్రాబాద్ రాష్ట్రానికి "రాజ్ ప్రముఖ్" అయ్యారు.1952 ఎన్నికలు జరిగేదాకా నామినేటెడ్ మంత్రి వర్గం రాష్ట్రంలో కొనసాగింది. ఆ మంత్రి వర్గంలో కొంత మంది కాంగ్రెసు నాయకులకు స్థానం లభించింది. మదరాసు రాష్ట్రంలో తెలుగు జిల్లాలను వేరుపరచి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర నిర్మాణం చేయాలన్న ఆందోళన చాలా రోజులుగా సాగింది. హైద్రాబాదు సంస్థానాన్ని విడగొట్టి తెలంగాణా జిల్లాలను తక్కువ మదరాసు రాష్ట్రపు తెలుగు జిల్లాలతో కలిపి క్రొత్త రాష్ట్రం ఏర్పరచాలన్న కోరిక తెలంగాణా ప్రజలలో ఎన్నడూ బహిర్గతం కాలేదు. హైద్రాబాదు సంస్థానాన్ని కర్ణాటక, మరట్వాడా జిల్లాల నాయకులు కోరారు. అందువల్ల తెలంగాణా జిల్లాలలో ఆదిలో సమైక్య తెలుగు రాష్ట్ర నిర్మాణానికి ప్రజాభిప్రాయం రూపొందలేదు.

**అభ్యాసం**

స్వాతంత్ర్యానికి పూర్వం రాజకీయ వ్యవస్థ హైద్రాబాద్ సంస్థానంలో ఎలా ఉండేది ?

## 10.3 ఆంధ్ర ప్రదేశ్ ఏర్పాటుకు పూర్వం రాజకీయ వ్యవస్థ

రెండవ ప్రపంచ యుద్ధానంతరం దేశంలో బ్రిటిష్ ఇండియా రాష్ట్రాలలో 1935 సంవత్సరపు భారత ప్రభుత్వ చట్టాన్ని అనుసరించి రాష్ట్రాల శాసన సభలకు ఎన్నికలు జరిగాయి. మద్రాసు రాష్ట్రంలో ఎన్నికలు జరిగి కాంగ్రెసు మెజారిటీని పొందింది. ఎన్నికల తరువాత ప్రకాశం పంతులు కాంగ్రెసు శాసనసభా పక్ష నాయకునిగా ఎన్నికై ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. ఈయన ముఖ్యమంత్రి పదవీ కాలంలోనే ప్రభుత్వ కార్య నిర్వాహక శాఖ నుండి న్యాయశాఖను వేరు పరచారు. ఈయన కాలంలోనే రాష్ట్రంలో ఫిర్కా అభివృద్ధి కార్య క్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. గ్రామాభ్యుదయ సాధన కోసం జిల్లాకు రెండు ఫిర్కాల చొప్పున ఈ పథకంలో చేర్చారు. ఫిర్కా అంతటినీ ఒక ఖండంగా స్వయం పోషకం చేయడానికి, సాంస్కృతిక అభ్యుదయ సాధనకు ఈ పథకాన్ని ఉద్దేశించారు. ఫిర్కా అభివృద్ధి స్కీము క్రింద ప్రతి ఫిర్కాకు ఒక ఫిర్కా డెవలప్‌మెంట్ ఉద్యోగిని నియమించారు. మంత్రి వర్గంలో మంత్రులతో పాటుగా పార్లమెంటరీ కార్యదర్శులకు స్థానం కల్పించారు. పార్లమెంటరీ కార్యదర్శులకు శాసనసభ వ్యవహారాలే గాని, ఫైళ్ళు చూసే అధికారం లేకుండేది. ప్రకాశం మంత్రి వర్గం కేవలం 11 నెలలు మాత్రమే కొనసాగింది. కాంగ్రెసు పక్షాలు అవిశ్వాస తీర్మానం ద్వారా ప్రకాశాన్ని పదవి నుంచి తొలగించాయి. ఆయన తరువాత ఓమాడూర్ రామస్వామి రెడ్డియార్ ముఖ్యమంత్రి అయ్యారు. తిరిగి 1949లో రెడ్డియార్‌కు వారసులుగా కుమార స్వామిరాజా మద్రాసు ముఖ్యమంత్రి అయి 1952 ఎన్నికల దాకా కొనసాగారు.

మొదటి సార్వత్రిక ఎన్నికలకు ముందే టంగుటూరి ప్రకాశం, ఆచార్య రంగా కాంగ్రెసును వదిలి వెళ్ళి కొత్త రాజకీయ పార్టీలను ఏర్పరచారు. 1952 ఎన్నికలలో మద్రాసు రాష్ట్రంలోని ఆంధ్ర జిల్లాలలో కాంగ్రెసు పార్టీ పరాజయం పొందింది. కాంగ్రెసు నుండి విడిపోయి క్రొత్త పార్టీలు పెట్టి పోటీ చేసిన వారు, కమ్యూనిస్టులు ఎక్కువ మంది శాసన సభ్యులను గెలిపించుకొన్నారు. ఎన్నికల పిదప కాంగ్రెసు వ్యతిరేక వర్గం "యునైటెడ్ ఫ్రంట్"గా ఏర్పడి ప్రభుత్వం ఏర్పరచ ప్రయత్నించారు. టంగుటూరి ప్రకాశం పంతులు ఈ ఫ్రంట్ నాయకులు . ప్రభుత్వం ఏర్పరచటానికి సంసిద్ధుడైన ప్రకాశాన్ని కాదని, గవర్నర్ శ్రీప్రకాశ్, రాష్ట్ర శాసన సభలోని పార్టీ లన్నింటిలోను ఎక్కువ స్థానాలు పొందిన కాంగ్రెసు పార్టీ నాయకుని ఆహ్వానించారు. కాంగ్రెసు శాసనసభ పక్ష నాయకులుగా ఎన్నికైన రాజగోపాలాచారి మద్రాసు ముఖ్యమంత్రి అయ్యారు. ముఖ్యమంత్రి కాగానే రాష్ట్రంలోని చిన్న చిన్న పార్టీలను సమీకరించటం ద్వారా రాజాజీ కాంగ్రెసుకు మెజారిటీ మద్దతును సమకూర్చారు. ఎన్నికల్లో ఆంధ్ర జిల్లాలో కాంగ్రెసు ఘోరంగా పరాజయం పొందింది. కమ్యూనిస్టులు ఎక్కువ సంఖ్యలో ఎన్నికయ్యారు.

ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర నిర్మాణం ఒక ప్రధాన సమస్య అయింది. మద్రాసు నగరం విషయంలో ఆంధ్ర ప్రాంత నాయకులలో విభేదాలు తల ఎత్తాయి. కాంగ్రెసు న్నాయకుల మధ్య విభేదాల వల్ల కమ్యూనిస్టులు సత్వర ఆంధ్ర రాష్ట్ర నిర్మాణ సమస్యను తమ ప్రధాన విషయంగా ఎంచుకున్నారు. గాంధీజీ అనుచరుడు పొట్టి శ్రీరాములు అక్టోబరు 19, 1932న మద్రాసు నగరంలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రనిర్మాణాన్ని కోరుతూ ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. ఆయన దీక్ష 50 రోజులు కొనసాగాక అందరూ ఆమోదిస్తే మద్రాసు నగరం లేకుండా ఆంధ్ర రాష్ట్ర నిర్మాణం సాధ్యమవుతుందని ప్రధాని నెహ్రూ ప్రకటించారు. అందుకు పొట్టి శ్రీరాములు అంగీకరించక తన దీక్షను కొనసాగిస్తూ డిసెంబరు, 15న మరణించారు. ఆయన మరణంతో ఆంధ్ర ప్రాంత ప్రజల ఉద్రేకాలకు అడ్డుకట్ట లేకుండా పోయింది. పర్యవసానంలో మద్రాసు నగరం మినహా నిర్వివాదమైన తెలుగు జిల్లాలతో కలిపి ఆంధ్ర రాష్ట్రం ఏర్పరుస్తామని ప్రధాని నెహ్రూ ప్రకటించారు. పాలన, ఆర్థిక వ్యవహారాలను పరిశీలించి పంపిణీకి సిఫారసులు చేయటానికి జస్టిస్ కైలాస్‌నాథ్ వాంఛూను భారత ప్రభుత్వం ప్రత్యేకాధికారిగా నియమించింది. ఆయన సమర్పించిన నివేదిక ఆధారంగా 1953 మార్చి 23న ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటును ప్రధాని ప్రకటించారు. రాష్ట్ర నిర్మాణం విషయం తేలటంతో రాయలసీమకు చెందిన వారు రాష్ట్ర రాజధాని విషయంలో "శ్రీబాగ్" ఒప్పందాన్ని పాటించాలని పట్టుబట్టారు. ఆంధ్ర రాష్ట్ర రాజధానిని నిర్ణయించటానికి మద్రాసు శాసనసభలోని ఆంధ్ర జిల్లాల శాసనసభ్యులు టంగుటూరి ప్రకాశం అధ్యక్షతన సమావేశమై కర్నూలు రాజధానిగా చేయ నిర్ణయించారు. అక్టోబరు 1, 1953 ఆంధ్ర రాష్ట్రాన్ని కర్నూలులో ప్రధాని నెహ్రూ లాంఛనంగా ప్రారంభోత్సవం చేశారు.

కొత్త రాష్ట్ర శాసనసభలో కాంగ్రెసుకు మెజారిటీ లేదు. కాంగ్రెసు పక్షనాయకుడుగా నీలం సంజీవరెడ్డి ఎన్నికయ్యారు. కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పరచటం ఇష్టం లేకపోయిన కాంగ్రెసు నుండి విడిపోయిన కొత్త పార్టీలు చేరి గెలిచిన ప్రకాశం కాంగ్రెసు సహసభ్యుడుగా చేరి మొదట ముఖ్యమంత్రి అయ్యారు. నీలం సంజీవరెడ్డి ఉపముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. కొత్త రాష్ట్రపు హైకోర్టు మద్రాసు హైకోర్టుగా ఉండి జూలై 5, 1954న గుంటూరులో ఆంధ్రరాష్ట్ర హైకోర్టు ప్రారంభమైంది. 1954 అక్టోబరు చివరలో ప్రకాశం మంత్రి వర్గంపై శాసనసభలో విశ్వాస రాహిత్య తీర్మానాలు చర్చకు వచ్చాయి. మద్య నిషేధం అమలు గురించి శొంఠి రామమూర్తి కమిటీ ఒక నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఆ కమిటీ సిఫారసుల అమలు విషయం రాజకీయ సమస్య అయ్యింది. ఒక్క ఓటు తేడాతో ప్రభుత్వం ఓడిపోయింది. ప్రకాశం మంత్రి వర్గం రాజీనామా (6-11-54) చేసింది. పర్యవసానంలో రాష్ట్ర శాసనసభను రద్దు చేసి రాష్ట్రపతి పాలన ప్రవేశపెట్టారు. రాష్ట్ర శాసనసబ కు జరిగిన మధ్యంతర ఎన్నికలలో కమ్యూనిస్టులను గెలవనీయకుండా చేసే లక్ష్యంతో కాంగ్రెసు ప్రజాపార్టీ, కృషిక్‌లోక్‌పార్టీల సహకారాన్నిఆర్థించింది. కాంగ్రెసు, ప్రజాపార్టీ, కృషిక్ లోక్ పార్టీలు కలిసి యునైటెడ్ కాంగ్రెసు లెజిస్లేచర్ పార్టీగా ఏకమయ్యాయి. ఎన్నికలలో అఖండ విజయం పొందింది. ఎన్నికల పిదప బెజవాడ గోపాల్‌రెడ్డి ఆంధ్ర రాష్ట్ర

BRAOU

ముఖ్యమంత్రి అయ్యారు. తిరిగి నీలం సంజీవరెడ్డి ఉపముఖ్యమంత్రి అయ్యారు.

భారత ప్రభుత్వ పోలీసు చర్య హైద్రాబాదు సంస్థానాన్ని విమోచనం చేసింది. పోలీసు చర్య పరిసమాప్తిలో సంస్థానంలో శాంతి భద్రతలు నెలకొల్పి మిలిటరీ గవర్నరును భారత ప్రభుత్వం నియమించింది. సెప్టెంబరు 17, 1948 నుండి డిసెంబరు, 1949 దాకా సైనిక పాలన కొనసాగింది. 1950 ఆరంభంలో సీనియర్ సివిల్ సర్వీసు ఉద్యోగి ఎం.కె. వెల్లోడి ముఖ్యమంత్రిగా పౌర ప్రభుత్వం ఏర్పాటైంది. భారత రిపబ్లిక్ అవతరణలో హైద్రాబాదు సంస్థానం "బి" తరగతి రాష్ట్రంగా అవతరించింది. నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్‌ను భారత ప్రభుత్వం రాష్ట్ర "రాజ్ ప్రముఖ్"గా నియమించింది. 1952 ఎన్నికలలో కాంగ్రెసుకు మెజారిటీ లభించి బూర్గుల రామకృష్ణారావు రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దాకా ఇదే మంత్రి వర్గం అధికారంలో కొనసాగింది.

## 10.4 రాష్ట్ర రాజకీయ వ్యవస్థ

భారత రాజ్యాంగం కేంద్రం లోను, రాష్ట్రాలలోను ఒకే విధమైన రాజకీయ వ్యవస్థలను రూపొందించటమే కాకుండా, దేశంలోని రాష్ట్రాలన్నింటికి ఒకే విధమైన వ్యవస్థను నిర్దేశించింది. ప్రతి రాష్ట్రంలోను భారత రాష్ట్రపతిచే నియమితుడైన గవర్నరుకు కార్యనిర్వహణాధికారాలున్నాయి. ఆయనకు సలహాలిచ్చి సహాయమందించటానికి ముఖ్యమంత్రి నాయకుడుగా ఒక మంత్రి వర్గం ఉంటుంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్నుకొన్న శాసనసభ వర్గానికి కార్యనిర్వాహక వర్గం బాధ్యత వహిస్తుంది. ప్రతి రాష్ట్రానికి ఒక శాసన వర్గం ఉంటుంది. 1956లో రాష్ట్రావతరణతో రాష్ట్ర శాసనసభ రూపొందింది. శాసనసభ కాలం పరిమితి ఐదేండ్లుగా రాజ్యాంగం నిర్దేశించింది. ఈ కాలపరిమితిని 42వ భారత రాజ్యాంగ సవరణ చట్టం ఆరేండ్లకు పొడిగించింది. తిరిగి జనతా ప్రభుత్వం దేశ రాష్ట్రాల శాసనసభల కాలపరిమితిని ఐదేండ్లకు తగ్గించింది. 1955లో మధ్యంతర ఎన్నికలు జరిగి ఆంధ్ర రాష్ట్ర శాసనసభ ఏర్పాటైంది. ఆ శాసనసభ 1956లో తెలంగాణా ప్రాంతపు శాసనసభ్యులను కలుపుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభగా రూపాంతరం చెందింది. తెలంగాణా ప్రాంతపు శాసనసభ్యులు 1952 సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికయ్యారు. 1957లో సార్వత్రిక ఎన్నికలు జరిగినప్పుడు ఒక్క తెలంగాణా ప్రాంతంలోనే శాసనసభ్యుల ఎన్నిక జరిగింది. ఆంధ్ర ప్రాంతపు సభ్యులు 1955లోనే ఎన్నికయినందున వారు శాసనసభ్యులుగా కొనసాగారు. అంతేగాక ఆంధ్ర ప్రాంతంనుండి ఎన్నికైన శాసనసభ్యుల పదవీకాలాన్ని 1962 సార్వత్రిక ఎన్నికల దాకా పొడిగించారు. ఇందు వల్ల 1957లో ఆంధ్ర జిల్లాలలో శాసనసభకు ఎన్నికలు జరగలేదు. మొత్తం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో రాష్ట్ర శాసనసభకు తొలి ఎన్నికలు 1962లోనే జరిగాయి. 1985లో ముఖ్యమంత్రి సలహా మేరకు రాష్ట్ర గవర్నరు శాసనసభ పదవీకాలం ముగియక ముందే రద్దు చేసారు. తిరిగి ఎన్నికలు జరిగాయి. 1972లో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం సందర్భంలో రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనను ప్రవేశపెట్టారు. కాని శాసనసభను రద్దు చేయలేదు. రాష్ట్రపతి పాలన కాలంలో రాష్ట్ర శాసనసభ సమావేశాలను నిర్వహించలేదు. డా॥ మర్రి చెన్నారెడ్డి మొదటి తడవ ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో కాంగ్రెసు పార్టీలో నెలకొని ఉన్న అసమ్మతి, ముఠా రాజకీయాల వల్ల రాష్ట్ర శాసనసభ సమావేశాలను ఏర్పాటు చేయటంలో ముఖ్యమంత్రి జాప్యంచేశారు. చివరకు రాజ్యాంగ పరిమితి అయిన శాసనసభ రెండు సమావేశాల మధ్య కాలం ఆరు నెలలకు మించరాదన్న నిబంధనను పాటించటం కోసం ముఖ్యమంత్రి సమావేశాలను ఏర్పాటు చేశారు. ఈ ఆలస్యం విమర్శకులను బాగా ఆకట్టుకుంది.

### 10.4.1 గవర్నరు

భారత రాజ్యాంగం గవర్నరు పదవిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య ప్రధానమైన అనుసంధాన కర్తగా రూపకల్పన చేసింది. గవర్నరు రాష్ట్రంలో నియమితుడైన కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి. గవర్నరు కేంద్రప్రభుత్వ ప్రతినిధిగాను, రాష్ట్ర ప్రభుత్వ

BRAOU

రాజ్యాంగాధి నేతగాను రెండు రకాలైన పాత్రలను నిర్వహించాల్సి ఉంది. గవర్నరు నియామకంలో రాష్ట్ర ముఖ్యమంత్రిని సంప్రదించాలన్న సాంప్రదాయం మంచిదేనని పలువురు వక్కాణించారు. కాని ఇప్పటి వరకు జరిగిన రాష్ట్ర గవర్నర్ల నియామకాలలో చాలా అరుదుగా ఈ సాంప్రదాయాన్ని పాటిస్తున్నారు. ఫలితంగా గవర్నరు పదవి నియామకం వివాదాస్పదంగా మారుతోంది. గవర్నర్లుగా నియమితులయ్యే వారు ఆ రాష్ట్రానికి చెందినవారై ఉండకూడదన్న సాంప్రదాయాన్ని కూడా బాగా పాటిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ పాలన అంతా గవర్నరు పేరు మీదగానే నిర్వహిస్తుంటారు. రాజ్యాంగాధినేతగా అధికారాల నిర్వహణలో గవర్నరుకు అవసరమైన హోదా, సాంప్రదాయాలు రూపొందాయి. పరిపక్వత, అనుభవాల దృష్ట్యా మంత్రి మండలికి స్నేహితుని లాగా తగిన సలహాలిచ్చేటట్లుగా గవర్నరు పదవి స్వరూపాన్ని సంతరించుకొంది. బ్రిటీష్ రచయిత బేజ్‌హాట్ మాటల్లో "రాజ్యాంగాధినేతగా గవర్నరుకు సమాచారం తెలుసుకొనే, సలహా ఇచ్చే, హెచ్చరిక చేసే" మూడు విధాలైన సాంప్రదాయక అధికారాలున్నాయి సాధారణ విధులలో అంతర్భాగంగానే గవర్నరు రాష్ట్రంలోని పరిస్థితులను కేంద్ర ప్రభుత్వానికి తెలియ చెప్పాల్సి ఉంది. గవర్నరుకు కొన్ని విచక్షణాత్మక అధికారాలున్నాయి. రాష్ట్ర అవతరణ నాటి నుండి నేటి వరకు ఒక్క 1984లో తప్ప గవర్నరు పదవి విషయంలో వివాదం ఏర్పడలేదు. 1984లో గవర్నరుగా ఉన్న రాంలాల్ ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావును బర్తరఫ్ చేసి క్రొత్త ముఖ్యమంత్రిని నియమించటం వివాదాస్పదమై యావద్భారత దృష్టిని ఆకర్షించింది.

### 10.4.2 ముఖ్యమంత్రి

రాష్ట్ర పరిపాలనా వ్యవస్థలో ముఖ్యమంత్రి ప్రధాన సూత్రధారి. దేశానికి ప్రధాన మంత్రి నాయకుడైనట్లే,రాష్ట్రానికి ముఖ్యమంత్రి నాయకుడు. భారత రాజ్యాంగం అమలుకు పూర్వం మద్రాసు రాష్ట్రంలో ముఖ్యమంత్రిని ప్రధాన మంత్రి (Prime Minister) అని పిలిచేవారు. అలాగే 1948కి పూర్వం హైద్రాబాదు సంస్థానంలో కూడా ప్రధానమంత్రి అని పిలిచేవారు. ముఖ్యమంత్రి పదవి రాష్ట్ర రాజకీయాలలో చాలా కీలకమైన స్థానం. సమస్త పరిపాలనా యంత్రాంగం, రాజకీయాలు ముఖ్యమంత్రి పదవిని కేంద్రంగా చేశాయి. ఆయన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంధాన కర్తగా వ్యవహరిస్తుంటారు. గవర్నరుకు సలహా లిచ్చి పాలనలో సహాయ మందించటానికి రాష్ట్ర శాసనసభకు బాధ్యత వహించే మంత్రి వర్గం ఉంటుంది. ముఖ్యమంత్రి మంత్రి వర్గ నాయకుడు. అధ్యక్షుడు. రాష్ట్ర గవర్నరు ముఖ్యమంత్రిని నియమిస్తాడు. ముఖ్యమంత్రి సలహా మేరకు గవర్నరు మంత్రివర్గ సభ్యులను నియమిస్తారు. ముఖ్యమంత్రి నియామకం గాని మంత్రి వర్గ సభ్యుల నియామకంగాని, భావించినంత సులభమైన విషయంకాదు. వివిధ రాజకీయ పార్టీలు, వివిధ సందర్భాలలోఅనుసరించిన సాంప్రదాయాలు, రాజ్యాంగ సంబంధమైన ముఖ్యమంత్రి నియామక పద్ధతిని మార్చి వేశాయి. ముఖ్యమంత్రిగా నియమించదగిన వ్యక్తికి ఎలాంటి అర్హతలు ఉండాలన్న విషయాన్ని రాజ్యాంగం పేర్కొనలేదు. శాసన సభ్యుడు కాదగిన అర్హతలు గల ఏ వ్యక్తినైనా గవర్నరు ముఖ్యమంత్రిగా నియమించవచ్చు. వాస్తవంలో రాష్ట్రశాసనసభ విశ్వాసం పొందగల వ్యక్తి ముఖ్యమంత్రిగా నియమితుడౌతాడు. ముఖ్యమంత్రిగా నియమితుడయ్యే వ్యక్తి తప్పని సరిగా శాసనసభ సభ్యుడై ఉండాలన్న నియమంలేదు. ముఖ్యమంత్రిగా గాని, మంత్రిగాగాని, నియమితుడైన వ్యక్తి శాసనసభ సభ్యత్వం లేకుండా ఆరునెలలకు మించి కొనసాగరాదు. అంటే ముఖ్యమంత్రి, మంత్రులు తప్పనిసరిగా శాసనసభ సభ్యులై ఉండాలి. అలా సభ్యత్వం పొందని వారైతే పదవిని వదులుకోవాలి. 1980లో రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన టి. అంజయ్య రాజ్యసభ సభ్యులు. ముఖ్యమంత్రికాగానే రాజ్యసభ సభ్యత్వం వదులు కొన్నారు. రామాయంపేట శాసనసభ నియోజకవర్గం నుండి రాష్ట్రశాసన సభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండు సభలుగా రాష్ట్రశాసన సభ వ్యవస్థీకృతమై ఉన్నప్పుడు సాధారణంగా దిగువ సభకు చెందిన వారే ముఖ్యమంత్రి అవుతారు. కాని అలాదిగువ సభకు చెందిన వారే ముఖ్యమంత్రికావాలన్న నిబంధన ఏదీలేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రముఖ్యమంత్రులలో భవనం వెంకట్రాం ఎగువసభ సభ్యులు. శాసనసభలో రాజకీయ పార్టీకి నిర్దిష్టమైన మెజారిటీ ఉన్నప్పుడు, ఆ పార్టీనాయకుని ముఖ్యమంత్రిగా నియమించటం మినహా గవర్నరుకు వేరే విచక్షణాధికారం ఏదీ లేదు. మెజారిటీ విషయంలో అనుమానం ఉన్నప్పుడు మాత్రమే గవర్నరు తన విచక్షణాధికారాన్ని ఉపయోగిస్తారు.

BRAOU

1984లో రాష్ట్రంలో అధికారం చేపట్టిన తెలుగు దేశం పార్టీ రెండుగా చీలింది. చీలిపోయినవారు నాదెండ్ల భాస్కరరావును నాయకునిగా ఎన్నుకొని తమకే మెజారిటీ శాసన సభ్యుల మద్దతు ఉందని ముఖ్యమంత్రి పదవిని కోరారు. గవర్నరు ఇరుపక్షాల బలాబలాల నిరూపణకు శాసనసభ సమావేశం ఏర్పాటు చేయక, తన విచక్షణాధికారాన్ని ఉపయోగించి నాదెండ్ల భాస్కరరావును రాష్ట్రముఖ్యమంత్రిగా చేశారు. తనబలాన్ని నిరూపించుకోవటానికి నెలరోజుల వ్యవధి ఇచ్చారు. రాష్ట్రరాజకీయ చరిత్రలో నెలరోజుల ముఖ్యమంత్రిగానే నాదెండ్ల భాస్కరరావు మిగిలిపోయారు. తనకు మద్దతు పలికే శాసన సభ్యుల సంఖ్యను పెంచుకోవటానికి నాదెండ్ల నానా అవస్థలుపడ్డారు. ఈ ప్రయత్నాలలో రాజకీయాలు బజారున పడ్డాయి. శాసనసభ సభ్యులు తమ మద్దతు విషయంలో నిశ్చితాభిప్రాయం వెల్లడించుకోలేకపోయినందున రాష్ట్ర రాజకీయాలు సంక్షోభంలో పడ్డాయి. నెలరోజుల వ్యవధిలో భాస్కరరావు తన మెజారిటీని నిరూపించుకోలేక పోయారు. గవర్నరు తిరిగి ఎన్.టి. రామారావునే ముఖ్యమంత్రిగా నియమించారు.

ముఖ్యమంత్రి పదవికి ఎలాంటి అర్హతలు లేకపోయినా రాజకీయ అర్హతలు అవశ్యకవిషయాలు. రాజకీయాలలో అంచెలు దాటి సమున్నత స్థానాలకు చేరుకోవటం అందరికీ సాధ్యమయ్యే విషయంకాదు. పదవులు కొందరికి వ్యక్తిత్వం ప్రసాదిస్తే, మరికొందరు తమ వ్యక్తిత్వం ద్వారా పదవులకు రూపకల్పన చేశారు. ముఖ్యమంత్రి అధికారాలపరిధి ఆ స్థానంలో ఉన్న వ్యక్తిపై ఆధారపడి ఉంటుంది. పదవి ఒకటే అయినా వ్యక్తులలోని భిన్నత్వం అధికార నిర్వహణలో, పాత్రపోషణలో కొట్టవచ్చినట్లు కన్పిస్తుంది. 1956 నుండి నేటివరకు పన్నెండు మంది ముఖ్యమంత్రులయ్యారు. ముఖ్యమంత్రులుగా ప్రతిఒక్కరూ తమవ్యక్తిత్వాల ప్రత్యేకతను ప్రదర్శించారు. ఒక్కొక్కసారి ఆయాసందర్భాలు కూడా వారి వ్యక్తిత్వాలను తీర్చిదిద్దాయి. ముఖ్యమంత్రులైన వారిలోఒక్క అంజయ్య తప్పమిగతా వారందరూ గ్రామీణ ప్రాంతాలు, వ్యవసాయ వర్గానికి చెందినవారు. ఒక్క దామోదరం సంజీవయ్య తప్పమిగతా ముఖ్యమంత్రులందరూ ప్రధాన కులాలకు చెందినవారే. సంజీవయ్య హరిజనుడు, అతిచిన్న వయస్సులోనే ముఖ్యమంత్రి అయ్యారు. ముఖ్యమంత్రిపదవిని నిర్వహించిన వారందరూ ఒకే రకమైన వ్యవహారసరళిని ప్రదర్శించలేదు. ఒక్కొక్కరు, ఒక్కొక్కరకమైన ముద్రను వేయగల్గారు. ఆయామంత్రుల పరిపాలన, వారివారి వ్యక్తిగత గుణగణాలతోపాటు, ఆయాసందర్భాల అవశ్యకతలకు అనుకూలంగా సాగింది. ఒకముఖ్యమంత్రి పదవి నుండి తొలగి పోయిన దశాబ్దానికి తిరిగి ముఖ్యమంత్రి కాగల్గారు. పదవీవిరమణ చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రముఖ్య మంత్రులందరి స్థానాలు రాజకీయాలలో భద్రంగా ఉన్నాయి. కొందరు ఉన్నత పదవులధిష్ఠించారు. 1971-72 లలో ముఖ్యమంత్రిపదవిని చేపట్టిన పి.వి. నరసింహరావు దేశప్రధానమంత్రి అయ్యారు. ఎవరూ రాజకీయాలనుండి విరమించుకోలేదు.

BRAOU

### 10.4.3 మంత్రులు - మంత్రివర్గం

ముఖ్యమంత్రి సిఫారసు మీద గవర్నరు మంత్రి వర్గ సభ్యులను నియమిస్తారు. మంత్రి వర్గం ప్రభుత్వ యంత్రాంగాన్ని అదుపులో పెడుతూ మార్గదర్శకత్వం వహిస్తుంది. రాష్ట్ర పరిపాలనా సామర్థ్యం, నిష్పక్షపాత వైఖరి, చిత్తశుద్ధి, నాయకత్వపు వైశిష్ట్యాన్ని చాటుతాయి. మంత్రి వర్గంలో ఎవరుండాలి, ఎంతమందిఉండాలి, ఎవరెవరికి ఏయే శాఖలను అప్పజెప్పాలి అన్న విషయాలపై రాజ్యాంగంలో నిర్దేశక నియమాలేవీ లేవు. మంత్రి వర్గం అనే పదంతో పాటుగా రాజ్యాంగంలో నిర్దేశింపబడని "కాబినెట్" అనే మరో ఇంగ్లీషు పదం కూడా వాడుకలో ఉంది. మంత్రివర్గం, కాబినెట్ రెండూపర్యాయపదాలు కావు. సాధారణంగా పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కేబినెట్ ప్రభుత్వమని పిలవటం బ్రిటిష్ సంప్రదాయం. మంత్రివర్గం అనేది విస్తృత అర్థంలో అన్నిరకాలైన మంత్రులుగలదానికి అన్వయిస్తుంటారు. మంత్రివర్గంలోని వారందరూ మంత్రిమండలి/ కాబినెట్ సమావేశాలకు-హాజరై ప్రభుత్వ విధాన నిర్ణయాలలో పాల్గొనాలని లేదు. ముఖ్యమంత్రి మొదట్లోనే కొందరిని కాబినెట్ మంత్రులుగా నిర్దేశిస్తారు. మంత్రివర్గంలో కాబినెట్ మంత్రులతో పాటు, స్టేట్‌మంత్రులు, ఉపమంత్రులు, పార్లమెంటరీ కార్యదర్శులు కూడా ఉంటారు. ప్రతి మంత్రివర్గంలోనూ అన్నిరకాలైన మంత్రులు ఉండాలన్న నిర్దేశకాలులేవు. ముఖ్యమంత్రులు

వారి వారి ఆలోచనలు, అవశ్యకతలను బట్టి మంత్రి వర్గంలో ఉండేవారిని నిర్ణయిస్తారు. కాబినెట్ మంత్రులు స్వతంత్రంగా శాఖలు నిర్వహిస్తూ తమపరిధిలో నిర్ణయాలు చేస్తుంటారు. స్టేట్‌మంత్రులు కూడా స్వతంత్రంగా శాఖలు నిర్వహిస్తుంటారు. కాని ముఖ్యమంత్రి ఆహ్వానం లేకుండా కాబినెట్ సమావేశాలకు హాజరుకారు. కాబినెట్‌మంత్రుల శాఖలలో పనిచేయటానికి ఉపమంత్రులు నియమితులవుతుంటారు. సాంకేతికంగా పార్లమెంటరీ కార్యదర్శులు మంత్రివర్గ సభ్యులు కారు. వీరిది పాలనా సంబంధమైన నియామకం. శాసనసభకార్యక్రమాల్లో తమ మంత్రులకు సహాయపడుతుంటారు. కార్యనిర్వాహక వర్గ విధులలో భాగస్వాములుకారు.

ముఖ్యమంత్రి సలహాపైననే మంత్రులు నియమితులు అయినప్పటికీ, మంత్రివర్గం మొత్తం సమిష్టి బాధ్యతను కలిగి ఉంటుంది. ప్రభుత్వ విధానాలకు రూపకల్పన చేసి నిర్ణయించటం మంత్రివర్గపు ప్రధమకర్తవ్యం. మంత్రివర్గ సమావేశాలలో చర్చలు జరిగినప్పుడు భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనా, ఒకసారి నిర్ణయం తీసుకొన్నాక మంత్రులందరూ దానికి కట్టుబడి ఉండి ఏకత్వాన్ని ప్రదర్శిస్తారు. మంత్రిమండలి నిర్ణయాలతో ఏకీభవించని వారు మంత్రులుగా కొనసాగే వీలులేదు. అలాంటి వారు రాజీనామాచేసి వైదొలగాల్సివస్తుంది. లేదా ముఖ్యమంత్రి సంబంధిత మంత్రిని రాజీనామా చేయమని అడగవచ్చు. అందువల్ల ముఖ్యమంత్రిని రాజీనామా చేయమని అడగవచ్చు. కాబట్టి ముఖ్యమంత్రి మంత్రులను నియమించేటప్పుడు కాబోయే మంత్రుల గుణగణాలు, ఇష్టానిష్టాలు, విధేయతలు, ప్రభుత్వ అవసరాలు, పార్టీ అవశ్యకతలు పరిశీలించి నిర్ణయిస్తారు. మంత్రులుగా ఎంపిక చేసేటప్పుడు ఆయా వ్యక్తుల నైతిక నిష్ఠ, సామర్థ్యం, నిష్పక్షపాతం, కలిసికట్టుగా పనిచేయగల సంసిద్ధతలను ప్రధానంగా పరిగణనలోనికి తీసుకొంటారు. మంత్రివర్గంలో అన్నిప్రాంతాలకు జిల్లాలకు, కులాలకు, వర్గాలకు, అనుభవానికి సరైన నిష్పత్తిలో ప్రాతినిధ్యం కల్పించాల్సి ఉంటుంది. ముఖ్యమంత్రి వ్యక్తిగత ఇష్టానిష్టాలకు తావులేదు. తనతో ఏకీభవించరనుకొన్న వారికి స్థానం కల్పించరు. అన్ని విషయాలలో విధేయతకే అధిక ప్రాధాన్యం ఇస్తారు. మంత్రికి కేటాయించిన పాలన శాఖ ఆయన హోదాకు చిహ్నంగా ఉంటుంది. ప్రభుత్వ పాలనశాఖలలో కొన్నింటిని ప్రధానమైనవిగాను, మరికొన్నింటిని అప్రధానమైనవిగాను భావిస్తుంటారు. మంత్రివర్గ సహచరుని హోదా తగ్గించాల్సి వచ్చినప్పుడు ముఖ్యమంత్రులు శాఖల కేటాయింపును ఆయుధంగా వాడుతుంటారు. మంత్రివర్గ సభ్యుల మధ్య జరిగే పాలన శాఖల విభజనను బట్టి వివిధ రాజకీయశక్తుల సమతౌల్యాన్ని గుర్తించవచ్చు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంత్రివర్గ నిర్మాణం జరిగినప్పుడల్లా ప్రతిముఖ్యమంత్రి రాష్ట్రావతరణ సందర్భంలో జరిగిన "పెద్దమనుషుల ఒప్పందం" పాటించాల్సిన రాజకీయ అవశ్యకత ఏర్పడింది. కొత్త మంత్రివర్గం ఏర్పడినప్పుడల్లా ముఖ్యమంత్రి ఒప్పందాన్ని పాటించాడా లేదా అన్న విషయం విమర్శకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ ఒప్పందంలో ఉపముఖ్యమంత్రి పదవి, ఆంధ్ర తెలంగాణాల మధ్య నిష్పత్తి, శాఖల కేటాయింపుల ప్రస్తావన ఉంది. ఆంధ్ర తెలంగాణా మంత్రుల నిష్పత్తి 60:40గా ఉండాలి. విధిగా తెలంగాణా మంత్రులలో ఒకముస్లింకు ప్రాతినిధ్యం కల్పించాలి. శాఖల కేటాయింపులో హోం, రెవిన్యూ, ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్, వాణిజ్య, పరిశ్రమల శాఖలలో కనీసం రెండైనా తెలంగాణా మంత్రులకు కేటాయించాలి.

మంత్రివర్గం పనిచేయాల్సిన తీరును గురించి పార్లమెంటరీ ప్రజాస్వామ్య సాంప్రదాయాలనే ఆంధ్రప్రదేశ్‌లో కూడా అనుసరిస్తున్నారు. రాజ్యాంగం ద్వారా లభించిన అధికారంతో రాష్ట్రగవర్నరు ప్రభుత్వ వ్యవహారాల నియమావళిని జారీ చేస్తారు. దీన్ని రహస్యపత్రంగా పరిగణిస్తున్నారు. ఈ పత్రంలో ప్రభుత్వ వ్యవహారాలలో ఎవరెవరు ఎలాంటి నిర్ణయాలు చేయటానికి అర్హులో నిర్దేశింపబడి ఉంది. నిర్ణీత వ్యవధులలో మంత్రి వర్గం సమావేశమవుతూ ప్రభుత్వ వ్యవహారాలను చర్చించి సమీక్షించి అవసరమైన నిర్ణయాలు చేస్తుంది.

భారత దేశ రాష్ట్రాలలోని మంత్రివర్గాలలో ఉపముఖ్యమంత్రి పదవిని ఆంధ్రులే మొదట సృష్టించారు. 1953లో ఏర్పడిన ఆంధ్ర రాష్ట్రంలో ఏర్పడిన రెండు మంత్రివర్గాలలోను ఉపముఖ్యమంత్రి పదవి ఉండేది. ఆ రెండు మంత్రివర్గాలలోను

BRAOU

నీలం సంజీవరెడ్డి ఉపముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాలలో నీలం సంజీవరెడ్డి ఉపముఖ్యమంత్రిగా నిర్వహించిన కీలక పాత్రను దృష్టిలో ఉంచుకొని ఆంధ్రప్రదేశ్‌లో ఉపముఖ్యమంత్రి పదవిని "పెద్ద మనుషుల ఒప్పందం"లో చేర్చారు. ఒప్పందం ప్రకారం ముఖ్యమంత్రి ఆంధ్రప్రాంతానికి చెందిన వాడైతే ఉపముఖ్యమంత్రి పదవిని తెలంగాణా వారికి ఇవ్వాలి. అలాగే ముఖ్యమంత్రి తెలంగాణా వాడైతే ఉపముఖ్యమంత్రి పదవి ఆంధ్ర వారికి ఇవ్వాలి. ఇప్పటి వరకు కేవలం నలుగురు మాత్రమే రాష్ట్రంలో ఉపముఖ్యమంత్రులుగా వ్యవహరించారు. పాలనా సంబంధమైన ప్రాధాన్యత లేవీ ఉపముఖ్యమంత్రి పదవికి లేకపోయినా, పదవి రాజకీయమైందిగా మారిపోయింది. ఉపముఖ్యమంత్రిని విధిగా నియమించాలన్న నిబంధన ఏదీ లేదు. కాని నియమించాల్సి వచ్చినప్పుడు తప్పకుండా "పెద్దమనుషుల ఒప్పందాన్ని" పాటించాల్సిఉంది.

మనరాష్ట్రంలో మంత్రివర్గ సమావేశాలు ముఖ్యమంత్రి నిర్దేశించిన స్థలంలో, సమయంలో, ఏర్పాటవుతాయి. సాధారణంగా మంత్రివర్గ సమావేశాలన్నీ రాష్ట్ర సచివాలయంలోని మీటింగ్ హాల్‌లో జరుగుతాయి. అయితే మనం అధికారికంగా ఏర్పాటయ్యే సమావేశాలకు, ఇష్టాగోష్ఠి సమావేశాలకు మధ్య భేదాన్ని గుర్తించాల్సిఉంది. ముందుగానే నిర్ణయించిన ఎజెండాలో మంత్రి వర్గ సమావేశాలు సచివాలయంలోనే జరుగుతాయి. ఎజెండా ఏదీ లేకుండా సచివాలయంలో గాని లేక ముఖ్యమంత్రి నివాస గృహంలో జరిగే సమావేశాలను ఇష్టాగోష్ఠి సమావేశాలంటారు. పార్టీకి ప్రభుత్వానికి సంబంధించిన వివిధ విషయాలను కూలంకషంగా చర్చించటానికి వీలుగా ఇష్టాగోష్ఠి సమావేశాలు జరుపుతుంటారు. వివిధ ప్రభుత్వ శాఖల నుండి మంత్రివర్గానికి నివేదించే ప్రతి పాదనలన్నింటిని ఆయా ప్రభుత్వశాఖల కార్యదర్శులు వివరణ పత్రాలతో సహా రాష్ట్రప్రభుత్వ ప్రధానకార్యదర్శికి పంపుతారు. వాటికి సంబంధించిన ప్రభుత్వ ఫైళ్ళను కూడా ప్రధాన కార్యదర్శికి పంపుతారు. ఈ కార్యక్రమమంతా రహస్యంగా ఉంటుంది. వివిధ ప్రభుత్వ శాఖల నుండి వచ్చిన ప్రతిపాదనలను ప్రధాన కార్యదర్శి ముఖ్యమంత్రికి నివేదించి మంత్రివర్గ సమావేశపు ఎజెండాను తయారుచేస్తారు. మంత్రి వర్గ సమావేశంలో చర్చించబోయే రహస్య విషయాలకు సంబంధించిన ఎలాంటి వివరణ పత్రాలను తయారు చేయరు. మంత్రి వర్గం ఎజెండాను చర్చిస్తున్నప్పుడు అవసరమైతే ఆయా శాఖల కార్యదర్శులను పిలిపించుకొని వివరణలు కోరుతారు. వివరణలు ఇచ్చిన కార్యదర్శులు తమ పని అయిపోగానే సమావేశ స్థలం నుండి బయటికి వెళ్ళిపోతారు. మంత్రులు ఎజెండాలోని విషయాలపై చర్చలు జరిపాక ముఖ్యమంత్రి నిర్ణయాన్ని ప్రకటిస్తారు. లాంఛనప్రాయమైన ఉపన్యాసాలకు మంత్రి వర్గ సమావేశంలో స్థానంలేదు. కుటుంబ సభ్యులు కూర్చొని తమలో తాము కుటుంబవిషయాలు చర్చించుకొన్నట్లుగా మంత్రి వర్గ సమావేశాలు జరుగుతాయి. సమావేశంలో నిర్ణయాలపై ఓటింగ్ ఉండదు. మంత్రుల వ్యతిరేకవాదనలు చేస్తారేగాని ఒకసారి నిర్ణయం ప్రకటించాక అందరూ ఒకే మాట మీద నిలుస్తారు. మంత్రివర్గ సమావేశాలకు ముఖ్యమంత్రి యే అధ్యక్షత వహిస్తారు. మంత్రులందరూ సమావేశ సమయాన్ని పాటిస్తారు. మంత్రివర్గసమావేశాలకు హాజరుకాకపోవటాన్ని క్రమశిక్షణారాహిత్యంగా భావిస్తారు. మంత్రివర్గ సమావేశ నిర్ణయాలను ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రికార్డుచేస్తారు. కేవలం మంత్రి వర్గ నిర్ణయాలు తప్ప మరేవి రాతపూర్వకంగా ఉంచరు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంత్రివర్గ సమావేశాలలో మంత్రులు చాలా వరకు ఇంగ్లీషు మాటలు కలిసిన తెలుగు భాషను ఉపయోగిస్తారు. అజెండాలోని విషయాలు పూర్తి కాగానే ముఖ్యమంత్రి సెలవుతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బయటికి వెళ్ళి పోతారు. మంత్రులందరూ ఒకచోట సమావేశం కావడాన్ని ఈ సమయంలో పార్టీ వ్యవహారాల చర్చకు వినియోగిస్తుంటారు. మంత్రివర్గ సమావేశపు నిర్ణయాలను ప్రధానకార్యదర్శి అధికారికంగా ప్రభుత్వశాఖలకు తెలియబరుస్తాడు. నిర్ణయాల అమలు చర్యలు వెంటనే ప్రారంభమవుతాయి.

### 10.4.4. సచివాలయం

రాష్ట్రప్రభుత్వ యంత్రాంగంలో ముఖ్యమంత్రి ఆయన మంత్రివర్గ సహచరులను రాజకీయ భాగంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ వ్యవహారాల నిర్వహణలో వారికితోడ్పడేటందుకు అమిత సంఖ్యలో గల వివిధస్థాయిల ప్రభుత్వ ఉద్యోగులను

BRAOU

కార్యనిర్వాహక వర్గంగా పిలుస్తున్నారు. ఇవి రెండూ ప్రభుత్వ యంత్రాంగంలో అంతర్భాగాలే. ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం చేపట్టే వివిధ చర్యలలో రెండు విభాగాలూ భాగ స్వాములే. ఈ రెండు విభాగాల మధ్య వర్ధిల్లే సంబంధాలు భిన్నదృక్కోణాల సమస్యలకు ప్రధాన కారణాలవుతాయి. వీరిమధ్యగల సత్సంబంధాలు ప్రభుత్వ కార్యక్రమాల విజయాలకు సోపానాలు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయం అనేక పాలనా విభాగాలుగా వ్యవస్థీకృతమై ఉంది. వీటిని ప్రభుత్వ శాఖలుగా వ్యవహరిస్తున్నారు. ప్రతిశాఖకు ఒక కార్యదర్శి అధిపతిగా ఉంటారు. శాఖ నిర్వహణలో కార్యదర్శికి అదనపు కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, ఉపకార్యదర్శి, సహాయకార్యదర్శి తమ సహాయ సహకారాలందిస్తుంటారు. వివిధ పాలన శాఖల కార్యదర్శులందరూ సాధారణంగా అఖిల భారత సర్వీసులకు చెందిన ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసుకు చెందినవారై ఉంటారు. వీరిని ప్రభుత్వ కార్యదర్శులు అంటారు. ఒకవిధంగా రాష్ట్ర సచివాలయాన్ని మంత్రివర్గపు విస్తృత వ్యక్తిత్వంగా వర్ణించవచ్చు. ప్రభుత్వ విధానాల రూప కల్పనలో సచివాలయం మంత్రులకు మంత్రివర్గానికి అన్ని విధాలైన సలహాలను, సహాయ సహకారాలను అందిస్తుంది. ప్రభుత్వ విధానాల రూప కల్పనకు నిర్దిష్ట సమాచారం అవసరమవుతుంది. కనుక సచివాలయం సమాచారాన్ని సేకరించి, విశ్లేషించి, ప్రత్యామ్నాయాలను చర్చించి అవసరమైనచర్యలను మంత్రులకు మంత్రివర్గానికి సిఫారసు చేస్తుంది. వివిధ ప్రభుత్వ శాఖలకు, క్షేత్రకార్యాలయాలకు, ప్రభుత్వ విధానాలు అమలు జరపటంలో నిర్దిష్ట మార్గదర్శక సూత్రాలను రూపొందించి ఆదేశాలను జారీ చేస్తుంది. సచివాలయం రాష్ట్రప్రభుత్వ ప్రతినిధిగా వ్యవహరిస్తుంటుంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సచివాలయం అధిపతి. ఆయనకు సచివాలయంలోని ప్రభుత్వశాఖలన్నింటిపైనా పర్యవేక్షణాధికారం ఉంది. సచివాలయంలోని సాధారణ పరిపాలనాశాఖకు కూడా ఆయనే అధిపతి. ఆయన ముఖ్యమంత్రికి ప్రధాన సలహాదారుడు. మంత్రివర్గ కార్యదర్శిగా వ్యవహరిస్తుంటారు. ప్రభుత్వప్రధాన కార్యదర్శి ముఖ్యమంత్రితో ఏర్పరచుకొన్న వ్యక్తిగత సాన్నిహిత్యం, అవగాహనలపై ఆయన కార్యదక్షత ఆధారపడి ఉంటుంది. ఇటీవలి రోజుల్లో ఈ సాన్నిహిత్యం అవగాహనలు కొంత ప్రాధాన్యతను సంతరించుకొన్నమాట వాస్తవమే. రాష్ట్రముఖ్యమంత్రులు తమకు ఇష్టమైన వారినే ప్రధానకార్యదర్శులుగా నియమించుకొంటున్నారు. ముఖ్యమంత్రికి ఇష్టమైన వారిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమించే సందర్భాలలో అతని కన్నా సీనియర్లుగా వున్నవారికి ప్రధాన కార్యదర్శి హోదా కల్పించి వివిధ శాసన బద్ధకార్పొరేషన్లు, బోర్డులకు ఛైర్మనులుగా నియమించటం సాంప్రదాయమైంది.

ఇటీవలికాలంలో ముఖ్యమంత్రి కార్యాలయం రూపొందటం ఒకగణనీయమైన అంశం. కేంద్ర ప్రభుత్వంలో ప్రధాన మంత్రికార్యాలయం లాగా, రాష్ట్రంలో ముఖ్యమంత్రి కార్యాలయం రూపొందింది. ముఖ్యమంత్రి చూడవలసిన ఫైళ్ళను క్రమపద్ధతిలో ఏర్పరచటమన్న విషయమే క్రమంగా ముఖ్యమంత్రి కార్యాలయ ప్రాధాన్యత వృద్ధికి దోహదం చేసింది. ఇది ఒక విధంగా ముఖ్యమంత్రి నిర్ణయ కల్పన ప్రక్రియను ఆయన కార్యాలయం ప్రభావపరచటంగా మారుతున్నదని విమర్శకులు భావిస్తున్నారు.

**అభ్యాసం**

సచివాలయవ్యవస్థ గురించి క్లుప్తంగా రాయండి.

BRAOU

## 10.5 రాజకీయ పార్టీలు - రాజకీయాలు

ప్రజాస్వామ్య వ్యవస్థలు సమర్థవంతంగా పనిచేయటానికి రాజకీయ పార్టీలు చాలా అవశ్యకమైనవని భావిస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలలో ప్రజలు రాజకీయ భాగస్వాములు కావటంలో రాజకీయ పార్టీలు తోడ్పడుతున్నాయి. ప్రజాస్వామ్య భావనవృద్ధితో పాటుగా రాజకీయ పార్టీలు వృద్ధి చెందటం గమనించదగిన విషయం. పార్టీ అంటే ఒక లక్ష్యసాధనకు సమైక్యమయ్యే వ్యక్తుల సముదాయం. పార్టీ అన్న పదం రాజకీయ సాహిత్యంలో 17వ శతాబ్దంలోనే ప్రవేశించింది. ఒక విధంగా రాజకీయ పార్టీల అవిర్భావానికి బ్రిటన్ పుట్టిల్లు. రాజకీయ పార్టీల వృద్ధి ఒక విధంగా రాజ్యాంగేతర వృద్ధి. దేశస్వాతంత్ర్యం తరువాతనే మనదేశంలో రాజకీయ పార్టీలు రంగప్రవేశం చేశాయి. మనదేశ రాజ్యాంగంలో ఎక్కడా రాజకీయ పార్టీల ప్రస్తావన లేదు. దేశంలో ఎన్నికలు నిర్వహించడానికి రాజ్యాంగం ఒక ఎన్నికల సంఘాన్ని ఏర్పాటు చేసింది. దేశంలో ఎన్నికలు నిర్వహించటంలో తోడ్పడేటందుకు భారత పార్లమెంట్ ప్రజాప్రాతినిధ్యపు చట్టాన్ని చేసింది. ఈ చట్టంద్వారా దేశంలో రాజకీయ పార్టీలను గుర్తించే అధికారం ఎన్నికల సంఘానికి లభించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ నాటి నుంచి నేటి వరకు రాజకీయ రంగంలో చాలా రాజకీయ పార్టీలు అవతరించాయి. ప్రతి ఎన్నికలలోను ఏ రాజకీయ పార్టీకీ చెందనివారు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేయటం ఆనవాయితీ అయ్యింది.

రాష్ట్రంలోని రాజకీయ పార్టీల వ్యవస్థను సునిశితంగా పరిశీలించినప్పుడు సైద్ధాంతికంగా రెండు విభిన్న భావనలకు ప్రతీకలుగా కాంగ్రెసు, కమ్యూనిస్టు పార్టీలు మనుగడను సాగిస్తున్నాయి. ఇతర రాజకీయ పార్టీలలో సైద్ధాంతిక భిన్నత్వాలను, భావనలను మనం వెతకాల్సి వస్తుంది. రాష్ట్రంలో చీలని రాజకీయ పార్టీలేదు. ప్రతిపార్టీ చీలిపోవటమన్నది సాధారణ విషయమైంది. రాష్ట్రరాజకీయ చరిత్రలో చిన్న చిన్న పార్టీలు, ఫ్రంటులు, గ్రూపులు, ముఠాలు ఎక్కువగా లేకపోయినా, ఉన్నకొన్ని అయినా కొంతకాలం అధికారంలో గల పార్టీకి తీవ్రమైన తలనొప్పిగా పరిణమించటం గమనించదగిన విషయం. రాష్ట్రరాజధాని నగరంలోనూ, కొన్ని జిల్లాల్లోనూ ముస్లింలు ఎక్కువ సంఖ్యలో ఉన్నా రాష్ట్రంలో ముస్లిం మతరాజకీయాలకు స్థానం లభించలేదు. ముస్లిం రాజకీయాలు నగరంలోని పాత బస్తీకే పరిమితమయ్యాయి. 1956 నుండి 1983 వరకు రాష్ట్రం కాంగ్రెసుకు పెట్టని కోటగానిలిచింది. 1983 ఎన్నికలలో తిరిగి 1994 ఎన్నికలలో కాంగ్రెసును ఓడించి తెలుగు దేశం పార్టీ ప్రభుత్వాధికాన్ని చేపట్టింది. 1989-94 మధ్యకాలంలో కాంగ్రెస్ అధికారాన్ని నిర్వహించింది. గత నాలుగు దశాబ్దాలుగా మూడు పదులకు పైగా వివిధ రాజకీయ పార్టీలు రాష్ట్రంలో జరిగిన ఎన్నికలలో పాల్గొన్నాయి. ఒక్క కాంగ్రెసు, తెలుగుదేశం పార్టీలు తప్ప మిగతా పార్టీలేవి రాష్ట్ర రాజకీయ రంగంలో నిలిచి తమ ప్రభావాన్ని ప్రదర్శించలేకపోయాయి. ఆదినుండి రాష్ట్రంలో కమ్యూనిస్టులకు అంతో ఇంతో బలం ఉంది. వాటికి రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలలో స్థిరమైన ఓటర్లమద్దతు కూడా ఉంది. 1955లో ఆంధ్ర రాష్ట్ర శాసనసభకు జరిగిన మధ్యంతర ఎన్నికలలో కమ్యూనిస్టులు మెజారిటీ పొందటానికి తమ యావచ్ఛక్తిని మొహరించి విఫలులయ్యారు. 1962 సార్వత్రిక ఎన్నికలలో కమ్యూనిస్టులు గణనీయమైన శాసన సభ స్థానాలు పొందినా, ఆ తర్వాత పార్టీచీలిపోయి మళ్ళీ అలాంటి ప్రజాదరణను ఏ ఎన్నికలలోనూ పొందలేకపోయింది. 1962లో క్రొత్తగా రాజకీయ రంగ ప్రవేశం చేసిన స్వతంత్రపార్టీ 141 అసెంబ్లీస్థానాలకు పోటీచేసి 19 స్థానాలను మాత్రమే గెలుచుకోగల్గింది. 1982లో ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీ భారతరాజకీయ చరిత్రలో అపూర్వమైన విజయాన్ని సాధించింది. శాసన సభస్థానాల్లో మూడింట రెండు వంతుల మెజారిటీ పొంది రాష్ట్రంలో మొదటిసారిగా కాంగ్రెసేతర పాలనకు నాంది పలికింది. 1990 ఎన్నికలలో తిరిగి కాంగ్రెసు విజయం పొంది అయిదేండ్లు అధికారాన్ని నిర్వహించింది. 1994 డిసెంబరు ఎన్నికలలో కాంగ్రెసును ఓడించి తిరిగి తెలుగు దేశం పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పరచింది.

1956 నుండి 1983 వరకు అధికారంలో కొనసాగిన కాంగ్రెసుకు వ్యతిరేకత ప్రతిపక్షాల నుండి కాకుండా, ప్రధానంగా కాంగ్రెసులోనే ఆవిర్భవించింది. రాష్ట్రంలో జరిగిన ఆందోళనలన్ని కాంగ్రెసులోని ముఠాకలహాల ప్రతిబింబాలే. రాష్ట్ర

BRAOU

శాసనసభలో కాంగ్రెసుకు సుస్థిరమైన మెజారిటీ ఉన్న రోజుల్లో కాంగ్రెసు మంత్రివర్గాలకు స్థిరత్వం లేకుండా పోయింది. కాంగ్రెసు పార్టీ అధికారంలో ఉన్న రోజుల్లో ప్రతిముఖ్యమంత్రి కాలంలోను ముఠాతగాదాలు ఆనవాయితీ అయ్యాయి. కాంగ్రెసుపార్టీలోని వ్యక్తిగత ప్రయోజనాలసాధనకు ముఠాలు కట్టటం సాధనమైంది. సైద్ధాంతిక వివాదాలకు చోటు మృగ్యమైంది. కులం, ప్రాంతం, స్థానికం వగైరా విషయాలు ముఠా తగాదాలలో అధిక ప్రాధాన్యతను సంతరించుకొన్నాయి. ముఠాతగాదాల కారణాల వల్ల సుస్థిరంగా ఉన్న కాంగ్రెసు మంత్రి వర్గాలు ప్రజాస్వామ్యేతర పద్ధతులలో అధికార పీఠం నుండి తొలగాల్సివచ్చింది. వ్యక్తిత్వాలు, అధికారదాహం పోషకత్వం ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు పార్టీలో ముఠా రాజకీయాలు పెరగటానికి కారణాలయ్యాయి. రాష్ట్రంలో ఏర్పడ్డ ప్రతిమంత్రివర్గంపైనా ముఠా తగాదాల ప్రభావాలున్నాయి. మంత్రి వర్గీయులు, అసమ్మతివాదులు అన్నపేర్లతో స్థిర సభ్యత్వం లేని ముఠాలు కూడా ఏర్పడ్డాయి. 1983లో అధికారం చేపట్టిన తెలుగుదేశం పార్టీకి కూడా ముఠా తగాదాలు తప్పలేదు. 1984లో పార్టీ రెండుగా చీలింది. కొంతమంది మంత్రులు మంత్రివర్గం నుండి రాజీనామా చేశారు.

దేశస్వాతంత్ర్యానికి పూర్వం రాష్ట్ర కాంగ్రెసులో బ్రాహ్మణనాయకుల ఆధిక్యత అధికంగా ఉండేది. స్వాతంత్ర్యానంతరం క్రమంగా వ్యవసాయం ప్రధాన వృత్తిగా గల రెడ్డి, కమ్మ, వెలమ కులాల చేతుల్లోకి కాంగ్రెసు నాయకత్వం వచ్చింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణతో మంత్రివర్గాలలో బ్రాహ్మణేతర అగ్రకులాలవారికే అధిక పదవులు లభించాయి. ఆంధ్ర రాష్ట్రంలో 1955 మధ్యంతర ఎన్నికలలో అధికారం చేపట్టటానికి కమ్యూనిస్టులు చేసిన ప్రయత్నాలు, భూస్వామ్యవర్గాలను కలవరపెట్టి, వారిని కాంగ్రెసు వైపుకు మళ్ళించాయి. కమ్యూనిస్టుల భయం వల్ల కాంగ్రెసు వైపుమొగ్గిన భూస్వామ్య అగ్రకులాల నాయకులను అడ్డుపెట్టుకొని కాంగ్రెసు పార్టీ ఓటర్లను ఆకట్టుకోగల్గింది. రాజకీయచైతన్యం తక్కువగా గల బలహీనవర్గాలు అగ్రకులాల ప్రభావంనుండి బయటపడటానికి వీలు చిక్కలేదు. 1969లో కాంగ్రెసు చీలటం వల్ల అది అగ్రకులాల, సంపన్నుల నాయకత్వంపై ఆధారపడి కొనసాగటం కష్టమైంది. రాష్ట్రరాజకీయాలపై భూస్వామ్య అగ్రకులాల వారికున్న ప్రాధాన్యతను తగ్గించటానికి 1972 రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో ప్రయత్నాలు జరిగాయి. పర్యవసానంలో వెనుకబడినకులాల వారికి, అల్ప సంఖ్యాక వర్గాలకు ఎక్కువ శాసన సభ స్థానాలు లభించాయి. మంత్రి వర్గాలలో కూడా బలహీన వర్గాల సంఖ్య పెరగనారంభించింది. అత్యవసర పరిస్థితి కాలంలో కాంగ్రెసు నేరుగా ఓటర్లతో సంబంధాలు ఏర్పరచుకొంది. ఇందిరాగాంధీ ఆమె అనుచర ముఖ్యమంత్రులు చేసేదల్లా సంపన్న వర్గాల దోపిడీని అరికట్టి ప్రజల జీవనం మెరుగుపరచటానికన్న భావం ప్రముఖస్థానం పొందింది. కాంగ్రెసుకు ప్రజాదరణ తగ్గిందని భావించిన అగ్రకులాల నాయకులు జనతాపార్టీలో చేరటం వల్ల 1978 శాసన సభ ఎన్నికలలో సామాన్య ప్రజలంతా ఇందిరా కాంగ్రెసుకు ఓటు చేసి గెలిపించారు. రాష్ట్రంలో మొదటి సారిగా బలహీనవర్గాలలో కాంగ్రెసు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల ఫలితాలకు కలిగిన ప్రతిస్పందనే కాంగ్రెసు విజయానికి కారణమని చెప్పవచ్చు. 1983 శాసన సభ ఎన్నికలఫలితాలు ఎవ్వరి ఊహలకు అందలేదు. రాష్ట్రంలో మొదటి సారిగా కాంగ్రేసేతర ప్రభుత్వం ఏర్పడింది. 1989 లో తిరిగి కాంగ్రెసు విజయం పొందినా 1994 ఎన్నికలలో మళ్ళీ తెలుగుదేశం పార్టీనే ప్రజలు అభిమానించారు.

BRAOU

## 10.6 ముఖ్యవిషయాలను గుర్తుంచుకుందాం

* కేంద్ర రాష్ట్ర సంబంధాలలో అభిప్రాయభేదాలు ఉన్నా తాడోపేడో తేల్చుకోవాలన్నపట్టుదలగాలేవు. సడలింపులు రాజకీయ వ్యవస్థప్రధాన లక్షణమైంది. దేశంలోని మిగతా రాష్ట్రాలతో పోల్చినప్పుడు మన రాష్ట్రంలో రాజకీయ సుస్థిరత బాగానే ఉన్నట్లుగా భావించుకోవాలి. ముఠాతగాదాలు, ఉద్యమాలు, రాజకీయ పార్టీల పోటీలు రాజకీయ సుస్థిరతను కదలించలేక పోయాయి.

* రాష్ట్ర మనుగడనే సవాలు చేసిన ఉద్యమాలు కూడా తమ ప్రభావాన్ని కొనసాగనివ్వలేక పోయాయి. ఎన్నికల ద్వారా ప్రభుత్వాలను మార్చవచ్చునన్న ధోరణికి ఇటీవలి ఫలితాలు బలాన్ని ఇచ్చాయి. 1983, 1989, 1994 ఎన్నికల

ఫలితాలు రెండు పార్టీల వ్యవస్థను తలపింపచేస్తున్నాయి.

★ ప్రాంతీయ రాజకీయ పార్టీల ఆవిర్భావం రాష్ట్ర అభివృద్ధికి ఆరోగ్య ప్రదాయినికాదన్న విమర్శకు అర్థం లేకుండా పోయింది. ఇతర రాష్ట్రాలతో పాటుగా ఆంధ్రప్రదేశ్ కూడా జాతీయ అభివృద్ధిలో భాగస్వామి అవుతోంది.

## 10.7 మాదిరి పరీక్షాప్రశ్నలు

30 పంక్తులలో జవాబులు రాయండి.

1. దేశ స్వాతంత్ర్యానికి పూర్వం రాష్ట్ర రాజకీయవ్యవస్థను వివరించండి
2. రాష్ట్ర రాజకీయ వ్యవస్థను క్లుప్తంగా వివరించండి ?

15 పంక్తులలో జవాబులు రాయండి.

1. రాష్ట్ర ముఖ్యమంత్రి - ఎన్నిక, విధులు గురించి రాయండి ?
2. మంత్రివర్గ సమావేశం - నిర్వహణ, నిర్ణయాల గురించి సమీక్షించండి

BRAOU

# భాగం - 11 పరిపాలనా వ్యవస్థ (శాసన, పాలనా, న్యాయవ్యవస్థలు)

విషయ క్రమం


11.0 ఉద్దేశం

11.1 ప్రవేశిక

11.2. శాసన వ్యవస్థ

11.2.1 రాష్ట్ర ప్రభుత్వం : రాజ్యాంగ చట్టం

11.2.2 గవర్నర్

11.2.3 శాసన సభలు

అభ్యాసం

11.3 ఎన్నికలు

11.3.1 శాసనసభల ఎన్నికలు : ప్రభుత్వ మార్పులు

11.3.2 ప్రథమ సాధారణ ఎన్నికలు : 1951

11.3.3 మధ్యంతర ఎన్నికలు

11.3.4 1955 మధ్యంతర ఎన్నికలలో పార్టీల బలాబలాలు

11.3.5 1957 ఎన్నికలలో తెలంగాణాలో పార్టీల బలాబలాలు

11.3.6 1967 ఎన్నికలలో పార్టీల బలాబలాలు

11.3.7 1978 రాష్ట్ర శాసన సభా ఎన్నికలలో వివిధ పార్టీల బలాబలాలు

11.3.8 1983 రాష్ట్ర శాసన సభా ఎన్నికలు : అధికారమార్పు

11.3.9 1983 రాష్ట్ర శాసన సభల ఎన్నికల్లో వివిధ పార్టీలకు లభించిన ఓట్ల శాతం

11.3.10. 1985 రాష్ట్ర శాసనసభ

అభ్యాసం

11.4 మంత్రివర్గాలు - మార్పులు

11.4.1 శాసనసభ : మంత్రివర్గాలు

11.4.2 మంత్రివర్గం

11.5 పాలనా వ్యవస్థ

11.6 రాష్ట్ర న్యాయవ్యవస్థ

11.6.1 హైదరాబాదు సంస్థానం

11.62. ఆంధ్రప్రాంతం

11.6.3 హైకోర్టు నిర్మాణం


BRAOU

11.6.4 జిల్లా కోర్టులు

11.6.5 సంచార న్యాయస్థానాలు

11.6.6 ఇతర న్యాయ స్థానాలు

11.6.7 న్యాయ సలహాదార్లు, కౌన్సిలు

11.6.8 పేదలకు న్యాయ సలహా పథకం

11.6.9 న్యాయ పరిషత్

11.6.10 లోక్ అదాలత్

11.6.11 లోకాయుక్త - ఉపలోకాయుక్త్.

అభ్యాసాలు

11.7 ముఖ్యవిషయాలను గుర్తుంచుకుందాం

11.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

## 11.0. ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు -

* శాసన సభా నిర్మాణం, ఎన్నికలు, మంత్రి వర్గాల మార్పులు గురించి తెలుసుకో గలుగుతారు.
* పాలనా వ్యవస్థ గురించి వివరించగలుగుతారు.
* న్యాయ వ్యవస్థ స్వరూపం, విధులూ గ్రహించగలుగుతారు.

BRAOU

## 11.1 ప్రవేశిక

శాసన, పాలన, న్యాయ వ్యవస్థలకు సంబంధించిన నిర్మాణాలను విధులను పరిశీలించటం ద్వారా మనం సామాజిక వ్యవస్థ రక్షణకు, నియంత్రణకు, కొనసాగింపుకు జరుగుతున్న కార్యకలాపాలను అర్థం చేసుకోగలుగుతాం. వాటి అధికార పరిమితులను కూడా మనం గుర్తించగలుగుతాం.

## 11.2 శాసన వ్యవస్థ

రాజ్యాంగ చట్రం ద్వారా రాష్ట్ర పరిధిలో గవర్నర్ పాత్రను పరిశీలించటంతోబాటు ఇక్కడ శాసన సభల ఏర్పాటును గురించి తెలుసుకోవటం అవసరం.

### 11.2.1 రాష్ట్ర ప్రభుత్వం : రాజ్యాంగ చట్రం

రాష్ట్రాల పరిపాలనా వ్యవహారాలలో ఫెడరలిజం అనేది పాలనా దృష్ట్యా, పాలనా సౌలభ్యం దృష్ట్యా వచ్చిన ధోరణి. పాలనా సౌలభ్యం దృష్ట్యా ఏర్పాటు చేసినవే రాష్ట్రాలు. భారతదేశ ఫెడరల్ వ్యవస్థ స్వతంత్ర భారతదేశపు రాజ్యాంగ పరంగా ఏర్పడింది. భారతదేశం "రాష్ట్రాల సమాఖ్య" అని రాజ్యాంగంలో పేర్కొన్నా, భారత రాజ్యాంగ వ్యవస్థలోని కేంద్రీకృత

(యూనిటరీ) స్వభావం కూడా కొట్టి వచ్చినట్లు కనపడే అంశం. అన్ని రాష్ట్ర ప్రభుత్వాల పరిపాలనా యంత్రాంగం ఒకే రకంగా ఉండాలని రాజ్యాంగం అంటుంది.

అందువల్ల అమెరికాలో మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా భారత రాజ్యాంగమే వర్తిస్తుంది.

రాష్ట్రాలలో ప్రభుత్వ యంత్రాంగాలు, కేంద్రప్రభుత్వ యంత్రాంగం ఏర్పాటయ్యాయి. కేంద్రంలో మాదిరిగానే - కార్య నిర్వాహక వర్గం, శాసన సభలు, న్యాయ వ్యవహారాల శాఖ అనే మూడు విభాగాలుగా రాష్ట్రంలో పాలనా యంత్రాంగం ఉంటుంది.

## 11.2.2 గవర్నర్

రాష్ట్ర ప్రభుత్వ కార్య నిర్వాహక అధికారం గవర్నర్‌కు అప్పగించబడింది. గవర్నర్‌ను రాష్ట్రపతి నియమిస్తాడు. రాష్ట్రపతి ఆమోదం ఉన్నంతకాలం సాధారణంగా అయిదేండ్లు గవర్నర్ పదవిలో వుంటాడు. గవర్నర్‌గా నియమితుడవటానికి ఆ వ్యక్తి భారత పౌరుడై ఉండాలి. 35 ఏండ్లు వయస్సు నిండి, లాభసాటి పదవి, ఉద్యోగం ఏదీ చేస్తూ ఉండరాదు. పార్లమెంటు శాసన సభ సభ్యుడై ఉండనక్కరలేదు.

### అధికారాలు -కార్యకలాపాలు - పాలనలో పాత్ర

పాలనాధికారాలు రాజ్యాంగం ద్వారా ఇవ్వబడినాయి కాబట్టి ఇతడు నేరుగా గాని లేక తన కింద ఉద్యోగుల ద్వారా కాని అధికారాన్ని చలాయిస్తాడు. ముఖ్యమంత్రిని, అతని సలహాపై ఇతర మంత్రులను నియమిస్తాడు. రాష్ట్ర ప్రభుత్వ కార్యనిర్వాహక చర్యలన్ని గవర్నర్ పేరు మీదగా జరుగుతాయి. అడ్వకేట్ జనరల్‌ను నియమిస్తాడు.

శాసనపరంగా గవర్నర్‌కు గణనీయమైన అధికారాలున్నాయి. ఒక రకంగా రాష్ట్ర శాసన సంస్థలలో ఆయనొక భాగం. శాసన సభను సమావేశ పరచటం, నిరవధికంగా వాయిదా వేయటం, రద్దు చేయటం కూడా ఈయన అధికారాలే. గవర్నర్ ఆమోదం లేనిదే ఏ బిల్లూ చట్టం కాదు. కొన్ని బిల్లులకు అతను సవరణలను సూచించవచ్చు. రాజ్యాంగపరమైన సమస్యలు ఉత్పన్నమవుతాయని భావించినపుడు రాష్ట్రపతి పరిశీలనకు పంపేందుకు బిల్లును అట్టిపెట్టవచ్చు. ద్రవ్య సంబంధమైన బిల్లును తిరిగి పంపటంకాని, ఆమోదించకుండా ఉండే అధికారాలు కానీ గవర్నర్‌కు లేవు.

గవర్నర్‌కు కొన్ని శాసనపరమైన అధికారాలున్నాయి. శాసనసభ సమావేశంలో లేనపుడు ఆర్థిక ఆర్డినెన్సులు జారి చేయవచ్చు. అత్యవసర పరిస్థితులలో నిజమైన కార్యనిర్వాహక అధిపతిగా గవర్నర్ వ్యవహరిస్తాడు. రాష్ట్రపతి ప్రతినిధిగా ప్రభుత్వ పాలనా యంత్రాంగానికి సారథ్యం వహిస్తూ సివిల్ సర్వీసు సహాయంతో పరిపాలనా వ్యవహారాలను స్వయంగా పర్యవేక్షిస్తాడు.

## 11.2.3 శాసన సభలు

రాజ్యాంగం ఏక సభ శాసన సంస్థలకు, లేదా ద్విసభ శాసన సంస్థలకు అవకాశం కల్పించింది. ద్విసభ అయినట్లయితే మొదటి సభను శాసన సభ అని, రెండవ దానిని శాసన మండలి అని అంటారు. ఆంగ్లో-ఇండియన్ కమ్యూనిటీ ప్రతినిధులు మినహా శాసన సభలో రాజ్యాంగం ప్రకారం సభ్యులంతా ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకొన్నవారే. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో రాజ్యాంగ ప్రకారం 275 సీట్లు ఉన్నాయి. రాష్ట్ర శాసనమండలిని 1985 జూన్ 1వ తారీఖున తెలుగుదేశం ప్రభుత్వం రద్దు చేయటం జరిగింది.

BRAOU

సాధారణంగా శాసనసభ పదవీకాలం అయిదేండ్లు. కాని అవసరం అనుకుంటే గవర్నర్ ఈ గడువు లోగానే సభలు రద్దు చేయవచ్చు. అత్యవసర పరిస్థితిలో గడువును పార్లమెంటు ఒక సంవత్సరం పొడిగించవచ్చు. అయితే ఒకసారి వ్యవధి మించి పొడిగించరాదు. అత్యవసర పరిస్థితి అయిపోయిన పిమ్మట గడువు పొడిగింపు ఆరుమాసాలు మించి ఉండదు.

శాసన సభలో పోటీ చేసే అభ్యర్థికి 25 సంవత్సరాలుండాలి. శాసన సభ్యుల హక్కులు, అధికారాలు, శాసనసభ కమిటీల హక్కులు వగైరా విషయంలో పార్లమెంటుకు శాసన సభలకు తేడా లేదు. సభ్యుల వేతనాలను, అలవెన్సులను శాసనసభ నిర్ణయిస్తుంది. శాసన సభ్యులు రాజ్యాంగ బద్ధులై ప్రజల అభివృద్ధి కోసం కృషి చేయవలసి ఉంటుంది.

**అభ్యాసం**

గవర్నర్ అధికారాలేమిటి ?

## 11.3. ఎన్నికలు

ఇప్పుడిక శాసన సభ ఎన్నికలను పరిశీలిద్దాం. ఎన్నికలు ప్రారంభమైనప్పటి నుంచీ అధికారంలో మార్పులూ ప్రారంభమైనాయి. వీటిని పరిశీలించడం వల్ల రాజకీయ స్వభావంలో తాత్కాలికమైన కొన్ని లక్షణాలకు కారణాలను గ్రహించవచ్చు.

### 11.3.1 ఎన్నికలు : ప్రభుత్వ మార్పులు

ప్రజాస్వామ్య దేశాలలో ప్రజాభిమతమే ప్రభుత్వ మనుగడకు మూలాధారం. ప్రభుత్వానికి ప్రజల ఆమోదం తెలియజేసే మార్గం ఎన్నికలు. ఎన్నికల ద్వారా తమకు అనుకూలమైన ప్రభుత్వాన్ని స్థాపించుకొని తమను తాము పరిపాలించుకొనే స్వేచ్ఛ, హక్కు ప్రజలకు ఏర్పడుతుంది. మనదేశంలో పూర్వం ద్వంద్వ పరిపాలన అమలులో పెట్టిన తరువాత ప్రభుత్వాలను ఏర్పరచడానికి ఎన్నికలు నిర్వహించడం జరిగింది. ఆ ఎన్నికల వ్యవస్థలో ఆస్తి కలిగిన వారు, పన్ను చెల్లించేవారు, చదువుకున్నవారు మాత్రమే పాల్గొనే అవకాశం కల్పించారు.

స్వాతంత్ర్యానంతరం 1951 లో అమలులోకి వచ్చిన రాజ్యాంగం జాతిమత వర్గలింగ వివక్ష లేకుండా 21 సంవత్సరాలు వయస్సు కలిగిన భారతీయ పౌరులందరికి ఓటు హక్కు కల్పించింది.

BRAOU

### 11.3.2 ప్రథమ సాధారణ ఎన్నికలు - 1951

ప్రత్యేక భాషా రాష్ట్ర సమస్య అందరి మనస్సులను ఆకట్టుకున్న తరుణంలో, 1951 నాటి ప్రప్రథమ సాధారణ ఎన్నికల్లో ఆంధ్ర ప్రజలు పాల్గొన్నారు. భాషా రాష్ట్ర ఏర్పాటుకు కాంగ్రెసు ప్రధాన అవరోధమనే తీవ్ర విమర్శలో ఈ ఎన్నికలలో కమ్యూనిస్టు పార్టీ గొప్ప ప్రచార ఉద్యమం సాగించింది. కాంగ్రెసు నుండి నిష్క్రమించిన శ్రీ ప్రకాశంగారి నాయకత్వంలో కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ, శ్రీరంగాగారి కృషిక్‌లోక పార్టీ ఎన్నికల రంగంలో దిగాయి. ఈ ఎన్నికలలో ఏ పార్టీకి పూర్తి మెజారిటీ రాలేదు. ఈ ఎన్నికలలో కాంగ్రెస్‌కు 40, కమ్యూనిస్టులకు 41, కె.యమ్.పి.పి.కు 22 స్థానాలు లభించాయి. శ్రీ ప్రకాశం గారి నేతృత్వంలో మిశ్రమ మంత్రి వర్గం ప్రభుత్వాన్ని చేపట్టింది.

### 11.3.3 మధ్యంతర ఎన్నికలు

సంవత్సరం నిండగానే ప్రకాశంగారి అధిపత్యంలోని మిశ్రమ మంత్రి వర్గం పడిపోయింది. రాష్ట్రపతిపాలన 1955లో మధ్యంతర ఎన్నికలు జరిపే వరకు జరిగింది. తిరిగి ప్రచారం తీవ్రరూపం ధరించింది. ఎన్నికల విజయం పట్ల కమ్యూనిస్టు పార్టీ అపారమైన విశ్వాసంతో ఎన్నికల పోరాటంలోకి దిగింది. ప్రథమ ఎన్నికలలో కమ్యూనిస్టుల విజయానికి భయపడిన కాంగ్రెస్ నాయకులు కె.యమ్.పి.పి.తో పొత్తు కుదుర్చుకున్నారు. కమ్యూనిస్టులు అధిక సంఖ్యలో ఓడిపోయినారు. కాంగ్రెస్‌కు మంచి మెజారిటీ లభించింది. శ్రీ బెజవాడ గోపాలరెడ్డి 1955లోనే మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడేవరకు అదే ప్రభుత్వం కొనసాగింది.

### 11.3.4 1955 మధ్యంతర ఎన్నికలలో పార్టీల బలాబలాలు

కాంగ్రెస్ 119, కమ్యూనిస్టులు 15, జన సంఘం, కె.యల్.పి. 22, ప్రజాపార్టీ 5, యస్.పి. 13, స్వతంత్రులు 22.

1957లో ఒక్క తెలంగాణా ప్రాంతంలో మాత్రం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో కాంగ్రెస్ మంచి విజయం సాధించింది. కమ్యూనిస్టు పార్టీ కొన్ని పూర్వపు స్థానాలు కోల్పోయింది.

### 11.3.5 1957 ఎన్నికలలో తెలంగాణాలో పార్టీ బలాబలాలు

కాంగ్రెస్ 68, కమ్యూనిస్టు 22, యస్.పి. 1, ప్రజాపార్టీ 1, స్వతంత్రులు 10.

తర్వాత 1962 నాటి మూడవ సాధారణ ఎన్నికలలో మొత్తం 300 శాసనసభ స్థానాలలో 177 స్థానాలను కాంగ్రెస్ గెలుచుకొని పూర్తి మెజారిటి సంపాదించింది. 51 సీట్లలో కమ్యూనిష్టు పార్టీ ప్రధాన ప్రతిపక్షంగా ఉంది.

1967 లో జరిగిన సాధారణ ఎన్నికలలో కాంగ్రెస్ అసెంబ్లీ స్థానాలు, ఓట్లు కూడా 1962 ఎన్నికలలో కన్నా తగ్గాయి. స్వతంత్ర పార్టీకి కొన్ని సీట్లు పెరిగాయి. అవి 19 నుంచి 29 వరకు. కాని ఈ ఎన్నికలలో కమ్యూనిష్టు పార్టీ తీవ్రంగా దెబ్బతింది. ప్రప్రథమంగా జన సంఘ్ ఎక్కువ సీట్లు సంపాదించుకున్నది.

### 11.3.6 1967 ఎన్నికలలో పార్టీల బలాబలాలు

కాంగ్రెస్ 165, స్వతంత్రపార్టీ 29, కమ్యూనిస్టు 11, మార్క్సిస్టు 9, స్వతంత్రులు 68.

1971 మధ్యంతర పార్లమెంటు ఎన్నికల తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభకు 1972లో ఎన్నికలు జరిగినాయి. కాని ఎన్నికలలో 1971 పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్‌కు పోలయిన ఓట్ల శాతంతో పోల్చుకొంటే 1972 లో జరిగిన ఎన్నికల ఓట్ల శాతం చాల తక్కువ.

BRAOU

1972లో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి మంచి మెజారిటీ లభించింది. ఈ ఎన్నికలలో ఎన్నికలు జరిగిన మొత్తం సీట్లు 287. వీటిలో వివిధ పార్టీల బలాబలాలు కింది విధంగా ఉన్నాయి.

కాంగ్రెస్ - 219, సి.పి.ఐ. - 7, మజ్లిస్ - 3, స్వతంత్రపార్టీ - 2, యస్.టి.పి.యస్. -2, సి.పి.యమ్ - 1, స్వతంత్ర అభ్యర్థులు - 53.

## 11.3.7 1978 రాష్ట్ర శాసనసభ ఎన్నికలు : వివిధ పార్టీల బలాబలాలు

1977లో లోక్‌సభ ఎన్నికలు జరగడం ఆ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ పరాజయం పాలవటంతో ఆ పార్టీ రెండుగా చీలిపోయింది. ఇందిరాగాంధి నాయకత్వంలోని కాంగ్రెస్ ఇందిరా కాంగ్రెస్‌ను స్థాపించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఉన్న జలగం వెంగళరావు బ్రహ్మానందరెడ్డి పక్షం వహించి ఇందిరా గాంధికి ఎదురు తిరిగారు. కాంగ్రెస్‌లోని ఇందిరా గాంధి అనుకూల వర్గానికి మర్రి చెన్నారెడ్డి, వ్యతిరేక వర్గానికి వెంగళరావు నాయకత్వం వహించారు. ఈ రాజకీయ ఘటనల పూర్వరంగంగా శాసనసభ ఎన్నికలు జరిగాయి.

కేంద్ర ప్రభుత్వంలో అధికారంలోవున్న జనతాపార్టీతోమార్క్సిస్టు పార్టీ ఎన్నికల ఒప్పందం కుదుర్చుకుంది. వెంగళరావు నాయకత్వంలోని కాంగ్రెస్ కమ్యూనిస్టు పార్టీతో ఒప్పందం కుదుర్చుకొంది. కాని ఇందిరా కాంగ్రెస్ ఒంటరిగానే ఎన్నికలలో పాల్గొంది. ఈ విధమైన త్రిముఖ పోటీ ఇందిరా కాంగ్రెస్‌కు ఎక్కువగా లాభించింది. ఇందిరా కాంగ్రెస్ 290 సీట్లకు పోటీచేసి 175 సీట్లు గెలుచుకొంది. వెంగళరావు కాంగ్రెస్‌కు 30 స్థానాలు లభించాయి. వెనుకబడిన ప్రాంతాలలో ముఖ్యంగా తెలంగాణా రాయలసీమ ప్రాంతాలలో ఇందిరాగాంధీ ప్రభావం తగ్గిపోవటం చేత ఆ పార్టీ తిరిగి అధికారంలోకి రాగలిగింది.

### 1978 రాష్ట్ర శాసన సభ ఎన్నికలలో వివిధ పార్టీల బలాబలాలు

ఇందిరా కాంగ్రెస్ 175, జనతాపార్టీ 60, కాంగ్రెస్‌పార్టీ 30, కమ్యూనిస్టు పార్టీ 6, మార్క్సిష్టు పార్టీ 8, స్వతంత్ర అభ్యర్థులు 15 ఇతరులు 0.

మొత్తం పోలయిన ఓట్ల శాతంలో ఎక్కువ ఇందిరా కాంగ్రెస్‌కు లభించాయి. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమటంటే 1977లో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో ఉత్తర భారతదేశంలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓటు చేయటం జరిగింది. కాని ఆంధ్రప్రదేశ్‌లో 1978 శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ (ఐ)కు అనుకూలంగా ఓటు వేయడంతో ప్రభుత్వ ఏర్పాటుకు దోహదం జరిగింది.

BRAOU

## 11.3.8 1983 రాష్ట్ర శాసనసభ ఎన్నికలు : అధికారమార్పు

గతంలో రాష్ట్ర శాసన సభకు జరిగిన ఎన్నికల కంటే 1983లో జరిగిన శాసనసభ ఎన్నికలు ఎంతో ప్రాధాన్యత, ప్రాముఖ్యత సంతరించుకొన్నాయి. 1972 ఎన్నికలలో చెన్నారెడ్డి నాయకత్వంలో అధికారాన్ని చేపట్టిన ఇందిరా కాంగ్రెస్ అవినీతికి నిలయమయింది. పార్టీలోనూ, ప్రజలలోనూ పరువు కోల్పోయిన చెన్నారెడ్డిని తొలగించి కేంద్ర కార్మికశాఖా మంత్రిగా ఉన్న టి. అంజయ్యను ముఖ్యమంత్రిగా 1980 అక్టోబరున నియమించడం జరిగింది.

పరిపాలనా దక్షత కొరవడిన టి. అంజయ్య అభాసుపాలయినాడు. ఇందిరా కాంగ్రెస్‌లో ముఠా తగాదాలు ఎక్కువయ్యాయి. జనార్ధనరెడ్డి, కోన ప్రభాకరరావు మధ్య ముఖ్యమంత్రి పదవికి తీవ్ర పోటీ జరిగింది. ఇటువంటి పరిస్థితులలో ఎటువంటి రాజకీయ ప్రాముఖ్యత లేని భవనం వెంకట్రామ రెడ్డిని ముఖ్యమంత్రిగా ఇందిరా గాంధి నియమించింది. కాని ఆయన కూడా ఎక్కువ కాలం పదవిలో కొనసాగలేకపోయారు. 1982లో సెప్టెంబరులో ఆయనను తొలగించి కోట్ల విజయభాస్కర రెడ్డిని

నియమించడం జరిగింది. కేవలం 5 సంవత్సరాలలో 4 ముఖ్యమంత్రులను మార్చడం, కాంగ్రెస్‌లోని ముఠాతగాదాలు పరిపాలనా దక్షతలేని నాయకులు, పెచ్చు పెరిగిన అవినీతి ప్రజలలో ఇందిరా కాంగ్రెస్ పలుకుబడిని అడుగు స్థాయికి దిగజార్చింది.

ఇటువంటి తరుణంలో తెలుగు చలన చిత్ర నాయకుడుగా 3 దశాబ్దాలుగా పేరొందిన ఎన్.టి. రామారావు 'తెలుగుదేశం' పేరిట ఒక ప్రాంతీయ పార్టీని 1982 మార్చిలో స్థాపించారు. తన 30 ఏళ్ళ సినీ గ్లామర్‌తోను, వాక్చాతుర్యంతోను రాష్ట్రం నలుమూలలా పర్యటించారు. కాంగ్రెస్ అవినీతి పరిపాలనలో విసుగు చెందిన ప్రజలను ఎన్.టి. రామారావు బాగా ఆకర్షించసాగారు. కాంగ్రెస్ బలహీనతను ఆధారం చేసుకొని ప్రజలలో ప్రాంతీయ అభిమానాన్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు చేశారు.

ఈ రాజకీయ రంగంలో 1983లో రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరిగాయి. ఆత్మ గౌరవాన్ని కాపాడండి, అవినీతిని నిర్మూలించండి అనే నినాదాలతో తెలుగుదేశం 289 సీట్లకు పోటీ చేసింది. మిగిలిన 5 సీట్లకు ఒప్పందం కుదుర్చుకొన్నది. ఇందిరా కాంగ్రెస్ అధికార పోటీలలో నిలవలేని నాదెండ్ల భాస్కరరావు, నల్లపు రెడ్డి శ్రీనివాసులు రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి వంటి కాంగ్రెస్ నాయకులు ఈ తెలుగు దేశంలో చేరిపోయినారు.

ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ఒక అంగీకారానికి వచ్చి సంయుక్తంగా పోటీ చేశాయి. ఈ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీకి 202 సీట్లు సాధించుకున్నది. అవినీతికి, లంచగొండితనానికి, దిగజారిన పరిపాలనకు ముఠాతగాదాలకు ఆలవాలమైన ఇందిరా కాంగ్రెస్ సరియైన పోటీని ఏ జాతీయ ప్రతిపక్షాలు ఇవ్వలేక పోవటం మూలంగా, రాష్ట్రంలో వామపక్షాలు తగినంతగా బలపడక పోవటం వల్ల, రాజకీయ ప్రత్యామ్నాయం కోసం ఎదురు చూస్తున్న రాష్ట్ర ప్రజలను ఎంతో సినీ గ్లామర్ కలిగిన ఎన్.టి. రామారావు తన వాక్చాతుర్యంతో, ప్రాంతీయ అభిమానాన్ని రెచ్చగొట్టటం వల్లనూ, తెలుగుదేశం పార్టీ అత్యధిక మెజారిటీ సంపాదించగలిగింది. మొట్టమొదటి సారిగా మన రాష్ట్రంలో కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని తెలుగుదేశం స్థాపించింది.

## 11.3.9 1983 రాష్ట్ర శాసన సభ ఎన్నికలలో వివిధ పార్టీలకు పోలయిన ఓట్ల శాతం

BRAOU

| | | |
|---|---|---|
| ఇందిరా కాంగ్రెస్ | - | 33.56 శాతం |
| టి.డి.పి. | - | 46.75 శాతం |
| సి.పి.ఐ | - | 2.81 శాతం |
| సి.పి.ఐ | - | 2.02 శాతం |

ఈ ఓట్ల శాతాన్ని బట్టి పరిశీలించినట్లయితే కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకత ఎక్కువగా ఉన్నట్లు అనిపిస్తుంది. కమ్యూనిస్టు, మార్క్సిస్టు పార్టీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పూర్వం జరిగిన ఎన్నికలతో పోల్చినట్లయితే వామ పక్షాలు తమ ఉనికిని కోల్పోతున్నట్లు తెలుపుతున్నవి. మిగిలిన జాతీయ పార్టీలకు చాల తక్కువ శాతం ఓట్లు పోలయినాయి. దీని ద్వారా అధికారాన్ని ఒక పార్టీ నుండి వేరొక పార్టీకి ప్రజలు ఒప్పచెప్పారు.

## 11.3.10 1985 రాష్ట్ర శాసన సభ ఎన్నికలు

1983 ఎన్నికలలో అత్యధిక మెజారిటీతో అధికారం చేపట్టిన తెలుగుదేశం ఎంతో కాలం సంయుక్తంగా నిలువ లేకపోయింది. ఆ పార్టీపై తిరుగుబాటు చేసి 1984 ఆగష్టు 16వ తేదీన నాదెండ్ల భాస్కరరావు ముఖ్యమంత్రిగా పదవి నధిష్టించారు. కాని ఆయనకు మెజారిటి సభ్యుల మద్దతు లేకపోవటం వలన తిరిగి సెప్టెంబరు 16న ఎన్.టి. రామారావు ముఖ్యమంత్రి కాగలిగారు. కాంగ్రెస్ పార్టీ నాదెండ్ల భాస్కరరావును బలపర్చింది. జాతీయ ప్రతిపక్షాలైన మార్క్సిస్టు, కమ్యూనిస్టు,

బి.జె.పి, జనతా పార్టీలు కలిసి కట్టుగా రామారావుకు మద్దతునిచ్చాయి. ఈ ప్రతిపక్షాల మద్దతుతో తిరిగి అధికారం చేపట్టిన రామారావు తన మనుగడ సుస్థిర పరచుకునేందుకు వీలుగా 1984 నవంబరు 22న శాసన సభను రద్దుచేసి తిరిగి ఎన్నికలు జరపమని కోరడంతో రాష్ట్ర శాసన సభకు 1985 మార్చి 5న ఎన్నికలు నిర్వహించారు.

ఈ ఎన్నికలలో ఎన్.టి. రామారావు నాయకత్వంలోని తెలుగుదేశం తనను బలపర్చిన కాంగ్రెసేతర పార్టీలతో సీట్ల సర్దుబాటు చేసుకొని మొత్తం 249 స్థానాలలోపోటీ చేసింది. కాని ఇందిరా కాంగ్రెస్, నాదెండ్ల భాస్కరరావు నాయకత్వంలోని ప్రజాస్వామ్య తెలుగుదేశం వేరువేరుగా అన్ని స్థానాలకు పోటీ చేయడం జరిగింది.

ఈ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ 202, సి.పి.ఐ -22, సి.పి.యమ్ - 11, జనతా - 3, బి.జె.పి - 8, సీట్లను గెలుచుకోగా ఇందిరా కాంగ్రెస్ 50 స్థానాలను మాత్రమే గెల్చుకోగలిగింది.

ఈ విధంగా సంపూర్ణ మెజారిటీని సాధించిన తెలుగుదేశం ప్రభుత్వాన్ని చేపట్టి శాసనసభ గడువు పూర్తికాలాన్ని పరిపాలించి కొన్ని వినూత్నమైన పథకాలను ప్రజాసంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి కొంత వైవిధ్యమైన పరిపాలనను ప్రజలకు అందజేసింది. ఇటువంటి చారిత్రక నేపథ్యంలో కొన్ని రాజకీయ సంఘటనలు చోటుచేసుకున్నాయి. వాటిలో ముఖ్యమైనవి శ్రీమతి ఇందిరాగాంధి హత్య, తదనంతరం రాజీవ్ గాంధి హత్య. వీటి వలన ప్రజలు ప్రభావితులై సానుభూతి పరులవటం వలన తరువాత జరిగిన ఎన్నికలలో తెలుగుదేశం ప్రభుత్వాన్ని ఏర్పరచగలిగే స్థానాలు సంపాదించలేక పోయింది.

**అభ్యాసం**

1983లో అధికార మార్పును వివరించండి.

BRAOU

## 11.4 మంత్రివర్గాలు - మార్పులు

ఎన్నికల్లో గెలుపొందిన పార్టీ కార్యనిర్వాహకవర్గం నాయకుడు లేదా ముఖ్యుడు ముఖ్యమంత్రిగానూ, కొందరు మంత్రులుగానూ మంత్రివర్గం ఏర్పడుతుంది. మంత్రి వర్గాలలో మార్పులు కూడా ఎన్నికల ఫలితాల కోసం; గవర్నర్ సూచనలననుసరించి జరుగుతూ వస్తాయి.

### 11.4.1 శాసనసభ - మంత్రి వర్గాలు

పరిపాలనా సౌలభ్యం కోసం దేశం కొన్ని రాష్ట్రాలుగా విభజింపబడింది. రాష్ట్రాలకు స్వయం పరిపాలనా స్వాతంత్ర్యం ఉన్నా అవి కేంద్ర ప్రభుత్వానికి లోబడి పనిచేస్తాయి. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వంలో ఉంటారు. ఈ ప్రతినిధులు ఉన్న సంఘమే శాసనసభ.

ఆంధ్ర రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ అవతరణ తరువాత 1959, జూన్ 31 వరకు ఒకే శాసనసభ ఉండేది. 1959 జూలై 1 నుండి రెండు సభలు గల శాసనసభ ఉండేది. అప్పటినుండి విధానసభ (అసెంబ్లీ), విధాన పరిషత్ (కౌన్సిల్) అని రెండు సభలు ఏర్పడ్డాయి. 1985 జూన్ 1న తెలుగుదేశం ప్రభుత్వ నాయకత్వం రాష్ట్ర శాసన మండలిని రద్దు చేయటం జరిగింది. అప్పటి నుండి ప్రస్తుతం వరకు విధాన పరిషత్‌ను పునర్నిర్మించడం జరుగలేదు. కొన్ని ప్రభుత్వాలు ఏర్పాటుకి ప్రయత్నాలు చేశాయి కాని సఫలీకృతం కాలేదు.

### 11.4.2 మంత్రి వర్గం

రాష్ట్ర ప్రభుత్వ కార్యనిర్వాహక అధికారం ముఖ్యమంత్రి నాయకత్వం లోని మంత్రివర్గంపై ఉంటుంది. గవర్నర్‌ను రాష్ట్రపతి నియమిస్తాడు. గవర్నర్ పేరు మీద పరిపాలన జరిగినా కీలక పాత్ర వహించేది ముఖ్యమంత్రి మాత్రమే. శాసన సభలో మెజారిటీ ఉన్న వ్యక్తిని ముఖ్యమంత్రిగా గవర్నర్ నియమిస్తాడు. అతని సలహామేరకు మిగిలిన మంత్రి మండలిని నియమిస్తాడు. మంత్రివర్గం శాసనసభకు సమిష్టి బాధ్యత వహిస్తుంది.

**ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు తరువాత ముఖ్యమంత్రులుగా పనిచేసినవారు; కొన్ని మంత్రి వర్గాలు; ముఖ్యమైన మంత్రులు :**

#### ఆంధ్రరాష్ట్రం

1953 మంత్రివర్గం : టి. ప్రకాశం - ముఖ్యమంత్రి, హోంశాఖ యన్. సంజీవ రెడ్డి - ఉపముఖ్యమంత్రి. టి.విశ్వనాధం - ఆర్థిక, న్యాయ, దేవాదాయశాఖలు, డి. సంజీవయ్య - ప్రణాళికలు, ఆరోగ్యం.

#### హైదరాబాదు రాష్ట్రం

మిలిటరీ గవర్నర్ మేజర్ జె.ఎన్. చౌదరి 18.9.1948 - 30.11.1949.

ముఖ్యమంత్రి శ్రీ బి. రామకృష్ణారావు 1950 - 1956

### 1955 గోపాలరెడ్డి మంత్రివర్గం

శ్రీ ప్రకాశం మంత్రివర్గం 13 నెలలు మాత్రమే అధికారంలో ఉంది. తరువాత మధ్యంతర ఎన్నికలు జరిగాయి. కాంగ్రెసు పార్టీని, కృషిక్ లోక్ పార్టీని, ప్రజాపార్టీని కలుపుకుని ముఖ్యమంత్రిగా శ్రీ బి. గోపాల రెడ్డితో మంత్రివర్గం ఏర్పాటు చేసింది.

బి. గోపాల్ రెడ్డి - ముఖ్యమంత్రి, సాధారణపాలన, విద్యాశాఖ

ఎన్. సంజీవరెడ్డి - ఉప ముఖ్యమంత్రి,

డి. సంజీవయ్య - రవాణా

గౌతు లచ్చన్న - విద్య మరియు కార్మికశాఖ, సాంఘీక సంక్షేమం.

BRAOU

నవంబరు 1956న ఆంధ్రప్రదేశ్ ఏర్పడేవరకు గోపాలరెడ్డి మంత్రివర్గం కొనసాగింది. కాంగ్రెస్ శాసనసభ పార్టీ నాయకత్వానికి జరిగిన విస్తృత పోటీలో సంజీవరెడ్డి విజయం సాధించి, విస్తృత ఆంధ్రప్రదేశ్‌కి మొదటి ప్రభుత్వాన్ని ఏర్పరచారు.

**1956 మంత్రి వర్గంలో ప్రముఖులు**

ఎన్. సంజీవరెడ్డి - ముఖ్యమంత్రి, సాధారణ పాలన, లా అండ్ ఆర్డర్, సమాచారం.

కె. వెంకట రమణారెడ్డి - రెవిన్యూ, రిజిస్ట్రేషన్

బి. గోపాలరెడ్డి - హోమ్, న్యాయస్థానాలు, జైళ్ళు

కళా వెంకటరావు - ఆర్థిక, రాష్ట్ర జీవిత భీమా

దామోదరం సంజీవయ్య - సాంఘిక సంక్షేమం, గృహవసతి.

నల్లూరి బసవరాజు - పరిశ్రమలు, గనులు, స్టేషనరీ

**1960లో జరిగిన మంత్రి వర్గ మార్పులు**

శ్రీ నీలం సంజీవరెడ్డి జాతీయ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికవటం చేత సంజీవరెడ్డి మంత్రివర్గం రాజీనామా చేయటం చేత శ్రీ దామోదరం సంజీవయ్య ముఖ్యమంత్రిగా నూతన మంత్రివర్గం 1960 జనవరి 11న ప్రమాణ స్వీకారం చేసింది.

**మంత్రివర్గం**

ధామోదరం సంజీవయ్య - ముఖ్యమంత్రి, సాధారణ పాలన, పురపాలక సంఘాలు, లా అండ్ ఆర్డర్.

కె.వి. రంగారెడ్డి - ఉప ముఖ్యమంత్రి రెవెన్యూ

అల్లూరి సత్యనారాయణరాజు - విద్యుచ్ఛక్తి, పి.డబ్ల్యు. డి

కాసు బ్రహ్మానందరెడ్డి - ఆర్థిక, వాణిజ్య పన్నులు

కల్లూరి చంద్రమౌళి - దేవాదాయ, ధర్మాదాయాలు

పిడతల రంగారెడ్డి - ప్రణాళిక, పంచాయితీరాజ్.

**1962 ఎన్నికల తరువాత మంత్రివర్గం**

నీలం సంజీవరెడ్డి - ముఖ్యమంత్రి, సాధారణ పాలన, పోలీసు

నూకల రామచంద్రారెడ్డి - రెవెన్యూ భూసంస్కరణలు

కాసుబ్రహ్మానందరెడ్డి - ఆర్థిక, సహకారం, వాణిజ్య

యమ్. పళ్ళల రాజు - పశుపోషణ, అడవులు, మత్స్య

మర్రి చెన్నారెడ్డి - ప్రణాళికలు, పంచాయితీరాజ్

యార్లగడ్డ శివరాంప్రసాద్ - ఆరోగ్యం వైద్యం

యం.ఎస్. లక్ష్మీనరసయ్య - మధ్యతరగతి, చిన్నపరిశ్రమలు

BRAOU

## 20-2-1964న ప్రమాణం చేసిన మంత్రివర్గం

కొన్ని రాయలసీమ జిల్లాలలో బస్సు రూట్ల జాతీయీకరణ గూర్చి సుప్రీం కోర్టు చేసిన వ్యతిరేక వ్యాఖ్యల పట్ల, సంజీవరెడ్డి మంత్రివర్గం 1964 ఫిబ్రవరిలో రాజీనామా చేసింది. పదవీ విరమణ చేసిన మంత్రివర్గంలో ఆర్థిక మంత్రి సంజీవరెడ్డి సన్నిహితుడు ముఖ్యమంత్రిగా పదవి స్వీకారం చేశాడు.

| | | |
|---|---|---|
| కాసు బ్రహ్మానందరెడ్డి | - | ముఖ్యమంత్రి, సాధారణపాలన, ప్రణాళిక, భారీపరిశ్రమ |
| నూకల రాంబద్రారెడ్డి | - | రెవెన్యూ, భూసంస్కరణలు |
| మర్రి చెన్నారెడ్డి | - | ఆర్థికం, మధ్యతరగతి, చిన్న పరిశ్రమలు |
| ఎ.వి.జి. రాజు | - | విద్య |
| యార్లగడ్డ శివరాంప్రసాద్ | - | ఆరోగ్యం, వైద్యం |
| పి.వి. నరసింహారావు | - | న్యాయం (సహాయ) |
| మీర్ అహమ్మద్ అలీఖాన్ | - | హోమ్, పోలీసు |

## 1967లో ఏర్పడ్డ మంత్రివర్గం

45 సాధారణ ఎన్నికల తరువాత 1967లో ఏర్పడ్డ మంత్రివర్గం ఈ కింది విధంగా ఉంది.

| | | |
|---|---|---|
| కాసు బ్రహ్మానంద రెడ్డి | - | ముఖ్యమంత్రి, సాధారణ పాలన, ఆర్థికం |
| పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి | - | ఆహారం, వ్యవసాయం |
| నల్లూరి బసవరాజు | - | రెవెన్యూ |
| జె.వి. రాఘవులు | - | విద్య |
| జె.వి. నరసింగరావు | - | పి.డబ్ల్యు డి. |
| కొండా లక్ష్మన్న బాపూజీ | - | కార్మికులు, పౌరసంబంధాలు |
| కె. విజయ భాస్కర రెడ్డి | - | సహకారం |
| ఎ. రామస్వామి | - | సాంఘిక సంక్షేమం |
| మహ్మద్ ఇబ్రహీం అలీ అన్సారి | - | జైళ్ళు, |
| కె.వి. నారాయణ రెడ్డి | - | ప్రణాళికలు, న్యాయం |
| శీలం సిద్ధా రెడ్డి | - | మధ్యతరగతి |
| సహాయ మంత్రి పి.వి. నరసింహారావు | - | ఆరోగ్యం, వైద్యం |

## 1971లో బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గం

| | | |
|---|---|---|
| కాసు బ్రహ్మానందరెడ్డి | - | ముఖ్యమంత్రి, సాధారణ పాలన, లా అండ్ ఆర్డర్ |
| జె.వి. నరసింగరావు | - | ఉపముఖ్యమంత్రి, ప్రణాళిక |
| పెద్ది రెడ్డి తిమ్మారెడ్డి | - | రెవెన్యూ |

BRAOU

| | | |
|---|---|---|
| లోడ రామస్వామి | - | పంచాయతీరాజ్, చిన్నమొత్తాలు |
| పి.వి. నరసింహారావు | - | విద్య |
| జి. సంజీవ రెడ్డి | - | కార్మికులు, పునరావాసం |
| జలగం వెంగళరావు | - | హోమ్, పోలీసు, ఆయుధాల చట్టం. |

## 1971లో రాజకీయ మార్పు, ఏర్పడిన మంత్రివర్గం

ఒక తెలంగాణా నాయకుడు ముఖ్యమంత్రి అవటం కోసం 1971 సెప్టెంబరులో జరిగిన బ్రహ్మానందరెడ్డి రాజీనామా చేయగా ముఖ్యమంత్రిగా పి.వి. నరసింహారావు ఎన్నుకోబడ్డారు.

| | | |
|---|---|---|
| పి.వి. నరసింహారావు | - | ముఖ్యమంత్రి, ప్రణాళిక, పి.డబ్ల్యు. డి. |
| తోట రామస్వామి | - | పంచాయతీరాజ్, చిన్నమొత్తాల పొదుపు |
| కాకాని వెంకటరత్నం | - | వ్యవసాయం, ఆహారోత్పత్తి |
| కె. అచ్యుత రెడ్డి | - | రెవెన్యు, రిజిస్ట్రేషన్, స్టాంపులు |
| కె. చొక్కారావు | - | పరిశ్రమలు |
| శీలం సిద్ధారెడ్డి | - | పెద్దతరహా నీటిపారుదల వసతి |

1972 సాధారణ ఎన్నికలు జరిగే వరకు నరసింహారావు మంత్రివర్గం, ఒక మధ్యంతర ఏర్పాటు మాత్రమే అయినప్పటికీ 25 మంది మంత్రులలో 14 మంది మార్చబడ్డారు.

## 1972 ఎన్నికల అనంతరం నరసింహారావు మంత్రివర్గం :

| | | |
|---|---|---|
| పి.వి. నరసింహారావు | - | ముఖ్యమంత్రి, సాధారణపాలన, లా అండ్ ఆర్డర్ |
| బి.వి. సుబ్బారెడ్డి | - | ఉపముఖ్యమంత్రి, ప్రణాళిక |
| కాకాని వెంకటరత్నం | - | వ్యవసాయం ఆహారోత్పత్తి, పశుపోషణ |
| టి. హయగ్రీవాచారి | - | పంచాయతీరాజ్ |
| జలగం వెంగళరావు | - | పరిశ్రమలు |
| కోన ప్రభాకర రెడ్డి | - | విద్యుత్చ్ఛక్తి |
| కె. భీమారావు | - | గిరిజనాభివృద్ధి |
| బాట్టం శ్రీరామమూర్తి | - | ప్రాథమిక, మాధ్యమిక విద్య |
| బత్తిన సుబ్బారావు | - | సహకారం |
| వి. కృష్ణమూర్తి నాయుడు | - | హోమ్, పోలీసు, జైళ్ళు |

BRAOU

అంజయ్య - కార్మికులు, ఉద్యోగకల్పన

మండలి వెంకట కృష్ణారావు - సాంఘీక సంక్షేమం

ప్రత్యేక ఆంధ్ర ఉద్యమం మధ్యలో 1973లో నరసింహారావు మంత్రివర్గం రాజీనామా చేసింది. 1973లో డిసెంబరు 10 వరకు రాష్ట్రపతి పాలన విధించబడిన తరువాత ఆంధ్రప్రదేశ్ నూతన ముఖ్యమంత్రిగా జలగం వెంగళరావు ఎన్నుకోబడ్డారు.

**1973 వెంగళరావు మంత్రివర్గం :**

జలగం వెంగళరావు - ముఖ్యమంత్రి, హోమ్, సాధారణ పాలన

పిడతల రంగారెడ్డి - ఆర్థికం, సమాచారం

కోదాటి రాజమల్లు - ఆరోగ్యం వైద్య సౌకర్యాలు

టి. అంజయ్య - కార్మికులు, ఉద్యోగకల్పన

చనుమోలు వెంకట్రావు - పి. డబ్ల్యు. డి

బాట్టం శ్రీరామ మూర్తి - సాంఘిక, గిరిజన సంక్షేమం

## 11.5 పాలనా వ్యవస్థ

రాష్ట్ర ప్రభుత్వం పై మంత్రి వర్గాలతో పాటు ఒక పాలనా వ్యవస్థ సహాయంతో నడుస్తుంది. పాలనా వ్యవస్థలకు ప్రధాన కార్యదర్శి (Chief Secretary) ఉంటారు.

ప్రధాన డిపార్టుమెంటుకు కార్యదర్శి ఉంటారు. ముగ్గురు కార్యదర్శులు ఉండేచోట ఒక ప్రిన్సిపల్ కార్యదర్శి ఉంటారు. శాఖ ప్రాముఖ్యం బట్టి కార్యదర్శుల సంఖ్య ఉంటుంది. ఫైనాన్స్, ప్లానింగ్, విద్య, రెవెన్యూ వంటి వాటికి సెక్రటరీలు ఉంటారు. సహాయ, అదనపు డిప్యూటి సెక్రటరీలు ప్రతి విభాగంలోనూ ఉంటారు.

విధాన అమలు వారి ప్రధాన బాధ్యత. ఉదాహరణకు రెండు రూపాయల కిలో పథకం తీసుకోండి. ఎంతమంది కుటుంబాలకు ఈ పథకం వర్తించాలి. ప్రతినెలకు ఎంత బియ్యం అవసరం, అటువంటి సమాచారాన్ని జిల్లానుండి సచివాలయానికి సప్లై చెయ్యాలి. విధానం జరిగిం తర్వాత అమలుకు పాలనా చట్రం సమాయత్తమౌతుంది.

ఆరు లక్షల పైనున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పాలనా వ్యవస్థకు ఆయువు పట్టు లాంటివారు. అనేక అభివృద్ధి పథకాల అమలులో వారి పాత్ర విశేషంగా ఉంది. పాలనా నాయకత్వపు సవాళ్ళు అనేకం ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు దైనందిన కార్యక్రమాల పట్లనే కాకుండా అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించాలని అనేక పాలనా సంస్కరణల సంఘాలు సూచించాయి.

జిల్లా పాలనా యంత్రాంగాలు ప్రణాళికీకరణలో చురుకుగా పాల్గొనేటట్లుగా ఉండాలని అనేక మంది అభిలాష. రాజ్యాంగంలో తృతీయ పాలనా చట్రం పంచాయితీ వ్యవస్థలు. ఆంధ్రప్రదేశ్‌లో మూడంచెల పాలనా వ్యవస్థను ఎన్నడో ప్రవేశపెట్టారు.

BRAOU

**అభ్యాసం**

పాలనా వ్యవస్థ ఎలా పని చేస్తుంది.

## 11.6 రాష్ట్ర న్యాయ వ్యవస్థ

మన రాష్ట్రంలో న్యాయస్థానాలు ఏర్పాటు, న్యాయ వ్యవస్థకు ఒక రూపం స్వాతంత్ర్యానికి ముందు నుండి ఏర్పడింది. అందువల్ల ప్రస్తుత న్యాయవ్యవస్థను గురించి తెలుసుకునే ముందు ఇంతకు పూర్వం ఉన్న న్యాయవ్యస్థను గురించి కూడా తెలుసుకోవాలి.

### 11.6.1 హైదరాబాదు సంస్థానంలో న్యాయవ్యవస్థ :

BRAOU

భారతదేశంలో విలీనం కాక పూర్వం హైదరాబాదు సంస్థానంలో న్యాయ వ్యవస్థ భారతదేశంలోని న్యాయ వ్యవస్థకు కొంత భిన్నంగా వుండేది. సంస్థానంలో న్యాయవ్యవస్థ అడుగు స్థాయిన జిల్లా స్థాయిలో నిజామత్ కోర్టు ఉండేది. దానిని క్రిమినల్ కేసులు, విచారించేటప్పుడు అదాలత్ 'నిజామత్ రాజువారిజిల్లా' అని పిలిచేవారు. సివిల్ కేసులను విచారించేటపుడు అదాల్ - ఇ - దివానీ అని పిలిచేవారు. వీటిపైన సుభా స్థాయిలో డిస్ట్రిక్ట్ సెషన్సు కోర్టుండేది. ఇది సివిల్ క్రిమినల్ కేసులను విచారించేది. 1862 వరకు సంస్థానం మొత్తానికి అప్పీలు చేసుకొనేందుకు హైకోర్టు వంటి ప్రత్యేక కోర్టు లేదు.

1866లో జిల్లాల నుంచి వచ్చే అప్పీళ్ళను విచారించేందుకు 'మహకుమా మూరాఫా అ జీల్హా' అనే కోర్టును మజ్లీస్ - ఇ - మురాఫా అనే కమిటీని ఏర్పాటు చేశారు. 1870లో ఈ కమిటీకి హైకోర్టు స్థాయిని కల్పించారు. దీనికి జిల్లా కోర్టులు నుండి వచ్చిన అప్పీళ్ళను విచారించే అధికారం ఉంది. తరువాత కాలంలో ఈ కోర్టుకు అనేక పేర్లను మార్చుతూ వచ్చారు. రాను రాను ఈ కోర్టు హైకోర్టు స్థాయిలోను, అధికారంలోనూ పెరుగుతూ వచ్చింది. 1928లో నవాబు మీర్జాయార్‌జింగ్ ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడు ఇది పూర్తిగా హైకోర్టు రూపాన్ని సంతరించుకుంది.

1948లో పోలీసు చర్య తరువాత హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో అంతర్భాగం అవడంతో నిజాం, నిజాం న్యాయ వ్యవహారాల కమిటీ రద్దయినాయి. హైదరాబాద్ హైకోర్టు తీర్పులపై అప్పీళ్ళను భారత ఫెడరల్ కోర్టు (భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిందగ్గర్నుంచి సుప్రీంకోర్టు) స్వీకరించింది. ఈ విధంగా 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడే వరకు కొనసాగింది.

### 11.6.2 ఆంధ్ర ప్రాంతం

1861 హైకోర్టుల చట్టం అనుసరించి 1862లో మద్రాసు హైకోర్టును ఏర్పరిచారు. రాష్ట్రం మొత్తానికి అది ఉన్నత న్యాయస్థానం. 1953లో మద్రాసు రాష్ట్రం నుండి తెలుగు భాషా జిల్లాలను విడదీసి ఆంధ్రరాష్ట్రాల ఏర్పాటు చేయడం జరిగింది. అప్పుడు ఆంధ్రరాష్ట్రానికి ఒక ప్రత్యేక హైకోర్టును గుంటూరులో ఏర్పరచారు. ఆంధ్రరాష్ట్ర హైకోర్టు ప్రథమ ప్రధాన న్యాయమూర్తిగా శ్రీ కోకా సుబ్బారావును నియమించారు.

1956లో ఆంధ్రరాష్ట్రాన్ని, హైదరాబాదు రాష్ట్రంలోని 9 తెలుగు జిల్లాలను కలిపి ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పరచడంతో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రథమ ప్రధాన న్యాయమూర్తి కూడా శ్రీ కోకా సుబ్బారావే అయ్యారు.

ఇలా ఏర్పడిన హైకోర్టు భారతదేశంలోని ఏక సంఘటిత (సింగిల్ ఇంటిగ్రెటెడ్) న్యాయ వ్యవస్థ క్రమానుగత శ్రేణిలో ఒక భాగం. అయితే భారతదేశంలో అత్యున్నత న్యాయస్థానం అయిన సుప్రీమ్ కోర్టుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టుపై ఎటువంటి ప్రత్యక్ష పరిపాలనా నియంత్రణ లేదు. ఇదే విధంగా రాష్ట్ర శాసనసభలచేతగాని కార్యనిర్వాహక సభచేత కాని హైకోర్టు నియంత్రించబడదు. ఈవిధంగా మన రాజ్యాంగం నిర్దేశించింది.

### 11.6.3. హై కోర్టు నిర్మాణం

ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ఒక ప్రధాన న్యాయమూర్తి, 21 మంది న్యాయమూర్తులు ఉన్నారు. రాజ్యాంగంలోని 217వ నిబంధనల ప్రకారం భారత రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని, రాష్ట్ర గవర్నరును సంప్రదించి రాష్ట్ర ప్రధానన్యాయమూర్తిని నియమిస్తారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులవ్వాలంటే భారతదేశ పౌరుడై కనీసం 10సం॥లు ఏదైనా స్థానంలో న్యాయమూర్తిగా లేదా రాష్ట్ర హైకోర్టు వంటి న్యాయ స్థానాలలో 10 సం॥లు న్యాయవాదిగా ఉండాలి. 425 రాజ్యాంగ సవరణ ద్వారా రాష్ట్రపతి ఎవరైనా వ్యక్తిని నిష్ణాతుడైన న్యాయమూర్తిగా నియమించే అధికారం ఏర్పడింది. కాని 435 సవరణ ఈ అధికారాన్ని తొలగించింది. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా నియమించబడిన వారు 60 సం॥లు వచ్చేవరకు న్యాయమూర్తిగా కొనసాగవచ్చు. 15వ రాజ్యాంగ సవరణలో ఈ పరిధిని (1963) 62 సం॥ వరకు పెంచారు. పదవీ విరమణ చేసిన తరువాత వారు సుప్రీంకోర్టు, హైకోర్టులలో (తాము పనిచేసిన హైకోర్టులలో తప్ప) న్యాయవాద వృత్తిని కొనసాగించవచ్చు. ఇది 1956 నుండి అమలుకి వచ్చింది. అంతకు ముందు వారికి ఇలా పనిచేసే అధికారం లేదు.

BRAOU

### హైకోర్టు అధికారాలు

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయాధికారాలు రాష్ట్రం మొత్తానికి వ్యాపించి ఉంటాయి. సివిల్, క్రిమినల్‌వివాదాలకు సంబంధించి రాష్ట్రంలో అత్యున్నత న్యాయస్థానం హైకోర్టే. ప్రజాప్రాతినిధ్య చట్టం కింద వచ్చే కేసులను నేరుగా విచారించటమే కాకుండా, క్రింది కోర్టు నుండి వచ్చే సివిల్‌క్రిమినల్ అప్పీళ్ళను స్వీకరించి విచారిస్తుంది. జిల్లాసెషన్ కోర్టు విధించిన మరణ శిక్షను ధృవీకరించిన క్రిమినల్ కేసులను హైకోర్టు పరిశీలిస్తుంది. అంతే కాకుండా కింది కోర్టులు కొట్టివేసిన కేసుల అప్పీళ్ళను స్వీకరిస్తుంది.

### రిట్ అధికారాలు

రాజ్యాంగంలోని 236 వ ప్రకరణం కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు, పౌరులప్రాథమిక హక్కుల పరిరక్షణార్థం కాని మరే ఇతర ప్రయోజనాల దృష్ట్యాకాని, హెబియస్‌కార్పస్, క్వూవారెంట్, ప్రొహిబిషన్ షెడ్ షియరరీ అనే రిట్స్‌ను, ఆదేశాలను, సూచనలను, తన పరిధిలోని వచ్చే అధికారులకు, వ్యక్తులకు జారీ చేయవచ్చు.

రాష్ట్ర హైకోర్టుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసే ఏ శాసనమైనా రాజ్యాంగానికి వ్యతిరేకమై ఉంటే అది చెల్లనేరదు అని కొట్టివేసే అధికారం ఉంది. 42 వ రాజ్యాంగ సవరణ మూలంగా కేవలం రాష్ట్ర శాసనాన్ని మాత్రమే అలా రాజ్యాంగ వ్యతిరేకతగా కొట్టివేసే అధికారం ఉంది. కేంద్ర శాసనాన్ని కొట్టివేసే అధికారాన్ని రాష్ట్ర హైకోర్టు పరిధినుంచి తప్పించారు.

క్రింది కోర్టులో ఉన్న ఏ కేసునైనా అంటే రాజ్యాంగాన్ని వివరించాల్సిన అవసరంగాని, న్యాయ మీమాంసకాని ఇమిడి ఉండే కేసును హైకోర్టు స్వయంగా స్వీకరించవచ్చు. రాజ్యాంగ 227 ప్రకరణలు ప్రకారం కింది కోర్టులు, ట్రిబ్యునల్స్‌పై హైకోర్టుకు నియంత్రణా అధికారాలు ఉన్నాయి. హైకోర్టు సిబ్బందిపై ప్రధాన న్యాయమూర్తికి పూర్తి అధికారాలున్నాయి. సిబ్బందిని నియమించడం, తొలగించడం మొదలైన అన్ని అధికారాలను ప్రధాన న్యాయమూర్తి కలిగి ఉంటారు. జిల్లా జడ్జీల నియామకంలోనూ, ప్రమోట్ చేయటంలోనూ ప్రధాన న్యాయమూర్తి ప్రముఖ పాత్ర వహిస్తాడు.

### 11.6.4 జిల్లా కోర్టులు

జిల్లాలో సివిల్ క్రిమినల్ కేసులను విచారించటానికి వేరు వేరు న్యాయ స్థానాలున్నాయి. క్రిమినల్ కేసులను విచారించే న్యాయస్థానాన్ని జిల్లా సెషన్స్ కోర్టు అంటారు. దీనికి మరణశిక్షతో సహా అన్ని శిక్షలు విధించే అధికారం ఉంది. ఇది కింది స్థాయికోర్టుల నుంచి వచ్చే అప్పీళ్ళను స్వీకరిస్తుంది.

జిల్లా స్థాయిలో సివిల్ వివాదాలను విచారించే న్యాయస్థానాన్ని జిల్లా కోర్టు అంటారు. ఇక్కడ గమనించ తగ్గ విషయమేమంటే జిల్లా జడ్జి జిల్లా సివిల్, సెషన్స్‌కోర్టులు రెండింటిని కూడా నిర్వహిస్తాడు. సివిల్ వివాదాల విషయంలో సబార్డినేట్ జడ్జి కోర్టులుంటాయి. అన్నిటి కన్నా దిగువ స్థాయిలో మున్సిఫ్, మేజిస్ట్రేట్ కోర్టులు వాటిపై మేజిస్ట్రేట్ ఒకటవ, రెండవ, మూడవ తరగతి మేజిస్ట్రేట్ కోర్టులుంటాయి. వీటన్నిటికీ స్పష్టంగా నిర్వచించిన అధికారాలు, విధులున్నాయి. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఉన్నన్యాయస్థానాల వివరాలు:

| | | | |
|---|---|---|---|
| 1. | జిల్లా కోర్టులు | - | 22 |
| 2. | అదనపు జిల్లాకోర్టులు | - | 34 |
| 3. | నిత్యావసర వస్తువుల చట్టం కింద కేసులు విచారణకు ప్రత్యేక జడ్జి ఉన్న కోర్టులు | - | 3 |
| 4. | సబార్డినేట్ జడ్జిల కోర్టులు | - | 90 |
| 5. | మొదటి తరగతి జ్యుడిషల్ మేజిస్ట్రేట్ కోర్టులు | - | 347 |
| 6. | రైల్వేల మొదటి తరగతి జ్యుడిషల్ మేజిస్ట్రేట్ కోర్టులు | - | 4 |
| 7. | రైల్వేలు రెండవ తరగతి ప్రత్యేక జ్యుడిషల్ మేజిస్ట్రేట్ | - | 12 |
| 8. | రెండవ తరగతి ప్రత్యేక జుడిషియల్ మేజిస్ట్రేటులు | - | 51 |

### 11.6.5 సంచార న్యాయ స్థానాలు

రాష్ట్రంలోపైన పేర్కొన్న న్యాయ స్థానాలు కాక 18సంచార న్యాయస్థానాలున్నాయి. ఇందులో 6 హైద్రాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలలో ఉన్నాయి. వీటిలో ఒకటి మునిసిపల్ కేసులను, రెండు సంచార న్యాయ స్థానాలు, మోటారు వాహనాల చట్టానికి సంబంధించిన కేసులను విచారణ జరుపుతున్నాయి. మూడు సంచార న్యాయ స్థానాలు రాష్ట్ర రోడ్డు

BRAOU

రవాణా సంస్థ బస్సులలో టికెట్లు లేకుండా ప్రయాణం చేసే వారి కేసులను విచారణ చేస్తుంది. భారత శిక్షాస్మృతి 1955, పౌర హక్కుల రక్షణ చట్టం కింద షెడ్యూలు కులాలు తెగలకు చెందిన బాధితుల కేసులను విచారించేందుకు ఏడు ప్రత్యేక సంచార న్యాయ స్థానాలను కోస్తా జిల్లాలలో,1985-86లో నాలుగు సంచార న్యాయ స్థానాలను కొన్ని రాయలసీమ జిల్లాలలో ఏర్పాటు చేయాలని సంకల్పించింది. ఇదే విధంగా మున్సిపల్ చట్టం కింద నేరాలను విచారించేందుకు విజయవాడలో ఒక సంచార న్యాయ స్థానం ఉంది.

### 11.6.6 ఇతర న్యాయ స్థానాలు

ఫ్యాక్టరీల చట్టం, కార్మికుల చట్టం కింద కేసులను విచారించేందుకు విజయవాడ, విశాఖపట్టణం, హైదరాబాదు నగరాలలో మున్సిఫ్ మేజిస్ట్రేటు కోర్టులున్నాయి. హైదరాబాదులో పారిశ్రామిక వివాదాలను పరిష్కరించడానికి రెండు ట్రిబ్యునల్స్, కార్మిక వివాదాలను పరిష్కరించడానికి ఒక లేబరు కోర్టు ఉంది. అదే విధంగా కార్మిక వివాదాలను పరిష్కరించడానికి ఒక లేబరు కోర్టు గుంటూరులో కూడా ఉంది. వీటితో పాటు హైద్రాబాదులో రెండు, సికింద్రాబాద్‌లో ఒకటి చొప్పున రెండు రెంట్ కంట్రోలింగ్ కోర్టులను నెలకొల్పాలని ప్రభుత్వం నిర్ణయించింది.

### 11.6.7 న్యాయ సలహాదార్లు, కౌన్సిలు

రాష్ట్ర ప్రభుత్వం తరపున న్యాయ స్థానాలలో వాద ప్రతివాదనలు జరిపే నిమిత్తం న్యాయ సలహాదార్లు ఉన్నారు. వారికయ్యే ఖర్చులు, జీత భత్యాలు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది.

సుప్రీమ్ కోర్టు ముందుకు వచ్చే రాష్ట్ర ప్రభుత్వ కేసులన్నింటిని చూడటానికి అడ్వకేట్సు ఆన్‌రికార్డువున్నారు. అదే విధంగా ప్రభుత్వం తరపున వాదించేందుకు ఈ కింది వ్యక్తులున్నారు.

1. అడ్వకేట్ జనరల్
2. అదనపు అడ్వకేట్ జనరల్
3. ఇద్దరు ప్రభుత్వ ప్లీడర్లు
4. ఇరవై ఎనిమిది మంది జూనియర్ గవర్నమెంట్ ప్లీడర్లు
5. పబ్లిక్ ప్రాసిక్యూటర్
6. ఇద్దరు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు

### 11.6.7 పేదలకు న్యాయ సహాయ పథకం

రాష్ట్రంలో ఉన్న పేదలకు, బలహీన వర్గాల ప్రజలకు న్యాయాన్ని అందించేందుకు ఈ పథకాన్ని 1980లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. మొదటి తరగతి, రెండవ తరగతి మేజిస్ట్రేట్ కోర్టులలో ప్రతివాదన చేసుకోవాలనే సభ్యులకు ఉచితంగా న్యాయ సహాయం కోసం ఈ పథకం ఉంది.

### 11.6.8 న్యాయ పరిషత్

రాష్ట్ర ప్రభుత్వం 'ఆంధ్రప్రదేశ్ లా అకాడమీ' (ఆంధ్రప్రదేశ్ న్యాయ పరిషత్) ను 1986లో ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో

BRAOU

ఇప్పటికీ సర్వీసులో ఉన్న, కొత్తగా నియమించబడ్డ న్యాయశాఖ అధికారులకు శిక్షణ ఇచ్చేందుకు ఈ అకాడమి ఏర్పాటు చేశారు. దీని కేంద్ర కార్యాలయం హైదరాబాద్‌లో ఉంది. న్యాయశాఖ అధికారుల రిక్రూట్‌మెంటును కూడా ఇది నిర్వహిస్తుంది. లా అకాడమి కార్యదర్శి సెలెక్షన్ కమిటీ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

### 11.6.9 లోక్ అదాలత్

రాష్ట్ర న్యాయ వ్యవస్థలో ఇటీవల కాలంలో ఆవిర్భవించిన నూతన వ్యవస్థ లోక్ అదాలత్‌లు. వీటినే ప్రజా న్యాయ స్థానాలు అని కూడా అంటారు. గుజరాత్‌లో లోక్ అదాలత్ వ్యవస్థకి ప్రతిరూపమే ఈ ప్రజా న్యాయస్థానాలు.

ప్రజలకు త్వరితగతిన తక్కువ ఖర్చులో న్యాయాన్ని అందించేందుకు ఇవి ఏర్పాటు చేయబడినాయి. ఈ ప్రజా న్యాయ స్థానాలలో వివాదాల పరిష్కారానికి మానవతా దృక్పథంతో లౌక్యంతో వ్యవహరిస్తూ ఇరుపక్షాల మధ్య సంప్రదింపులు, మధ్యవర్తిత్వం ద్వారా సమస్యని పరిష్కరిస్తారు. స్థానికంగా సాంఘిక దృక్పథం ఉన్న ఒక న్యాయమూర్తిని ఈ ప్రజా న్యాయస్థానానికి కన్వీనర్‌గా నియమిస్తారు. ప్రజాన్యాయ స్థానాల వివరణకు వచ్చిన వివాదాలను సివిల్, క్రిమినల్, రెవెన్యూ అనే అంశాలుగా విడదీసి వేరు వేరుగా పరిశీలిస్తారు. 1987 వరకు 20 లోక్ అదాలత్‌లను నిర్వహించి 10 వేల కేసులను పరిష్కరించారు.

### 11.6.10 లోకాయుక్త - ఉపలోకాయుక్త

ప్రభుత్వ అధికారులలోను ప్రభుత్వ సంస్థలలోనూ నానాటికీ అవినీతి లంచగొండితనం పెరిగిపోతున్నది. మన రాజ్యాంగ నిర్మాతలు వీటిని ఎదుర్కొనటానికి ప్రత్యేకమైన సంస్థలను నెలకొల్పలేదు. వీటిని తొలగించేందుకుగాను న్యాయ వ్యవస్థ అవినీతి నిరోధకశాఖ,ఇంటెలిజెన్స్ విభాగం (ట్రిబ్యునల్స్)కు తోడుగా లోకాయుక్త-ఉపలోక్‌పాల్ అనే సంస్థలను ఏర్పరచవలసిందిగా శ్రీ సంతానం ఆధ్వర్యంలో ఏర్పడిన కేంద్ర పరిపాలనా సంస్కరణల సంఘం సిఫారసు చేసింది.

BRAOU

ఈ సూచనల మేరకు ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ లోకాయుక్త బిల్‌ను 1982లో ఆమోదించింది. దీనికి 1983లో రాష్ట్రపతి ఆమోదముద్ర లభించింది.

**పరిధి :**

1. - అవినీతి నిర్మూలన దాని ముఖ్య లక్ష్యం.

2. పరిపాలనలో జరుగుతున్న అధికార దుర్వినియోగాన్ని అరికట్టాలన్నది మరో ఉద్దేశ్యం.

మంత్రులు, లెజిస్లేటర్లు, మేయర్లు, కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరక్టర్లు, జిల్లా పరిషత్ ఛైర్మన్లు, కార్యదర్శులు, విశ్వ విద్యాలయ వైస్‌చాన్సలర్లు, రిజిస్ట్రార్లు, ఈ పరిధిలోకి వస్తారు.

**స్వరూపం :**

ఈ వ్యవస్థలో ఒక లోకాయుక్త,ఒక ఉపలోకాయుక్త ఉంటారు. విరమణ చేసిన కోర్టు ప్రధాన న్యాయమూర్తినిగాని పదవిలో వున్న హైకోర్టు న్యాయమూర్తినిగాని, లోకాయుక్తగా నియమించవచ్చు.

ఇలా నియమించబడ్డ వ్యక్తి 5 సంవత్సరాలు పదవిలో ఉంటారు. ఆంధ్రప్రదేశ్ మొదటి 'లోకాయుక్త'గా శ్రీ అవుల సాంబశివరావు 1983లో పదవి బాధ్యతలు స్వీకరించారు.

న్యాయ విభాగంలో ఒక డైరక్టరు, ఒక ఉప డైరక్టరు ఉంటారు. పరిశోధనా విభాగంలో 11 మంది అధికారులుంటారు. వీరంతా లోకాయుక్త విధి నిర్వహణలో తోడ్పడతారు.

**విధినిర్వహణ :**

లోకాయుక్త స్వీకరించే ఫిర్యాదులు మూడు రకాలుగా ఉంటాయి.

1) ప్రజలనుంచి వచ్చే ఫిర్యాదులు.

2) లోకాయుక్త తనంతటతానుగా విచారించే ఘటనలు

3) గవర్నర్ అభ్యర్థనపై విచారించే కేసులు.

టెలిగ్రామ్‌లు, ఇన్‌లాండ్ ఉత్తరాల ద్వారా వచ్చే ఫిర్యాదులు లోకాయుక్త స్వీకరిస్తుంది. ఈ ఫిర్యాదుతో పాటు రూ. 25/-డ్రాఫ్టును కూడా జతపరచవలసి ఉంటుంది.

ఇంత వరకు లోకాయుక్త విచారించిన ఫిర్యాదులలో పింఛన్‌ల మంజూరు, బకాయిలు చెల్లింపులు, మొదలుకొని ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీ వరకు అనేక విషయాలు ఇమిడి వున్నాయి. ఇంతవరకు లోకాయుక్త విచారించిన ఫిర్యాదులలో 13 మంది అధికారులకు హోదా తగ్గించడం కాని, ఇంక్రిమెంట్ నిలుపు చేయడం గాని, డిస్మిస్ చేయడం గాని జరిగింది.

**అభ్యాసం**

జిల్లా కోర్టు పనితీరును సమీక్షించండి.

## 11.7. ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

* రాష్ట్రాలలో ప్రభుత్వ యంత్రాంగాలు కేంద్ర ప్రభుత్వ యంత్రాంగం నమూనాలో ఏర్పాటయ్యాయి. ఇది శాసనసభలు, పాలన లేదా కార్యనిర్వాహకవర్గం,న్యాయ వ్యవస్థ అనే మూడు విభాగాలుగా మనకు కన్పిస్తుంది.

* ప్రజాభిమతమే ప్రభుత్వ మనుగడకు మూలాధారం. ఎన్నికలే ప్రజామోదాన్ని తెలియ పరిచే మార్గం. 1951 లో 21 సం॥ నిండిన భారతీయ పౌరులందరికీ ఓటు హక్కును ప్రకటించారు.

* ప్రథమ సాధారణ ఎన్నికలు 1951లో జరిగాయి.

BRAOU

* ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధుల సంఘమే శాసన సభ.
* రాష్ట్ర ప్రభుత్వ కార్యనిర్వాహక అధికారం ముఖ్యమంత్రి నాయకత్వంలోని మంత్రి వర్గంపై ఉంటుంది.
* రాష్ట్ర ప్రభుత్వానికి సహాయంగా ఒక పాలనా వ్యవస్థ పనిచేస్తుంది.
* ఆంధ్ర ప్రదేశ్‌లో (మొత్తం) మూడంచెలపాలనా వ్యవస్థ ఉంది.
* మన రాష్ట్రంలో న్యాయ వ్యవస్థ స్వాతంత్ర్యానికి ముందు మరో రూపంలో కనిపిస్తుంది.
* భారత రాజ్యాంగం ప్రకారం ఆంధ్రప్రదేశ్ లోనూ భిన్న స్థాయుల్లో న్యాయ వ్యవస్థలు కన్పిస్తాయి.

## 2.8. మాదిరి పరీక్షా ప్రశ్నలు

30 పంక్తుల్లో జవాబులు రాయండి

1. శాసనసభ ఏర్పడే విధానాన్ని వివరిస్తూ దాని పనితీరును సమీక్షించండి.
2. ఆంధ్రప్రదేశ్‌లో న్యాయ వ్యవస్థ స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్యానంతరం ఎలా ఉందో వివరించండి.

15 పంక్తుల్లో జవాబులురాయండి.

1. ఆంధ్రప్రదేశ్ అవతరణ నుండీ మన రాష్ట్రంలో మంత్రి వర్గాల మార్పులను సమీక్షించండి.
2. పాలనా వ్యవస్థ పనితీరును క్లుప్తీకరించండి.

BRAOU

# భాగం - 12 స్థానిక సంస్థలు

## విషయ క్రమం

12.0 ఉద్దేశం

12.1 ప్రవేశిక

12.2 స్థానిక సంస్థల ఏర్పాటు

12.2.1 స్థానిక సంస్థల ఆవశ్యకత

12.2.2 బల్వంతరాయ్ మెహతా కమిటి

అభ్యాసం

12.3 ఆంధ్రప్రదేశ్‌లో పంచాయితీ రాజ్

12.3.1 గ్రామసభ

12.3.2 గ్రామ పంచాయితీ

12.3.3. పంచాయితీ సమితి

12.3.4 జిల్లా పరిషత్

అభ్యాసం

12.4 ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ వ్యవస్థలో మార్పులు

12.4.1 పంచాయితీరాజ్ బిల్లు

12.4.2 అశోక్ మెహతా కమిటి

12.4.3 1981లో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన మార్పులు

12.4.4 1986లో చేసిన మార్పులు

అభ్యాసం

12.5 పంచాయితీరాజ్ 73వ రాజ్యాంగ సవరణచట్టం.

12.6 1993లో ప్రభుత్వం ప్రవేశ పెట్టదలచిన మార్పులు

12.7 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

12.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 12.0 ఉద్దేశం

ఈ భాగం చదివింతర్వాత మీరు

* ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థలు ఎలా ఏర్పడ్డాయో, వాటిలో కాలక్రమేణా కొన్ని మార్పులు ఎలా జరిగాయో తెలుసుకోగలుగుతారు.
* పంచాయితీరాజ్ వ్యవస్థ స్వరూప స్వభావాలను వివరించగలుగుతారు.

## 12.1 ప్రవేశిక

స్థానిక సంస్థల ఏర్పాటు కేవలం స్వాతంత్ర్యానంతర ప్రయత్నమే కాదు. అతి ప్రాచీన కాలం నుండి అంటే మౌర్యుల కాలం నుండే స్థానిక సంస్థలు పనిచేస్తున్నట్లు దాఖలాలున్నాయి. నగర గ్రామీణ ప్రాంతాలలో స్థానిక సంస్థల ఏర్పాటుకు సంబంధించిన ప్రస్తావన కౌటిల్యుడి అర్థశాస్త్రంలో కూడా పేర్కొనబడింది. అలాగే గుప్తులు, మొగలులు, బ్రిటిష్ పాలన కాలంలో కూడా స్థానిక సంస్థల ఆవశ్యకతను గుర్తించటం జరిగింది. ఈ రకంగా భారతదేశంలో స్థానిక సంస్థల ఉనికిని పరిశీలిస్తే వాటికి సుదీర్ఘమైన చరిత్ర ఉన్నట్లు తెలుస్తోంది. కాలగమనంలో రాజులు మారినా రాజ్యాలు మారినా ఇవి తమ ఉనికిని కోల్పోలేదు. అయితే స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్యానంతరం గల స్థానిక సంస్థల స్వరూప స్వభావాలు నిర్వహించే విధులలో చాలా మార్పులున్నాయి.

బ్రిటిష్ పాలన కాలంలో స్థానిక సంస్థలకు ఒక ఆకృతిని కల్పించడానికి కృషి చేసిన లార్డ్ రిప్పన్ (1882) భారత దేశంలో స్థానిక సంస్థల పితామహుడిగా గుర్తింపు పొందాడు. స్వాతంత్ర్యానంతరం ప్రజలు పాలన కార్య వ్యవహారాలలో చురుకుగా పాల్గొనేటట్లు చేసి, తమ సమస్యల పరిష్కారానికి తామే బాధ్యత వహించేటట్లు చేయడానికి స్థానిక సంస్థలను ఒక సాధనంగా గుర్తించారు. ముఖ్యంగా ప్రపంచ దేశాలన్నింటిలో అతిపెద్ద ప్రజా స్వామ్య దేశంగా గుర్తింపు పొందిన భారతదేశం అన్ని విషయాల్ని ఢిల్లీ నుండే పరిష్కరించడం సాధ్యం కాదని, కాబట్టి స్థానిక సంస్థల్ని ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదులుగా రాజకీయ శిక్షణ శాలలుగా గుర్తించి ఏర్పరచారు. "స్థానిక ప్రభుత్వం" అంటే "ఒక స్థానిక ప్రాంతానికి పరిమితమై వారికి బాధ్యత వహిస్తూ ఆ స్థానిక ప్రాంత ప్రజల అవసరాలను తీరుస్తూ చట్ట పరిధిలో వారిపై పన్నులను విధించడానికి అవసరమైన అధికారం గల సంస్థ".

స్థానిక సంస్థలను వాటిని ఏర్పాటు చేసే ప్రదేశాన్ని బట్టి మౌలికంగా రెండు భాగాలుగా విభజించవచ్చు. అవి: (1) పట్టణ స్థానిక ప్రభుత్వాలు (2) గ్రామీణ స్థానిక ప్రభుత్వాలు. పట్టణ స్థానిక ప్రభుత్వాలను జనాభా ఆధారంగా తిరిగి పురపాలక సంఘాలు (Municipalities), నగరపాలక సంస్థ, మహానగర ప్రాంతాలు (Metropolion Cities) అనే రకాలుగా విభజించవచ్చు.

పంచాయితీ రాజ్ వ్యవస్థగా పిలువబడుతున్న గ్రామీణ స్థానిక ప్రభుత్వాలలో గ్రామ పంచాయితి మండల ప్రజాపరిషత్ (ఇది వరకు పంచాయితి సమితులుగా పిలువబడేవి) జిల్లా ప్రజా పరిషత్తులు చర్చకు వస్తాయి.

కొన్ని పరిమితుల దృష్ట్యా స్థానిక ప్రభుత్వాలు అనే ఈ భాగంలో నగర, గ్రామీణ స్థానిక ప్రభుత్వాలు రెండింటిని గూర్చి

BRAOU

వివరంగా చర్చించడం సాధ్యం కానందున పంచాయితీరాజ్ విధానం పైనే ఎక్కువ దృష్టి కేంద్రీకరించటం జరిగింది.

## 12.2. స్థానిక సంస్థల ఏర్పాటు

స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో రాజ్యాంగబద్ధమైన ప్రభుత్వం ఏర్పడిన తరువాత వివిధ రంగాలలో అనేక మార్పులు వచ్చాయి. రాజ్యాంగ ఆశయాల సాధనకు అనుగుణంగా ఎన్నో సంస్థలు, రకరకాల కార్యక్రమాలు రూపొందించటం జరిగింది. అన్ని రంగాలలో సత్వర ఆర్థికాభివృద్ధి సాధించడానికై పంచవర్ష ప్రణాళికలు ఏర్పరచారు. ఈ వ్యూహాలు, కార్యక్రమాలు పటిష్ఠంగా అమలు పరచడానికి వాటిలో లబ్ధిదారులందరిని భాగస్వాములుగాచేయాలనే ఆలోచనలు బయలుదేరాయి. వాటిలో ఒక భాగమే పంచాయితీ రాజ్ సంస్థల రూపకల్పన. పంచాయితీ రాజ్ వ్యవస్థను భారతదేశాభివృద్ధికి రూపొందించుకున్న స్వదేశీ నమూనాగా అభివర్ణింపవచ్చు.

భారతదేశం వలస పాలన నుండి విముక్తి చెందిన తరువాత రూపొందిన విధానాలలో సత్వర గ్రామీణాభివృద్ధి సాధించడం ప్రధానాంశం. భారత దేశం వ్యవసాయిక దేశం కావడం, అధిక సంఖ్యాక ప్రజలు గ్రామాలలోనే నివసించడం దీనికి ప్రధాన హేతువు. స్వాతంత్ర్యానంతరం దేశంలో ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అక్టోబర్ 2, 1952 లో జాతీయాభివృద్ధి కార్యక్రమాలను ప్రయోగాత్మకంగా 55 బ్లాకులలో ప్రారంభించింది. ఈ కార్యక్రమాలను దేశంలోని మిగతా ప్రాంతాలకు విస్తరింపజేసే ఉద్దేశంతో మరుసటి సంవత్సరమే అంటే 1953 అక్టోబర్ 2వ తేది నుండి జాతీయ విస్తరణ సేవా పథకాలను ప్రవేశపెట్టింది. అయితే కొద్ది కాలంలోనే దేశంలోని అన్ని రాష్ట్రాలలోనూ సమాజాభివృద్ధి కార్యక్రమాల సంఖ్య అనూహ్యంగా పెరిగి అవి ఏ ఉద్దేశం కోసం ప్రారంభించబడ్డాయో ఆ ఆశయాలు నెరవేరలేవని తేలిపోయింది. సమాజాభివృద్ధి కార్యక్రమాలలో ప్రజలు పాలుపంచుకోలేక పోవడం వలన ఈ పథకాలు అనుకున్నంత ఫలితాలు ఇవ్వలేకపోయాయి. అలాగే అవి ప్రజలలోఏలాంటి ఆసక్తిని కూడా కలిగించలేదు. ఈ పథకాల సంఖ్య గణనీయంగా పెరగడం మూలంగా వీటిపై రాజకీయ నాయకుల నియంత్రణ కొరవడింది. ఈ పథకాల నిర్వహణలో సమన్వయం లోపించి అమలులో జాప్యం వంటి సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ప్రభుత్వం తరపున ఈ పథకాల అమలుకు బాధ్యతవహించే ఉద్యోగి బృందం కూడా లాభాపేక్షతో స్వార్థ భావం అలవర్చుకోవడం, ప్రజలకు ప్రయోజనాలు కల్పించడం తమ దయాదాక్షిణ్యాల పైన ఆధారపడివుంటుందని భావించడం వంటి సమస్యల మూలంగా సమాజాభివృద్ధి కార్యక్రమాలు విఫలమయ్యాయి.

BRAOU

### 12.2.1 స్థానిక సంస్థల ఆవశ్యకత

స్వతంత్ర్య భారత దేశంలో స్థానిక సంస్థలు అభివృద్ధి చెందడానికి అనేక పరిస్థితులు దోహదం చేశాయి. అందులో ప్రధానమైనవి :

- పైన వివరించినట్లు అభివృద్ధి ప్రక్రియలో ప్రజలనుభాగస్వాములుగా చేయడంలో సమాజాభివృద్ధి కార్యక్రమాలు (CDP) విఫలం కావడం ;
- గ్రామాలు స్వయం సమృద్ధి చెందినవిగా విలసిల్లడానికి గాంధీజీ ప్రతిపాదించిన గ్రామ రాజ్య తాత్విక భావన ప్రభావం ప్రణాళికా రచయితలపై అమితంగా వుడటం ;

- గ్రామాలు నిజమైన స్వపరిపాలనా సంస్థలుగా వర్ధిల్లడానికి గ్రామ పంచాయితీలను ఏర్పాటు చేయాలనీ, అవి తమ విధులను స్వతహాగా నిర్వర్తించడానికి కావలసిన అధికారాలను రాష్ట్ర ప్రభుత్వాలు దాఖలు పరచాలని రాజ్యాంగంలో 40వ ప్రకరణం ఆదేశించడం ;

- క్రమబద్ధమైన ఆర్థికాభివృద్ధి సాధనకై రచించుకున్న పంచవర్ష ప్రణాళికలు పటిష్టంగా అమలు పరచడానికి క్రింది స్థాయిలో ఒక దృఢమైన పాలనా వ్యవస్థ అవశ్యకతను గుర్తించడం ;

- ప్రజాస్వామ్య వ్యవస్థ పునాదులను పటిష్టం చేయడానికి కింది స్థాయిలో స్థానిక సంస్థలను ఏర్పాటు చేయాలనే ఆలోచనలు బలపడటం.

### 12.2.2 బల్వంతరాయ్ మెహతా కమిటీ

పై కారణాల నేపథ్యంలో జాతి పునర్నిర్మాణంలో ప్రజలను భాగస్వాములుగా చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 1957 జనవరిలో బల్వంతరాయ్ మెహతా అధ్యక్షతన ఒక అధ్యయన బృందాన్ని నియమించింది. ఈ కమిటీ అధ్యయనానికి సంబంధించిన ప్రధానాంశాలు :

- సమాజాభివృద్ధి, జాతీయ విస్తరణ సేవా కార్యక్రమాల పనితీరును అధ్యయనం చేయడం, క్రింది స్థాయి గ్రామ పంచాయితీలతో పై స్థాయిలో గల ప్రజా సంస్థలతో వ్యవస్థాగత సంబంధాలను నెలకొల్పడంలో గల సమస్యలను పరిశీలించడం ;

- శాంతి భద్రతలు, న్యాయ, శిస్తు పాలనకు సంబంధించిన కొన్ని అంశాలు మినహాయించి దశల వారిగా జిల్లా అభివృద్ధి దానికి సంబంధించిన మొత్తం సాధారణ పాలనను ప్రజా సంస్థలే చేపట్టి నిర్వహించేటట్లు జిల్లా పాలనను పునర్వ్యవస్థీకరించడం.

బల్వంతరాయ్ మెహతా సంఘం దేశంలో అమలు పరచబడుతున్న సమాజాభివృద్ధి, జాతీయ విస్తరణ సేవా కార్యక్రమాల పనితీరును పరిశీలించి ఒక నివేదికను సమర్పించింది. బల్వంతరాయ్ మెహతా కమిటీ తన నివేదికలో కమిటీ ప్రజాస్వామ్య వికేంద్రీకరణ కోసం మూడు అంచెలతో కూడిన పంచాయితీరాజ్ వ్యవస్థ ఏర్పాటుకు సిఫారసు చేసింది. ఫలితంగా దేశంలో పంచాయితీరాజ్ వ్యవస్థకు అంకురార్పణ జరిగింది. ఈ సంఘం సిఫారసులకనుగుణంగా జిల్లా పాలనను పునర్వ్యవస్థీకరణ చేయడానికి వివిధ రాష్ట్రాలు పూనుకున్నాయి. పంచాయితీ రాజ్ సంస్థలను దేశంలో మొదటి సారి స్థాపించిన ఘనత రాజస్థాన్‌కు (అక్టోబర్ 2, 1959) ఆ తరువాత ఆంధ్రప్రదేశ్ (నవంబర్ 1, 1959) కు దక్కుతుంది.

బల్వంతరాయ్ మెహతా సంఘం ఒక అంచెతో మరో అంచెకు సంబంధం గల మూడు అంచెల పంచాయితీరాజ్ వ్యవస్థ ఏర్పాటుకు సూచించింది. గ్రామ స్థాయిలో గ్రామ పంచాయితీ, కొన్ని గ్రామాల సముదాయమైన ఇదివరకటి బ్లాకు స్థాయిలో పంచాయితీ సమితి, జిల్లాస్థాయిలో జిల్లా పరిషత్ ఏర్పాటు చేయాలని ఈ సంఘం సిఫారసు చేసింది. ఈ సంఘం నివేదికలో ప్రధానమైనది గ్రామ పంచాయితీ మాత్రమే. ఇందులో ముఖ్యంగా వార్డు సభ్యుల ఎన్నికకు మాత్రమే ప్రత్యక్ష ఎన్నికలుంటాయి. ఈ సభ్యులందరు కలసి తమ నుండి సర్పంచ్ ఉప సర్పంచ్‌లను ఎన్నుకుంటారు. వివిధ గ్రామ పంచాయితీల సర్పంచులందరు పంచాయితీ సమితిలో పదవిరీత్యా సభ్యులుగా ఉంటారు. వీరందరు తమలోనుండి ఒకరిని సమితి అధ్యక్షుడు, మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు. అదే రకంగా జిల్లాకు సంబంధించినంతవరకు జిల్లాలోని

BRAOU

వివిధ పంచాయితీ సమితుల అధ్యక్షులందరు జిల్లా పరిషత్తులో పదవిరీత్యా సభ్యులుగా ఉంటారు. వీరు తమలో నుండి ఒకరిని జిల్లాపరిషత్ చైర్మన్‌గా మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. అంటే గ్రామ పంచాయితీలలోని వార్డు మెంబర్ల ఎన్నికకు తప్ప మిగతా పదవుల ఎన్నికకు పరోక్ష ఎన్నిక పద్ధతిని ఈ సంఘం సూచించింది. ఈ సంఘం తన సిఫారసులలో పంచాయితీ వ్యవస్థలోని మధ్య అంచె అయిన పంచాయితీ సమితికి అధిక ప్రాధాన్యత నిచ్చింది. అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పన, అమలులో పంచాయితీ సమితికి అధిక ప్రాధాన్యత ఉండాలని, వివిధ పంచాయితీ సమితుల కార్యక్రమాలను సమన్వయ పరిచే సంస్థగా మాత్రమే జిల్లా పరిషత్ వ్యవహరించాలని సూచించింది.

మేఘాలయ, నాగాలాండ్ తప్ప దేశంలోని మిగతా రాష్ట్రాలన్ని కొన్ని సవరణలతో పంచాయితీరాజ్ వ్యవస్థలను అమలు పరచడానికి చట్టాలు చేశాయి. అయితే ఈ సంస్థల స్వరూప స్వభావాలలో మనకు కొన్ని భేదాలు కన్పిస్తాయి. బల్వంతరాయ్ మెహతా కమిటీ సూచించిన మూడు అంచెల విధానాన్ని దేశంలోని 15 రాష్ట్రాలు అమలు చేశాయి. కేరళ, కాశ్మీర్ ఒకే అంచె (కేవలం గ్రామ పంచాయిత్)ను ఏర్పాటు చేసుకున్నాయి. కర్నాటక, హిమాచల్ ప్రదేశ్, ఒరిస్సా, హర్యానా రాష్ట్రాలు రెండు అంచెల (గ్రామ పంచాయితీలు, పంచాయితీ సమితులు) పంచాయితీరాజ్ విధానాన్ని ప్రవేశపెట్టాయి. మొదట్లో పశ్చిమ బెంగాల్ నాలుగు అంచెల విధానాన్ని 1973 వరకు ఆ తరువాత మూడు అంచెల విధానాన్ని (1978) ప్రవేశపెట్టింది. ప్రస్తుతం పశ్చిమ బెంగాల్‌లోని మార్క్సిస్టు ప్రభుత్వం ఈ సంస్థలలో కొన్ని మౌలిక సంస్కరణలు చేపట్టింది. దీని వలన బ్లాకు స్థాయి ప్రణాళికా కమిటీలు జిల్లాస్థాయి ప్రణాళికా కమిటీల ఏర్పాటు చేయబడ్డాయి. బ్లాకు స్థాయి కమిటీలకు పంచాయితీ సభాపతి, జిల్లాస్థాయి ప్రణాళికా కమిటీలకు జిల్లా పరిషత్ సభాపతి అధ్యక్షులుగా, బ్లాకు స్థాయిలో BDO మెంబర్ సెక్రెటరీగా, జిల్లాస్థాయిలోని జిల్లా మెజిస్ట్రేట్ మెంబర్ సెక్రెటరీగా ఉంటారు. పశ్చిమ బెంగాల్‌లోని పంచాయితీరాజ్ సంస్థలకు క్రమం తప్పకుండా ఎన్నికలు నిర్వహిస్తున్నందున ఇవి ప్రజలలోఎంతో కుతూహలాన్ని కలిగిస్తున్నాయని కొన్ని అధ్యయనాల వల్ల తెలుస్తుంది. అలాగే నాగాలాండ్‌లో గ్రామ కౌన్సిల్స్, గ్రామ అభివృద్ధి బోర్డులు (Village Development Boards) అమలులో ఉన్నాయి.

BRAOU

ఈ విధంగా ఈ సంస్థల స్వరూప స్వభావాలలో కొన్ని భేదాలున్నట్లే వివిధ రాష్ట్రాలలో వీటి అమలు ఒకేసారి జరుగలేదు. వీటిని రాజస్తాన్, ఆంధ్రప్రదేశ్, అస్సాం, కర్నాటక, ఒరిస్సా రాష్ట్రాలు 1959 లో స్థాపిస్తే ; బీహార్, గుజరాత్, పంజాబ్, హర్యానా, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్‌లు 1961లోస్థాపించాయి. అలాగే మూడు అంచెల పంచాయితీరాజ్ వ్యవస్థలు గల రాష్ట్రాలలో ఒక రాష్ట్రానికి, మరో రాష్ట్రానికి కూడా భేదం ఉంది.

**అభ్యాసం**

భారతదేశంలో పంచాయితీరాజ్ వ్యవస్థ ఏర్పడ్డానికి దారితీసిన కారణాలను సమీక్షించండి.

## 12.3 ఆంధ్రప్రదేశ్‌లో పంచాయితీరాజ్

బల్వంతరాయ్ మెహతా సంఘం సిఫారసుల ననుసరించి 1959 నవంబర్ 1న అమలులోకి వచ్చిన పంచాయితీరాజ్ విధానం జిల్లా పరిషత్తుల చట్టం 1959, గ్రామ పంచాయితీల చట్టం 1964 ఆధారంగా పనిచేస్తుండేది. దాని ప్రకారం గ్రామ స్థాయిలో గ్రామ పంచాయితీ, బ్లాకు స్థాయిలో పంచాయితీ సమితి, జిల్లా స్థాయిలోజిల్లా పరిషత్తు అనే మూడు అంచెల పంచాయితీ రాజ్ విధానం అమలు పరచబడింది. ఈ చట్టాల ప్రకారంగా ఏర్పాటయిన పంచాయితీరాజ్ వ్యవస్థను గురించి కొన్ని వివరాలు :

### 12.3.1 గ్రామ సభ

1964 గ్రామ పంచాయితీల చట్టంలో గ్రామ స్థాయిలో 'గ్రామసభ'గా పిలువబడే గ్రామ సాధారణ సభ ప్రస్తావన కూడా ఉంది. అయితే ఇది సంవత్సరానికి రెండుసార్లు సమావేశం కావాలని ఉన్నా ఆ విధంగా సమావేశమైన దాఖలాలు లేవని కొన్ని అధ్యయనాల వల్ల తెలుస్తుంది.

### 12.3.2 గ్రామ పంచాయితి

ప్రతి గ్రామ పంచాయితి జనాభా ప్రాతిపదికన నిర్ణయించబడుతుంది. దాని సభ్యుల సంఖ్య కూడా జనాభా ఆధారంగా 5 నుండి 17 వరకు ఉంటుంది. గ్రామ పంచాయితీ సభ్యులు ప్రత్యక్షంగా ప్రజలచే ఎన్నుకోబడేవారు. దీని సభ్యుల ఎన్నికల కోసం గ్రామ పంచాయితీని కొన్ని వార్డులుగా విభజించారు. వీరిని వార్డు మెంబర్లు అంటారు. ప్రత్యక్షంగా ఎన్నుకోబడిన వార్డు మెంబర్లందరు కలిసి తమలో నుండి ఒకరిని గ్రామ పంచాయితీ సర్పంచ్, ఉపసర్పంచ్‌గా ఎన్నుకుంటారు. వార్డు మెంబర్ల ఎన్నికలలో హరిజనుల, గిరిజనుల, మహిళలకు కూడా రిజర్వేషన్లు కల్పించబడ్డాయి. గ్రామ పంచాయితీకి సంబంధించనంతవరకు సర్పంచ్‌కు తిరుగులేని అధికారాలు ఇవ్వబడ్డాయి.

BRAOU

### 12.3.3 పంచాయితి సమితి

మూడు అంచెల పంచాయితీ విధానంలో మధ్య అంచె అయిన పంచాయితీ సమితి అభివృద్ధి కార్యక్రమాల అమలు దృష్ట్యా అత్యంత ప్రాధాన్యతను వహించింది. రాష్ట్రంలో 1959 కి పూర్వం గల మొత్తం 448 బ్లాకులను 321 బ్లాకులుగా విభజించారు. ప్రతి బ్లాకు స్థాయిలో ఒక పంచాయితి సమితిని ఏర్పాటు చేశారు. వీటి జనాభా 80 వేల నుండి 2 లక్షల వరకు ఉంటుంది. పంచాయితి సమితి పరిధిలోని వివిధ గ్రామ పంచాయితీల సర్పంచ్‌లు, ఆ సమితికి సంబంధించిన శాసన సభ్యులు ఇందులో పదవి రీత్యా సభ్యులను, వీరిలో హరిజనులు, గిరిజనులు, మహిళలు సభ్యులుగా లేకపోతే వీరికి చెందిన ఇద్దరేసి సభ్యులను కో ఆప్ట్ చేసుకుంటారు. (మొత్తం ఆరుగురు) సమితి సభ్యులందరు కలిసి తమలో నుండి ఒకరిని అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడుగా ఎన్నుకుంటారు. రాష్ట్ర కేడర్‌కు చెందిన B.D.O. (Block Development Officer) అనే అధికారి, పంచాయితి కేడర్‌కు చెందిన వివిధ విస్తరణాధికారులుంటారు. B.D.O. పై సమితి ప్రెసిడెంట్ పాలనాపరమైన నియంత్రణాధికారం కలిగి ఉంటాడు. సమితి కార్యకలాపాలు 7స్థాయీ సంఘాల ద్వారా నిర్వహించబడేవి. అనేక రకాల అభివృద్ధి కార్యక్రమాల అమలుకు సమితి బాధ్యత వహిస్తుండేది.

### 12.3.4 జిల్లా పరిషత్

ఆంధ్రప్రదేశ్ లోని పంచాయితీ రాజ్ వ్యవస్థలో అత్యున్నత సంస్థ జిల్లా పరిషత్ జిల్లా పరిధిలోని ఆయా సమితుల ప్రెసిడెంట్లు ఆ జిల్లాకుచెందిన MLA లు, MP లు పదవిరీత్యా సభ్యులు. జిల్లా కలెక్టర్ కూడా ఇందులో సభ్యుడే. వీరే గాక హరిజనులు (2), గిరిజనులు (2), మహిళలు (2), గ్రామీణాభివృద్ధిలో అనుభవం గల మరో ఇద్దరిని కో ఆప్ట్ చేసుకునేవారు. జిల్లా పరిషత్ కార్య నిర్వాహణాధికారిని D.D.O. (District Development Officer) గా పిలుస్తారు. సమితిమాదిరిగానే జిల్లా పరిషత్ కార్యకలాపాలన్ని నిర్వహించడానికి 7 స్థాయీ సంఘాలుండేయి. జిల్లా కలెక్టర్ వీటి సమావేశాలకు అధ్యక్షత వహించేవాడు.

**అభ్యాసం**

పంచాయితి సమితి నిర్మాణాన్ని వివరించండి.

BRAOU

### 12.4 ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ వ్యవస్థలో మార్పులు

బల్వంతరాయ్ మెహతా సిఫారసుల మేరకు ఆంధ్రప్రదేశ్‌లో పంచాయితీరాజ్ వ్యవస్థలను ఏర్పాటు గావించుకున్నది మొదలు నేటి వరకు దీని వ్యవస్థ స్వరూప స్వభావాలలో గణనీయమైన మార్పులు వచ్చాయి. 1967లో నియమించబడిన ఎమ్.టి. రాజు కమిటి సిఫారసుల మేరకు జిల్లా పరిషత్తుకు అదనంగా జిల్లా బోర్డులు వచ్చాయి. జిల్లా కలెక్టర్ దీని ఛైర్మన్, జిల్లా పరిషత్ అధ్యక్షుడు దీని సభ్యుడు. అలాగే 1968లో నియమించిన వెంగళరావు కమిటి, 1972లో నరసింహం అధ్యక్షతన గల ఉన్నతాధికార సంఘం పంచాయితీరాజ్ సంస్థలను మరింత ప్రజాస్వామీకరించి గ్రామీణాభివృద్ధి సాధనాలుగా తీర్చిదిద్దడానికి కొన్ని నిర్మాణాత్మకమైన మార్పుల్ని సూచించాయి.

**వెంగళరావు కమిటి సిఫారసులలో ప్రధానమైనవి :**

★ పంచాయితీ బ్లాకులు, రెవెన్యూ ప్రాంతాల పరిధి ఒకే విధంగా ఏర్పాటుచేయాలి.

★ స్థాయీ సంఘాల సంఖ్య తగ్గించాలి.

★ జిల్లా అభివృద్ధి బోర్డులను రద్దుచేసి, వాటి బాధ్యతలు జిల్లా పరిషత్తుకు అప్పగించాలి.

★ జిల్లా స్థాయిలోని అధికార్లందరిని జిల్లా పరిషత్ అధీనంలోకి తేవాలి.

## నరసింహం కమిటి సిఫారసులలో ప్రధానమైనవి :

నరసింహం అధ్యక్షతన 1971లో ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. ఈ సిఫారసులను పురస్కరించుకొని తిరిగి నరసింహం అధ్యక్షతనే 1979 - 80 లో మరో సంఘాన్ని నియమించింది. రెండవ నివేదిక ఫిబ్రవరి 26, 1981 తేదీన సమర్పించింది. నరసింహం అధ్యక్షతన ఏర్పాటు చేసిన (1971, 1981) రెడు కమిటీల సిఫారసుల ప్రధానాంశాలు :

★ గ్రామ పంచాయితి సర్పంచ్, పంచాయితి సమితి సభ్యులు, జిల్లా పరిషత్ సభ్యులు అందరూ ఓటర్లచే ప్రత్యక్షంగా ఎన్నుకోబడాలి.

★ శాసన సభ్యులు, పార్లమెంటు సభ్యులు, జిల్లా కలెక్టర్‌కు పంచాయితీ వ్యవస్థలో ప్రమేయం ఉండరాదు.

★ పంచాయితీ రాజ్ వ్యవస్థ రాజ్యాంగ భద్రత చేకూర్చేందుకు "స్థానిక ప్రభుత్వాలు" అన్న పేరుతో రాజ్యాంగం ఒక అధ్యయనాన్ని చేర్చాలి.

★ రాష్ట్ర ప్రభుత్వం - స్థానిక సంస్థల మధ్య ఆదాయాలను పంపిణీ చేయడానికి రాష్ట్ర స్థాయిలో ఒక ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేయాలి.

★ స్థానిక సంస్థల ఎన్నికలకు ఒక ప్రత్యేక ఎన్నికల సంఘం ఉండాలి.

★ అధికారాల వికేంద్రీకరణ జరగాలి.

★ ప్రణాళికను వికేంద్రీకరించడానికి జిల్లా స్థాయి ప్రణాళికా రచన జరగాలి, జిల్లా పరిషత్తు పరిపాలన కింద ఒక జిల్లా ప్రణాళికా బృందం, డాటా (గణాంక వివరాల) బాంకును నెలకొల్పాలి.

★ ప్రతి జిల్లా పరిషత్తుకు ఒక సీనియర్ IAS అధికారిని ప్రధాన కార్యనిర్వహణాధికారిగా నియమించి, అయనను SFDA, ITDA, CADA, DPAP మొదలైన ప్రత్యేక ఏజెన్సీలకు చైర్మన్‌గా చేయాలనీ, అభివృద్ధి శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులందరిని జిల్లా పరిషత్ నియంత్రణలోకి తేవాలనీ, బ్లాకు స్థాయి విస్తరణాధికారులందరినీ నియంత్రణ కింద ఉంచాలని సిఫారసులు చేసింది.

BRAOU

### 12.4.1 పంచాయితీ రాజ్ బిల్లు

వెంగళరావు, నరసింహం కమిటీల సూచనల నేపథ్యంలో జిల్లా పరిషత్తులు (1959), గ్రామ పంచాయితీల (1964) చట్టాలలో మార్పులు చేయడానికి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో పంచాయితీ రాజ్ బిల్లును కూడా ప్రవేశపెట్టింది. ఈ బిల్లులోని ప్రధానాంశాలు :

★ పంచాయితీ సమితి పరిధిలో గల వివిధ గ్రామపంచాయితీల సభ్యులందరు కలిసి పంచాయితీ సమితి ప్రెసిడెంటును ఎన్నుకోవాలి.

★ జిల్లా పరిషత్ చైర్మన్ ఆ జిల్లా పరిధిలో గల అన్ని పంచాయితీ సమితుల ప్రెసిడెంట్లు గాక ఆ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయితీ సర్పంచ్ లందరూ కలిసి ఎన్నుకోవాలి.

★ శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు కూడా పంచాయితీ సమితి లేదా జిల్లాపరిషత్తు అధ్యక్షులుగా ఎంపిక కావడానికి అర్హులే.

★ పంచాయితీ సమితి, జిల్లా పరిషత్‌ల లోని ప్రతి స్థాయీ సంఘం (Standing Committee) లో హరిజనులు, గిరిజనులు, మహిళలకు తప్పని సరిగా ప్రాతినిధ్యం కల్పించాలి.

★ పంచాయితీ సమితి, జిల్లా పరిషత్‌లలోని స్థాయీ సంఘాల సంఖ్యను 5 కు కుదించాలి.

★ జిల్లా పరిషత్‌లోని వివిధ స్థాయీ సంఘాలకు చైర్మన్‌గా ఉన్న జిల్లా కలెక్టర్‌కు ఇక ముందు జిల్లా పరిషత్తులో ఏలాంటి ప్రమేయం ఉండరాదు. జిల్లా పరిషత్ కార్యదర్శి బదులు ఒక IAS క్యాడర్ గల Chief Executive Officer ను నియమించాలి.

## 12.4.2 అశోక్ మెహతా కమిటీ

జాతీయ స్థాయిలోనూ పంచాయితీరాజ్ వ్యవస్థల పనితీరును సమీక్షించి సిఫారసులు చేయడానికి కొన్ని కమిటీలు, కమీషన్లను నియమించారు. వాటిలో జీ.వి.కే. రావు కమిటి, అశోక మెహతా కమిటీలు ప్రధానమైనవి. జనతా ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వం నియమించిన అశోక మెహతా సంఘం 1978 ఆగస్టులో తన నివేదికను సమర్పించింది. దీని ఆధారంగా కొన్ని రాష్ట్రాలు వాటి పంచాయితీ రాజ్ వ్యవస్థలలో కొన్ని సంస్కరణలు చేపట్టాయి. అశోక మెహతా సంఘం సిఫారసులలో ప్రధానమైవి :

★ మూడు అంచెల స్థానంలో రెండు అంచెల పంచాయితీరాజ్ సంస్థలు ఉంటాయి. అవి: జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్తులు, కింది స్థాయిలో మండల పంచాయితీలుగా ఉంటాయి.

★ ఇదివరకటి పంచాయితీ సమితులను రద్దుపరచి వాటి స్థానంలో 15,000 - 20,000 జనాభా గల ప్రాంతాన్ని ఒక మండలంగా విభజించి సమితులు నిర్వహించే విధులను వీటికి బదలాయించాలి.

★ ప్రతి మండలం పంచాయితీలో ప్రత్యక్షంగా ఎన్నుకోబడిన 15 గురు సభ్యులు ఉంటారు.

★ రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేయబడిన ఎన్నికల కమీషన్ చే పంచాయితీ సంస్థల ఎన్నికలు నిర్వహించాలి. ఎన్నికలు క్రమం తప్పకుండా ప్రతి 5 సంవత్సరాల కొకసారి నిర్వహించాలి.

★ అభివృద్ధి కార్యక్రమాల పట్ల స్పష్టమైన వైఖరిని కలిగి ఉండటానికి పంచాయితీల ఎన్నికలు పార్టీల ప్రాతిపదికన జరగాలి.

★ కాలానుగుణంగా పంచాయితీ సంస్థల పనితీరుమ సమీక్షించడానికి రాష్ట్ర ప్రభుత్వాలు విశ్వ విద్యాలయాల వంటి స్వయం ప్రతిపత్తిగల స్వాధీన సంస్థలకు అప్పగించాలి.

★ గ్రామీణ - పట్టణ ప్రాంతాల మధ్య సరైన సంబంధాలు కలిగి ఉండేటట్లు చూడాలి.

## 12.4.3. 1981లో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన మార్పులు

పైన వివరించిన కమిటీల సిఫారసుల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి టంగుటూరి అంజయ్య హయాంలో (1981లో) పంచాయితీ రాజ్ వ్యవస్థలో మౌలికమైన మార్పులు చోటు చేసుకుని ఏడు సంవత్సరాల వ్యవధి తరువాత 1981లోఎన్నికలు జరిగాయి. అప్పటి ముఖ్యమంత్రి టంగుటూరి అంజయ్య దీనిని ఆంధ్రప్రదేశ్‌లో పంచాయితీ



BRAOU

రాజ్ సంస్థలు పునరుజ్జీవనం పొందడంగా అభివర్ణించారు. ముఖ్యంగా ఈ ఎన్నికల మూలంగా పంచాయితీ రాజ్ వ్యవస్థలో విప్లవాత్మకమైనమార్పులు వచ్చాయి. రాష్ట్రంలోని 330 పంచాయితీ సమితులలోని 114 సమితులలో బలహీన వర్గాల అభ్యర్థులే గెలుపొందారు. 44 సమితులలో హరిజనులు, 36 సమితులలో గిరిజనులు, 33 సమితులకు మహిళలు ఎన్నికయ్యారు. రాష్ట్రంలోమొదటి సారి అధిక సంఖ్యలో యువకులే వివిధ పదవులకు ఎంపికయ్యారు. అలాగే కొన్ని జిల్లా పరిషత్తులు, గ్రామ పంచాయితీలు, ఎస్.సి., ఎస్.టి. లకు రిజర్వు చేయబడ్డాయి.

ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్‌లలో చేపట్టిన సంస్కరణల మూలంగా గ్రామ పంచాయితీ వార్డు మెంబర్లతో (సభ్యులు) పాటు సర్పంచ్, సమితి అధ్యక్షులు ప్రజలచే ప్రత్యక్షంగా ఎంపిక అవుతారు. పంచాయితీ సమితి పరిధిలోగల గ్రామ పంచాయితీ సర్పంచ్‌లందరు పంచాయితీ సమితులలో అలాగే జిల్లా పరిషత్తు పరిధిలో గల వివిధ సమితుల ప్రెసిడెంట్లు జిల్లా పరిషత్తులో పదవి రీత్యా సభ్యులుగా ఉన్నారు. M.L.A., MP లు కూడా జిల్లాపరిషత్తులో పదవిరీత్యా సభ్యులు కూడా ఉన్నారు. వీరితోపాటు కో-ఆప్టెడ్ సభ్యులు కూడా ఉన్నారు. జిల్లా పరిషత్తులోని సభ్యులు తమలో నుండి ఒకరిని చైర్మన్, వైస్-చైర్మన్‌గా ఎన్నుకొనేవారు. ఈ పదవులకు M.L.A., MP లు కూడా అర్హులే. ఈ మార్పులు చాలా మేరకు నరసింహం కమిటీ సిఫారసులకు అనుగుణంగానే ఉన్నాయి. 1981లోకొన్ని మార్పులతో ప్రవేశ పెట్టిన ఈ పంచాయితీ రాజ్ విధానం 13-9-1986 వరకు అమలులో ఉంది.

## 12.4.4. 1986లో చేసిన మార్పులు

BRAOU

1986లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం నాటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు "పాలనను ప్రజా ముంగిళ్లకు తీసుకు పోవడం" అనేనినాదంతో ప్రభుత్వం మాండలిక వ్యవస్థను ప్రవేశపెట్టడం మూలంగా పంచాయితీరాజ్ వ్యవస్థలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. దీని ద్వారా 1959 జిల్లా పరిషత్తుల చట్టం రద్దుచేయబడి "ఆంధ్రప్రదేశ్ మండల ప్రజా పరిషత్తులు, జిల్లా ప్రజాపరిషత్తులు, జిల్లా అభివృద్ధి సమీక్షా మండలుల చట్టం 1986" జనవరి 15, 1987 నుండి అమలులోకి వచ్చి రాష్ట్రంలో పంచాయితీ రాజ్ సంస్థల్ని పునర్వ్యవస్థీకరించటం జరిగింది. ఫలితంగా పంచాయితీ సంస్థలలోని అన్ని స్థాయిల అధ్యక్షుల పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు జరిగాయి. మండల ప్రజా పరిషత్, జిల్లా అధ్యక్షులు పార్టీ ప్రాతి పదికన ఎన్నుకోబడ్డారు. పునర్వ్యవస్థీకరించబడిన పంచాయితీ రాజ్ సంస్థల నిర్మాణం, విధులు కింది విధంగా ఉంటాయి :

### * గ్రామ సభ :

ప్రతి గ్రామానికి ఒక గ్రామసభ ఉంటుంది. గ్రామ ఎన్నికల జాబితాలో ఓటర్లుగా నమోదు చేసుకున్న వారందరూ ఇందులో సభ్యులుగా ఉంటారు. ఇది సంవత్సరానికి రెండుసార్లు సమావేశమవుతుంది. ఈ సమావేశానికి గ్రామ పంచాయితీ సర్పంచ్ అధ్యక్షత వహిస్తాడు. ఈ సమావేశాలలో గ్రామ పంచాయితీ ఖాతాలు, ఆడిట్ నివేదికలు, సాంవత్సరిక పాలనా నివేదికలను ప్రస్తుత సంవత్సరానికి చేపట్టే కార్యకలాపాలను గూర్చి చర్చిస్తారు.

### * గ్రామ పంచాయితీ :

గ్రామ పంచాయితీకి సంబంధించినంతవరకు జనాభా ప్రాతిపదికన ప్రతి 3,000 జనాభా గల గ్రామానికి లేదా రెవెన్యూ గ్రామానికి ఒక గ్రామ పంచాయితీ ఉంటుంది. జనాభా ఆధారంగా పంచాయితీ సభ్యుల సంఖ్య 5 నుండి 9 వరకు ఉంటుంది. సభ్యుల ఎన్నికలకు గ్రామాన్ని కొన్ని వార్డులుగా విభజిస్తారు. సర్పంచ్, సభ్యులు ఏకకాలంలోనే ప్రత్యక్షంగా 5

సంవత్సరాల కాలానికి ఎన్నుకోబడుతారు. ఎన్నుకోబడిన సభ్యులలో ఒకరిని ఉపసర్పంచ్ గా ఎన్నుకుంటారు. ఆ గ్రామానికి సంబంధించిన రోడ్లు, భవనాల నిర్మాణం, వీధి దీపాలు, వీధులను శుభ్రం చేయడం, జనన మరణాల నమోదు లాంటివి గ్రామ పంచాయితీ నిర్వహించే విధులు. ఈ విధుల అమలుకై అవసరమైన ఆర్థిక వనరులలో మండల ప్రజా పరిషత్ ఇచ్చే నిధులు, విరాళాలు ; గ్రామ పరిధిలోని ఇండ్లు, వాహనాలపై పన్నుల రూపంలో వచ్చే నిధులు ప్రధాన ఆదాయ మార్గాలు.

## ★ మండల ప్రజా పరిషత్ :

ఆంధ్రప్రదేశ్‌లో ఇదివరకటి 330 పంచాయితీ సమితులను పరిపాలనా సౌలభ్యం కోసం, పాలనా వ్యవస్థను సామాన్య మానవుడి చేరువలోకి తీసుకు పోయే నిమిత్తం 1104 మండల ప్రజాపరిషత్తులుగా విభజించబడ్డాయి. దీని ప్రకారం మండల ప్రజా పరిషత్ పరిధిలోని గ్రామ పంచాయితీ సర్పంచ్ లందరు, ఆ ప్రాంతానికి చెందిన శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు మండల ప్రజా పరిషత్తులో పదవి రీత్యా సభ్యులుగా ఉంటారు. ఒకవేళ మైనారిటీలు, స్త్రీలు ఇందులో సభ్యులు కాకపోతే వారిని నామ నిర్దేశం (Nominate) చేసుకోవడం జరుగుతుంది. హరిజన, గిరిజనులకు వారి జనాభా ప్రాతిపదికన, స్త్రీలకు 9 శాతం రిజర్వేషన్లు కల్పించబడ్డాయి. మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడిని ఆ మండలంలో ఓటర్లందరు ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు. మండల పరిషత్ సభ్యులు తమలో నుండి ఒకరిని ఉపాధ్యక్షులుగా ఎన్నుకుంటారు. మండలాధ్యక్షుల ఎంపిక పార్టీ ప్రాతిపదికన జరుగుతున్నందున గెలిచిన తరువాత పార్టీ ఫిరాయించ వీలు లేకుండా చట్టం చేయబడింది. ప్రతి మండలానికి M.D.O (Mandal Development Officer) అనే అధికారి ఉంటాడు. ఇతనిపై మండలాధ్యక్షుడు పాలనా నియంత్రణ కలిగి ఉంటాడు.

మండల ప్రజా పరిషత్ నిర్వహించే విధుల్లో విద్య, సాంఘిక సంక్షేమం, సమాజాభివృద్ధి, పశుపోషణ, ప్రజారోగ్యం, కమ్యూనికేషన్లు, సహకారం, కుటీర పరిశ్రమలు, మహిళాభ్యుదయం ప్రధానమైనవి. ఈ విధులను నిర్వహించడానికి అవసరమైన డబ్బు మండలానికి ప్రభుత్వం బదిలీ చేసిన నిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే గ్రాంట్లు, భూమి శిస్తులో భాగం, చట్టం ప్రకారం పన్నులు, సర్ చార్జి వల్ల లభించే ఆదాయం, గ్రామ పంచాయితీల ద్వారా వచ్చే వాటా, ప్రజల ద్వారా లభించే విరాళాలు, ఇతర వ్యాపార సంస్థలనుండి వచ్చే ఆదాయం ప్రధాన ఆదాయ మార్గాలు.

BRAOU

## ★ జిల్లా ప్రజా పరిషత్తులు :

1986 చట్టం ప్రకారం ప్రతి జిల్లాకు ఒక జిల్లా పరిషత్ ఉంటుంది. ఇందులో పదవి రీత్యా సభ్యులుగా (Ex Officio), ఎంపిక కాబడిన వారు, నామ నిర్దేశం (Nominated) చేయబడిన సభ్యులు అనే మూడు రకాల సభ్యులు ఉంటారు. మండల ప్రజాపరిషత్ అధ్యక్షులందరు ఆ జిల్లాకు చెందిన శాసన సభ్యులు, పార్లమెంట్ సభ్యులు, జిల్లా కలెక్టర్, జిల్లా ప్రజా పరిషత్తులో పదవి రీత్యా సభ్యులుగా ఉంటారు. మైనారిటీ మతాలకు చెందిన ఒక సభ్యుడిని నామనిర్దేశం చేసుకొంటారు. అలాగే స్త్రీలు ఇందులో సభ్యులుగా లేకపోతే వారిని కో-ఆప్ట్ చేసుకోవడం జరుగుతుంది. జిల్లా ప్రజా పరిషత్ ఛైర్మన్‌ను ఆ జిల్లాలోని ఓటర్లందరు ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవులకు కూడా హరిజన, గిరిజన, వెనుకబడిన వర్గాల వారికి రొటేషన్ పద్ధతిన రిజర్వేషన్లు ఉంటాయి. ఛైర్మన్ ఇతర సభ్యులు 5 సంవత్సరాల వరకు పదవిలో ఉంటారు. జిల్లా పరిషత్ 6 స్థాయీ సంఘాల సహాయంతో తన విధులను నిర్వహిస్తుంది. ఇవి విద్య, సాంఘిక సంక్షేమం,స్త్రీ శిశు సంక్షేమం, విత్తం, ప్రజాపనులు, అభివృద్ధికి సంబంధించినవి. జిల్లా ప్రజా పరిషత్ ఛైర్మన్ అన్ని స్థాయీ సంఘాలకు అధ్యక్షుడిగా ఉంటాడు. ఇది కనీసం మూడు నెలలకొకసారైనా సమావేశం కావలసి ఉంటుంది.

విధులు :

జిల్లా పరిషత్ విధులలో ప్రధానమైనవి :

★ మండల ప్రజాపరిషత్ బడ్జెట్‌ను ఆమోదించడం

★ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధులు మండలాలకు పంపిణీ చేయడం,

★ మండల ప్రజా పరిషత్తులు తయారు చేసిన ప్రణాళికలను సంఘటిత పరచి జిల్లా ప్రణాళికను తయారు చేయడం,

★ మండలాలలో వివిధ పథకాలు అమలు జరిగేటట్లు చూడడం.

★ రెండు లేక మూడు మండలాలు కలసి ఉమ్మడిగా చేసే పనులను పర్యవేక్షించడం,

★ జిల్లా అభివృద్ధిపై ప్రభుత్వానికి సలహానివ్వడం.

ఆదాయ మార్గాలు :

జిల్లా ప్రజా పరిషత్తులకు వచ్చే ఆదాయ మార్గాలలో :

★ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలిచ్చే నిధులు,

★ చిన్న తరహా కుటీర పరిశ్రమల అభివృద్ధికై జాతీయ స్థాయి సంస్థలిచ్చే గ్రాంట్లు,

★ భూమి శిస్తులో వాటా

★ రాష్ట్రం నుండి బదలాయించబడే కొన్ని పన్నులు, రుసుములు

★ దేవాదాయ, ధర్మాదాయ సంస్థల నుండి లభించే ఆదాయం

★ ప్రభుత్వం నుండి వచ్చే తలసరి గ్రాంట్లు (రెండు రూపాయలు).

★ ప్రజలు, మండల ప్రజా పరిషత్తులిచ్చే విరాళాలు.

తొలగింపు :

గ్రామ పంచాయితీ సర్పంచ్, మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు, జిల్లా ప్రజా పరిషత్ అధ్యక్షున్ని ఏమైన అవినీతి అక్రమాలకు పాల్పడినా, కావాలని రాష్ట్ర ప్రభుత్వ ఆజ్ఞలను ధిక్కరించినా, అధికార దుర్వినియోగానికి పాల్పడినా పదవి నుండి తొలగిస్తారు.

ఉద్యోగులు :

పంచాయితీ రాజ్ ఉద్యోగులకు సంబంధించి గ్రామ పంచాయితీ స్థాయిలో, ఒకవేళ అది పెద్ద గ్రామపంచాయితీ అయితే కార్యనిర్వహణాధికారి ఉంటాడు. మండల ప్రజా పరిషత్‌లో మండల అభివృద్ధి అధికారి (Mandal Develop-

BRAOU

ment Officer), ఆయన క్రింద వివిధ విస్తరణాధికారులు (Extension Officers), గ్రామాభివృద్ధి అధికారులు, గుమస్తాలు ఉంటారు. జిల్లా ప్రజా పరిషత్ స్థాయిలో ఇతర అధికారులు ఉంటారు.

తెలుగుదేశం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పంచాయితీ రాజ్ విధానం చాలామేరకు అశోక్ మెహతా సంఘం సిఫారసులకు అనుగుణంగానే ఉన్నాయని చెప్పవచ్చు.

**అభ్యాసం**

మండల ప్రజాపరిషత్‌లను గురించి రాయండి

BRAOU

## 12.5 పంచాయితీరాజ్ 73వ రాజ్యాంగ సవరణ చట్టం

దేశంలోని మొత్తం పంచాయితీరాజ్ వ్యవస్థలోనే నిర్ణయాత్మకమైన మార్పులు వచ్చాయి. ఈ మార్పులు తలపెట్టింది కేంద్రప్రభుత్వమే కావడం గమనార్హం. దీనిని రాష్ట్రాల అధికారాలను హరించడానికి కేంద్రం తలపెట్టిన రాజకీయ చర్యగా కాంగ్రెసేతర రాష్ట్రాలు విమర్శించాయి.పంచాయితీ రాజ్‌కు సంబంధించిన రాజ్యాంగ సవరణల బిల్లును గూర్చి మాట్లాడుతూ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధి "రాజ్యాంగంలోని 40వ అధికరణ కింద అట్టడుగు స్థాయిలో స్థానిక స్వపరిపాలన అందించే విషయమై కేంద్రానికి నిర్దిష్టమైన బాధ్యతలున్నాయని, పంచాయితీరాజ్‌కు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించే ఉద్దేశంతో రాజ్యాంగాన్ని సవరించాలని, పంచాయితీరాజ్ సంస్థలను పునర్వ్యవస్థీకరించి పునరుత్తేజం చేయడానికి ఈ రాజ్యాంగ సవరణ అత్యావశ్యకమని' పేర్కొన్నారు.

అట్టడుగు స్థాయి వరకు ఆర్థిక, పాలనాధికారాలను వికేంద్రీకరించి ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత పటిష్టం చేసే ఉద్దేశంతో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 1989 మే నెలలో 64వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. లోకసభలో ఆమోదం పొందినప్పటికి ఆ బిల్లు రాజ్యసభలో వీగిపోయింది. సాధారణ ఎన్నికల తరువాత అధికారంలోకి వచ్చిన పి.వి.నరసింహారావు ప్రభుత్వం తిరిగి పంచాయితీ రాజ్‌కు సంబంధించిన 72వ రాజ్యాంగ సవరణల బిల్లును ప్రవేశపెట్టింది. ఈ బిల్లు డిశంబర్ 22, 1992న లోకసభ ఆమోదం, ఆ మరుసటి రోజే రాజ్యసభ ఆమోదం పొంది ఏప్రిల్ 20, 1993న భారత రాష్ట్రపతి ఆమోదంతో చట్టంగా రూపుదిద్దుకుంది. రాజ్యాంగ 72వ సవరణ బిల్లును 73వ రాజ్యాంగ సవరణ బిల్లుగా పిలుస్తారు. ఈ

చట్టం ఏప్రిల్ 24, 1993 నుండి అమలులోకి వచ్చింది. ఇది అన్ని రాష్ట్రాలకు వర్తించబడింది.

**73 వ రాజ్యాంగ సవరణ బిల్లులోని ప్రధానాంశాలు :**

★ ప్రతి గ్రామ పంచాయితీ పరిధిలో ఒక గ్రామసభ ఉంటుంది. ఇది రాష్ట్ర శాసనం ద్వారా సంక్రమించే విధులు, అధికారాలను నిర్వహిస్తుంది.

★ చిన్న రాష్ట్రాలు మినహా దేశ వ్యాప్తంగా మూడు అంచెల (గ్రామస్థాయి, బ్లాకు స్థాయి, జిల్లా స్థాయి) పంచాయితీ సంస్థలుంటాయి. 20 లక్షలకు మించని జనాభా గల చిన్న రాష్ట్రాలలో మధ్య స్థాయి పంచాయితీలు ఉండాలనే నిబంధన లేదు. (దీని వలన దేశంలోని పంచాయితీరాజ్ సంస్థల వ్యవస్థా నిర్మాణంలో సారూప్యత సాధించబడుతుందని భావన.)

★ రాష్ట్ర అసెంబ్లీలు, లోక్‌సభలకు జరిగే ఎన్నికల మాదిరిగానే పంచాయితీలలోని అన్ని అంచెల సభ్యులు, గ్రామ పంచాయితీ సర్పంచ్‌లను ప్రజలే ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు. అయితే మధ్య స్థాయి, జిల్లా స్థాయి పంచాయితీల అధ్యక్షులు పరోక్షంగా ఎన్నికకాబడతారు.

★ పంచాయితీల అన్ని అంచెల సభ్యులు ఎన్నికలను నిర్వహించడానికి, ఎన్నికల జాబితాను తయారుచేయడానికి,ఎన్నికల ప్రక్రియపై నియంత్రణ, నిర్దేశం కలిగి ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి రాష్ట్రగవర్నర్ నియమించే స్వతంత్ర్య ప్రతిపత్తిగల ఎన్నికల కమీషన్ ఏర్పాటవుతుంది.

★ గ్రామ పంచాయితీ అధ్యక్షులు మధ్యస్థాయి పంచాయితీలలోనూ, మధ్యస్థాయి పంచాయితీ అధ్యక్షులు జిల్లాస్థాయి, పంచాయితీలలోనూ పదవిరీత్యా సభ్యులుగా ఉంటారు. అలాగే M.L.A. లు, M.P. లు M.L.C.లు వారి ప్రాంతానికి చెందిన మధ్యస్థాయి, జిల్లా స్థాయి పంచాయితీలలో పదవిరీత్యా సభ్యులుగా ఉంటారు.

★ శాసనసభ,లోక్‌సభ మాదిరిగానే పంచాయితీరాజ్ సంస్థలలో కూడా జనాభాప్రాతిపదికన హరిజనులు, గిరిజనులకు సీట్లు కేటాయించారు. వీరు నామినేషన్, కోఆప్షన్ పద్ధతిన గాక ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకోబడతారు. అన్ని స్థాయిల పంచాయితీ సంస్థలలో కనీసం 30 శాతం సీట్లు మహిళలకు కేటాయిస్తారు. కేటాయించిన నియోజక వర్గాల నుండి ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారా వీరిని ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు. హరిజనులు, గిరిజనులకు కేటాయించిన కోటాలో 30 శాతం ఈ కులాలకు చెందిన మహిళలకు కేటాయిస్తారు. అయితే సాధారణ, రిజర్వుడు నియోజక వర్గాలలో మహిళలకు కేటాయించిన మొత్తం సీట్లు 30 శాతానికి మించరాదు.

★ వెనుకబడిన తరగతుల అభ్యర్థులకు రిజర్వేషన్లు కల్పించే విషయం ఆయా రాష్ట్రాలకు వదిలివేశారు.

★ ఎన్నికైన ప్రతి పంచాయితీ / సభ్యుడి పదవి కాలం 5 సంవత్సరాలు. ఏ కారణం చేతనైనా ఏదైనా పంచాయితీని రద్దు పరిస్తే లేదా ఎవరైనా సభ్యుడు తొలగించబడినా అలా చేసిన 6 నెలలలోగా ఆ పదవికి / సంస్థకు ఎన్నికలు నిర్వహించాలి. వీరు మిగతా కాలం వరకు మాత్రమే పదవి లోకొనసాగుతారు.

★ ఏ కారణం చేతనైనా శాసనసభ్యుడిగా కొనసాగడానికి / పోటీ చేయడానికి అర్హత కోల్పోయిన వ్యక్తి పంచాయితీ ఎన్నికలలోపోటీ చేయడానికి కూడాఅనర్హుడే.

BRAOU

★ పంచాయితీలకు అధికారాలు బాధ్యతలు రాష్ట్ర ప్రభుత్వం నుండి సంక్రమిస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శిక సూత్రాల పరిధిలో (ముఖ్యంగా రాజ్యాంగంలోని 11 వ షెడ్యూలు లో పొందుపరిచిన నేపథ్యంలో ఆర్థికాభివృద్ధి,సామాజిక న్యాయం సాధించడానికి తగు ప్రణాళికలు రూపొందించి, అమలు పరిచే బాధ్యత పంచాయితీలకు అప్పగిస్తారు)

★ పంచాయితీలకు తమ విధుల నిర్వహణ కవసరమైన వనరులు సమకూరుస్తారు. వాటికి ఆర్థిక పటిష్ఠత ఏర్పరుస్తారు. పన్నులు విధించడానికి, వసూలు చేయడానికి; నిర్దిష్టమైన కొన్ని పన్నుల నుండి వాటా, రాష్ట్ర సంఘటిత నిధి నుండి గ్రాంట్లు పొందటానికి రాష్ట్ర ప్రభుత్వం వాటికి అధికార మిస్తుంది.

★ స్థానిక సంస్థలస్థితిని సమీక్షించి,రాష్ట్ర - స్థానిక సంస్థల మధ్య ఆర్థిక వనరులు పంపిణీ చేయడంలో తగిన సూచనలు చేయడానికి ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి రాష్ట్రాలలో ఆర్థిక సంఘం ఏర్పాటు చేస్తారు. అలాగే రాష్ట్ర సంఘటిత నిధికి వచ్చే వనరులు మరిన్ని నిధులు సమకూరడంలో కేంద్ర ఆర్థిక సంఘం కూడా కేంద్ర ప్రభుత్వానికి తగిన సూచనలు చేస్తుంది.

★ స్థానిక స్థాయిలో ఆర్థికాభివృద్ధి, సామాజిక న్యాయం సాధించడానికి చేపట్టే ఇతర కార్యక్రమాలతో పాటు పంచాయితీలు తప్పని సరిగా చేపట్టి నిర్వహించాల్సిన కొన్ని నిర్దిష్టమైన కార్యక్రమాలు రాజ్యాంగంలో కొత్తగా చేర్చబడిన 11 వ షెడ్యూలు (ఆర్టికల్ 243 జి) లో పొందు పరిచారు. అవి: (1) వ్యవసాయం, (2) భూసార పరిరక్షణ, భూముల అభివృద్ధి, భూసంస్కరణల అమలు, (3) చిన్న నీటి పారుదల అభివృద్ధి, నిర్వహణ; (4) పశు సంరక్షణ, పాడి పరిశ్రమ, కోళ్ళ పెంపకం, (5) చేపల పెంపకం; (6) సామాజిక అడవులు, (7) అడవుల నుండి వచ్చే చిన్న తరహా ఉత్పత్తులు; (8) చిన్నతరహా పరిశ్రమలు, ఆహారం నిల్వచేసే పరిశ్రమలు, (9) భారీ గ్రామీణ కుటీర పరిశ్రమలు (10) గ్రామీణ గృహనిర్మాణం (11) మంచి నీటి సరఫరా , (12) పశుమేత, ఇంధనం; (13) రహదారులు, కాల్వర్టులు వంతెనలు మార్గాల నిర్వహణ; (14) గ్రామీణ విద్యుచ్ఛక్తి, పంపిణీ, (15) సాంప్రదాయేతర ఇంధన వనరులు, (16) పేదరిక నిర్మూలన కార్యక్రమాలు, (17) ప్రాథమిక, సెకండరీవిద్య; (18) సాంకేతిక వృత్తి పరమైన విద్య, (19) వయోజన విద్య, (20) గ్రంథాలయాలు, (21) సాంస్కృతిక కార్యక్రమాలు, (22) మార్కెట్లు, సంతల నిర్వహణ, (23) ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, డిస్పెన్సరీల నిర్వహణ, (24) కుటుంబ సంక్షేమం, (25) స్త్రీ శిశు సంక్షేమం, (26) సాంఘిక సంక్షేమం, అంగ, మానసిక వికలాంగుల సంక్షేమం, (27) బలహీన వర్గాలు ముఖ్యంగా హరిజన,గిరిజన సంక్షేమం, (28) ప్రజా పంపిణీ విధానం, (29) సామాజిక ఆస్తుల నిర్వహణ.

BRAOU

## 1993లో ప్రభుత్వం ప్రవేశ పెట్టదలచిన మార్పులు :

73వ రాజ్యాంగ సవరణ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కొన్ని సవరణలు చేసింది. సమగ్ర పంచాయితీరాజ్ బిల్లు తయారీలో బి.పి.ఆర్.విఠల్ కమిటి, మంత్రి వర్గ ఉపసంఘం (Cabinet Sub Committee) చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖామాత్యులు చెప్పారు. చివరిగా అనేక కోణాల నుండి పరిశీలించిన మీదట ప్రస్తుత మండల విధానాన్నే కొనసాగిస్తూ ఒక సమగ్ర పంచాయితీరాజ్ బిల్లును 29-12-1993న శాసనసభలో ప్రవేశపెట్టారు. రాజ్యాంగ సవరణల నేపథ్యంలో కొన్ని మార్పులతో ప్రవేశపెట్టిన ఈ ముసాయిదా బిల్లులోని ప్రధానాంశాలు :

★ గ్రామ పంచాయితీ సర్పంచులను పరోక్షపద్ధతిలోను, మండల జిల్లాప్రజా పరిషత్ అధ్యక్ష ఉపాధ్యక్షులనూ ప్రాదేశిక నియోజక వర్గాల సభ్యులు ఎన్నుకుంటారు.

★ గ్రామ పంచాయితీలలో ఇద్దరు సభ్యులు నామినేషన్ పద్ధతిన తీసుకోబడతారు. (ఒకరుమహిళ,మరొకరు మైనారిటీలకు చెంది గ్రామాభివృద్ధిలో. ఆసక్తి ఉన్నవారు). వీరికి సర్పంచు, ఉప సర్పంచుపదవులకు జరిగేఎన్నికలలో ఓటు చేసేందుకు సమావేశాలలో మాట్లాడేందుకు హక్కును ఈ బిల్లులో పొందుపరిచారు.

★ గ్రామ పంచాయితీల సభ్యుల సంఖ్య ఆ గ్రామ పంచాయితీ జనాభాను బట్టి 5-12 వరకు ఉంటుంది.

★ వెనుక బడిన వర్గాల వారికి 25 శాతం రిజర్వేషన్లు ఉంటాయి. S.C., S.T., B.C. ల వారందరికి కలిపి 50 శాతం వరకు రిజర్వేషన్లు ఉంటాయి.

★ గ్రామ పంచాయితీలోఆ నియోజక వర్గం శాసనసభ్యుని, ఒక మహిళను, అభివృద్ధి కార్యక్రమాలలో సహాయపడేందుకు మరో వ్యక్తి అధికారేతర సభ్యులుగా నామినేట్ చేస్తారు.

★ రొటేషన్ పద్ధతిన రిజర్వేషన్లు ఉంటాయి.

★ ఆయా గ్రామ పంచాయితీలలో మొత్తం స్థానాలలో మూడవ వంతుకు తగ్గకుండా మహిళలకు కేటాయిస్తారు.

★ గ్రామ పంచాయితీ పనులు, కాంట్రాక్టుల ద్వారా నేరుగా ప్రయోజనం పొందిన వ్యక్తి సర్పంచుగా ఎన్నికయ్యేందుకు అనర్హుడు.

★ మండల ప్రజా పరిషత్‌లో సర్పంచ్‌లకు ప్రాతినిధ్యం కల్పించే అంశం ప్రతిపాదించలేదు. మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షులను పరోక్షంగా ఎన్నుకోవాలని అంటే నిర్ధారిత ప్రాదేశిక నియోజక వర్గాలకు ప్రాతినిధ్యం వహించే సభ్యులకు మాత్రమే అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకునే అవకాశం కల్పించారు.

★ జిల్లాకలెక్టర్, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ అధ్యక్షులు మండల ప్రజాపరిషత్‌లో శాశ్వత ఆహ్వానితులుగా ఉంటారు. పంచాయితీ వ్యవహారాలలో పరిజ్ఞానం గల మరో వ్యక్తి పేరును సూచిస్తారు.

★ జిల్లా పరిషత్తులో ఆ జిల్లాలోని ప్రాదేశిక నియోజక వర్గాలకు ఎన్నికయ్యే వారితో పాటు MLA లు, MP లు సభ్యులుగా ఉంటారు.

జిల్లా పరిషత్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లను ప్రాదేశిక నియోజక వర్గాల సభ్యులే ఎన్నుకుంటారు.

ప్రతి జిల్లాకు ఒక 'జిల్లా మహాసభ' ఏర్పాటు చేస్తారు. జిల్లా పరిషత్ సభ్యులు, మండల ప్రజా పరిషత్ సభ్యులు ఇందులో సభ్యులుగా ఉంటారు. ఇది జిల్లా పాలనకు సంబంధించిన ఆడిట్ నివేదికలను పరిశీలిస్తుంది.

పైన సూచించిన అంశాలు రాజ్యాంగ సంస్కరణల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన సమగ్ర పంచాయితీ రాజ్ బిల్లులోని కొన్ని అంశాలు 237 పేజీలు గల ఈ బిల్లును ప్రతిపక్షాలు పట్టు పట్టడంతో పరిశీలన కోసం సెలక్షన్ కమిటీకి నివేదించారు.

BRAOU

1993 కాంగ్రెస్ హయాంలో చేసిన మార్పులను తరువాతి కాలంలో (12-12-94)అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం కొనసాగించలేదు. ఈ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టానికి కొన్ని సవరణలుచేసి పంచాయితీరాజ్ సంస్థలకు ఎన్నికలు నిర్వహించింది.

సమాజంలోని వివిధ వర్గాల ప్రజలకు రిజర్వేషన్ల శాతాన్ని పెంచింది. హరిజనులకు18%, గిరిజనులకు8%, వెనుకబడినవార్గల వారికి34% (లోగడ వారికి 15%, 6%, 25% ఉండేవి). దీని ప్రకారం వివిధ కులాలు/ వర్గాల వారికి కేటాయించిన రిజర్వేషన్లు కింద పట్టికలో చూపబడిన విధంగా ఉన్నాయి.

వివిధ పంచాయితీరాజ్ సంస్థలలో సీట్లు రిజర్వేషన్

| అంచె | మొత్తం | BCs | SCs | STs | OCs |
|---|---|---|---|---|---|
| గ్రామపంచాయితీ | 21, 743 | 7393 | 3914 | 1739 | 8697 |
| (సర్పంచులు) | (7220) | (2464) | (1304) | (580) | (2872) |
| మండల పంచాయితీ | 1092 | 372 | 197 | 91 | 432 |
| (అధ్యక్షులు) | (372) | (126) | (66) | (32) | (148) |
| జిల్లా పరిషత్తులు | 22 | 7 | 4 | 2 | 9 |
| (అధ్యక్షులు) | (8) | (2) | (1) | (1) | (4) |

బ్రాకెట్లలో చూపినసంఖ్య స్త్రీలకుకేటాయించిన రిజర్వేషన్లు (33-33%)

(ఆధారం : ఫిబ్రవరిమాసంలో ఈనాడులోప్రచురించబడిన సమాచారం మేరకు)

BRAOU

- ☆ ఏ ప్రాంతాన్ని రిజర్వు చేయాలనే విషయం లాటరీపద్ధతి ద్వారా నిర్ణయించారు. మొదట్లోరాష్ట్రాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని రిజర్వేషన్లు నిర్ణయించాలనే ఆలోచనను అనేక విమర్శల మూలంగా చివరి నిమిషంలో మార్చి జిల్లానే ప్రభుత్వం ఒకయూనిట్‌గా పరిగణించారు.

- ☆ మండల పరిషత్ అధ్యక్షులు, జిల్లా పరిషత్ ఛైర్మన్‌లు ఎంపిక కొత్తగా ఏర్పాటు చేసుకోబడిఎంపికకాబడిన మండల, జిల్లా ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యుల ద్వారా జరుగుతుంది. (MPTC, ZPTC) వీరు చేతులెత్తడం ద్వారా ఎంపిక జరుపుతారు.

- ☆ ఏ ఏ పదవులు రిజర్వు చేయాలనే విషయం కూడా లాటరీ పద్ధతి ద్వారా నిర్ణయిస్తారు.

- ☆ ఎన్నికల ఖర్చు విషయంలో రాష్ట్రస్థాయి శాసనసభ్యుల ఎన్నికల మాదిరిగానేపంచాయతీ రాజ్ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులకు ఖర్చు విషయంలో నిబంధనలు విధించారు. ఫలితంగా వార్డు మెంబర్లుగా పోటీ చేసే అభ్యర్థులు. రూ. 2,500/-లు, సర్పంచు రూ. 10,000/-లు, మండల, జిల్లా ప్రాదేశిక సభ్యులు రూ. 50,000/- లకు మించి ఖర్చు చేయకూడదు.

73 రాజ్యాంగ సవరణల నేపధ్యంలో ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ వ్యవస్థలో చోటు చేసుకున్న ప్రధాన మార్పు స్త్రీలకు 33-33 శాతం రిజర్వేషన్లు కల్పించడం. అయితే స్త్రీలకు సరియైన ప్రాతినిధ్యం కల్పించినప్పటికీ ఎన్నికైన స్త్రీలలో చాల మేరకు ఇది వరకటి పంచాయితీరాజ్ నాయకుల భార్యలో, బంధువులో ఉన్నందున పంచాయితీ నిర్ణయాలలో వీరి జోక్యం అధికమై స్త్రీలు కేవలం ఉత్సవ విగ్రహాలుగా మారారు. అందువల్ల స్త్రీల తరపున పురుషులు పంచాయితీ నిర్ణయాలలో జోక్యం చేసుకోరాదనే ప్రభుత్వం ఉత్తర్వును జారీ చేసింది. అలాగే సర్పంచులు, మండలాధ్యక్షులు, మండల, జిల్లా, ప్రాదేశిక నియోజక వర్గాలు, జిల్లా పరిషత్ ఛైర్మన్‌లుగా ఎంపికైన కొంతమంది దళిత స్త్రీలకు అధికారులు సరియైన విధంగా సహకారం అందించడం లేదనే విమర్శ కూడా ఉంది.

ఏది ఏమైనా దేశ రాజకీయాలలో పంచాయితీలు నిర్ణయాత్మకమైన స్థానాన్ని కలిగి ఉన్నందువల్ల వీటి వ్యవస్థలు తరచుగా మార్పులకు లోనవుతూ వస్తున్నాయి.

## 12,7 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

★ స్థానిక సంస్థలు ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదులు అనీ, అవి రాజకీయ శిక్షణ శాలలనీ గుర్తించటం అనివార్యమైంది.

★ స్థానిక సంస్థలను పట్టణ స్థానిక ప్రభుత్వాలు గానూ, గ్రామీణ స్థానిక ప్రభుత్వాలు గానూ విభజించవచ్చు.

★ భారతదేశంలో స్థానిక సంస్థలు అభివృద్ధి చెందటానికి చాలా కారణాలున్నాయి. వాటి నేపధ్యంలో 1957లో బల్వంతరాయ్ మెహతా అధ్యక్షతన ఒక అధ్యయన బృందం ఏర్పడింది.

★ 1964 గ్రామ పంచాయితీల చట్టం ప్రకారం మూడు అంచెల పంచాయితీరాజ్ విధానం అమలులో కొచ్చింది.

★ 1978లో అశోక్ మెహతా కమిటీ పంచాయితీ రాజ్ వ్యవస్థకు కొన్ని మార్పులను చేసింది.

★ 73వ రాజ్యాంగ సవరణ నేపధ్యంలో 1993 లోనూ ప్రభుత్వం కొన్ని మార్పులను, ప్రవేశపెట్టదలచింది.

★ దేశ రాజకీయాలలో పంచాయితీలకు నిర్ణయాత్మకమైన పాత్ర ఉందనటంలో సందేహం లేదు.

## 12.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

30 పంక్తులలో జవాబులు రాయండి.

1. ఆంధ్రప్రదేశ్‌లో పంచాయితీరాజ్ వ్యవస్థ స్వరూపాన్ని విశ్లేషించండి.

2. పంచాయితీరాజ్ వ్యవస్థలో చోటు చేసుకుంటున్న మార్పులను సమీక్షించండి.

15 పంక్తులలో జవాబులు రాయండి.

1. జిల్లా పరిషత్ నిర్మాణాన్ని వివరించండి.

2. 1993లో పంచాయితీరాజ్ వ్యవస్థలో ప్రభుత్వం ప్రవేశపెట్టదల్చిన మార్పుల్ని సమీక్షించండి.

BRAOU

# భాగం - 13 ఆర్థిక ప్రణాళికా వ్యవస్థలు

విషయ క్రమం

13.0 ఉద్దేశం

13.1 ప్రవేశిక

13.2 ఆర్థిక వ్యవస్థ : వనరులు

అభ్యాసం

13.3 వివిధ పంచవర్ష ప్రణాళికల స్వరూపం

13.3.1 ఆర్థిక ప్రణాళికలు - వాటి ఆవశ్యకత

13.3.2 భారతదేశం

13.3.3 రాష్ట్రంలో ప్రణాళికలు : అభివృద్ధి

13.3.4 మొదటి మూడు పంచవర్షప్రణాళికలు : అభివృద్ధి

13.4 ప్రణాళికలు - స్వావలంబనం

13.4.1 ప్రణాళిక రూపకల్పన

13.4.2 భారత ఆర్థిక ప్రణాళికల ఆశయాలు, వ్యూహం

అభ్యాసం

13.5 ఆంధ్రప్రదేశ్‌లో ప్రణాళికలు - ప్రగతి

13.5.1 మొదటి మూడు ప్రణాళికల్లో నిర్దేశించిన ప్రాధాన్యాల క్రమం

13.5.2 వార్షిక ప్రణాళికలు (1966 - 69)

13.5.3 వార్షిక ప్రణాళికల్లో ప్రగతి

13.5.4 ప్రణాళికా కాలంలో ఆర్థికాభివృద్ధి

13.5.5 ఐదవ పంచవర్ష ప్రణాళిక

13.5.6 ఆరవ పంచవర్ష ప్రణాళిక

13.5.7 ఏడవ పంచవర్ష ప్రణాళిక

అభ్యాసం

13.6 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

13.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 13.0 ఉద్దేశం

ఈ భాగం చదివాక మీరు ఆర్థిక వ్యవస్థకు సంబంధించి వనరుల సమీకరణ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయ వ్యయాలు, ప్రణాళికల లక్ష్యాలు, స్వరూపం, ప్రగతి గురించి వివరించ గలుగుతారు.

## 13.1 ప్రవేశిక

ప్రజాస్వామ్య ప్రభుత్వాలు తాము ప్రజలకిచ్చిన వాగ్దానాలను నెరవేర్చుకోవడానికి నిధులను సమకూర్చుకోవాల్సి ఉంటుంది కదా. ఒక కుటుంబాన్ని నడిపించినట్లే ఒక రాష్ట్రం, దేశ ఆర్థిక వ్యవహారాలు ఆదాయం వ్యయాలపై ఆధారపడతాయి. అయితే ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాలు, వ్యయాన్ని ముందుగా అంచనా వేసిన తర్వాతే వనరుల అన్వేషణ ప్రారంభమౌతుంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వనరుల అనేక రకాలుగా సమీకరిస్తాయి. ఇవి; పన్నులు, ఎక్సయిజ్ డ్యూటీలు, సుంకాలు ద్వారా రాబడి, రుణాలు, కస్టమ్స్ డ్యూటీ మొదలైనవి. స్థూలంగా చెప్పాలంటే ప్రభుత్వం ప్రత్యక్ష, పరోక్ష పన్నుల రుణాల ద్వారా ధనాన్ని సమీకరించుకొని ముందుగా నిర్ణయించుకున్న విధానాల ప్రకారం తమతమ లక్ష్యాలను సాధించడానికి ప్రయత్నిస్తుంది. ఏ రాజకీయ పక్షం అధికారంలో ఉన్నా ఒక నిర్దేశించిన కార్యక్రమాన్ని అమలు జరపడానికి వనరులను సమీకరిస్తుంది.

స్వాతంత్ర్యం వచ్చి సుమారు అర్థశతాబ్ది కావస్తోంది. ఆర్థిక ప్రణాళికా రంగంలో మన అనుభవం ఏమిటో పరిశీలించుకోవాల్సిన సమయం ఇది.

## 13.2 ఆర్థిక వ్యవస్థ : వనరులు

మనది కేంద్రీకృత ప్రణాళికా వ్యవస్థ. ఇందులో రాష్ట్రాలకు స్థానం లేకపోలేదు. కాని, కేంద్రం ప్రణాళికా రచనలోనూ, దేశ ఆర్థిక వ్యవస్థ స్వరూప స్వభావాలను రూపుదిద్దడంలోనూ ప్రముఖ పాత్ర పోషిస్తోంది.

సరళీకృత ఆర్థిక విధానాల అమలు వల్ల కొన్నిరంగాల ప్రైవేటీకరణవల్ల, ప్రణాళికా సంఘపు పాత్రపైన సందేహాలు కలగవచ్చు. కాని, దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రణాళికా వ్యవస్థ పాత్ర ఇప్పటికీ ఉంది. విద్య, ఆరోగ్యం, మానవ సంపద ప్రగతికి దోహదపడే ఇతర రంగాల అభివృద్ధిలో ప్రణాళికా సంఘం ఇప్పటికీ కీలకపాత్ర పోషిస్తోంది. అంతర్జాతీయ రంగాలలో భారత ప్రధాని ఇతర ప్రతినిధులు మనదేశ అభివృద్ధిని ఒక మార్కెట్టే నిర్ణయించబోదని పదే పదే పేర్కొనడం ఇక్కడ మనం గమనించాలి.

1991 కి ముందు మన ఆర్థిక విధానాలు సోషలిస్టు వ్యవస్థని సమర్థిస్తూ / అనుకరిస్తూ ఉండేవి. అది అప్పటి విధాన నిర్మాతలైన నెహ్రూ, ఇందిరాగాంధి దృక్పథాన్ని ప్రతిబింబించేవిగా ఉండేవి. రాను రాను అంతర్జాతీయ రంగంలో పెనుమార్పులు సంభవించిన కారణంగానూ సోవియట్ యూనియన్ ఇతర తూర్పు యూరోపియన్ దేశాలలో కమ్యూనిజం అంతం కావడంతో సోషలిస్టు అభివృద్ధి వ్యూహాలపైన వాటి పరిణామాలపైన ఒక ఆసక్తికరమైన చర్చ కొనసాగుతోంది.

అభివృద్ధికి బహుముఖ వ్యూహాల అవశ్యకతను గుర్తిస్తూ భారతదేశం కొన్ని కొన్ని కీలక రంగాలలో ప్రైవేటీకరణకు అనుమతినిస్తూ వస్తోంది. దీని వల్ల ఆర్థిక రంగంలో అనేక మార్పులు వస్తున్నాయి. కాలాన్ని బట్టి, అంతర్జాతీయ రంగంలో పోటీని ఎదుర్కోడానికి వ్యూహాలలో మార్పులు వస్తున్నాయి.

BRAOU

ఎటువంటి అభివృద్ధి పథకాలకైనా నిధుల అవసరం గురించి చెప్పనక్కరలేదు. అవి ఏ విధంగా సమీకరిస్తున్నారో తెలుసుకోవాలి . ఎందుకంటే ప్రభుత్వ వివిధ శాఖలు అనేక విధులను నిర్వర్తిస్తాయి. కాని నిధుల సమీకరణ శాఖలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఎందువల్లనంటే ఆ వ్యవస్థల పనితీరుపై ప్రభుత్వ పాలనా నాణ్యత ఆధారపడి ఉంటుంది. అదే కాకుండా అభివృద్ధి చెందుతున్న దేశాలలో పన్ను చట్టాలలో లొసుగుల వల్ల ప్రభుత్వ రాబడి అనుకున్నంతగా ఉండదు. వాటిని తొలగించడానికి కృషి నిరంతరం జరుగుతున్నప్పటికీ కొన్ని సరిదిద్దలేరు.

దేశంలో ప్రణాళికా సంఘం వనరులను మదింపు చేసే ప్రధమ ఏజన్సీ. ప్రణాళిక పరిమాణాన్ని, ప్రతిరాష్ట్ర ప్రణాళికా పెట్టుబడిని నిర్ణయించేది ఈ వ్యవస్థే.

ప్రధానమంత్రి అధ్యక్షునిగా ఈ సంఘం ఐదు లేక ఆరుగురు సభ్యులతో పనిచేస్తుంది. ఉపాధ్యక్షునిగా సాధారణంగా ఒక కేబినెట్ మంత్రి ఉంటారు. వనరులు సమీకరించడమే కాక, ప్రణాళికా వ్యయాన్ని నిర్ణయించే అధికారం ఈ సంస్థకి ఉంటుంది. వివిధ మంత్రిత్వ శాఖల సమన్వయంతో ఈ వ్యవస్థ తన విధులను నిర్వహిస్తుంది.

కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలో రెండు లేదా మూడు విభాగాలుంటాయి. వ్యయం, ఆదాయం ముఖ్యమైనవి కాగా ఒక్కొక్కప్పుడు బాంకింగ్ కూడా ఒక ఉపశాఖగా ఉండేది. ఈ ఆర్థిక శాఖ పరిధిలో ప్రత్యక్ష పన్నుల మండలి, ఎక్సయిజ్ సుంకం, కస్టమ్స్ మొదలైనవి ఉంటాయి.

కేంద్ర ప్రభుత్వ ఆదాయంలో పన్నులు ఇతర రాబడి మార్గాలను పరిశీలిస్తే ప్రత్యక్ష పన్నులు పాత్ర గణనీయంగా తగ్గిపోతుందని గ్రహించగలరు. ఉదాహరణకు ఈ సంవత్సరం అంటే 1995 - 96 బడ్జెట్ ప్రతిపాదనలను కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెడుతూ కేంద్రానికి ఆదాయం ఏ విధంగా వస్తోందో వివరించారు. రూపాయినే ప్రమాణంగా తీసుకున్నాం అనుకోండి అందులో :

(అ) ఎక్సయిజ్ నుంచి 21 శాతం,

(ఆ) ఇతర పన్నులనుంచి ఒక శాతం

(ఇ) సుంకాలు కాని రాబడి నుంచి 13 శాతం

(ఈ) రుణేతర ద్రవ్య రాబడి 7 శాతం

(ఉ) ఆదాయ పన్ను 7 శాతం

(ఊ) కార్పొరేట్ పన్ను 8 శాతం

(ఎ) విదేశీ రుణాలు రెండు శాతం

(ఏ) అంతర్గత రుణాలు 24 శాతం

(ఐ) కస్టమ్స్ డ్యూటీ 13 శాతం

(ఒ) రిజర్వ్ బేంక్ రుణం రెండు శాతం

పైన పేర్కొన్న విధంగా ప్రభుత్వానికి రాబడి అందుతోంది.

BRAOU

ఇప్పుడు ఖర్చుని ఈ పట్టిక ద్వారా గ్రహించండి.

| | | (శాతంలో) |
|---|---|---|
| 1. | రాష్ట్రాలకు ప్రణాళికా సాయం | 10 |
| 2. | రాష్ట్రాలకు ప్రణాళికేతర సాయం | 6 |
| 3. | ప్రణాళికేతర వ్యయం | 10 |
| 4. | రక్షణ వ్యయం | 13 |
| 5. | వడ్డీ | 26 |
| 6. | సబ్సిడీలు | 6 |
| 7. | రాష్ట్రాలకు పన్నుల వాటా కేంద్ర బడ్జెటు | 6 |

**1995-96 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ ప్రకారం ఆదాయ వ్యయాలు ఈ విధంగా ఉన్నాయి.**

| | రాబడి | (శాతాలలో) |
|---|---|---|
| 1. | రాష్ట్ర పన్నులు | 45.85 |
| 2. | కేంద్రం ద్వారా లభించే పన్నులు | 19.68 |
| 3. | ఇతర ఆదాయం | 19.19 |
| 4. | వడ్డీల ద్వారా ఆదాయం | 8.72 |
| 5. | లోటు | 6.56 |

**రాష్ట్ర వ్యయాన్ని ఇప్పుడు గమనించండి.**

| | | (శాతంలో) |
|---|---|---|
| 1. | అభివృద్ధి పనులకు | 66.95 |
| 2. | అప్పులపై వడ్డీ | 14.26 |
| 3. | పరిపాలన నిర్వహణకు | 7.26 |
| 4. | పన్నుల వసూళ్ళ ఖర్చు | 1.59 |
| 5. | ఇతర ఖర్చులు | 9.94 |

ముందు పేర్కొన్న వివరాలు దేశ రాష్ట్ర ఆదాయ వ్యయాలు ఏ విధంగా ఉంటాయో తెల్పుతాయి. ఇక, నిర్దేశించిన విధులను నిర్వహించడానికి వనరులు ఏ విధంగా సమీకరిస్తారో తెలుసుకోవాలి.

విస్తృత పాలనా యంత్రాంగం ద్వారా కేంద్ర ప్రభుత్వం తన పన్నులను వసూలు చేస్తుంది. ఉదాహరణకు ఆదాయపు పన్ను శాఖ, కస్టమ్స్ శాఖలను మీరు మీ మీ ప్రదేశాలలో గమనించి ఉంటారు.

BRAOU

రాష్ట్రాలకు వస్తే వాణిజ్య పన్నుల శాఖ, స్టేటు ఎక్సైజ్ సుంకాల శాఖలు ఇతర శాఖలు పన్నులు ఇతర రాబడులను రాష్ట్ర ప్రభుత్వానికి సమకూరుస్తాయి.

గ్రామ పంచాయితీలు, మండల ప్రజాపరిషత్తులు, జిల్లా ప్రజా పరిషత్తులు కూడా ఆస్తిపన్ను ఇతర పన్నులు విధించే అధికారం కలిగి ఉన్నాయి. అదే విధంగా పట్టణాలలో మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు కూడా అనేక పన్నులు విధిస్తాయి.

ఈ విధంగా కేంద్ర రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు అనేక పన్నులను విధిస్తాయి. తమకున్న పాలనా యంత్రాంగం ద్వారా అవి వాటిని వసూలు చేస్తాయి. ఉదాహరణకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు ఒక కార్యదర్శి ఉంటారు. అతనికి సహాయంగా అనేక జాయింట్ సహాయ డిప్యూటీ అసిస్టెంట్ కార్యదర్శులు ఉంటారు. కేంద్ర మంత్రిత్వ శాఖ అధ్వర్యంలో అనేక ఇతర ఆర్థిక శాఖలు పనిచేస్తాయి. ఇన్‌కంటాక్స్, ఎక్సయిజ్ డ్యూటీ, కస్టమ్స్ శాఖ ఇతర శాఖలు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో తమ విధులు నిర్వహిస్తాయి.

అదే విధంగా రాష్ట్రాలలో కూడా విస్తృత యంత్రాంగం ఉంటుంది.

**అభ్యాసం**

కేంద్ర ప్రభుత్వానికి రాబడి ఎలా అందుతోంది ?

________________________________________

________________________________________

________________________________________

________________________________________

________________________________________

________________________________________

________________________________________

________________________________________

BRAOU

## 13.3 వివిధ పంచవర్షప్రణాళికల స్వరూపం

భారతదేశంలో స్వాతంత్ర్యానికి ముందే ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు అమలు జరపాలనే భావం బలపడింది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ 1938లో జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షతన ప్లానింగ్ కమిటీని నియమించింది. ఈ కమిటీ కొన్ని భావాలను స్థిరపరిచింది. తర్వాత పారిశ్రామికవేత్తలు 'బొంబాయి ప్లాను' అనే దానిని విప్లవమంది. యమ్.యన్.రాయ్ "పీపుల్స్ ప్లాన్" అనే దానిని, శ్రీమన్నారాయణ్ అగర్వాలు "గాంధియన్‌ప్లాన్" అనేదానిని తయారు చేశారు.

స్వాతంత్ర్యం రాగానే ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, అధ్యక్షుడుగాను, వి.టి. కృష్ణమాచారి ఉపాధ్యక్షుడిగానూ, 1951లో ప్రణాళికా సంఘం ప్రారంభమైంది.

స్వాతంత్ర్యం వచ్చేనాటికి భారతదేశం సగటు తలసరి ఆదాయం అధిక సంఖ్యాకుల జీవన ప్రమాణం రెండూ చాలా

తక్కువ స్థాయిలో ఉండటం, నిరుద్యోగ పరిస్థితి ప్రబలడం, ఆదాయ పంపిణీలలో అధిక వ్యత్యాసాలు మొదలైన సమస్యలను ఎదుర్కొనవలసి వచ్చింది. అప్పటి వరకు సాధించిన పారిశ్రామికాభివృద్ధి దేశావసరాల దృష్ట్యా చాల తక్కువని చెప్పవచ్చు.

### 13.3.1 ఆర్థిక ప్రణాళికలు - వాటి అవశ్యకత

ఆర్థిక ప్రణాళిక దేశ సంపద అంచనాను మన లక్ష్యాలను, వనరులను ఉపయోగించే పద్ధతిని సూచిస్తుంది. అయితే ఉన్న లేక పరిమితమైన వనరులను దేశ అవసరాలకు ఏ విధంగా ఉపయోగించుకోవాలనేది ప్రశ్న. ఇది ఆ దేశ ఆర్థిక పరిస్థితులు, ఆర్థికాభివృద్ధి దశ, సంఘ స్వరూపం, ప్రభుత్వ విధానం మీద ఆధారపడి ఉంటుంది. సాధ్యమైనంత తక్కువ కాలంలో పరిమిత వనరులతో వీలైనంత ఎక్కువ ఆర్థికాభివృద్ధిని సాధించడమే ప్రణాళికల ముఖ్య లక్ష్యం.

### 13.3.2 భారతదేశం

భారతదేశంలో ప్రణాళికా కార్యక్రమాలు ప్రారంభించక ముందు, వినిమయ వస్తువుల పరిశ్రమల అభివృద్ధికి ఎక్కువ ప్రాముఖ్యాన్ని ఇచ్చారు. మౌలిక ఉత్పాదక వస్తువుల పరిశ్రమలను స్థాపించడం వెనుకబడింది. కాని పారిశ్రామికాభివృద్ధిని త్వరితగతిని సాధించడానికి పరిశ్రమలు ముఖ్యంగా ఇనుము, ఉక్కు, అల్యూమినియం, కాస్టిక్ సోడా, ఎరువులు, పెట్రోలియం వస్తువులు, యంత్రసామగ్రి అవసరం ఎంతైనా ఉంది. భారతదేశం ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కారానికి క్రమబద్ధమైన ప్రణాళికా ప్రగతిని సాధించడం ఒక్కటే మార్గమని గ్రహించారు. ప్రణాళికా బద్ధ కార్యక్రమం ద్వారా స్వయం పోషకత్వపు పెరుగుదల దశను సాధ్యమైనంత తక్కువ కాలంలో చేసుకోవడానికి వీలవుతుంది. ఆర్థికంగా పురోగమించిన దేశాలు శతాబ్దం పైగా సాధించిన ఆర్థిక ప్రగతిని మనదేశం కొన్ని దశాబ్దాల్లోనే సాధించాల్సిన ఆవశ్యకత ఉంది. కాబట్టి ఈ పరిస్థితుల్లో మన మౌలిక లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని నిర్ణీత కార్యక్రమాలను రూపొందించడం, వాటిని అమలు పరచడంలో ప్రభుత్వం ప్రధాన పాత్ర వహించాల్సి ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దీని కోసం 1950 నుండి ప్రణాళికలను రూపొందించి అమలు జరుపుతున్నారు.

### 13.3.3 రాష్ట్రంలో ప్రణాళికలు : అభివృద్ధి

1953 అక్టోబర్ 1వ తేదీ ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు సంయుక్త మంద్రాసు రాష్ట్రప్రణాళిక, ఆంధ్ర ప్రాంతానికి చెందిన వివరాలతో విభజన చేయడం జరిగింది.

**ఆంధ్రప్రదేశ్ పంచవర్షప్రణాళికలు**

| ప్రణాళిక | వ్యయం (రూ. కోట్లలో) |
|---|---|
| మొదటి ప్రణాళిక | 96.78 |
| రెండవ ప్రణాళిక | 188.60 |
| మూడవ ప్రణాళిక | 352.42 |
| మధ్య వార్షిక ప్రణాళికలు | 234.06 |
| నాల్గవ ప్రణాళిక | 427.48 |
| ఐదవ ప్రణాళిక | 1333.58 |
| ఆరవ ప్రణాళిక | 3100.00 |

BRAOU

| | |
|---|---|
| ఏడవ ప్రణాళిక | 7500.00 |
| ఎనిమిదవ ప్రణాళిక | --------- |

**అభివృద్ధి :**

ప్రభుత్వ రంగంలో పెట్టిన అధిక పెట్టుబడుల రీత్యా మొదటి ప్రణాళికలో అనుకున్న దానికంటే 101 శాతం, రెండవ ప్రణాళికలో 105 శాతం మూడవ ప్రణాళికాకాలంలో 112.7 శాతం అభివృద్ధి సాధించబడింది. ఆంధ్ర రాష్ట్ర అవతరణ సందర్భంలోను ఆంధ్రప్రదేశ్ అవతరణ సందర్భంలోనూ దశాబ్దికాలంలోనే రెండు దఫాలు రాష్ట్రాలు పునర్వ్యవస్థీకరింపబడినందు వల్ల పాలనా సంబంధమైన ఖర్చులను, ఇబ్బందులను ప్రణాళికల ద్వారా చెప్పుకోదగిన అభివృద్ధిని సాధించగలిగింది.

### 13.3.4 మొదటి మూడు పంచవర్ష ప్రణాళికలలో సాధించిన ప్రగతి

వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాల కోసం ప్రణాళికావ్యయాలు క్రమేపీ పెరుగుతూ వచ్చాయి. అందువల్ల ఆహారధాన్యాలు, వాణిజ్య పంటల ఉత్పత్తిలో అభివృద్ధి సాధించబడింది. ఐతే ప్రధానంగా ద్వితీయ, తృతీయ ప్రణాళికా కాలాల్లో ఆహారధాన్యాల లక్ష్యాల ఉత్పత్తి సాధించబడలేదు. రసాయనిక ఎరువులు, మేలిరకపు విత్తనాల సరఫరాలో అనుకున్న లక్ష్యాలు సాధించకపోవడంతో ఈ మేరకు పంటల ఉత్పత్తిలో కూడా, అనుకొన్న లక్ష్యాలు సాధించబడలేదని తెలుస్తున్నది. అంతేకాక, భారీ, మధ్య తరహా నీటి పారుదల సౌకర్యాలు విస్తృతంగా కల్పించకపోవడం కూడా కొంత కారణం. ఇందుకు తోడు తృతీయ ప్రణాళిక చివరి సంవత్సరంలో దేశ వ్యాపితంగా సంభవించిన అనావృష్టి పరిస్థితులు కూడా కొంత కారణం. ఈ పరిస్థితులు వ్యవసాయ ఉత్పత్తులు పడిపోవడానికి దోహదం చేశాయి.

## 13.4 ప్రణాళికలు -స్వావలంబనం

BRAOU

దేశంలో ప్రణాళికాయుగం అభివృద్ధికి మార్గదర్శి శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య. 1934 లో ఆయన రాసిన "Planned Economy for India" అనే పుస్తకంలో దేశంలో తాండవిస్తున్న దారిద్ర్యం, నిరుద్యోగం వంటి సమస్యల నిర్మూలనకు ప్రణాళికా బద్ధమైన పద్ధతి, కార్యక్రమం అవసరమని పేర్కొన్నారు. 1938 లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నెహ్రూ అధ్యక్షతన జాతీయ ప్రణాళికా కమిటీ ఏర్పడింది.

స్వాతంత్ర్యానంతరం 1950 లో ప్రణాళికా సంఘం ఏర్పడింది. వనరుల అంచనా, సమీకరణ, ప్రణాళికా ప్రాధాన్యతలను నిర్ణయించటం వివిధ రంగాలకు వనరులను కేటాయించడం, లక్ష్యాలను నిర్ణయించి కాలానుగుణంగా ప్రణాళికా ఫలితాలను సమీక్షించడం ప్రణాళికా సంఘపు విధులు. 1951 లో మొదటి పంచవర్ష ప్రణాళికను ప్రారంభించటంలో భారతదేశంలో ప్రణాళికాయుగం అభివృద్ధి ప్రారంభమైంది. ప్రస్తుతం ఎనిమిదవ పంచవర్ష ప్రణాళిక (1992 - 1997) అమలులో ఉంది. ప్రణాళికలు లేకుండా ఈ రోజున వివిధ రంగాల్లో సమన్వయ పూర్వక అభివృద్ధిని సాధించలేము. ప్రణాళికల వలన భారతదేశం పారిశ్రామిక, వ్యవసాయ, రక్షణ తదితర రంగాల్లోని అనేక వస్తూత్పత్తులలో స్వావలబంనం (Self - reliance) సాధించింది.

### 13.4.1 ప్రణాళిక రూపకల్పన

భారతదేశంలో పంచవర్ష ప్రణాళికలను రూపొందించేది ప్రణాళికా సంఘం. భారత ప్రధానమంత్రి దానికి అధ్యక్షులు. ప్రణాళికా సంఘానికి ముఖ్య కార్య నిర్వాహకాధికారిగా ఒక ఉపాధ్యక్షుడుంటాడు. ప్రాధాన్యతలను బట్టి రాష్ట్ర ప్రభుత్వాలు తమ ప్రణాళికను రూపొందిస్తాయి. జాతీయ ప్రాధాన్యతలు, వనరుల లభ్యతను బట్టి ప్రణాళికా సంఘం దేశం మొత్తానికి

సంబంధించిన పంచవర్ష ప్రణాళికను రూపొందిస్తుంది. దీనిని కేంద్ర మంత్రి మండలి చర్చించి మార్పులు కూర్పులు చేస్తాయి. రాష్ట్ర ముఖ్య మంత్రులతో కూడిన జాతీయాభివృద్ధి మండలి పంచవర్ష ప్రణాళికను చర్చించి ఆమోదించిన తరువాత, పార్లమెంటు ఆమోదించిన తరువాత దీనికి తుది రూపమేర్పడుతుంది. ఇట్లా ప్రజాస్వామ్య నిర్ణయం ప్రకారం భారత ప్రణాళికలను రూపొందించటం వలన వీటి ప్రజాస్వామ్య ప్రణాళికలంటారు. కమ్యూనిస్టు దేశాలలో కేంద్ర ప్రణాళికా సంఘం రూపొందించిన ప్రణాళికనే క్రింది స్థాయిలో అమలు చేయటం వలన దీనిని ఆదేశపూరిత లేదా నియంతృత్వ ప్రణాళిక అని అంటారు.

## 13.4.2 భారత ఆర్థిక ప్రణాళికల ఆశయాలు, వ్యూహం

భారతదేశ ఆర్థిక ప్రణాళికల ముఖ్యాశయం ఒక్క మాటలో చెప్పాలంటే ఆర్థికాభివృద్ధి. ఆర్థికాభివృద్ధి పరమావధి ప్రజల జీవన ప్రమాణాలను పెంచడం. అయితే 'పరస్పర సంబంధ'మున్న అనేక అంశాలను దృష్టిలో పెట్టుకొని వివిధ అంశాలను స్పష్టీకరించారు. వాటిని ఈ కింది విధంగా చెప్పవచ్చు:

**ప్రణాళికల ఆశయాలు :**

**1. వృద్ధి :** అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థికాభివృద్ధికి ముఖ్య లక్షణం దీర్ఘకాలంగా నిలకడగా జాతీయాదాయాన్ని పెంచుతుండడమే. కాబట్టి జాతీయాదాయాన్ని తగు మాత్రపు పరిమాణంలో ఏటా పెంచుతుండాలి. మన దేశంలో ఏటా కనీసం 5 శాతం చొప్పున జాతీయాదాయం పెరుగుతుండాలని భావించారు. అంతమాత్రం పెరిగితే కాని పెరుగుతున్న జనాభా తలసరి ఆదాయం పెరగదు. ఎందుకంటే తలసరి ఆదాయం పెరిగితేనే గాని వినియోగ ప్రమాణాలు కొంతవరకైనా పెరుగుతాయి. తలసరి ఆదాయం పెరగడం జీవన ప్రమాణాలు పెరగడానికి ఆధారభూతమౌతుంది. అంతేకాక, పొదుపులు, పెట్టుబడులు పెంచడానికి వీలౌతుంది. తలసరి ఆదాయం ఏటేటా పెరుగుతుండాలనేది ఆశయం.

అయితే కేవలం తలసరి ఆదాయం పెరిగినంత మాత్రాన జీవన ప్రమాణాలు పెరిగినట్లు కాదు. ఎందుకంటే తలసరి ఆదాయం ఒక సగటు సంఖ్య మాత్రమే. అది పెరిగినంత మాత్రాన అందరి ఆదాయాలు, వినియోగశక్తి పెరిగినట్లు కాదు. జాతీయాదాయం వృద్ధి అవుతున్నప్పటికీ, పేద ప్రజల జీవన పద్ధతిలో పెరుగుదల కన్పించకపోవడం సర్వసాధారణమైంది. అందువల్ల పేదప్రజల, బలహీన వర్గాల వినియోగశక్తి ఒక కనీస ప్రమాణ స్థాయికి పెంచడం ఒక ఆశయమైంది. అందుకనే జీవితావసర వస్తువులను పేద ప్రజలకు సప్లయి చేసి వారి వారి వినియోగశక్తిని పెంచడం జరుగుతుంది.

**2. ఆధునికీకరణ :** ఆర్థిక వ్యవస్థను ఆధునీకీకరణ చేయనిదే నిలకడగా దీర్ఘకాలంలో జాతీయాదాయం పెరగదు. ఆధునికీకరణ వలన ఆర్థిక వ్యవస్థ స్వరూప స్వభావాలు మారిపోతాయి. అందువలన ప్రణాళికలలో ఆధునికీకరణ ఒక విశిష్ట ఆశయమైంది. మూలధన వస్తువుల ఉత్పత్తి పెంచడం వలన దీర్ఘకాలంలో వస్తూత్పత్తి వేగంగా పెంచడానికి వీలవుతుంది. తత్ఫలితంగా ఆర్థిక వ్యవస్థ ఉత్పాదక శక్తి పెరుగుతుంది.

ఇనుము, ఉక్కు, ఇంజనీరింగ్, నౌకానిర్మాణం, పెట్రోలియం, ఎలక్ట్రానిక్స్, ప్లాస్టిక్స్, కంప్యూటర్లు మొదలైన రంగాలలోనూ వివిధ ఆధునిక వస్తూత్పత్తి పరిశ్రమలు ఏర్పడాలి. అంతేకాక ఆధునికీకరణకు అవసరమైన సంస్థాగత మార్పులు కూడా చేయాలి. బ్యాంకుల విస్తరణ, పరపతి వృద్ధి, దీర్ఘకాలిక పరపతి సంస్థల సృష్టి, విక్రయ వ్యవస్థ, భూ సంస్కరణలు మొదలైనవి చేసి ఆధునికీకరణకు దోహదం చేయాలి.

**3. స్వశక్తి మీద ఆధారపడటం :** భారత ఆర్థిక ప్రణాళికల మరొక ఆశయం దేశ ఆర్థిక వ్యవస్థను స్వశక్తి మీద ఆధారపడేదిగా తయారు చేయడం. అంటే అన్ని వస్తువులు దేశంలోనే తయారు కావాలని కాదు. ప్రధాన వస్తువులను



BRAOU

దేశంలోనే ఉత్పత్తి చేసుకొని మనకవసరమైన వస్తువులు వ్యాపార పద్ధతుల ద్వారా విదేశాల నుండి కొనుక్కొనే శక్తి ఉండాలి. కొనుక్కోవడానికి వీలుకాని సాంకేతిక విజ్ఞాన సంబంధమైన వస్తువులను, రక్షణ సామగ్రిని దేశంలోనే తయారు చేసుకొనే శక్తి ఉండాలి. విదేశీ మూలధనాన్ని మామూలు వ్యాపార పద్ధతులలో పొందడమే కాని విదేశీ సహాయం మీద ఆధారపడకూడదు. దిగుమతులను తగ్గించాలి.

**4. ఉద్యోగిత :** దీర్ఘకాలంలో పూర్ణోద్యోగిత సాధించాలనే ఆశయం మొదటి నుండి ఉంది. ప్రతి ప్రణాళికలో ఉద్యోగితావకాశం పెంచడమనే ఆశయాన్ని వ్యక్తీకరించారు. ప్రచ్ఛన్న నిరుద్యోగితకు, నిరుద్యోగితకు ప్రధాన కారణం ఉత్పాదక సామాగ్రి లేకపోవడమే. కాబట్టి మూలధన నిర్మాణం పెరిగేకొద్దీ, దీర్ఘకాలంలో ఉత్పత్తి పెరగడంతో పాటు ఉద్యోగిత పెరుగుతుందని విశ్వసించారు. కాని ప్రణాళిక ప్రణాళికకు నిరుద్యోగిత పెరుగుతుండడం చేత ఉద్యోగితను పెంచేందుకు చిన్న పరిశ్రమలకు, కుటీర పరిశ్రమలకు ప్రోత్సాహమిచ్చారు. వివిధ రకాల గ్రామీణ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పని దినాలను కల్పించడం జరిగింది.

**5. సాంఘిక న్యాయం :** భారతదేశంలో సగానికి పైగా ప్రజలు పేదరికంలో మగ్గుతున్నారు. వీరిని దారిద్ర్యంలోంచి బయట పడేటట్లు చేయడం ఒక ముఖ్య ఆశయం. పేదరికంలో బాధపడే వారి శాతాన్ని ప్రణాళిక ప్రణాళికకు తగ్గించుకుంటూ రావాలి. అంతేగాక, ఆదాయ సంపద వ్యత్యాసాలను తగ్గించి, ఆర్థిక స్థోమత కేంద్రీకరణను తగ్గించాలనేది మరొక ఆశయం.

పారిశ్రామిక గ్రహాల చేతిలో ఆర్థికశక్తి కేంద్రీకరణను నివారించడం మరో ముఖ్యమైన ఆశయంగా పరిగణించారు. ఈ ఆశయాలను "సమ సమాజ రీతి స్థాపన", "నవ సమాజంవైపు పురోగతి", "ఆర్థిక ప్రజాస్వామ్యం" అనే పద జాలంతో ప్రచారం చేశారు.

పైన వర్ణించిన ఆశయాల సాధనకు ప్రణాళిక కర్తలు ఒక వ్యూహాన్నే అనుసరించారు.

**ప్రణాళికలలో అభివృద్ధి వ్యూహం :** మన ప్రణాళిక అభివృద్ధి వ్యూహాన్ని ద్వితీయ ప్రణాళికలో బాహాటంగా ప్రకటించారు. "దీర్ఘ కాలంలో బొగ్గు, విద్యుచ్ఛక్తి, ఇనుము, ఉక్కు, భారీ యంత్రాలు, భారీ రసాయనాలు, భారీపరిశ్రమలు అభివృద్ధి మీద పారిశ్రామీకరణ, జాతీయ ఆర్థిక వ్యవస్థ వృద్ధి ఆధారపడుతుంది. వాటి వల్లనే మూలధన కల్పన కవసరమైన శక్తిసామర్థ్యాలొస్తాయి. వీలైనంత త్వరగా దేశాన్ని ఉత్పాదక వస్తువులకు విదేశాల మీద ఆధారపడకుండా చేయాలి. లేకపోతే, ఇతర దేశాల నుంచి ముఖ్య ఉత్పాదక వస్తువులను సమకూర్చు కోవడంలో ఇబ్బందుల వల్ల మూలధన సంచయనం కుంటుపడుతుంది. కాబట్టి పరిశ్రమలను వీలైనంత వేగంగా వృద్ధి చేయాలి", అని ద్వితీయ ప్రణాళిక మూల స్వరూప చిత్రణ (Plane frame) లో పేర్కొన్నారు. ఈ వ్యూహాన్నే కొద్దిమార్పులతో ఇప్పటికీ కొనసాగిస్తున్నాం.

**అభివృద్ధి వ్యూహపు అమలుకుకావాల్సిన పరిస్థితులు :**

**1. కుటీర పరిశ్రమలు :** ఈ వ్యూహాన్నే అమలు పరచడానికి తగిన పరిస్థితులు సృష్టించాలి. ఉదాహరణకు, భారీ పరిశ్రమలు, అవస్థాపనా రంగాల విస్తరణ వల్ల ద్రవ్యాదాయాలు అనతి కాలంలోనే పెరుగుతాయి. జనాభా పెరగడం వల్ల వినియోగ వస్తువులకు డిమాండు పెరుగుతుంది. వాటి సప్లయి తగినంతగా లేకపోతే ధరలు పెరుగుతాయి. ద్రవ్యోల్బణ మేర్పడుతుంది. అటువంటి పరిస్థితులలో ప్రణాళికలను అమలు చేయడం కష్టమౌతుంది. కాబట్టి చిన్న పరిశ్రమలను, కుటీర పరిశ్రమలను ప్రోత్సహించి కావలసిన వినియోగ వస్తువుల ఉత్పత్తి పెంచాలి.

**2. పొదుపులు (Savings) :** భారీ పరిశ్రమల స్థాపనకు, అవస్థాపనా రంగ విస్తరణకు పొదుపులు పెద్ద మొత్తంలో కావాలి. దేశంలో పొదుపులు పెంచవలసిన ఆవశ్యకత ఏర్పడుతుంది. దేశంలో పొదుపు పెట్టుబడి అవసరాలకు చాలదని



BRAOU

ఊహించారు. కాబట్టి కొంత కాలం పాటు 'విదేశీసహాయం' అవసరమౌతుందని భావించారు. అందుకనే విదేశీ సహాయానికి స్వాగతం పలికారు.

**దిగుమతి బదిలీ :** మూలధన సామాగ్రిని బాగా దిగుమతి చేసుకోవలసి ఉంటుంది. అందుకని అనావశ్యక దిగుమతులను నిలిపి వేయాలి. అంతేకాక ఇది వరకు దిగుమతి చేసుకొనే వస్తువులను ఇప్పుడు దేశంలోనే తయారుచేసుకోవాలి. దీన్నే దిగుమతి బదిలీ అంటారు. అంతేకాక, ముఖ్యదిగుమతులు చేసుకోవడానికి కావల్సిన విదేశీ కరెన్సీని ఎగుమతులు పెంచడం ద్వారా ఆర్జించాలి.

**ప్రభుత్వ రంగం :** భారీ పరిశ్రమల స్థాపనకు పెట్టుబడి పెద్ద మొత్తాల్లో కావాలి. అంతేకాక వాటివల్ల సాంఘిక ప్రయోజనాలున్నాయి. అందువలన వీటి స్థాపనకు ప్రభుత్వ రంగం ఉత్తమ సాధనంగా భావించారు.

**అభ్యాసం**

ఆర్థిక ప్రణాళికల ఆశయాలను సమీక్షించండి

BRAOU

## 13.5 ఆంధ్రప్రదేశ్‌లో ప్రణాళికలు - ప్రగతి

ప్రణాళికా ప్రక్రియలో దేశంలోని వివిధ రాష్ట్రాలు భాగస్వాములు. ఆయా ప్రాంతం అవసరాల దృష్ట్యా, ప్రణాళికలను రూపొందించుకొని జాతీయ ప్రణాళికా ప్రక్రియలో సమన్వయించి వాటిని అమలు జరపడానికి రాష్ట్రాలు ప్రయత్నిస్తుంటాయి. ఆ విధమైన ప్రణాళికా ప్రక్రియ తెలుగు ప్రజలుంటున్న ప్రాంతంలో అవిభక్త మద్రాసు రాష్ట్రంలో 1951లో ప్రారంభమైంది. 1953లోమద్రాసు రాష్ట్రం నుంచి తెలుగు ప్రాంతాలను వేరు చేయడంలో మొదటి ప్రణాళికలో కొన్ని సవరణలు చేయవలసిన అవసరమేర్పడింది. ఆంధ్ర రాష్ట్రానికి సంబంధించి మొదటి ప్రణాళిక పెట్టుబడి రూ. 64.23 కోట్లు. కానీ ఖర్చయిన మొత్తం రూ. 64.52 కోట్లు. 1956లోఆంధ్రప్రదేశ్ ఏర్పాటు కావడంతో ప్రణాళికా కేటాయింపులను ఇంకోసారి సవరించవలసిన అవసరమేర్పడింది. కాని తెలంగాణా ప్రాంతానికి సంబంధించిన వివరాలు అందుబాటులో లేనందువల్ల ఆంధ్ర రాష్ట్రానికి కేటాయించిన మొత్తం 50 శాతం కలిపి ఆంధ్రప్రదేశ్ మొదటి ప్రణాళికా వ్యయాన్ని రూ. 96.78 కోట్లుగా నిర్ణయించారు. రెండో ప్రణాళిక మొదటి సంవత్సరాంతంలో ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. ఆంధ్ర రాష్ట్రం మొదటి ప్రణాళికాంతంలో ఏర్పడింది.

వాటి ఫలితంగా ప్రణాళికా నిర్వహణలో పాలనాపరమైన ఎన్నో సర్దుబాట్లు చేయవలసి వచ్చింది. మొదట్లో రెండో ప్రణాళికా మొత్తం పెట్టుబడిని రూ. 170.74 కోట్లుగా నిర్ణయించినా, తరువాత దాన్నిరూ. 179.89 కోట్లకు పెంచారు. కాని ఆ ప్రణాళికా కాలంలో పెట్టిన ఖర్చురూ. 188.60 కోట్లు మాత్రమే.

ఆంధ్రప్రదేశ్ మూడో పంచవర్ష ప్రణాళికకి గాను కేటాయించిన పెట్టుబడి మొత్తం రూ. 305 కోట్లు. కానీ చివరకి ఈ పెట్టుబడి మొత్తం రూ.312.66 కోట్లుగా సవరించడం జరిగింది.

## 13.5.1 మొదటి మూడు ప్రణాళికలలో నిర్దేశించిన ప్రాధాన్యాల క్రమం

మొదటి మూడు పంచవర్ష ప్రణాళికలలో వ్యవసాయం నీటిపారుదల, విద్యుచ్ఛక్తి రంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయానికి ఉన్న స్థానం దృష్ట్యా వ్యవసాయ రంగానికి ప్రాధాన్యమివ్వడంలో ఆశ్చర్యమేమీలేదు. జాతీయ ప్రణాళికలలో కూడా వ్యవసాయం అగ్ర స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మొత్తం జనాభాలో 2/3 వంతు మంది ఏదో ఒక రూపంలో వ్యవసాయం మీద ఆధారపడి బ్రతికేవారు. పై కారణాల వల్లనే మొదటి ప్రణాళిక మొత్తం పెట్టుబడిలో వ్యవసాయానికి (సమాజాభివృద్ధి కలుపుకొని) 13 శాతం మొత్తాన్ని కేటాయించారు. ఈ కేటాయింపు రెండో ప్రణాళికలో 20 శాతానికి, మూడో ప్రణాళికలో 22 శాతానికి పెంచారు.

వ్యవసాయాభివృద్ధికి నీటి పారుదల కీలకమైంది. అందువల్ల వ్యవసాయాభివృద్ధితో పాటు నీటి పారుదల సౌకర్యాల అభివృద్ధి కోసం ప్రణాళికలలో అధిక మొత్తాలను కేటాయించడం చూడవచ్చు. రెండో ప్రణాళికా కాలంలో నాగార్జున సాగర్ ప్రాజెక్టును చేపట్టడం వల్ల నీటి పారుదలకు కేటాయించిన మొత్తం ఎక్కువగా ఉంది. రెండో ప్రణాళికలో నీటి పారుదలకు గాను 39 కోట్లు రూపాయలు, మూడో ప్రణాళికలో 65 కోట్లు రూపాయలు ఖర్చు చేయడం జరిగింది. అంటే మొదటి పంచవర్ష ప్రణాళికలో మొత్తం ప్రణాళికా పెట్టుబడిలో నీటి పారుదల పథకాల కోసం కేటాయించిన పెట్టుబడి 22 శాతం, రెండో ప్రణాళికలో 31 శాతం, మూడో ప్రణాళికలో 26 శాతం ఉంది.

BRAOU

వ్యవసాయాభివృద్ధి సత్వరంగా జరగడానికి విద్యుచ్ఛక్తి పుష్కలంగా లభించాల్సి ఉంటుంది. ఈ రంగాన్ని అభివృద్ధి పరిచే నిమిత్తం ప్రణాళికా కాలంలో అనేక పథకాలను ప్రారంభించారు. మొదటి ప్రణాళికలో విద్యుచ్ఛక్తి ఉత్పత్తికి గాను మొత్తం పెట్టుబడిలో 39శాతం, రెండో ప్రణాళికలో 20శాతం, మూడో ప్రణాళికలో 27 శాతం కేటాయించారు.

మొదటి మూడు ప్రణాళికలలో వ్యవసాయం, నీటిపారుదల, విద్యుచ్ఛక్తి రంగాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం వల్ల పరిశ్రమలు, రవాణా, సాంఘిక సేవల రంగాలకు కేటాయింపులు అంతగా లేకపోయాయి. మూడు ప్రణాళికలలో పరిశ్రమలకు కేటాయించిన మొత్తం 1.15 కోట్లు (1శాతం), 10.13 కోట్లు (5శాతం), 15.19 కోట్లు (4 శాతం),సాంఘిక సేవా సౌకర్యాలకుగాను మొదటి ప్రణాళికలో రూ. 20.21 కోట్లు (21శాతం), రెండో ప్రణాళికలో రూ. 35.82 కోట్లు (20.3శాతం), మూడో ప్రణాళికలో రూ. 54.70 కోట్లు (5.5శాతం) కేటాయించారు. అంటే సాంఘిక సేవా సౌకర్యాలకు కేటాయించిన మొత్తాల శాతం క్రమంగా తగ్గుతూ వచ్చిందనే విషయం స్పష్టమౌతుంది. వాణిజ్య పంటలైన చెఱకు, ప్రత్తి పంటల విషయంలో కొంత అభివృద్ధి సాధించబడింది. అయితే నూనె గింజల పంటల విషయంలో నిర్ణయించుకొన్న లక్ష్యాలు ఆయా ప్రణాళికా కేంద్రాల్లో సాధించటం జరుగలేదు.

**సాంద్ర వ్యవసాయాభివృద్ధి పథకం :** సత్వర ఫలితాలను సాధించే ఉద్దేశ్యంతో కొరతగా ఉన్న వనరులను ఎంపిక చేసిన కొన్ని అభివృద్ధి పథకాల కోసమే వెచ్చించాలన్న నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఈ విధంగా చేయడం వల్ల అభివృద్ధికి అవకాశాలున్న ప్రాంతంలో ఆ పథకాలకు ప్రాధాన్యమిచ్చి, ఉన్న వనరులను అక్కడే కేంద్రీకరించి మంచి ఫలితాలను సాధించాలనే ఉద్దేశ్యంతో సాంద్ర వ్యవసాయిక జిల్లా పథకాలను ప్రారంభించారు. ఈ విధమైన విధాన నిర్ణయం జాతీయ

స్థాయిలో చేయడం, ఈ పథకంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లాను 1960లో ఎంపిక చేయడం జరిగింది. ఈ పథకం స్వల్ప కాలంలోనే సత్ఫలితాల్నిచ్చింది.

**పారిశ్రామికాభివృద్ధి :** పారిశ్రామికాభివృద్ధి విషయంలో రాష్ట్రం ప్రభుత్వం నిర్వహించిన పాత్ర అంత విశిష్టమైంది కాదు. రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి విషయంలో ప్రయివేట్ పెట్టుబడి గణనీయంగానే జరిగినప్పటికీ అనుకున్న లక్ష్యాలని సాధించలేదు. చిన్న తరహా పరిశ్రమల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధచూపింది.

పైన పేర్కొన్న రంగాలలోనే కాక ఇతర రంగాలైన విద్య, ఆరోగ్యం, గృహవసతి మొదలైన వాటిలో కూడా ప్రగతి సాధించడం జరిగింది.

## 13.5.2 వార్షిక ప్రణాళికలు (1966-69)

రాష్ట్రప్రభుత్వం నాల్గవ పంచవర్ష ప్రణాళికను (1966 నుండి 1970-71 వరకు) రూ. 700 కోట్ల పెట్టుబడితో సిద్ధం చేసింది. ఈ ప్రణాళిక ముఖ్యోద్దేశం రాష్ట్రతలసరి ఆదాయం 29.40 శాతం సాధించాలి. ఎందుకంటే రాష్ట్ర తలసరి ఆదాయం జాతీయ తలసరి ఆదాయం కంటే చాలా తక్కువగా ఉంది. కాని ప్రణాళికా జాతీయాభివృద్ధి సంస్థ 1965 సెప్టెంబరు 5,6 తేదీలలో సమావేశమై సూచించిన విధంగా నాలుగవ పంచవర్ష ప్రణాళిక స్థానంలో వార్షిక ప్రణాళికలు నిర్వహించడం జరిగింది. ఈ మార్పులకు కారణం ఆర్థిక వనరులను దేశరక్షణ శాఖాభివృద్ధికి తరలించడమే.

1966-67రాష్ట్ర వార్షిక ప్రణాళికలో రూ. 79.25 కోట్లు ఖర్చు చేయాలని మొట్ట మొదటిగా అంచనా వేశారు. దీనికి తోడుగా కేంద్ర ప్రభుత్వం అదనంగా రూ.11.25 కోట్లు నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు, చిన్న తరహా నీటి పారుదల ప్రాజెక్టుల్లకు గాను మంజూరు చేయడంతో రాష్ట్ర ప్రణాళికా తుది నిర్ణయ ఖర్చు రూ. 90.50 కోట్లకు పెరిగింది. కాని సవరించిన అంచనా ఖర్చు రూ. 94.38 కోట్లు. కానీ, 1966-67 ప్రణాళికలో వాస్తవంగా ఖర్చు పెట్టబడిన మొత్తం రూ. 93.40 కోట్లు మాత్రమే.

పైవిధంగానే రాష్ట్ర 1967-68 మరియు 1968-69వార్షిక ప్రణాళికలు కూడ తయారుచేశారు. వీటి ప్రకారం 1967-68 ప్రణాళికా పెట్టుబడి రూ. 74.87 కోట్లుగా నిర్ణయించారు. ఈ పెట్టుబడి మునుపటి సంవత్సరం పెట్టుబడి కంటే చాలా తక్కువ. తరువాత 1968-69 ప్రణాళికలో కూడా పెట్టుబడి ముందటి ప్రణాళిక కంటె తక్కువగానే నిర్ణయించబడింది. అంటే రూ. 92.13 కోట్లు మాత్రమే.

## 13.5.3 వార్షిక ప్రణాళికలలో ప్రగతి

రాష్ట్రంలో మూడవ ప్రణాళికా ఆరంభం నుండి, వార్షిక ప్రణాళికల చివరి వరకు (1969-70 వరకు) కొన్ని మిశ్రమ పరిణామాలను ఎదుర్కొనవలసి వచ్చింది. వ్యవసాయాధారమైన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వర్షాలు లేక దెబ్బతింది. 1968-69లో కోస్తా ప్రాంతం వరద వలన దెబ్బతిని, వ్యవసాయ ఉత్పత్తి దెబ్బతింది. దానికి తోడు జనాభా పెరుగుదల ఎక్కువైనందున పరిస్థితి తీవ్రంగా ఉంది. పై కారణాల ఫలితంగా రాష్ట్ర ఆదాయం కూడా తగ్గింది.

మూడవ వార్షిక ప్రణాళికా కాలంలో కొన్ని భారీ, మధ్యతరహా ప్రాజెక్టులు చేపట్టారు. కొన్నిటి నిర్మాణం పూర్తయింది. ఈ పథకాలకు రూ. 59.36 కోట్లు వెచ్చించారు. రాష్ట్రంలో తగినంత థర్మల్, హైడ్రో వనరులున్నా వాటిని తగిన పరిమాణంలో త్వరిత గతిని వినియోగించుకోలేకపోయాం. మొదటి ప్రణాళికారంభానికి నామ మాత్రంగా ఉన్న విద్యుత్ ఉత్పత్తి స్థాయి గణనీయంగా పెరిగినా, అవసరాలకు తగినంత ఉత్పత్తి అంచనాల స్థాయిని చేరుకోనలేదు.

మూడు వార్షిక ప్రణాళికలలోను వ్యవసాయోత్పత్తుల కోసం తీసుకున్న చర్యల వల్ల ఆశించిన ఫలితాలు సమకూరలేదు.

BRAOU

ఆహార ధాన్యాల ఉత్పత్తిలో ఆశించిన లక్ష్యాలను చేరుకోలేకపోయాం. ఐతే నూనె గింజల పంటలు, ఇతర వాణిజ్య పంటల పరిస్థితి కొద్దిగా మెరుగనిపించినా, మొత్తంమీద వ్యవసాయ రంగంలో పెద్దగా పురోగతి లేదు. అదే విధంగా పరిశ్రమల రంగంలో పెద్దగా పురోగతి కనిపించలేదు. భారీ మధ్యతరహా పరిశ్రమలు, చిన్న తరహా పరిశ్రమలు, ఖనిజాభివృద్ధి మొదలైన వాటి కోసం మొత్తం మీద రూ. 7.11 కోట్లు ఖర్చు చేయటం జరిగింది.

విద్యా రంగంలో ఒక విధంగా చెప్పుకోదగిన కృషి జరిగింది. సాధారణ విద్యా రంగంలోనే కాక, వృత్తి విద్యలలో కొంత ఆశాజనక పరిస్థితులేర్పడ్డాయి.

### 13.5.4 4వ ప్రణాళికా కాలంలో ఆర్థికాభివృద్ధి (1967-74)

తృతీయ ప్రణాళికలో రాష్ట్ర ప్రణాళిక మొత్తం ఖర్చు రూ. 353 కోట్లు ఉంది. ఈ ప్రణాళికలో ప్రణాళిక కోసం లభిస్తున్న కేంద్ర సహాయం కూడా తగ్గింది. దేశంలో నిరుద్యోగం, పాక్షిక నిరుద్యోగం, తక్కువ ఆదాయ సమస్యలు ఏమాత్రం పరిష్కారం కాలేదని నాల్గవ ప్రణాళికా ముసాయిదా పేర్కొంది. అలాగే కొద్ది మంది చేతులలో ఆస్తి ఆదాయ వనరులు చిక్కుకొని ఉన్నాయనే యదార్థాన్ని కూడా కాదనలేకపోయింది. అందువల్ల నిలకడతో కూడిన ఆర్థిక పురోగతి, స్వయం సమృద్ధి సాధనలను నాల్గవ ప్రణాళిక ప్రధాన ధ్యేయంగా పెట్టుకొంది. సాంఘిక న్యాయం, సమానత్వ సాధనకోసం కృషి జరపాలని నిర్ణయించింది. తన లక్ష్య సాధనలో వేగంగా ఏడాదికి 4-5శాతం చొప్పున జాతీయాదాయాన్ని పెంపొందించుకోవాలని 4 శాతం వ్యవసాయాభివృద్ధి రేటును 8-10 శాతం పారిశ్రామికాభివృద్ధి రేటును నిర్ణయించింది. వ్యవసాయ ఉత్పత్తులను అభివృద్ధి చేసుకోవాలని, ధరలను అదుపులో పెట్టాలని, ప్రారంభించిన నీటి పారుదల ప్రాజెక్టులను పూర్తి చేయాలని, ప్రాంతీయ అసమానతలను తగ్గించాలని నిర్ణయించింది.

BRAOU

త్వరితగతిన రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి అతిముఖ్యమైన వ్యవసాయం పరిశ్రమల రంగాలలో నాల్గవ ప్రణాళికా ఖర్చులో దాదాపు 42.3 శాతం విద్యుచ్ఛక్తి రంగంలో వినియోగించడం జరిగింది. నాల్గవ ప్రణాళికా ఖర్చులో విశేషంగా భారీ మధ్య తరహా నీటి పారుదల ప్రాజెక్టుల కొరకు కేటాయించడం జరిగింది. ప్రణాళికా ఖర్చుల్లో ఈ ముఖ్య రంగాలకు హెచ్చుగా మొత్తాలను కేటాయించడం వల్ల రవాణా కమ్యూనికేషన్లు, సాంఘిక సేవలు, పరిశ్రమలు ఇతర రంగాలకు తగిన మొత్తాలను ఖర్చు పెట్టడం జరుగలేదు.

**ప్రణాళిక ప్రగతి :** నాల్గవ ప్రణాళిక మొదటి నాలుగు సంవత్సరాలలోను రుతుపవనాల ప్రభావం అనుకొన్న విధంగా లేకపోవటం వల్ల రాష్ట్ర అభివృద్ధి కోసం చేసిన కృషి కొంతవరకు వృథా అయింది. అందువలన 4వ ప్రణాళికలోని అన్ని సంవత్సరాలలోను వ్యవసాయ రంగంలో ఆశించిన ప్రయోజనాలు చేకూరలేదు.

విద్యుచ్ఛక్తి రంగంలో నిధుల కొరత వలన అనుకున్న లక్ష్యాన్ని సాధించడం సాధ్యం కాలేదు. తత్ఫలితంగా విద్యుదుత్పాదక శక్తి తగ్గిపోవడం పొరుగు రాష్ట్రం నుంచి విద్యుచ్ఛక్తిని కొంత కాలం వరకు వినియోగించడం జరిగింది.

**కేంద్ర ప్రతిపాదిత ప్రత్యేక పథకాలు :** 4వ ప్రణాళికా కాలంలో ప్రాంతీయ అసమానతలు తగ్గించడానికి, అట్టడుగున ఉన్న ప్రజానీకానికి సాంఘిక న్యాయం చేకూర్చడానికి కొన్నిప్రత్యేక పథకాలను కేంద్రం ప్రతిపాదించింది.

వీటిలో ముఖ్యమైనపథకాలు :

1. క్షామ ప్రాంతాల అభివృద్ధి పథకం
2. గిరిజన ప్రాంతాల అభివృద్ధి పథకం

3. సన్నకారు రైతుల అభివృద్ధి పథకం

4. చిన్నకారు రైతుల వ్యవసాయ కార్మికుల పథకాలు

5. పారిశ్రామికంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పథకం

ఈ పథకాలన్నీ ప్రణాళికా కాలంలో మన రాష్ట్రంలో అమలు జరిగాయి.

మొత్తం మీద నాలుగవ ప్రణాళికా వ్యయం అతి తక్కువగా ఉండడంతో పాటు, దేశంలో చెలరేగిన ద్రవ్యోల్బణం ధరల పెరుగుదల వల్ల, ఆశించిన భౌతిక లక్ష్యాలు ఏమాత్రం నెరవేరలేదు.

### 13.5.5 5వ పంచవర్ష ప్రణాళిక (1974-78)

5వ ప్రణాళికా ముసాయిదా రెండు అతి ముఖ్యమైన లక్ష్యాలతో రూపొందించబడింది. ఒకటి, దారిద్ర్య నిర్మూలనం; రెండవది, స్వావలంబన సాధనం. ఈ లక్ష్యాల సాధనకు ఆర్థిక పురోభివృద్ధిలో అతిముఖ్యమైన కొన్ని మార్పులు జరగాలి.

5వ ప్రణాళిక పెట్టుబడి రూ. 1307.16 కోట్లుగా నిర్ణయించారు. 5వ ప్రణాళికను పరిశీలించినట్లయితే రాష్ట్రంలో వివిధ రంగాల కేటాయింపు విశదమౌతుంది. అందులో నీటి పారుదల, విద్యుచ్ఛక్తికి ప్రాధాన్యతను తగ్గించి, పరిశ్రమలు, గనులు,రవాణా, కమ్యూనికేషన్సు, సాంఘిక సేవలకు ప్రాధాన్యత నిచ్చారు. ఉదాహరణకు నీటి పారుదల, విద్యుచ్ఛక్తి రంగాలకు గాను, 4వ ప్రణాళికలో64.2 శాతం వ్యయంచేయగా, 5వ ప్రణాళికలో 51.3 శాతం మాత్రమే ఖర్చుచేయాలని అంచనా. ప్రధానంగా 5వ ప్రణాళికలో రాష్ట్రంలో ఎప్పుడో ప్రారంభించిన ఇంతవరకు పూర్తికాని నాగార్జునసాగర్, పోచంపాడు, తుంగభద్ర ఎగువకాల్వ, వంశధార మొదలైన మేజరు ప్రాజెక్టులను గోదావరి బ్యారేజిని పూర్తిచేయాలని తలపెట్టారు.

**ఆరు సూత్రాల పథకం :** పైన వివరించిన ప్రణాళిక కేటాయింపులు కాకుండా రాష్ట్ర సత్వర సమతౌల్య, సమగ్రాభివృద్ధి కోసం స్వర్గీయ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి ప్రకటించిన ఆరు సూత్రాల కార్యక్రమాన్ని అనుసరించి 5వ ప్రణాళికలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఏడాదికి రూ. 18 కోట్లు చొప్పున మొత్తం రూ. 90 కోట్లు హైదరాబాదు-సికింద్రాబాదు జంట నగరాల అభివృద్ధి కోసం రూ. 5కోట్లు కేంద్రం నుండి అదనంగా నిధులు లభించాయి.

**కనీస అవసరాల పథకం :** సమాజంలో వెనుకబడిన ప్రజల వెనుకబడిన తరగతుల, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికిగాను ప్రత్యక్షంగా 4వ ప్రణాళికా కాలంలో కేంద్రం ప్రతిపాదించిన క్షామ ప్రాంతాల అభివృద్ధి కార్యక్రమాలు సన్నకారు రైతుల అభివృద్ధి కార్యక్రమాలు, ఏజన్సీ ప్రాంత సమన్వయ పథకాలు, ప్రాంతీయ అభివృద్ధి పథకాలు 5వ ప్రణాళికలో కూడాకొనసాగాయి. పై కార్యక్రమంతో పాటు అదనంగా కొన్ని కార్యక్రమాలను చేర్చి ఈ పథకం అమలు చేశారు.

**20 అంశాల కార్యక్రమం :** 1975 జూలైలో ప్రధానమంత్రి ప్రకటించిన 20 అంశాల ఆర్థిక కార్యక్రమం అమలుకు చర్యలు తీసు కొన్నారు. ప్రజలను ముఖ్యంగా స్వల్పాదాయ వర్గాలకు, నిత్య జీవితావసర వస్తువులు అందించేందుకుగాను, సహకార వినిమయ స్టోర్సు, సూపర్ బజార్లు పట్టణాలోను, తాలూకా కేంద్రాలలోను తెరిచారు.

**5వ ప్రణాళికా కాలంలో ప్రణాళికా ప్రగతి :** అనుకోని కారణాల వల్ల 5వ ప్రణాళికా వ్యవధి ఒక సంవత్సరం ముందుగానే ముగిసింది. వ్యవసాయ రంగంలోను, ఆహార ధాన్యాల ఉత్పత్తిలోను ప్రగతి అంచనాల కంటే తక్కువగానే ఉంది. చిన్నతరహా పరిశ్రమల స్థాపన బాగా విస్తృతమయింది. విద్యా రంగంలో అనేక విశ్వ విద్యాలయాలను ఏర్పరచడం జరిగింది. భారీ మధ్య తరహా, చిన్న తరచా ప్రాజెక్టు అభివృద్ధికి చర్యలు తీసుకొన్నారు.

BRAOU

### 13.5.6 ఆరవ పంచవర్ష ప్రణాళిక (1980-85)

రాష్ట్ర ఆరవ ప్రణాళికా ముసాయిదా రాష్ట్ర ఆర్థికాభివృద్ధి రేటును పెంచాలని, సాధ్యమైనంతవరకు నిరుద్యోగం సమస్యను తగ్గించాలని, కనీస అవసరాలను ప్రజలకందించి వారి జీవన పరిస్థితులను మెరుగుపరచవలెనని, ఆదాయ ధన అవసరాలను తగ్గించాలని, ప్రాంతీయ అసమానతలను తగ్గించాలనీ స్వచ్ఛంద కుటుంబ నియంత్రణా పథకాలలో జనాభా పెరుగుదలను అరికట్టాలనే ముఖ్య ఉద్దేశ్యాలతో వెలువడింది.

పై ఉద్దేశ్యంతో ఆరవ ప్రణాళికలో రూ. 3,100.00 కోట్లు ఖర్చు పెట్టాలని అంచనా వేసి కడపటికి రూ. 3,416.16 కోట్లు ఖర్చు చేశారు. అందులో వ్యవసాయం అనుబంధ కార్యక్రమాల్లో రూ. 244.04 కోట్లు, సహకార శాఖకు రూ. 29.15 కోట్లు, నీటి పారుదల, రూ. 925.29 కోట్లు, విద్యుచ్ఛక్తికి రూ. 789.70 కోట్లు, పరిశ్రమలు గనులకు రూ. 105.66 కోట్లు, రవాణా, కమ్యూనికేషన్లుకు రూ. 236.00 కోట్లు, ఆర్థిక సేవలకు రూ. 28.30 కోట్లు సాధారణ సేవలకు రూ. 16.00 కోట్లు కేటాయింపబడింది.

**ప్రణాళిక ప్రగతి :** ఆరవ పంచవర్ష ప్రణాళికలో మొత్తం ఖర్చు ఆదాయంకంటె ఎక్కువైంది. ఈ ప్రణాళికలో వ్యవసాయం ఉత్పత్తిలో మంచి అభివృద్ధి జరిగింది. అలాగే బహుళార్థక సాధక, భారీ,మధ్య తరహా ప్రాజెక్టుల క్రింద అదనపు నీటి పారుదల సౌకర్యం కల్పించబడింది. విద్యుచ్ఛక్తిలో 1025 మిలియన్ వాట్ల ఉత్పత్తి కాగా 6,000 గ్రామాలు విద్యుత్తును పొందాయి.

**కొత్త 20 సూత్రాల ఆర్థిక పథకం :** బలహీన వర్గాలకు మరియు కొన్ని ప్రధానమైన అభివృద్ధి ప్రాంతాలకు ఈ కొత్త 20 సూత్రాల ఆర్థిక పథకం ఒక బంగారు బాట వంటిది. కొన్ని వెనుకబడిన జాతులైన షెడ్యూల్డు కులాలు, తెగలు, ఆర్థికంగా వెనుకబడిన తరగతులు, చిన్నకారు, సన్నకారు రైతులు, భూమిలేని స్త్రీలు, పిల్లల జీవన భృతిని పెంచి వారి జీవన పరిమాణాల్లో మార్పు తేవడం కోసం ఈ ప్రణాళికలను ప్రవేశపెట్టారు.

**ప్రగతి పథం :** 1983లో నిమ్న జాతులు అభివృద్ధి కోసం ఒక పథకం 'ప్రగతి పథం' ఆరవ ప్రణాళికా కాలంలో ప్రవేశపెట్టడం జరిగింది.

BRAOU

### 13.5.7 ఏడవ పంచవర్ష ప్రణాళిక (1985-90)

ఏడవ పంచవర్ష ప్రణాళికా ముసాయిదా డాక్యుమెంటు మూడు ప్రధాన లక్ష్యాలతో వెలువడింది. అవి: ఆహారం, పని, ఉత్పత్తి.

ప్రయివేటు పెట్టుబడితో కలిసి మొత్తం రూ. 16.497 కోట్లు పెట్టుబడితో రాష్ట్రంలోని ఏడవ ప్రణాళికా ముసాయిదా తయారు చేశారు.

ముసాయిదా డాక్యుమెంటులో పేర్కొన్న అశయాలు :

ఎ) రాష్ట్రాభివృద్ధి రేటు 6.5 శాతానికి పెంచటం.

బి) ఇన్ ఫ్రాస్ట్రక్చర్ పెట్టుబడులను అధికం చేయటం.

సి) సాంఘిక వినియోగ సౌకర్యాలను పెంచటం.

డి) ఆర్థిక సాంఘికాభివృద్ధికై తగిన చర్యలు తీసికోవటం.

ఇ) పేదరిక నిర్మూలన పథాకలపైన ప్రత్యేక శ్రద్ధ

ఎఫ్) ఉత్పత్తి పైన ప్రత్యేక శ్రద్ధ.

జి) యువకులు, స్త్రీలకూ సంబంధించి కొత్త అభివృద్ధి పథకాలను చేపట్టడం.

7వ ప్రణాళికలో ఆహారం,పని, ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. వీటికి ఎక్కువ కేటాయింపులు జరిగాయి. అదే విధంగా చిన్న తరహా నీటి పారుదల, గ్రామీణ విద్యుచ్ఛక్తి పథకాలు 7వ ప్రణాళికలో ప్రాధాన్యత పొందాయి.

**అభ్యాసం**

అ. రాష్ట్రంలో వార్షిక ప్రణాళికలు ప్రగతిని వివరించండి

ఆ. అయిదవ పంచవర్ష ప్రణాళికలోని ప్రధానాంశాల్ని వివరించండి.

BRAOU

## 13.6 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

★ కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు ప్రత్యక్ష పరోక్ష పన్నుల ద్వారా రుణాల ద్వారా ఆర్థిక వనరులను సమీకరిస్తాయి.

★ దేశంలో ప్రణాళికా సంఘమే వనరులను మదింపు చేసే ప్రథమ ఏజెన్సీ.

★ 1951లో మొదటి ప్రణాళికా సంఘం ఏర్పడింది.

★ ఆధునీకరణ; జాతీయ,తలసరి ఆదాయాల వృద్ధి, స్వావలంబనం, ఉద్యోగిత, సాంఘిక న్యాయం మొదలైనవి ప్రణాళికల ప్రధాన ఆశయాలు.

★ ఆరు పంచవర్ష ప్రణాళికల్లోను రాష్ట్రంలోచెప్పుకోదగ్గ అభివృద్ధి జరిగింది. ఏడవ పంచవర్ష ప్రణాళికలో ఆహారం, పని ఉత్పత్తులకు ప్రాధాన్యతను ఇచ్చారు.

## 13.7. మాదిరి పరీక్షా ప్రశ్నలు

30 పంక్తులలో జవాబులు రాయండి.

1. ప్రణాళికల ప్రధాన ఆశయాలను వివరించండి.
2. పంవచర్ష ప్రణాళికల్లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం సాధించిన ప్రగతిని సమీక్షించండి.

15 పంక్తులలో జవాబులు రాయండి.

1. ఆర్థిక వనరులను ప్రభుత్వాలు ఏ విధంగా సమీకరిస్తాయి.
2. వార్షిక ప్రణాళికలను గురించి వివరించండి.

BRAOU

# భాగం - 14 ప్రభుత్వ రంగ సంస్థలు

## విషయ క్రమం


14.0 ఉద్దేశం

14.1 ప్రవేశిక

14.2 ప్రభుత్వ రంగ సంస్థలు

అభ్యాసం

14.3 ఆర్థిక కార్యక్రమాలలో ప్రభుత్వ జోక్యం : కారణాలు

అభ్యాసం

14.4. ప్రభుత్వరంగ సంస్థల రకాలు

14.1 శాఖీయ రకం ప్రభుత్వరంగ సంస్థలు

14.2 కంపెనీ రకం ప్రభుత్వరంగ సంస్థలు

14.3 ప్రభుత్వ కార్పోరేషన్

14.5 ప్రభుత్వరంగ సంస్థల మారుతున్న తీరు

అభ్యాసం

14.6 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

14.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 14.0 ఉద్దేశం

ఈ భాగం చదివాక ఈ కింది అంశాల్ని మీరు వివరించగలుగుతారు :

- ★ ప్రభుత్వ రంగ సంస్థ అంటే అర్థం, వాటి రకాలు.
- ★ ఆర్థిక కార్యక్రమాలలో రాజ్యం జోక్యం చేసుకోవడానికి కారణాలు.
- ★ ప్రభుత్వ రంగ సంస్థల పనితీరు
- ★ ప్రభుత్వ సరళీకృత విధానం - ప్రభుత్వ రంగ సంస్థల భవిష్యత్తు

## 14.1 ప్రవేశిక

ఆర్థిక కార్యక్రమాలలో ప్రభుత్వాలు విస్తృతంగా పాల్గొనడం రెండవ ప్రపంచ యుద్ధానంతరం విశ్వ వ్యాప్తంగా జరిగిన

పరిణామం. చాలా కాలం వలస పాలనలో మ్రగ్గి రెండవ ప్రపంచ యుద్ధానంతరం విముక్తి పొంది మొన్నటి వరకు మూడవ ప్రపంచ దేశాలుగా పిలువబడిన దేశాలు (సోవియట్ యూనియన్‌లో వచ్చిన పరిణామాల దృష్ట్యా మూడవ ప్రపంచ దేశాలను అభివృద్ధి చెందుతున్న దేశాలుగా పేర్కొన్నారు) వాటి ఆర్థిక కార్యక్రమాలలో విస్తృతంగా పాల్గొనడం నిజంగా ఒక సాహసోపేతమైన చర్యగా వర్ణించవచ్చు. సామాజిక న్యాయం, సత్వర ఆర్థికాభివృద్ధి సాధించి దేశంలోని వివిధ ప్రాంతాలు, ప్రజల మధ్య ఆర్థిక అసమానతలు తొలగించి ప్రజాజీవన విధానంపై ప్రభావాన్ని చూపే కీలక రంగాలను ప్రభుత్వ యాజమాన్యంలోకి తీసుకురావడాన్ని దాదాపు అభివృద్ధి చెందుతున్న దేశాలన్నీ తమ ప్రధాన ఆశయాలుగా పెట్టుకున్నాయి. ఈ విధంగా నేడు ఏదో కొంత మేరకు ఆర్థిక కార్యక్రమాలలో పాల్గొనని ప్రభుత్వంగాని దేశం కాని లేదనే చెప్పాలి.

భారత దేశం విషయంలో పరిశీలిస్తే స్వాతంత్ర్యానికి పూర్వం కూడా గనులు, రైల్వేలు, జల మార్గాలు, ఇతర ప్రజావసర కార్యక్రమాలలో ప్రభుత్వం జోక్యం కలుగజేసుకున్నప్పటికీ అది చాలా పరిమితంగానే ఉండేది. కాని స్వాతంత్ర్యానంతరం సత్వర ఆర్థికాభివృద్ధికి ప్రణాళికా బద్ధమైన కృషి ప్రధాన సాధనంగా ఎంచుకోవడ వల్ల, ఇతర కారణాల వల్ల ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటుకు విస్తృతమైన కృషి జరిగింది. ఏ.హెచ్.హన్సన్ (A.H. Hanson) అనే రచయిత మాటల్లో చెప్పాలంటే "సత్వర ఆర్థికాభివృద్ధి సాధించాలనే ఆకాంక్షగల దేశం దాని అంతిమ దృష్టి ఏదైనప్పటికి, పనులన్నీ సాఫీగా సాగిపోవాలంటే అవసరమైన చోట్ల ప్రభుత్వ రంగ సంస్థలను స్థాపించడం తప్ప మరో గత్యంతరం లేదు. కాబట్టే ఆర్థిక గతిని నిర్ధారించడంలో ప్రభుత్వ రంగ సంస్థలను ఆర్థిక వ్యవస్థ ప్రధాన రంగాలు (The Commanding Sectors of Economy) గా భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ణించాడంటే వాటి ప్రాధాన్యత ఎంత ఉందో మనం గుర్తింపవచ్చు. అయితే ప్రభుత్వ రంగ సంస్థల విషయంలో వాటి పనితీరు ఆశాజనకంగా లేదు. ఆర్థిక వ్యవస్థలో ప్రయివేటీకరణకు జరుగుతున్న ప్రయత్నాల నేపధ్యంలో ప్రభుత్వ రంగ సంస్థల ప్రాధాన్యతను ఈ భాగంలో పరిశీలిద్దాం. ఈ రకం ప్రభుత్వ రంగ సంస్థలు వ్యాపార, సాంకేతిక దృక్పథాలతో సంస్థలను నిర్వహించడానికి దోహదం చేస్తాయి. మిగతా ప్రభుత్వ రంగ సంస్థల మాదిరిగాక, దీనికి విధుల నిర్వహణలో స్వాధీనత ఉన్నందున అనవసరమైన జాప్యాలను తొలగించడానికి వీలవుతుంది. అయితే ప్రభుత్వ శాసనానికి కట్టుబడి ఉండటం, వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణ, కార్మిక (సిబ్బంది) సంక్షేమం వంటి విషయాలలో ఇవి ఎంత వరకు విధేయంగా ఉంటాయనేది సందేహాస్పదం.

BRAOU

## 14.2 ప్రభుత్వ రంగ సంస్థలు

దేశ సామాజిక,ఆర్థిక రంగాలలో ప్రభుత్వ రంగ సంస్థలకు విశిష్టమైన స్థానముంది. ముందుగా "ప్రభుత్వ రంగ సంస్థలు' అంటే ఏమిటి అనేది తెలుసుకోవడం అవసరం. నేడు 'ప్రభుత్వ రంగ సంస్థలు' (Public Enterprises), ప్రభుత్వ రంగం (Public Sector), ప్రభుత్వాధీన సంస్థలు (Public Undertakings) అనే పదాలను దాదాపు ఒకే అర్థంలో వాడుతున్నాం. అయితే వీటిని 'ప్రభుత్వ రంగ సంస్థలు" అని వ్యవహరించడంలో గల సమస్యలను కొద్దిమంది రచయితలు గుర్తించారు. ప్రభుత్వ రంగం అని వ్యవహరిస్తే కేంద్ర,రాష్ట్ర ప్రత్యక్ష అజమాయిషిలో నడిచే సంస్థలకూ వీటికీ తేడా లేకుండా పోతుంది కాబట్టి ప్రభుత్వ యాజమాన్య సంస్థలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక వాణిజ్య సంస్థలు, స్వయం ప్రతిపత్తిగల కార్పోరేషన్లు,కంపెనీలుగా భావించాలని వీరి వాదన.

సాధారణ అర్థంలో చెప్పాలంటే పారిశ్రామిక,వాణిజ్య, విత్త స్వభావం గలిగి ప్రభుత్వం స్థాపించిన వ్యాపార సంస్థ (Enterprises) ను ప్రభుత్వ రంగ సంస్థలని అనవచ్చు.

అభ్యాసం

ప్రభుత్వ రంగ సంస్థ అంటే ఏమిటో వివరించండి ?

## 14.3 ఆర్థిక కార్యక్రమాలలో ప్రభుత్వజోక్యం-కారణాలు

రెండవ ప్రపంచ యుద్ధానంతరం, ఆసియా, ఆఫ్రికా ఖండాలలోని చాలా దేశాలు విదేశీ దాస్య శృంఖలాల నుండి విముక్తి పొంది స్వతంత్ర్య రాజ్యాలుగా అవతరించాయి. ఈ రాజ్యాలు సామాజిక, ఆర్థిక రంగాలలో ఎదురవుతున్న సమస్యలను ఎదుర్కొంటూ సత్వరంగా ఆర్థిక పురోభివృద్ధి సాధించాలనే ప్రయత్నంలో ఎన్నో కార్యక్రమాలను చేపట్టాయి. ముఖ్యంగా భారత దేశం వంటి వర్థమాన దేశాలు వాటి సమాజాలను పట్టి పీడిస్తున్న పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, అసమానతలు, ఆకలి కేకలు, పౌష్ఠికాహార లోపం,అజ్ఞానం వంటి సమస్యలను నిర్మూలించడానికి పాలనా, సంస్థాగత సంస్కరణలతో పాటు అధికోత్పత్తి సాధించడం వల్ల ప్రజల జీవన ప్రమాణాన్ని మెరుగు పరచడానికి ప్రయత్నాలు చేశాయి.

BRAOU

భారత దేశం విషయంలో పరిశీలిస్తే స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వం సామాజిక న్యాయంతో పాటు సత్వరాభివృద్ధి సాధించడానికి ప్రణాళికాబద్ధమైన కృషితో సమసమాజ నిర్మాణ స్థాపన తన ప్రధాన ఆశయాలుగా రాజ్యాంగంలో పొందు పరచుకుంది. ఫలితంగా ఆర్థిక కార్యక్రమాలలో విరివిగా పాల్గొనాలనే ఆకాంక్షను వ్యక్త పర్చింది. ఆర్థిక కార్యక్రమాలలో ప్రభుత్వం జోక్యం చేసుకోవడానికి లేదా సామాజిక జీవనంపై ప్రభావం చూపే కొన్ని రంగాలను ప్రభుత్వమే చేపట్టి నిర్వహించడానికి చాలా కారణాలున్నాయి.

అందులో ప్రధానమైనవి :

★ సమాజ సంక్షేమం దృష్ట్యా అవసరమనుకున్న కార్యకలాపాలు ప్రయివేటు యాజమాన్యాలు చేపట్టకపోవడం.

★ సామాజిక న్యాయం , సత్వరాభివృద్ధికై ప్రభుత్వం కొన్ని ఆశయాలు ఏర్పరచుకొంటుంది. అటువంటి ఆశయ సాధన పూర్తిగా ప్రయివేటు వ్యక్తులు/ సంస్థలకు వదిలివేస్తే వాటిపై అంతగా శ్రద్ధ కనపర్చకపోవచ్చు లేదా పూర్తిగా విస్మరించవచ్చు.

★ ప్రయివేటు వ్యక్తులు/సంస్థలు నిర్వహించే కొన్ని ఆర్థిక కార్యక్రమాలను సమర్థవంతంగా క్రమబద్ధ చేయడం/నియంత్రించడం వీలుగాక పోవడం మూలంగా కూడా ప్రభుత్వమే నిర్వహించాలని భావించడం.

★ సమాజ సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టే ఇతర కార్యకలాపాలతోపాటు కొన్ని ప్రభుత్వ రంగ సంస్థలను నెలకొల్పాలని ప్రభుత్వం తలచడం,

★ అభివృద్ధి ప్రక్రియను మెరుగుపరచి జాతీయాదాయాన్ని పెంచడం మూలంగా ప్రజల తలసరి ఆదాయాన్ని, జీవన ప్రమాణాన్ని పెంచడం వల్ల ప్రజాసంక్షేమాన్ని కాపాడటానికి ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటు ఒక అభివృద్ధి సాధనమని ప్రభుత్వం భావించడం,

★ దేశ రక్షణ, యుద్ధానికి సంబంధించిన విషయాలు ప్రయివేటు వ్యక్తుల నియంత్రణ లో ఉండటం సమంజసం కాదు. అటువంటి అంశాలను ప్రభుత్వమే చేపట్టి నిర్వహించవలసి రావడం,

★ స్వాతంత్ర్యానంతరం శీఘ్రతరమైన ఆర్థికాభివృద్ధి కోసం ప్రణాళికాబద్ధమైన కృషిని ఆశయంగా ఎంచుకోవడం వల్ల పేదరికం నిర్మూలన, వ్యక్తుల, ప్రాంతాల మధ్య ఆర్థిక అసమానతల తొలగింపుతోపాటు వ్యవసాయం, పారిశ్రామిక ఇతర సేవా రంగాల మధ్య, సంతులనమైన అభివృద్ధి సాధించడం కోసం కూడా ప్రభుత్వం ఆర్థిక కార్యక్రమాలలో విస్తృతంగా జోక్యం చేసుకోవలసి వచ్చింది.

**అభ్యాసం**

ప్రభుత్వం కొన్ని రంగాలను ఎందుకు స్వయంగా నిర్వహించాల్సి వస్తుందో వివరించండి?

BRAOU

## 14.4 ప్రభుత్వ రంగ సంస్థల రకాలు

దేశ అవసరాలను బట్టి, కార్య నిర్వహణ అధికారం(Operational authority) విత్తపర స్వాధీనత (Financial Authority) లను బట్టి, ప్రభుత్వ జవాబుదారీ ఎంత మేరకు ఉందనేదాన్ని బట్టి ప్రభుత్వరంగ సంస్థలను ప్రధానంగా మూడు రకాలుగా విభజింపవచ్చు.

అవి: (1) శాఖీయ, (2) కంపెనీ,(3) కార్పోరేషన్ రకాల ప్రభుత్వరంగ సంస్థలు.

### 14.4.1 శాఖీయ రకం ప్రభుత్వ రంగ సంస్థలు

శాఖీయ రకం (Departmental Form) ప్రభుత్వ రంగ సంస్థలకు రైల్వేశాఖ, తంతితపాల శాఖ,రక్షణ శాఖలు ఉదాహరణలు. ప్రభుత్వ రంగ సంస్థలలోకంటే శాఖీయ రకం ప్రభుత రంగ సంస్థలు అతి పురాతనమైనవి. ప్రభుత్వ రంగ సంస్థలు ఏర్పాటు చేసిన కొత్తలో ప్రభుత్వం నిర్వహించే పాలనా సంబంధ విధులకూ, ప్రభుత్వ యాజమాన్య సంస్థలకూ మధ్య మనకు పెద్ద తేడా కనిపించదు. ప్రపంచంలోని చాలా దేశాలలో ఇప్పటికీ శాఖీయ రకం ప్రభుత్వ రంగ సంస్థలే అధికంగా ఉన్నాయి.

### శాఖీయ రకం ప్రభుత్వ రంగ సంస్థల లక్షణాలు

1) వీటికి అవసరమైన నిధులను సంఘటిత నిధి నుండి తీసుకొని, వచ్చే ఆదాయం కూడా సంఘటిత నిధికే జమ చేయడం వల్ల ప్రభుత్వానికి లభించే ఆర్థిక వనరులను సమర్థంగా ఉపయోగించుకొనడానికి వీలవుతుంది.

2) ప్రభుత్వ కార్యాలయాల కార్యకలాపాలకు వర్తించే బడ్జెట్, అకౌంటింగ్, ఆడిటింగ్ నియంత్రణలు కూడా వీటికి వర్తించడం మూలంగా ప్రభుత్వ జవాబుదారీ (Public accountability) ని అధికంగా సాధించడానికి వీలవుతుంది.

3) సివిల్ సర్వెంట్లే వీటి శాశ్వత ఉద్యోగులుగా ఉండటం, వీరి నియామక పద్ధతి, సర్వీసు నియమ నిబంధనలు మిగతా సివిల్ ఉద్యోగుల మాదిరే ఉండటం మూలంగా వారి పనులకు వారే బాధ్యత వహిస్తారు. అయితే పాలన చర్యలకు సంబంధించిన అంతిమ బాధ్యత రాజకీయ నాయకులది (మంత్రిది) కాబట్టి పార్లమెంటులో మంత్రిని అడిగే ప్రశ్నలకు అవసరమైన సమాచారాన్ని సివిల్ సర్వెంట్లు పొందుపరుస్తూ సలహాదారులుగా ఉంటారు.

4) ఈ రకం ప్రభుత్వరంగ సంస్థలలో రహస్యాలు పాటించడం సులభం కాబట్టి దేశ రక్షణకు సంబంధించిన పరిశ్రమలన్నీ శాఖీయ రకంగానే ఉంటాయి.

5) ప్రభుత్వ రంగ సంస్థలపైన అధిక నియంత్రణ ఉండాలంటే ఈ రకం సంస్థలు అనువుగా ఉంటాయి.

శాఖీయ రకం ప్రభుత్వ రంగ సంస్థలలో రాజకీయ నాయకుల జోక్యం అధికంగా ఉండటం వల్ల అధికారంలో గల పార్టీ వీటిని తన సొంతానికి వాడుకునే అవకాశం వుంది. వీటి దినచర్యలలో మంత్రి (రాజకీయ నాయకుల) జోక్యం అధికంగా ఉండటం వలన సంస్థ పని కుంటుపడే అవకాశముంది. అలాగే ఆర్థిక పరమైన నియంత్రణలు అధికంగా ఉండటం, ఆదాయంలోని మిగులును సొంతానికి ఉపయోగించుకునే స్వాధీనత లేకపోవడం, మంత్రికి జవాబుదారీ వహించడం వంటి అంశాలు మూలంగా ఉద్యోగులలో కూడా చొరవ నశించే ప్రమాదముంది.

బ్రిటీష్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్ (BBC) మాజీ డైరక్టర్ జనరల్ లార్డ్‌రీత్ (Lord Reeth) బ్రిటన్‌లోని ప్రభువుల సభలో (House of Lords) మాట్లాడుతూ "ప్రభుత్వ సర్వీసులను శాఖీయ రకం ప్రభుత్వ రంగ సంస్థలచే నిర్వహించడమే జాతీయీకరణ, అని అనుకుంటే, నేను జాతీయీకరణ కంటే ప్రయివేటు యాజమాన్య నిర్వహణనే కోరుకుంటానని" పేర్కొన్నాడు.

### 14.4.2 కంపెనీ రకం ప్రభుత్వ రంగ సంస్థలు

వీటిని ప్రభుత్వ కంపెనీ లేదా జాయింట్ స్టాక్ కంపెనీలని కూడా పిలుస్తారు. ఇవి సాధారణంగా దేశ కంపెనీల చట్టం ప్రకారం స్థాపించబడి ఆ చట్టం పరిధిలోనే నడుచుకుంటాయి. 1956 కంపెనీల చట్టం ప్రకారం "ప్రభుత్వ కంపెనీ' అంటే

BRAOU

“కేంద్ర ప్రభుత్వం గాని, రాష్ట్ర ప్రభుత్వం గాని, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఉమ్మడిగా గాని లేదా ప్రభుత్వ కంపెనీ ఇతర అనుబంధ (Subsidiary) కంపెనీగాని మొత్తం చెల్లించిన మూలధనంలో 51 శాతానికి తక్కువ గాకుండా వాటాలను కలిగుంటే దానిని ప్రభుత్వ కంపెనీ అనవచ్చు”. జాయింట్ స్టాక్ కంపెనీలు చాలా వరకు లాభాలను ఆర్జించే విధంగా వ్యాపార నిర్వహణ కోసమే స్థాపించటం జరుగుతుంది. కాబట్టి సాధారణంగా ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణలో పాటించే నియంత్రణ, నియమ నిబంధనలు వీటికి వర్తించవు. అయితే ప్రభుత్వం వీటి డైరక్టర్ల నియామకం ద్వారా పరోక్షంగా నియంత్రణను కలిగి ఉండవచ్చు. దీనికి రాష్ట్రహోదా కూడా ఉండదు. ప్రభుత్వ కార్పోరేషన్ కంటే కంపెనీ రకం ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటు చాలా సులభం. ఇది ముఖ్యంగా ప్రయివేటు వ్యక్తులు, ప్రభుత్వం తమ తమ వాటా మూలధనం పెట్టుబడి పెట్టడం మూలంగా కలిసి పనిచేసే ఒక మిశ్రమ సంస్థ. కాబట్టి వాటి మూలధనంలో మార్పుల మూలంగా పరిశ్రమలను ప్రయివేటు యాజమాన్యంలోకి లేదా ప్రభుత్వ యాజమాన్యంలోకి మార్చడం కూడా సులభం. దీని ఉద్యోగులు సివిల్ ఉద్యోగులు కారు. వీరిని ప్రభుత్వ ఉద్యోగులనరు.

పార్లమెంటుకు జవాబుదారి వహించడం సాధ్యం కాకపోవడం, ఉద్యోగులు సివిల్ ఉద్యోగులు కాకపోవడం అనేవి కంపెనీ రకం ప్రభుత్వ రంగ సంస్థల బలహీనతలు.

### 14.4.3 ప్రభుత్వ కార్పోరేషన్

ప్రభుత్వం అధికారం ముసుగులో తన కార్యకలాపాలను నిర్వహించడంలో స్వాధీనత గల సంస్థలనే ‘కార్పోరేషన్ రకం’ ప్రభుత్వ రంగ సంస్థ అనవచ్చు. అమెరికా మాజీ అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ రూజ్వెల్ట్ అభిప్రాయంలో ‘కంపెనీ, శాఖీయ రకం ప్రభుత్వ రంగ సంస్థల పరిధిలోకి రాని, ప్రభుత్వ ప్రమేయంతో స్థాపించిన, వాణిజ్య కార్యకలాపాలకు నిర్వహించే స్వాధీనత గల సంస్థనే ‘కార్పోరేషన్ తరహా ప్రభుత్వ రంగ సంస్థ’ అని చెప్పవచ్చు.

ప్రభుత్వ కార్పోరేషన్లు ఒక ప్రత్యేక చట్టం ద్వారా ఏర్పాటయి, ఆ చట్టంలో వాటి అధికారాలు, విధులు, నిర్వహణ తీరుతెన్నులు, ప్రభుత్వంతో దానికుండవలసిన సంబంధాల వంటి అంశాలు వివరించి ఉంటాయి. వీటి లక్షణాలను పరిశీలిస్తే, చట్టపరమైన విషయాలలో ప్రత్యేక వ్యక్తి హోదా ఉంటుంది. కాబట్టి దీనిపై కోర్టులో దావా వేయవచ్చు లేదా ఇతరులపై దావా వేయవచ్చు . అలాగే వ్యక్తులు, సంస్థలతో వ్యాపార ఒప్పందాలు కుదుర్చుకోవచ్చు. తన పేరుపైఆస్తిని సంపాదించుకోవచ్చు.

BRAOU

మూలధన సంచయనం, నష్టాల పూరణంలో తప్ప, మిగతా విత్త వ్యవహారాలలో కార్పోరేషన్‌కు స్వాతంత్ర్యం ఉంటుంది. ఇది ప్రభుత్వ ఖజానా నుండి, ప్రజల నుండి అప్పులు తీసుకోవచ్చు. అలాగే తన వస్తు సేవలను అమ్మడం ద్వారా ఆదాయాన్ని రాబట్టుకోవచ్చు. దానికి లభించే ఆదాయాన్ని తిరిగి ఉపయోగించుకునే అధికారం కూడా దీనికుంటుంది. ఇతర ప్రభుత్వ సంస్థలకు వర్తించే బడ్జెట్, అకౌంటింగ్,ఆడిట్ శాసనాలు, పద్ధతులు సాధారణంగా వీటికి వర్తించవు. ప్రభుత్వ కార్పోరేషన్ ఉద్యోగులు సివిల్ ఉద్యోగులు కారు. దాని నియమ నిబంధనల ప్రకారం స్వంత ఉద్యోగులులను నియమించుకునే అధికారం దీనికుంది.

## 14.5 ప్రభుత్వ రంగ సంస్థలు మారుతున్న తీరు

1945 ఏప్రిల్ 21లోనే భారత ప్రభుత్వం యుద్ధానంతరం (రెండవ ప్రపంచయుద్ధానంతరం) పారిశ్రామిక విధాన తీర్మానానికి సంబంధించి ఒక శ్వేత పత్రాన్ని విడుదల చేసింది. దానిప్రకారం పార్లమెంటులో పారిశ్రామిక విధాన తీర్మానానికి సంబంధించిన ఒక చట్టం తేవాలని, పారిశ్రామికీకరణ ప్రధాన ఆశయాలు దేశానికి అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని జాతీయ సంపదను పెంచాలని, రక్షణ విషయంలో అవసరమైన మెలకువలు తీసుకోవాలని,

ఉద్యోగావకాశాలు అధికంగా మెరుగుపరచడం లాంటివి పారిశ్రామిక విధానం ప్రధాన ఆశయాలని భావించారు. ఇందు కోసం (1) ఇనుము,ఉక్కు, (2) ప్రైమూవర్స్ తయారీ, (3) ఆటోమొబైల్స్, (4) ట్రాక్టర్లు, ఇతర రవాణా వాహనాలు, (5) విమానాలు, (6) షిప్ బిల్డింగ్, (7) మెరైన్ ఇంజనీరింగు , (8) ఎలక్ట్రికల్ యంత్ర పరికరాలు వంటి జాతీయ ప్రాధాన్యంగల కీలక రంగాలు జాతీయం చేయాలని సూచన ఇచ్చారు. ఈ నేపథ్యంలో వివిధ ప్రభుత్వ పారిశ్రామిక విధాన తీర్మానాల రూపకల్పన, వాటి పట్ల ప్రభుత్వం అవలంభించిన వైఖరి ప్రకారం ప్రభుత్వ రంగం పాత్రను గమనించవచ్చు.

మొదటి పారిశ్రామిక విధాన తీర్మానం (1948) దేశ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడానికి, ప్రభుత్వ అజమాయిషీలో పరిశ్రమలను నెలకొల్పడానికి ప్రాధాన్యత నిచ్చింది.ముఖ్యంగా శీఘ్రతరమైన ప్రణాళికాబద్ధమైన ఆర్థికాభివృద్ధికి మిశ్రమ ఆర్థిక విధానం అత్యంతావశ్యకమని గుర్తించి ప్రభుత్వం చేపట్టి నిర్వహించేవి, ప్రయివేటు వ్యక్తులు చేపట్టి నిర్వహించే ఆర్థిక కార్యక్రమాలను 4 భాగాలుగా వర్గీకరించింది. నెహ్రూ ఆధ్వర్యంలోని నూతన ప్రభుత్వం సమ సమాజ నిర్మాణ స్థాపన ధ్యేయంగా ప్రధాన ఉత్పత్తి సాధనాలన్నీ రాజ్య అజమాయిషి, నియంత్రణలో ఉండాలని భావించింది.

పై నేపథ్యంలో 1956లో రూపొందిన రెండవ పారిశ్రామిక విధాన తీర్మానం పరిశ్రమలను ప్రధానంగా మూడు తరగతులుగా వర్గీకరించింది. అవి : (1) కేవలం ప్రభుత్వ అజమాయిషీలో నడిచేవి (రక్షణ, రైల్వేల వంటివి), (2) క్రమంగా ప్రభుత్వ అజమాయిషీలోకి తేబడేవి (రవాణా, ఎరువులు), (3) కేవలం ప్రయివేటు వ్యక్తులు, సంస్థలు మాత్రమే చేపట్టి నిర్వహించేవి. ఈ విధంగా రెండవ పారిశ్రామిక విధాన తీర్మానం మన ఆర్థిక వ్యవస్థలో మిశ్రమ ఆర్థిక విధానాన్ని పాదుకొలిపి ప్రభుత్వ రంగానికి పెద్ద పీట వేసిందని చెప్పాలి. ముఖ్యంగా ఆర్థిక వ్యవస్థపై ప్రభావాన్ని కలుగజేసే వివిధ కార్యకలాపాలకు ప్రభుత్వ రంగం విస్తరింపబడి, అతి కీలకమైన వస్తువుల ఉత్పత్తి,మౌలిక సదుపాయాల కల్పన ప్రభుత్వ రంగానికి అప్పగించబడి, వినియోగదారునికి అవసరమైన అత్యవసర వస్తువులను సరఫరా చేయడం ద్వారా ప్రభుత్వ రంగం ఒక సామాజిక స్థిరీకరణ శక్తిగా అవతరించింది.

BRAOU

మొదటి, రెండవ పారిశ్రామిక విధాన తీర్మానాలు ప్రయివేటు రంగానికి కొంత ప్రాధాన్యత ఇచ్చినప్పటికి జాతీయీకరణతో (1969) ప్రభుత్వ రంగం విస్తరించడం వల్ల ప్రయివేటు రంగం చిన్నచూపుచూడబడటం ఫలితంగా పారిశ్రామికాభివృద్ధి పెరుగుదల మందగించిందని గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 2, 1974లో తన పారిశ్రామిక విధాన తీర్మానాన్ని సవరించింది. ఫలితంగా ప్రభుత్వ మూడవ పారిశ్రామిక విధాన తీర్మానం (1973) లో కొన్ని పెద్ద ప్రయివేటు వ్యాపార సంస్థలకు (లైసెన్సులు మంజూరు చేయడం వంటి చర్యల మూలంగా) వెసులు బాటు కల్పించారు.

నాల్గవ పారిశ్రామిక విధాన తీర్మానం (1977) చేపట్టే నాటికి కేంద్రంలో ప్రభుత్వం మారి జనతా పార్టీ అధికారంలోకి రావడంతో తన ఆశయాల కనుగుణంగా పారిశ్రామిక విధానాన్ని మార్చ సంకల్పించింది. ఫలితంగా 1977 పారిశ్రామిక విధాన తీర్మానంలో కుటీర పరిశ్రమలు ఏర్పాటు , చిన్న తరహా పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించే నేపథ్యంలో జిల్లా పారిశ్రామిక కేంద్రాలు ఏర్పాటు, గ్రామీణ పరిశ్రమల కమీషన్ ఏర్పాటు, నిర్ణయీకరణలో పారిశ్రామిక కార్మికులకు భాగస్వామ్యం కల్పించడం వంటి అంశాలకు ప్రాధాన్యత నివ్వడం లాంటి అంశాలను మినహాయిస్తే మిగతా పారిశ్రామిక విధాన తీర్మానాలతో పోలిస్తే దీనిలో చెప్పుకోదగిన ప్రత్యేక అంశాలేమీ లేవనే చెప్పాలి. అలాగే దీని తరువాత చేపట్టిన 20 (ఇరవై) అంశాల కార్యక్రమం (1982), నూతన 20 (ఇరవై) అంశాల కార్యక్రమం (1986) కూడా ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ రంగం ప్రాధాన్యతను గుర్తించాయి. అయితే 1985లో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పారిశ్రామిక విధానంలో ప్రభుత్వం సాధించదలచిన వృద్ధి, సమత, సామాజిక న్యాయం, స్వయం సమృద్ధి, మెరుగైన ఉత్పత్తి సామర్థ్యం లాంటి ఆశయాల నేపథ్యంలో 1985 పారిశ్రామిక విధాన తీర్మానంలో సరళీకృత విధానం అనుసరించడానికి ఎఫ్ ఇ ఆర్ ఎ లు (F E R A) ఎమ్ ఆర్ టి పి (M R T P) లో కొన్ని మార్పులు చేయడం ద్వారా పెద్ద పారిశ్రామిక సంస్థలపై ప్రభుత్వ నియంత్రణ విషయంలో కొంత మెతక

వైఖరిని అవలంబించిందని చెప్పవచ్చు.

అయితే 1991-92లో చేపట్టిన ఏడవ పారిశ్రామిక విధాన తీర్మానాన్ని పరిశీలిస్తే ప్రభుత్వ రంగం మీద చిత్త శుద్ధిలేని ప్రభుత్వ వైఖరి బహిర్గత మవుతుంది. ముఖ్యంగా సరళీకృత విధానం పేర పెద్ద పెద్ద పారిశ్రామిక , వ్యాపార సంస్థలు తమ కార్యక్రమాలను విస్తృత స్థాయిలో చేపట్టి నిర్వహించడానికి ప్రయివేటు రంగానికి అవసరమైన స్వేచ్ఛను ఇవ్వడమే కాక బహుళజాతీయ సంస్థలు తమ కార్యక్రమాలను స్వేచ్ఛగా కొనసాగించడానికి అవసరమైన వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించింది. ఈ రకంగా ఆర్థిక రంగం నుండి ప్రభుత్వం క్రమంగా వెనక్కి తగ్గే స్వభావం అవలంబించడం వల్ల ప్రభుత్వ రంగ సంస్థల భవిష్యత్తు అయోమయంలో పడింది. దీనికి తోడు ప్రభుత్వ రంగ సంస్థలు అలవికాని నష్టాలు, అప్పుల బాధలో కూరుకుపోవడం, అసమర్థత హెచ్చి, ఉత్పత్తి మందగించడం, జవాబుదారీ తనం లోపించడం, పాలకులు యజమానులుగా ప్రభుత్వ రంగ సంస్థల్లో రాజకీయ జోక్యానికి పాల్పడటం, కార్మిక సంఘాలు తీవ్ర వాద ధోరణిని అవలంబించడం లాంటి సమస్యల మూలంగా ప్రభుత్వ రంగ సంస్థల ఉనికి పుండుపై కారం చల్లినట్లయింది.

ఇది వరకు ప్రజల సామాజిక, ఆర్థిక జీవన విధానాన్ని ప్రభావ పరిచే ఆర్థిక కార్యక్రమాలలోవిస్తృతంగా పాల్గొనిన ప్రభుత్వం (రాజ్యం) పై కారణాల వలన ఆర్థిక రంగం నుండి వైదొలగాలని, తన అజమాయిషిలో ఉన్న సంస్థలను ప్రయివేటీకరించాలని ఆలోచిస్తోంది. ఈ ఆలోచనకు రాజీవ్ గాంధి హయాంలోనే అంకురార్పణ జరిగిందని చెప్పాలి. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రభుత్వ రంగ సంస్థలను వదిలించుకోవడం ఒక సమస్యగా మారింది. సమసమాజ స్థాపన , శీఘ్రగతిన ఆర్థికాభివృద్ధి ప్రధాన లక్ష్యంగా స్థాపించిన ప్రభుత్వ రంగ సంస్థలు అధికోత్పత్తి మాట అటుంచి, ఉత్పత్తి మందగించి, నిర్వహణసామర్థ్యం లోపించడం, ఉద్యోగుల జీతాలు సమస్యలుగా మారి అలవికాని నష్టాల ఊబిలో కూరుకుపోవటంతో వీటి పోషణ ప్రభుత్వానికి భారంగా తయారయింది. కాబట్టి అతి ప్రాధాన్యం గల కొన్ని అంశాలు తప్ప మిగతా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేయాలని ప్రభుత్వం తలుస్తోంది. అయితే కార్మిక సంఘాల నాయకులు, కొన్ని రాజకీయ పార్టీల నుండి వ్యతిరేకత రావడంతో ఆ ఆలోచన విరమించుకుంటున్నారు. ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ఆర్థిక నిధుల వత్తిడి మూలంగా ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ పవనాలు బలంగానే వీస్తున్నాయి. ఇందులో భాగంగానే వర్తకం (trade) విత్త రంగాల్లో (Finance) డి రెగ్యూలరైజ్ (de regularise) చేయడం, కంట్రోళ్ళు, లైసెన్సుల విషయంలో సరళీకృత విధానాన్ని అవలంబించడం, ప్రయివేట్ వ్యక్తులు, మార్కెట్ శక్తుల విపణిలో స్వేచ్ఛగా పాల్గొనేటట్లుగా చేయడం, కొన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరించడం లాంటి అంశాలు ఇందుకు ఉదాహరణలు. ఈ రకంగా ఆర్థిక పరివర్తన, అభివృద్ధికి ప్రయివేటీకరణను న్యాయబద్ధమైన , కార్యసాధకమైన సాధనంగా ఇటీవలి కాలంలో గుర్తించటం జరిగింది.

BRAOU

**అభ్యాసం**

ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణకు కారణాలేమిటి?

## 14.6 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

★ పారిశ్రామిక, వాణిజ్య, విత్త స్వభావం కలిగి ప్రభుత్వం స్థాపించిన వ్యాపార సంస్థ (enterprise) ను ప్రభుత్వ రంగ సంస్థలని పేర్కొంటారు.

★ సామాజిక జీవనంపై ప్రభావం చూపే కొన్ని రంగాలను ప్రభుత్వమేచేపట్టి నిర్వహించడం ద్వారా ఆర్థిక కార్యక్రమాలలో జోక్యం తప్పని సరి అయ్యింది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో జీవన ప్రమాణం మెరుగు పరచే ప్రయత్నాలలో ఇది ఒక భాగం అయ్యింది.

★ ప్రభుత్వ రంగ సంస్థల్లో కొన్ని రకాలున్నాయి : అవి 1. శాఖీయ, 2. కంపెనీ, 3. కార్పోరేషన్, ప్రభుత్వ రంగ సంస్థలు.

★ ప్రభుత్వ విధానాలను బట్టి ప్రభుత్వ రంగ సంస్థల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇందులో ప్రధానంగా ప్రభుత్వ రంగాలను ప్రయివేటీకరించటం పై అనుకూలత ఎక్కువగా ఇటీవల కన్పిస్తోంది.

## 14.7. మాదిరి పరీక్షా ప్రశ్నలు

**30 పంక్తులలో జవాబులు రాయండి.**

1. ఆర్థిక కార్యక్రమాలలో ప్రభుత్వ జోక్యానికి దారితీస్తున్న పరిస్థితులను సూచించండి.
2. ప్రభుత్వ రంగ సంస్థల్లో రకాలను పేర్కొని వాటి స్వరూపాన్ని వివరించండి?

**15 పంక్తులలో జవాబులు రాయండి.**

1. ప్రభుత్వ రంగ సంస్థలంటే ఏమిటి?
2. సరళీకృత విధాన ప్రభావం ప్రభుత్వ రంగాలపై ఎలా ఉంది?

BRAOU

BRAOU

# ఖండం – IV ఆంధ్రప్రదేశ్ : అభివృద్ధి సమస్యలు

ఈనాడు సమాజానికి సంబంధించి అనేక అంశాలను గుర్తించటమే కాకుండా వాటి పరస్పరతను తెలుసుకోవటం అత్యవసరమైంది. మానవ వికాసానికి సంబంధించి, సమాజాభివృద్ధికి సంబంధించి మనం స్థూలంగా తెలుసుకోవాల్సిన రంగాలు కొన్ని ఉన్నాయి. వాటిని ఈ ఖండం పరిచయం చేస్తుంది. ఈ ఖండంలో 6 భాగాలున్నాయి. అవి :

15. విజ్ఞాన సాంకేతిక శాస్త్రాలు,
16. మానవ వనరులు.
17. పర్యావరణ, ఇంధనం
18. సామాజికా శాంతి
19. పారిశ్రామిక రంగం.
20. వ్యవసాయ రంగం.

B R A O U

BRAOU

# భాగం - 15 విజ్ఞాన సాంకేతిక శాస్త్రాలు

## విషయ క్రమం


15.0 ఉద్దేశం

15.1 ప్రవేశిక

అభ్యాసం

15.2 ప్రాచీన సంప్రదాయాలు - భారతదేశం

అభ్యాసం

15.3 భారతదేశం - స్వాతంత్ర్యానంతర దశ

అభ్యాసం

15.4 ఆంధ్రప్రదేశ్ లోని విజ్ఞాన సాంకేతిక శాస్త్రం

15.5 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

15.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 15.0. ఉద్దేశం

ఈ భాగం పూర్తి చేసిన తర్వాత మీరు కింది అంశాలను వివరించగలుగుతారు:

★ భారతదేశ ప్రాచీన సంప్రదాయాలు, విజ్ఞాన సాంకేతిక శాస్త్రంలో ప్రాచీన భారతీయుల కృషి.

★ భారతదేశం స్వాతంత్ర్యానంతర దశలో విజ్ఞాన సాంకేతిక, శాస్త్రాలపై రాజకీయ సాంస్కృతిక నైతిక విలువల ప్రభావం.

★ ఆంధ్రప్రదేశ్ విజ్ఞాన సాంకేతిక శాస్త్రాల అభ్యున్నతికి చేసిన తోడ్పాటు.

## 15.1 ప్రవేశిక

మానవుని మనుగడలో విజ్ఞాన సాంకేతిక శాస్త్రాలు విడదీయలేని అంతర్భాగాలు. అవి ఆదినుండి ఈనాటి వరకూ మానవ నాగరికతను మలిచాయి. భవిష్యత్తులో కూడా ఇవి ప్రభావితం చేయగలుతాయి. అందుకే ఇవి అవిచ్ఛిన్న శక్తులు. విజ్ఞాన శాస్త్రం కానీ సాంకేతిక శాస్త్రం కానీ ఆకస్మికంగా ఒక రోజులో పుట్టలేదు. ఇవి ఆద్యంతాలు లేని అన్వేషణా ప్రతిఫలాలు. విజ్ఞాన శాస్త్రం అధ్యయనంలో రెండు ప్రధాన అంశాలున్నాయి. అవి: (1) తెలుసుకోవడం (to know) (2) ఆచరణలో పెట్టడం (to do)

ఈ రెండు అంశాలు అవిభాజ్యాలు. అయితే ఇటీవలి కాలంలో ఈ రెండు అంశాల మధ్య తేడాను మనం గమనిస్తున్నాం. విజ్ఞాన శాస్త్రం అనే పదం లాటిన్ భాషలోని Scera లేదా Scientia అనే పదాల నుండి ఆవిర్భవించింది. దీని అర్థం 'తెలుసుకోవడం' అని చెప్పుకోవచ్చు. నాల్గు దశాబ్దాల కిందటి వరకూ విజ్ఞాన శాస్త్రాన్ని ప్రకృతి



BRAOU

తత్వ శాస్త్రంగా పరిగణించేవారు. విజ్ఞాన శాస్త్రం అధ్యయనంలో ఆచరణీయ అంశాన్ని సాంకేతిక శాస్త్రం అనే కొత్త పేరుతో పిలిచేవారు. అయితే విజ్ఞాన శాస్త్రం లేకుండా సాంకేతిక శాస్త్రం లేదు. విజ్ఞాన శాస్త్ర ఫలితాలు ప్రయోగశాలను అధిగమించి, మానవ జీవితానికి ప్రతిబంధకంగా ఉన్న కష్టాలను అధిగమించటానికి దోహద పడకపోతే, విజ్ఞాన శాస్త్రం మానవునికి నిరుపయోగం అని చెప్పవచ్చు. విజ్ఞానశాస్త్రం అధ్యయనంలో ఒక విశిష్టమైన అంశం వైజ్ఞానిక పద్ధతి. ఇది ఉద్దేశ పూర్వక పద్ధతి కంటే భిన్నమైంది. ఉద్దేశ పూర్వక పద్ధతికి నిర్దిష్టమైన (అందరికీ ఆమోదయోగ్యమైన) నిర్వచనం లేదు. అయితే చాలామంది దీనిని E.O.D పద్ధతిగా భావిస్తారు. E.O.D. అంటే (Experimentation, Observation, Deduction) ప్రయోగాత్మక, పరిశీలనాత్మక నిగమన పద్ధతి. అయితే ఈ పద్ధతిలో మధ్యలో దోష సవరణ పద్ధతులను చేపట్టి, ఉపకల్పన, ధ్రువీకరణలను పొందుపరుస్తూ మళ్లీ మళ్లీ ప్రయోగాత్మకంగా పరిశీలనలను జరిపి, మళ్లీ దోషనివారణ పద్ధతుల ద్వారా సిద్ధాంత ధృవీకరణాలను సాధిస్తే అది వైజ్ఞానిక పద్ధతి అవుతుంది. ఇది అంతంలేని ప్రక్రియ. అందువల్లనే ఒక దశాబ్దంలో శాస్త్రవేత్తలు ప్రతిపాదించిన ఉపకల్పనలు, తరువాత జరిపిన ప్రయోగ పరిశీలన వల్ల తరువాత దశాబ్దాలలో సవరించుకోవలసి రావడం జరిగింది. లేదా నిరుపయోగమైనవిగా బుట్ట దాఖలు చేయడం జరిగింది. ఆమోదయోగ్యమైన సిద్ధాంతం స్థానంలో, మరింత మెరుగైన సిద్ధాంతం ఆవిర్భవించేవరకే ప్రతి వైజ్ఞానిక సిద్ధాంతమూ నిజం.

అయితే సాంకేతిక శాస్త్రంలో ఈ విధమైన మౌలికమైన పరస్పర విరుద్ధమైన సిద్ధాంత రూపాంతరాలు రాలేదు. ఒక విధంగా చూస్తే సాంకేతిక శాస్త్ర చరిత్రే మానవ చరిత్ర అని చెప్పవచ్చు. మానవుడు తన మనుగడను సౌఖ్యంగా గడిపేందుకు వినియోగించిన సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగానే, మానవ చరిత్రను అనేక యుగాలుగా విభజించారు. పాతరాతియుగం, కొత్తరాతి యుగం, లోహయుగం మొదలైన విభజనలు సాంకేతిక శాస్త్ర పురోగమనాన్ని సూచించేవే. ఇది ఒక మౌలిక ప్రశ్నను రేకెత్తించింది. విజ్ఞాన శాస్త్రం మొదట పుట్టి క్రమేపి అది సాంకేతిక శాస్త్రంగా పరిణమించిందా? లేక సాంకేతిక శాస్త్రం మొదటపుట్టి విజ్ఞానశాస్త్రం అందుకు అవసరమైన సిద్ధాంత పరమైన ఆధారాన్ని కల్పించిందా? దీనికి ఇదమిత్థమైన, అందరికీ ఆమోదయోగ్యమైన సమాధానం లేదు. ఎందుకంటే ఈనాడు విజ్ఞాన సాంకేతిక శాస్త్రాలను విడదీయలేము. వీటిని విభిన్న కోణాలనుండి కానీ, వేర్వేరు దృక్పథాలనుండి కానీ చూడలేము. వ్యాఖ్యానించలేము. ఈ సత్యాన్ని మనం అంగీకరించక తప్పదు. క్లుప్తంగా చెప్పాలంటే విజ్ఞానశాస్త్రం ఉనికిని మానవునికి తెలియ చెప్పేదే సాంకేతిక శాస్త్రం. మానవుని ఉనికిని మానవేతర జీవరాసులనుంచి వేరు చేసేదే సాంకేతిక శాస్త్రం. అందుకే సాంకేతిక శాస్త్రాన్ని మానవుని అదనపు శారీరక అంగం (extra - corporal organ) అంటారు. మానవ జీవితానికీ, మానవుని మనుగడకూ, అవసరమైన జీవితావసరాలను సమకూర్చుకోవడానికీ వినియోగదాయకమైన జ్ఞానేంద్రియాలు విజ్ఞాన శాస్త్రాలు అని మనం చెప్పుకోవచ్చు.

BRAOU

**అభ్యాసం**

విజ్ఞాన సాంకేతిక శాస్త్రాలను ఎందుకు విడదీయలేము ?

## 15.2 ప్రాచీన సంప్రదాయం : భారతదేశం

ప్రాచీన భారతదేశంలో వేదాలు విజ్ఞాన సాంకేతిక శాస్త్రాలకు భాండాగారాలు. వేదం అంటేనే విజ్ఞానమని చెపుతారు. వేదాలు జ్ఞానానికి సంబంధించిన గొప్ప నిధులు అయినప్పటికీ, వేదాలలోని విజ్ఞానం ఏదైనా, అది మతం, ఆచారం, జీవిత విధానం అనే వాటితో క్లిష్టంగా ముడిపడి ఉంది.

పాశ్చాత్య చరిత్ర కారులూ, వేదాంత వేత్తలూ తెలియ చెప్పేంతవరకు మన వైభవోపేతమైన గతం గురించి మనకెవ్వరికీ తెలియదు. విలియం జోన్స్, ప్రిన్‌సెప్, మాక్స్ ముల్లర్, గోల్డ్ స్టకర్, బెర్నాల్, విల్‌సన్, ఫెర్గుసన్, వంటి ప్రాచ్య విషయాల అధ్యయనవేత్తలు ప్రాచీన భారతదేశం సాధించిన ప్రగతిని, తమ చరిత్రాత్మక పరిశోధనల ద్వారా పాశ్చాత్య ప్రపంచానికే కాక, విద్యావంతులైన భారతీయులకు గూడా తెలిసేలా వెలువరించారు. 1971లో కొత్త ఢిల్లీలోని ఇండియన్ అకాడమీ వారుకూ A Consise History of Science in India అనే సమగ్ర రచనను ప్రచురించారు. యాజ్ఞవల్క్యుడు "మానవ జీవిత వాస్తవోద్దేశం ఈ విశ్వాన్ని వైజ్ఞానికంగా పరిశోధించడమే" నని చెప్పాడు. నారద సంహితను బట్టి, వైజ్ఞానిక సాంకేతిక రంగాలకు సంబంధించి 18మంది కృషి చేశారని చెపుతారు. వీరు బ్రహ్మ, సూర్య, వశిష్ఠ, అత్రి, మను, పౌలస్త్య, లోమాష, యారిచి, అంగీర, వ్యాస, నారద, శౌనక, భృగు, చ్యవన, యవన, గర్గ, కాశ్యప, పరాశరు లనేవారు. అయితే వీరి రచనలను కానీ, వారి తర్క పద్ధతులను కానీ అర్థం చేసుకోవాలంటే వారి వేదాంత ధోరణులనూ, వారి సంవాదాలలోని, మత, ధార్మిక, ఆచార పద్ధతులనూ వైజ్ఞానిక మూలాంశాల నుంచి వేరుచేయవలసి వస్తుంది. గ్రిఫిత్ అనే పాశ్చాత్య పండితుడు అంగీర లేక అధర్వణాపాంగీరసుడనే ప్రాచీన భారతీయుడు అగ్నిని కనుగొన్నట్లు గుర్తించాడు. దశాంశ పద్ధతిని, 1 నుండి 9వరకు అంకెలను ప్రపంచానికి అందించిన ఘనత ప్రాచీన భారతీయులదేనని పాశ్చాత్య పండితులు కూడా ఈ రోజు అంగీకరిస్తున్నారు. ఆమోదిస్తున్నారు. వేదాలలోని సుల్వ సూత్రాలు, విజ్ఞాన సాంకేతిక శాస్త్రాలకు ప్రాచీన భారతదేశం అందించిన ఒక గొప్ప బహుమతి. వీటిని కనుగొన్నవారూ, రాసిన వారూ ప్రాచీన భారతీయులే. వాటిని కనుకొన్నవారి పేర్ల మీదే ఈ సూత్రాలు ప్రచారం పొందాయి. బౌద్ధాయన, ఆపస్తంబ, కాత్యాయన, మానవ, మైత్రాయన, వర్భ, వదుల సూత్రాలలో జ్యామితీయ సూత్రాలు - బలిపీఠాల హోమకుండాల నిర్మాణానికి సంబంధించిన గణిత సూత్రాలు ఉన్నాయి. వీటిలో అత్యంత ప్రధానమైనది, ఈనాడు మనకు తెలిసిన పైథాగరస్ (570-497 ) సిద్ధాంతం. ఆపస్తంభ సూత్రాలలోనూ సుల్వ సూత్రాలలోనూ ఈ సిద్ధాంతాన్ని వేర్వేరు రూపాలలో పదే పదే ప్రస్తావించారు.

వర్గమూలాలను కట్టడం, గ్రహణ సమయాలను గణించడం, సంవత్సరానికి గల రోజులను లెక్క కట్టడం, సౌర కుటుంబంలోని గ్రహాల కక్ష్యలను నిర్ధారించడం లాంటి అతిక్లిష్టమైన ప్రక్రియలను ప్రాచీన కాలంలోని భారతీయ పండితులు సాధించారు. ప్రాచీన భారతదేశంలోని పౌలిశ, రోమాంక, వశిష్ఠ, సూర్య, పైతామహాల ఐదు సిద్ధాంత గ్రంధాలను గురించి పాశ్చాత్య పండితులు ప్రస్తావించారు. శ్రీసేన రచించిన పౌలిశ, రోమాంక సిద్ధాంత గ్రంధాలు, రోము దేశంలోని అలెగ్జాండ్రియా పాల్ (Paul of Alexandria) రచనల వల్ల ప్రభావితమైనాయని పేర్కొన్నారు. అయితే శ్రీసేనవల్ల పాల్ ప్రభావితుడైనాడా లేదా పాల్ వల్ల శ్రీసేన ప్రభావితుడైనాడా అన్నది ఇంకా వివాదాంశమే. ఆర్యభట్ట (475 A.D.) , వరాహమిహిర (499 A.D.) , బ్రహ్మగుప్త (598 A.D.) , మహావీర (850 A.D.) శ్రీపతి(1039 A.D.) శ్రీధరుడు (1020 A.D.) లాంటి పండితులు గణిత శాస్త్రం, ఖగోళశాస్త్రం జ్యోతిషాలలో (astrology) చేసిన కృషి గణనీయమైంది. ప్రాచీన భారతదేశంలోని తాంత్రిక ఆరాధనా పద్ధతుల పరంగా (tantric cults) , రసవాదం (alchemy) పరంగా, అత్యంత సాహసోపేతమైన ప్రయోగాలను చేశారు. విశ్వంలోని ద్రవ్య ధర్మాలను (Properties of matter) ద్రవ్య, గుణ, కర్మ, సామాన్య, విశేష, సమన్వయ అని విభజించి విశ్లేషించారు. అల్‌బెరూని (1031 A.D) భారతదేశం పర్యటించినపుడు వింధ్యపర్వతాలకు దక్షిణంగా నాగార్జునుడనే రసవాది రసరత్నాకర మనే గ్రంధాన్ని రచించాడనీ, దీనిలో

BRAOU

వివిధ లోహాలను బంగారంగా మార్చగల (transonate) రహస్య పరిశోధనలు చేశాడనీ రాశాడు. నాగార్జునుడు చాల గొప్ప వైద్య శాస్త్రవేత్త (Physician) అనీ, అతడు sublimation, distillation, extraction అనే పద్ధతులనుపయోగించి మకరధ్వజనూ (red sulphide of mercury) కజ్జలినీ (black sulphide of Mercury) తయారుచేసేవారని రాశాడు.

ఇక వైద్య విధానాలనూ, వాటి ప్రయోగాత్మకతలనూ పరిచయం చేసుకుందాం. చరక సంహిత, సుశ్రుత సంహితల్లాంటి గ్రంథాల్లోనే కాక, రామాయణ, భారతం లాంటి గ్రంథాల్లోనూ, ఉపనిషత్తులలోనూ వైద్యశాస్త్రానికి సంబంధించిన ఎన్నో విషయాలు కన్పిస్తాయి. గాయాలకూ, యుద్ధాల్లో క్షత గాత్రులైన సైనికులకు చేసే శస్త్రచికిత్సలకూ సంబంధించిన విషయాలు ఈ గ్రంథాల ద్వారా తెలుస్తాయి. తక్షశిలలోని వైద్య విద్యాలయానికి ప్రపంచంలోని అనేక దేశాలనుండి పండితులు వచ్చేవారు. మానవ శరీరంలోని ఏ దోషానికైనా వాత, పిత్త, కఫా లనే మూడు దోషాల ఆధారంగా వ్యాధి నిర్ధారణ చేయడాన్ని ప్రపంచమంతా ఆరోజుల్లో ఆమోదించింది.

ఇక ప్రాచీన వైజ్ఞానిక పద్ధతికి వస్తే, అది ఈనాటి పాశ్చాత్య పద్ధతికి ఏ విధంగానూ తీసిపోదు. ఈ పద్ధతిలో, విశ్లేషణ సూత్రాలు (Principles of analysis) ప్రత్యక్ష, పరోక్ష, అనుమాన, ఉపమాన, ఆప్తవాక్య ప్రమాణాల ద్వారా జరిపిన పరీక్షలలోనిలిస్తేనే, దేన్ని అయినా వైజ్ఞానిక సూత్రంగా పరిగణించేవారు. ఈ పద్ధతి ఈ రోజు మనం ఉపయోగించే పద్ధతికి సరిపోతుంది.

అలాంటి అద్భుతమైన వైజ్ఞానిక సంప్రదాయం ఎలా అంతరించిపోయిందనేదే మనముందున్న ప్రశ్న. దాని ఆనవాళ్లు కూడా ఈనాడు కనిపించవు. ఈనాడు సరిగ్గా వాటికి సంబంధించిన సమాచారం ఎక్కడా బోధపరచడం జరగలేదు. బహుశా దానికి కారణం మనదేశంలో సుదీర్ఘకాలం విదేశీయులయిన గ్రీకులు, మొగలులూ, బ్రిటీష్‌వారూ, భారతదేశంలోని సిరిసంపదల్నే కాకుండా జ్ఞాన భాండాగారాల్ని దోచుకుపోవటమే. 18వ శతాబ్దం తొలిపాదంనుంచే భారతదేశంలో వైజ్ఞానిక సంప్రదాయ పునరుజ్జీవనచ్ఛాయలు కన్పిస్తాయి. చరిత్రలో ఈ సంఘటనలే భారతదేశాన్ని యూరోపులో సాగిన పారిశ్రామిక విప్లవం అనంతర దశలోని ప్రగతిలో పాలుపంచుకోనీయకుండా వెనుకకు నెట్టి వేశాయి. భారతదేశాన్ని లోపల జరుగుతున్న సామాజిక మార్పులూ, అంతః కలహాలూ, ఘర్షణలూ, బ్రిటీషు వలస పాలనలోని దుష్ఫలితాలూ భారతదేశం అభివృద్ధి చెందని, వెనుకబడ్డ దేశంగానే ఉండేలా చేశాయని మనంచెప్పుకోక తప్పదు. 1940 తర్వాతే అంటే స్వాతంత్ర్యానికి పూర్వమే బలమైన రాజకీయ, వైజ్ఞానిక నేతృత్వం భారతదేశంలో - విజ్ఞాన సాంకేతిక శాస్త్రాలకు బీజాలను వేసింది. ఆ బీజాలే నేటి భారత వైజ్ఞానిక స్థాయి గర్వించదగ్గ స్థానంలో ఉండటానికి కారణమయ్యాయి.

BRAOU

### అభ్యాసం

ప్రాచీన వైజ్ఞానిక, పద్ధతికీ, నేటి వైజ్ఞానిక పద్ధతికి తేడా తెల్పండి. ?

## 15.3 భారతదేశం - స్వాతంత్ర్యానంతర దశ

మన దేశంలోని పరిశోధనశాలల్లో జరుగుతున్న అనేక వైజ్ఞానిక పరిశోధనల వివరాలు, సమాజంపై వాటి బహుముఖ ప్రభావాల గురించిన సమాచారం ఎవరికీ అందుబాటులో కనిపించక పోవటం అత్యాశ్చర్యకరమైన విషయమే. అయినా ఇది వాస్తవం. శాస్త్ర పరిశోధకులు, ప్రయోగశాలల మధ్య కూడా ఎలాంటి వైజ్ఞానిక పరమైన సమన్వయం కానీ, సహకారం కానీ కనిపించదు. శాస్త్రీయ పరిశోధన, సాంకేతిక అనుసరణ అనేవి ఒంటరిగా ఎవరికి వారు విడిపోయి తమ తమ ఏకాంత హర్మ్యాలలో సాగించే కృషిగా మనకు కనిపిస్తుంది. దేశానికి సంబంధించి ఒక సాధారణ లక్ష్యం వేపుగా ఆ శాస్త్రజ్ఞుల విజ్ఞానశాస్త్రకృషి సాగుతున్నట్లు తోచదు. అయితే ఇందుకు విరుద్ధంగా కనిపించే కొన్ని శాస్త్ర, సాంకేతిక బృందాలు లేకపోలేదు. రాజకీయ వాదులూ, సాంకేతిక శాస్త్రజ్ఞులూ, బ్యూరోక్రాట్లూ, విశ్వ విద్యాలయాల ప్రొఫెసర్లూ, సామాన్య ప్రజలూ - వీరందరి మధ్యా పరస్పర విశ్వసనీయత సహకారం,సమన్వయం కొరవడినట్లు కనిపిస్తుంది.

సంప్రదాయ భారతీయ సమాజాలు ఎప్పుడూ కూడా నూతన కల్పన దిశలో ప్రయాణించాయి. అయితే భారతీయ సాంకేతికత చిన్న చిన్న క్షేత్రాలకే పరిమితమైంది. ముఖ్యంగా వ్యవసాయ పరమైన ఉత్పత్తికి (బియ్యం, గోధుమ, గోగునార, పత్తి, చెఱకు, పొగాకు, నూనెగింజలు) మాత్రమే ఈ కృషి ఉపయోగించటం జరిగింది. అయితే ఇది అంత ప్రభావవంతమైన సాంకేతికతకాదు. భూమిని పూర్తి ఉపయోగితలోకి తెచ్చుకొనేందుకు ఇవి ఉపకరించలేదు. గ్రామంలో కలప, మైనం, చర్మం, వనమూలికల నుండి గ్రహించే పదార్థాలు, ద్రవాలు, గృహ నిర్మాణానికి ఉపకరించే వాటితో సంబంధమున్న అనేక వృత్తి నైపుణ్యాలు కనిపిస్తాయి. యంత్ర భాగాలు, విద్యుచ్ఛక్తి తయారీ, సిమెంటు, రసాయనాలు, ఎరువులు, పెట్రోలియం ఉత్పత్తులు, గనులు, ప్రసార వ్యవస్థ మొదలైన అంశాలపై ఇటీవల దృష్టి ఎక్కువైనా మొత్తం దేశాన్ని పారిశ్రామిక దేశంగా మార్చేందుకు తగినంతగా సమాజంపై వాటి ప్రభావం లేదు. దీనికి చాలా కారణాలున్నాయి. అందులో మొదటిది జనాభా. 1951లో జనాభా 340 మిలియన్లు. 1971 కి ఇది 560 మిలియన్లకి పెరిగింది. 1981లో 715 మిలియన్లకూ, 1991 లో 820 మిలియన్ల వరకూ చేరుకుంది.

విజ్ఞానశాస్త్రం -సమాజం; విజ్ఞానశాస్త్రం - ప్రభుత్వం మధ్య పరస్పర అవగాహన అస్పష్టంగానూ అయోమయంగానూ తయారైంది. ప్రధానంగా వైజ్ఞానిక విషయాలలో తీసుకునే నిర్ణయాల్లో, ఎక్కువగా రాజకీయ పరమైన, సామాజిక పరమైన ఒత్తిడులు కన్పిస్తాయి. సహజమైన అవసరాలు, దేశ లక్ష్యాల మధ్య ఎప్పుడూ వైరుధ్యాలు తప్పడంలేదు. వ్యవసాయం × పరిశ్రమలూ; అభివృద్ధి × రక్షిత పథకాలూ; కంప్యూటర్లు, యాంత్రికత × ఉద్యోగావకాశాలు ; జనాభా నియంత్రణ × కనీస అవసరాలు సమకూర్చటం వీటి మధ్య పరస్పర సంఘర్షణ, వైరుధ్యం కన్పిస్తాయి. అందుబాటులోని వనరులు సమానంగా పంచాల్సిన సందర్భాల్లో, రాజకీయనాయకుల ప్రమేయం వల్ల ఇవ్వాల్సిన ప్రాధాన్యాలు తారుమారయి ; నిజమైన లక్ష్యాలను సాధించే శక్తి సన్నగిలిపోవటం జరుగుతుంది. మన శక్తి యుక్తులన్నీ, కేంద్రీకరించాల్సిన రంగాలను గుర్తించటంలోనే వ్యయమై పోతున్నాయి.

అయితే అలాఅని నిరాశపడనక్కర్లేదు. అణు రియాక్టర్ల కోసం ఇంధనాల తయారీ విషయంలో ఆసియాలోనే భారతదేశానికి రష్యా తర్వాత స్థానం. 1956 లోనే భారత్ మొదటి అణు రియాక్టర్ అప్సరను రూపొందించింది. హెచ్.టి జెట్ ఫైటర్‌ను తన దేశీయ సాంకేతిక పరి జ్ఞానంతో భారతదేశం తయారుచేసింది. స్వాతంత్ర్యానంతరం ఒక అణురక్షణ విజ్ఞాన సంస్థను స్థాపించారు. ఇది తృతీయ ప్రపంచదేశాలకే అసూయ పుట్టించేలా పరిశోధనా పాటవాన్ని సంతరించుకుంది. 1942 లో శ్రీ కె.వి. రామస్వామి ముదలియార్ అప్పటి లోక్‌సభలో ఒక తీర్మానాన్ని తీసుకు వచ్చారు. 'నెహ్రూ - భట్నాగర్ ఎఫెక్ట్' తో రాజకీయ - వైజ్ఞానిక నాయకత్వాల మధ్య అవగాహన, కార్యాచరణ సమన్వయం సాధ్యమయ్యాయి. దీని ఫలితమే సి.ఎస్.ఐ.ఆర్ స్థాపన. ఈ రాజకీయ వైజ్ఞానిక అనుసంధానానికి మొదటి మెట్టు హరిజంషెద్ బాబా అధ్యక్షతన అణుశక్తి

BRAOU

కమిషన్ 1946లో ఏర్పడడం. 1950లో శ్రీరామ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ రీసర్చ్ ఏర్పాటయింది. 1953లో భట్నాగర్ (యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ - యు.జి.సి) అధ్యక్షుడుగా విశ్వవిద్యాలయాల విరాళాల సంఘం ప్రారంభమైంది. 1958లో డా॥ డి.ఎస్. కొఠారి నేతృత్వంలో డిఫెన్స్ రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఏర్పడింది. 1958 లోనే విజ్ఞాన శాస్త్ర విధాన తీర్మానం జరిగింది. ఒక సలహా సంఘం కూడా ఏర్పడింది. ఇది మంత్రిమండలికి సలహాలను ఇస్తుంది. దేశంలో సైన్సు కార్యకలాపాలన్నిటినీ సమన్వయం చేయడానికీ, సామాజిక, ఆర్థిక అభివృద్ధికీ అనువుగా విధాన నిర్ణయాలను రూపొందించడానికీ ఈ సంఘం కృషి చేస్తుంది.

1960కి ముందు వైజ్ఞానిక పరిశోధనలు ఏ శాస్త్రానికి ఆశాస్త్రానికే పరిమితమయ్యేవి. 1960 తర్వాత ఈ విధానంలో గణనీయమైన మార్పు వచ్చింది. ఈ మార్పు ఒక శాస్త్రంలోని పరిశోధన వేరే శాస్త్రంలో పరిశోధనకు సహాయకారిగా ఉండేందుకు దోహదం చేసింది. ఒక విధంగాచూస్తే ఇది అంతరీషయాల పరిశోధనా పద్ధతికి అంకురార్పణం అని చెప్పవచ్చు.

సాంకేతిక నిపుణుల ఇంజనీర్లమధ్య ఒక సమన్వయం, సహకారం కుదిరింది. శాస్త్ర పరిశోధన విభాగంలో అప్పటివరకూ ఉన్న అధికార క్రమం స్థానంలో వికేంద్రీకరణ సాధ్యమైంది. వాణిజ్య కేంద్రం, పారిశ్రామిక కేంద్రం లాంటివి ఏర్పడుతూ వచ్చాయి. ఈ కాలంలోనే ఐసిఏఆర్ ( ICAR), వైద్య పరిశోధనా మండలి (Medical Research Board), మొదలైన పరిశోధన, అభివృద్ధి కేంద్రాలెన్నో వెలుగు చూశాయి. ఇవి కాకుండా విదేశీ సహాయంతో, సబ్సిడీ రాయితీలతో CIBA Research Centre, Hindusthan Lever Research Centre, Metel Box, Alembic, Sarabhai మరి ఇతర పరిశోధన, అభివృద్ధి సంస్థలు ఎన్నో వెలిశాయి.

ఈ రకమైన శాస్త్రీయాభివృద్ధి దృష్టి 1970 లో మరింత ఎక్కువైనట్లు కన్పిస్తుంది. 1970 నవంబర్‌లో శాస్త్రవేత్తల సాంకేతిక నిపుణుల విద్యావేత్తల తృతీయ మహాసభలు జరిగాయి. విజ్ఞాన సాంకేతిక శాస్త్రాలకు సంబంధించి ఒక సమన్వయాత్మక ప్రణాళికను రూపొందించటానికిగాను ఒక కమిటీని ఏర్పరచాలనే లక్ష్యంతో ఈ సభలు జరిగాయి. 1971 సంవత్సరాంతానికి జాతీయ కమిటీ ఎన్.సి.ఎస్.టి. (N.C.S.T.) ఏర్పడింది. సి.ఎస్.ఐ.ఆర్. (C.S.I.R.) ను పునర్వ్యవస్థీకరించారు. 1971లో శాస్త్ర సాంకేతిక విభాగం ఒకటి ప్రణాళిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఏర్పడింది. ఆర్థిక, పారిశ్రామిక,సామాజిక అభివృద్ధి ప్రణాళికలతో బాటుగా ఒక సమన్వయ దృష్టితో ఈ శాస్త్ర సాంకేతిక ప్రణాళికను రూపొందించారు. దానికి సంబంధించి విధాన సూత్రాలను కూడా స్పష్టంగా నిర్వచించారు. 1974 నాటికి ఈ ప్రణాళికను ఖరారు చేశారు. తత్ఫలితంగా శాస్త్ర పరిశోధనలకు ఆర్థిక సహాయం అందుబాటులోకి వచ్చింది. శాస్త్ర సాంకేతిక కార్యకలాపాలు విస్తృతమయ్యాయి. విస్తృతమైన వ్యవస్థాపన దీంతో సాధ్యమైంది. దీనికి తోడుగా తర్ఫీదు పొందిన ప్రత్యేక నిపుణులు ఎక్కువయ్యారు. ఇన్నాళ్ళకు భారతదేశం ప్రపంచ దేశాలన్నింటిలోనూ శాస్త్ర రంగంలో ముందంజ వేసిన దేశంగా అంతర్జాతీయ ఖ్యాతిని గడించింది.

భారతీయ పరిశోధన తనదృష్టిని ఎక్కువగా సమాచారం, కంప్యూటర్ సాంకేతికత, ఆధునిక బయోలజీ, బయోటెక్నాలజీ, ప్రత్యామ్నాయ ఇంధన వనరులు, రిమోట్ సెన్సింగ్, ఫార్మాస్యూటికల్స్ తదితర రంగాలపై సారిస్తూ ఉంది. ఈ రంగాల్లో శిక్షణ కావాలంటే ఆధునాతన వసతులు అధికంగా ఉండాలి. పరిశోధనలో నూతన కల్పనాత్మకమైన పద్ధతులుండాలి. వ్యవస్థాపన పరమైనవీ, ఆధునికమైనవీ, మెరుగైనవీ అయిన సౌకర్యాలుండాలి. ప్రపంచంలో ఇతర శాస్త్ర వేత్తలతో, సంస్థలతో ఫలితాలనూ, పద్ధతులనూ పంచుకుని పరస్పరం ప్రోత్సహించుకునేలా ఉండాలి. అంతర్జాతీయ గుర్తింపునూ ఆమోద ముద్రనూ పొందాలని పనిచేసే శాస్త్రవేత్తలు ఒక్కొక్కప్పుడు జాతీయ అవసరాలను, పరిమితులను దాటి తమ లక్ష్యాల వేపు పరిగెడుతుంటారు. ఏ దేశం కూడా ఒంటరిగా ఈ రంగాల్లో పని చేయడం సాధ్యంకాదు. అలాంటప్పుడు తన వద్ద ఉన్న అసమగ్రమైన, ఆర్థికంగా చాలని శాస్త్ర సాంకేతికతతో, పురాతన విజ్ఞానంతో వెనకబడి పోయే సాహసం భారత్ చేయదు. ఈ నేపథ్యంలోంచి చూస్తే తనకున్న ఎన్నో పరిమితుల్ని అధిగమించి, భారతదేశం సాధించిన విజయాలకు మనం ఎంతో

BRAOU

గర్వించాలి.

ఈ సందర్భంలోనే మనం భారతదేశాన్ని అంతర్జాతీయంగా శాస్త్ర సాంకేతిక రంగాల్లో అగ్రస్థానంలో ఉంచటానికి తమ శాయశక్తులా కృషి చేసిన శాస్త్రవేత్తలను స్మరించుకోవటం అవసరం.

### 15.3.1 సర్ జగదీశ్ చంద్రబోస్ (1858 - 1937) :

ఈయన జీవ చలన, చలనరహితాల మధ్య సంబంధాన్ని విశ్లేషించటానికి ప్రయత్నించారు. ఆయన భౌతిక శాస్త్రవేత్త అయినా జీవశాస్త్రంలో, వృక్ష శాస్త్రంలో నిష్ణాతుడు. బోస్ "Crescograph" "Resonant Records" "Death Records" ను కనుగొన్నారు. వాటి ద్వారా మొక్కల సంవేదనల్నీ, మరణ సంకేతాలనూ గుర్తించారు.

### 15.3.2. శ్రీనివాస రామానుజన్ (1887 - 1920) :

రామానుజన్ తన గణిత శాస్త్ర ప్రతిభ, చాతుర్యంతో పాశ్చాత్య ప్రపంచాన్ని చకితుల్ని చేశారు. జి. హెచ్ హార్డీ సహకారంతో 21 పరిశోధన పత్రాల్ని సమర్పించారు. సమకాలికుల్లో ఆయన పరిశోధన సంచలనాన్ని రేపింది. అనంతర పరిశోధనలకు ప్రోత్సాహన్ని ఇచ్చింది. నేటికీ నాటికీ ఆయన పరిశోధనకు చాలా గుర్తింపు ఉంది.

### 15.3.3 మేఘ నాథ్ సహా (1893 - 1956) :

ఈయన న్యూక్లియర్ శాస్త్రవేత్త. ఈయన ఐన్‌స్టీన్, ప్లాంక్, మరెందరో ప్రముఖ భౌతిక శాస్త్రవేత్తలతో కలిసి పని చేశాడు. ఉపరితల వాతావరణ విజ్ఞాన విభాగంలో విడివడని చిక్కు ముడులెన్నో ఇతని సిద్ధాంతాలవల్ల (Translation, ionisation) విప్పగలిగారు.

### 15.3.4. సర్. సి.వి. రామన్ (1988 - 1970)

తన రంగుల అధ్యయనం ద్వారా గొప్ప పేరు గడించి నోబెల్ బహుమతిని (1930) అందుకున్నవారు. 1954 లో ఇతనికి భారతరత్న ఇచ్చారు. 1929 లో నైట్ బిరుదును పొందారు. నోబెల్ బహుమతి అందుకున్న మొదటి ఆసియా శాస్త్రవేత్త రామన్. రామన్ ఎఫెక్ట్, రామన్ స్పెక్ట్ర, మాలిక్యులర్ డిఫ్రాక్షన్ అఫ్ లైట్, థియరీ ఆఫ్ మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఫిజిక్స్ ఆఫ్ క్రిస్టల్స్ రామన్ సిద్ధాంతాల ఆధారంగా రూపొందినవే.

### 15.3.5 హోమి జె. భాభా (1910 - 1966) :

భాభా, యూరోప్‌లోని ప్రముఖ న్యూక్లియర్ శాస్త్రవేత్తలతో కలిసి పనిచేశారు. క్వాంటమ్ మెకానిక్స్ రంగంలో అపార కృషి చేశారు. 1954 లో ఇతనికి పద్మభూషణ్ అవార్డు వచ్చింది. అనేక అంతర్జాతీయ అవార్డులను పొందారు. స్వయం సమృద్ధి సిద్ధాంతాన్ని విశ్వసించి ప్రచారం చేశారు. శాస్త్ర రంగాభివృద్ధి పట్ల ఆసక్తితో, తారాపూర్ రియాక్టర్‌కు సంబంధించి యు.ఎస్ తోనూ, cirus కు సంబంధించి కెనడాతోనూ సహకార బాంధవ్యాలు ఏర్పడటానికి కృషి చేశారు. ఆయన కృషి అంతా, మొదటి అణుశక్తి కేంద్రం కమిషన్ ఏర్పాటులో ప్రతిఫలించింది.

### 15.3.6 దౌలత్ సింఘ్ కొఠారి (1906 -

కొఠారి ఆస్ట్రో ఫిజిక్సులో నిష్ణాతులు. ఇతర శాస్త్ర రంగాలలోనూ ఎంతో కృషి చేశారు. యూ.జి.సి. ఛైర్మన్‌గా ఉన్నారు.

BRAOU

భారతదేశంలోని పరిస్థితులకు అనుగుణంగా కొఠారి సమర్పించిన విద్యా నివేదిక, సిఫారసులు విద్య కొక మార్గ నిర్దేశం చేశాయి. 1973లో ఆయనకు పద్మ విభూషణ్ ఇచ్చారు.

## 15.3.7 జయంతి నార్లికర్ (1938 - )

హోయిలె - నార్లికర్ సిద్ధాంతం చాలా ప్రసిద్ధమైంది. ప్రపంచ శాస్త్ర రంగంలో భారత్ స్థానాన్ని అగ్రస్థానంలో పదిల పరచడంలో జయంతి నార్లికర్ కృషి చాలా ఉంది. ఖగోళ శాస్త్ర సిద్ధాంతాలకు సంబంధించిన రంగాల్లో ఆయన చాలా కృషి చేశారు. చాలా అంతర్జాతీయ అవార్డులను అందుకున్నారు. శాస్త్ర సాంకేతిక విషయాలపైన జనరంజక వ్యాసాలను రాశారు. సాంస్కృతిక వారసత్వాన్ని ఆధారం చేసుకుని కొత్త పరిశోధనలతో కొత్తపుంతలు తొక్కాలని ఆయన అభిప్రాయపడ్డారు.

## 15.3.8 ప్రఫుల్ల చంద్ర రే (1861 - 1944)

వీరు పి.సి. రేగా ప్రసిద్ధులు. రసాయన శాస్త్రవేత్త. ఆయన హిందూ రసాయని శాస్త్ర చరిత్ర (హిస్టరీ ఆఫ్ హిందూ కెమిస్ట్రీ) అనే పుస్తకం రాశారు. రసాయన శాస్త్రానికి సంబంధించి ప్రాచీన భారతదేశంలో జరిగిన పరిశోధనల్ని ఈ గ్రంథంలో ఆయన క్రోడీకరించారు. స్వదేశీ పరిశోధన, స్వయం సమృద్ధి మీద ఆధారపడి శాస్త్ర రంగంలో ముందుకు దూసుకెళ్లే యువకుల్ని ప్రోత్సహించారు. ఆయన ఇచ్చిన స్ఫూర్తితోనే "బెగాల్ కెమికల్ అండ్ ఫార్మాస్యూటికల్ వర్క్స్ (1901)", "కలకత్తా పాడరీ వర్క్స్", "బెంగాల్ ఎనామిల్‌వర్క్స్" ఆవిర్భవించాయి.

## 15.3.9 శాంతి స్వరూప్ భట్నాగర్ (1894 - 1955)

భట్నాగర్ పేరెన్నికగన్న శాస్త్రవేత్త. చాలా అవార్డులు పొందారు. 1936లో ఆర్డర్ ఆఫ్ బ్రిటిష్ ఎంపైర్, 1941 లో నైట్ బిరుదూ, 1954 లో పద్మ విభూషణ్ అవార్డూ పొందారు. సి.ఎస్.ఐ.ఆర్ (C.S.I.R) మొదటి డైరెక్టరుగా ఉన్నారు. జాతీయ భౌతిక ప్రయోగశాలలు, జాతీయ రసాయనిక ప్రయోగశాలలు, కేంద్ర ఇంధన పరిశోధన సంస్థ, సి.ఎఫ్. టి.ఆర్.ఐ (CFTRI) మొదలైన జాతీయ ప్రయోగశాలల సమాహారాన్ని రూపొందించగలిగారు.

## 15.3.10 టి. ఆర్ శేషాద్రి (1900 - 1975)

సుప్రసిద్ధ రసాయన శాస్త్రవేత్త. దేశ విదేశాలలో ఎన్నో అవార్డులు పొందారు. లండన్‌లోని రాయల్ సొసైటీలోసభ్యత్వం పొందారు. గొప్ప జాతీయవాది. భారతదేశంలోని శాస్త్ర పరిశోధన రంగంలో ఎనలేని కృషి చేశారు.

## 15.3.11 రాజా రామణ్ణ (1925 - )

రాజా రామణ్ణ పరమాణు భౌతిక శాస్త్రవేత్త భాభా అటమిక్ రీసర్చ్ సెంటర్‌కు డైరక్టరుగా పనిచేశారు. పరమాణు పరిశోధన రియాక్టర్లు అప్సర, సైరస్, పూర్ణిమల నిర్మాణానికి, ఈయనే ప్రధాన కారకుడు. 1974 లో మొదటి అణువిస్ఫోటనం వెనక ఉన్నది ఆయన మేధాశక్తే. 1975 లో అతనికి పద్మ విభూషణ్ అవార్డు వచ్చింది.

## 15.3.12. ఎం.ఎస్. స్వామినాథన్ (1925 - )

వ్యవసాయ శాస్త్రవేత్త. స్వామినాథన్ హరిత విప్లవం సారథి. "ప్రయోగశాలనుండి క్షేత్రానికి" ("Lab to Land") అనే నినాదంతో కార్యక్రమాన్ని ప్రారంభించాడు. ఆయన ఎక్కువ దిగుబడి నిచ్చే పంటల రకాలను కనుగొన్నాడు. అనేక అంతర్జాతీయ అవార్డులను గెలుచుకున్నారు. రామన్ మాగ్‌సేసే అవార్డును కూడా పొందారు. ఈయనకు 1972లోపద్మభూషణ్ ఇచ్చారు.

BRAOU

### 15.3.13 ఎల్లాప్రగడ సుబ్బారావు (1896 - 1948) :

ఆంధ్రప్రదేశ్‌లో జన్మించారు. ఆయన తండ్రి ఆయుర్వేదంలో ప్రసిద్ధి పొందిన నిపుణుడు. ఎల్లాప్రగడ సుబ్బారావు 1921 లో మద్రాసు వైద్య కళాశాలలో వైద్య శాస్త్రంలో పట్టా పుచ్చుకొన్నారు. ఉష్ణమండల వ్యాధులను అధ్యయనం చేసేందుకు ఇంగ్లాండు వెళ్ళి అక్కడ డాక్టరు స్ట్రాంగ్ సలహాతో డాక్టరు ఒ ఫాలిన్ క్రింద 1930 లో జీవ రసాయన శాస్త్రంలో పిహెచ్.డి. పట్టా సంపాదించారు. అనేక పరిశోధనలు చేసి 1940 లో అమెరికాలోని లెడర్లీ ప్రయోగశాలలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేరారు. ఆయన నాయకత్వంలో ఎన్నో కొత్త రకాలయిన వైజ్ఞానిక పరిశోధన పద్ధతులు రూపొందాయి. విటమిన్ బి -12, ఫోలిక్ ఆసిడ్ (Folic acid) నికటోనమైడ్ టెట్రాసైక్లిన్ (Nicotonamide Tetracyclin) లాంటి మౌలిక ఔషధ నిర్మాణాలను కనుక్కొనేందుకు ఆయన దోహదం చేసారు.

**అభ్యాసం**

అంతర్జాతీయ రంగంలో భారత్ శాస్త్ర పరిశోధనకు ఎలాంటి స్థానం ఉంది ?

BRAOU

## 15.4 ఆంధ్రప్రదేశ్‌లో విజ్ఞాన సాంకేతిక శాస్త్రం

పొరుగు రాష్ట్రాలతో పోల్చినట్లయితే ఆంధ్రప్రదేశ్‌లో వైజ్ఞానిక సాంకేతిక శాస్త్రాలకు సంబంధించిన ప్రయోగశాలలు, వ్యవస్థలు ఈ మధ్యకాలంలోనే ఎక్కువగా స్థాపించారని చెప్పుకోవచ్చు. నెల్లూరుజిల్లాలోని అంతరిక్ష పరిశోధన కేంద్రం, Indian Institute of Chemical Technology (IICT), Centre for Cellulor and Moleculer biology (CCMB), జాతీయ భూ భౌతిక పరిశోధనా సంస్థ, జాతీయ పోషకాహార సంస్థ, వివిధ defence ప్రయోగశాలలు భారతదేశంలోనే కాక ప్రపంచంలో గూడా ఆంధ్రప్రదేశ్ ఉనికిని వైజ్ఞానిక సాంకేతిక రంగాలలో పటిష్ఠం చేశాయి. ఒక సాంకేతిక విశ్వవిద్యాలయాన్నీ, వైద్య విశ్వవిద్యాలయాన్నీ స్థాపించిన ఘనత ఆంధ్రప్రదేశ్‌కే దక్కింది.

ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని విజ్ఞాన సాంకేతిక పరిశోధన సంస్థలను ఇక్కడ ఉదహరించాం :

(i) ఆగ్నేసియాలో కెల్లా పెద్దదయిన నిజామియా వేధశాల 1908 లో స్థాపించబడింది. బిర్లా ప్లానిటోరియం (1985)లో నిర్మింపబడి సామాన్య మానవునికి అంతరిక్ష విజ్ఞాన విశేషాలను నక్షత్ర శాస్త్ర విషయాలను ప్రదర్శనలతోచూపించడం ఈ సంస్థ ప్రత్యేకత. దీని అనుబంధంగా బిర్లా సైన్సు మ్యూజియం విజ్ఞానశాస్త్ర విశేషాలనుసామాన్య మానవునికి అర్థం అయే తీరులో విశదీకరిస్తుంది.

(ii) శ్రీహరి కోట అంతరిక్ష కేంద్రం ఉపగ్రహాలు రాకెట్ల ప్రయోగాలలోనూ, అంతరిక్ష వాహనాల నిర్మాణంలోనూ, అత్యద్భుత ప్రగతి సాధించింది.

(iii) ప్రాంతీయ పరిశోధన శాల ( IICT ) - రసాయన సాంకేతిక పరమైన మౌలిక ఔషధ నిర్మాణాలనూ, ఉత్పాదన విధానాలనూ, డిజైనులనూ, నవ కల్పనలనూ రూపొందించే ఈ సంస్థ హైదరాబాదులో ఉంది.

(iv ) జాతీయ పోషకాహార సంస్థ 1918 లో తమిళనాడులోని కూనూరులో స్థాపించబడినా 1958 లో హైద్రాబాదుకు తరలింపబడింది. పోషకాహారానికి సంబంధించిన విషయాలలో పరిశోధన, సరి అయిన పోషకాలు లేనందువల్ల వచ్చే జబ్బులు వాటి నివారణోపాయాలకు సంబంధించిన పరిశోధన ఈ సంస్థ ముఖ్యోద్దేశాలు.

(v) జాతీయ భూ భౌతిక పరిశోధనా సంస్థ 1961 లో హైద్రాబాదులో స్థాపించబడింది. ఖనిజ సంపద అన్వేషణకై గగనతలం మీదుగా విశిష్టమైన సర్వే విధానాలను రూపొందించింది. ఈ మధ్య లాతూరులో జరిగిన భూకంపంపై విశేషమైన పరిశోధనలు జరిపింది.

(vi) కేంద్ర పొగాకు పరిశోధనాలయం 1949 లో స్థాపించారు. 1965 లో భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థకు దీనిని అనుబంధించారు.

(vii) తైల సాంకేతిక పరిశోధనా సంస్థ 1949 లో అనంతపురంలో స్థాపించారు. 1985 వరకు ఇది పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఉండేది. 1985 తరువాత దీనిని జవహర్‌లాల్ సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలోకి తెచ్చారు.

(viii) సీరమ్ ఇన్‌స్టిట్యూట్ పేరుతో 1945లో ఆంధ్రప్రదేశ్‌లో స్థాపించిన పశురోగ జీవశాస్త్ర పరిశోధన సంస్థ పేరును 1954 లో వెటర్నరీ బయోలాజికల్ రీసర్చి ఇన్‌స్టిట్యూట్‌గా పేరును మార్చారు. ఈ సంస్థలోని వాక్సిన్ తయారీ విభాగం రోగ పరిశోధనా విభాగాలు ఈ రాష్ట్రంలోనేగాక దేశంలోని ఇతర రాష్ట్రాల అవసరాలకు సహాయపడుతూంది.

BRAOU

(ix) కేంద్ర యునానీ పరిశోధనా సంస్థ 1971 లో స్థాపించారు. ఇది యునానీ వైద్య విధానంలో అత్యంత ప్రయోగాత్మకమైన పరిశోధన చేస్తుంది.

(x) ఆంధ్రప్రదేశ్ విజ్ఞాన శాస్త్ర పరిషత్తును 1963 లో స్థాపించారు. ఆంధ్ర ప్రదేశ్‌లో శాస్త్రీయ విజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం, శాస్త్రీయ విజ్ఞానాన్ని విశేషాలను ప్రదర్శనశాలల ద్వారా ప్రచారం చేయడం, శాస్త్రీయ విజ్ఞానాభివృద్ధికి సంబంధించిన విధానాలనురూపొందించడం, విజ్ఞాన విషయాల గ్రంథాలయాలను స్థాపించడం, తత్సంబంధిత పత్రికా ప్రచురణ దీని ముఖ్యోద్దేశాలు. 1966లో ఈ సంస్థ చాలా ప్రాంతీయ కేంద్రాలయాలను స్థాపించింది.

(xi) మెట్ట సేద్యపు కేంద్ర పరిశోధన సంస్థను 1920 లో ఇంపీరియల్ వ్యవసాయ పరిశోధనా సంస్థగా స్థాపించారు. ఇది 1950 నుంచి ఆంధ్రప్రదేశ్‌లో ఒక శిక్షణా సంస్థగా రూపుదిద్దుకొంది.

(xii) ఇక్రిశాట్ 1972 లో హైద్రాబాదులో జాతీయ ప్రాతిపదికపై ప్రారంభించారు. ఇది వివిధ జాతీయ వ్యవసాయ కార్యక్రమాల్లో పనిచేసే యువ శాస్త్రజ్ఞులకు శిక్షణ ఇస్తుంది. ఇంతవరకు 70 దేశాల నుండి శాస్త్రజ్ఞులు ఇక్కడ శిక్షణ పొందారు.

(xiii) జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థను 1965 లో జాతీయ కమ్యూనిటీ డెవెలప్ మెంట్ సంస్థగా హైద్రాబాదులో స్థాపించారు. 1977లో ప్రస్తుత పేరుతో జాతీయ సాంఘిక ఆర్థిక అభివృద్ధికి అనుగుణంగా గ్రామీణాభివృద్ధికి కావలసిన కార్యక్రమాలను ప్రణాళికలను ఈ సంస్థ రూపొందిస్తూంది.

(xiv) జాతీయ వ్యవసాయ పరిశోధనా నిర్వహణ సంస్థ 1976 లో స్థాపించారు. ఇది వ్యవసాయ పరిశోధనలో అత్యంత కృషి జరుపుతూంది.

(xv) జాతీయ రిమోట్‌సెన్సింగ్ ఏజన్సీ అంతరిక్ష పరిశోధనల ద్వారా జాతీయ భూ వనరులను గుర్తించడం, వర్గీకరించడం లాంటి పరిశోధనలలో అత్యంత ప్రాముఖ్యాన్ని సంపాదించింది.

ఇవే కాక నూనె విత్తుల పరిశోధనా డైరెక్టరేట్ (1977) ఇండియన్ స్టాండర్డ్ ఇన్స్టిట్యూట్ (1968) నివారణ వైద్య సంస్థ అల్ట్రా ఒల్టేజి పరిశోధనా ప్రయోగశాలలు లాంటి ఎన్నో ప్రయోగశాలలు, సంస్థలు ఆంధ్రప్రదేశ్ వైజ్ఞానిక సాంకేతిక రంగాలలో చేసే కృషిని చాటి చెప్తున్నాయి.

## 15.5 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- విజ్ఞాన సాంకేతిక రంగాలలో ప్రాచీన భారతీయులు మహోన్నతమైన కృషి చేశారు. అయితే అవన్నీ మత విషయాలతో కలిసి ఉన్నందువల్ల పాశ్చాత్య పరిశోధకులు చెప్పే వరకూ మనకంతగా తెలియదు.
- ప్రాచీన వైజ్ఞానిక పద్ధతికీ, ఈనాటి వైజ్ఞానిక పద్ధతికీ చాలా పోలికలున్నాయి.
- స్వాతంత్ర్యానంతరం భారత్‌లో శాస్త్ర రంగ పరిశోధనపై దృష్టి ఎక్కువ కేంద్రీకరించారు.
- దేశం మొత్తంపై రకరకాల పరిశ్రమ రంగాలపై ఆసక్తి, చొరవ ఎక్కువైనా, మనదేశాన్ని పారిశ్రామిక దేశంగా మార్చేంతగా వాటి ప్రభావం లేదు.
- భారతదేశం ప్రపంచదేశాల్లో అన్నిటికన్నా ముందు స్థానంలో, తృతీయ ప్రపంచదేశాలు అసూయపడే స్థానంలో చేరింది.
- 1960 తర్వాత విజ్ఞాన వ్యవస్థ సరళీ కృతమై, సమన్వయ దృష్టిని పెంచుకుంది. అంతర్జాతీయంగా సమన్వయం, సహకారం, ఇచ్చిపుచ్చుకోవటం అనివార్యం అని గ్రహించడం జరిగింది.
- భారతదేశాన్ని శాస్త్ర రంగంలో ముందుకు తీసికెళ్లిన గొప్ప వ్యక్తులెందరో ఉన్నారు. సర్ జగదీశ్ చంద్రబోస్ నుంచి సి.వి. రామన్ వరకూ ఎందరో కన్పిస్తారు.
- ఆంధ్ర ప్రదేశ్‌లోనూ ఇటీవలే విజ్ఞాన సాంకేతిక శాస్త్రానికి సంబంధించి ప్రయోగశాలలు, వ్యవస్థలూ ఎక్కువగా స్థాపించారు.

## 15.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

30 పంక్తుల్లో జవాబులు రాయండి

1. ప్రాచీన భారతీయుల శాస్త్ర కృషిని సమీక్షించండి.
2. నేడు అంతర్జాతీయంగా భారతదేశానికి శాస్త్ర రంగంలో ఉన్న స్థానాన్ని నిరూపించండి.

15 పంక్తుల్లో జవాబులు రాయండి.

1. స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో శాస్త్ర రంగం పురోభివృద్ధిని గురించి రాయండి.
2. ఆంధ్రప్రదేశ్‌లో శాస్త్ర రంగం అభివృద్ధిని సమీక్షించండి.

BRAOU

# భాగం - 16 మానవ వనరులు

## విషయ క్రమం

16.0 ఉద్దేశం

16.1 ప్రవేశిక

అభ్యాసం

15.2 మానవాభివృద్ధి - మానవ వనరులు

అభ్యాసం

16.3 విద్యావిధానాలు

అభ్యాసం

16.4 అందరికీ ఆరోగ్యం - లక్ష్యం

16.5 మహిళలు

16.6 మానవ వనరుల అభివృద్ధి ఎందుకోసం ?

అభ్యాసం

16.7 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

16.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 16.0. ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు -

* మానవ వనరుల మదింపు ఆవశ్యకతను,
* మానవాభివృద్ధికై జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో అమలులో ఉన్న కార్యక్రమాలను - వివరించగలుగుతారు.

## 16.1 ప్రవేశిక

ప్రగతి నిర్ధారక విధానాలు, సాధనాలలో మానవాభివృద్ధి లేదా మానవవనరులకు స్థానం ఈ మధ్య ఎక్కువ ఇచ్చినట్లు కనిపిస్తుంది. ఎందుకంటే మానవాభివృద్ధి భావన 1990 దశకం నుంచి ప్రారంభం అయినట్లు ప్రపంచబాంక్ ఇతర అంతర్జాతీయ నివేదికలు వెల్లడిస్తున్నాయి. అయితే జాగ్రత్తగా పరిశీలిస్తే ఇంతకు ముందే మానవాభివృద్ధి అన్నది మన సామాజిక ఇతర శాస్త్రవేత్తల దృష్టిలో కీలక స్థానం ఆక్రమించింది. సామాజిక వ్యవస్థ విభాగాలు ఎంత మేరకు మానవాళికి మేలు చేకూరుస్తాయో అనే దాన్ని బట్టి వాటిని మదింపు చేయాలి. "(Panel arrangements must be

judged by the extent to which they promote human good) అని అరిస్టాటిల్ అన్నారు.

మానవాభి వృద్ధే అంతిమ సూచికగా పేర్కొంటూ "సంపద మాత్రమే మనం ఆశిస్తున్న మంచికాదు. అదికేవలం ఉపయోగకరమైంది మాత్రమే" (Wealth is evidently not the good we are seeking, for it is merely useful and for the sake of something else)" అనీ పేర్కొన్నారు.

అలాగే ఇమానూల్ కొంట్ "మానవత్వమే అంతిమలక్ష్యం. అది ఎప్పుడూ ఒక లక్ష్యానికి సాధనం మాత్రం కాదు" "(act as to treat humanity ... in their own person as an end... never as a means only)" అని అభిప్రాయపడ్డారు.

ప్రైవేటీకరణకు ఆద్యుడుగా పేర్కొబడుతున్న ఏడంస్మిత్ (1723 - 1790) "ఆర్థికాభివృద్ధి అనేది ఒక వ్యక్తి ఇతరులతో స్వేచ్ఛగా కలిసి మెలిసి కనిపించేందుకు దోహదపడాలని (economic development should enable a person to mix freely with others without being ashamed to appear in public) అన్నారు.

మొదటి నుంచి ప్రగతి భావనల ఉద్దేశం మానవ అభివృద్ధే. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి సుమారు 50 ఏళ్ళు అవుతోంది. భౌతిక వనరులనే ప్రాతి పదికగా తీసుకుంటే ఇంత తక్కువ కాలంలో చాలా అభివృద్ధిని సాధించాం అని పేర్కొనాలి. అనేక రంగాలలో మనం స్వయం సమృద్ధి స్థాయికి చేరగలిగేం. భూగర్భంలోని వివిధ వనరులను వెలికితీసి అభివృద్ధికై వినియోగించుకోగలుగుతున్నాం. అలాగే అంతరిక్షంలోకి అనేక క్షిపణులను పంపి మన ప్రగతి పథానికి నూతన మార్గాలను అన్వేషిస్తున్నాం. నిజానికి అంతర్జాతీయ స్థాయిలో మనం సాధించిన అభివృద్ధికి ఆశ్చర్యపడేవాళ్ళు కొందరుంటే ప్రశంసించే వారు ఎక్కువ ఉన్నారు. వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం, ఇతర రంగాలలో స్పష్టమైన నిర్ణయాలు తీసుకొని ఉత్పాదకతలను పెంచుకున్నాం. జాతీయ ఉత్పత్తి పెరిగింది. అలాగే జాతీయ ఆదాయం తలసరి ఆదాయాలలో కూడా పెరుగుదల కనిపిస్తోంది. ఇంత సాధించినప్పటికీ మనదేశం వెనుకబడినదిగా లేదు. అభివృద్ధి చెందుతున్న దేశాల జాబితాలోనే వర్గీకరించబడుతోంది. తొమ్మిది ప్రణాళికల అమలు తర్వాత కూడా 20 కోట్ల మంది పైబడి పేదరికపు రేఖకు దిగువనే మనుగడ సాగిస్తున్నారంటే మన అభివృద్ధి వ్యూహాలలో రావల్సిన మార్పును గురించి విశ్లేషించాలి. అయితే సాంప్రదాయ అభివృద్ధి సిద్ధాంతం ప్రకారం జాతీయ ఉత్పత్తి పెరుగుదలవల్ల తలసరి ఆదాయం పెరుగుతుందని అంటారు. ఈ అధిక ఆదాయం వల్ల అధిక జీవన ప్రమాణాలకు దారితీస్తుందన్న ఆశాభావం సైద్ధాంతిక అవగాహనలోనున్న ముఖ్యమైన చిక్కు. ఒకప్పుడు ఆదాయాలలో తీవ్ర అసమానతలకు దారితీయొచ్చు. ఆర్థికాభివృద్ధి వల్ల లాభాలు ఒకప్పుడు కింది వర్గాలకు చేరకపోవచ్చు. అభివృద్ధి విధానాల ప్రధాన లక్ష్యం ప్రజల ఎంపికల్ని విస్తృతం కావించడం.

అభ్యాసం

మానవాభివృద్ధికీ ప్రగతికీ సంబంధం ఏమిటి ?

BRAOU

## 16.2 మానవాభివృద్ధి - మానవవనరులు.

మానవ వనరుల అభివృద్ధిని కాంక్షించే వారికి ఆర్థికాభివృద్ధి కోరే వారికీ మధ్య ప్రధానమైన భేదం ఏమంటే ఆర్థికాభివృద్ధి కోరేవారు ఆదాయం పెరుగుదలే కోరుతారు. మానవాభివృద్ధిని గురించి వాదించేవారు అందరి మానవుల ఎంపిక పరిధిని విస్తృతం చేయాలని (enlargement of all human choices), ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో మానవుల ఎంపికలని విస్తరించాలని కోరతారు. అయితే ఆదాయం పెరిగితే అప్రయత్నంగా మిగతా ఎంపికలు పెరగవచ్చు. అయితే ఈ అనివార్య సంబంధం అన్ని సందర్భాలలోనూ పనిచెయ్యదు.

ఒక దేశ జాతీయ ప్రాధాన్యతల మీద అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. ఆయుధాలా ? ఆహార ధాన్యాలా ? శ్రేష్ఠ వర్గాలకు లాభించే అభివృద్ధి వ్యూహమా? సమానత్వ సాధనను ఉద్దేశించటమా ? అధికారవాదం x ప్రజాస్వామ్యం (Autheritarianism VS democracy), నిర్దేశించబడిన ఆర్థిక వ్యవస్థ లేదా ప్రజల భాగస్వామ్యం కల్గిన అభివృద్ధి వ్యూహమా ? (Command economy & Participatory development ?) ఇలా ప్రాధాన్యతలుండవచ్చు. కాబట్టి ఆర్థికాభివృద్ధి ద్వారా సాధ్యమైన ఆదాయ పెరుగుదల అన్నది నిజమైన సూచికగా అంటే పరిమాణాత్మకం గా ఉండవచ్చు. గుణాత్మకంగా మీరు విశ్లేషిస్తే అనేక అనుమానాలు ఉత్పన్నమౌతాయి. దేశాల అభివృద్ధిని, సంపన్నతను ప్రజలు సాధించిన అభివృద్ధిని అంచనా వేసేందుకు అనేక పద్ధతులు కొత్తగా వస్తున్నాయి. ఇక్కడ మనం గుర్తుంచుకోవలసిన ఒక ముఖ్య అంశం ఉంది. అది ఏమిటంటే మానవులు సాధించిన ప్రగతి సమగ్ర స్వరూపాన్ని ఎప్పటికీ అంచనా వేయలేం. ఎందుకంటే భౌతిక సౌకర్యాలు అందించడంలో ప్రపంచంలో అమెరికాను మించింది లేదు. ఈ మధ్యనే జరిగిన ఒక గోష్టిలో ఒక అమెరికన్ ప్రొఫెసర్ ప్రసంగిస్తూ "అమెరికా నుంచి మీరు సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకోండి. మీకు ఉపయోగపడుతుంది. కాని అమెరికాలో సంస్కృతిని దిగుమతి చేసుకోకండి. మీ దేశ సంస్కృతి చాలా ఉన్నతమైంది. దాన్ని కాపాడుకోండి అమెరికాలో "కుటుంబం" అన్నది నాశనం అయిపోయింది. నేర ప్రవృత్తి హెచ్చుగా ఉంది. కొన్ని రాష్ట్రాలలో మీరు రాత్రిళ్ళు బయటకువెళ్లలేరు. కొన్ని చోట్ల పగలు కూడా వెళ్ళలేరు" అన్నారు.

అభివృద్ధికి మారుపేరు అమెరికా అయితే ఆ దేశం గురించి వారి ప్రజలే ఆ విధంగా ఘోషిస్తున్నారు. అంటే "అభివృద్ధి అంటే" ? అన్న ప్రశ్న మళ్ళీ ఉదయిస్తుంది. మనం ఆర్థిక అంశాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి మానవాభివృద్ధిలో ఆర్థికేతర అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదనీ ప్రపంచబాంక్ మానవాభివృద్ధిని సమగ్రంగా ప్రతిబింబించే సూచీని నిర్మించాలని 1990లో ఒక నివేదికలో సూచించారు. ఎందుకంటే అభివృద్ధి నిర్వచనం, కొలమానాలు దేశ పరిస్థితులను బట్టి మారుతుంటాయని, స్థూలదేశీయోత్పత్తి, తలసరి ఆదాయం ఆధారంగా నిర్ణయించే అభివృద్ధి స్థాయి వాస్తవ పరిస్థితులకు అద్దం పడుతుందని చెప్పలేం అనీ వారి నివేదికలోని ముందుమాటలో పేర్కొన్నారు.

మానవాభివృద్ధి నివేదికలో మెరుగైన జీవితం గడపడానికి మూడు ముఖ్య సూచికలను రూపొందించారు. అవి :

(1) ఆయుర్దాయం (2) పరిజ్ఞానం (3) ఆదాయం

వీటి గురించిన సమాచారాన్ని లెక్కలోకి తీసుకుంటారు. వాటి వల్ల ప్రగతిని సమగ్రంగా అంచనా వెయ్యవచ్చని పేర్కొన్నారు.

1995లో ప్రచురించిన మానవాభివృద్ధి నివేదికలో లింగ సంబంధమైన అభివృద్ధి సూచిని రూపొందించారు. పార్లమెంట్‌లో మహిళల సంఖ్య, మేనేజిమెంట్ ప్రొఫెషనల్ రంగాలలో స్త్రీల భాగస్వామ్యం, జాతీయ ఆదాయంలో వారి

BRAOU

భాగం మొదలైన అంశాలను పరిగణనలోనికి తీసుకుంటున్నారు.

దేశాల సంపన్నతను నిర్ణయించడంలో కూడా మార్పులు కనపడుతున్నాయి. సాధారణంగా తలసరి ఆదాయం ప్రకారం సంపన్నతను నిర్ణయిస్తున్నారు. దీనిలో అనేక లోపాలను పేర్కొన్నారు. ఉదాహరణకు 1995 నివేదిక ప్రకారం సౌది అరేబియా తలసరి ఆదాయం శ్రీలంకతో పోలిస్తే 16 రెట్లు ఎక్కువ. అయితే అక్షరాస్య స్థాయిలో సౌది అరేబియా శ్రీలంకతో పోలిస్తే చాలా వెనుకబడింది. సుసంపన్నమైన న్యూయార్క్‌లో నివసిస్తున్న నీగ్రోల ఆయుర్దాయం బంగ్లాదేశ్‌లోని పౌరులతో పోలిస్తే తక్కువే. ప్రపంచబ్యాంక్ ఇప్పుడు సహజవనరులు, యంత్రాలు, భవనాలు, రహదారులు మొదలైన ఉత్పాదక ఆస్తులను, మానవవనరులను లెక్కలోకి తీసుకొని దేశాల అభివృద్ధిని సుసంపన్నతను నిర్ణయిస్తోంది. దీన్ని బట్టి దేశాలు తమ వద్ద సహజ వనరులు లేకపోయినా మానవ వనరులపై పెట్టుబడి పెట్టి అభివృద్ధిని సాధించవచ్చు. అనేక దేశాలు విద్య, ఆరోగ్యం వంటి కీలక రంగాలపై నిధులు వెచ్చించి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకై కృషిచేశాయి. కేవలం రోడ్లు, సహజ వనరులు, భవనాలు మొదలైన ప్రాథమిక సదుపాయాలు పుష్కలంగా ఉన్నంతమాత్రాన అభివృద్ధి సాధించినట్లు చెప్పలేం. మానవ వనరుల నాణ్యత ముఖ్యమని అంతర్జాతీయ సంస్థలు పేర్కొంటున్నాయి. ప్రజల ఉత్పాదక శక్తి, సమాజాన్ని ఐక్యంగా ఉంచే కుటుంబ వ్యవస్థ సేవా సంస్థల మొదలైన వాటి స్థితిగతులను (దీనినే "సామాజిక మూలధనం" గా వ్యవహరిస్తున్నారు) నిర్లక్ష్యం చేస్తే స్వల్పకాలంలోనో దీర్ఘ కాలంలోనో సమాజంపై ప్రభావం చూపవచ్చు.

కొన్ని మానవుల ఎంపికలు సంపన్నతపై ఆధారపడి ఉంటాయి. జ్ఞాన సముపార్జన, ఆరోగ్యం; పరిశుభ్ర వాతావరణం రాజకీయ స్వాతంత్ర్యం వంటివి ఇతర సామాన్య సంతోషాలు పూర్తిగా వ్యక్తిగత ఆదాయంపై ఆధారపడి ఉండవు కదా! మానవ వనరులూ వాటి అభివృద్ధీ ఎందుకు ఇంత ప్రాముఖ్యతను సంతరించుకున్నట్లు ? ఈ కింద పేర్కొన్న కొన్ని ఇతర కారణాలు గురించి తెలుసుకుందాం :

(1) ప్రజలు ఒక ప్రధానమైన లక్ష్యాన్ని చేరుకున్నట్లే అభివృద్ధి ప్రణాళికల విజయాలు కేవలం ఉత్పత్తి క్రమాల విస్తరణగా తీసుకో కూడదు. అది ప్రజల జీవితాలను మెరుగు పరచేవిగా భావించాలి.

(2) మానవాభివృద్ధికి రెండు ముఖాలున్నాయి అవి :

(అ) ఆరోగ్య అభివృద్ధి, విజ్ఞానం, నైపుణ్యం మొదలైన సామర్థ్యాలను ఏర్పరచటం (ఆ) ఉద్యోగాల్లో ఉత్పత్తి కార్యక్రమాల్లో, రాజకీయాల్లో వారి నైపుణ్యాల్ని వినియోగపరచటం. ఈ రెండింటి మధ్య సమతౌల్యం ఉండాలి.

(3) మానవాభివృద్ధి సూచిక ఉత్పత్తి - సమానత, కొనసాగింపు సామర్థ్యం అధికార సంక్రమణలతో కూడుకుని ఉంటుంది.

అభివృద్ధి మౌలిక ఉద్దేశం ప్రజల ఎంపిక పరిధిని పెంచేదిగా ఉండాలని భావిస్తున్నారు.

జాతీయ సంపన్నత పెరుగుతున్న కొద్దీ ప్రజల ఎంపికలు కూడా పెరగాలి. కాని ఈ రెండింటి మధ్య యాంత్రిక అనివార్య సంబంధం ఏమీలేదు. సామాజిక సేవలు (విద్య, ఆరోగ్యం మొదలైనవి) అందించే ప్రభుత్వ విధానాల ద్వారా అభివృద్ధికీ మానవ జీవితానికీ మధ్య ఒక లంకెను ఏర్పరచాలి. ఏ దేశానికైనా నిజమైన సంపద ఆ దేశ ప్రజలే. కాని ఈ భావన విధాన నిర్మాతలలో ఉన్నా ఆచరణలో లోపించినట్లు అనిపిస్తుంది. ఎందుకంటే జనాభాను మనం ఒక సంపదగా భావించడం లేదు. భారంగానే చూస్తాం. మానవ వనరుల విలువ ఏమిటో వాటి అభివృద్ధికి తీసుకోబోయేచర్యలు



BRAOU

ఏమిటో తెలుసుకోవడం చాలా అవసరం. అన్ని రంగాలలో మానవ వనరుల అభివృద్ధి గురించి ప్రస్తుత పరిమితుల్లో చర్చించడం సాధ్యం కాదు. కాబట్టి ఆరోగ్యం విద్యా రంగాల ద్వారా మానవ వనరుల అభివృద్ధిని ఏ విధంగా సాధించగలమో పరిశీలిద్దాం.

**అభ్యాసం**

మానవాభివృద్ధి సూచిక అంటే ఏమిటి ?

## 16.3 విద్యా విధానాలు

దేశ సగటు అక్షరాస్యత స్థాయి 52. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుమారు 45 శాతం.

దేశంలో ఇప్పుడు పాఠశాలలు ఉన్నాయి. పదికోట్ల విద్యార్థినీ విద్యార్థులు ఈ పాఠశాలల్లో చదువుకుంటున్నారు. మానవ వనరుల అభివృద్ధికి విద్య ప్రధాన వ్యూహంగా పరిగణించాలి. మనదేశంలో ఉన్న పాఠశాలల్లో చదువుకొంటున్న విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా, మధ్యలో బడికి ఎగనామం పెట్టేవారి సంఖ్య కూడా పెరుగుతోంది. అంటే మనం పెట్టిన మదుపుకు సరైనరాబడి రావడం లేదు. ఒకటో క్లాసులో 100 మంది విద్యార్థులు చేరేరనుకొంటే అందులో 30 మంది మాత్రమే 10వ తరగతికి చేరగలుగుతున్నారు. ఈ మధ్యలో బడి ముగిసే వారి సంఖ్య కలవరపడేదిగా పెరిగి పోవడం విద్యా ప్రణాళికలను అస్తవ్యస్తం చేస్తున్నాయి. ఇది ఒక్క ఆర్థికాంశానికి సంబంధించింది కాదు. దేశంలో మానవ వనరుల అభివృద్ధికి ఇదొక పెద్ద సవాలు.

మన రాష్ట్రంలో చిత్తూరు, నిజామాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పాఠశాల విద్యారంగంలో జరిపిన సర్వేలో ఆసక్తికరమైన అంశాలు వెల్లడయ్యాయి. ఇప్పటి వరకు ఆర్థిక కారణాల వల్లనే పిల్లలు మధ్యలో చదువును మానేస్తున్నారు అనుకొంటున్నాం. కాని కొన్ని జిల్లాలలో స్కూల్లో చెప్పే పాఠాలు ఆసక్తికరంగా లేనందువల్లే పిల్లలు స్కూళ్ళు మానేస్తున్నారన్నది ఈ మధ్యన వెల్లడైంది.

ఇక ఇతర ఉప రంగాలలో పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉంది. మన దేశంలో 1995 చివరికి 220 విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. 8500 కళాశాలలున్నాయి. వీటిలో సుమారు 60లక్షలమంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. జాతీయ అవసరాల దృష్ట్యా చూస్తే మొత్తం విద్యార్థుల సంఖ్య తక్కువే. 90 కోట్ల పైన జనాభా ఉన్న



BRAOU

దేశంలో సుమారు 60 లక్షల మంది ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారంటే దేశంలో మానవ వనరులు ఎంత నిరుపయోగంగా ఉన్నాయో తెలుసుకోవచ్చు. దేశ జనాభాలో సుమారు 20శాతం మంది ప్రజలు ఉన్నత విద్యను అభ్యసించే వయసులో ఉన్నారు. (అంటే 17 నుండి 23 సంవత్సరాల వయసు) అంటే సుమారు 18 కోట్లమంది ఉన్నత విద్యా సంస్థలలో విద్యను అభ్యసిస్తూ ఉండాలి. విశ్వవిద్యాలయాల విరాళాల సంఘం ఒక నివేదిక అనుసరించి సుమారు 60 లక్షల మంది విద్యను అభ్యసిస్తున్నారంటే మానవ వనరుల అభివృద్ధిలో విద్యారంగం పాత్ర ప్రశ్నార్థకంగానే ఉంది. ఈ పరిస్థితి నూతన ఆర్థిక విధానాల వల్ల మరింత దారుణంగా ఉండబోతోందని విశ్లేషకుల అంచనా. ఆర్థికాభివృద్ధి రేటుకు విద్యారంగంపై ఖర్చు స్థాయికి సంబంధం లేదని అంతర్జాతీయంగా నిరూపించబడింది. అంటే జాతీయ ఆదాయం / ఉత్పత్తి పెరిగినంత మాత్రాన విద్యారంగంలో పెట్టుబడి పెరిగే అవకాశాలు తక్కువే.

తర్వాత వచ్చే ప్రశ్న నాణ్యత. చదువుతున్న విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నప్పుడు దేశంలో అందిస్తున్న విద్యా ప్రమాణాల గురించి ప్రభుత్వం, ప్రజలు విశ్వ విద్యాలయాలు ప్రస్తుతం ఆందోళన చెందుతున్నాయి. దేశ అవసరాల నిమిత్తం విద్యా విధానాలు రూపొందించుకోవాలని ఒక సాధారణ అవగాహన ఉండటంలో తప్పులేదు. కాని ఆచరణలో ఇది సాధ్యమా ? స్వాతంత్ర్యం తర్వాత 1967లో మొట్టమొదటి సారి విద్యకు సంబంధించిన అన్ని ఉపరంగాలను సాకల్యంగా పరిశీలించిన కొఠారి నివేదిక ఆధారంగా భారత ప్రభుత్వం మొదటి విద్యావిధానాన్ని 1968లో రూపొందించింది. ఈ విధానం ఆధారంగానే జాతీయ విద్యా వ్యవస్థ ఆచరణలోకి వచ్చింది. దీన్నే 10+2+3 తరహా అంటారు. 10 ఏండ్ల స్కూలు విద్య + రెండు సంవత్సరముల ఇంటర్మీడియట్ విద్య + మూడు సంవత్సరముల డిగ్రీ బోధన. ఇప్పటికీ ఇది కొనసాగుతోంది. విద్యారంగంలో వస్తున్న అనేక నూతన ప్రయోగాల వల్ల పాత విధానాలలో గందరగోళం వల్ల 1977 లో జనతాపార్టీ మరో జాతీయ విధానం ముసాయిదాను తయారుచేశారు. ఇది వెలుగు చూడకుండానే జనతా ప్రభుత్వం అధికారాన్ని కోల్పోయింది.

1986 లో కూడా విద్యా విధానం శాస్త్ర సాంకేతిక విద్యకు సాధారణ విద్యకు కొత్త రూపం ఇవ్వదల్చింది. ఈ విధానం "5 సంవత్సరాలు", మూల్యాంకనం కాకుండానే జనతాదళ్ ప్రభుత్వం ఆచార్య రామమూర్తి ఆధ్వర్యంలో ఒక కొత్త కమిటీని నియమించింది. ఈ లోపలే 1991లో కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చింది. 1992 ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జనార్దన రెడ్డి ఆధ్వర్యంలో మరో కమిటీని ఏర్పాటు చేసింది. 1986 విద్యా విధానం అంతా సవ్యమే అని ఈ కమిటీ తీర్పు నిచ్చింది.

BRAOU

మానవ వనరులను పెంపొందించడంలో విద్యారంగం ఒక ప్రముఖ పాత్ర పోషిస్తుంది. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖను మానవ వనరుల శాఖగా మార్చడం బట్టి ప్రభుత్వం మానవ వనరుల అభివృద్ధిలో విద్యారంగం పాత్రను గుర్తించినట్టే. అయితే పరిణామం పేర్లు మార్చడం వరకేనా ఆచరణలో ఉందా అన్నది కాలం నిర్ణయిస్తుంది. విద్యారంగం పలు సవాళ్ళు ఎదుర్కొంటోంది. అందులో ముఖ్యమైనవి;

(1) విధానాలలో పేర్కొన్న కార్యక్రమాల అమలుకు ఎంత ఖర్చు చేయాలో అన్నదానిపై అవగాహన కొరవడడం.

(2) ఈ రంగానికి కేటాయించిన దానిలో అత్యధిక వనరులు పంతుళ్ళ జీతాలకే సరిపోతోంది. అంటే అభివృద్ధి కోసం నిధులు అంతంత మాత్రమే మిగిలాయి.

(2) విద్యారంగంలో ప్రాధాన్యతలని నిశ్చయించకుండా అన్ని రంగాలకు ధనాన్ని వెచ్చించడం.

(3) దేశంలో మానవశక్తి ప్రణాళిక (man power planning) కు, విద్యా విధానాలకు (educational policies) కు లంకె లేకపోవడం.

(4) అత్యధిక సంఖ్యలో మహిళలు నిరక్షరాస్యులుగా ఉండడం.

ఈ మధ్యనే కేంద్ర ప్రభుత్వం విద్యకు అధిక నిధులు కేటాయించాలన్న విధాన ప్రకటనను చేసింది, "అందరికీ విద్య" అనే అంతర్జాతీయ సదస్సులో భారత ప్రధాన మంత్రి విద్యారంగానికి స్థూల జాతీయోత్పత్తిలో 6 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. 1967 లోనే స్థూల జాతీయోత్పత్తిలో 6 శాతం నిధులు కేటాయించాలని డా.డి.ఎస్. కొఠారి అధ్యక్షతన జాతీయ విద్యా సంస్థ కోరింది. ఆ నివేదికలోని వనరుల కేటాయింపును అమలు చేయటంలో ఆలస్యం ఊహించలేనిది.

పట్టిక 1

| సంవత్సరం | విద్యా కమిషన్ సిఫారసు | వ్యయం |
|---|---|---|
| 1965 - 68 | 2.9 | 2.8 |
| 1970 - 71 | 3.4 | 3.1 |
| 1980 - 81 | .5.0 | - |
| 1986 - 87 | 6.00 | 3.9 |

* (Report of Education Commission P. 872)

... (Report of the Committee for Review of N P E 1992 P. 360)

పట్టిక 2

పంచవర్ష ప్రణాళికలలో విద్యా రంగం కేటాయింపులు

| | % |
|---|---|
| మొదటి ప్రణాళిక | 7.86 |
| రెండవ ప్రణాళిక | 5.83 |
| మూడవ ప్రణాళిక | 6.87 |
| సంవత్సర ప్రణాళికలు | 4.86 |
| నాల్గవ ప్రణాళిక | 5.04 |
| ఐదవ ప్రణాళిక | 3.27 |
| ఆరవ ప్రణాళిక | 2.40 |
| ఏడవ ప్రణాళిక | 3.55 |

ఇతర దేశాలతో పోలిస్తే మానవ వనరుల అభివృద్ధిలో విద్యా రంగానికి కేటాయింపులు తక్కువే. అభివృద్ధి చెందుతున్న దేశాలు మనకన్నా ఎక్కువ నిధులు విద్యకు సమకూరుస్తున్నాయి. తూర్పు ఆసియా లోని కొరియా సింగపూర్ వంటి దేశాలు వాటి దేశ స్థూల ఉత్పత్తిలో 20 శాతం విద్యపై ఖర్చు చేశాయి.

చదువుకొన్నవారు ఎదుర్కొనే ప్రతిబంధకం నిరుద్యోగం . ప్రస్తుతం దేశంలో నిరుద్యోగుల సంఖ్య 20 మిలియన్లు. మనం ఎంచుకున్న ఆర్థిక వ్యూహంలో ఎక్కువ మందికి వొకేషనల్ కోర్సులకు ప్రోత్సాహం ఇవ్వాలని ఉంది. ఈ మధ్యనే



BRAOU

వాటిని ప్రారంభించారు. సాధారణ విద్య కంటే వొకేషనల్ అంటే వృత్తిపరమైన విద్యకు ప్రాధాన్యత నివ్వడం వల్ల నిరుద్యోగ సమస్య కొంత తీరుతుంది. దేశాభివృద్ధికి విద్య అవసరం. అంతేకాక మానవ వనరులు కూడా విద్య ద్వారా పెంపొందించగలం అన్నది గుర్తిస్తే మంచిది.

## అభ్యాసం

మానవ వనరుల అభివృద్ధికి విద్యా రంగం ఎలా తోడ్పడుతుంది ?

## 16.4 అందరికీ ఆరోగ్యం - లక్ష్యం

BRAOU

విద్య తర్వాత మానవ వనరుల అభివృద్ధికి తోడ్పడే మరొక ప్రధాన రంగం ఆరోగ్యం. నిరక్షరాస్యత వల్ల, ఉపాధి అవకాశాలు లేనందువల్ల ప్రజలు తమ ఆరోగ్య అవసరాలను నిర్లక్ష్యం చేయవచ్చు. ఆరోగ్యవంతంగా లేని దేశం అభివృద్ధి పథం వైపు పయనించలేదు. వ్యక్తులు, సమాజంలో ఆరోగ్యానికి సంబంధించిన లక్ష్యాలు, సాంఘిక, ఆర్థిక లక్ష్యాలతో మిళితం కావాలి. ప్రజల మానసిక ప్రవృత్తిలోనే మార్పు రావాలి.

మన దేశం అమలు పరుస్తున్న నూతన ఆరోగ్య ప్రధాన లక్ష్యాలు ఇవి :

(1) ఆరోగ్య సదుపాయాలు ప్రజలకు చేరువలో ఉండాలి. అవి ప్రజల ఆర్థిక స్తోమతకు తగ్గట్టు వారు భరించగలిగేవిగా ఉండాలి.

(2) ప్రజలు కొత్త విధానాలను అలవర్చుకోవడానికి వీలుగా శిక్షణా సౌకర్యాలను ఏర్పరచి తగిన విధంగా ప్రచారం చేయాలి. స్థానిక అవసరాలకు తగ్గట్టుగా హెల్త్ వర్కర్లను తయారు చేసి వారి ద్వారా గ్రామాలలో ఆరోగ్య సేవలను వనరులు కల్పించాలి.

(3) ఆరోగ్య వైద్య విషయాలలో ప్రజల్లో విరివిగా ప్రచారాన్ని రూపొందించడానికి వీలుగా అధికారులు, హెల్త్ వర్కర్లు మొదలైన వారు, గ్రామాలలో యువకులను ఎంపిక చేసి వారి ద్వారా గ్రామాల్లో వైద్య నిపుణులను గుర్తించాలి. వారి సహాయంతో స్థానికంగా ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించి ఏర్పాట్లు సులువుగా చెయ్యవచ్చు.

(4) సామాజిక వ్యవస్థకు తగిన సాంకేతిక విధానాన్ని చేపట్టాలి. తల్లి, పిల్లల విషయంలో వారి ఆరోగ్యాన్ని పెంపొందించడానికి వీలైన సలహాలను అందించాలి.

(5) స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని స్థానికంగా లభ్యమయ్యే మార్గాలతో పరిష్కరించాలి. ఆరోగ్య వైద్య విషయాలలో వికేంద్రీకరణ సూత్రం అమలు కావాలి.

భారత రాజ్యాంగం 47వ ఆర్టికల్‌లో ఆదేశించిన విధంగా పౌష్టికాహార స్థాయిని పెంచి ప్రజల జీవన ప్రమాణాన్ని పెంపొందించాలి. దీనికి విధానపరమైన ప్రతిస్పందన ఎలా ఉందో చూద్దాం. దేశంలో అత్యధిక ప్రజలు గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్నారు. వివిధ ప్రణాళికలలో ఆరోగ్య రంగానికి ఇచ్చిన ప్రాధాన్యతను గమనించండి. మొదటి ప్రణాళిక అంటు వ్యాధుల నిర్మూలన, గ్రామ ప్రాంతాలలో వైద్య సౌకర్యాలను మెరుగు పరచడం లక్ష్యంగా పెట్టుకుంటే, రెండోది దేశంలో పలుచోట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాపనకు తోడ్పడింది. మూడోది కుటుంబ నియంత్రణకు, నాల్గోది గ్రామ ప్రాంతాలలో పేద ప్రజలకు ఆరోగ్య సేవల్ని, అందించేందుకు 'ఐదో ప్రణాళికలో 'ఆరోగ్యం' కనీస అవసరాలలో భాగంగా చూపారు. ఆరవ ప్రణాళిక సుమారుగా ఇవే లక్ష్యాలను కలిగి ఉంది. అందరికీ ఆరోగ్యం' అనే నినాదం ఆరో ప్రణాళికలో మొదలు అయ్యింది, ఏడో ప్రణాళిక గ్రామీణ ఆరోగ్యానికి ప్రాధాన్యతను ఇచ్చింది. ఎనిమిదో ప్రణాళిక (health infrastructure) ఆరోగ్య సాధనా సంపత్తికి ప్రాధాన్యతను ఇచ్చింది. అనేక జాతీయ కార్యక్రమాల ద్వారా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు ఆర్థిక ఇతర సహకారాలను అందచేస్తోంది. ఉదాహరణకు ఈ మధ్యనే "పోలియో చుక్కలు" ఒక జాతీయ స్థాయి కార్యక్రమంగా కొనసాగింది. ఇవికాక జాతీయ మలేరియా నిర్మూలన, జాతీయ టి.బి. కేంద్రాలు, అంధత్వ నిర్మూలన, జాతీయ గినివామ్ నిర్మూలన (నారి కురుపు), జాతీయ కుష్ఠురోగ నిర్మూలన,కుటుంబ సంక్షేమ కార్యక్రమం మొదలైన అనేక కార్యక్రమాల ద్వారా జాతీయ ఆరోగ్యానికి చర్యలు చేపట్టడం జరిగింది. మన రాష్ట్రంలో ఆరోగ్యంపథకంలో 1306 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు స్థాపించారు.మొత్తం 10568 కుటుంబ సంక్షేమ ఉపకేంద్రాలు కూడా ఉన్నాయి. ఒక నిమిషానికి 48 మంది పిల్లలు ఆంధ్రప్రదేశ్ లో పుడుతున్నారు. ప్రపంచంలో 140 మంది మిలియన్ల పిల్లలు పుడితే 4 మిలియన్ల మంది కొన్ని గంటల్లోనే మృతి చెందుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 1000కి 71 మంది శిశుమరణాల రేటు ఉంటే దేశంలో 1000కి 79 ఉంది. ప్రపంచంలో సంవత్సరానికి 5 లక్షల మంది స్త్రీలు ప్రసవ సమయంలో చనిపోతున్నారు.

**పౌష్టికాహార లోపం :** ఆరోగ్యాన్ని నిర్ణయించే మరొక ముఖ్యమైన అంశం పౌష్టికాహారం. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కొనుగోలు శక్తి లోపించడం వల్ల సమతుల్య ఆహారాన్ని తీసుకోలేకపోతున్నారు. భారతదేశంలో ఆహార ఉత్పత్తి గణనీయంగా పెరిగినా సామాన్య మానవునికి ఆహారం అందుబాటులో ఉందా? అన్న ప్రశ్న వేసుకోక తప్పదు. మానవ వనరుల నాణ్యత వారు తీసుకునే ఆహారాన్ని బట్టి ఉంటుంది.

భారతదేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి 1950లో 50మి. టన్నులు ఉంటే 1990కి అది 170 మి. టన్నులకి చేరింది. తలసరి ఆహారం ధాన్యాల లభ్యత 1951లో రోజుకు మనిషికి 395 గ్రా . అది 1995కి 430 గ్రాములకి పెరిగింది, కాని పప్పు ధాన్యాలు తలసరి లభ్యత 60.7 గ్రా. నుండి 36.2 గ్రా. పడిపోయింది. ప్రొటీన్‌ల శక్తి, విటమిన్ 'ఎ' లోపం, విటమిన్ 'బి' లోపం, ఐడీన్ లోపం మొదలగునవి. పౌష్టికాహార రంగంలో కన్పిస్తున్న ప్రధాన సమస్యలు. పౌష్టికాహార లోపం కారణంగా అనేక మంది గ్రామీణ ప్రజలు, ముఖ్యంగా రైతు కూలీలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. పౌష్టికాహారం అన్నది సామాజిక ఆర్థికాభివృద్ధిలో భాగంగానే చూడాలి.

BRAOU

## 16.5 మహిళలు

జనాభాలో సగం శాతం ఉన్న మహిళలు అనేక రంగాల్లో వెనుకబడి ఉన్నారు. మానవ వనరుల్లో సగం శాతం ఉన్న వీరి అక్షరాస్యత శాతం భారతదేశంలో39.3 శాతం మాత్రమే. ఆంధ్రప్రదేశ్‌లో మహిళ అక్షరాస్యత 32.7 శాతం మాత్రమే. 1991 లెక్కల ప్రకారం గ్రామీణ మహిళల్లో 23 నుండి 27 శాతం వరకే పని లభిస్తుంది. 19 శాతం మహిళా కార్మికులు జీతం లేకుండా కుటుంబ బాధ్యతలే నిర్వహిస్తున్నారు. అత్యధిక మహిళలు అసంఘటిత రంగంలో ఉన్నారు. తక్కువ పరిజ్ఞానం, తక్కువ సామాజిక స్థాయి, తక్కువ ఆదాయం ఈ మూడూ మహిళలు ఉన్న పరిస్థితిని వివరిస్తాయి. ఇప్పుడిప్పుడే అనేక రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల అభివృద్ధికై అనేక చర్యలు చేపడుతున్నారు. ఈ చర్యల ఫలితం వేచి చూడవలసిందే. ఏ దేశంలోనైతే మహిళలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక ప్రకియలలో ఎక్కువ ప్రమేయం ఉండదో ఆ దేశ మానవ వనరుల అభివృద్ధి అతి తక్కువ స్థాయిలో ఉంటుంది.

## 16.6 మానవ వనరుల అభివృద్ధి ఎందుకోసం ?

ఒక దేశాభివృద్ధిని గుణాత్మకం (Qualitative) గానూ పరిమాణాత్మకం (Quantitative) గా కూడా కొలవవచ్చు. సాంప్రదాయబద్ధ ఆర్థిక శాస్త్ర వేత్తలు స్థూల జాతీయోత్పత్తి, తలసరి ఆదాయం మొదలైన అంశాల ఆధారంగా నిర్ణయిస్తారు. 1990 దశకం నుంచి అభివృద్ధిని కొలిచే మానవ వనరుల ప్రాతిపదికపై ఒక సూచీని తయారు చేశారు. దీన్నిబట్టి అక్షరాస్యతస్థాయి, లింగపరమైన అభివృద్ధి , శిశు మరణాల శాతం, అతి తక్కువ స్కూలు చదువుల కాలం, మొదలైనవి అభివృద్ధికి నిర్ధారించే నూతన సూచీలు. ఉదాహరణకు అధిక సంఖ్యాకులైన ప్రజలు నిరక్షరాస్యులనుకోండి. అభివృద్ధి వ్యూహంలో వారికి పెద్దగా పాత్ర ఉండదు. దక్షిణ ఆశియా ప్రాంత దేశాలలో ప్రజలు కనీస అవసరాలకు నోచుకోలేదు. కాని అతి శాస్త్రీయమైన పద్ధతులలో తమ రక్షణ దళాలకు తర్ఫీదు ఇచ్చి అనేక వేల కోట్లు రూపాయలు తమ 'రక్షణ'కు వెచ్చిస్తున్నారు. ఈ ప్రాంతంలోసుమారు 380 మిలియన్ల ప్రజలు నిరక్షరాస్యులు. భారతదేశంలోసుమారు 40 కోట్లు మంది నిరక్షరాస్యులు ఉన్నారంటే ఆలోచించండి. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 4 కోట్లు ప్రజలు నిరక్షరాస్యులు.

BRAOU

మానవ వనరుల అభివృద్ధిపై ఎక్కువ దృష్టిని కేంద్రీకరిస్తే తప్ప, జాతీయోత్పత్తి ప్రక్రియలలో ప్రజలు ఎక్కువ మంది పాల్గొనలేరు. అధిక జాతీయోత్పత్తి జరిగినంత మాత్రాన అభివృద్ధి ప్రక్రియ ద్వారా ప్రజలకు దాని ఫలాలు అందవు.

దేశ దీర్ఘకాలిక అవసరాల దృష్ట్యా చూస్తే మానవ వనరులు పెంపొందిస్తే తప్ప సుస్థిరమైన అభివృద్ధి సాధ్యం కాదు.

**అభ్యాసం**

మానవ వనరుల అభివృద్ధి ఎందుకోసమో క్లుప్తంగా వివరించండి.

## 16.7 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

★ ప్రగతికి మానవాభివృద్ధే అంతిమసూచికగా చాలా మంది మేధావుల అభిప్రాయ పడ్డారు.

★ మానవాభివృద్ధి నివేదికలో మెరుగైన జీవితాన్ని గడిపేందుకు మూడు ముఖ్య సూచికలను పేర్కొన్నారు.

(1) ఆయుర్దాయం, (2) పరిజ్ఞానం, (3) ఆదాయం

★ మానవ వనరులను నిర్లక్ష్యం చేస్తే స్వల్ప కాలంలో దీర్ఘకాలంలోనూ సమాజంపై ప్రభావాలు పడతాయి.

★ జాతీయ సంపద పెరుగుతున్నకొద్దీ మానవుని ఎంపికలు విస్తృతం కావాలి.

★ ఏ దేశానికైనా నిజమైన సంపద ఆదేశ ప్రజలే.

★ మానవ వనరులను పెంపొందించడంలో విద్యా రంగం ప్రధాన పాత్రను పోషిస్తుంది.

★ కొత్తగా తయారైన మానవాభివృద్ధి సూచిలో అక్షరాస్యతా స్థాయి, లింగ సంబంధిత అభివృద్ధి, శిశు మరణాలు శాతం, అతి తక్కువ, స్కూలు చదువుల కాలం మొదలైన అంశాలు నిర్ణాయకత్వాన్ని వహిస్తాయి.

## 16.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

30 పంక్తులలో జవాబులు రాయండి.

1. మానవ వనరులంటే ఏమిటో నిర్వచించి, వాటిని మదింపు చేయాల్సిన ఆవశ్యకతను విశదీకరించండి.

2. మానవ వనరుల అభివృద్ధిలో విద్యా విధానం పాత్రను వివరించండి.

15 పంక్తులలో జవాబులు రాయండి.

1. మానవ అభివృద్ధి గురించి ప్రముఖుల అభిప్రాయాలను సమీక్షించండి.

2. కొత్త గా ఏర్పరచిన మానవ వనరుల అభివృద్ధి సూచీలో కనిపించే అంశాలను పేర్కొనండి.

BRAOU

# భాగం - 17 పర్యావరణం, ఇంధనం

విషయ క్రమం


17.0 ఉద్దేశం

17.1 ప్రవేశిక

17.2 పర్యావరణం

17.2.1 స్వాభావిక పర్యావరణం

17.2.2. సామాజిక సాంస్కృతిక పర్యావరణం

అభ్యాసం

17.3. ఇంధనం

అభ్యాసం

17.4 పర్యావరణ సమస్యలకు పరిష్కారాలు

17.5 ఉద్యమాలు

17.6 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

17.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 17.0. ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత ఈ కింది అంశాలను మీరు అవగాహన చేసుకుంటారు :

* స్వాభావిక పర్యావరణంలోనిముఖ్యాంశాలైన ఉష్ణోగ్రత, గాలి, వర్షపాతం, నేల మొదలైన విషయాలను గ్రహిస్తారు.
* మానవులు తాము నిర్మించుకునే సామాజిక, సాంస్కృతిక పర్యావరణాన్ని గురించి తెలుసుకుంటారు.
* పర్యావరణంలోని పదార్థాలు, వస్తువులు మార్పు చెందటాన్నివిశ్లేషించగలుగుతారు.
* మానవ జీవితానికి మనం నివసిస్తున్న భూమి పర్యావరణానికి గల సంబంధాల్ని గ్రహిస్తారు.

## 17.1 ప్రవేశిక

పర్యావరణానికి కొన్ని ముఖ్య లక్షణాలున్నాయి. స్వాభావిక, కృత్రిమ పర్యావరణాల మధ్య తేడాలు ఉంటాయి. పర్యావరణం, శక్తికి పరస్పర సంబంధం ఉంది. మానవ జీవన సరళికి, పర్యావరణానికి గల సంబంధాన్ని అవగాహన చేసుకోవటం ద్వారా మానవుని మనుగడ సులభతరం, సుఖవంతం అవుతుంది.

BRAOU

## 17.2 పర్యావరణం

మన చుట్టూ ఉండే భౌతిక, జీవ పరిసరాలను పర్యావరణం అంటారు. మనం వివిధ రకాలైన జీవులు, నిర్జీవులు, సంఘటనలు ప్రాకృతమైన ప్రభావాలు మధ్య నివసిస్తున్నాం. దీని నంతటిని కలిపి పర్యావరణం అనవచ్చు.

ప్రతి ప్రాణి తమ అవసరాల కోసం, పరిసర పర్యావరణంపై ఆధారపడుతుంది. గాలి, నీరు, ఆహారం మొదలైన వాటి కోసం జీవులు పర్యావరణంపై ఆధారపడుతున్న విషయం మనకు తెలిసిందే. అలాగే మానవుడు తన ఉనికి కోసం పర్యావరణం పై ఆధారపడుతున్నాడు. అంతే కాకుండా తన సుఖం, రక్షణ కోసం ఒక కొత్తరకం పర్యావరణాన్ని ఏర్పాటు చేసుకుంటున్నాడు. దీనినే సామాజిక సాంస్కృతిక పర్యావరణం అంటారు. ఈ విధంగా పర్యావరణాన్ని స్వాభావిక పర్యావరణం (Natural Environment) సామాజిక సాంస్కృతిక లేక మానవకల్పిత పర్యావరణం (Socio-cultural or man made environment)గా విభజించవచ్చు.

### 17.2.1 స్వాభావిక పర్యావరణం

భౌతిక కారకాలు, జీవ సంబంధ కారకాలు అనే రెండు కారకాలతో ఏర్పడింది స్వాభావిక పర్యావరణం.

భౌతిక కారకాలలో వాతావరణం, నేల ముఖ్యమైనవి. వాతావరణం అంటే ఉష్ణోగ్రత, తేమ, వర్షపాతం. నేల అంటే భూమిపైన గల మెత్తని మట్టి అందులో పదార్థాలు.

జీవ సంబంధమైన కారకాలలో మొక్కలు, జంతువులు, మానవులు ఉంటాయి. మొక్కలు ఆహారాన్ని ఉత్పత్తి చేసి జంతువులకు మానవులకు లభింప చేస్తున్నాయి. ఇంతే కాక వాతావరణంలో ఆక్సిజన్, కార్బన్ డై ఆక్సైడుల సమతుల్యతను కాపాడటం,నేలలో తేమ ఉంచటం, నేల కోతను అరికట్టడం, వరదలను నిరోధించటం మొదలైన అంశాలలో సహాయపడుతున్నాయి. మానవులకు జంతువుల నుండి కూడా ఆహారం లభిస్తుంది. (ఉదా: పాలు,గ్రుడ్లు, మాంసం, చేపలు మొదలైనవి)

మానవులకు రవాణా, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో జంతువులు సహాయపడుతాయి. సూక్ష్మజీవులు, కొన్ని ప్రమాదకరమైనప్పటికీ, ఎంతో ఉపయోగకారిగా ఉంటాయి.

### 17.2.2. సామాజిక, సాంస్కృతిక పర్యావరణం

మానవ కల్పితమైన పర్యావరణంలో రోడ్లు, భవనాలు, వ్యవసాయం, రవాణా పద్ధతులు ఉంటాయి.

మానవుడు సంఘజీవి. అయితే ఈ సంఘం మానవుడు ఏర్పరచుకున్నదే. కుటుంబం, మతం, రాజ్యాంగ వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థ, కళలు ఇవన్నీ మానవుని సాంస్కృతిక పర్యావరణానికి సంబంధించిన కారకాలు.

పర్యావరణంలోని వివిధ పదార్థాలు ద్రవ్యరాశి, ఘనపరిమాణం కలిగి ఉంటాయి. ఈ పదార్థాలు ఘనమైన వాయు స్థితులలో ఉండవచ్చు. ఈ పదార్థాల నుండి ఉష్ణం, కాంతి, ధ్వని ఉత్పత్తి అవుతాయి. వీటిని శక్తి రూపాలు అంటారు. కాబట్టి ప్రతి పనికి, గమనానికి శక్తి అవసరం. పదార్థాలలో ఏవీ స్థిరమైన రూపంలోగాని, స్థితిలోగాని ఉండవు. ఇతర పదార్థాలతో అవి పరస్పరం చర్య జరిపి మార్పు చెందుతూ ఉంటాయి. అందుచేత పర్యావరణంలో కూడా ప్రతి వస్తువూ మార్పును పొందుతుంది. అలాగే పర్యావరణం ఎప్పుడూ మార్పుకు లోనవుతూ ఉంటుంది.

BRAOU

నదులు గమనాన్ని మార్చుకోవటం, అడవులు నశించి పోవటం, కొండ గుట్టలు తరిగి పోవటం లాంటివి మనం ఇటీవలి కాలంలో ఎక్కువగా చూస్తున్నాం. ఈ విశ్వంలోని నక్షత్రాలు, గ్రహాలు మనం నివసిస్తున్న భూమి అన్నీకూడా పరిణామ క్రమంలో ఏర్పడినవే. దీనిని విశ్వ పరిణామం (cosmic Evolution) అంటారు.

అలాగే భూమి మీద అనుకూల పరిస్థితులలో రసాయనిక మార్పులు జరిగిన జీవ పదార్థం (D N A) ఏర్పడింది. మొదట ఏక కణ జీవులు ఏర్పడి,జీవ పరిణామం ద్వారా బహుకణ జీవులు ఏర్పడి, చివరగా మానవుడు ఏర్పడ్డాడు. మానవుడు తన మనుగడ కోసం పర్యావరణాన్ని తనకు అనుకూలంగా మలచుకుంటున్నాడు. ఈ ప్రక్రియలో ఎంతో జాగరుకతతో మెలగవలసి ఉంది. ఎందుకంటే అనేక లక్షలసంవత్సరాల నుండి జీవ పదార్థం నుంచి పరిణామ క్రమంలో ఏర్పడినవివిధ ప్రాణులు ఒకసారి శాశ్వతంగా కోల్పోతే అవి మళ్ళీ సృష్టించబడలేవు.

**అభ్యాసం**

అ. పర్యావరణం అంటే ఏమిటి ?

ఆ. పర్యావరణం, పదార్థాల పరస్పర సంబంధాన్ని తెలపండి ?

BRAOU

## 17.3 ఇంధనం

సృష్టిలోని శక్తి వనరులు ప్రత్యక్షంగా కాని లేదా అనేక రూపాంతరాలు చెంది కానీ జీవ కోటి అవసరాలకు ఉపయోగపడుతుంటాయి. మనకు ప్రధానంగా శక్తి సూర్యుని నుండి లభిస్తుంది. ఈనాడు మనం ఉపయోగించే శక్తి వనరులు :

1. సాంప్రదాయ ఇంధన వనరులు (ఉదా: వంట చెరకు లేదా కట్టెలు, పశు శక్తి)

2. ఆధునిక ఇంధన వనరులు (ఉదా: విద్యుత్తు, జలవిద్యుత్తు, థర్మల్ విద్యుత్తు,అణు విద్యుత్తు, నూనె-పెట్రోలు, సహజ వాయువు)

3. సాంప్రదాయేతర ఇంధన వనరులు (ఉదా: సౌరశక్తి, వాయుశక్తి, బయోగ్యాస్, చెత్తనుండి విద్యుత్తు)

పైన పేర్కొన్న ప్రత్యామ్నాయ వనరులు కాక శక్తిని వివిధ రకాలుగా ఉత్పత్తి చేయడానికి శాస్త్రజ్ఞులు ఎన్నో పరిశోధనలు చేస్తున్నారు. అవి:

1. **భూగర్భ ఉష్ణశక్తి :** భూగర్భంలోనికి నీటిని పంపి, బయటకు వచ్చే వాయువుతో టర్బైనుల ద్వారా విద్యుత్తును భారీ ఎత్తున ఉత్పత్తి చేయవచ్చు.

2. **సముద్ర ఉష్ణ శక్తి :** సముద్రంలో వివిధ లోతులలో ఉన్న ఉష్ణోగ్రతల సహాయంతో విద్యుత్తును ఉత్పత్తి చేసేందుకు పరిశోధనలు జరుగుతున్నాయి.

3. **అలల శక్తి :** సముద్రంలోని అలలు వచ్చిపోయినపుడు కలిగే గాలి పీడనం సహాయంతో వాయు టర్బైనులను త్రిప్పి విద్యుచ్ఛక్తిని తయారు చేయవచ్చునని తెలుస్తుంది.

4. **హైడ్రోజను :** హైడ్రోజను, ఆక్సిజను వాయువుల రసాయన సంయోగం వల్ల నీరు ఏర్పడుతుంది. ఎక్కువ హైడ్రోజను అణువుల మిశ్రమాన్ని భార ఉదజని అని అంటారు. ఇందులో ఉన్న అధిక శక్తితో విద్యుత్తును ఉత్పత్తి చేయవచ్చు.

5. **సూపర్‌కండక్టవిటి :** అధికోష్ణ వాహకాలు శక్తి ఉత్పత్తి చేయటంలో బాగా ఉపయోగపడ్తాయని తెలుస్తోంది. దీని వల్ల రవాణా, కమ్యూనికేషన్సు పరిశ్రమలలో పెద్ద మార్పులు వస్తాయి.

ఇంధన శక్తి అనగానే మనకు విద్యుచ్ఛక్తి, పెట్రోలు, డీజిలు, కిరోసిను, బొగ్గు మొదలైన ఇంధన వనరులు గుర్తుకు వస్తాయి. వీటిని ఎక్కువగా పట్టణ ప్రజావసరాలకు, పారిశ్రామిక, రవాణాల కోసం ఉపయోగిస్తారు. కాని మన గ్రామ ప్రాంతాలలో ఈ ఆధునిక శక్తి వనరులకంటే పశువులు,వంటచెరకు మొదలైన వాటిని ఎక్కువగా ఉపయోగిస్తారు.

అయితే ఆధునిక ఇంధన వనరులు శాశ్వతం కాదు. అంతేకాక అవి ఎక్కువగా పర్యావరణ కాలుష్యానికి దారి తీస్తున్నాయి. అందువలన మనం ఉపయోగించే శక్తివిధానాలను తగిన విధంగా మార్చుకోవాలి. అందుకోసం ఈ కింది అంశాలను దృష్టిలో ఉంచుకొనవచ్చు :

1. కొరతగా ఉన్న ఆధునిక ఇంధన వనరులను పొదుపుగా వాడాలి.

BRAOU

2. పర్యావరణ వినాశనాన్ని కల్పించే భారీ జల విద్యుత్తు, ధర్మల్, అణు విద్యుత్తు, కేంద్రాలను స్థాపించకుండా చిన్న తరహా జల విద్యుత్తు ఉత్పాదక కేంద్రాలను నిర్మించి వినియోగించాలి.

3. సాంప్రదాయక ఇంధన వనరులైన సౌరశక్తి, వాయుశక్తి, సముద్ర గర్భ ఉష్ణశక్తి, అలల శక్తి మొదలైన వాటి వినియోగానికి ప్రాముఖ్యత నివ్వాలి.

4. ప్రతి గ్రామం స్వయం పోషకత్వాన్ని సాధించడానికి వీలైన ప్రతిచోట బయోగ్యాసు వినియోగం, సౌరశక్తి, వాయుశక్తి కేంద్రాల నిర్వహణలో శిక్షణ నిచ్చి ప్రోత్సహించాలి.

5. బాధ్యతగల పౌరులుగా ప్రజలు తమవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలి. సైకిళ్ళు ధర తగ్గించడం ద్వారా వాటి వినియోగాన్ని పెంచవచ్చు. పెట్రోలుతో నడిచే వ్యక్తిగత రవాణా వాహనాలు ధరను పెంచి వాటి వినియోగాన్ని తగ్గించవచ్చు. రిఫ్రిజిరేటర్లు, పెట్రోలు, వాహనాలు ఉపయోగించకుండా ఉన్నట్లయితే వాటిని ఉపయోగించే శక్తిని పొదుపు చేయవచ్చు.

6. కుటీర, చిన్నపరిశ్రమలను ప్రోత్సహించినట్లయితే మిల్లులు వినియోగించే శక్తిని పొదుపు చేసిన వాళ్ల అవుతాము.

ఈ విధంగా పర్యావరణం నష్టపోకుండా మన ఆర్థికాభివృద్ధిని సాధించే వరకు మన జీవన విధానంలో ఇటువంటి మార్పులను చేసుకొన్నట్లయితే మన రాష్ట్రం, దేశం మాత్రమే కాకుండా ప్రపంచ పర్యావరణాన్ని రక్షించుకోవచ్చు.

**అభ్యాసం**

సంప్రదాయ, ఆధునిక, సంప్రదాయేతర ఇంధన వనరులకు ఉదాహరణల్వీండి ?

BRAOU

## 17.4 పర్యావరణ సమస్యలకు పరిష్కారాలు

మనకున్న పర్యావరణ సమస్యలలో కొన్ని కీలకమైన సమస్యలను, వాటి పరిష్కారాలను తెలుసుకుందాం.

1. మనిషికి కావలసిన కనీస అవసరాలతో బాటు విద్య, ఆరోగ్యం, పరిసరాల పరిరక్షణ కార్యక్రమాలు ముమ్మరం చేసినట్లయితే దేశంలో అన్ని ప్రాంతాలలో కూడా ప్రజల సహకారంతోనే జనాభాని అదుపు చేయడానికి తగిన ప్రణాళికలను రూపొందించి అమలు చేయవచ్చు.

2. రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడకం వలన నీటి కాలుష్యం, పరిసరాల కాలుష్యం పెరిగింది. పెంటపోగు సేంద్రియ ఎరువులు ఎక్కువగా వాడి కృత్రిమ ఎరువుల వాడకం తగ్గించటం ద్వారా పంట భూముల సారాన్ని పోషించవచ్చు. అలాగే క్రిమి సంహారక మందుల వాడకం తగ్గించి పంట తెగుళ్ళను నివారించేందుకు వివిధ రకాలైన జీవాపరణ పద్ధతులను (లింగాకర్షణ, దీపపు కాంతి ఆకర్షణ) వాడటం మంచిది.

3. పట్టణాల వైపు జనాభా వలస వెళ్లటం వల్ల మంచినీటి సరఫరా, మురుగునీటి పారుదల, పారిశ్రామిక వ్యర్థ పదార్థాలు, వాయుకాలుష్యం, నీటి కాలుష్యం, ధ్వని కాలుష్యం అదుపు చేయటం అవసరమైంది. తాగే మంచినీరు తగిన ప్రమాణాలలో ఉండేట్లు చూడటం, క్లోరిన్ కలుపటం లేదా కాచివడబోసిన నీరు త్రాగటం, మంచినీటి గొట్టాల మురికి నీటి గొట్టాల మధ్య ఎటువంటి సంబంధాలు లేకుండా తగిన చర్యలు తీసుకోవటం అవసరం. ధ్వని కాలుష్యానికి కారకాలైన వాహనాలు వాటి హారన్లు పర్యవేక్షించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ వాహనాల నుండి వచ్చే పొగల కాలుష్యాన్ని పరీక్షించి వాహనాలకు తగిన మార్పులు వెటనే చేయించటం అవసరం. ఇటువంటి వివిధ కాలుష్యాల వల్ల ప్రజలలో వచ్చే అనారోగ్యాన్ని పరిశోధించి మూలకారణాలు పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలి. పరిశ్రమలకు కాలుష్య నియంత్రణ పరికరాలు ఏర్పరచి కాలుష్యాన్నిఅదుపు చేయాలి.

4. విచక్షణా రహితంగా అడవులను నరకటం వలన పర్యావరణం సమతుల్యం దెబ్బతింటుంది. కార్బన్‌డై ఆక్సైడ్‌ను ఉపయోగించి ఆక్సిజన్ స్థాయిని పెంచే చెట్లు నశించటం వల్ల ప్రజారోగ్యం, పర్యావరణం పరిరక్షణ దెబ్బతింటాయి. మహబూబ్‌నగర్, నల్గొండ, అనంతపూరు ప్రాంతాలు ఎడారులుగా మారిపోతుంటే పంటలకు, పశువులకు నష్టం వాటిల్లుతోంది. అందువలన అనువైన చెట్ల అడవులను పెంచాలి

5. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణలకు సంబంధించిన చట్టాలలో ఉన్న లోపాలను తొలగించటం, వాతావరణ కాలుష్యంపై వచ్చే కేసులను వెంటనే పరిష్కరించడం అవసరం. అట్లా వెంటనే పరిష్కరించనట్లయితే అనారోగ్యం, ప్రాణహాని పెరిగిపోతుంది. కాబట్టి ప్రత్యేకమైన కోర్టులను ఏర్పాటు చేయాలి.

6. వాతావరణ కాలుష్యం, పర్యావరణ సంక్షోభాలు జీవన్మరణ సమస్యలు కాబట్టి ఈ సమస్యల పట్ల ప్రజలలో అవగాహన పెంపొందించి అప్రమత్తం చేయాలి. ప్రజలు, పారిశ్రామిక వేత్తలు, అధికారులు పరిశ్రమలను స్థాపించే ముందే సరియైన నిర్ణయాలు తీసుకునేటట్లు ప్రసార మాధ్యమాలు పూనుకోవాలి. విషపూరిత రసాయనాలకు గురై మరణించడం, రోగ గ్రస్తులు కావటం కంటే అటువంటి పరిశ్రమలు స్థాపించడానికి ముందే అప్రమత్తంగా ఉండటం మంచిది. ఆ పరిశ్రమల స్థాపన వల్ల కలిగే పర్యావరణ ప్రభావానికు సంబంధించిన నివేదికలను తయారు చేయించి ఆ నివేదికలపై బహిరంగ చర్యలు జరిపి తగిన సలహాలను ప్రభుత్వం తీసుకోవాలి.

కాలుష్యానికి గురైనప్రజలకు, అభివృద్ధి కార్యక్రమాలకు గురైన నిర్వాసితులకు నష్టపరిహారాన్ని ఇవ్వటానికి మన రాష్ట్రంలో కూడా తగిన శాసనాలు అమలు చేయాలి. ఇందు కోసం ప్రసార మాధ్యమాలు ప్రపంచ పర్యావరణ సమస్యలపై ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వానికి తెలియచేయాలి. ఉత్తర అమెరికా 33.2 శాతం, యూరోపు 26.1 శాతం భూమి మీద ఉష్ణోగ్రత పెంపుకు (Global warming) కారణం కాగా, భారతదేశం 1.5 శాతం, చైనా 5.5 శాతం బాధ్యత వహిస్తున్నాయి. మొత్తం మీద ఈ భూ ఉపరితల ఉష్ణోగ్రత పెంపుకు పారిశ్రామిక దేశాలు 80 శాతం పైగా కారణమవుతున్నాయి.

ఐక్యరాజ్య సమితి, ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్, ప్రభుత్వేతర సంస్థలు పర్యావరణ పరిరక్షణ విధాన నిర్ణయాలు తీసుకోవటంలో ప్రముఖ పాత్ర వహిస్తున్నాయి. వివిధ స్థాయిల్లో, దశల్లో వెలువడుతున్న నివేదికలు గురించి ప్రజల్లో అవగాహన కలిగించటం అవసరం. ఉదాహరణకు 1992లోని రియో సమావేశం (Rio Conference), యునైటెడ్

BRAOU

నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ఎన్విరాన్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్ (UNCED) వారి ఎజెండా 21 అనే డాక్యుమెంట్‌లోని సిఫార్సుల గురించి తెలియ జేయవలసి ఉంది.

ఇటీవలి కాలంలో చలామణీ అవుతున్న "సుస్థిరమైన అభివృద్ధి" (Sustainable developement) సిద్ధాంతం గురించి తెలుపటం అవసరం. పర్యావరణంతో నిమిత్తం లేని అభివృద్ధి వినాశానికి దారి తీస్తుంది. మరి అభివృద్ధిని సాధించటం ఎలా? దీనికి సమాధానమే ఈ సుస్థిరమైన అభివృద్ధి. స్థూలంగా సుస్థిరమైన అభివృద్ధి అంటే పర్యావరణానికి జీవావరణానికి అనుగుణంగా, ఆత్మీయంగా ఉండే అభివృద్ధి విధానం. ఈ చైతన్యవంతమైన సామాజిక ఆర్థిక విధానంలో ప్రజలు పాత్రను తెలియజేయాల్సిన అవసరం ఉంది.

## 17.5 ఉద్యమాలు

మన దేశంలో పరిశ్రమలు, వాహనాలు, రసాయనాలు వాడకం రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. వీటి వలన ఏర్పడుతున్న వాతావరణ కాలుష్యాన్ని నివారించటానికి తగిన చర్యలు తీసుకొనబడటం లేదు. ఈ కారణాల వల్ల కాలుష్య సమస్యను ఎదుర్కోవలసి ఉంటుంది.

మన దేశంలో 50 శాతం నగరాలకు, 70 శాతం పట్టణాలకు భూగర్భ మురుగునీటి సౌకర్యాలు లేవు. మురుగు శుద్ధి కేంద్రాలు లేవు. ఈ మురుగు నీరు నీటి వనరులను కలుషితం చేస్తూ అనేక రోగాలకు కారణ భూతమవుతోంది. మన దేశంలో అధికంగా కాలుష్యాన్ని విడుదల చేసే పరిశ్రమలలోసగం ఫ్యాక్టరీలకు కాలుష్య శుద్ధి కేంద్రాలు నామ మాత్రంగా ఉన్నాయి. ప్రభుత్వ రంగ పరిశ్రమలు కూడా కాలుష్య సమస్యను బొత్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయి. ప్రభుత్వం కూడా ఈ కాలుష్యాన్ని నివారణ పథకాలను అత్యంత శ్రద్ధతో పరిగణించటం లేదు. ప్రభుత్వ రంగ పరిశ్రమలు, ప్రభుత్వ వాహనాలు కాలుష్య నియంత్రణ చట్టాన్ని యధేచ్ఛగా ఉల్లంఘిస్తున్నందువల్ల, మిగిలిన ప్రయివేటు పారిశ్రామిక వేత్తలు, వ్యక్తులు ఈ చట్ట నిబంధలను ఖాతరు చేయటం లేదు. దీనికి తోడు కాలుష్య నియంత్రణ బోర్డులు రాజకీయ వత్తిడులకు లొంగి చిత్తశుద్ధి లేకుండా పనిచేస్తున్నాయి.

మనదేశంలో అనేక ప్రాంతాలలో కాలుష్యాన్ని కలిగించే వివిధ పథకాలను ఎదుర్కోటానికి అనేక ఉద్యమాలు జరిగాయి. బొంబాయికి నైఋతి దిశలో ఎరువుల కర్మాగారాన్ని స్థాపించటం వలన అటువైపునుండి వచ్చే గాలి ద్వారా కాలుష్యం బొంబాయి ప్రజలకు హాని కలిగిస్తుందని దానిని నిరోధించడానికి ఒక ఉద్యమాన్ని చేపట్టారు. అందులో విజయం సాధించారు కూడా. అదే మాదిరిగా గంగానది వెంబడి స్థాపించబడ్డ అనేక పరిశ్రమలు గంగానది నీటిని కాలుష్యం చేస్తున్నాయి. ఈ కాలుష్యాన్ని ఆపటానికి ప్రఖ్యాత సుప్రీంకోర్టు న్యాయవాది శ్రీ ఎం.పి. మోహతా సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేసినపుడు మురుగు నీటిని శుద్ధి చేయకుండా, గంగానదిలో కాలుష్యాన్ని కలిపే పరిశ్రమలను మూసివేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశం మేరకు అనేక కాలుష్యశుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయబడి గంగానది నీటిని శుద్ధి చేసే ప్రయత్నం ప్రారంభం అయింది.

డెహ్రాడూన్ లోయలో నీటి వనరులు కలుషితమవటం వల్ల అక్కడి ప్రజలు అనేక ఉద్యమాలు సాగించి చివరకు సుప్రీంకోర్టులో దాఖలు చేసినపుడు కోర్టు వారు కంట్రాక్టర్‌లను అక్కడి సున్నపురాతి కొండలను కొట్టివేయకుండా నిరోధించారు.

మన ఆంధ్ర రాష్ట్రంలో నాగార్జున రిజర్వాయరు వద్ద అణువిద్యుత్తు కేంద్రాన్ని స్థాపించడానికి రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు తలపెట్టినపుడు కొంతమంది నిపుణులు స్వచ్ఛంధ సేవా సంస్థల ప్రతినిధులు ఈ అణశక్తి కేంద్రం నాగార్జున సాగర్ వద్ద పెట్టడం వల్ల ఏర్పడే వాతావరణ కాలుష్యం, పర్యావరణ సంక్షోభాల గురించి ప్రజలలో అవగాహన కలిగించారు. అనేక

BRAOU

సభలు, సమావేశాలు, ప్రదర్శనలు, ఉద్యమాలు నిర్వహించారు. ప్రజలలో వచ్చిన ఈ చైతన్యంతో నాగార్జున సాగర్ వద్ద అణుశక్తి కేంద్రాలు స్థాపించే ఉద్దేశాన్ని ప్రభుత్వం విరమించుకుంది.

ఆంధ్రప్రదేశ్ రాజధాని అయిన హైద్రాబాదు చుట్టువున్న నగర శివార్లలోని నాచారం, సరూర్‌నగర్, పటాన్‌చెరువు, జీడిమెట్ల, కూకట్‌పల్లి, బొలారం ప్రాంతాలలోని పరిశ్రమల నుండి వెలువడే కాలుష్యం వల్ల అక్కడి ప్రజలు తీవ్రంగా బాధలకు గురి అవుతున్నారు. అప్పుడు "కాలుష్య వ్యతిరేక పౌర సమితి" అనే సంస్థ స్థానిక ప్రజలతో కూడగట్టుకుని ఉద్యమాలు నిర్వహించి అక్కటి ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకొని వచ్చింది.

వాతావరణ కాలుష్యం, పరిసరాల పరిరక్షణ విషయంలో ప్రజలు ఉద్యమాలను నిర్వహించి అవసరమైతే కోర్టుద్వారా ఎదుర్కొంటేనే కాలుష్యాన్ని నివారించ గలుగుతున్నారు. అందువలన ప్రజలలో ఆసక్తి కలిగించటం, బడిపిల్లల్లో, కళాశాల విద్యార్థులలో ఈ విషయాలపై అవగాహనను పెంపొందింప చేయాల్సిన బాధ్యత ప్రసారమాధ్యమాలకు ఉంది. ఉద్యమాల గురించి, వాటినాయకుల గురించి వారనుసరించే విధానాల గురించి ప్రసార మాధ్యమాలు ప్రజలకు తెలియ చేయవలసి ఉంది. ప్రతి జిల్లాలో ఆ ప్రాంతాలకు సంబంధించి మొక్కలు, చెట్లను పెంచేటట్లు చేసి కాలుష్య నివారణ సంఘాలను ఏర్పరచి పర్యావరణాన్ని సంరక్షించుకుంటూ దేశ ప్రగతికి కృషి చేయాలి.

## 17.6 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- ★ మన చుట్టూ ఉండే భౌతిక, జీవ పరిసరాలను "పర్యావరణం" అంటారు.
- ★ వాతావరణం, నేల వంటి భౌతిక కారకాలతో ఏర్పడినది స్వాభావిక పర్యావరణం.
- ★ సాంఘిక, సాంస్కృతిక కారకాల వలన మానవుని సౌఖ్యం కోసం ఏర్పడింది మానవ జనిత పర్యావరణం లేదా సామాజిక, సాంస్కృతిక పర్యావరణం.
- ★ శక్తి - ప్రధానంగా సాంప్రదాయ, ఆధునిక, సాంప్రదాయేతర ఇంధన వనరులలో లభిస్తుంది.
- ★ ఇంధన వనరులను ఉపయోగించే విధానాలను ప్రస్తుత సమస్యలను, పరిధులను దృష్టిలో ఉంచుకొని బాధ్యతగల పౌరులుగా తమవంతు కర్తవ్యాన్ని అందరూ నిర్వర్తించాలి.
- ★ వాతావరణ కాలుష్యం, పర్యావరణ సంక్షోభాలు జీవన్మరణ సమస్యలు కాబట్టి ఈ సమస్యల పట్ల, వాటి పరిష్కారాల గురించి ప్రజాభిప్రాయాన్ని తెలియజేయాలి.
- ★ వాతావరణ కాలుష్యాన్ని నివారించటానికి, ఎదుర్కోవటానికి చేపట్టిన ఉద్యమాలు అనుసరించిన పద్ధతులు, విజయాలు ప్రజలందరికీ తెలియజేయాలి.

BRAOU

## 17.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

30 పంక్తుల్లో జవాబులు రాయండి

1. పర్యావరణం అంటే ఏమిటి ? వివరించండి ?

2. సాంప్రదాయేతర ఇంధన వనరులను ఉపయోగించేందుకు ఆధునిక ఇంధన వనరులను ఉపయోగించే విధానంలో మార్పులను తెచ్చేందుకు దారితీసిన పరిస్థితులను వివరించండి.

15 పంక్తులలో జవాబులు రాయండి.

1. ప్రస్తుత పర్యావరణ సమస్యలను పేర్కొని వాటి పరిష్కారాలను సూచించండి.

2. పర్యావరణ సంరక్షణ కేర్పడిన ఉద్యమాలను కొన్నింటిని తెలపండి ?

BRAOU

# భాగం - 18 సామాజిక అశాంతి

విషయ క్రమం

18.0 ఉద్దేశం

18.1 ప్రవేశిక

18.2 సామాజిక అశాంతి

18.2.1. అశాంతి అంటే

18.2.2. పేదరికం, నిరుద్యోగం, అధిక ధరలు

18.2.3. అభివృద్ధిలో అసమతౌల్యం

18.2.4. రిజర్వేషన్లు

18.2.5. దళితులు - అశాంతి

18.2.6 మహిళలు - అశాంతి

అభ్యాసం

18.3. అశాంతి రూపాలు

18.3.1 అశాంతి, విధ్వంసక రూపాలు

18.3.2 అశాంతి, నిర్మాణాత్మక మార్పులు

అభ్యాసం

18.4. ఉద్యమాలు, సామాజిక సమూహాలు

18.5 మార్పు

18.6 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

18.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

## 18.0. ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు:

* సామాజిక అశాంతి అంటే ఏమిటో నిర్వచించగలుగుతారు.

* సామాజిక అశాంతి,నిర్మాణాత్మక, విధ్వంసకర రూపాలను గ్రహించగలుగుతారు.



BRAOU

## 18.1 ప్రవేశిక

ఈ రోజు దినపత్రికలు తిరగేస్తే చాలా వరకు రాజకీయ వార్తలకి, సంచలన వార్తలకి ఎక్కువ చోటు కేటాయిస్తున్నట్లు కన్పిస్తుంది. సామాజిక  ఇతర అంశాలు ఇప్పుడిప్పుడే కన్పిస్తున్నాయి. వీటిని పోటీని ఎదుర్కోడానికి, పాఠక లోకాన్ని ఆకట్టుకోవడానికి ప్రవేశపెట్టారు. అంతే కానీ పాఠకులకు విజ్ఞానం పంచడానికి కాదని కొందరి వాదన.

అశాంతిని సామాజిక, ఆర్థిక, చారిత్రక, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలోఎలా అర్థం చేసుకోవాలి అనే విషయాన్ని పరిశీలిద్దాం. అశాంతి మూలమేమిటి? వైయక్తిక, సామాజిక అశాంతికి కారణాలేమిటి? అనే జిజ్ఞాసతో మనం అన్వేషిస్తే కొన్ని అంశాలు సుబోధకమవుతాయి.

ఒక నిర్దిష్ట కాలంలో ప్రజల మధ్య ఏర్పడేవే సామాజిక సంబంధాలు.  అంటే వర్గం, జాతి, సమూహం, సాంఘిక, మానసిక, వ్యక్తిగత సంబంధాలను కలిపే సామాజిక స్వరూపం అనవచ్చు. మానవుల పరస్పర సంబంధాలు సాధారణంగా లక్ష్యం, విలువలు, రూపాలు, విధి నిషేధాలతో ముడిపడి ఉంటాయి.  ప్రజా వ్యవహారాలు, కార్యకలాపాలు సామాజిక వ్యవస్థ పరిధిలో జరుగుతాయి,  ఆ వ్యవస్థ ఈ పరస్పర సంబంధాల స్వరూపాన్ని, సారాన్ని నిర్ణయిస్తుంది.

సామాజిక అశాంతి గురించి పరిశీలించేటప్పుడు ముఖ్యంగా మనం ఎదుర్కొనేవి మూడు సవాళ్ళు.

1. సమాజంలో వివిధ వర్గాల మధ్య వైరుధ్యాలకు కారణాలు.
2. సామాజిక పరిణామం గురించి సరైన చారిత్రిక అవగాహన
3. జరుగుతున్న ఉద్యమ పూర్వాపరాలను అనేక కోణాల్లోంచి చూసి విశ్లేషించి ఒక చారిత్రక దృక్పథంతో పాఠకులకు అర్థం అయ్యేరీతిలో అందించగలగడం.

వర్తమాన వ్యవహారాలను అందించే క్రమం పాత్రికేయ శైలిపై ఆధారపడి ఉంటుంది.  వార్తకే ప్రాధాన్యత కాకుండా వ్యాఖ్యలు కూడా ప్రస్తుత వార్తా పత్రికలలో చోటు చేసుకోవడం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.  ఒక 'వార్త' లే కాకుండా పాఠకులు, పత్రికల వారు దాని పుట్టుపుర్వోత్తరాల పట్ల ఆసక్తి చూపిస్తున్నారు.  విశ్లేషణ లేకుండా వార్త ఉన్నచోట అది అనేక పుకార్లకి తావు నిచ్చి ఒక నిర్దిష్టతలేని అశాంతికి గురి చేస్తుంది.  పుకార్లు అనవసర వ్యక్తిగత విషయాలకి తావు నిస్తాయి.  అందువల్ల ఆధునిక పత్రికా విలేఖరి (పేజితో బాటు చాలా పరిమితంగా ఉన్నప్పటికి) వార్త వెనుక ఉన్న ప్రజా అభిప్రాయనాడిని చూడడానికి ప్రయత్నించాలి.  ఉదాహరణకు కాంగ్రేసు ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇందిరా గాంధి కుటుంబం అందులో సంజయ్ గాంధి వంటి రాజ్యాంగేతర అధికార శక్తి గురించి, తర్వాత సోనియా గాంధి లేదా ఇతరుల గురించి మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి బంధువుల గురించి అధిక వార్తలు, పుకార్లు మొదలైనవి మీరు చూసే ఉండి ఉండచ్చు.  రాసిన వన్నీ అబద్ధాలు అయి ఉండకపోవచ్చు.  కానీ ఒక సంపాదకుడు తెలుసుకోవలసినవి, ఇంతేనా?  రాజకీయ పరిస్థితి గురించి అవగాహన అవసరం.  కాని అది ఏరూపంలో ఉండాలి?

పత్రికా రంగం, ఆమాటకొస్తే ప్రసారమాధ్యమాలు అన్నీ ఎదుర్కొంటున్న అనేక సవాళ్ళులో ప్రతి ఉద్యమం, ఆందోళన వెనకనున్న ప్రజానాడిని పరిశీలిస్తూ చరిత్రలోకి తొంగి చూసి వర్తమానాన్ని విశ్లేషించి భవిష్యత్ పోకడలను గుర్తించ గలగడం చాలా ముఖ్యమైంది.

BRAOU

## 18.2 సామాజిక అశాంతి

సమాజం, సంబంధాలు, అనుబంధాలు వాటితో కూడిన స్థిర (కనిపించే) వ్యవస్థే సమాజం. ఇందులో పెద్ద పెద్ద ప్రజాసమూహాలు చట్టం. సంప్రదాయాలు - అనే బలమైన వాటితో అనుబంధించబడింది. ఏ సమాజంలోనైనా ఇవి చారిత్రకంగా పరిణామం చెందిన రూపాలు. మార్కిస్టు కోణాల్నించి పరిశీలిస్తే ఇవన్నీ ఉత్పత్తి సంబంధాలపై ఆధారపడినవి.

వర్గాలు, వర్గ సంబంధాలు గతి చారిత్రకతకు సంబంధించినవి. కానీ ఈ నాటికీ వాటికి సామాజిక శాస్త్రంలో అంతగా స్థానం లేదని అనలేం. అనేక సామాజిక సమూహాలతో కూడినదే సమాజం. వ్యక్తి, కుటుంబం, స్నేహబృందం, బంధుకోటి, ఉద్యోగి, విద్యార్థి, కార్మిక సంఘాలు జాతి, మత, కుల, ప్రాంతీయ సంబంధాలు ఇతరంగా అనేకమైనవి కలిసి సమాజం అంటారు. వర్గం అనే మాటను తొలగిస్తే దాని స్థానంలో సమూహాల గురించి చర్చిస్తున్నారు. ఈ సమూహం అనేది ఎలా ఏర్పడిందడానికి ఒక చిన్న ఉదాహరణ అవసరం. ఒక సామాజిక శాస్త్రవేత్త ఇలా చెప్పారు: "బాల్యంలో పిల్లలు తల్లి తండ్రులపై ఆధారపడతారు. ఇది అనివార్యం. వారి ద్వారా ఆహారం, విశ్రాంతి, భద్రత, ఆనందం లభిస్తాయి కదా. అన్నదమ్ములు, అక్కచెళ్ళెళ్ళ ద్వారా పరస్పర సహాయ సహకారాలు లభిస్తాయి. బిడ్డపుట్టినప్పుడే ఒక సమూహంలో సభ్యులుగా ఉండే ముఖ్యులు తెలుసుకుంటారు. జీవితం అంతా ఒక గ్రూపు భావన వెంటాడుతూనే ఉంటుంది". కాబట్టి సమూహం ప్రాథమిక రూపం అని కొందరు సమాజ శాస్త్రవేత్తల భావన. కానీ కుటుంబం చారిత్రకంగా రూపొందిన వ్యవస్థ. అయితే ఒక దశలో కుటుంబం లేదు. చాలా కాలం వరకు కుటుంబ సభ్యుల మధ్య పని విభజన ఏర్పడ లేదు. కాబట్టి కుటుంబ వ్యవస్థలో పరస్పర సంబంధాలు శాశ్వతం కావని మార్క్సిస్టు సామాజిక శాస్త్రజ్ఞుల భావన. వారి దృష్టిలో సంబంధాలు ఉత్పత్తి సంబంధాలకే పరిమితం. వ్యక్తుల సాంఘిక, వ్యక్తిగత, సాంస్కృతిక మతపర జీవితాన్ని ఇవి నిర్ణయించడం లేదు. మధ్యయుగాలలో శ్రేణులు అత్యంత బలవత్తరమైనవిగా పరిగణించబడ్డాయి.

ఆధునిక యుగంలో వృత్తి సంబంధాలు వాటి ఉత్పత్తి కేంద్రాలకే పరిమితం అయి ఉంటాయి. సమూహాలు అనే భావననూ ప్రస్తుతం వర్గంగా పేర్కొంటున్నారు.

BRAOU

ప్రతి సమాజంలో ఉన్నత వర్గానికి చెందిన కొద్దికాలం మంది ఉంటారు. ధనం, విద్య, సంస్కారం, ప్రతిభ, ఔన్నత్యాల ఫలితంగా వారికి సమాజంపై అజమాయిషీ లభిస్తుందని సామాజిక శాస్త్రంలో సిద్ధాంతం పేర్కొంటుంది. ఆధునిక ప్రభుత్వాలు ప్రజాస్వామ్య సూత్రాల ఆధారంగా రూపొందింపబడినా, ప్రభుత్వాధికారం అసలు వారి చేతిలోనే ఉంటుందని ఒక వాదన. దీని వల్ల మెజారిటీ ప్రజలు ప్రభుత్వం నడపడంలో పాల్గొనలేదనవచ్చు. సైద్ధాంతికంగా ప్రజల ప్రభుత్వం ఆచరణలో భిన్నంగా కనిపిస్తుంది. సామాజిక వ్యవస్థా నిర్మితిలోనే అసమానతలు చోటు చేసుకోవడాన్ని గుర్తించితేనే సామాజిక స్వరూపంపై ఒక అవగాహన ఏర్పడుతుంది.

అయితే ఉన్నత వర్గాలకు చెందినవారే అధికారం చెలాయిస్తున్నారని అన్న వాదనకు ప్రతివాదనలు లేకపోలేదు. బడుగు వర్గాలకు చెందిన కొద్దిమంది అధికారం చేజిక్కించుకోవచ్చు. వారు ఉన్నత వర్గ సిద్ధాంతాలను దృక్పథాన్ని ప్రతిబింబించగలుగుతేనే అధికారంలో ఉండగలరు.

విశ్వకవి, నోబల్ బహుమతి గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ ఈ విషయంపై ఇలా అన్నారు :

"యుగ యుగాలుగా నాగరిక సమాజంలో లక్షలాది అనామకులుండేవారు. వారే అధిక సంఖ్యాకులు. వారే చాకిరితో

జీవనం గడిపేవారు. సంపూర్ణ మానవులుగా వికసించే అవకాశం వీరికి లేదు. వారికి తిండి, బట్ట, విద్య, సంపద అన్నీ కరువే. కానీ చాకిరీ మాత్రం అత్యధికం. వారు తలపై నాగరికతా జ్యోతిని మోసే దీప స్తంభంలాంటి వారే. జ్యోతి కాంతి దశదిశలకు వ్యాపిస్తుంది. పై వారు ఆ కాంతిలో ప్రజ్వలిస్తారు. కానీ మోసేవారికి మిగిలేది నూనె మరకలు, దీపస్తంభ భారం మాత్రమే".

ముందు పేర్కొన్నట్లే బడుగు వర్గాలకు చెందిన వారికీ పైకి ఎగబాకే అవకాశాలు లేకపోలేదు. నిరుద్యోగుల సంఖ్య అభివృద్ధి చెందిన దేశాలలో కూడా పెరుగుతోంది. వారి సాంఘిక చలనాలకి (Social Mobility) అవకాశాలు లేనట్లే కదా. ఇక ఉద్యోగంలో ఉండేవారిలో "ఊర్ధ్వకదలిక (Vertical Mobility) కంటే సమతుల కదలిక (Horizontal Mobility) ఎక్కువ.

సమ్మెలు, పోరాటం, తిరుగుబాట్లు, సామాజిక అశాంతికి రూపాలు. వీటికి కారణం ఆర్థిక పరిస్థితులతో బాటు సామాజిక పోకడలు కూడా అని గ్రహించాలి.

### 18.2.1 అశాంతి - స్థితి

అశాంతి అంటే ఇది ఒక రకమైన మానసికస్థితి. వ్యక్తిగత అశాంతికి గురయిన వ్యక్తి సమాజంపై ఉన్నత వర్గాలపై ద్వేషం పెంచుకుంటాడు. ప్రస్ఫుటంగా కనిపించే ఆర్థిక అసమానతలు ఈ పరిస్థితికి కారణం, వ్యక్తిగత అశాంతికి, సామాజిక అశాంతికి దారితీయకుండా ప్రజలను నిర్మాణాత్మక కార్యక్రమాలవేపు మరల్చే భావ జాలం కొరవడితే అల్ల కల్లోలానికి దారితీస్తుంది. విధ్వంసక పరిణామాలకి దారి తీస్తుంది. సామాజిక జీవనానికి విఘాతం కల్గించవచ్చు. ఉదాహరణకు రష్యా, తూర్పు యూరప్ రాజ్యాలలో కమ్యూనిస్టు ప్రభుత్వం పతనానికి కారణం సామాజిక అశాంతి అని పేర్కొంటున్నారు.

వ్యక్తిగత అశాంతికి కారణాలు సామాజిక దృక్పథం నుంచి చూస్తే అనేకం. వాటిలో పేదరికం, నిరుద్యోగం, కుటుంబ కలహాలు, మొదలైనవి పేర్కొనదగినవి. ముఖ్యంగా మానసిక దృక్కోణం నుంచి చూస్తే ఇంకా ఎన్నో ఉన్నాయి.

ఈదృష్టితో చూస్తే మానవ ప్రవర్తనను అవసరాల క్రమానుగత శ్రేణి ద్వారా వివరించవచ్చు. మానసిక శాస్త్రవేత్తల దృష్టిలో అవసరాలు అనేకం. శారీరక అవసరాలు, మానసిక అవసరాలు, ఆహారం, వస్త్రాలు ఇవ్వడం వంటి భద్రతా అవసరాలు(Security needs) , సామాజిక గుర్తింపు అవసరాలు (Social needs)

వాటిని క్రమంగా సాధించడం మానవ ప్రవృత్తి. వాటిలో ఏది సాధించలేక పోయినా మనిషి అశాంతికి గురి అవుతాడు. అయితే ఇది వ్యవస్థీకృత రంగానికి సంబంధించింది. అవ్యవస్థీకృత రంగానికి అంటే un-organised గా ఉన్న సమాజాలలో (అన్ని తృతీయ ప్రపంచ దేశాలు) అశాంతి మరింత జటిలమైన సమస్య. వ్యక్తిగత అశాంతే సామాజిక విలువల పతనానికి దారితీస్తుంది. విలువల పతనంతో సామాజిక అశాంతి మరింత ఎక్కువ అవుతుంది.

స్థూలంగా చెప్పాలంటే అభివృద్ధి ప్రక్రియలోనే లోపాలుంటే ధనిక - బీద వర్గాల మధ్య అగాధాలను పెంచుతుంది. ఇది మొదటి కారణం. ఆర్థికంగా ఇది మొదటిది. ఉదాహరణకు విద్యారంగం తీసుకోండి. దేశంలో210 విశ్వవిద్యాలయాల లోనూ, 8500 కాలేజీల ద్వారా సుమారు 60 లక్షల మంది చదువుకుంటున్నారు. మనం దిగుమతి చేసుకున్న విద్యావిధానం వల్ల అనేకమంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరంగా ఉంది. అందువల్ల విద్యార్థులలో అశాంతిని మనం చుట్టూ ఉన్న సమాజంలో ఉన్న సమస్యల నుంచి వేరు చేసి "ఈ తరం విద్యార్థులలో క్రమశిక్షణ కరువైంది. అందువల్ల విద్యార్థులను

BRAOU

మరింత క్రమ శిక్షణకు గురి చెయ్యాలని భావిస్తే అది సమాజాన్ని ఏడిపిస్తున్న విస్మరించిన వారిగా విస్మరించినట్లే అనిపిస్తుంది. విద్యారంగంలో వస్తున్న పెనుమార్పులను గూడా నిశితంగాపరిశీలిస్తేనే అశాంతికి మూల కారణాలు ఏమిటో విదితమవుతాయి. ఉదాహరణకు మనదేశంలో ప్రతి విద్యార్థిపైన ప్రభుత్వం గాని ప్రైవేటు సంస్థలు కానీ చేసిన ఖర్చు ఈ మధ్యనే అంచనా వేశారు. విద్యను ప్రైవేటు పరం చెయ్యాలని, ప్రభుత్వం ఉన్నత విద్య బాధ్యతను ఇక నిర్వహించలేదని కొందరి భావన. అయితే లెక్కలు చూస్తే మనదేశం ఒక్కొక్క విద్యార్థిపైన సరాసరి సుమారు రూ॥ 9000 మాత్రమే ఖర్చు చేస్తోంది. అదే అమెరికా 2,80,000, ఇంగ్లాండ్ 1,70,000 ఖర్చుచేస్తే మన కంటే మన ఇరుగుపొరుగు దేశాలైన చైనా, పాకిస్తాన్‌లు వారి ఉన్నత విద్యారంగానికే చెందిన విద్యార్థి పైన ఎక్కువ ఖర్చు చేస్తున్నాయి. (చైనా రూ. 23,000/- పాకిస్తాన్ రూ. 14000/-) దీన్నిబట్టి ఏం అర్థం అవ్వాలి ? ఉన్నత విద్యారంగంపై మన ఖర్చు అనుకున్నంత స్థాయికి లేదు.

ప్రాథమిక విద్యకు వస్తే ఒకటో తరగతిలోచేరిన విద్యార్థుల్లో 80 శాతం పదవ తరగతి దాకా చేరడం లేదు. వారు మధ్యలో మానుకుంటున్నారు. అధికసంఖ్యలో నిరక్షరాస్యులు 2000 సంవత్సరానికి భారతదేశంలో ఉండబోతున్నారట. విద్యారంగం అస్తవ్యస్తంగా ఉండడానికి, వాటిల్లో అశాంతి చెలరేగడానికి విద్యపై అతి తక్కువ పెట్టుబడి ఒక్కటే కారణం కాదు. అశాస్త్రీయ విద్యా విధానం కూడాఅందుకు కారణం.

అనేక సంఘాలు నివేదికలు సమర్పించిన తర్వాత విద్యారంగంపై పెట్టుబడిని 3.2 నుంచి 6 శాతానికి పెంచాలని ఈ మధ్యనే ప్రధాన మంత్రి ప్రకటించారు. దీన్ని బట్టి సుమారు సంవత్సరానికి 80,000 కోట్లు రూపాయలు ఖర్చు చేస్తారని కేంద్రవిద్యామంత్రి పేర్కొన్నారు. ఒక పక్క దేశంలోని అందరికి విద్య అందించే వనరులు లేవనీ, మరోప్రక్క వనరులు చాలా ఉన్నాయి పథకాలు రూపొందించండి అనీ కేంద్ర విద్యా శాఖా కార్యదర్శి సూచన. అనేక రంగాల లాగే ఇది విద్యారంగంలో ఉన్న వైరుధ్యాలను చాటుతుంది. ఈ సందర్భంలో విద్య ప్రైవేటీకరణ గురించిన చర్చ సామాన్య ప్రజలకు అర్థం కాదు.

ప్రైవేటీకరణను సమర్థిస్తున్న రాజకీయ సామాజిక, ఆర్థిక శక్తులేవో అంచనా వేసి దానివల్ల లాభనష్టాలను బేరీజు వేస్తే చర్చపూర్తవదు. అలాగే ప్రైవేటీకరణ వద్దు అనేవారి వాదనలు ఏమిటి, ఏ సామాజిక ఆర్థిక శక్తులు వాటిని వ్యతిరేకిస్తున్నాయో తెలుసుకోవాలి.

యువకులు ఈనాడు ఆందోళన చెందడానికి అనేక కారణాలలో నిరుద్యోగం, అభద్రత ముఖ్యమైనవి. ప్రభుత్వం సోషలిజం సూత్రాలు వల్లెవేసినన్నాళ్లు ముచ్చట వేరేగా ఉంది. అంటే ప్రభుత్వ రంగాలు ఉపాధి కల్పనా కేంద్రాలుగా వర్ణించబడ్డాయి. చదువుకు కొలువుకు లంకె ఎప్పుడూ లేదన్నది విస్మరించలేని నిజం.

అలాగే ఎన్నో సంస్థలు విద్యార్థులను ఎంపిక చేసి సుశిక్షితులుగా తయారుచేస్తారు. తమ సంస్థ అవసరాలకు అనుగుణంగా తర్ఫీదు ఇస్తారు. దాన్ని బట్టి మనం గ్రహించవలసిందేమిటంటే విద్యకు ఉపాధికి మధ్య దూరం ఉన్నదన్న వాస్తవం. వృత్తి విద్యాకోర్సుల ద్వారా ఈ అంతరాన్ని తగ్గిద్దాం అనే ప్రయత్నం మంచిదే. కానీ అన్నిరకాల వృత్తి విద్యా కోర్సుల్ని మన విద్యాలయాలు అందించగలవా ? ఇది వ్యవస్థలోపాలను సూచిస్తుంది. దాన్ని మరింత పరిశోధించగలగాలి. అసలు మన దేశంలో నిరుద్యోగ యువకులు ఎంతమందో ఖచ్చితమైన సమాచారం మన ప్రభుత్వం దగ్గర లేదనే అనుమానాన్ని ఒక దిన పత్రిక తన రీడర్ కామెంట్‌లో పేర్కొంది. ఎంప్లాయిమెంటు ఎక్స్ఛేంజ్‌లో డిసెంబరు 31వ తేదీ 1989 వరకు నమోదు అయిన సంఖ్యా వివరాలు ఇలా ఉన్నాయి :

BRAOU

## నిరుద్యోగానికి చెందిన గణాంక వివరాలు :

మొత్తం దేశంలో నమోదయిన నిరుద్యోగుల సంఖ్య 6.11 మిలియన్లు అంటే సుమారు 61 లక్షల మంది ప్రజలు ఉపాధికోసం ఎదురు చూస్తున్నారు. వారిలో 41 లక్షల మంది శిక్షణ, నిపుణత లేని పనివారు. సుమారు, 11 లక్షల పైగా వృత్తి నిపుణతగల పనివారు. ఇవి 1989 చివరినాటి వివరాలు. గత ఆరు సంవత్సరాలలో నిరుద్యోగుల సంఖ్య గణనీయంగా పెరిగి ఉంటుందని ఆవార్తా పత్రిక అంచనా, పైగా ప్రతి నిరుద్యోగి విధిగా ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్‌లో నమోదు చేసుకోక పోవచ్చు. ఈ పరిస్థితులలో ప్రభుత్వం 2003వ సంవత్సరంలోపు అందరికీ ఉపాధి అన్న లక్ష్యం సాధించగలదా అన్నదిప్రశ్న. సరళీకృత విధానంలో ఈ సమస్య ఊసు ఎవరూ ఎందుకు ఎత్తడం లేదు? ఒక వేళ చర్చ జరిగినా ఏ స్థాయి వరకు సాగుతుంది? మొదలైన అంశాలను మనం అర్థం చేసుకోవాలి.

అశాంతిని అన్నికోణాల నుంచి పరిశీలిస్తేనే అర్థం చేసుకోగలం.

### 18.2.2 పేదరికం

సుమారు 40 శాతం పైగా ప్రజలు పేదరిక రేఖ కింద ఉన్నారన్నది ఒక అంచనా. సాధారణంగా సంవత్సర ఆదాయం నిర్ణయించిన దాని కంటే తక్కువ ఉంటే పేదరికంలో ఉన్నారని భావం. ఏడో దశకంలో దండేకర్, నీలా కాంత్‌రధ్ అనేఇద్దరు ఆర్థిక శాస్త్రవేత్తలు మొదటి సారి దారిద్ర్యరేఖని నిర్ణయించారు. నేషనల్ శాంపుల్ సర్వే 1960 - 61 డేటాని బట్టి ఈ ఇరువురు ప్రజల వినియోగాన్ని(Consumption Pattern) నిర్ధారించారు. నెలకు ఎనిమిది రూపాయల కంటే తక్కువ ఖర్చు చేసే వారు, ఎనిమిది నుంచి పదకొండు రూపాయలు వెచ్చించేవారు; 11నుంచి 13 రూపాయలు ఖర్చు చేసేవారు. అలాగే 13 రూపాయల నుంచి 15 రూపాయలు ఖర్చు చేసేవారు. ఈ వర్గీకరణ ప్రకారం గ్రామీణ ప్రాంతాలలో 13 నుంచి 15 రూపాయలు ఖర్చు చేసేవారు 616 గ్రాముల ఆహారపదార్థాలను, ఇతర ప్రత్యామ్నాయ ఆహారపదార్థాలను వినియోగిస్తారనీ ఇవికాక పాలు, నూనె, నెయ్యి, కలిపితే రోజుకు 2250 కాలరీలు గల ఆహారాన్ని తీసుకుంటారనీ తేల్చారు. దీని కన్న తక్కువ ఆహారాన్ని తీసుకున్న వారిని దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నట్లు పేర్కొనాలని అన్నారు. దీన్ని బట్టి 1960-61 ధరలను నిర్దేశించి గ్రామాలలో రోజుకు 15 రూపాయల ఆదాయం కన్నా ఎక్కువ పొందుతున్న వారిని పేదరికపు రేఖకు దిగువగా ఉన్న వారుగా అభివర్ణించారు. వారి అంచనాల ప్రకారం 1970లలో దేశంలో గ్రామాలలోనివసిస్తున్న 40 శాతం మంది, పట్టణాలలో జీవనం సాగిస్తున్న 50 శాతం మంది ప్రజలు దారిద్ర్య రేఖ కోరల్లో చిక్కుకున్నారని పేర్కొన్నారు. ఆ తర్వాత ఈ సూత్రానికి అనేక మార్పులు, చేర్పులు జరిగాయి. పోషకాహార నిపుణుల సహాయంతో మరింత సరళమైన పద్ధతిని రూపొందించారు. కాలరీలు ఒక్కటే పరిగణన లోనికి తీసుకోకూడదనీ, ప్రొటీన్లు కూడా లెక్కలోకి రావాలనీ ఒక్క కూడే కాదు, గూడు, గుడ్డ కూడా తీసుకోవాలనీ సూచనలు చేసారు. కానీ సుమారు 25 సంవత్సరాల క్రితం దండేకర్, రధ్ పేర్కొన్న పేదరిక సూత్రం ఇంకా ప్రాతిపదికగా చూస్తున్నారు.

BRAOU

కాబట్టి సామాజిక అశాంతి, దీనికి త్రోవతీసే నేర ప్రవృత్తి అర్థం చేసుకోడానికి పేదరికపుటంచుల కొలత ఒక సూచిక మాత్రమే. పైన పేర్కొన్న ఇద్దరు ఆర్థిక శాస్త్రవేత్తలు పేదరికం నిర్మూలించడానికి ఒకచక్కని పథకం రూపొందించారు. వారి లెక్క ప్రకారం పేదరిక నిర్మూలనకు సంవత్సరానికి 866 కోట్లు రూపాయల చొప్పున రోడ్లు, ఇరిగేషన్, ఇతర సమగ్ర ఉపాధి కల్పనా పథకాలపై ఖర్చు చేసినట్లయితే ఈ పాటికి పేదరికం నిర్మూలించబడేది అని భావించవచ్చు. ఇది విద్యావిషయక సంబంధమైన అంశంగా మాత్రమే పరిగణించగూడదు. వీరి అధ్యయనంలో అంశాలు ఇంకా ఇవ్వాల్టికీ వాస్తవ పరిస్థితుల్ని

చూస్తే కనిపిస్తూనే ఉన్నాయి. ఎందుకంటే అనేక మంది ప్రజలు ఇంకా పేదరికంలోనే మగ్గుతున్నారు. ఈ విధంగా ఆర్థిక రంగంలో పేదరికం, నిరుద్యోగం, అధిక ధరలు, తక్కువ పెట్టుబడులు, అంచనాలకు మించిన ప్రభుత్వ వ్యయం అనేక ఇతర కారణాల వల్ల సామాజిక అశాంతికి దారితీస్తుంది. ఉదాహరణకు అధికధరల వల్ల కార్మిక వర్గం అశాంతికి గురై సమ్మెలు, సాగించడం వల్ల ఉత్పత్తి పడిపోతుంది. దీనివల్ల సరళీకృత ప్రభావం ఉంటుంది. సరళీకృత విధానాల ఆవశ్యకతను ఈ నేపథ్యంలో అర్థం చేసుకోవాలి.

## 18.2.3 అభివృద్ధిలో అసమతౌల్యం

సామాజికంగా చూస్తే మనదేశం అనేక సమస్యలతో సతమతమౌతోంది. కులం, మతం, ప్రాంతీయ విబేధాల వల్ల అభివృద్ధిలో అసమతౌల్యతలు చోటుచేసుకుంటున్నాయి. అసలు ప్రణాళికాభివృద్ధి అనుసరించిన వ్యూహం వల్ల అసమానతలు పెరిగాయని కొందరంటారు. ఉదాహరణకు హరిత విప్లవం వల్ల బడుగు వర్గాలకు, ధనిక వర్గానికి అంతర్యం మరింత పెరిగిందని కొందరి వాదన. కాని వ్యవసాయోత్పత్తులు గణనీయంగా పెరిగాయి. అయితే అభివృద్ధి వ్యూహంలో లొసుగుల వల్ల సరిగ్గా జరగలేదని మరికొందరి వాదన. మొత్తానికి ఏ వ్యూహం అయినా ప్రజా సంక్షేమానికే దోహద పడకుండా అసమానతలు పెరగడానికి దోహద పడడాన్ని గ్రహించి విధాన నిర్మాతలు నూతన వ్యూహాలను ప్రవేశ పెట్టవలసిన అవసరం ఉంది. మన రాష్ట్రంలో పత్తి ఉత్పత్తి దారులు పెట్టుబడి పెట్టి నష్టం రావడం మూలంగా కొంతమంది ఆత్మహత్యలు చేసుకోవడం మీకు గుర్తుండే ఉంటుంది. వ్యవసాయరంగ పరిస్థితి ఆశాజనకంగా లేకపోవడానికి కారణమేమిటో విశ్లేషించనట్లయితే పత్తి ఉత్పత్తిదారులు లేక ఇతర బడుగు వర్గాల బాధలను అర్థంచేసుకోలేం. ఒక పక్క రైతు దేశ ఆర్థిక పరిస్థితికి వెన్నెముక వంటివాడని అంటున్నాం. మరొక పక్క రైతన్న బాధలు పత్రికల్లో చూస్తున్నాం. వాటికి కారణాలనూ వ్యవసాయరంగం పూర్వాపరాలనూ సరిగ్గా అధ్యయనం చెయ్యాలి. అలాగే షెట్కారి సంఘటన, ఉల్లిపాయల ఉత్పత్తిదారుల కడగండ్లు, షరద్ జోషినాయకత్వం, మహేంద్ర, టికైట్ వంటి నాయకుల సమ్మె 'చలో ఢిల్లీ' వంటివి సామాజిక ఆర్థిక చట్రంనుంచి అర్థం చేసుకోవాలి.

## 18.2.4 రిజర్వేషన్లు

ఈ రోజు రిజర్వేషన్లు సమాజాన్ని తీవ్ర అశాంతికి గురి చేస్తున్నాయి. ఈ విధానాన్ని బలపరిచేవారి, వ్యతిరేకించేవారి వాద ప్రతివాదనలు ఎలా ఉన్నా సామాజిక అశాంతికి కారణాలను పరిశోధించాలి. వీటిలో రాజకీయ లబ్ధి ఎంత ఉందో అంచనా వేయగలగాలి. నిర్దేశించిన ప్రకారం రిజర్వేషన్లు కొన్ని వర్గాల వారికి రాజ్యాంగం అమలులోకి వచ్చిన 10 సంవత్సరాల వరకేనని ప్రకటించిన తర్వాత ఆ గడువుని ఇప్పటికే నాలుగు సార్లు పొడిగించారని విమర్శఉంది. దీనివల్ల అగ్రకులాల వారికి, వర్గాల వారికి అవకాశాలు తగ్గిపోతున్నాయన్నది వారి వాదన. ఇదే కాకుండా ప్రతిభ దెబ్బతింటోందని వారి వాదన. అయితే ప్రతిభ అంటే ఏమిటో ఎవరూ నిర్ధారించడంలేదు. మరి కొంతమంది ఉద్దేశంలో పటిష్టమైన ప్రాథమిక విద్యను అందించటం వల్ల దీర్ఘకాలంలో రిజర్వేషన్లు ఎత్తివేయవచ్చునే భావన ఉంది. 1980 దశకం చివర్లో మండల్ కమిషన్ రికమండేషన్ల అమలు వల్ల రిజర్వేషన్ల సమస్యవల్ల అగ్రవర్ణాలలో మరింత అశాంతి చెలరేగింది. ఈ అశాంతి ఆత్మహత్యలకు దారి తీసింది. వెనక బడిన తరగతులకు కేంద్ర ప్రభుత్వం మరిన్ని రాయితీలు ఇవ్వడం వల్ల ఆగ్రహం చెంది అగ్రవర్ణాలలో అశాంతి జ్వాలలు రగులుకున్నాయి. ఇవన్నీ ఒక సైద్ధాంతిక చట్రం ద్వారా విశ్లేషిస్తే తప్ప సామాజిక వాస్తవికత బోధపడదు. దళిత వర్గాల పట్ల ప్రభుత్వాల ప్రేమ నిజాయితీతో కూడిందా అన్నది కూడా చెప్పడం కష్టం. రిజర్వేషన్లు కొన్ని రాష్ట్రాలలో 50శాతం మించి ఉండడం, మరికొన్ని రాష్ట్రాలలో తక్కువ ఉండడానికి కారణాల గురించిన సరైన సమాచారం లేదని

B RAOU

చెప్పగలం. సుప్రీంకోర్టు నిర్దేశాల ప్రకారం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదు. అగ్రకులాలను శాంత పరచడానికి అగ్ర కులాలలో ఆర్థికంగా వెనకబడిన వారికి 50 శాతం రిజర్వేషన్లు కల్పించారు. ఆచరణలో రిజర్వేషన్లు, ఏ వర్గాల వారికి అందుతున్నాయని తెలుసుకోవడం అవసరం. ఎందుకంటే బడుగువర్గాలలో ఇప్పటికే ఒకస్థాయి అభివృద్ధి సాధించిన వారికి మరింత ప్రగతికి తోడ్పడు తున్నాయి తప్ప అత్యడుగు స్థాయి, దళితులు స్వాతంత్ర్యం సాధించి 49 ఏళ్ళు కావస్తున్నా అలాగే ఉన్నారనే విమర్శ లేకపోలేదు. బలహీన వర్గాలలోనే అంతరాలు ఏర్పడుతున్నాయని అంటున్నారు. దాన్ని అర్థం చేసుకోవడానికి రిజర్వేషన్లపై ఒక సమగ్ర సామాజిక, ఆర్థిక సర్వే అవసరం.

### 18.2.5 దళితులు - అశాంతి

దళితుల పరిస్థితి గ్రామాలలో ఆందోళనాకరంగా ఉంది. ఈ మధ్యనే తమిళనాడులో అగ్రవర్ణాల కోసం కేటాయించిన కుండలోని నీరు త్రాగినందుకు ఒక దళిత బాలిక కుడికన్ను పీకి వేసే ప్రయత్నం ఒక అగ్రవర్ణుడు చేసాడు.

మన రాష్ట్రంలో అనేక మార్లు దళితులపై దాడులు జరిగాయి. పాదిరి కుప్పం, కారంచేడు, నీరుకొండ, చుండూరు సంఘటనలలో అనేక మంది దళితులు దారుణంగా హత్యలకు గురి అయ్యారు. దేశంలో ఇతర ప్రాంతాలలోకూడా ఇదే పరిస్థితి నెలకొని ఉంది. అగ్రవర్ణాల జాత్యాహంకారం దీనికి కారణం. దళితులపై ఈ అత్యాచారాలు వారిని సామాజిక అభద్రతకే కాకుండా తీవ్ర అశాంతికీ గురిచేస్తున్నాయి. ఇది సమాజంలో అనైక్యత పోకడలను సూచిస్తాయి. ఈ సంఘటనలకు బాధ్యులను కఠినంగా శిక్షించడానికి మన న్యాయ వ్యవస్థ తోడ్పడుతోందా అని కొందరి అనుమానం. అస్పృశ్యతను ఎన్నో దశాబ్దాల క్రితం నిషేధించినా ఆచరణలో శూన్యం అనిపిస్తుంది. ప్రభుత్వం సంఘటన జరిగిన తర్వాత ప్రకటించి చేతులు దులుపుకుంటుందని మరో విమర్శఉంది. సంఘటనల తరహాలను అర్థం చేసుకోవాలి. దీనికి కొంత చారిత్రిక అవగాహన అవసరం. అభివృద్ధి చెందుతున్న దేశాలలో కుల లేదా జాతిభావనల్ని ఒక సామాజిక సందర్భంలో అవగాహన చేసుకోవాలి. వీటికి మార్గం ఏమిటంటే వాటికి సంబంధించిన సాహిత్యాన్ని విశ్లేషించటం. సరళీకృత ఆర్థిక విధానాలు దళితుల పరిస్థితులపై మరింత క్షీణజంప జేస్తుందనే భావనను అనేక మంది వ్యక్త పరుస్తున్నారు.

BRAOU

### 18.2.6 మహిళలు - అశాంతి

మన జనాభా 200 అంతానికి 100 కోట్లు దాటవచ్చు. ఇందులో సుమారు 50 శాతం మంది మహిళలు. 1991 జనాభా లెక్కల ప్రకారం దేశ అక్షరాస్యత సగటు శాతం 52.11 కాగా మన రాష్ట్రంలో 45.11 శాతం మాత్రమే అక్షరాస్యులు. అందులో 56.24 శాతం పురుషులు అక్షరాస్యులు. 33.71 శాతం స్త్రీలు మాత్రమే అక్షరాస్యులు. దళితులపై అత్యాచారాలు మన దేశంలో ఎంత సాధారణమో అలాగే బలహీనవర్గమైన మహిళలపై కూడా అనేక అత్యాచారాలు వింటూనే ఉన్నాం. ఈ మధ్యనే నైనా సాహ్ని అనే మహిళను రొట్టెచేసే కుంపట్లో పడేసి కాల్చడం, మొసళ్ళకు పడెయ్యడం మనం గొప్పగా చెప్పుకునే భారతీయ నాగరికతకు కొత్త సవాళ్ళు. మహిళలపై దౌర్జన్యం, భౌతికమే కాదు, అనేక మానసిక చర్యల ద్వారా మహిళలను హింసాత్మక చర్యలకు గురి చేస్తున్నారు. నిరక్షరాస్యత కారణంగా, పురాణ ఇతిహాసాలలో స్త్రీల గురించిన పొగడ్తలు - ఇవన్నీ పురుషాధిక్య సమాజం స్త్రీలను వంచించే సాధనాలు. మహిళా స్థితిని అధ్యయనం చేయడానికి 1971లో మొదటి సారిగా ఒక కమిటీని నియమించింది. ఈ నివేదిక ఆధారంగా మహిళలు శ్రేయో సమాజానికి లక్ష్యం కాదు అనీ, వారు అత్యంత కీలక వర్గం అనీ అభిప్రాయం వ్యక్తపరిచారట. ఆరవ ప్రణాళిక పత్రంలో మొదటిసారిగా 'మహిళలు-అభివృద్ధి' అన్న అంశంపై ప్రత్యేక అధ్యాయాన్నే పొందుపరిచారు. 1985లో స్త్రీ - శిశు సంక్షేమ శాఖను కేంద్రప్రభుత్వం నెలకొల్పింది. 1992 లో

జాతీయ మహిళా సంఘాన్ని కూడా నియమించారు. దీని విధులు: మహిళలకు రాజ్యాంగంలో ఏర్పరచిన హక్కుల మూల్యాంకనం, ఉన్నటువంటి చట్టాల సమీక్ష అందులో లొసుగులను తొలగించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు, వారి హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులు పరిశీలన మొదలైనవి.

ప్రభుత్వ యంత్రాంగమే కాకుండా అనేక ప్రభుత్వేతర సంస్థలు కూడా మహిళాభ్యుదయం, పరిరక్షణ కోసం ఈనాడు కృషిచేస్తున్నాయి. అయితే రాజ్యం వీరి ప్రగతికి ఎన్ని పథకాలు చేపట్టినా, వారిపై అత్యాచారాలు పెరుగుతున్నాయి. ఈ రంగంలో ఘోరమైన వైఫల్యాలను మనం చూస్తూనే ఉన్నాం. సుమారు సగం జనాభా అశాంతికి లోను కావడం అన్నది సమాజంలో ఉన్న తీవ్ర రుగ్మతలను వెల్లడిచేస్తుంది. వరకట్న దురాచారాలు, బాలికల విద్యకు ప్రోత్సాహకాలు కొరవడడం, సందర్భ శుద్ధిలేని విద్య, ఆడపిల్లల పట్ల తల్లితండ్రుల వివక్ష, మహిళల్లో తీవ్ర పేదరికం (ఎందుకంటే ఆహారం తను తక్కువ తీసుకొని పిల్లలకు, అందులో మగపిల్లలకు ఎక్కువ పెట్టడం వల్ల అందులోనూ పోషకాహారం వీరిలో తక్కువగా ఉంటుంది.) వీటి ప్రభావం అభివృద్ధి పై పడి అశాంతికి దారి తీస్తుంది. బాలబాలికలు సమున్నత స్థాయిలో పెంపకం లేకపోవడం వల్ల వివక్షకు గురిఅవుతున్నారు. అయితే 7వ తరగతి నుండి చూస్తే అత్యున్నంత స్థాయివరకు చాలా మట్టుకు బాలికలే రాంకులు సాధిస్తున్నారు. ఇంకా ప్రోత్సాహకాలు ఇస్తే మరెన్నో సాధిస్తారు.

మహిళల వెనకబాటుతనానికి సంబంధించిన అనేక ఇతర అంశాలున్నాయి. సమగ్ర అవగాహన ద్వారానే పరిష్కార మార్గాలు కనుక్కోవచ్చు. లేదంటే సమస్య వేరు, పరిష్కారం వేరు అనే దృక్పథం అలవడుతుంది. ఈ రోజు స్త్రీల మీద అత్యాచారాలు ఎన్ని జరుగుతున్నా అత్యాచారం తర్వాత ఒక న్యాయ నిర్ణాయక కమిటీ నియామకం జరుగుతుంది. ఆ కమిటీ నివేదికలో అనేక సామాజిక భద్రతా చర్యలు సూచిస్తారు. మరి కొన్నాళ్లకు ఆ సంఘటన గురించి మర్చిపోతారు. కవ్వింపు (Provocative) దుస్తులు ధరించడం వల్ల స్త్రీలు మానభంగాలకు గురౌతున్నారని ఒక మధ్యతరగతి వర్గం ఈ రోజు నమ్ముతోంది. ఇటువంటి తప్పుడు అవగాహన వల్ల నిజాన్ని దాచే ప్రయత్నం జరుగుతుంది. సామాజిక అభద్రత వల్ల స్త్రీలు ఆందోళన చెందుతున్నారు. దీన్ని బట్టి మనకి అర్థం అయ్యేదేమంటే సగం మంది ప్రజలు అభద్రతకు లోనైతే అదే కనిపించని అశాంతికి దారితీస్తుంది.

BRAOU

**అభ్యాసం**

సమాజంలో భిన్న కోణాల్లో కనిపించే అశాంతిని సమీక్షించండి.

## 18.3 అశాంతి రూపాలు

అశాంతి వల్ల సమ్మెలు, పోరాటాలు జరుగుతాయి. ప్రతి ఒక్క సమ్మెవల్ల ఉద్రేకాలు పెరుగుతాయి. గాంధీజీ సూచించినట్లు అందరూ అహింసా మార్గాలనే పాటించరు. హింసాత్మక చర్యల ద్వారా ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తారు. ధర్నాలు, రాస్తారోకోలు మరెన్నో ఇతర పద్ధతుల ద్వారా తమ అసమ్మతిని తెల్పుతారు. సామాజిక అశాంతి ఒకవైపు విధ్వంస కారకమైనా, కొన్నిసార్లు నిర్మాణాత్మక మార్పులకు దారి తీసేవిగానూ ఉంటాయి.

### 18.3.1 అశాంతి - విధ్వంసక రూపాలు

రాజకీయ కారణాలను బట్టి కొన్ని ఉద్యమాలు విధ్వంసక చర్యలకు దారి తీస్తుంది. ఉదాహరణకు 1960లలో హిందీకి వ్యతిరేకంగా ఉద్యమం అనేక హింసాత్మక సంఘటనలకు దారితీసింది. ప్రాణనష్టం, ఆస్తినష్టం రెండూ జరిగాయి. అలాగే భాషా ప్రాతిపదికపైన రాష్ట్రాలు ఏర్పరచాలన్న డిమాండ్ పైన కూడా హింస, విధ్వంస సంఘటనలను ప్రజలు ఇంకా మర్చిపోరు. మన రాష్ట్రంలో విశాఖ ఉక్కు కర్మాగారం కోసం ఆందోళనలు జరిగాయి. అలాగే ప్రత్యేక తెలంగాణా, ఆంధ్ర ఉద్యమాలు అనేక హింసాత్మక సంఘటనలకు దారితీసాయి. వీటివల్ల అనేక నష్టాలు సంభవించాయి. అసలు అభివృద్ధి ప్రక్రియే కొంత సామాజిక అస్థిరతను, కల్లోలాన్ని సృష్టించి అశాంతికి దారి తీస్తుంది. మనం అవలంబించిన అభివృద్ధి నమూనా ప్రకారం ధనవంతుడు ఇంకా ధనవంతుడుగానూ, పేదవాడు మరింత పేదవాడుగా మారతాడు అని కొందరు శాస్త్రవేత్తలు అంటారు. ఎటువంటి అభివృద్ధి ప్రకారం ఏ సామాజిక మార్పు వస్తుందోనని ఎప్పుడూ ముందే ఊహించలేం. ఉదాహరణకు నిర్దేశించిన అభివృద్ధి రేటు మనదేశం సాధించగలదా అన్న ప్రశ్న వేస్తున్నారు.

ప్రభుత్వ విధానాల ఉద్దేశం ఒకటైతే అది ఊహించని పరిణామాలకి దారి తీస్తుంది. కాబట్టి విధాన యంత్రాంగం ఉద్దేశం మంచిదే అయినా దానికి తగిన ఇతర వనరుల సమీకరణ జరుగుతుందా అంటే చెప్పలేం. స్వాతంత్ర్యం రావడమే ప్రజలలో గొప్పఆకాంక్షలకి ఆశలకి దారి తీసింది. వాటిని తీర్చటానికి తగిన వనరుల సమీకరించడం అసాధ్యం. అన్ని తృతీయ ప్రపంచదేశాలు దాదాపు ఇదే పరిస్థితిలోనే ఉన్నాయి. కాక పోతే గత 15-20 సంవత్సరాల నుంచి ఆర్థిక వ్యవస్థను విస్తృతం కావించడం వల్ల కొరియా, సింగపూర్ లాంటి దేశాలు ఆసియా లో అగ్రగాములుగా తయారయ్యాయి.

అభివృద్ధిని త్వరితగతిన తీసుకురాగలిగినప్పుడు అశాంతిని కూడా నియంత్రించవచ్చు.

### 18.3.2 అశాంతి ; నిర్మాణాత్మక మార్పు

గత 40 సంవత్సరాల నుంచి అభివృద్ధిలో భాగంగా భారీ నీటి ప్రాజెక్టులను ప్రభుత్వం చేపడుతోంది. 80వ దశకం వరకు వీటిని ఆధునిక దేవాలయాలుగా అభివర్ణించారు. కానీ 80వ దశకం చివరి నుంచి ఈ భారీ ప్రాజెక్టులుఅభివృద్ధికి, ముఖ్యంగా పర్యావరణానికి తీవ్రహాని తలపెడుతున్నాయని అనేక మంది భావిస్తున్నారు. సర్దార్ సరోవర్ ప్రాజెక్ట్, నర్మదా వాలీ ప్రాజెక్ట్ వల్ల అనేక మంది స్థానిక గిరిజనులు వారి ప్రాథమిక ఉపాధి కోల్పోయారనీ అనేక మంది నిరాశ్రయులయ్యారనీ నర్మదా బచావో ఆందోళన సంస్థ (NBA) పేర్కొంటుంది. మేధా పాట్కర్ ఆధ్వర్యంలో సాగే ఈ ఆందోళన ద్వారా గిరిజనులకు సరైన రీతిలో పునరావాసం కల్పించాలనీ ఈ డామ్‌వల్ల నష్టాలే తప్ప లాభాలు లేవనీ పేర్కొంటున్నారు. అనేక కేంద్ర ప్రభుత్వాలు సంస్థలు ఈ డామ్ వల్ల నష్టం లేదంటే NBA తన నివేదికలో ఎంతమందికి ఏ విధంగా నష్టం జరగ బోతోందో పేర్కొంది.

BRAOU

**మేధాపాట్కర్ ఆధ్వర్యంలో నడిచే ఆందోళనను సామాజిక అశాంతికి ఒక నిర్మాణాత్మక ప్రతిస్పందనగా గ్రహించాలి.**

అనేక మంది నిర్వాసితులను కూడ గట్టుకుని ఆనకట్ట నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ NBA ప్రజలలో కొంత చైతన్యాన్ని తీసుకురాగలిగింది. పర్యావరణ అంశంపై ప్రపంచ బాంకు కూడా బాధ్యతను గుర్తించి రెండవ విడత ఋణాన్ని నిలుపు చేసిందంటే ఉద్యమం కొంత వరకు సఫలీకృతం అయ్యిందనే చెప్పాలి.

మరోవైపు అసలు నీటి వనరులు లేక దుర్భిక్ష ప్రాంతమైన కచ్, రాష్ట్ర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులకు గురౌతున్నారని వారి ఇక్కట్లకు కొంత వరకైనా తీర్చడానికే నర్మద ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేయడం తప్పని సరి అని గుజరాత్ ప్రభుత్వం వాదన.

అసలు నర్మదా ప్రాజెక్ట్ వల్ల మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్‌లో కొంత భాగం లాభ పడతాయి. వ్యవసాయానికి కాకుండా విద్యుదుత్పత్తి కూడా మెరుగు పడుతుందని ప్రాజెక్టు నిర్మాతల ఉద్దేశం. మరి ఉద్దేశం మాట ఎలా ఉన్నా ఊహించని పరిణామాలు మరెన్నో ఉన్నాయి. సామాజికంగా చూస్తే నర్మదానదీ పరివాహక ప్రాంతం చుట్టూతా ఉన్న లక్షలాది మంది తమ ప్రధాన ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని NBA తెలిపేవరకు ఎవ్వరికీ ఆలోచన రాలేదు. వచ్చినా ఆచరణ రూపం దాల్చలేదు. ఈ ప్రాజెక్ట్ వల్ల ఎంతనష్టపోయేది సరైన అంచనాలు వేయ లేదని NBA భావన. పర్యావరణ ఆందోళన కారులు అసలు అభివృద్ధి నిరోధకులని కొంతమంది అభివర్ణిస్తున్నారు. మేధాపాట్కర్ పశ్చిమ దేశాల ఏజంటు అని వారికి మనం అభివృద్ధి చెందడం అన్నది ఇష్టం కాదని ఆమె వారి మెప్పుకోసం పనిచేస్తోందనీ వారి వాదన. ప్రజానాడిని చూసి, వారి సమస్యలను అర్థం చేసుకొని, వారి అభివృద్ధికి ఏది మంచిదో నిర్ణయించడం ప్రభుత్వ విధి అనవచ్చు. కాని ఆచరణలో ప్రజాభీష్టానికే వ్యవతిరేకంగా పోవడం మంచిదా, కాదా అన్నది ప్రశ్న.

ఇతర భారీ నీటి పారుదల ప్రాజెక్టుల విషయంలో కూడా పర్యావరణ ఆందోళన కారులకు - సంబంధించిన ప్రభుత్వాలకు మధ్య శాంతి పొసగడం లేదు. ఎవరి అభిప్రాయాలకు వారు నిబద్ధులై ఉండడంవల్ల అశాంతి జ్వాలలు అన్ని వైపులా వ్యాపిస్తున్నాయి.

మొన్నటివరకు బాబా ఆమ్టే ఆమరణ నిరాహార దీక్ష తేహ్రీ ప్రాజెక్టు కి వ్యతిరేకంగా ఎందుకు చేపట్టాల్సి వచ్చిందో అందరికీ తెలుసు.

ఒక్కొక్కప్పుడు సామాజిక అశాంతి నిర్మాణాత్మక మార్పుకు దోహద పడవచ్చు. అంటే అశాంతిని ఒక నాయకుడు ఖచ్చితంగా అవగాహన చేసుకొని అశాంతి పోకడలను సామూహిక లక్ష్యాలవేపు మళ్లిస్తే కొంత నిర్మాణాత్మక మార్పు వచ్చే అవకాశం ఉంది.

నర్మాదా ప్రాజెక్ట్ పైన జరిగిన ఆందోళన వల్ల, అశాంతి వల్ల ప్రభుత్వాలలో పర్యావరణం పట్ల శ్రద్ధ పెరిగింది. అది ఎంతవరకు ఆచరణలోకి వస్తుందన్నది వేరే విషయం. అలాగే దేశంలో ఇతర ప్రదేశాలలో అనేక ఆందోళనల వల్ల అడవులను నరకడం తగ్గిందనే చెప్పాలి.

సామాజిక అశాంతి - దాని ద్వారా సంభవించిన ఆందోళనల వల్ల అభివృద్ధి పోకడల పైనే ఒక చర్చ ప్రారంభం అయ్యింది. అభివృద్ధి లేక పర్యావరణం అన్నది దీని సారాంశం. రెండింటినీ మేళవించినదే నిజమైన అభివృద్ధి అని సమాజ శాస్త్రజ్ఞుల భావన.

BRAOU

అశాంతి వల్ల కల్గిన అసౌకర్యాలున్నా పర్యావరణ ఆందోళనల వల్ల సామాజిక గమనం, వృత్తిపరమైన గమనం పెరుగుతాయని కొందరి అంచనా. అన్ని ఉద్యమాలూ, అన్ని చోట్లా నిర్మాణాత్మక మార్పుకి దోహదపడవు. రాజకీయ కారణాల వల్ల ప్రేరేపించబడిన ఉద్యమాలు కో కొల్లలు. రాజకీయ ప్రక్రియ లోనే 'ఆందోళన' అన్నది రాజకీయ పక్షాల ప్రయోజనాల కోసం ఉపయోగపడతాయి. నిరక్షరాస్యత అనే విషయంపైన స్పష్టమైన అవగాహన కొరవడడం వల్ల ప్రజలు తమలో ఉన్న అశాంతిని రాజకీయ పార్టీలు ప్రచారంచేసే భావాలని నమ్మి మోసపోవచ్చు. ప్రజలు ప్రచార ప్రలోభంలో పడి ఆలోచనా శక్తి కోల్పోయి. ఉద్వేగాలకు లోనయి ప్రభుత్వ, ఇతర ఆస్తులకు నష్టం కల్గిస్తారు. కొన్ని పత్రికలు కూడా రాజకీయ ప్రయోజనాలకు పరోక్షంగా దోహద పడతాయి. విషయప్రాతిపదికపైన చర్చ కోవడం తక్కువై రాజకీయాలు కాకుండా వ్యక్తిగత ద్వేషాలనుతీర్చుకోసం ప్రజలలో ఉన్న అశాంతిని సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. ప్రతి అంశం పైన లోతుగా పరిశీలించడానికి ప్రసార మాధ్యమాల్లోపనిచేసే జర్నలిస్ట్‌కి కాలపరిమితి వల్ల అవకాశం లభించకపోవచ్చు. ఇందువల్ల విశ్లేషణ లోపించి ప్రజలను మరింత భయభ్రాంతుల రావించే వార్తలు రావడం చూస్తూనే ఉంటాం.

అభివృద్ధి చెందుతున్న దేశాలలోనూ ముఖ్యంగా భిన్న భాషలు సంస్కృతులకు చెందిన అనేక వర్గాల ప్రయోజనాలను పరిరక్షించడం ఒక విధంగా కష్టమే.

**అభ్యాసం**

నిర్మాణాత్మక మార్పుకు అశాంతి ఎలా దారితీస్తుందో ఒక ఉదాహరణను ఇవ్వండి.

BRAOU

## 18.4 ఉద్యమాలు : ప్రజాసమూహాలు

మన రాష్ట్రంలో నిర్దిష్ట భావజాలంతో ప్రారంభించబడిన పీపుల్స్ వార్ గ్రూప్ పరిస్థితి ఈరోజు ఆందోళనకరంగా ఉందని అనేక పరిశీలకులు అంటున్నారు. ఉద్యమాలు ప్రజాస్వామ్యంలో భాగమే. కాని వాటి రూపం మీద భిన్నాభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి. 1940 లలో'దున్నేవాడిదే భూమి' ఉద్యమం నుంచి ఈరోజు వరకు జరిగిన ఆందోళనలను మనం ఆకళింపు చేసుకోవాలంటే సంకీర్ణ సమాజ నిర్మాణాన్ని ముందు అర్థం చేసుకోవాలి. ఈ రోజు ఒక భూస్వామిని హత్య చేసినా, ఎన్‌కౌంటర్‌లో ఒక వార్ నాయకుడు మరణించినా ఇదొక ప్రత్యేక సంఘటనగా భావించకూడదు. ఉద్యమ చరిత్ర స్వరూప స్వభావాలను క్షుణ్ణంగా అర్థం చేసుకొని వ్యాఖ్యానిస్తేనే బాగుంటుంది. ఎవరు ఒప్పు ఎవరు తప్పుఅన్నది కాదు.

సామాజిక మార్పు అన్నది ఒక తుపాకీ ద్వారానా? ప్రజాస్వామ్య పద్ధతులద్వారానా? విద్య ద్వారా ప్రజలలో సామాజిక చైతన్యం ప్రేరేపించటం ద్వారానా, భయభ్రాంతుల ద్వారా ప్రజలను లొంగదీసుకోవటం ద్వారానా అన్నది మన ప్రాపంచిక దృక్పథం మీద ఆధారపడింది.

## 18.5 మార్పు

మార్పు అన్నది అందరూ ఆశించేదే. అది ఏ స్థాయిలో వస్తోంది? ఆ ప్రక్రియలోఎవరు ఎక్కువ లాభం పొందుతున్నారు? ఎవరు ఎక్కువ నష్టపోతున్నారు? అశాంతి ఎక్కువైతే మరింత అణచివేత, అణచివేత ఎక్కువైతేమరింత అశాంతి. (more unrest more repression) అన్నది ఒక చట్రంగా విష వలయంలా కనిపిస్తోంది. ఈ చట్రాన్నిభేదించి ప్రజలకు సమాన అవకాశాలు కల్పించే సమతుల్య అభివృద్ధికి మార్గాలు ఏమిటో చూడాలి. ఈ ప్రక్రియలో మనందరం భాగస్వాములు కావాల్సిన అవసరం ఎంతో ఉంది.

## 18.6 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

★ అశాంతి అనేది ఒక మానసిక స్థితి. వ్యక్తిగత అశాంతికి కారణాలు సామాజిక దృక్పథం నుంచి చూస్తే అనేకం. పేదరికం, నిరుద్యోగం, అభద్రత మొదలైనవి వాటిలో కొన్ని.

★ అశాంతి రూపాల్లో రెండు ప్రధానమైన వాటిని గుర్తించవచ్చు. అవి :

1. విధ్వంసక రూపం, 2. నిర్మాణాత్మక రూపం.

★ ఉద్యమ చరిత్రలను క్షుణ్ణంగా పరిశీలించి గానీ అవి ప్రజా సమూహాల్లో రేకెత్తిస్తున్న అలజడి గురించి బాధ్యతా రహితంగా వ్యాఖ్యానించకూడదు.

★ అశాంతి ఎక్కువై అణచివేత, అణచివేత ఎక్కువై అశాంతి - ఇది ఒక విషవలయంగా తయారైంది. ఈ చట్రాన్ని ఛేదించాల్సిన అవసరం ఉంది.

BRAOU

## 18.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

30 పంక్తుల్లో జవాబులు రాయండి

1. అశాంతికి కారణాలను విశ్లేషించండి?

2. సామాజికాశాంతిని నిర్వచించి అందులోరెండు రకాల రూపాలను పేర్కొనండి?

15 పంక్తుల్లో జవాబులు రాయండి.

1. అభివృద్ధిలో అసమతౌల్యం అశాంతికి ఎలా కారణమౌతుందో వివరించండి?

2. "అశాంతి ఎక్కువైతే మరింత అణచివేత. అణచివేత ఎక్కువైతే మరింత అశాంతి" -వ్యాఖ్యానించండి?

# భాగం - 19 పారిశ్రామిక రంగం : ఆంధ్రప్రదేశ్

విషయ క్రమం


19.0 ఉద్దేశం

19.1 ప్రవేశిక

19.2 పారిశ్రామిక అభివృద్ధిలో వివిధ స్థాయిలు

19.3. పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సాహపరచే కారకాలు

19.3.1. కేంద్ర ప్రభుత్వ రంగ పెట్టుబడులు

19.3.2 రాష్ట్రస్థాయి ప్రోత్సాహ సంస్థల ఆవిర్భావం

19.3.3. కీలక రంగ పెట్టుబడులు : విద్యుత్ రంగం

19.3.4 హరిత విప్లవ ప్రభావం

19.3.5. రాజకీయ వాతావరణం

19.3.6. తీవ్ర ఆర్థిక ప్రోత్సాహకాలు

అభ్యాసం

19.4 పారిశ్రామిక వ్యవస్థలో మార్పులు

19.5 పారిశ్రామికాభివృద్ధి : ఉప ప్రాంతీయ సమస్యలు

అభ్యాసం

19.6 సత్వర పారిశ్రామికాభివృద్ధి :చర్యలు

19.7 పరిశ్రమలు ఖాయిలా : కారణాలు

19.8 పారిశ్రామికాభివృద్ధి:సమస్యలు

19.9 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

19.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 19.0. ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు -

★ ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికీకరణపరిస్థితిని వివరించగలుగుతారు.

★ ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికంగా అభివృద్ధి చెందకపోడానికి గల కారణాలను గుర్తించగలుగుతారు.

BRAOU

## 19.1 ప్రవేశిక

వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ ఇతర రాష్ట్రాలతో పోల్చి చూస్తే ఆంధ్రప్రదేశ్ వెనకబడేఉంది. పారిశ్రామిక రంగం రాష్ట్రాల ప్రగతి సూచీలో చెప్పాలంటే ఏడో స్థానాన్ని ఆక్రమిస్తోంది. బొగ్గు, బాక్సైట్,మైకా, ఆస్బెస్టాస్ నిల్వలు కాకుండా, సహజ వాయువు, చమురు వంటి నిల్వలు నిక్షేపంగా ఉన్నాయి. రాష్ట్రానికి దగ్గరలోనే ముడి ఇనుము కూడా దండిగా ఉంది. ఇన్ని సహజ వనరులు లభ్యం కావడం వల్ల జల వనరుల ఆధారంగానైనా, థర్మల్ విద్యుత్ ద్వారా అయినా సమతౌల్య అభివృద్ధి సాధ్యమవుతుంది. రవాణా, కమ్యూనికేషన్, ఓడరేవుల సౌకర్యాలు కూడా బాగానే ఉన్నా రాష్ట్ర స్థూల ఉత్పత్తి జాతీయ సగటుతో పోలిస్తే నిరాశ చెందక తప్పదు. మైనింగ్, మాన్యుఫ్యాక్చరింగ్ ఉప వ్యవస్థలను సాధారణంగా పారిశ్రామిక రంగంగా వర్గీకరిస్తారు. స్థూల రాష్ట్ర ఉత్పత్తిలో ఈ రంగంలో వాటా 1960-61లో 13.4 శాతం ఉంది. 1970-71 లో 18.3 శాతానికి 1990-91లో 19 శాతానికి పెరిగింది. కాని ఈ రంగంలోజాతీయ సగటు 1990-91లో 22 శాతం. జాతీయ సగటు కంటె ఆంధ్రప్రదేశ్ తక్కువగా ఉండడానికి పారిశ్రామికాభివృద్ధి ప్రక్రియ కొంత ఆలస్యంగా ప్రారంభం కావడమే కాకుండా రెండు రాజకీయ ఆందోళనలను ఎదుర్కోవలసి రావడం కూడా కారణం. మొదటి మూడు పంచవర్ష ప్రణాళికలు వనరులలో పారిశ్రామికాభివృద్ధికి అతి తక్కువ ప్రాధాన్యతను ఇచ్చాయి. నాల్గో ప్రణాళికలో కూడా పారిశ్రామికాభివృద్ధికీ, మొత్తం ఖర్చులో సుమారు నాలుగు శాతాన్ని కేటాయించారు. పారిశ్రామికాభివృద్ధికీ, గనులకూ ఆరోప్రణాళికలో ఆరు శాతం కేటాయించారు. అయితే ఆరో ప్రణాళిక నుంచీ విద్యుత్ రంగానికి నిధులు తగ్గుతూ వచ్చాయి. విద్యుత్ రంగానికి ఐదో ప్రణాళిక వరకు అధిక వనరులు కేటాయింపు వల్లనే మన రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి సాధ్యపడిందని చెప్పుకోవాలి.

## 19.2 పారిశ్రామికాభివృద్ధిలో వివిధ స్థాయిలు

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధి అనుభవాన్ని జాతీయ స్థాయితో పోలిస్తే కొన్ని వ్యత్యాసాలను గుర్తుకు తెస్తుంది. ప్రణాళికీకరణ మొదటి 15 సంవత్సరాలలో (1951-1965) జాతీయ స్థాయిలో పారిశ్రామిక రంగ అభివృద్ధి ఇంచుమించు ఎక్కువగా ఉంటే ఆంధ్రప్రదేశ్‌లో అతి తక్కువగా ఉండడం గమనార్హం. అదే 1960ల మధ్య నుంచి 1970దశకం చివరి వరకు జాతీయ స్థాయిలో పారిశ్రామికాభివృద్ధి మందకొడిగా ఉంటే ఇదే కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో విస్తృత పారిశ్రామికాభివృద్ధి జరిగింది. 1980లలో తిరిగి జాతీయ స్థాయిలో ఈ రంగం అభివృద్ధి పుంజుకుంటే మన రాష్ట్రంలో మందకొడిగా సాగింది. జాతీయ స్థాయిలోమార్పులను అటుంచి ఆంధ్రప్రదేశ్ పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తే పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందడానికి కావలసిన వనరులన్నీ ఉన్నాయి. కాబట్టి సరైన ప్రోత్సాహకాలు కల్పించినట్లైతే ఈ రంగం మరింత అభివృద్ధి సాధించ వచ్చున్నది అవగతమౌతుంది.

పారిశ్రామిక ప్రగతి రేటును మరింత బాగా పరిశీలిద్దాం. 'పరిశ్రమ' అంటే నమోదైన, నమోదు కాని సంస్థలతో కూడుకొని ఉంటుంది. నమోదు కాని సంస్థల సమాచారం సరిగా తెలియదు.

నమోదైన సంస్థల సంఖ్యను తీసుకొంటే 1958-59లో 3512 ఉంటే 1971-72కు 4245కు పెరిగాయి. ఇది చెప్పుకోదగ్గ పెరుగుదల కాదు. అయితే 1971-72 నుంచి 84-85 మధ్యకాలంలో 10వేల పైనే నెలకొల్పబడి ఈ రంగంలో అభివృద్ధి సాలుకి సగటు 10 శాతం ఉండింది.

ఇక ఉత్పత్తికి వస్తే 1968-69 / 73-74 ల మధ్య ఫ్యాక్టరీల ద్వారా సాలుసరి ఉత్పత్తి, 8 శాతం కాగా, 73-74

BRAOU

నుంచి 1979-80 ల మధ్య ఈ రేటు 9కి పెరిగింది.

1973-74 నుంచి 1984-85 మధ్య కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికాభివృద్ధి శీఘ్రంగానే జరిగింది. 1980 నుంచి పరిశ్రమల రంగం అభివృద్ధి మందకొడిగా ఉంటూ వస్తోంది. తొమ్మిదో దశకం కూడా అంత ఆశాజనకంగా లేదు.

## 19.3 పారిశ్రామికాభివృద్ధిని ప్రోద్బలపరచే కారకాలు

1973-74 నుండి 1984-85 వరకు ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికాభివృద్ధికి అనేక కారణాలున్నాయి. వాటిలో ముఖ్యమైనవి ఇక్కడ పేర్కొన్నాం :

### 19.3.1 కేంద్ర ప్రభుత్వ రంగ పెట్టుబడులు

కేంద్ర ప్రభుత్వంచే డిపార్ట్‌మెంట్‌కు చెందని ప్రభుత్వ రంగ పరిశ్రమలలో పెట్టుబడిని, ఇక్కడ ముఖ్యంగా పేర్కొనాలి. కేంద్ర ప్రభుత్వం అనేక ప్రభుత్వ రంగ సంస్థలను ఆంధ్రప్రదేశ్‌లో 1975 నాటికే స్థాపించింది. వీటిలో చాలా మటుకు హైదరాబాద్, విశాఖపట్నంలకే పరిమితమైనప్పటికి కేంద్ర పెట్టుబడులలో (పరిశ్రమల ద్వారా) రాష్ట్రం వాటా గణనీయంగా పెరిగిందని చెప్పాలి. ఉదాహరణకు 1963కు ఈ పెట్టుబడి వాటా 0.78 శాతం ఉండగా 1988-89 కల్లా 10.3 శాతానికి చేరడం ఇక్కడ గుర్తుంచుకోవాలి. ఇది భెల్, ఇసిఐఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలకు అనేక చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు దోహద పడ్డాయి. ఉక్కు పరిశ్రమలో కేంద్ర ప్రభుత్వ వాటా మరింత పెరగడాన్ని ఈ మధ్య సంవత్సరాలలో గమనించవచ్చు.

### 19.3.2 రాష్ట్ర స్థాయి ప్రోత్సాహక సంస్థల ఆవిర్భావం

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధి కార్పోరేషన్ (Andhra Pradesh State Industrial Development Corporation), ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్ (Andhra Pradesh State Finance Corporation), ఆంధ్రప్రదేశ్ స్టేట్ చిన్న తరహా పరిశ్రమల సంస్థ (Andhra Pradesh State Small Scale Industrial Corporaton), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ వంటి సంస్థలు ఆర్థిక సహాయం అందించి అనేక ప్రైవేట్ సంస్థల స్థాపనకు దోహదపడ్డాయి. ముఖ్యంగా 1974 నుండి 1988 మార్చి ఆంధ్ర ప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధి సంస్థ అనేక ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్, కెమికల్, ప్లాస్టిక్ పరిశ్రమల స్థాపనకు కృషి చేసింది.

BRAOU

### 19.3.3 విద్యుత్ రంగంలో పెట్టుబడి ప్రభావాలు

నాలుగు, ఐదో ప్రణాళికల్లో విద్యుత్ రంగానికి 40 శాతం పైనే నిధులు కేటాయింపుల వల్ల ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగం ఇతర పరిశ్రమలను ఆకర్షించగల్గింది. దీని వల్ల తలసరి పరిశ్రమ విద్యుత్ వినియోగం 1970-71లో 32 Kvh నుండి 56 kvh కు పెరిగింది. 86 కు ఇది 97 kvh కు పెరిగి జాతీయ సగటు కంటె ఎక్కువగా ఉండేది.

### 19.3.4 హరితవిప్లవం : పారిశ్రామికాభివృద్ధి పై ప్రభావం

వ్యవసాయ రంగంలో హరిత విప్లవం ఆసక్తికరమైన రెండు పరిణామాలకు దారితీసింది. పారిశ్రామిక రంగం నుండి తయారైన వస్తువులకు గిరాకీ పెంచి ఈ రంగంలో పెట్టుబడిని ప్రోత్సహించింది. వ్యవసాయరంగం మిగులు కొన్ని

పరిశ్రమలలోకి పెట్టుబడిగా మారింది.

### 19.3.5 రాజకీయ వాతావరణం

ప్రత్యేక తెలంగాణా, ఆంధ్ర ఉద్యమాల తర్వాత రాజకీయ వాతావరణం కొంత స్థిరపడింది. దీనివల్ల పారిశ్రామిక శాంతి నెలకొనడానికి వీలయ్యింది. సమ్మెలు, లాకౌట్లు, కూడా ఈ కాలంలో తక్కువే. పరిశ్రమ రంగంలో పెట్టుబడికి అనువైన వాతావరణం ఏర్పడి ప్రవాసాంధ్రులు అనేక మంది పెట్టుబడి పెట్టడానికి ముందుకొచ్చారు.

### 19.3.6. విత్త, ఆర్థిక ప్రోత్సాహకాలు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఐదో ప్రణాళిక (1974-1978) కాలంలో రూపొందించిన వివిధ విత్త, ఆర్థిక ప్రోత్సాహకాల వల్ల పారిశ్రామికంగా వెనుకబడిన జిల్లాల్లో పరిశ్రమలు స్థాపించడానికి దోహదపడి పారిశ్రామికాభివృద్ధి ప్రక్రియను త్వరితం చేసింది.

**అభ్యాసం**

పారిశ్రామికాభివృద్ధి ప్రోత్సాహకాలల్లో ముఖ్యమైన వాటిని రెంటిని పేర్కొనండి.

BRAOU

### 19.4. పారిశ్రామిక వ్యవస్థలో మార్పులు

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికీకరణ తొలి దశలో ఆహార, పానీయాలు టుబాకో, వస్త్రాలు వంటి వ్యవసాయాధార వినిమయ వస్తువులను ఉత్పత్తి చేసే పరిశ్రమలే ప్రాధాన్యం వహించాయి. ఉదాహరణకు 1960లో వినిమయ వస్తువుల ఉత్పత్తి రంగంలో 84 శాతం ఉత్పత్తి ఉపాధి కల్పించింది. 72 శాతం ఉత్పత్తి అంతా ఈ రంగం నుంచే వచ్చింది, 54 శాతం మూలధనం ఈ రంగానికి సంబంధించిన ఫ్యాక్టరీలకే చెందింది. 1984-85 కల్లా వినియోగ వస్తువుల పరిశ్రమలలో ఉపాధి 62 శాతానికి పడిపోయింది. దానితో మూలధనం 19 శాతానికి, ఉత్పత్తి 25 శాతానికి తగ్గిపోయింది.

మూలధన వస్తువుల జాబితాలో 1969 నుంచి కెమికల్ ప్రోజెక్టులు, విద్యుదుత్పత్తి పరికరాలు, ఓడల నిర్మాణం,

పెట్రోలియం వంటివి చేరాయి. ఫ్యాక్టరీ రంగంలో 1985-86 కల్లా విద్యుత్ పరికరాలు, టుబాకో,ఎలోస్ వంటివి చేరడంతో రాష్ట్ర పెట్టుబడులలో వాటి వాటా మూడింటి రెండు వంతులైంది.

ఈ విధంగా ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల రంగం వ్యవసాయాధార వినిమయ వస్తువులతో ప్రారంభం అయి మౌలిక, అధిక పెట్టుబడితో కూడిన పరిశ్రమలకు చేరింది. అత్యధిక పెట్టుబడితో కూడిన ప్రభుత్వ రంగ సంస్థలే కాకుండా సిమెంటు, పేపర్లు వంటి పరిశ్రమలలో ప్రైవేట్ పెట్టుబడి కూడా దీనికి కారణం. కాని, రాష్ట్రంలో అధిక పెట్టుబడి ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు కల్పించలేక పోవడం ఇక్కడ గమనించాలి.

## 19.5 పారిశ్రామికాభివృద్ధి -ఉప ప్రాంతీయ సమస్యలు

రాష్ట్రంలో 1980ల మధ్య కాలానికి పరిశ్రమలలో పెట్టుబడి పెరుగుతోందన్నది స్పష్టమైంది. ఇంతకు ముందు పేర్కొన్నట్లు రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి అధిక శాతం హైదరాబాద్, విశాఖపట్నం జిల్లాలలోఎక్కువగా కేంద్రీకృతమైంది. రంగారెడ్డి, మెదక్ జిల్లాలనుపైరెండింటితోకలిపితే రాష్ట్రంలో పరిశ్రమలకు సంబంధించిన 70 శాతం స్థిరాస్తులు,50 శాతం ఉత్పత్తులు,మొత్తంలో మూడో వంతు ఉద్యోగ అవకాశాలు ఈ నాలుగు జిల్లాల ద్వారానే సాధ్యమైంది.

పారిశ్రామికాభివృద్ధి, తద్వారా వచ్చే ఉపాధి అవకాశాలు విషయంలో ప్రాంతీయ అసమానతలు స్పష్టంగా కనబడుతాయి. రాష్ట్ర జనాభాలో 18 శాతం పైనే రాయలసీమ జిల్లాలో నివసిస్తున్నారు. కాని రాష్ట్ర పారిశ్రామిక ఉపాధిలో లేదా ఉద్యోగావకాశాల్లో వారి వాటా 15 శాతం మాత్రమే. అదేవిధంగా 44 శాతం వరకు రాష్ట్ర జనాభాలో ఉన్నా కోస్తా ఆంధ్ర వాటా (ఉద్యోగాలలో)37 శాతం మాత్రమే, అయితే తెలంగాణా జిల్లాలు జనాభాలో 38 శాతం ఉన్నా పారిశ్రామిక ఉపాధిలో 48 శాతం వరకు ఉంది. ప్రాంతీయ విశ్లేషణలు ఈ విషయంలో తప్పుదోవ పట్టించేవిగా ఉండవచ్చు. మూలధనం, పరిశ్రమలలో ఉపాధిఎక్కువగా హైదరాబాద్‌చుట్టు పక్కల కేంద్రీకృతం అయిఉండగా, కోస్తా ఆంధ్రాలో ఇవి విశాఖపట్నం జిల్లా చుట్టూ ఉన్నాయి. కార్మిక శక్తిపై ఆధారపడిన పరిశ్రమలు కోస్తాలోని, తూర్పు, పశ్చిమ గోదావరి, గుంటూరు జిల్లాలలో ఉన్నాయి. జరిగిన కొద్దిపాటి పారిశ్రామికాభివృద్ధి రాయలసీమ లోని చిత్తూరు జిల్లాకే పరిమితం. మరింకా చెప్పాలంటే తిరుపతి చుట్టుపట్లా జరిగింది.

కోస్తా ఆంధ్రలోని విజయనగరం, విశాఖపట్నం, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు పారిశ్రామికంగా వెనుకబడ్డవి గానే పేర్కొనాలి. వెనుకబడిన జిల్లాలలో పారిశ్రామికాభివృద్ధి కోసం ఆచరణలో ఉన్న ప్రోత్సాహక పథకాలు కూడా అంతగా ఫలించలేదని కొన్ని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. చిత్తూరు, కర్నూలు, కడప,వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాలలో స్థానిక అనుకూలతలు, ముడి వస్తు యాంత్రిక సాంకేతిక సౌకర్యాల ఉండబట్టి పరిస్థితి కాసింత మెరుగ్గా కనపడవచ్చు. కాని, శ్రీకాకుళం, అనంతపురం, ఆదిలాబాద్ జిల్లాలో ఈ ప్రోత్సాహక పథకాలు అనుకున్నంతగా సఫలం కాలేదు. ప్రస్తుతం సరళీకృత విధానం ప్రకారం ఈ ప్రోత్సాహకాలను ఒక్కొక్కటిగా విరమించుకుంటున్నారు. సమతౌల్య పారి శ్రామికాభివృద్ధిపై దీని ప్రభావం ఊహించవచ్చు. ముఖ్యంగా వెనుకబడిన జిల్లాలు ప్రోత్సహకాలు లోపం వల్ల త్వరితగతిన అభివృద్ధి చెందగలవా అన్న ప్రశ్న ఆర్థిక శాస్త్రవేత్తలు వేస్తున్నారు.

BRAOU

అభ్యాసం

పారిశ్రామికాభివృద్ధిలో ప్రాంతీయపరమైన అసమానతలకు కారణాలేవి ?

## 19.6. సత్వర పారిశ్రామికాభివృద్ధి : చేపట్టవలసిన చర్యలు

మరింత పారిశ్రామికాభివృద్ధి జరగాలంటే ఈ క్రింది అంశాలను పరిగణనలోనికి తీసుకోవాలి :

1. పారిశ్రామికంగా వెనుకబడ్డ ఆంధ్రప్రదేశ్‌లో 1975-85 స్వర్ణయుగంగా పరిగణించాలి. కొంత కాలం దేశ జాతీయ సగటును మించినా ఈ రాష్ట్రం ఇంకా పారిశ్రామికంగా వెనుకబడ్డ రాష్ట్రంగానే పరిగణించబడుతోంది. మహారాష్ట్ర, గుజరాత్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు వంటి రాష్ట్రాలతో పోలిస్తే మన ప్రగతి పారిశ్రామికంగానూ, మూలధన పెట్టుబడి విషయంలోనూ తక్కువే. మహారాష్ట్ర, గుజరాత్ వంటి రాష్ట్రాలలో తలసరి పెట్టుబడి రూ. 851, రూ. 676 అయితే ఆంధ్రప్రదేశ్‌లో ఈ పెట్టుబడి రూ. 230 మాత్రమే.

2. విద్యుత్ రంగంలో పెట్టుబడి ప్రణాళికా పెట్టుబడిలో త్వరితగతిన తగ్గుతూ వస్తోంది. దీనివల్ల ఇతర రంగాలలో పెట్టుబడి తగ్గే ప్రమాదం ఉంది. ప్రైవేట్ రంగం నుంచి విద్యుత్ రంగంలో పెట్టుబడులు వచ్చేలా లేనందువల్ల దీని ఫలితం పారిశ్రామికీకరణ మీద పడడం ఖాయం.

3. వ్యవస్థా పరంగా కొన్ని మార్పులు వచ్చినా వ్యవసాయాధార పరిశ్రమలే ఇంకా ప్రాబల్యంలో ఉన్నాయి.

4. పారిశ్రామికీకరణ కొన్ని జిల్లాలకే పరిమితం అయింది.

## 19.7. పరిశ్రమల ఖాయిలా

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రాంతీయ అసమానత్వం కాకుండా పరిశ్రమలు ఖాయిలా పడడం కూడా ఒక కారణం. ఖాయిలా పడ్డ పరిశ్రమల సమస్య రాష్ట్రానికి పరిమితం కాక పోయినప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే ఆలస్యంగా

BRAOU

ప్రారంభమైన పారిశ్రామికీకరణ ప్రక్రియ ఈ ఖాయిలా పడ్డ పరిశ్రమల వల్ల మరింత వెనుకంజ వేయవలసి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో ఖాయిలా పడ్డ పరిశ్రమల సంఖ్య దేశ సగటును మించి ఉంటోంది. 1982-92 మధ్య కాలంలో మనరాష్ట్రంలో ఖాయిలా పడ్డ పరిశ్రమలు వాటి ఋణాలు సుమారు పదింతలు పెరిగాయి.

## 19.8 పారిశ్రామికాభివృద్ధి : సమస్యలు

పరిశ్రమల రంగంలో సాధించిన ప్రగతిని ముందు పేర్కొన్న మూడు కారణాలను మరోసారి మననం చేసుకుందాం. అవి: (1) కేంద్ర ప్రభుత్వ రంగ పరిశ్రమలు, (2) మిగులు విద్యుత్, (3) పరిశ్రమలు స్థాపింపగోరే వారికి పన్నులు ఇతర ఆర్థిక ప్రోత్సాహకాల అందుబాటు, ప్రస్తుతం అమలులో ఉన్న సరళీకృత విధానాలు. ఆర్థిక విధానాలు పరిశ్రమల స్థాపనకు పూర్వం ఉండేంత ప్రోత్సహంగా ఉండబోదు. కేంద్ర ప్రభుత్వ రంగానికి పెట్టుబడి ప్రైవేట్ రంగం నుంచి రావాల్సి ఉంటుంది. ప్రైవేట్ రంగ పెట్టుబడులను ఆకర్షించడానికి అనేక రకాలు పోటీలు పడుతున్నారు. ఈ పరిస్థితి రాష్ట్ర పారిశ్రామిక రంగం ఎదుర్కోబోయే ఒక అనిశ్చిత దశను సూచిస్తుంది.

ఇక విద్యుత్ రంగం మరో సవాలు. 1980-81 వరకు విద్యుత్ విషయంలో మిగులు రాష్ట్రంగా పేరొందిన ఆంధ్రప్రదేశ్ 1985-86కు కనీస అవసరాలకు చేరింది. అప్పటి నుంచి సరఫరాకు గిరాకీకి అంతరం బాగా పెరుగుతూనే ఉంది. విద్యుత్ లోటు పారిశ్రామికీకరణకు మొదటి సవాలు. ప్రస్తుత ఆర్థిక సంస్కరణలు విద్యుత్ రంగంలో ప్రభుత్వ పెట్టుబడినే ముఖ్యంగా చూపుతున్నాయి. దీనివల్ల విద్యుత్ రంగం ఆందోళనకరంగా ఉంది. అలా అని ప్రైవేట్‌పెట్టుబడిని ప్రోత్సహపరచడానికి స్పష్టమైన మార్గదర్శక సూత్రాలు కూడా లేవు. ఇందువల్ల ప్రైవేట్ పెట్టుబడి ముందుకు రావడం లేదు. విద్యుత్ రంగంలో అదనపు సామర్థ్యాన్నిపెంచడం అధిక వ్యయంతో కూడుకున్నది. కాబట్టి ఈ మధ్య కాలంలో పారిశ్రామిక ప్రగతి కుంటుపడే ప్రమాదం ఉంది. ఆర్థిక క్రమశిక్షణ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలను విరమించుకోవడం పారిశ్రామికీకరణకు మరో సమస్య. అనేక రకాల ప్రోత్సహకాలు ఉన్నప్పుడే ఈ రంగంలో సాధించిన ప్రగతి అంతంత మాత్రంగా ఉంటే ఇవి లేని పక్షంలో ఈ రంగంలో రాబోయే మార్పులు ఊహించవచ్చు. ఇప్పటి దాకా జరిగిన ప్రగతే అనాలోచితంగా జరిగిందని ఇక జరగబోయేది దీనికన్నా అన్యాయంగా ఉండొచ్చని కొందరి ఆర్థిక శాస్త్రవేత్తల అభిప్రాయం.

అయితే ముందే చెప్పినట్లు ఇంతటి నిరాశాజనక పరిస్థితిలోనూ కొన్ని ఆశాజనక అంశాలు లేకపోలేదు. అవి రాష్ట్రంలో ఖనిజ ఇతర సహజ వనరులు దండిగా ఉండడం, అనేక రకాల నైపుణ్యాలుకలిసి మానవ వనరుల లభ్యత, మందులు, కెమికెల్స్, పెట్రోకెమికల్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, రెడీమెడ్ దుస్తులు మొదలైన రంగాలలో అభివృద్ధికి చాలా అవకాశాలు ఉండడం.

BRAOU

### అభ్యాసం

పారిశ్రామికాభివృద్ధికి చేపట్టాల్సిన సత్వర చర్యలను పేర్కొనండి.

## 19.9 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- వనరులున్నా వాటిని వినియోగించుకోవటంలో ఆంధ్రప్రదేశ్ వెనుకబడింది.
- సరైన ప్రోత్సాహకాలు కల్పించినట్లయితే పారిశ్రామిక రంగం మరింత అభివృద్ధిని సాధించవచ్చు.
- ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల రంగం వ్యవసాయాధార వినిమయ వస్తువులతో ప్రారంభం అయింది. ఈ నడక అత్యధిక పెట్టుబడిగల పరిశ్రమల వరకు ఇప్పటికి చేరింది.
- పారిశ్రామికాభివృద్ధి, తద్వారా వచ్చే ఉపాధి అవకాశాల విషయంలో ప్రాంతీయ అసమానతలు స్పష్టంగా కనిపిస్తాయి.
- సమతౌల్య పారిశ్రామికాభివృద్ధికి చేపట్టవలసిన చర్యలు కొన్ని ఉన్నాయి.

BRAOU

## 19.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

30 పంక్తుల్లో జవాబులు రాయండి

1. పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహపరిచే కారకాలను పేర్కొని వివరించండి?
2. పారిశ్రామికాభివృద్ధికి సంబంధించి తలఎత్తే ప్రాంతీయ సమస్యలను ఎలా పరిష్కరించాలో వివరించండి.

15 పంక్తులలో జవాబులు రాయండి.

1. పరిశ్రమల ఖాయిలాకు కారణాలేవి?
2. పారిశ్రామికాభివృద్ధిలో మనం ఎదుర్కొంటున్న సమస్యలేవి?

## పట్టిక 1 : ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికాభి వృద్ధి : సూచికలు

| | | 1970-71 | 1975-76 | 1980-81 | 1985-86 | 1989-90 |
|---|---|---|---|---|---|---|
| 1. | ఫ్యాక్టరీ రంగంలో రిజిష్టరు అయిన సంస్థలు | 5448 | 6150 | 11155 | 12746 | 16007 |
| | (% All India Share) | (8.4%) | | | | (14.8%) |
| 2. | ఫ్యాక్టరి రంగంటో ఉత్పారన విలువ (% All India Share) | 688 | 1707 | 3184 | 7335- | |

*As on June 1991 CMIE Basic Statistics Relating to states of India : September 1994*

## పట్టిక 2 : ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర ప్రభుత్వరంగ పరిశ్రమలలో ఉపాధి, పెట్టుబడి

| | | 1981 | 1986 | 1991 | 1993 |
|---|---|---|---|---|---|
| 1. | ఆంధ్రప్రదేశ్ | | | | |
| | ఉపాధి (లక్షలలో) | 0.74 | 0.92 | 1.12 | 1.05 |
| | పెట్టుబడి (కోట్ల రూపాయలలో) | 988 | 5271 | 12924 | 15,534 |
| 2. | ఆల్ ఇండియా | | | | |
| | ఉపాధి (లక్షలలో) | 19.29 | 22.14 | 23.06 | 22.11 |
| | పెట్టుబడి (కోట్లరూపాయలలో) | 21,182 | 56,695 | 1,30,655 | 1,73,501 |

మూలం : *Centre for Monitoring Indian Economy, Basic Statistics of State's. September 1994.*

BRAOU

## పట్టిక 3 : ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక వ్యవస్థలో మార్పులు (శాతాల్లో)

| వ. సం. | పరిశ్రమల రకం | 1960 Number | 1960 Employment | 1960 Capital | 1960 Value added | 1984-85 Number | 1984-85 Employment | 1984-85 Capital | 1984-85 Value added |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1. | మౌలిక పరిశ్రమలు | 3.9 | 4.1 | 30.2 | 18.5 | 9.2 | 21.0 | 62.0 | 38.3 |
| 2. | మూలవస్తు పరిశ్రమలు | 9.7 | 11.1 | 15.7 | 15.7 | 13.1 | 15.5 | 10.5 | 35.1 |
| 3. | మధ్య వస్తు పరిశ్రమలు | 1.2 | 0.5 | 0.3 | 0.3 | 2.8 | 1.7 | 7.8 | 0.2 |
| 4. | వినిమయ వస్తు పరిశ్రమలు | 85.5 | 84.3 | 53.8 | 71.5 | 74.9 | 61.8 | 19.5 | 25.0 |

నోట్సు : 1. మౌలిక పరిశ్రమలు : రసాయనాలు, సిమెంటు, ఉక్కు, విద్యుత్తు పరికరాలు, విద్యుచ్ఛక్తి.
2. మూలవస్తు పరిశ్రమలు : యంత్రాలు, లోహక వస్తువులు, నౌకభాగాలు
3. మధ్యరిశ్రమలు : రబ్బరు, పెట్రోలియం మొదలయినవి.
4. వినియోగ వస్తువులు : ఆహారపదార్థాల తయారీ, టొబాకో, పంచదార, మిల్లు వస్త్రాల ఉత్పత్తి.

*ఆధారం : ఎస్. లక్ష్మీనారాయణ, ఎం.సి. స్వామినాథన్*

## పట్టిక 4 : భారతదేశంలో, ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమ ఖాయిలా

| | | | జూన్ 1982 | డిసెంబర్ 1985 | డిసెంబర్ 1987 | మార్చ్ 1992 |
|---|---|---|---|---|---|---|
| 1. | ఖాయిలా పరిశ్రమ : ఆం.ప్ర × భారతదేశం | | | | | |
| | పెద్దతరహా | ఆం.ప్ర. | 13 | 37 | 70 | 145 |
| | | భారతదేశం | 435 | 637 | 1119 | 1536 |
| | చిన్నతరహా | ఆం.ప్ర | - | 8694 | 19206 | 29586 |
| | | భారతదేశం | - | 1,17,783 | 2,04,255 | 2,45,575 |
| | మొత్తం | ఆం.ప్ర. | 13 | 8,731 | 19,276 | 29,731 |
| | | భారతదేశం | 435 | 1,18,420 | 2,05,374 | 2,47,111 |
| 2. | ఖాయిలా పరిశ్రమలు తీర్చాల్సిన బాకీలు | | | | | |
| | పెద్దతరహా | ఆం.ప్ర. | 31.6 | 103.1 | 119.1 | 455.4 |
| | | భారతదేశం | 1729.0 | 2980.2 | 2801.8 | 5786.6 |
| | చిన్నతరహా | ఆం.ప్ర | - | 63 | 138 | 271 |
| | | భారతదేశం | - | 1068 | 1797 | 3100 |
| | మొత్తం | ఆం.ప్ర. | 31.6 | 166.1 | 257.1 | 726.4 |
| | | భారతదేశం | 1729.0 | 4048.2 | 4598.8 | 8886.6 |

*ఆధారం : CMIE Basic Statistics Relating to states of India, September 1994.*

BRAOU

# భాగం - 20 ఆంధ్రప్రదేశ్ - వ్యవసాయ రంగం

విషయ క్రమం


20.0 ఉద్దేశం

20.1 ప్రవేశిక

20.2 వ్యవసాయోత్పత్తి : నవీన ధోరణులు

20.2.1. హరిత విప్లవం పూర్వ దశ (1956-71)

20.2.2. హరిత విప్లవం మొదటి దశ (1971-81)

20.2.3. హరిత విప్లవం రెండోదశ (1981-1994)

అభ్యాసం

20.3 క్షీణించిన ఆహార ధాన్యాల ఉత్పత్తి : కారణాలు

20.4 మిశ్రమ పంటలు : వ్యవసాయరంగ పారిశ్రామీకీకరణ

20.5 నీటి పారుదల సౌకర్యం

20.6 ఎరువుల వాడకం

20.7 విద్యుచ్ఛక్తి

20.8 వ్యవసాయ రుణం

20.9 కమతాల సైజు, భూమి, వ్యవసాయ రంగ సమస్యలు

20.10 వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు

అభ్యాసం

20.11 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

20.12 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 20.0. ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత ఈ కింది అంశాలను మీరు అవగాహన చేసుకుంటారు :

(అ) వ్యవసాయ రంగంలో ఆంధ్రప్రదేశ్ స్థానం.

(ఆ) ఆంధ్ర ప్రదేశ్‌లో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న కొన్ని ముఖ్య సమస్యలు.

## 20.1 ప్రవేశిక

రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో వ్యవసాయ రంగపు వాటా 1955-56లో 64 శాతం నుంచి 1980-81 కల్లా, 43 శాతానికి, 1991లో 38 శాతానికి గణనీయంగా పడిపోయినా ఆంధ్రప్రదేశ్‌ని వ్యవసాయ రాష్ట్రంగా సాధారణంగా వ్యవహరిస్తాం. అయితే ఈ 38 శాతం కూడా దేశ సగటుతో పోలిస్తే ఎక్కువే. వ్యవసాయ రంగం ప్రజల ప్రధాన జీవనాధార వృత్తి. ఎక్కువమంది దీనిపై ఆధారపడడమే అందుకు కారణం. ఉదాహరణకు 1961లో 72 శాతం మంది ప్రజలు వ్యవసాయంపై ఆధారపడితే 1991లో కూడా 68.5 శాతం మందికి వ్యవసాయరంగమే ఉపాధి కల్పించింది. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో వ్యవసాయం వాటా తగ్గినా (64నుంచి 43 కు ముందు పేర్కొన్నాం) ఈ రంగంపై ఆధారపడ్డ కార్మికుల సంఖ్య అంతగా పడిపోలేదు. పోయిన దశకంలో రాష్ట్రంలో కార్మికుల సంఖ్య ఒకకోటి 70 లక్షల నుంచి రెండు కోట్లకు పైగా పెరిగింది. ఈ పెరుగుదల 1.91 శాతం, దీనివల్ల భూమిపైఒత్తిడి పెరిగి, కమతాలు మరింత తగ్గి, వ్యవసాయ, వ్యవసాయేతర ఆదాయాల మధ్య వ్యత్యాసం అధికమైంది.

## 20.2 వ్యవసాయోత్పత్తి : కొత్త ధోరణులు

వ్యవసాయ రంగంలో అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్‌ను సాధారణంగా వర్ణిస్తారు. కాని ఈ పరిశీలన లోపభూయిష్టమైందని చెప్పాలి. ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించి నప్పటి నుంచి వ్యవసాయ రంగంలో రాష్ట్ర ప్రగతిని జాగ్రత్తగా పరిశీలిస్తే ఈ విషయం మరింత తెలుస్తుంది. తలసరి వ్యవసాయోత్పత్తి దేశ సగటుతో పోలిస్తే 1980ల లోనే 1/5 తక్కువగా ఉండడం ఇక్కడ మనం గుర్తుంచుకోవలసిన విషయం. 27.4 మిలియను హెక్టార్ల ప్రాంతానికి 40 శాతం భూమి మాత్రమే సాగులో ఉంది. పంటల ధోరణిని గమనిస్తే 70 శాతం భూమి ఆహార ధాన్యాలకు 16 శాతం భూమి నూనె గింజలకు ఉంది. వీటిలో వరి అతి ఎక్కువ పంటగా ఉంది. ఆ తర్వాత స్థానంలో జొవార్, నూనె గింజలు, పప్పు దినుసులు వేస్తున్నారు.

BRAOU

ఆంధ్ర ప్రదేశ్‌లో వ్యవసాయాభివృద్ధిని మూడు దశలుగా విభజించవచ్చు.

1. హరిత విప్లవం పూర్వ దశ (1956-71)
2. హరిత విప్లవం మొదటి దశ (1971-81)
3. హరిత విప్లవం రెండోదశ (1981-1994)

### 1. హరిత విప్లవం పూర్వ దశ (1956-71):

ఈ కాలంలో వ్యవసాయ ఉత్పత్తి కొద్దిగానే అంటే 1.7 శాతం మాత్రమే పెరిగింది. ఈ పెరుగుదల కూడా సాగు కిందకు ఎక్కువ భూమి రావడం వల్లనే కాని హెక్టారుకు పెరిగిన ధిగుబడి వల్ల కాదు.

### 2. హరిత విప్లవం మొదటి దశ (1971-81) :

ఈ దశలో వ్యవసాయ ఉత్పత్తి, 3 శాతం పెరిగింది. అధిక పంట దిగుబడి కాకున్నా నీటి పారుదల సౌకర్యాలు విస్తరించడం వల్ల మరిన్ని ప్రాంతాలు సాగుకు రావడం ఈ దశలో గమనించవచ్చు.

### 3. హరిత విప్లవం రెండోదశ (1981-1994) :

ఈ కాలంలో ఆహార ధాన్యాలు దిగుబడి 1.2 శాతానికి తగ్గిపోయింది. దేశ సగటు 2.73 శాతం ఉంటే మన

రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తులు 1.2 శాతం తగ్గడం కొంత ఆందోళనకరమే. రాష్ట్ర తలసరి వ్యవసాయ ఉత్పత్తి కూడా 1981లో 187 కి.గ్రా. నుంచి 1991 కి 185కు తగ్గింది. ఆహార ధాన్యాల పెరుగుదల జనాభా పెరుగుదల రేటు కంటే తక్కువగా ఉండదని గ్రహించాలి.

**అభ్యాసం**

హరిత విప్లవం గురించి రాయండి

## 20.3 క్షీణించిన ఆహార ధాన్యాల ఉత్పత్తి : కారణాలు

1980లలో ఆహార ధాన్యాల ఉత్పత్తి పడిపోవడం తక్కువ దిగుబడి వల్ల కాదు. చెప్పాలంటే ఈ సమయంలో దేశం సగటు ఉత్పత్తి కంటె 1.3 రెట్లు ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువగా ఉంది.

BRAOU

చెరకు, మొక్కజొన్న (Maize) వంటి పంటలు కూడా దేశ సగటు ఉత్పత్తి కంటె ఎక్కువే ఉన్నాయి. పప్పు దినుసులు విషయంలో ఈ తక్కువ దిగుబడి స్పష్టంగా కనిపిస్తుంది.

## 20.4. మిశ్రమ పంటలు - వ్యవసాయ రంగం వ్యాపారీకరణ

ఆంధ్రప్రదేశ్‌లో 1980లలో వేరుసెనగ, పత్తి, మిరప వంటి వాణిజ్య పంటలు అధికంగా ఆదరణ పొందాయి. ఉదాహరణకు వేరుసెనగ సంవత్సరానికి 3.5 శాతం, పత్తి, 4.7 శాతం, మిరప 2.5 శాతం చొప్పున పంట దిగుబడులు పెరిగాయి. అయితే రాగి, జొన్న వంటి మెట్ట పంటలకు గిరాకీ పెరగలేదు. దక్షిణ తెలంగాణా, రాయలసీమ వంటి ప్రాంతాలలో వ్యవసాయ పంటల విలువను పై పంటలు కొంత వరకు పెంచాయి. మిల్లెట్స్ నుంచి/వేరుసెనగ పంట మార్పిడి పెరిగే వ్యవసాయ ఉత్పత్తికి సూచనవంటిది. తక్కువ దిగుబడినిచ్చే మిలెట్స్ పంట నుంచి మిశ్రమ పంటలకు, అధిక దిగుబడినిచ్చే పంటలకు మార్పిడి అయినా కూడా దేశ సగటుతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో తలసరి హెక్టారు ఉత్పత్తి తక్కువగా ఉంటూ వస్తోంది. దీనికి కారణాలను పరిశీలించాలి.

## 20.5 వ్యవస్థాపన - నీటి పారుదల సౌకర్యాలు

వ్యవసాయోత్పత్తి పెరగడానికి నీటి పారుదల సౌకర్యాలు కీలకం. ప్రణాళికావ్యయంలో నీటి పారుదలకు వివిధ ప్రణాళికలలో అధిక ప్రాధాన్యత నిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవించిన నాటి నుంచి 25-32 శాతం ప్రణాళికా వ్యయం చిన్న, మధ్య తరహా, భారీ నీటి పారుదల ప్రాజెక్టుల అభివృద్ధి కోసం కేటాయించారు. ఇందులో చిన్న తరహా నీటి పారుదలకు నిధులు తక్కువే. దీని వల్ల 1951లో సేద్యం 27లక్షల హెక్టార్ల నుంచి 1991 కి 47 హెక్టార్లకు చేరింది. ఏడో ప్రణాళిక అంతానికి నీటి పారుదల సౌకర్యం 22 లక్షల హెక్టార్ల మేరకు అదనంగా పెరిగింది. ఇందులో 18 లక్షల హెక్టార్ల భూమి భారీ, మధ్య తరహా, నీటి పారుదల ప్రాజెక్టుల ద్వారానూ, నాలుగు లక్షల హెక్టార్లు చిన్న నీటి తరహా ప్రాజెక్టుల మూలంగానూ సేద్యానికి దోహదపడింది. అదనంగా కల్పించిన నీటి పారుదల సౌకర్యాలు వాస్తవంగా వాడుకలో ఉన్న దానికి భేదం ఉంది. కల్పిత నీటి పారుదల సౌకర్యం ప్రాజెక్టులు ప్రతిపాదించిన ప్రాంతాల చివర వరకు నీరు అందక పోవడం సరైన చెఱువుల నిర్మించకపోవటం ఇందుకు కారణాలు. నీటిపారుదల సౌకర్యం 50 లక్షల హెక్టార్ల వరకు కల్పించబడినా వాస్తవానికి నికర నీటి పారుదల సౌకర్యం 40 లక్షల హెక్టార్లకు పరిమితమైంది.

1980-1994 మధ్య కాలంలో నికర సేద్యం రమారమి 104 నుంచి 114 లక్షల వరకు ఉంది. ఇందులో నీటి పారుదల సౌకర్యం కలిగిన నికర భూమి 35-44 లక్షల హెక్టార్ల మధ్య ఉండేది. ఒకటి కంటే ఎక్కువ పంటలకు నీటి పారుదల సౌకర్యం కలిగిన 10 లక్షల హెక్టార్లు ఉంది. అయితే మొత్తంసేద్యం జరుగుతున్నప్రాంతంలో సుమారు 40 శాతం నీటి పారుదల సౌకర్యం ఉంది. ఈ నీటి పారుదల చెఱువులు, బావులు లేదా వేటి ఆధారంగా ఉందో చెప్పలేం. వీటిలో చెఱువులు ఆధారంగా సాగే వ్యవసాయం తగ్గుతూ వస్తోందని అంచనా. అదే బావుల ఆధారంగా జరిగే వ్యవసాయం 4.9 శాతం చొప్పున పెరుగుతోంది. అయితే వీటివల్ల సమస్యలు అనేకం. రాయలసీమ వంటి కరువు ప్రాంతాలలో భూజలాలను అతిగా వాడకం వల్ల క్షామపరిస్థితులు నెలకొనే ప్రమాదం ఉంది.

BRAOU

## 20.6 ఎరువుల వాడకం

1960 చివరి వరకు దేశంలో ఇతర ప్రాంతాలలాగాఆంధ్రప్రదేశ్‌లో కూడా రసాయనిక ఎరువుల వాడకం పరిమితంగానే ఉండేది. సస్య విప్లవం తర్వాత ఈ ఎరువుల వాడకం ఎక్కువగా కనిపిస్తుంది. 1975-76 వరకు హెక్టారుకు 31 కిలోలు వాడేవారు. 1975-76 నుంచి ఈ వాడకం నాలుగింతలు పెరిగింది. ఇప్పుడు రసాయనిక ఎరువులు అతి ఎక్కువగా వాడే రాష్ట్రాల జాబితాలో ఆంధ్రప్రదేశ్ కూడా చేరింది. ఇందులో ఇప్పటికీ పంజాబ్, హర్యానా, తమిళనాడు రాష్ట్రాలు ఉన్నాయి. వీటి వాడకంలో వివిధ ప్రాంతాలలో అసమానతలు లేకపోలేదు. ఉదాహరణకు 38 శాతం సేద్యంతో కోస్తా, 50 శాతంఆంధ్రా సేద్యంతో ఎక్కువ ఎరువులు వాడడం కనిపిస్తుంది. తెలంగాణా రాయలసీమలో ఎరువుల వాడకమే తక్కువ. ఇక్కడ పోటాషియం వంటి నత్రజని ఎరువుల వాడకం హెచ్చు.

## 20.7 విద్యుచ్ఛక్తి

1950ల వరకు వ్యవసాయ రంగానికి విద్యుచ్ఛక్తి వాడకం తక్కువే. ఈ వాడకం 21 శాతానికి 82-83కు చేరింది. అదే 1993-94కు 43 శాతానికి చేరింది. వ్యవసాయానికి కరెంట్ వాడకం పెరగడానికి ప్రధాన కారణం సబ్సిడీ. ఇది కొన్ని అరిష్టాలకు దారి తీసింది. కొంతమంది దురాశా పరులు నీటిని అమ్ముకొంటూ 'జల దొరలుగా' ఒక కొత్త వర్గంగా చెలామణి అవుతున్నారు. నీటిని అధిక ధరలకు అమ్ముకుంటూ లాభాలు ఆర్జిస్తూ నూతన సామాజిక సమస్యలను కల్పిస్తున్నారు.

## 20.8. వ్యవసాయ ఋణం

ప్రణాళికీకరణ మొదటి దశకంలో దేశంలో వ్యవసాయ రంగానికి వ్యవస్థాగత రుణం సుమారు తొమ్మిది రెట్లు పెరిగింది. ఆరో దశకంలో ఇది నాలుగు రెట్లు, 1980లలో మరో నాలుగు రెట్లకు పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌కు వస్తే ఈ రుణాలు సంవత్సరానికి 15 శాతం చొప్పున (1957-1985) మధ్య పెరిగాయి. వ్యవసాయానికి ఇతర వస్తువుల అవసరం కూడా అదే విధంగా పెరుగుతూ వచ్చింది. 1990-91 సంవత్సరంలో సుమారు రూ. 760 కోట్లు రుణాలు ద్రవ్య రూపంలో పంపిణీ అయింది. ఇది మొత్తం రుణంలో 11 శాతం మాత్రమే. వ్యవసాయ రంగానికి రుణాలు (వడ్డీ వ్యాపారులు వంటి) అవ్యవస్థీకృత రంగం నుంచి ఎక్కువగా వస్తున్నాయని ఈ పరిస్థితి మనకు మెట్ట ప్రాంతంలో బాగా కనిపిస్తుందనీ, చిన్న మధ్య తరహా రైతుల ఈ రుణాలను ఎక్కువగా ఉపయోగించుకుంటారనీ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

## 20.9 కమతాల సైజు - భూమి వ్యావసాయిక రంగ సంస్కరణలు

మనదేశంలోనూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ కమతాల సంఖ్య విపరీతంగా పెరిగింది. దేశం సగటు సాలుకు 2 శాతం ఉంటే, ఈ కమతాల పెరిగిన రేటు ఆంధ్రప్రదేశ్‌లో 2.7 శాతం ఉంది. చిన్న, సన్నకారు రైతులు 72 శాతం కమతాలను కలిగి ఉండేవారు. ఇది మొత్తం భూమిలో 38 శాతం. అయితే 1990 కల్లా చిన్న కమతాలు ఉండే వారి సంఖ్య 77 శాతానికి పెరిగింది. అదే విధంగా వారి అజమాయిషీలో ఉండే భూమి 35 శాతానికి పెరిగింది. వ్యవసాయ రంగంలో వ్యవసాయ కూలీల సంఖ్య పెరగడం, స్వయం ఉపాధి ఉన్నవారి సంఖ్య తరగడం ఈ కాలంలో గమనించ వలసిన మరో పరిణామం. వ్యవసాయ కూలీల సంఖ్యలో కూడా దేశం సగటుతో పోలిస్తే మన రాష్ట్రానిది ఎక్కువే. దేశ సగటు 32 అయితే మన రాష్ట్రంలో 41 శాతం వ్యవసాయ కూలీలే. చిన్న సన్నకారు రైతులలో చాలా భాగం సంవత్సరం అంతా ఉపాధి ఉన్నవారు కాదు. వారి పొలాల్లో దిగుబడి కూడా తక్కువే. లోపభూయిష్టమైన భూసంస్కరణలు అనేక మందికి భూమిని లేకుండా చేస్తే భూమి ఉన్నవారికి అత్యవసరమైన నీరు, రుణం ఇతర సదుపాయాలు కొరవడ్డాయి.

## 20.10. వ్యవసాయ రంగం ఎదుర్కొనే ప్రధాన సమస్యలు

ఎన్నో సదుపాయాలున్నా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వ్యవసాయ రంగంలో వెనుకబడే ఉంది. అందుకు కారణాలు :

1. దేశ సగటుతో పోలిస్తే 1990-91 లో తలసరి వ్యవసాయ ఉత్పత్తి అయిదో వంతు తక్కువగా ఉండడం.

2. వ్యవసాయం ద్వారా అభివృద్ధి కి 1971-1991 మధ్యనతేడా 1.9 శాతం మాత్రమే.

3. వ్యవసాయ రంగంలో కార్మిక ఉత్పత్తి 1970-91 మధ్య నిలకడగా ఉంది. వ్యవసాయేతర రంగాలలో కార్మిక ఉత్పత్తి 1971-1991 మధ్య 40 శాతం పెరగటాన్ని ఇక్కడ గుర్తుంచుకోవాలి.

4. వ్యవసాయ రంగంపై పెట్టుబడి పెరిగినా ఇది కొన్ని జిల్లాలకే పరిమితమయింది. దుర్భిక్ష ప్రాంతాలకు ముఖ్యంగా ఇది విస్తరించలేదు.

5. నీటి పారుదల అనేక చారిత్రక కారణాల వల్ల ప్రాంతీయ విభేదాలకు దారి తీసింది.

6. నూతన నీటి పారుదల పథకాలు ప్రాంతీయ విచక్షణకు దారి తీసాయి.

BRAOU

7. ఎరువుల తయారీ నీటి పారుదల సమృద్ధిగా ఉండే ప్రాంతాలలోనే కేంద్రీకృతమయింది.

8. చారిత్రాత్మక విచక్షణలు స్వాతంత్ర్యానంతరం నియంత్రించ లేకపోయాయి. ఉదా : 1980ల తర్వాత కూడా నీటి పారుదల సౌకర్యాలు ఆదిలాబాద్‌లో 8శాతం, మెదక్ 10 శాతం, మహబూబ్‌నగర్ 13 శాతం, అదే పశ్చిమ గోదావరిలో నీటి పారుదల నిష్పత్తి 82 శాతం పెరిగింది.

9. వ్యవసాయాభివృద్ధికి నీటి పారుదల, సౌకర్యం కీలకం. సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక వంగడాలు కూడా సమాన పాత్రను పోషిస్తాయి. దుర్భిక్ష జిల్లాలయిన మహబూబ్‌నగర్, అనంతపూరు, కర్నూలు,చిత్తూరు, మెదక్, రంగారెడ్డి,, ఆదిలాబాద్‌లలో నీటి పారుదల సౌకర్యాలు తక్కువ.

10. వర్షాధార భూమిలో దిగుబడి తక్కువ. అలాగే ఉపాధి అవకాశాలు తక్కువ. పేదరికం ఎక్కువ. ఇటువంటి ప్రాంతాలలో ఉపాధి అవకాశాలను కల్పించాలి.

11. ఆంధ్రప్రదేశ్‌లో చెప్పుకోదగ్గ బీడు బంజరు భూములు ఉన్నాయి. నికర సాగు ప్రాంతంలో వీటి వాటా 23 శాతం, భూమిని మరింత న్యాయంగా పంపిణీ చేయడానికి అవకాశం ఉంది. వ్యవసాయాభివృద్ధి జరగాలంటే చాలినంత పెట్టుబడితో పాటు, భూ సంస్కరణలుకూడా చేపట్టాలి.

12. నీటి పారుదల కల్పనకూ, వాడకంలో ఉన్నదానికీ చెప్పుకోదగ్గ భేదం ఉంది. కొన్ని ప్రాజెక్టులలో ఇది 65 శాతం దాకా ఉండవచ్చుని పరిశీలకుల అంచనా. రాష్ట్రంలో నీటి పారుదల సౌకర్యం స్వాతంత్ర్య కాలం నుంచీ 130 శాతం పెరిగినా అది దేశ సగటుతో పోలిస్తే తక్కువే. ఉన్న సామర్థ్యాన్ని పెంపొందించటం ద్వారా, నీటి పారుదల సౌకర్యం పెంచడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తిని అధికం చేయవచ్చు.

13. ఇవి కాక రుణ సదుపాయాలు, సాంకేతిక పరిజ్ఞానం ముఖ్యంగా మెట్ట ప్రాంతాలను సంస్థాగత ఏర్పాట్ల ద్వారా పటిష్ట పరచడం ద్వారానే వ్యవసాయాన్ని అభివృద్ధి పరచడం సాధ్యం.

**అభ్యాసం**

రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధిలో ఎదుర్కొంటున్న సమస్యల్ని ఎలా పరిష్కరించవచ్చో క్లుప్తంగా రాయండి?

B R A O U

## 20.11 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

★ మన దేశంలో ప్రజలకు ప్రధాన జీవనాధారం వ్యవసాయం రంగం. 1991లో 68.5శాతం ప్రజలు వ్యవసాయ రంగం పైనే తమ ఉపాధికి ఆధారపడుతారు.

★ వ్యవసాయ రంగంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామి అనటం పరిపాటి. కాని ఈ పరిశీలన లోపభూయిష్టమైంది.

★ ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయాభివృద్ధిని మూడు దశలుగా విభజించవచ్చు. (1) హరిత విప్లవ పూర్వదశ, (2) హరిత విప్లవ మొదటి దశ, (3) హరిత విప్లవ రెండో దశ.

★ వ్యవసాయోత్పత్తి అభివృద్ధిలో నీటిపారుదల సౌకర్యాలు చాల కీలకమైన పాత్రను పోషిస్తాయి.

★ వ్యవసాయానికి సంబంధించి పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలు : ఎరువులు, విద్యుచ్ఛక్తి, వ్యవసాయ రుణం, కమతాల సైజు, భూమి మొదలైనవి.

★ వ్యవసాయ రంగం ఎదుర్కొనే ప్రధాన సమస్యల్ని కొన్నిటిని గుర్తించారు. వాటి పరిష్కారం ద్వారా అభివృద్ధి సాధించవచ్చు.

## 20.12 మాదిరి పరీక్షా ప్రశ్నలు

30 పంక్తుల్లో జవాబులు రాయండి

1. వ్యవసాయ రంగంలో ఆంధ్రప్రదేశ్ స్థానాన్ని చర్చించండి.

2. ఆంధ్రప్రదేశ్‌లోవ్యసాయాభివృద్ధిని దశల వారీగా వివరించండి.

15 పంక్తులలో జవాబులు రాయండి.

1. నీటిపారుదల సౌకర్యాలు వ్యవసాయాభివృద్ధికి ఎంత అవసరమో వివరించండి.

2. వ్యవసాయ రంగం ఎదుర్కొనే ప్రధాన సమస్యల్ని పేర్కొనండి.

BRAOU

## పట్టిక 1 : ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయానికి సంబంధించి కొన్ని వివరాలు

| | 1970-71 | 1976-77 | 1980-81 | 1985-86 | 1989-90 | 1990-91 | 1992-93 |
|---|---|---|---|---|---|---|---|
| 1. వినియోగ భూమి వివరాలు | | | | | | | |
| . నంబరు (లక్షల్లో) | 54.2 | 61.5 | | 82.3 | | | |
| స్థలం (లక్ష హెక్టార్‌లు) | 135.8 | 143.8 | | 141.6 | | | |
| సరాసరి సైజు (హెక్టార్) | 2.51 | 2.34 | | 1.72 | | | |
| 2. పంటలున్న స్థలం | | | | | | | |
| ఆహార పంటలు(లక్షల హెక్టార్లు) | 94.9 | | 87.6 | | | 77.6 | |
| | (74.31) | | (74.36) | | | (58.84) | |
| ఆహారేతరపంటలు (") | 32.8 | | 30.2 | | | 54.3 | |
| | (25.69) | | (25.64) | | | (41.16) | |
| అన్ని పంటలు (") | 127.7 | | 117.8 | | | 131.9 | |
| | (100) | | (100) | | | (100) | |
| 3. ఎరువుల వినియోగం | | | | | | | |
| ఎన్‌పికె (1000 టన్నులు) | 415 | | | 576 | 888 | 1514 | |
| ఒకహెక్టారుకు వినియోగస్థలం(కి.లో) | 31.1 | | | 45.9 | 66.3 | 114.2 | |
| 4. వ్యవసాయరంగానికి అదనంగా చేరిన విలువ | | | | | | | |
| రాష్ట్రవ్యవసాయ వాటా (%) | | 51.3 | | 42.5 | | 35.7 | |
| గ్రామ ఆదాయం (తలసరి) | | 424 | | | | 1240 | |

*Notes :* *(1) 1970-73, 1980-83 and 1987-90 respectively*
*(2) 1970-73 and 1987-90 respectively*

*Source : CMIE, Basic Statistics relating to states of India : September 1994.*

BRAOU

# ఖండం V పరిణామాలు, ధోరణులు

వర్తమాన పరిణామాలనూ ధోరణులనూ ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, బేరీజు వేసుకుంటూ గమ్యాన్ని నిర్దేశించుకోవాల్సిన బాధ్యత మనకుంది. అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర పరిణామాలను, ధోరణులను అధ్యయనం చేయటంలో భాగంగా వాటి మధ్య సంబంధాన్ని, పరస్పర ప్రభావాల్ని గుర్తించటం తప్పనిసరి. వీటిని వివరించేందుకు ఈ ఖండంలో 3 భాగాలున్నాయి. అవి:

21. అంతర్జాతీయ పరిణామాలు, ధోరణులు

22. భారతదేశ పరిణామాలు, ధోరణులు

23. ఆంధ్రప్రదేశ్ పరిణామాలు, ధోరణులు.

B R A O U

BRAOU

# భాగం-21 అంతర్జాతీయ పరిణామాలు, ధోరణులు

విషయక్రమం


21.0 ఉద్దేశం

21.1 ప్రవేశిక

21.2 జాతీయ రాజ్యాల వృద్ధి

అభ్యాసం

21.3 ద్విధ్రువ ప్రపంచం

అభ్యాసం

21.4 అలీన విధానం

అభ్యాసం

21.5 ఐక్యరాజ్య సమితి

అభ్యాసం

21.6 ఆయుధ నియంత్రణం

అభ్యాసం

21.7 తృతీయ ప్రపంచం

అభ్యాసం

21.8 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

21.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 21.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు:

- అంతర్జాతీయరంగంలో జరుగుతున్న ప్రధానమైన పరిణామాలను అన్వయించుకోగలుగుతారు.
- తలెత్తుతున్న ప్రధాన ధోరణులను వివరించగలుగుతారు.

## 21.1 ప్రవేశిక

ఇరవయ్యో శతాబ్ది ప్రారంభం వరకు ప్రపంచ చరిత్ర అంటే యూరోపు చరిత్రగానే భావించేవారు. యూరోపు ఖండంలోని అయిదారు రాజ్యాలు మొత్తం ప్రపంచాన్ని వలస రాజ్యాల పేరుతో తమ ఆధిపత్యంలో ఉంచుకొని, తమకు అనుకూలంగా వాటి రాజకీయ, సాంఘిక, ఆర్థిక, విదేశాంగ విధానాలను నిర్దేశిస్తూ ఉండేవి. కాని రెండవ ప్రపంచయుద్ధ పరిసమాప్తి తరువాత, జాతీయోద్యమాల రాజకీయ స్వాతంత్ర్యోద్యమాల మూలంగా వలస వాదం బలహీనపడింది. రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు జాతీయ, అంతర్జాతీయ, వ్యవహారాల నిర్వహణ కులీనులకే పరిమితమై ఉండేది. కాని రెండవ ప్రపంచం యుద్ధం తరువాత అంతర్జాతీయ రాజకీయ ప్రక్రియలలో పాల్గొనే రాజ్యాల సంఖ్య పెరగటమే కాకుండా, రాజ్య వ్యవహారాల్లో పాల్గొనే ప్రజల సంఖ్య గణనీయంగా వృద్ధి చెందింది. రాజకీయ స్వాతంత్ర్యోద్యమాల ఫలితంగా ప్రజలలో రాజకీయ పరిజ్ఞానం, చైతన్యం వృద్ధి చెందడటంతో అంతర్జాతీయ సంఘటనల మీద విదేశీ వ్యవహారాల మీద, ప్రజలు తమ అభిప్రాయాలను ప్రకటించడం మొదలు పెట్టారు. ప్రజాస్వామ్యీకరణ ఒక్క రాజ్య నిర్వహణలోనే కాకుండా విదేశాంగ విధాన నిర్వహణలో కూడా స్థానం సంతరించుకొంది. రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు విదేశాంగ విధానం పాలకుల అవసరాలను తీర్చేదిగానే ఉండేది. ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యం లభించేది కాదు. ప్రజాస్వామ్యీకరణంతో కొత్త రాజ్యాలు ఆవిర్భవించాయి. ఇరవయ్యో శతాబ్దంలో, ప్రధానంగా రెండవ ప్రపంచ యుద్ధకాలం నుండి, విజ్ఞాన శాస్త్రాలు బాగా వృద్ధి చెందాయి. పర్యవసానంలో దేశాల మధ్య దూరం తగ్గి, ప్రపంచ ప్రజల మధ్య అవగాహన వృద్ధి చెందటం ప్రారంభమైంది. ఏ రాజ్యమూ ఏకాకిగా వ్యవహరించగల స్థితిలో లేదు. రాజ్యాల మధ్య సంబంధాలు వృద్ధి చెందాయి. అది వివిధ సమస్యలను రేకెత్తించింది. కొత్తగా స్వాతంత్ర్యం పొందిన రాజ్యాలు సామ్రాజ్య వాదం, వలసవాదం, జాతి విచక్షణ విధానాల దుష్ఫలితాలను స్వయంగా అనుభవించి ఉన్నందున, అవి ప్రపంచంలోని ఏమారుమూలన ఉన్నప్పటికీ వాటిని వ్యతిరేకించటం సర్వసాధారణమైంది. అంతేగాక నూతన రాజ్యాల ఆవిర్భావం ప్రపంచ శాంతి సాధనకు ప్రాధాన్యమిచ్చింది. అంతర్జాతీయరంగంలో దోపిడీకీ, ఆర్థిక అసమానతలకూ అవకాశం లేని సమ సమాజాన్ని స్థాపించవలసిన అవసరాలకూ, సమాజ సంక్షేమ ఆకాంక్షలకూ ప్రాధాన్యం ఇవ్వసాగారు. ఈ శతాబ్దంలో సాంకేతిక వైజ్ఞానిక రంగాల్లో వచ్చిన మార్పులు అంతర్జాతీయరంగాన్ని అనూహ్యంగా ప్రభావితం చేశాయి. యుద్ధ సాధనాలలో వచ్చిన సాంకేతిక అభివృద్ధి, యుద్ధం స్వరూపాన్నే మార్చి వేసింది. ఆధునిక యుగంలో యుద్ధంలో విజేత పరాజిత రాజ్యాల మధ్య భేదం తగ్గిపోయింది. అణ్వాయుధాల వల్ల ప్రపంచ మానవాళి మనుగడకే ముప్పు వాటిల్లింది. అణ్వాయుధాలు ఉన్నా, ఏ దేశమూ వాటిని ప్రయోగించే పరిస్థితిలో లేదు. అణ్వాయుధాల వృద్ధితో ప్రపంచశాంతికి ఇంతకు ముందెన్నడూ లేని ప్రాధాన్యం ప్రాప్తించింది. సమకాలీన ప్రపంచాన్ని ప్రభావ పరుస్తున్న ముఖ్యకారకాలను మనం పరిశీలిద్దాం.

BRAOU

## 21.2 జాతీయ రాజ్యాల వృద్ధి

సమకాలీన అంతర్జాతీయ సమాజంలో అత్యంత ప్రాచుర్యం పొందిన భావన 'జాతీయ రాజ్య వ్యవస్థ' ఈ భావనకు ప్రాతిపదిక జాతీయతాభావం. అది ఒక రోజున హఠాత్తుగా ఆవిర్భవించింది కాదు. అనేక శతాబ్దాల పరిణామక్రమంలో వివిధ సామూహిక సంఘటనల ఫలితంగా, కాలక్రమేణా అంతర్జాతీయంగా రూపు దిద్దుకొన్న భావం అది. ఆధునిక యుగం ఆవిర్భావంతో యూరోపు ఖండంలో జాతీయతాభావాలు అంకురించాయి. యూరోపు ఖండ చరిత్రకు సంబంధించినంత వరకు 19వ శతాబ్దాన్ని జాతీయవాద యుగంగా చరిత్రకారులు పేర్కొంటున్నారు. 20వ శతాబ్ద ఆరంభంలో జాతీయతా భావం యూరోపుఖండానికి వెలుపల బాగా విస్తరించింది. జాతీయతాభావ వ్యాప్తి వల్ల, చైతన్యం పొంది జాతీయ ఉద్యమాల ద్వారా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలకు చెందిన చాలా ప్రాంతాలు జాతీయ రాజ్యాలుగా అవతరించాయి.

'జాతి' పదానికి స్పష్టమైన అర్థాన్ని ఇవ్వటం కష్టం. చాలామంది రచయితల అభిప్రాయంలో జాతి అనేది ప్రాథమికంగా సామాజిక సాంస్కృతిక పరమైంది. కాని మొదటి ప్రపంచ యుద్ధం తరువాత జాతి పదానికి రాజకీయ పరమైన అర్థాన్ని ఇవ్వటం మొదలైంది. ఈ అర్థంలో జాతి అంటే రాజ్యం, జాతీయ సముదాయాల సమ్మిళితం. ఈ కారణంగానే సమకాలీన సమాజంలో రాజ్యాలను జాతి రాజ్యాలు అని పేర్కొంటున్నారు. "ఒకే జాతి ఒకే రాజ్యం" అనేది జాతీయవాదానికి మౌలిక సూత్రం. జాతీయ రాజ్యం దాని ఆదర్శం. ఇక జాతీయ భావమనేది ఒక మానసిక ప్రవృత్తి. ప్రజా సముదాయంలో నెలకొన్న కలిసి జీవించాలనే ప్రగాఢ వాంఛగా దీనిని పేర్కొనవచ్చు. ఒకే రకమైన భావాలు కలిగిన ప్రజా సముదాయాన్ని "జాతీయత" లేక "జాతీయ సముదాయము" ని, అటువంటి జాతీయ సముదాయం రాజకీయంగా వ్యవస్థీకృతమై స్వతంత్రంగా వ్యవహరించ గలిగినప్పుడు దానిని జాతి లేక జాతీయ రాజ్యమని పేర్కొంటున్నాం. ఆధునిక రాజ్య వ్యవస్థ "జాతీయ రాజ్యం" భావనపై ఆధారపడిన రాజకీయ వ్యవస్థ. అది ఒక విధంగా యూరోపియన్ రాజ్య వ్యవస్థ కొనసాగింపుగా మనం భావించవచ్చు. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత చాలా కొత్త రాజ్యాలు ఆవిర్భవించటంతో జాతీయ రాజ్య వ్యవస్థ ప్రపంచ వ్యాప్తమైంది. పర్యవసానంలో యూరోపియన్ రాజ్యాల ప్రాధాన్యం తగ్గటం మొదలైంది. సాంకేతిక విజ్ఞాన రంగంలో జరిగిన వృద్ధితో, రాజ్యాల మధ్య దూరం తగ్గి ప్రపంచ సంస్కృతి అభివృద్ధి చెందటానికీ, ప్రపంచ ప్రజలలో తామంతా ఒకే ప్రపంచానికి చెందిన వారమనే విశాలదృక్పథం పెరిగిపోవటానికీ వీలు కలిగింది. అణ్వాయుధాల వృద్ధి వల్ల జాతీయ సమాజంలో ఏ రాజ్యమూ తనకుతానుగా తన ఆర్థిక, సామాజిక అవసరాలను తీర్చుకోలేని పరిస్థితిఏర్పడింది. ఒకవైపు అంతర్జాతీయ, విశ్వమానవ దృక్పథాలు అభివృద్ధి చెందుతున్న ధోరణినీ, మరొకవైపు తమ తమ జాతీయ రాజ్యాల పట్ల ప్రజల అనురాగం కొనసాగటాన్నీ మనం గమనించవచ్చు.

BRAOU

**అభ్యాసం**

జాతి, జాతీయత, జాతీయ రాజ్యం అనే పదాలను వివరించండి ?

## 21.3 ద్విధ్రువ ప్రపంచం

రెండవ ప్రపంచ యుద్ధ పరిసమాప్తితో యూరోపు చరిత్ర పూర్తిగా మారిపోయింది. యుద్ధంలో బ్రిటన్, ఫ్రాన్సులు విజయం పొందినప్పటికీ, జనాభా, సంపదల దృష్ట్యా బాగా నష్టపోయాయి. యుద్ధంలో ఓటమి పొందిన జర్మనీ తన భౌగోళిక స్వరూపాన్నే కోల్పోయింది. యుద్ధానికి ముందు అగ్రరాజ్యాలుగా ప్రఖ్యాతిపొందినవి, యుద్ధానంతరం బలహీన రాజ్యాలుగా రూపాంతరం చెందాయి. పర్యవసానంలో ఏర్పడిన శూన్యతను భర్తీ చేయటానికి అమెరికా, రష్యాలు పోటీ పడ్డాయి. రెండవ ప్రపంచ యుద్ధానికి పూర్వం అంతర్జాతీయ రాజకీయాలలో చురుకుగా పాల్గొనని అమెరికా; యుద్ధానంతరం క్రియాశీలకంగా పాల్గొనటం ప్రారంభించింది. మొదటి ప్రపంచయుద్ధం సమాప్తం కావటానికి ముందు ఆవిర్భవించిన సోవియట్ రష్యాతన శక్తిని నిరూపించింది. అమెరికా, రష్యాలు రెండూ యుద్ధంలో నష్టపోయినప్పటికీ, తక్కిన రాజ్యాలతో పోల్చినప్పుడు అవి తమ ప్రత్యేకతలను చాటుకొన్నాయి. యుద్ధకాలంలో అమెరికా రష్యాల మధ్య నెలకొన్న మైత్రి, యుద్ధానంతరం ప్రపంచ రాజకీయాలను తమ గుప్పిట్లో ఉంచుకోవటానికి పరస్పరం పోటీ పడటంగా పరిణమించింది. ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం అవి ప్రపంచ రాజకీయ రంగంలో అగ్రరాజ్యాలుగా అవతరించాయి. వీటి మధ్య ప్రాబల్యపోటీ పర్యవసానంగా రెండవ ప్రపంచయుద్ధం తరువాత అంతర్జాతీయ రాజకీయాలలో కొత్త మలుపు వచ్చింది. సమకాలీన ప్రపంచంలో అగ్రరాజ్యాల అవతరణ మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాల కాలంనుండి ఆరంభమైంది. రెండు ప్రపంచ యుద్ధాలలోనూ పెద్ద దేశాలు కూటాలను ఏర్పరచుకొన్నాయి. రెండవ ప్రపంచ యుద్ధం అంతర్జాతీయ రాజకీయ రంగాన్ని ద్విధ్రువ రాజకీయరంగంగా మార్చివేసింది. యుద్ధానంతర పరిస్థితులలో అమెరికా, సోవియట్ రష్యాలు అంతర్జాతీయ రాజకీయాలలో చురుకుగా పాల్గొనటం వల్ల అగ్రరాజ్యాల యుగం ఆరంభమైంది. క్రమంగా అగ్రరాజ్యాల ప్రాముఖ్యం పెరిగి ప్రచ్ఛన్న యుద్ధానికి దారితీసింది. అగ్రరాజ్యల భావనను విలియం టి. ఫాక్స్ అనే రచయిత మొదటిసారిగా ప్రవేశపెట్టారు. ఒక రాజ్యం తన సైనిక శక్తి ద్వారా మరొక ప్రబల రాజ్యంతో సమాన స్థాయిలో ప్రపంచంలోని ఏ ప్రాంతానికైనా తన ప్రాబల్యాన్ని విస్తరింప చేయగలిగిఉంటే అది అగ్రరాజ్యం. మరొక మాటలో చెప్పాలంటే ఏ ప్రాంతంలోనైనా యుద్ధ ప్రమాదం ఏర్పడినప్పుడు జోక్యం చేసుకోగల ప్రాబల్యం, సామర్థ్యం ఉన్న దేశం అగ్రరాజ్యం. అంతర్జాతీయ రాజకీయాల విద్యార్థుల దృష్టిలో అగ్రరాజ్యాలంటే సైనిక, అణు, ఆర్థిక, పారిశ్రామిక శక్తులతో ఇతర దేశాలను అణగదొక్కగల రాజ్యాలే. వాటికి అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం ఉండాలి. తమ శక్తి సామర్థ్యాలతో ప్రపంచంలో ఎక్కడ సంఘర్షణ జరిగినా తమ ఉనికినీ, ప్రాబల్యాన్నీ, సంసిద్ధతనూ వెల్లడించుకోగల్గాలి.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం అమెరికా, రష్యాల ద్వైపాక్షిక సంబంధాలలో ఉత్పన్నమైన ఉద్రిక్తతలను, సంఘర్షణలను వర్ణించటానికి ప్రముఖ పాత్రికేయుడు వాల్టర్ లిప్‌మాన్ "ప్రచ్ఛన్న యుద్ధ" మనే పదాన్ని (Cold War) వాడారు. ప్రత్యక్ష సాయుధ సంఘర్షణ లేకుండా రెండు రాజ్యాల మధ్య సంఘర్షణ స్థితిని సూచించే విధంగా

BRAOU

అంతర్జాతీయ సంబంధాలలో ప్రచ్ఛన్న యుద్ధ భావన ప్రాచుర్యంలోకి వచ్చింది. రెండు అగ్రరాజ్యాల నాయకత్వంలో ఏర్పడ్డ కూటాల మధ్య యుద్ధ వాతావరణంతో కూడిన ఉద్రిక్తత, ప్రపంచ రాజ్యాలపై దాని ప్రభావమే ప్రచ్ఛన్న యుద్ధం. ప్రచ్ఛన్న యుద్ధం ప్రారంభించటానికి బాధ్యులు ఎవరన్న ప్రశ్నకు సరియైన సమాధానం లేదు. రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మనీ ఓటమితో, మిత్ర రాజ్యాల స్నేహంతో తీవ్రంగా కలతలు ప్రారంభమయ్యాయి. దౌత్య సంబంధమైన చర్చలు లేకుండా జరిగిన కాలయాపనలో ప్రచ్ఛన్నయుద్ధచ్ఛాయలు అలుముకోనారంభించాయి. బెర్నార్డ్ బ్రూచ్ 1947లో మొదటిసారి బహిరంగంగా గ్రీకు, టర్కీ దేశాలకు సహాయమందిస్తున్న "ట్రూమన్ పథకం" మీద ఉపన్యాసమిస్తూ "ప్రచ్ఛన్నయుద్ధం" అనే నామకరణం చేశారు. సోవియట్ రష్యా కమ్యూనిస్టుల ప్రమాదం నుండి రక్షించుకోటానికి ఇంగ్లీషు భాష మాట్లాడే ప్రజలందరూ ఏకం కావాలని అమెరికాలోని మిస్సోరి రాష్ట్రంలోని ఫుల్టన్ కళాశాలలో బ్రిటిష్ నాయకుడు విన్‌స్టన్ చర్చిల్ 1946లో చేసిన ఉపన్యాసంతో ప్రచ్ఛన్న యుద్ధం ఆరంభమైందని అంటారు. పరస్పర అనుమానాలూ, శత్రుత్వ భావనలూ, నిర్ణయాతీతమైన సంఘర్షణలూ, యుద్ధానంతరం మిత్ర రాజ్యాల విచ్ఛిత్తికి కారణాలయ్యాయి. అంతర్జాతీయరంగంలో తమ తమ వ్యక్తిత్వప్రాధాన్యాలను ఏర్పరచుకోవడానికి అనువైన వ్యూహాలను ఏర్పరచుకొన్నాక, మిత్ర రాజ్యాల మధ్య క్లిష్ట సమస్యలు త్వరత్వరగా తలెత్తుతూ వచ్చాయి. 1945లో జపానుపై అమెరిగా ప్రయోగించిన ఆటంబాంబులు, దౌత్య వ్యవహారాల్లో నూతన దృక్కోణాలను ప్రవేశపెట్టి రెండు అగ్ర రాజ్యాలను సమానంగా భయభ్రాంతులను కలుగజేశాయి. 1949 చివరలో కమ్యూనిస్టు చైనా ఆవిర్భవించటంతోఅగ్రరాజ్యాల ప్రాబల్యాలపోటీకి చైనా రంగస్థలమైపోయింది. ఆయుధాలపోటీ, సైనిక స్థావరాలు, ఇతర విధాలైన సైనిక సంసిద్ధతలు, బెర్లిన్ నగర దిగ్బంధనం, కొరియా యుద్ధం, సూయజ్ కాలువ వివాదం మొదలైన సమస్యలలో ఈ సైనిక సంసిద్ధత దర్శనమిస్తున్నది. ఈ సంసిద్ధతల ద్వారా అగ్రరాజ్యాలు తమ యుద్ధ పాటవాన్ని పరీక్షించుకోవటానికి వీటిని ఉపయోగించాయి. కేవలం పూనిక, సంసిద్ధతలే ప్రచ్ఛన్న యుద్ధ లక్షణాలు కావు. తమ నిర్ణయాలను ఇతర దేశాలపై రుద్దటానికి చేసే ప్రయత్నాలు కూడా ఇందులోని భాగాలే. సైద్ధాంతిక విముఖత్వం, ఆధునిక ప్రసార సాధనాల ద్వారా ద్వేషపూరిత ప్రచారం, గూఢచారి చర్యలు, వెన్నుపోటు చర్యలు, ఇతర దేశాల అంతరంగిక విషయాలలో జోక్యం జేసుకోవటం లాంటివి కూడా ప్రచ్ఛన్న యుద్ధ లక్షణాలే. అగ్రరాజ్యాల మధ్య ఆర్థిక సంబంధమైన పోటీ అభివృద్ధి చెందుతున్న దేశాలకు వివిధ రూపాల్లో ఆర్థిక సహాయం అందించటంలోనూ వాళ్లకు తమకనుసన్నల్లో ఉంచుకోవటంలోనూ పర్యవసించింది.

ప్రచ్ఛన్నయుద్ధం అంతర్జాతీయ రాజకీయాలను బాగా ప్రభావ పరచింది. ప్రపంచ రాజ్యాలలో భయాందోళనలను రేకెత్తించింది. రాజ్యాల మధ్య ఆయుధాల సేకరణ పోటీ ప్రారంభమైంది. రెండు కూటాల రాజ్యాలు కీలకమైన ఆయుధాల తయారీలో పోటీపడి, ఆ పోటీని నిరంతరం కొనసాగించాయి. అది రాజ్యాల అనేకమైన ఒప్పందాలకు కారణభూతమైంది. రెండవ ప్రపంచ యుద్ధానంతరం విమోచనం పొందిన పూర్వపు వలస రాజ్యాలు కొన్ని, ఏ కూటమిలోనూ చేరకుండా స్వతంత్ర విధానాలను అవలంబించాయి. పర్యవసానంగా అలీనోద్యమం వృద్ధి చెందింది. ప్రచ్ఛన్న యుద్ధం ఐక్యరాజ్య సమితిని నిర్వీర్యం చేసింది. ఇరు కూటాలు పరస్పరం వ్యతిరేకించుకోవటం వల్ల, ఐక్యరాజ్య సమితి తన విధులను నిర్వహించటంలో సంపూర్ణ సాఫల్యం పొందలేకపోయింది.

ప్రచ్ఛన్న యుద్ధం తీవ్రస్థాయికి చేరుకొన్న తరువాత, అగ్రరాజ్యాలు ప్రపంచంలో ఉన్న ఉద్రిక్తత వల్ల మరో ప్రపంచ యుద్ధం సర్వనాశనకరమనే భయంతో ఉద్రిక్తతల సడలింపుకు చర్యలు చేపట్టాయి. అణు విజ్ఞాన వ్యాప్తి వల్ల

BRAOU

సర్వనాశన భయం అగ్రరాజ్యాల విధానాలలో సడలింపులకు దోహదం చేసింది. ఇరు కూటాల మధ్య పోటీలు కొనసాగుతూనే, సైనిక కూటాలు రద్దుకాకుండా "సయోధ్య వాతావరణం" నెలకొంది. పరస్పర విధ్వంసం కన్నా, పరస్పరం పాక్షికంగా ప్రయోజనాలు సాధించటం ఉచితమని అగ్రరాజ్యాలు భావించుకోవటం వల్ల అంతర్జాతీయ రాజకీయాలలో "సయోధ్య" భావనకు ప్రాముఖ్యం లభించింది. అగ్రరాజ్యాలు తమ మధ్య గల విభేదాలను తొలగించుకోవటమే గాక, పరస్పరం సహకరించుకొనే రంగాలను విస్తరించటానికి నిర్ణయించుకోవటం ఒక ఆశాజనక పరిణామం. 1990 ఆరంభంలో సోవియట్ రష్యా అమలు చేసిన ఉదార సంస్కరణల పర్యవసానంగా సంభవించిన పరిణమాల మూలంగా ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణం తొలగిపోయింది. సోవియట్ రష్యా విచ్ఛిన్నమైన తరావాత అమెరికాకు దీటుగా నిలువగల మరో రాజ్యం అంతర్జాతీయ రాజకీయరంగంలో అవతరించలేదు. అమెరికా అందించే సహాయ సహాకారాల మీదే రష్యా ఆధారపడే స్థితి ఏర్పడినందున వాటి మధ్య సంఘర్షణలకు తావులేకుండా పోయింది.

అభ్యాసం

ప్రచ్ఛన్న యుద్ధం అంతర్జాతీయ పరిణామాలపై ఎలాంటి ప్రభావాన్ని కలిగిఉందో వివరించండి ?

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

## 21.4 అలీన విధానం

BRAOU

రెండవ ప్రపంచ యుద్ధానంతరం, వలస విమోచనం సాధించుకొని స్వతంత్ర రాజ్యాలుగా అవిర్భవించిన ఆసియా, ఆఫ్రికా రాజ్యాలు ఏ కూటాలలోనూ చేరకుండా స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అవలంబించటాన్ని అలీన విధానమని పిలుస్తున్నారు. తాము సంపాదించుకొన్న స్వాతంత్ర్యాన్ని రక్షించుకోవాలనే కాంక్ష, తమ రాజకీయ సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలనే అభిలాషల ఫలితమే అలీన విధానం. ఆర్థిక రాజకీయ స్వాతంత్ర్యాలకు భద్రత ఏర్పడే ప్రపంచ నిర్మాణమే ఈ దేశాల ఆశయం. అగ్రరాజ్యాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం బాగా ప్రజ్వరిల్లుతున్న రోజుల్లో అలీన విధానం రూపొందింది. అగ్ర రాజ్యాల మధ్య సయోధ్య ఏర్పడేటట్లు చేయటంలోనూ, అభివృద్ధి చెందుతూ ఉన్న దేశాల ఆర్థికాభివృద్ధికి కృషి చేయటంలోనూ, ప్రపంచశాంతి స్థాపన ప్రయత్నంలో, సామ్రాజ్యవాదాన్ని పూర్తిగా వ్యతిరేకించాలనే భావంతో భారత ప్రధాని నెహ్రూ ఢిల్లీలో ఆసియా రాజ్యాల సమావేశం ఏర్పరచారు. ఆ సమావేశంతో నూతన ఆసియా ఆవిర్భావాన్ని ప్రపంచం గుర్తించింది. ఈ సమావేశంలోనే అలీన విధాన రూపకల్పనకు నాందీ ప్రస్తావన జరిగింది. 1955లో ఇండోనేసియాలోని బాండుంగ్ నగరంలో జరిగిన ఆసియా ఆఫ్రికా రాజ్యాల మహాసభ అలీన విధాన వృద్ధిలో తొలిమెట్టు. బాండుంగ్‌లో మొత్తం 20 దేశాలు పాల్గొన్నాయి. మొదటిసారిగా ఈ బాండుంగ్ సమావేశంలో

అలీన విధానం చర్చకు వచ్చింది. ఆఫ్రికా, ఆసియా రాజ్యాల మధ్య ఆర్థిక, సాంస్కృతిక సహకారానికీ, మానవ హక్కుల సంరక్షణకూ, రాజ్యాల స్వయం నిర్ణయాధికారానికీ, కృషి చేయాలని నిర్ణయించారు. అలీన విధానం అవలంబించే రాజ్యాలు అంతర్జాతీయ సమాజంలో కలిసికట్టుగా వ్యవహరించటానికి అంగీకరించాయి. సమావేశంలో పాల్గొన్న నాయకులు అలీన విధానాన్ని కూలంకషంగా చర్చించి నూతన దృక్కోణాలను నిర్ణయించారు. అలీన విధానాన్ని అవలంబించే రాజ్యాలు సైనిక కూటాలలో సభ్యత్వంలేని శాంతికాముక రాజ్యాల కూటమి అని వివరించారు. ప్రపంచ వలస విధానాలనుండి విముక్తి సాధించుకోవటంలోను అలీన విధానం గొప్ప ప్రగతిని సాధించగల్గింది. ఆరంభంలో అలీన విధానాన్ని తటస్థ విధానంగా భావించారు. తటస్థ విధానం నిషేధాత్మక స్వభావం గలది. యుద్ధంలో ఏ పక్షంలోనూ చేరకుండా ఉండటాన్ని తాటస్థ్యం అని అంటారు.

అలీన విధాన భావన అకస్మాత్తుగా ఏర్పడింది కాదు. చారిత్రక అనుభవాల, సంఘటనల పర్యవసానం అలీనవిధానం. ఈ భావం వృద్ధి చెందటంలో భారతదేశం ప్రధానమైన పాత్రను నిర్వహించింది. దేశ స్వాతంత్ర్యోద్యమ కాలంలోనే భారత జాతీయ నాయకులు సైనిక కూటాలూ, ప్రభావాలూ ఏ సమస్యనూ పరిష్కరింపజాలవన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. అభివృద్ధి చెందుతున్న బీద దేశాల సమస్యలు ప్రచ్ఛన్న యుద్ధ ఉద్రిక్త వాతావరణంలో పరిష్కారం కాజాలవని భావించారు.

1948 చివరలో అవతరించిన ఇండోనేసియాలో డచ్ వారు సైనిక చర్యలను ఆరంబించటాన్ని ఆసియా రాజ్యాలు తీవ్రంగా విమర్శించాయి. అలీన విధానం అవలంబించదలచుకొన్న రాజ్యాలకు "పంచశీల" సూత్రాలు మార్గదర్శకాలన్నారు. 1954 మే 29న టిబెట్ సమస్యపై భారత చైనా దేశాలు చేసుకొన్న ఒప్పందంలో మొదటిసారిగా పంచశీల సూత్రాలు అనుబంధంగా ప్రకటితమయ్యాయి. భారత చైనా ప్రధానులు తమ మధ్య, ప్రపంచ దేశాల మధ్య ఏర్పరచుకొనే సంబంధాలలో పంచశీల సూత్రాలు అనుసరణీయమవుతాయని ప్రకటించారు. పంచశీల సూత్రాలు అంటే: (1) ప్రాదేశిక సమగ్రతనూ, సార్వభౌమత్వాన్నీ పరస్పరం గౌరవించుకోవటం; (2) ఉభయ దేశాలకు దురాక్రమణ ఉద్దేశాలు లేకుండటం; (3) ఒకరి ఆంతరంగిక విషయాలలో మరొకరు జోక్యం కలుగచేసుకోకపోవటం (4) సమానత్వం; (5) శాంతియుత సహజీవనం. ఆ రోజుల్లో అలీన విధానాన్ని అమెరికా నిశితంగా విమర్శించింది. ఉభయ సైనిక కూటాలు అలీన విధానాన్ని అర్థం చేసుకోవటంలో విఫలమయ్యాయి.

BRAOU

ప్రపంచ దౌత్య సంబంధాలలో అలీన విధానం ఒక విశిష్ట భావన. ప్రచ్ఛన్న యుద్ధపు ఉద్రిక్తతలు సడలటానికి శాంతిప్రియ దేశాలు అవలంబించిన విధానం మొదటి సారిగా అలీన విధానం అవలంబిస్తున్న దేశాల నాయకులు 1961 సెప్టెంబరులో యుగోస్లేవియా రాజధాని బెల్‌గ్రేడ్‌లో సమావేశమయ్యారు. అప్పటి నుండి నాలుగు సంవత్సరాలకొకసారి సమావేశమయ్యే సంప్రదాయం ఏర్పడింది. 25 రాజ్యాలతో ప్రారంభమైన అలీన విధాన ఉద్యమం 103 రాజ్యాలకు విస్తరించింది. మూడవ ప్రపంచ ప్రజల ఆశయాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆలీన విధానం అంతర్జాతీయ శాంతి అవగాహనకు గణనీయమైన కృషి చేసింది. అలీనోద్యమం అంతర్జాతీయ రాజకీయాల్లో నిర్మాణాత్మక, నైతిక శక్తిగా ఆవిర్భవించింది. వ్యక్తిగతంగానూ, సమైక్యంగానూ అలీన దేశాలు ప్రపంచంలో ఉద్రిక్తతలు సడలటానికి చేసిన కృషి అమోఘమైంది. వాటి కృషి పర్యవసానంగా 1974 మే నెలలో జరిగిన ఐక్యరాజ్యసమితి ఆరవ ప్రత్యేక సమావేశం నూతన అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థపై ఒక ప్రకటనను ఆమోదించింది. అంతర్జాతీయ ఆర్థిక వ్యవహారాలలో అలీన విధానం అవలంబిస్తున్న రాజ్యాలు ప్రత్యేకమైన వేదికను ఏర్పాటు చేసుకోవటం చాలా ప్రముఖమైన విషయం. అలీన దేశాల కృషి ఫలితంగా ప్రపంచంలో వలసల నిర్మూలనం జరిగి అగ్రరాజ్యాల కూటాల వైపు దేశాల ధ్రువీకరణ (Polarisation) బలహీనమైందని చెప్పవచ్చు.

సోవియట్ రష్యా అంతర్థానంతో ద్విధ్రువ ప్రపంచం ఏక ధ్రువ ప్రపంచంగా మారింది. అలీన విధానం చైతన్యవంతమైంది. మారిన నేటి అంతర్జాతీయ పరిస్థితులలో కూడా దానికి ప్రాముఖ్యం ఉంది. అంతర్జాతీయంగా వచ్చిన మార్పులకనుగుణంగా అలీన విధాన ధ్యేయాలలో కూడా కొన్ని మార్పులు వచ్చాయి. ప్రపంచ రాజకీయాల పాత్రనూ, సైనిక విధానాన్నీ, ప్రచ్ఛన్న యుద్ధాన్నీ వ్యతిరేకించటం కన్నా, ఆకలి, అనారోగ్యం, అనావృష్టి, దుర్భర దారిద్ర్యం మొదలైన పరిస్థితులను రూపుమాపే సంక్షేమాభివృద్ధి వైపు అలీన దేశాలు తమ దృష్టి మరలించాయి. అలీన విధానం ఒక అంతర్జాతీయ వ్యవస్థ కాదు. అది ఒక ఉద్యమం. దాన్ని అనుసరిస్తున్న రాజ్యాలన్నీ తరచుగా శిఖరాగ్ర సమావేశాలను నిర్వహిస్తున్నాయి. దీనికి సంస్థాగత నిర్మితి లేదు. శిఖరాగ్ర సమావేశం జరిగిన దేశం అధినేతనే అధ్యక్షులుగా ఎన్నుకుంటారు. మరొక సమావేశం జరిగేదాకా ఆ అధ్యక్షుడే సంధానకర్తగా వ్యవహరిస్తుంటారు. అందువల్లనే దీనిని అలీనోద్యమంగా వ్యవహరిస్తున్నారు.

అభ్యాసం

ప్రస్తుత కాలంలో అలీన విధానానికి ఉన్న ప్రాముఖ్యత ఏమిటి ?

BRAOU

## 21.5 ఐక్యరాజ్య సమితి

యుద్ధాలను నివారించి శాంతిని నెలకొల్పే నిమిత్తం ఈ శతాబ్దపు ఆరంభం నుండి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. మొదటి ప్రపంచయుద్ధ పరిసమాప్తి తరువాత శాంతి ఒప్పందంలో భాగంగా నానాజాతిసమితి రూపొందింది. వివిధ కారణాలవల్ల నానాజాతిసమితి తన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించలేకపోయింది. రెండవ ప్రపంచ యుద్ధం సాగుతుండగానే, యుద్ధానంతర ప్రపంచశాంతి పరిరక్షణ గురించి రాజ్యాలు ఆలోచించసాగాయి. నానాజాతిసమితిని పునరుజ్జీవింపచేయటం వృథా ప్రయాసగా ఆనాటి ప్రపంచ నాయకులు భావించారు. మిత్ర పక్షాల తరపున అమెరికా సంయుక్త రాష్ట్రాలు యుద్ధంలో ప్రవేశించక పూర్వమే 1941లో బ్రిటన్ ప్రధాని, అమెరికా అధ్యక్షులు కలిసి అట్లాంటిక్ ఛార్టరును ప్రకటించారు. ఈ ఛార్టరు ప్రకారం యుద్ధానంతరం వ్యవహరించాలని నిర్ణయించుకొన్నారు. ప్రజల స్వయం నిర్ణయాధికారపు హక్కు, అన్ని జాతుల వారికీ ముడి పదార్థాలు లభ్యమై సమానంగా అనుభవించే హక్కు, సముద్రాలపై అన్ని దేశాలకు స్వేచ్ఛాయానపు హక్కు, నిరాయుధీకరణ సూత్రాలూ భవిష్యత్తుకు సోపానాలుగా ఛార్టర్‌లో పేర్కొన్నారు. 1942లో అమెరికా, సోవియట్ రష్యాలు యుద్ధంలో ప్రవేశించిన 26దేశాలకూ మిత్రరాజ్యాల లక్ష్యాలను వివరిస్తూ అట్లాంటిక్ ఛార్టర్‌ను పంపించాయి. ఆ దేశాలు ఈ ఛార్టర్‌ను అంగీకరించాయి. ఈ రాజ్యాల

ప్రకటననే ఐక్యరాజ్యాల ప్రకటన (UNITED NATIONS DECLARATION) గా వ్యవహరిస్తున్నారు. యుద్ధకాలంలో జరిగిన అగ్రనాయకుల సమావేశాలలో ఐక్యరాజ్యసమితి ఏర్పాటును కూలంకషంగా చర్చించారు. 60 దేశాల ప్రతినిధులు 1945 ఏప్రిల్-జూన్ మాసాలలో శాన్‌ఫ్రాన్సిస్కో నగరంలో సమావేశమై ఐక్యరాజ్యసమితి ప్రణాళికను చర్చించి అంగీకరించారు. అభిప్రాయ భేదాలు ఎన్ని ఉన్నా భవిష్యత్తులో యుద్ధాలు నివారించటానికీ, అంతర్జాతీయ సహకారానికీ ఒక ప్రపంచ సంస్థ ఉండాలన్న విషయాన్ని అంగీకరించారు. ఈ సమావేశంలో ప్రతినిధులు అంగీకరించిన ప్రయత్నాన్ని, ఆయా దేశాల పార్లమెంటులు ధ్రువీకరించాయి. 1945 అక్టోబరు 24న ఐక్యరాజ్యసమితి అధికారికంగా అవతరించింది.

యుద్ధాల్ని నివారించటం ఐక్యరాజ్యసమితి ప్రథమ కర్తవ్యం. తమ జీవితకాలంలో రెండు ప్రపంచ యుద్ధాలను చూసిన జనావళి భవిష్యత్తులో మరో యుద్ధాన్ని చూడకుండా ఉండగల వాతావరణాన్ని సృష్టించటమే దీని ప్రాథమిక లక్ష్యం. ఇతర లక్ష్యాలు : (1) అంతర్జాతీయ శాంతిభద్రతలను కాపాడటానికీ, దురాక్రమణలను అరికట్టి, ప్రపంచశాంతిని పరిరక్షించటానికీ సమితి అన్ని శాంతియుత మార్గాలనూ ఉపయోగించటం; (2) అంతర్జాతీయ సౌభ్రాతృత్వాన్ని దృఢ పరచటానికి వివిధ దేశాల మధ్య సమాన హక్కులు, స్వయం నిర్ణయాధికారాల ప్రాతిపదికల మీద దేశాల మధ్య మైత్రిని పెంపొందించటం (3) ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, మానవతాపరమైన అంతర్జాతీయ సమస్యలను పరిష్కరించటానికి అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించడం, జాతి, మత, కుల, వర్గ, భాషా, లింగ విచక్షణ లేకుండా మానవ హక్కుల పట్ల, ప్రాథమిక స్వాతంత్ర్యాల పట్ల గౌరవాన్ని పెంచటం; (4) పై లక్ష్యాల సాధనకు సమితి అన్ని దేశాల కార్యకలాపాలను సమన్వయపరచటం, లక్ష్యాల సాధనకు సభ్యదేశాలు విడివిడిగాను, కలిసికట్టుగాను కృషి చేసేటట్లు చూడటం, ఛార్టరును అంగీకరించిన రాజ్యాలు సమితిలో సభ్యత్వం పొందటం. ప్రస్తుతం సమితిలోని సభ్య రాజ్యాల సంఖ్య 186. సమితి పోషణ ఖర్చులను సభ్యదేశాలు స్వచ్ఛంద ప్రాతిపదికమీద భరిస్తాయి.

ఐక్యరాజ్య సమితి కేవలం రాజకీయ విధులనే కాక ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, విధులను కూడా నిర్వహిస్తున్నది. ప్రపంచ ప్రజల సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేసే అనుబంధ సంస్థలు అనేకం ఉన్నాయి. ఈ సంస్థలకు స్వయంపాలన ప్రతిపత్తి ఉంది. ఆయా సంస్థల పేర్లే అవి నిర్వహించే కార్యక్రమాలను వివరించేవిగా ఉన్నాయి. ఐక్యరాజ్య సమితిలో సభ్యత్వం లేని రాజ్యాలు కూడా ఈ అనుబంధ సంస్థలలో సభ్యత్వం పొందవచ్చు. ఐక్యరాజ్య సమితిలో ఆరు ప్రధానాంగాలు ఉన్నాయి. అవి : (1) సాధారణ సభ (2) భద్రతా సమితి (3) ఆర్థిక సాంఘిక సమితి (4) ధర్మ కర్తృత్వ సంఘం (5) అంతర్జాతీయ న్యాయస్థానం (6) సచివాలయం. వీటిలో సాధారణ సభ, భద్రతా సమితి చాల ప్రధానమైనటువంటివి. సాధారణ సభను ఐక్యరాజ్యసమితి పార్లమెంటుగాను, భద్రతా సమితిని కార్య నిర్వాహక వర్గంగాను మనం భావించవచ్చు. సాధారణ సభ సంవత్సరంలో కనీసం ఒకసారి సమావేశం కావాల్సి ఉంది. సమితి రాజకీయ కార్యకలాపాలలో భద్రతా సమితి అతి ప్రధానమైన పాత్రను నిర్వహిస్తున్నది. గతంలోని నానాజాతి సమితి అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రపంచ శాంతిని పరిరక్షించే బాధ్యతను భద్రతా సంఘానికి ఇవ్వటమైంది. భద్రతా సంఘం ఏ ఎజెండా లేకుండా కనీసం పక్షం రోజుల కొకసారైనా సమావేశం కావాల్సిఉంది. ప్రపంచ శాంతి భద్రతల పరిరక్షణ దాని ప్రథమ కర్తవ్యం. రెండవ ప్రపంచ యుద్ధంలో మిత్ర పక్షాలుగా కూడిన అమెరికా, సోవియెట్ రష్యా,

BRAOU

ఫ్రాన్సు, ఇంగ్లాండ్, చైనాలకు ఇందులో శాశ్వత సభ్యత్వం ఉంది. మిత్ర రాజ్యాల యుద్ధకాలపు మైత్రి కొనసాగితే ప్రపంచ శాంతి పరిరక్షణ సులభమౌతుందన్న భావనతో శాశ్వత సభ్యత్వం కల్పించటమే గాక, భద్రతాసంఘం తీర్మానాలకు వీరి అంగీకారం తప్పనిసరి. అందువల్ల శాశ్వత సభ్య రాజ్యాలలో ఏదైనా ఒకటి తీర్మానాన్ని అంగీకరించక పోవటాన్ని వీటో అధికారంగా వ్యవహరిస్తున్నారు. యుద్ధకాలపు మిత్ర రాజ్యాల అంగీకారంతో భద్రతాసంఘం ప్రపంచ శాంతి పరిరక్షణకు సమిష్టి భద్రతా రక్షణ వ్యవస్థగా వ్యవహరిస్తున్నది.

ఐక్యరాజ్య సమితి ఇప్పటిదాకా సాధించినదానికంటే ముందు సాధించాల్సింది ఎక్కువగా ఉంది. ప్రపంచ శాంతి భద్రతలను కాపాడటంలో ఐక్యరాజ్య సమితి కృషిలో జయాపజయాలు ఉన్నాయి. కొరియా విషయంలోనూ ఇటీవల ఇరాక్ విషయంలోనూ తప్ప మరేదేశపు దురాక్రమణదారుల మీదా సైనిక చర్యలను తీసుకొనలేకపోయింది. ప్రధానంగా ప్రచ్ఛన్న యుద్ధకాలంలో భద్రతాసమితి సైనిక, ఆర్థిక చర్యలను చేపట్టలేకపోయింది. అయితే అనేక సందర్భాలలో ఐక్యరాజ్యసమితి దేశాల మధ్య సంఘర్షణలు విస్తరించకుండా, వృద్ధి చెందకుండా నిరోధించకల్గింది. భద్రతా సమితిలో అగ్రరాజ్యాలకుగల వీటో హక్కు వారి సంకుచితతత్వానికి రక్షాకవచమైంది. సమితి సభ్య దేశాలు భిన్న సిద్ధాంతాలు, భిన్న దృక్పథాలు, ధోరణులు కలిగి ఉండటం వల్ల అవి ఒకే తాటిమీద నడవలేకపోతున్నాయి. పరస్పర వ్యతిరేకాభిప్రాయాలు గల దేశాలమధ్య సామరస్య సాధన కష్టమైన విషయమే. 1960 నుండి సమితి సభ్యదేశాల సంఖ్య పెరిగినందువల్ల అవి సమితిపై ఒత్తిడితెచ్చి ప్రపంచ ఆర్థికాభివృద్ధికి కృషి జరిగేటట్లు చేశాయి. ఐక్యరాజ్యసమితి ఏమీ చేయలేని సంస్థ అని తోసి పుచ్చటం చాల తేలిక. అలాగే సమితిని ప్రపంచశాంతిని పరిరక్షించే ప్రధాన సంస్థగా పరిగణించటం కూడా తేలికే. రాజకీయ విషయాలలోకన్నా, రాజకీయేతర విషయాలలోనేఐక్యరాజ్యసమితి ఎక్కువగా విజయాలను సాధించింది. దాని అనుబంధ సంస్థలు వివిధ రంగాలలో గణనీయమైన కృషి చేస్తున్నాయి. అవి మానవతా విధులను ఎన్నింటినో నిర్వహిస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి జయాపజయాల పరిశీలనలో అది సార్వభౌమాధికారంగల ప్రపంచ వ్యవస్థ కాదన్న విషయాన్ని మనం గుర్తుంచుకోవాల్సి ఉంది.

BRAOU

**అభ్యాసం**

ఐక్యరాజ్యసమితి విధుల్ని క్లుప్తంగా తెలియజేయండి.

---

---

---

---

## 21.6 ఆయుధ నియంత్రణ

ఆయుధాలు, ఆయుధాల ఉత్పత్తి శాంతి స్థాపనకు ప్రమాదం కాబట్టి, నిరాయుధీకరణ అవసరం. శాంతి భద్రతలకు ముప్పు కలిగించే ఆయుధాల విసర్జన అంతర్జాతీయ రాజకీయాలలో ప్రధానాంశం. దేశ రక్షణకు

ఆయుధాలు అవసరం. కాని అవసరానికి మించిన పరిమాణంలో ఆయుధాలను కలిగి ఉండటం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో యుద్ధ కాంక్షను ప్రతిబింబిస్తుంది. నేడు రాజ్యాలు నిరాయుధీకరణ, ఆయుధ నియంత్రణల గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నాయి. ఏకపక్ష నిర్ణయంగా గాని, లేక బహుళపక్ష ఒప్పందాల ద్వారాగాని దేశాల సైనిక వ్యవస్థలలో ఆయుధాలను నియంత్రించటాన్ని ఆయుధ నియంత్రణ అని అంటున్నారు. రెండవ ప్రపంచయుద్ధం ఆయుధ పరిజ్ఞానంలో విపరీతమైన మార్పులను తెచ్చిపెట్టింది. యుద్ధరీతినే మార్చివేసింది. మొదటి ప్రపంచయుద్ధంలో టాంకులు ప్రవేశిస్తే, రెండవ ప్రపంచయుద్ధం ఆటంబాంబుల విస్ఫోటనంతో అంతమైంది. పర్యవసానంగా యుద్ధతంత్రంలో సాంప్రదాయక ఆయుధాల స్థానాన్ని అణ్వాయుధాలు సంపాదించుకొన్నాయి. అణ్వాయుధాల తయారీకి ప్రతిదేశం ఎక్కువ మొత్తాన్ని వ్యయంచేయవలసివచ్చింది. అణ్వాయుధాల రహస్యం కొన్ని రాజ్యాలకే పరిమితమై ఉన్నందున, అణువిజ్ఞాన పరిశోధనలకు ప్రతిదేశం ఉత్సాహాన్ని చూపుతున్నది.

ఆయుధాల నియంత్రణ, నిరాయుధీకరణలు అంతర్జాతీయ సమస్యలలోనివే కాని ప్రత్యేకమైనవి కాదు. ప్రపంచంలోనిదేశాలు తమ శక్తిని పెంపొందించుకోవటానికీ, భద్రతను కాపాడుకోవటానికీ ఆయుధాల సేకరణ విధానాన్ని అనుసరిస్తున్నాయి. ప్రతి దేశం తనవిరోధిదేశం కంటే ఎక్కువ పరిమాణంలో ఆయుధాలను సమీకరించుకో ప్రయత్నిస్తున్నది. ఈ కారణంగా దేశాలన్నీ ఆయుధాల నిల్వలలో ఆధిక్యతను సాధించటానికి ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయి. భద్రతను గురించిన మానసిక భయాందోళనలు దేశాలను నిరంతర ఆయుధ పోటీకి పురికొల్పుతున్నాయి. ఆయుధాల ఉత్పత్తి, ఆయుధాల పోటీ అనేక నష్టాలకు దారి తీస్తున్నాయి. అవి: యుద్ధావకాశాలను పెంచటం, అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ పరిమిత వనరులను తప్పని సరిగా ఆయుధాల సేకరణకు వినియోగించవలసి రావటం. ఇవి ఆరోగ్యం, విద్య, నివాసం మొదలైన సమస్యలకు దారితీస్తున్నాయి. సమస్యలు ఉన్నప్పటికీ దేశాలు ఆయుధ సేకరణకు ప్రాముఖ్యం ఇవ్వటం కేవలం ఘర్షణల వృద్ధి కొరకే. ఆయుధాల పోటీలవల్ల దేశాల్లో ఆయుధాలనిల్వలు దినదినాభివృద్ధి చెందుతున్నాయి. సాంకేతిక రంగంలోని పరిశోధనలు విభిన్న ఆయుధాలను కనుక్కోవటానికి తోడ్పడటమే కాక వాటి సామర్థ్యాన్ని విపరీతంగా పెంచాయి. అగ్ర రాజ్యాలు అణ్వాయుధాల విషయంలో తీవ్రమైన పోటీలోకి దిగాయి.

BRAOU

నిరాయుధీకరణ ప్రయత్నాలు 19వ శతాబ్దంలోనే ప్రారంభమయ్యాయి. రాజ్యాల లక్ష్యాలలో సమైక్యత లేనందువల్ల నిరాయుధీకరణ ప్రయత్నాలు సఫలం కాలేదు. నిరాయుధీకరణ విషయంలో నానాజాతిసమితి విఫలమైనప్పటికి, ఐక్యరాజ్య సమితి దీనికి తగు ప్రాధాన్యం ఇచ్చింది. ఐక్యరాజ్య సమితి మొదటి సమావేశంలోనే నిరాయుధీకరణ సమస్యను ప్రస్తావించారు. రెండవ ప్రపంచ యుద్ధానంతరం అణ్వాయుధాల వినాశక శక్తిని గుర్తించిన ప్రపంచ దేశాలు తమ భవిష్యత్తుకోసం సాంప్రదాయక ఆయుధాలపై, అణ్వాయుధాలపై నిషేధాలు తప్పనిసరిఅని గుర్తించాయి. మొట్టమొదటి సారిగా ప్రపంచ చరిత్రలో మానవాళి మనుగడ నిరాయుధీకరణపై ఆధారపడి ఉందని గుర్తించటమైంది. మొట్టమొదటి సమావేశంలోనే సమితి అణుశక్తి కమిషను ఏర్పాటుచేసింది. ప్రపంచ దేశాల ఆయుధాగారాల నుండి అణ్వాయుధాలను, మారణాయుధాలను నిర్మూలించటం ఈ కమిషన్ ప్రథమ కర్తవ్యంగా నిర్ణయించారు. ఈ కమిషన్ తన కార్యక్రమాలను కేవలం అణ్వాయుధాలకే పరిమితం చేసింది. అణ్వస్త్ర పాటవ పరీక్షలు నిషేధించాలని 1954లో మొదటి సారిగా భారత ప్రధాని నెహ్రూ ఐక్యరాజ్యసమితిలో ప్రతిపాదించారు. దీన్ని అలీన దేశాలు సమర్థించాయి. అణ్వస్త్ర పాటవ పరీక్షల నిషేధానికి అనుకూలంగా ప్రపంచ ప్రజాభిప్రాయాన్ని మలిచారు.

అణ్వాయుధ పరిజ్ఞానంలో ప్రపంచ రాజ్యాలు సాధించిన ప్రగతి అకారణంగా గాని, పొరపాటున గాని యుద్ధం సంభవించే అవకాశాలను పెంచింది. శత్రు పక్షాల మధ్య సంక్షోభం తలెత్తినప్పుడు అణుయుద్ధం సంభవించే అవకాశం ఎక్కువైంది. అణుయుద్ధ అవకాశాన్ని తొలగించటానికి రెండు అగ్రరాజ్యాలు 1963 అత్యవసర సమాచార సాధనాన్ని ఏర్పాటు చేసుకున్నాయి. ఈ ఏర్పాటు ప్రకారం రెండు దేశాల అధిపతుల మధ్య hot line ద్వారా ఒక టెలీటైపు సంబంధం కలిగించారు. 1957లో అంతరిక్షంలోకి మొదటిసారిగా ఉపగ్రహాన్ని ప్రయోగించటంలో ఆయుధ నియంత్రణ చర్చలలో కొత్త అంశాలు స్థానం కల్పించుకున్నాయి. అగ్రరాజ్యాల అంగీకారంతో ఐక్యరాజ్య సమితిలో అంతరిక్షాన్ని శాంతి ప్రయోజనాలకే వినియోగించాలన్న తీర్మానం చేశారు. ఈ ప్రయత్నాలేవీ అణ్వాయుధాల వ్యాప్తిని అరికట్టలేకపోయాయి. అణ్వస్త్ర విస్తరణ నివారణ సంధిని రాజ్యాలు అరమరికలు లేకుండా అంగీకరించలేకపోతున్నాయి. పర్యవసానంలో అణుశాస్త్ర విజ్ఞాన పరిశోధనలు కొనసాగుతున్నాయి. ప్రస్తుత పరిస్థితులలో ఆయుధ నియంత్రణ సాధ్యమవుతుందా అన్నది సందేహాస్పదమైంది.

అభ్యాసం

ఆయుధ నియంత్రణ ఆవశ్యకతను వివరించండి ?

## 21.7 తృతీయ ప్రపంచం

తృతీయ ప్రపంచం పదం ఇప్పుడు బాగా వాడుకలో ఉంది. రాజనీతిశాస్త్రజ్ఞులు, అంతర్జాతీయ సంబంధాల రచయితలు, రాజనీతిజ్ఞులు తృతీయ ప్రపంచాన్ని రకరకాలుగా వర్ణించారు. కానీ వారిలో ఏకాభిప్రాయం లేదు. వలసవాద రాజ్యాల నుండి విమోచనం పొంది, వలస వ్యతిరేక విధానం అనుసరించడం, అలీన విధానం అభివృద్ధి చెందక పోవటం, అధిక జనాభా, జాతిపరమైన విభేదాలు మొదలైన రాజకీయ, ఆర్థిక సమస్యల వంటి లక్షణాలున్న రాజ్యాల సమూహమే తృతీయ ప్రపంచం. ప్రచ్ఛన్న యుద్ధ పర్యవసానంగా ఏర్పడిన సైనిక కూటాలలో చేరకుండా స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అనుసరించే ఆసియా, ఆఫ్రికా దేశాలతో పాటు కమ్యూనిస్టు దేశాలతో సహా అభివృద్ధి చెందని దేశాల సమూహాన్ని తృతీయ ప్రపంచంగా పేర్కొంటున్నారు. తృతీయ ప్రపంచం ఏది అన్న విషయంలో అంగీకారం లేనప్పటికి, పూర్వపు వలస పాలన నుండి విముక్తిపొంది, స్వతంత్ర రాజ్యాలుగా ఉన్నవాటిని తృతీయ ప్రపంచంగా విస్తృతార్థంలో వాడవచ్చు. ఇర్వింగ్ లూయీ హార్విక్స్ తృతీయ ప్రపంచాన్ని అభివృద్ధి ప్రాతిపదికగా నిర్వచించారు. పోటీలలో ఉన్న పెట్టుబడిదారీ విధానం ముఖ్యలక్షణంగా గల పశ్చిమ యూరోపు, అమెరికా, జపానులను ఆయన మొదటి ప్రపంచంగా పేర్కొన్నారు. సోవియట్ రష్యా, కమ్యూనిస్టు రాజ్యాలను రెండవ ప్రపంచంగా పేర్కొన్నారు. వలస ఆధిపత్య కబంధ హస్తాలనుండి విమోచనం పొంది, ఒకే విధమైన అభివృద్ధి



BRAOU

సమస్యలను ఎదుర్కొంటూ; అభివృద్ధి మార్గాలను అవలంబించే దేశాలను మూడవ ప్రపంచం అని ఆయన అన్నారు. చైనా నాయకుడు మావో అమెరికా, సోవియట్ రష్యాలను మొదటి ప్రపంచంగాను, జపాను, యూరోపు, కెనడా రెండవ ప్రపంచంగాను వర్ణిస్తూ, ఇటీవలి కాలంలో వలస పాలన నుండి విముక్తి చెంది అభివృద్ధి చెందుతూ ఉన్న లాటిన్, అమెరికా, ఆఫ్రికా, ఆసియా రాజ్యాలను తృతీయ ప్రపంచంగా పేర్కొన్నారు. అభివృద్ధి మార్గంలో ఆసియా, ఆఫ్రికా, లాటిన్, అమెరికా దేశాలు ఎదుర్కొంటున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యలన్నీ ఒకే రకమన్న భావన తృతీయ ప్రపంచ సిద్ధాంతానికి దారితీసింది. 1961లో ఐక్యరాజ్యసమితి తీర్మానం ప్రపంచాన్ని మూడు ఆర్థిక విభాగాల కింద విభజించింది. మొదటి వర్గంలో ప్రభుత్వేతర రంగం బాగా అభివృద్ధి చెందిన దేశాలు, రెండవ వర్గంలో ప్రభుత్వాధీనంలో ఉన్న ఆర్థిక వ్యవస్థలు గల దేశాలు, మూడవ వర్గంలో ప్రాథమిక వస్తువులైన వ్యవసాయోత్పత్తులు, ఖనిజాలు, నూనె, రాగి, ఇనుము, పత్తి, జనుము మొదలైనవి ఉత్పత్తి చేసే దేశాలు. మూడవ ప్రపంచం తక్కువ పారిశ్రామికీకరణ చెందినదిగా, తక్కువ పెరుగుదల, తక్కువ సగటు ఆదాయం ఉండి ఆర్థికంగా మొదటి, రెండో ప్రపంచాల మీద ఆధారపడే లక్షణాలు కలదిగా గుర్తించారు. తృతీయ ప్రపంచ సమస్యలు నిరంతర ప్రజా జీవన సమస్యలు. ఈ సమస్యల పరిష్కార మార్గన్వేషణ తృతీయ ప్రపంచ రాజ్యాల నిరంతర ప్రయత్నం.

వలసవాద దేశాల ప్రభావాల నుంచి విముక్తి చెందిన తృతీయ ప్రపంచ రాజ్యాల బానిస మనస్తత్వంలోగణనీయమైన మార్పులు రావటం లేదు. వలస దేశాల విధానాల వల్ల తృతీయ ప్రపంచ రాజ్యాలు బాగా నష్టపోయాయి. పేదరికం వలసవిధానపు వారసత్వమని విజ్ఞులు వర్ణించారు. తృతీయ ప్రపంచంలోని చాలా రాజ్యాలు రాజకీయ విమోచనం పొందినప్పటికీ, ఆర్థిక అశక్తత వల్ల అవి పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన మొదటి ప్రపంచ రాజ్యాలపై ఆధారపడుతున్నాయి. పర్యవసానంలో వాటి సార్వభౌమత్వం నామమాత్రమై పోయింది. తృతీయ ప్రపంచ దేశాల ప్రధాన సమస్య బీదరికం. ఇందుకు జనాభా పెరుగుదల ప్రధాన కారణం. తృతీయ ప్రపంచంలోని 18దేశాలలో జనాభా పెరుగుదలకు తగ్గట్టుగా ఆహారోత్పత్తి జరగటం లేదు. వ్యవసాయమే ప్రధానమైనప్పటికీ కొన్ని రాజ్యాలు కొంత పారిశ్రామికాభివృద్ధిని సాధించాయి. అయితే కొన్ని రాజ్యాలు తమ పారిశ్రామికాభివృద్ధికి పశ్చిమ రాజ్యాల అభివృద్ధి వ్యూహాలనే అనుసరిస్తున్నాయి. మూడవ ప్రపంచంలోని చాలా రాజ్యాల భౌగోళిక స్వరూపానికి వలస వాదమే ప్రధాన కారణం. స్వలాభాపేక్షతోనే సామ్రాజ్యవాద దేశాలు వలసలను సృష్టించాయి. ఈ వలసల ఏర్పాటులో పూర్వపు భాగాలలోని ప్రజలప్రమేయం లేకుండా కొత్త ప్రాదేశిక సరిహద్దులను ఏర్పరిచాయి. ఈ విధంగా చేయటం వలన కొత్తగా స్వాతంత్ర్యం పొందిన దేశాలు సమైక్యతా సాధనను ప్రధాన సమస్యగా ఎదుర్కోవాల్సి వస్తున్నది. సుదీర్ఘ వలస పాలన వల్ల చాలా దేశాలు తమ వలస పాలకుల రాజకీయ వ్యవస్థలనే రూపొందించుకున్నాయి. ఇందువల్ల సంప్రదాయ విధేయతలు తీవ్ర విఘాతానికి గురి అయ్యాయి. మూడవ ప్రపంచ దేశాలలో రాజకీయ చైతన్యం చాలా తక్కువ స్థాయిలో ఉండటం కూడా ఒక సమస్య అయిపోయింది. అగ్రదేశాలు అందించే సైనిక సహాయం కూడా తృతీయ ప్రపంచ రాజ్యాలు ఎదుర్కొంటున్న సమస్యలలో ఒకటి. అంతేకాక చాలా దేశాలలో సైనిక వ్యయం పెరుగుతున్నది. విదేశాల నుండి లభిస్తున్న సహాయం దేశంలోని వనరులలో చాలా భాగాన్ని సైనిక వ్యయం ఆక్రమించటంలో, అభివృద్ధి పనులు సవ్యంగా జరగటం లేదు. దీనికి తోడు అగ్రరాజ్యాల ప్రాబల్య పోటీకి మూడవ ప్రపంచ రాజ్యాలు యుద్ధ భూములుగా మారుతుండటాన్ని గమనించాల్సి ఉంది. తృతీయ ప్రపంచ దేశాలు తమ మధ్య సఖ్యతకు వివిధ సంస్థలను ఏర్పరచు కొన్నప్పటికీ, అవి అగ్రరాజ్యాల రాజకీయ చదరంగంలో పావులుగానే మారుతున్నాయి.

పైన వివరించిన సమస్యలతో పాటు తృతీయ ప్రపంచ రాజ్యాలు నయా వలస వాద సమస్యను కూడా ఎదుర్కోవాల్సి వస్తున్నది. రెండవ ప్రపంచ యుద్ధపరిసమాప్తితో సామ్రాజ్యాలు అంతరించాయి. దానితో పాటు వలస వాదం అంతరించింది. ప్రత్యక్ష వలస పాలన పోయింది. బలవత్తర దేశాలు ప్రపంచ రాజకీయాలలో తృతీయ ప్రపంచ రాజ్యాలకు సమాన అవకాశాలు ఉండరాదని, ప్రపంచ సంపదలో వాటికి న్యాయమైన పంపిణీ జరగరాదని భావిస్తున్నాయి.

BRAOU

ఇది ఆర్థిక,దౌత్య పద్ధతుల ద్వారా తృతీయ ప్రపంచ రాజ్యాలను అదుపు చేయాలని ప్రయత్నిస్తున్నాయి. వలస రాజ్యాల నుండి విముక్తి పొంది స్వతంత్ర రాజ్యాలుగా అవతరించిన పూర్వపు వలసలు పరోక్షంగా ఇతర దేశాల రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సైనిక, సాంకేతిక శక్తుల అజమాయిషీకిలోను కావడం వల్ల వాటి రాజకీయ స్వాతంత్ర్యం లాంఛనప్రాయమై పోయింది. నిరంతరం ఆర్థికంగా ఆధారపడేటట్లు చేయడం, ఆర్థిక వర్గాలు ఏర్పడటం, భారీ పెట్టుబడుల ద్వారా దొడ్డిదారిన ఆర్థికరంగంలో ప్రవేశించటం, అప్పులు, సహాయాలు, అసమాన మారకపు రేట్లు మొదలైన మార్గాల ద్వారా పూర్వపు వలసలను తమ ఆధిపత్యంలో ఉంచుకోవటానికి సామ్రాజ్యవాద దేశాలు ప్రయత్నిస్తున్నాయి. ఇవే నయా వలస విధానపు ప్రధాన లక్షణాలు. అభివృద్ధి చెందుతూ ఉన్న దేశాల బలహీనతలే నయా వలస వాదం ఆవిర్భవించడానికి ప్రధాన కారణం. పూర్వపు వలస విధానం ఇప్పుడు లేదు. కొత్తగా స్వాతంత్ర్యం పొందిన తృతీయ ప్రపంచ రాజ్యాలు, పాత అంతర్జాతీయ ఆర్థిక చట్రంలోనే పనిచేస్తున్నాయి. ప్రత్యక్షంగాను, పరోక్షంగాను కొత్తదేశాల ఆర్థిక వ్యవస్థలను పాశ్చాత్య పారిశ్రామిక దేశాలు నియంత్రిస్తున్నాయి. ఈ బడుగు దేశాలు ఆర్థిక సంబంధాలలో సమానత్వం కొరకు పారిశ్రామికీకరణ చెందిన దేశాలపై ఆధారపడకుండా ఉండే నిమిత్తం కొత్త ఆర్థిక వ్యవస్థను కోరుకుంటున్నాయి. అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు అందించే సహాయం వల్ల ఆయా దేశాల్లో ఆర్థిక సమానతలు ఏర్పడటమేగాక అవి నిరంతరం సామ్రాజ్య వాద దేశాలపై ఆధారపడేందుకు తోడ్పడుతున్నాయి. ఎన్నో షరతులతో ఇస్తున్న ఆర్థిక సహాయాలు, సంపన్న దేశాల విదేశ విధానాల లక్ష్య సాఫల్యానికి ఆయుధంగా ఉపయోగపడుతున్నాయి. ఇవి గాక సంపన్న దేశాల వాణిజ్య సంస్థలు సరిహద్దులను దాటి అంతర్జాతీయంగా అనేక రాజ్యాలతో వ్యాపార సంబంధాలు పెట్టుకొంటున్నాయి. వీటిని బహుళ జాతి సంస్థలంటున్నా కేంద్రీకృతమైన మార్గ దర్శకత్వం బహుళ జాతి సంస్థల ప్రధాన లక్షణం. వివిధదేశాలలో అధిక లాభాలు ఆర్జించటమే వాటి ధ్యేయం. తృతీయ ప్రపంచంలోని సార్వభౌమ రాజ్యాల ఆదాయాలకన్నా ఈ బహుళజాతి సంస్థల ఆదాయం ఎక్కువగా ఉంటున్నది. ఇవి ఆయా రాజ్యాల ప్రభుత్వ విధాన నిర్ణయాలను ఎంతగానో ప్రభావితం చేస్తున్నాయి. ఇవి ఆయా రాజ్యాలలోని స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానం వాటికి తగిన స్థాయిలో ఉపయోగపడకుండా చేస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలలో లభించే శిక్షణ సాంకేతిక పరిజ్ఞానాలను వెనుకబడిన దేశాలు సమకూర్చుకో లేవు. పర్యవసానంలో మూడవ ప్రపంచ దేశాలనుండి మేధావులు సంపన్న దేశాలకు వలస వెళ్ళుతున్నారు. నయా వలస విధానం మూడవ ప్రపంచ దేశాలు శాశ్వతంగా వెనుకబడిన దేశాలుగా కొనసాగేందుకు దోహద పడుతున్నది.

అభ్యాసం

"తృతీయ ప్రపంచం" అనే భావనను వివరించండి ?

BRAOU

## 21.8 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

★ ఇరవయ్యోశతాబ్దంలో అంతర్జాతీయ రంగంలో దోపిడీకీ, ఆర్థిక అసమానతలకూ అవకాశం లేని అంతర్జాతీయ సమ సమాజాన్ని స్థాపించటానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.

★ సమకాలీన ప్రపంచంలో అత్యంత ప్రాచుర్యాన్ని పొందిన భావన జాతీయ రాజ్య వ్యవస్థ. అంతర్జాతీయ, విశ్వమానవ దృక్పధాలు ఓ వైపు కొనసాగుతున్నా జాతీయ రాజ్య భావనవైపు ప్రజలు మొగ్గు చూపుతుండటం గమనార్హం.

★ ప్రపంచ యుద్ధకాలంలోకలిసి పనిచేసిన అమెరికా రష్యాలు ప్రపంచ ప్రాబల్యం అనంతరకాలంలో పోటీ పడ్డాయి. వీటి మధ్య ఉద్రిక్తతలను, సంఘర్షణలను 'ప్రచ్ఛన్న యుద్ధం' అనే పదంతో సూచించడం ప్రారంభమైంది.

★ అలీన విధానం ప్రాచుర్యంలోకి రావటానికి భారతదేశం ఎంతో కృషిచేసింది. అంతర్జాతీయ రాజకీయాల మార్పుల కనుగుణంగా అలీన విధాన ధ్యేయాలలోనూ మార్పులు వస్తూఉన్నాయి.

★ నానాజాతి సమితి తన విధుల్ని నిర్వర్తించలేకపోయిన తరుణంలో కొత్తగా ఐక్యరాజ్య సమితిని రూపొందించారు. ఐక్యరాజ్యసమితి కేవలం రాజకీయ కార్యకలాపాలకేకాక, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక విధుల్ని కూడా నిర్వహిస్తోంది.

★ ప్రపంచ శాంతికి నిరాయుధీకరణ సూత్రం తప్పని సరి అని గ్రహించిన దేశాలు ఆయుధ నియంత్రణకు సుముఖత తెల్పక తప్పని పరిస్థితి ఏర్పడింది.

★ తృతీయ ప్రపంచ రాజ్యాలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల్లో బీదరికం, సైనిక న్యాయం, నయా వలస వాదం మేధావుల వలస లాంటివి ఎన్నోఉన్నాయి. ఇవి మూడో ప్రపంచ దేశాలు కలకాలం వెనుకబడిఉండటానికి దోహదకారులుగా ఉన్నాయి.

BRAOU

## 21.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

30 పంక్తుల్లో జవాబులు రాయండి.

1) ద్విధృవ ప్రపంచం అంటే ఏమిటి ? వివరించండి ?

2) తృతీయ ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న సమస్యల్ని విపులీకరించండి.

15 పంక్తుల్లో జవాబులు రాయండి.

1) 'అలీన విధానం' రూపొందించటంలో భారతదేశ కృషిని సమీక్షించండి ?

2) ఆయుధ నియంత్రణ ద్వారా ప్రపంచశాంతి ఎలా సాధ్యమౌతుందో విశదీకరించండి ?

# భాగం-22 భారతదేశం; పరిణామాలు, ధోరణులు

విషయక్రమం


22.0 ఉద్దేశం

22.1 ప్రవేశిక

22.2 రాజ్యాంగ నిర్మాణం

అభ్యాసం

22.3 పార్లమెంటు

అభ్యాసం

22.4 రాష్ట్రపతి

22.5 ప్రధానమంత్రి

22.6 రాజకీయ పార్టీల వ్యవస్థ

అభ్యాసం

22.7 విదేశాంగ విధానం

22.8 తృతీయ ప్రపంచదేశాలు - రాజకీయ వ్యవస్థల స్వభావం

22.9 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

22.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 22.0 ఉద్దేశం

ఈ భాగం చదివింతర్వాత మీరు :

- మన దేశంలో ప్రజాస్వామ్య స్వభావాన్ని వివరించగలుగుతారు.
- రాజ్యాంగ నిర్మాణం గురించి పార్లమెంటు స్వభావం గురించి రాష్ట్రపతి, ప్రధానమంత్రి విధుల గురించి చర్చించ గలుగుతారు.
- మనదేశంలో రాజకీయ పార్టీల వ్యవస్థ తీరుతెన్నులను విశ్లేషించగలుగుతారు.

## 22.1 ప్రవేశిక

భారత రాజ్యాంగ నిర్మాతలు దేశానికి పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థే అత్యుత్తమమైనదని భావించారు. స్వాతంత్ర్య పూర్వ రాజకీయాల నుండి మనకు పార్లమెంటరీ సంస్థలతో పరిచయమున్నందున రాజ్యాంగ నిర్మాతలు పార్లమెంటరీ పద్ధతి వైపు మొగ్గారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి నాలుగు దశాబ్దాలు గడచి ఐదో దశాబ్దం పూర్తికానుంది. ఇప్పటి వరకు మనం పదకొండుసార్లు లోక్‌సభకు ఎన్నికలు జరుపుకొన్నాం. ప్రపంచ దేశాలలో విజయవంతంగా నడుస్తున్న అతిపెద్ద ప్రజాస్వామ్యదేశమనిపించుకున్నాం. భారత ప్రజాస్వామ్యం నిరక్షరాస్యత, పేదరికం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నప్పటికీ, ప్రజలు పెద్ద సంఖ్యలో రాజకీయాలలో భాగస్వాములవుతున్నారు. క్రియారాజకీయాలలో పాల్గొనే పౌరుల సంఖ్య క్రమంగా వృద్ధి చెందుతున్నది. సార్వత్రిక ఎన్నికలలో పాల్గొనే ఓటర్ల సంఖ్య క్రమంగా వృద్ధి చెందుతున్నది. అనేక యూరోపియన్ దేశాల ఎన్నికలలో పాల్గొనే ఓటర్ల సంఖ్యకు తీసిపోని విధంగా, మన దేశపు ఎన్నికలలో ఓటర్లు పాల్గొంటున్నారు. దేశ రాజకీయాలలో చురుకైన పాత్ర నిర్వహించటం అత్యవసరమూ ఆనందదాయకమని ప్రజలు భావిస్తున్నారు. ఇంతకాలం రాజకీయ జీవన స్రవంతికి దూరంగా ఉంటున్న అనేక జాతులు, వర్గాల వారిని రాజకీయాలలో పాల్గొనేటట్లు చేయటానికి ప్రజాస్వామ్యం రాజబాట అవుతుందని ప్రజలు భావిస్తున్నారు.

ప్రజల ఆలోచనా విధానంలో వచ్చిన మార్పులవల్ల, వారు ఒక పటిష్టమైన రాజకీయ శక్తిగా ఆవిర్భవించారు. తాము ఎన్నుకొన్న ప్రభుత్వాలు, వాగ్దానం చేసిన ఆర్థిక సంస్కరణలు అమలు చేయించే వైపు పయనించటం లేదని కూడా భావిస్తున్నారు. మనం రాజకీయ ప్రజాస్వామ్యాన్ని ఏర్పరచుకొన్నాం గాని ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పలేదన్న అభిప్రాయం ప్రబలమై పోతున్నది. ఈ నేపథ్యంలో మనదేశం ఎదుర్కొన్న పరిణామాలనూ, పరిష్కారాలనూ సాధించిన అభివృద్ధిని అధ్యయనం చేయటానికి ప్రయత్నిద్దాం.

BRAOU

## 22.2 రాజ్యాంగ నిర్మాణం

బ్రిటిష్ వారు భారతదేశంలో రాజకీయ ప్రాబల్యం సంపాదించుకొన్న నాటినుంచి, దేశపాలనకు అవసరమైన శాసనాలన్నింటిని బ్రిటిష్‌పార్లమెటు చట్టాల ద్వారా రూపొందిన రాష్ట్రాల శాసనసభలూ కేంద్ర శాసనసభా దేశంలో చట్టాలను చేసి అమలు పరచసాగాయి. రెండవ ప్రపంచ యుద్ధానంతరం దేశంలోని బ్రిటిష్ ఏలుబడి ప్రాంతాలలో ఎన్నికలు జరిగి శాసనసభలు రూపొందాయి. భారతదేశ నాయకులతో ఒకవైపుచర్చలు కొనసాగిస్తూనే, రాజ్యాంగ రూపకల్పనకూ 'రాజ్యాంగసభ' ఏర్పాటుకూ బ్రిటిష్ ప్రభుత్వం అంగీకరించింది. బ్రిటిష్ పాలిత రాష్ట్రాల శాసనసభ్యులతో ఎన్నుకొన్న ప్రతినిధులసభతో భారతరాజ్యాంగసభ ఏర్పడింది.

భారత రాజ్యాంగ సభ తొలి సమావేశాలు 1946 డిశెంబరు 26వ తేదీన ప్రారంభమయ్యాయి. స్వాతంత్ర్యం వచ్చాక భారత యూనియన్‌లో చేరిన సంస్థానాల ప్రతినిధులను కూడా రాజ్యాంగ సభకు నామినేటుచేశారు. రాజ్యాంగసభ సభ్యులలో భిన్న రాజకీయ సంస్కృతులకూ భావాలకూ చెందిన వారున్నారు. సభ్యులలో విప్లవకారులు, సంప్రదాయవాదులు, సామ్యవాదులు, లౌకికవాదులు, మితవాదులు మొదలైన వారున్నారు. పరోక్ష ఎన్నిక నామినేషను

పద్ధతులలో రాజ్యాంగసభ ఏర్పాటైనప్పటికీ, అందులో ప్రాతినిధ్యం పొందని భావం, వర్గం ఏదీ లేదు. పార్టీ విధేయతలతో నిమిత్తం లేకుండా సభ్యులు చర్చలలో పాల్గొని అభిప్రాయాలను వెల్లడించే స్వేచ్ఛను అనుభవించారు. వివిధ రాజ్యాంగ సూత్రాల అంగీకారం విషయంలో నిర్ణయాలన్నీ సర్వాంగీకారసూత్రం ఆధారంగా జరిగాయి. సభ చర్చలలో ఎవ్వరూ ఎన్నడూ పార్టీపరంగా వ్యవహరించలేదు. అధికార పక్షం, ప్రతిపక్షం అన్న విభేదాన్ని ఎన్నడూ ఎవ్వరూ పాటించలేదు. దేశ పరిస్థితులకు అనుగుణంగా అందరికీ ఆమోదయోగ్యమైన రాజ్యాంగాన్ని రూపొందించడాన్ని సభ్యులు తమ ప్రధానవిధిగా భావించారు. రాజ్యాంగసభ సభ్యులలో భిన్నత్వం ప్రతిబింబించినా నెహ్రూ, పటేల్, ఆజాద్, రాజేంద్ర ప్రసాద్‌ల నాయకత్వం ఏకత్వ సాధనలో సామరస్య మార్గాల ద్వారా కృషిచేసి సాఫల్యం సాధించగలిగింది. రాజ్యాంగసభ సభ్యులు అకస్మాత్తుగా వివిధ రాష్ట్రాలనుండి రాజ్యాంగం తయారుచేయటానికి ఆహ్వానితులైన వారుకారు. వారంతా భారత జాతీయోద్యమంలో కాకలు తీరిన యోధులు. పరిపాలన బాధ్యతలను గుర్తెరిగిన పాలకులు. రాజ్యాంగ సభలో కాంగ్రెసువారే ప్రధాన పాత్రను నిర్వహించినప్పటికీ ముఖ్యమైన విధాన నిర్ణయాలలో ప్రజాస్వామ్య పద్ధతులనే పాటించారు. భారత రాజ్యాంగ సభ ఆమోదించిన రాజ్యాంగం ఆనాటి భారత రాజకీయ నాయకుల విజ్ఞతకు ప్రతీక. రాజకీయ స్వాతంత్ర్యం, పౌరస్వేచ్ఛలు, భారత రాజ్యాంగానికి పునాదిరాళ్ళు. రాజ్యాంగసభ ఆరంభ సమావేశంలో ప్రధాని నెహ్రూ రూపొందించి ప్రతిపాదించిన లక్ష్యాల తీర్మానం ఆధారంగా అది రూపొందింది. ఈ తీర్మానం రాజ్యాంగం ప్రవేశికలో ప్రతిబింబిస్తుంది. రాజ్యాంగాన్ని అర్థం చేసుకోవటంలో ప్రవేశిక చాలా సహాయకారిగా ఉంది. ప్రవేశిక రాజ్యాంగం సారాంశం. అది ఒక విధంగా రాజ్యాంగపు తాత్త్విక పునాదులను పునరుద్ఘాటిస్తుంది. రాజ్యాంగ ఉదార ప్రజాస్వామ్య తత్వాన్ని పూర్తిగా ప్రతిబింబిస్తున్నది. వ్యక్తుల స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను మూలమైన భాగంలోపొందుపరచారు. హక్కులకు న్యాయవ్యవస్థ, రక్షణను కూడా కల్పించారు. భారత రాజ్యాగం పార్లమెంటు ఆధిక్యతగల లిఖిత రాజ్యాగం. రాజ్యాంగ సవరణ పద్ధతులలో దృఢ, అదృఢ, పద్ధతులు రెంటినీ పొందుపరిచారు. రాజ్యాంగంలో ప్రతివిషయం విపులంగా ఉన్నందువల్ల అతిపెద్ద గ్రంథం తయారైంది.

సాధారణంగా ఏ దేశపు రాజ్యాంగమైనా దాని రూపకల్పన నాటి సాంఘిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా మారకపోయినట్లయితే అభివృద్ధి కుంటుపడుతుంది. రాజ్యాంగం ఆశించిన సాంఘిక, ఆర్థిక, రాజకీయలక్ష్యాలకోసం రాజ్యాంగాన్ని చాలాసార్లు సవరించాల్సివచ్చింది. ఆశించిన ఫలితాలు రానప్పుడు, ఊహించని ఫలితాలు వచ్చినప్పుడు మన పాలకులు రాజ్యాంగాన్ని సవరించటానికి వెనుకాడలేదు. రాజ్యాంగం అమలులోకి వచ్చిన తొలిరోజుల్లోనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తాము ఊహించని పరిస్థితుల నెదుర్కోవాల్సివచ్చింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితులనుఎదుర్కోవటానికే 1950 లోనే రాజ్యాంగ సవరణలు ప్రారంభమయ్యాయి. మన రాజ్యాంగ సవరణ విధానం దృఢమైనదని కొందరు, అదృఢమైనదని మరికొందరు భావిస్తున్నారు. ఒక రకంగా మన రాజ్యాగం సవరణ పద్ధతి దృఢత్వం, సరళతల సమ్మేళనం. ఇలాంటి సమ్మిళిత రాజ్యాంగ సవరణ విధానం ప్రపంచంలో మరెక్కడా లేదని కొందరు రాజ్యాంగ నిపుణుల అభిప్రాయం. ఇప్పటి వరకు భారత రాజ్యాంగాన్ని చాలాసార్లు సవరించారు. ఇతర దేశాల రాజ్యాంగాలతో పోల్చినప్పుడు మనదేశ రాజ్యాంగాన్ని ఎక్కువసారులు సవరించినట్లే. రాజ్యాంగంలోని దాదాపు 200 ప్రకరణలు సవరణలకు గురి అయ్యాయి. షెడ్యూళ్ళను చేర్చారు. రాజ్యాంగ ప్రవేశిక కూడా సవరణలకు లోనైంది. రాజ్యాంగ సవరణాధికారాన్ని, పద్ధతిని వివరించే ప్రకరణం కూడా మూడుసార్లు సవరణకు గురైంది.

BRAOU

**అభ్యాసం**

రాజ్యాంగ సవరణలు ఎందుకు చేయాల్సివస్తుంది?

## 22.3 పార్లమెంటు

ప్రజా ప్రతినిధులకు ప్రభుత్వ బాధ్యత; నియమిత కాలానికి పాలితుల ఆమోదం పాలకుల అధికారానికి ప్రాతిపదిక అన్న భావాలే పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రధానమైన పునాదులు . సుదీర్ఘ చారిత్రక పోరాటాల ఫలితంగా బ్రిటన్‌లో పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ స్వరూపాన్ని సంతరించుకొంది. రాత పూర్వకం కాని బ్రిటిష్ రాజ్యాంగం పార్లమెంటు నిర్మితికి ప్రాతిపదిక. బ్రిటిష్ పార్లమెంటుకు సర్వసత్తాకమైన సార్వభౌమాధికారాలు ఉన్నాయి. అక్కడి పార్లమెంటు అధికారాలకు ఎలాంటి అడ్డంకులూ నియంత్రణలూ లేవు. సంప్రదాయాలను మన్నించటం పట్ల బ్రిటిష్ వలస పాలనకు వారసత్వంగా, వారు భారతదేశ పరిపాలనకు ప్రసాదించిన వరాలమూటగా పార్లమెంటరీ వ్యవస్థ మనదేశంలో రూపొందింది. పశ్చిమ దేశాల ఉదారవాద ప్రభావమే బ్రిటిష్ పార్లమెంటరీ సంస్థల ఏర్పాటుకు మన జాతీయ నాయకులను ప్రోత్సహించింది. దేశంలో రూపం దాల్చి ఉన్న పార్లమెంటరీ వ్యవస్థతో భారత జాతీయ నాయకులుకు గల పరిచయం పార్లమెంటు సంస్థ రూపకల్పనకు ప్రోత్సాహాన్నిచ్చింది. అయితే బ్రిటన్లో, మనదేశంలో పార్లమెంటరీ వ్యవస్థలు రూపొందిన చారిత్రక, సామాజిక, సాంస్కృతిక నేపథ్యాలు ఒకే విధమైనటువంటివి కావు. భారతదేశంలోని పార్లమెంటు అత్యున్నత ప్రాతినిధ్య శాసనవర్గంగా రూపందాల్చింది. పార్లమెంటులోనే ప్రజల అధికారమంతా నిక్షిప్తమై ఉంది. అది భారత ప్రజాభిప్రాయవేదిక. పార్టీల రాజకీయాల వీరంగాల రంగస్థలం. బ్రిటిష్ పార్లమెంటు సంప్రదాయాలను వారసత్వంగా స్వీకరించటంతో పాటుగా భారతదేశపు పార్లమెంటు తనదైన కొన్ని కొత్త సాంప్రదాయాలను నెలకొల్పుకున్నది. ప్రతిరోజూ పార్లమెంటు సమావేశాలు ''ప్రశ్నోత్తరాల గంట'' తో ప్రారంభమవుతాయి. దీని తరువాత అంగీకృతమైన ఎజెండా విషయాల చర్చను పార్లమెంటు చేపడుతుంది. ప్రశ్నోత్తరాల గంట అయిపోయాక, అంగీకృత ఎజెండా విషయాల చర్చను ప్రారంభించటానికి ముందుగల సమయంలో పార్లమెంటు సభ్యులు అత్యవసర ప్రజాసమస్యలను ప్రస్తావించే సంప్రదాయం నెలకొన్నది. ఈ సమయాన్ని పత్రికా ప్రపంచం ''శూన్య సమయం'' (zero hour) గా వ్యవహరిస్తున్నది. దీనికి పార్లమెంటులో అధికారికమైన గుర్తింపులేదు. కానీ సభ్యులు ఆ సమయాన్ని ఒక

BRAOU

అవకాశంగా వినియోగించుకొంటున్నారు. ఇలాంటి ప్రయత్నాలవల్ల పార్లమెంటు ఇతర విషయాలకు కేటాయించిన సమయం వృధా అయ్యే అవకాశాలున్నాయి. చాలా సందర్భాలలో శూన్య సమయంలో లేవనెత్తిన సమస్యల చర్చకు చాలా సమయం పట్టి ఇతర విషయాల చర్చలకు అవకాశాలు తగ్గటాన్ని మనం గమనించవచ్చు.

మనదేశపు పార్లమెంటులో లోక్‌సభ, రాజ్యసభ అనే రెండు సభలున్నాయి. సాధారణ మెజారిటీ పద్ధతిన భారత పౌరులు ఓటర్లుగా నమోదు అయి లోక్‌సభ సభ్యలను ఎన్నుకొంటారు. రాష్ట్రాల శాసన సభలు రాజ్యసభకు ప్రతినిధులను ఎన్నుకొంటాయి. రాష్ట్రపతి ఆహ్వానం మేరకు ఉభయ సభల సమావేశాలు జరుగుతుంటాయి. సభ్యులకు పార్టీల ప్రతిపాదికన సీట్లు కేటాయింపు అవుతాయి. పార్లమెంటులో సభ్యులు తమస్థానం నుండే ప్రసంగించాల్సి ఉంది. భారత ఉపరాష్ట్రపతి రాజ్యసభకు అధ్యక్షులుగా వ్యవహరిస్తారు. లోక్‌సభ సభ్యులు తమలో ఒకరిని స్పీకరుగా ఎన్నుకొంటారు. బ్రిటిష్ కామన్స్ సభలో స్పీకరుకు "ఒకసారి స్పీకరు అయితే ఎల్లప్పుడూ స్పీకరే" అన్న సంప్రదాయం ఉంది. అక్కడ స్పీకరు ఏ పార్టీకీ చెందిఉండడు. అతనిని అందరూ ఏకగ్రీవంగా ఎన్నుకొంటారు. మనదేశంలో ఆ సంప్రదాయం లేదు. స్పీకరు పదవి మనదేశంలో తనదైన ప్రత్యేకతను ఏర్పరచుకోలేదు. పార్టీఫిరాయింపులు చేసే సభ్యులను గుర్తించే అధికారం స్పీకరుకు ఉంది. పర్యవసానంలో స్పీకరు పదవి చాలాసార్లు వివాదంలోకి వచ్చింది.

పార్లమెంటు సభలకూ, సభ్యులకూ కొన్ని హక్కులు, గౌరవాలు, మర్యాదలు ఉన్నాయి.వీటిని రాజ్యాంగం నిర్వచించలేదు. సభలో సభ్యులు చేసిన ప్రసంగాలను సభ వెలుపల ప్రశ్నించే అధికారం ఎవరికీ లేదు. సభ సమావేశమౌతున్నప్పుడు ప్రభుత్వం ప్రధాన నిర్ణయాలను సభలోనే ప్రకటించాలి. కాని సభ వెలుపల ప్రకటించరాదు. సభలో స్పీకర్ అధికారి. అతని ఆజ్ఞలనే అందరూ పాటించాల్సి ఉంది. సభలో జరిగిన చర్చను కించపరచే విధంగా వ్యాఖ్యానిస్తూ ప్రకటించే అధికారం ఎవ్వరికీ లేదు. పార్లమెంటులోని ఉభయ సభలకూ కొన్ని స్థాయి సంఘాలు ఉన్నాయి. వీటి ద్వారా సభా కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. కొన్ని ప్రత్యేక విషయాల పరిశీలనకు ప్రత్యేక సంఘాలను సభలు నియమిస్తాయి. కొన్ని విషయాలపై రెండు సభల సంయుక్త సంఘాలను కూడా ఏర్పరచే సంప్రదాయం ఉంది. వీటినే 'జాయింట్ పార్లమెంటరీ కమిటీలు' అని వ్యవహరిస్తున్నారు.

దేశంలోని వివిధ సామాజిక శక్తుల ప్రతిబింబాల స్వరూపమే రాజకీయ నిర్మితులను, వాటి వ్యవహారాలను, వ్యవహార సరళిని ప్రభావితం చేస్తూఉంటుంది. పార్లమెంటు సభ్యులు ప్రభుత్వ వ్యవహారాలను సునిశితంగా పరిశీలిస్తూ, లోపాలను గుర్తించి సవాలు చేయగల ప్రతిభను కలిగి ఉండాలి. ప్రభుత్వ వ్యవహారాల సమాచారాన్ని సదా తెలుసుకొంటూ ఉండాలి. ఇలాంటి ప్రతిభా శక్తులు కొంతమందికి జన్మతః సిద్ధిస్తాయి. మరికొందరికి అనుభవ, విజ్ఞాన, వృత్తి, ప్రవృత్తుల ద్వారా లభిస్తాయి. పార్లమెంటు సభ్యులకు ధారాళమైన భావ వ్యక్తీకరణ, పాలన, నిర్వహణ, నైపుణ్యాలుచాలా అవసరం. 1952 నుండి వివిధ లోక్ సభలలో సభ్యులుగా ఉన్నవారిని పరిశీలించినప్పుడు వయోవృద్ధులే అధిక సంఖ్యలో ఉన్నట్లుగా విదితమవుతున్నది. యువకులకు ప్రాధాన్యం కల్పించాలని అన్ని రాజకీయ పార్టీలు బహిరంగంగా ప్రకటిస్తున్నప్పటికీ వాస్తవంలో యువ సభ్యుల సంఖ్య ఎదుగుదల వైపు సాగటం లేదు. సభ్యుల విద్యార్హతల విషయంలో నానాటికి ప్రగతి కనిపించటం గమనించదగిన విషయం. పార్లమెంటు సభ్యులలో రాజకీయాలు వృత్తిగా గల వారి ఆవిర్భావం, పెరుగుదలలను మనం ప్రధానాంశంగా పేర్కొనవచ్చును. ఓటర్లలో సగం మంది స్త్రీలే అయినప్పటికీ "లోక్‌సభ" లలో వారి ప్రాతినిధ్యంలో గణనీయమైన వృద్ధి కానరావటం లేదు.

BRAOU

సంవత్సరంలో కొద్ది కాలం మాత్రమే పార్లమెంటు సమావేశాలు జరుగుతాయి. సమావేశాలలో పాల్గొనటానికి సభ్యులకు అనేక సౌకర్యాలు కల్పించటమైంది. అయినప్పటికీ, దైనందిన సమావేశాలలో హాజరయ్యే సభ్యుల సంఖ్య గణనీయంగా లేదు. ఏదో వివాదాస్పదమైన అంశం మీద చర్చ జరుగుతున్నప్పుడు, ఓటింగు జరగాల్సివచ్చినప్పుడు మాత్రమే సభ్యులు హాజరు విషయంలో దృష్టిని కేంద్రీకరిస్తున్నారు. చాలా సందర్భాలలో సభలో కోరం లేకుండానే ప్రధానమైన విషయాలపై చర్చలు జరిగి నిర్ణయాలు తీసుకోవడాన్ని మనం గమనించవచ్చు. సభా హక్కులను మర్యాదలను వినియోగించుకోవటంలో కొంతమంది పార్లమెంటు సభ్యులు అనుసరిస్తున్న వ్యవహార సరళి పట్ల ప్రజలలో అపోహలు పెరిగి పార్లమెంటు ప్రాధాన్యత గురించి పునరాలోచించటం ప్రారంభమైంది. దేశంలో వ్యవసాయ వృత్తిగల గ్రామీణ ప్రజానీకమే అత్యధికంగా ఉన్నప్పటికీ, ప్రాతినిధ్యం వహిస్తున్న సభ్యుల సంపన్న జీవన సరళి, ప్రజల నుండి వారిని దూరం చేస్తున్నది. పార్లమెంటు సమావేశాలలో వాగ్యుద్ధాలకు తలపడటం, నినాదాలు చేయటం, హేళనలు చేయటం, పార్లమెంటేతర పద్ధతులైన ధర్నాలు చేయటం, స్పీకరు ముందు బైఠాయించటంలాంటి ప్రవర్తనల వల్ల ప్రజలలో పార్లమెంటు పట్ల గల భక్తి విశ్వాసాలు సడలుతున్నాయి. యథార్థంలో పార్లమెంట్ అధికార హీనమైన సంస్థ. దానికి స్వంతంగా చర్య చేపట్టే అధికారం కాని, చొరవ తీసుకొనే అధికారం కాని లేదు. మంత్రి వర్గం సలహామేరకే రాష్ట్రపతి పిలిస్తేనే పార్లమెంట్ సమావేశమౌతుంది. రాష్ట్రపతి సంతకం చేస్తేనే గాని పార్లమెంట్ ఆమోదించిన బిల్లులకు శాసన రూపం చేకూరదు. మంత్రి వర్గపు చర్యలేకుండా పార్లమెంట్ ఏమీ చేయదు. పార్లమెంట్ ఆమోదం లేకుండానే, మంత్రి వర్గానికి మెజార్టీ సభ్యుల మద్దతు ఉన్నంతకాలం, మొదట చర్యలు చేపట్టి ఆ తరువాత పార్లమెంటు ఆమోదానికి నివేదించి మెజారిటీ సభ్యుల మద్దతుతో ఆమోదం పొందవచ్చు. ఆర్డినెన్సుల ద్వారా శాసనాలు చేసి వాటిని తమ మెజారిటీతో పార్లమెంటు ఆమోదించేటట్లుగా మంత్రి వర్గాలు వ్యవహరిస్తున్నాయి. ఇందువల్ల కొన్ని విషయాలలో పార్లమెంటు ఆమోదం కేవలం చర్చలకే పరిమితమై నామమాత్ర విషయంగా మారింది. భారతదేశంలో పార్లమెంటు సార్వభౌమాధికారం కేవలం దానికి నివేదించిన విషయాలను చట్ట బద్ధం చేయటానికే పరిమితమైపోయింది. శాసన నిర్మాణ అధికారాన్ని వివిధ సామాజిక, ఆర్థిక సాంస్కృతిక వర్గాలు, రాజకీయ పార్టీలు, ప్రభావ వర్గాలు ఉద్యోగి స్వామ్యానికి పార్లమెంటుకు ధారాదత్తం చేశాయి. పార్లమెంటులోని చర్చలన్నీ పాలకపార్టీ ప్రతిపక్ష పార్టీలకే పరిమితమైపోతున్నవి. పార్టీలకు చెందకుండా ఉన్న స్వతంత్ర సభ్యుల పాత్ర గణనీయమైందిగా లేదు. అయితే పార్లమెంట్ ప్రభావం క్షీణత చెందుతూ కార్యనిర్వాహక వర్గపు ప్రాధాన్యత పెరగటమన్నది ప్రపంచ వ్యాప్తంగా పరిణమిస్తున్న ధోరణి. దేశంలో రెండు రాజకీయ పార్టీల వ్యవస్థ నెలకొనకపోవటం, పార్టీల వ్యవస్థ పటిష్ఠతను సంతరించుకోక పోవటం, పార్టీలలో క్రమశిక్షణాలోపం, రాజకీయ ఫిరాయింపులు, నిరక్షరాస్యత, లంచగొండితనం, రాజకీయ నాయకుల నైతికపతనం మొదలైన అంశాలన్నీ పార్లమెంట్ సార్వభౌమాధికార క్షీణతకు దోహదం చేస్తున్నాయన్నది అందరికీ తెలిసిన విషయం. రాజకీయ పార్టీలు సిద్ధాంతాలకన్నా రాజకీయ అవసరాలకే ప్రాధాన్యతం ఇస్తున్నాయి.

పార్లమెంటరీ ప్రజాస్వామ్య విజయానికి అత్యున్నతమైన బాధ్యతా భావం, రాజ్యాంగ నైతికత చాలా అవసరం. అధికారంలో ఉన్న పాలక పార్టీ, ప్రతిపక్ష స్థానంలో ఉన్న పార్టీలు రాజకీయ క్రీడను నియమబద్ధంగా నిర్వహించాల్సి ఉంటుంది. మొట్టమొదటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ తాను నాటిన పార్లమెంటరీ ప్రజాస్వామ్యమనే మొలకను పెంచి పోషించటానికి ఎక్కువ శ్రద్ధాసక్తులు ప్రదర్శించారు. ఆయన పార్లమెంటు సమావేశాలకు ఎప్పుడూ గైరు హాజరు అయ్యేవారు కారు. సభా మర్యాదలను పాటించేవారు. ప్రతిపక్ష నాయకుల చర్చలను, విమర్శలను

BRAOU

వినటానికి సదా సిద్ధంగా ఉండేవారు. తోటి మంత్రులు సమాధానాలు ఇవ్వటంలో వెనుక ముందాడినప్పుడు వెనుదిరిగి కనుసైగల ద్వారా ఆదేశించేవారు. ఆయన పార్లమెంటును ప్రజల అధికారానికి వివేకానికి ప్రతినిధిగా భావించేవారు. ఆయన కాలంలో ప్రతిపక్షం చాలా బలహీనంగా ఉండేది. మెజారిటీ సభ్యుల మద్దతు తనకు ఉన్నప్పటికీ నెహ్రూ ఎన్నడూ పార్లమెంటరీ సంప్రదాయాలను గాని, నియమ నిబంధనలను గాని అగౌరవ పరచలేదు. విధిగా పార్లమెంటు సమావేశాలకు హాజరయ్యే ఆయన స్వభావం ఇతర సభ్యుల మీద అమితంగా ప్రభావం కనబరచింది.

అభ్యాసం

శూన్య సమయం అంటే ఏమిటి?

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

## 22.4. రాష్ట్రపతి

భారత రాజ్యాంగం ఏర్పరచిన వ్యవస్థలో రాష్ట్రపతి పదవి చాలా ప్రధానమైంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు అనుగుణంగా భారత రాష్ట్రపతి పదవిని నిర్దేశించారు. వంశపారంపర్యపు వారసత్వంగా బ్రిటిష్ సార్వభౌముడు బ్రిటన్ దేశాధినేత. ప్రజల ప్రతినిధులు ప్రత్యేక పద్ధతిలో భారత రాష్ట్రపతిని ఎన్నుకొంటారు. మన దేశపు రాష్ట్రపతికి బ్రిటిష్ సార్వభౌమునికి మించిన అధికారాలున్నాయి. ఎన్నికల నియంత్రణ పర్యవేక్షణలలో భారత రాష్ట్రపతి పదవికి ఎన్నిక జరుగుతుంది. ఎన్నికైన పార్లమెంటు సభ్యులు, వివిధ రాష్ట్రాల శాసన సభలకు ఎన్నికైన ప్రజాప్రతినిధులు కలిసి రాష్ట్రపతిని ఎన్నుకొంటారు. భారత రాష్ట్రపతి ఎన్నికలో భారతీయ పౌరులకు ప్రత్యక్ష భాగస్వామ్యం లేదు. ప్రజలచే ఎన్నికైన ప్రజా ప్రతినిధులు ఎన్నికలో పాల్గొంటారు. ఈ ఎన్నిక విధానం రాష్ట్రపతిని ఒక పార్టీ లేక ఒక ప్రత్యేక నియోజక వర్గ ప్రతినిధిగా గాక, యావత్ జాతి ఎంపిక చేసిన ప్రతినిధిగా రూపొందిస్తున్నది. వీటన్నింటికంటే ముఖ్యం, భారత రాష్ట్రపతి ఎంపికలో రాష్ట్రాలు భాగస్వాములు కావటం. రాష్ట్రపతి పదవీకాలం ఎన్నికైన నాటినుంచి ఐదేండ్లు. పదవీకాలం ముగియక ముందు కేవలం "మహాభియోగం" (impeachment) ద్వారా మాత్రమే పదవినుండి తొలగించేవీలున్నది. రాష్ట్రపతిని తొలగించే మహాభియోగంతో రాష్ట్రాల శాసనసభలకు ఎలాంటి సంబంధం లేదు. రాష్ట్రపతికి గల సాధారణ, అసాధారణ అధికారాలను ఆయన స్వయంగా ఇష్టం వచ్చినట్లు నిర్వహించే వీలులేదు. ప్రతి అధికారం ఉపయోగం విషయంలోను రాష్ట్రపతి తన మంత్రిమండలి సలహాననుసరించే వ్యవహరించాల్సి ఉంది.

BRAOU

రాష్ట్రపతి కోరినప్పుడు సమాచారం అందించాల్సిన బాధ్యత ప్రధానమంత్రిది. ఏ సమాచారం అందివ్వాలో పర్యవసానాలను ఆలోచించి రాష్ట్రపతికి సమాచారం అందించే అధికారం ప్రధాన మంత్రికి ఉంది. ప్రధాన మంత్రి సమర్పించిన సమాచారానికి మించి అడగటానికి రాష్ట్రపతికి అధికారం లేదు. ప్రభుత్వ కార్యకలాపాలన్నీ రాష్ట్రపతి పేరు మీదుగానే నడిచినా ప్రతి విషయంలోనూ ప్రధానమంత్రే పార్లమెంటుకు బాధ్యత వహిస్తారు. రాష్ట్రపతి తన సలహాల ద్వారా, వివేచనాధికారాల ద్వారా, మంత్రిమండలిని ప్రభావితం చేయాలని రాజ్యాంగం భావన. కొన్ని విషయాలలో రాష్ట్రపతి మంత్రిమండలి సలహా పొందకుండానే వ్యవహరించవచ్చు. మంత్రి మండలి నిర్ణయాలను పునః పరిశీలించాల్సిందిగా కోరవచ్చు. ప్రధానమంత్రి నియామకంలో కూడా రాష్ట్రపతి స్వేచ్ఛగా వ్యవహరించలేడు. మెజారిటీ పార్టీ నాయకునిగాని, లేదా లోక్‌సభ విశ్వాసాన్ని చూరగొనగలడన్న వ్యక్తిని గాని రాష్ట్రపతి ప్రధానమంత్రిగా నియమిస్తారు. ప్రధానమంత్రి నియామకంలో కూడా భారత రాష్ట్రపతి స్వేచ్ఛగా వ్యవహరించలేడు. 1989లో, 1990లో, 1991లో, 1996లో ప్రధాన మంత్రులను నియమించినప్పుడు రాష్ట్రపతి వారికి నిర్ణీత గడువులో లోక్‌సభ విశ్వాసాన్ని పొందాలన్న నియమాన్ని పెట్టటం గమనించదగ్గ విషయం. రాజ్యాంగ రీత్యా ప్రధానమంత్రిని నియమించేది రాష్ట్రపతే ఐనప్పటికీ, వాస్తవంలో రాష్ట్రపతి ప్రధానమంత్రి చేతనే పదవిని పొందుతున్నాడనే విమర్శ ఉంది. కేంద్రంలోను, రాష్ట్రాలలోను కాంగ్రెసు పార్టీయే అధికార పార్టీ స్థానమందున్నప్పుడు రాష్ట్రపతి పదవికి కాంగ్రెసు పార్టీ ఎంపిక చేసిన అభ్యర్థి గెలవటమన్నది అందరికీ ముందుగానే తెలిసిన విషయం. ప్రధాన మంత్రికి తన మాట ప్రకారం తన పార్టీని నడిపించగల సత్తా ఉంటుంది. నెహ్రూ, ఇందిరాగాంధీలు, తాము ప్రతిపాదించిన అభ్యర్థులనే పార్టీచేత అంగీకరింపచేసి వారినే రాష్ట్రపతులుగా గెలిపించారు. అందువల్లనే రాష్ట్రపతి ప్రధానమంత్రి మనిషని అంటున్నారు.

భారత రాజకీయాలలో రాష్ట్రపతి హోదా, అంతస్తు విషయంలో ఏకాభిప్రాయం లేదు. రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతి హోదా కేవలం నామమాత్రమని ఒక వాదం ఉంది, అలాకాదు, కొన్ని సందర్భాలలో భారత పార్లమెంటరీ వ్యవస్థలో అత్యంత ప్రాధాన్యం వహిస్తూ ప్రధానమంత్రి నియామకంలో కీలకమైన పాత్ర నిర్వహిస్తాడని మరొకవాదం ఉంది. అయితే భారత రాష్ట్రపతి కేవలం నామమాత్రపు అధికారి అన్న విషయం రాజ్యాంగంలో ఎక్కడా వివరించలేదు. రాజ్యాంగంలో ఇలాంటి స్పష్టమైన వివరణ లేనందువల్లనే రాష్ట్రపతి హోదా స్థాయి విషయంలో వివిధాభిప్రాయాలు వెల్లడి కావడానికి ఆస్కారమేర్పడింది. మంత్రి మండలి లేకుండా ఎంతటి స్వల్ప కాలానికైనా రాష్ట్రపతి పరిపాలన బాధ్యతలను చేపట్టే అవకాశానికి రాజ్యాంగంలో స్థానం లేదు. భారత రాష్ట్రపతి పరిమిత కాలానికి ఎన్నికై రాజ్యాంగ పవిత్రతను పెంచి, పోషించి, కాపాడుతాననీ, భారత ప్రజల సంక్షేమం కొరకు శాయశక్తులా కృషి చేస్తానని అధికారం స్వీకరించే ముందు ప్రమాణం చేస్తారు. ఇలాంటి గురుతరమైన బాధ్యతలను నిర్వహించాల్సిన రాష్ట్రపతి ఎల్లప్పుడూ ప్రధానమంత్రి సలహాను తప్పక పాటించనక్కర లేదని కొందరి అభిప్రాయం. భారత రాష్ట్రపతికి నామమాత్రపు అధికారాలే ఉన్నప్పటికీ ఆయనకు "సలహా, ప్రోత్సాహం, హెచ్చరించే" అధికారాలు ఉన్నాయి. రాష్ట్రపతి మంత్రి మండలికి సలహాదారుడుగా, స్నేహితుడుగా, మార్గదర్శిగా వ్యవహరించాలని కూడా భావించాల్సి ఉంది. అయితే ప్రత్యేక పరిస్థితులలో లేదా అసాధారణ పరిస్థితులలో రాష్ట్రపతి కొన్ని అధికారాలను నిర్వహించాల్సిన అవసరమేర్పడవచ్చు. పార్లమెంటులో ప్రధానమంత్రికి మెజారిటీ సభ్యుల మద్దతు ఉన్నంతకాలం మంత్రి మండలికే సంపూర్ణాధికారాలుంటాయి. ప్రజాస్వామ్య సూత్రాలను విడనాడనంతవరకు తమ ఇష్టం వచ్చినట్లుగా ప్రజలను పాలించే హక్కు మంత్రి మండలికి ఉంది. కాని మంత్రి మండలి ప్రజాస్వామ్య సూత్రాలకు తిలోదకాలు ఇచ్చి అవినీతి, అసమర్థతలకు నిలయమైనప్పుడు,

BRAOU

పార్లమెంటు నిరాసక్తతను ప్రదర్శించిన సందర్భంలో దేశాన్ని అటువంటి ప్రధానమంత్రి, మంత్రి మండలి నుండి రక్షించటానికి రాష్ట్రపతి బాధ్యత వహించే అవకాశాలున్నాయి. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత రాష్ట్రపతిదే కాని ప్రధానమంత్రిది కాదు. రాజ్యాంగాన్ని కాపాడుతానని ప్రమాణం చేసి రాష్ట్రపతి బాధ్యతలను స్వీకరిస్తారు. ప్రధానమంత్రి మంత్రిమండలి రాజ్యాంగానుసారం వర్తించ లేకపోయినప్పుడు రాజ్యాంగ రక్షకుడుగా రాష్ట్రపతి అవసరమైన చర్యలను చేపట్టవచ్చు. రాష్ట్రపతి, ప్రధానమంత్రి ఒక జట్టుగా పనిచేయాల్సి ఉంటుందే కాని, పరస్పరం వ్యతిరేకించుకొనే, విమర్శించుకొనే అధికార కేంద్రాలు కావు. లోక్‌సభ రద్దు విషయంలో కూడా రాష్ట్రపతి తన విచక్షణాధికారాన్ని వినియోగించవచ్చునని కొందరి అభిప్రాయం. కానీ ఇంతవరకు జరిగిన సంఘటనలు ఆధారంగా ప్రధానమంత్రి సలహా లేకుండా లోక్‌సభను రాష్ట్రపతి రద్దు చేయలేదని చెప్పవచ్చు. రాజకీయ రంగంలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకొంటున్న ప్రస్తుత పరిస్థితులలో భారత రాష్ట్రపతి మున్ముందు కీలకమైన పాత్రను నిర్వహించవలసి వస్తుంది.

## 22.5 ప్రధాన మంత్రి

పార్లమెంటరీ ప్రభుత్వ వ్యవస్థలో కార్యనిర్వాహక వర్గం పార్లమెంటుకు బాధ్యత వహిస్తుంది. మంత్రులు వ్యక్తిగతంగాను, సమిష్టి గాను పార్లమెంటుకు బాధ్యత వహిస్తారు. పార్లమెంటరీ తరహా ప్రభుత్వంలో ప్రధానమంత్రి పదవి చాలా ప్రధానమూ, ప్రాథమికమూ అయింది. భారత రాష్ట్రపతి ప్రధానమంత్రిని నియమిస్తారు. ప్రధానమంత్రి సలహా మీద రాష్ట్రపతి ఇతర మంత్రులను నియమిస్తారు. ప్రభుత్వ నిర్ణయాలకు మంత్రులందరూ కట్టుబడి ఉంటారు. వ్యతిరేకించే మంత్రులు ప్రభుత్వం నుండి రాజీనామా చేయాలి. రాజకీయ ఏకత్వం పార్లమెంటరీ లక్షణాలలో అతి ప్రధానమైనంది. ఒకే పార్టీకి లేదా ఒకే విధమైన రాజకీయ లక్ష్యాలు, ఆశయాలు ఉన్నప్పుడే మంత్రివర్గం విజయవంతంగా పనిచేయగలదు. భారత రాజ్యాంగం మంత్రి మండలిని మాత్రమే నిర్దేశించింది. మన రాజ్యాంగంలో "కాబినెట్" అనే పదం లేదు. బ్రిటన్‌లో మాదిరి మన దేశంలో కూడా "కాబినెట్" రాజ్యాంగేతర వృద్ధి, రాజ్యాంగం మంత్రిమండలి సంఖ్య, స్థాయిపై ఎలాంటి నిబంధనలను విధించలేదు. అయితే వ్యవహార రీత్యా మంత్రి మండలిలో కాబినెట్ మంత్రులు, స్టేట్ మంత్రులు, సహాయ మంత్రులు ఉంటున్నారు. ప్రధాన ప్రభుత్వ శాఖలను నిర్వహించే మంత్రులను కాబినెట్ మంత్రులంటున్నారు. వీరే ప్రధానమంత్రి ఆహ్వానం మేరకు మంత్రివర్గ సమావేశాలలో పాల్గొంటుంటారు. స్టేట్ మంత్రులు, ఉప మంత్రులు స్వతంత్రంగా గానీ ఒకరికి లోబడి గానీ తమ కర్తవ్యాలను నిర్వహిస్తుంటారు. వీరు ప్రధానమంత్రి ఆహ్వానిస్తే తప్ప మంత్రివర్గ సమావేశాలకు హాజరు కారు. కాబినెట్ అంటే కొన్ని ప్రధానమైన శాఖలను నిర్వహించే మంత్రుల సముదాయమే. కాబినెట్ సమావేశాలలోనే ప్రభుత్వ విధానాలకు సంబంధించిన అన్ని నిర్ణయాలను తీసుకొంటారు. అత్యవసర సందర్భాలలో ప్రధానమంత్రి తనకు ఇష్టులైన ఇద్దరు లేదా ముగ్గురు మంత్రులతో సమాలోచనలు జరుపుతుంటారు. ఇలాంటి సమాలోచనలు జరపటాన్ని "కిచెన్ కాబినెట్" సమావేశాలని పత్రికా రచయితలు వ్యాఖ్యానిస్తుంటారు. సమగ్రంగా పరిశీలిస్తే ప్రధానమంత్రి మంత్రి మండలికీ, దేశానికీ జీవగర్ర. మంత్రి మండలి నిర్మాణానికీ, మనుగడకీ విడిపోవటానికీ ప్రధానే హేతువు. కేంద్ర ప్రభుత్వానికి ప్రధానమంత్రి మకుటం లేని మహారాజు. మంత్రి మండలిని సౌరకుటుంబంతో పోలిస్తే ప్రధానమంత్రిని సూర్యుడనవచ్చు. సంక్షిప్తంగా చెప్పాలంటే దేశ ఆర్థిక, సామాజిక, రాజకీయ ప్రగతి, శాంతి సమైక్యతలు ప్రధానమంత్రి పైనే ఆధారపడి ఉన్నాయి. ప్రధానమంత్రి నిర్వర్తిస్తున్న అధికారాల వల్ల కాబినెట్ ప్రభుత్వం ప్రధానమంత్రిత్వ ప్రభుత్వంగా మార్పు చెందుతున్నది.

BRAOU

మంత్రుల నియామకం, శాఖల కేటాయింపులలో ప్రధానమంత్రికి సంపూర్ణ స్వేచ్ఛ ఉంటున్నది. ఆయనే మంత్రుల మధ్య సమన్వయ సంబంధాలను పర్యవేక్షిస్తుంటారు. ప్రధాన మంత్రుల వ్యక్తిత్వాలు, ప్రవర్తనలలో తేడాలు ఉన్నప్పటికీ ఈ ప్రధానమంత్రి తీసుకునే నిర్ణయాలపై అప్పటి రాజకీయ పరిస్థితుల ప్రభావాన్ని విస్మరించ వీలులేదు. మనదేశంలో పరిపాలన సాఫీగా జరగటమన్నది ప్రధానమంత్రి శక్తిసామర్థ్యాల మీద ఆధారపడి ఉంది. ప్రభుత్వం సాఫీగా కొనసాగటమన్నది ప్రధాని అధికారాల నిర్వహణపై ఆధారపడి ఉంటుంది. ఇంతవరకు ప్రధానమంత్రి పదవిని అలంకరించిన వారందరు ప్రభుత్వ వ్యవహారాలను సమర్థంగా నిర్వహించారు. వీరందరూ రాష్ట్రపతి, పార్లమెంట్, ప్రతి పక్షాలతో సత్సంబంధాలను కొనసాగించారు. ప్రధానికి రాష్ట్రపతికి అప్పుడప్పుడు భేదాభిప్రాయాలు ఉత్పన్నమైనప్పటికీ అవి ఏవీ రాజ్యాంగ సంక్షోభానికి దారితీయ లేదు.

## 22.6 రాజకీయ పార్టీల వ్యవస్థ

ప్రజాస్వామ్య వ్యవస్థలు సమర్థంగా పనిచేయటానికి రాజకీయ పార్టీలు చాలా అవశ్యకమైనవని అందరూ భావిస్తున్నారు. ప్రజాస్వామ్య ప్రభుత్వాలలో ప్రజలు రాజకీయ భాగస్వాములు కావటంలో రాజకీయ పార్టీలు తోడ్పడుతున్నాయి. రాజకీయ పార్టీలు ఉండటం ప్రజాస్వామ్య ప్రభుత్వాల ప్రధాన లక్షణంగా భావిస్తున్నారు. మన దేశంలో రాజకీయ పార్టీలు ఏర్పడిన పరిస్థితులు పాశ్చాత్య రాజ్యాల పరిస్థితులకు భిన్నం. పాశ్చాత్య రాజ్యాలలో రాజకీయ పార్టీలు ఏర్పడటానికి ఆ దేశాల ప్రజల రాజకీయ ఇష్టానిష్టాలు ప్రధాన కారణాలు. కానీ మన దేశంలో ప్రజాభిప్రాయాన్ని వ్యవస్థీకరించే లక్ష్యంతోనే పార్టీలు రూపం సంతరించుకొన్నాయి. వాస్తవంలో మన దేశంలో రాజకీయ పార్టీల ఆవిర్భావం స్వాతంత్ర్యం లభించాకనే ఆరంభమైంది. స్వాతంత్ర్యం రాకముందు భారత జాతీయ కాంగ్రెసు పవిత్ర గంగానది లాగా అందరినీ కూడగట్టుకొని ఉద్యమించింది. అందులో అన్ని రకాల అభిప్రాయ భేదాలున్నవారూ చేరారు. స్వాతంత్ర్య సముపార్జన దాని లక్ష్యమైంది. అందులో మితవాదులు, అతివాదులు, తీవ్రవాదులు, మతవాదులు, సామ్యవాదులు అందరూ చేరారు. పాశ్చాత్య దేశాలలో "ముఠాలే"రాజకీయ పార్టీలుగా రూపాంతరం చెందాయి. పార్టీలుగా అవతరించాక సమాజంలో గౌరవ ప్రతిపత్తులు సంపాదించుకొన్నాయి. కానీ మన దేశంలో అలాకాదు. రాజకీయ పార్టీలే ముందు ఏర్పాటయ్యాయి. చారిత్రక కారణాల వల్ల జాతీయోద్యమ రథ సారధిగా ఉన్న భారత జాతీయ కాంగ్రెసు సంస్థనుంచే దేశంలోని వివిధ రాజకీయ పార్టీలు అవతరించాయి. మన దేశంలో రాజకీయ పార్టీలకు శాసనబద్ధత ఉంది. రాజ్యాంగంలో ఎక్కడా రాజకీయ పార్టీల ప్రస్తావన లేదు. దేశంలో ఎన్నికలు నిర్వహించటానికి రాజ్యాంగం నిర్దేశించిన ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణలో తోడ్పడేటందుకు రాజకీయ పార్టీలకు గుర్తింపు కలుగచేసింది. దేశ స్వాతంత్ర్యానంతరం భారత జాతీయ కాంగ్రెసు లోక సేవా సంస్థగా రూపొందాలన్నది మహాత్మాగాంధి ఆశయం. కానీ నాయకులు జాతీయ కాంగ్రెసును ఒక రాజకీయ పార్టీగా రూపొందించారు. కాంగ్రెస్‌లో గల ఇతర రాజకీయ భావాల వారు బయటికి వెళ్ళి స్వతంత్రంగా రాజకీయ పార్టీలుగా వ్యవస్థీకరించుకొన్నారు.

భారత దేశంలో గల రాజకీయ పార్టీలు సభ్యుల మీద కన్నా నాయకుల మీదే ఎక్కువగా ఆధారపడుతున్నాయి. అందువల్ల రాజకీయ పార్టీలలో సైద్ధాంతిక విశ్వాసం గల సభ్యత్వం లేకుండా పోతున్నది. ఒక్క భారతీయ జనతాపార్టీ, కమ్యూనిస్టు పార్టీలకు తప్ప మిగతా రాజకీయ పార్టీలకు సైద్ధాంతిక విశ్వాసం, నిబద్ధత గల సభ్యత్వం లేదు. ఫలితంగా పార్టీలలో లక్ష్యాల సాధనకు కావలసిన సమైక్యతా భావం లోపిస్తున్నది. అలాంటి పార్టీలు సార్వత్రిక ఎన్నికలకు ముందు,

BRAOU

కిరాయి సైనికులుగా స్వచ్ఛందంగా చేరే వ్యక్తులను చేర్చుకొని వారి ద్వారా పార్టీ ప్రణాళికలను ప్రచారం చేయిస్తూ ఎన్నిక పోటీలలో నిలుచుంటున్నాయి. పార్టీలకు స్థానిక స్థాయిలో నిబద్ధత గల సభ్యులు ఉండటం లేదు. స్థానిక పార్టీల నిర్మితులలో గూడా నాయకులే ఉంటున్నారు గాని, నిరంతరం పనిచేయగల నిబద్ధతగల పార్టీ కార్యకర్తలు ఉండటం లేదు. ఈ పరిస్థితుల వల్ల పార్టీల సభ్యుల భర్తీలో సర్దుబాట్లు, పార్టీలు ఫిరాయించటం, నిరంతర కార్యక్రమమైంది. రాజకీయ పార్టీల నిర్మితులలో అనిశ్చితత్వం, అస్పష్టత, తాత్కాలికత్వం చోటు చేసుకున్నాయి.

వీటికి తోడుగా రాజకీయ పార్టీలలో వ్యక్తి ప్రాధాన్యం మరో ఆసక్తికరమైన అంశం. దీనినే నాయకత్వ సమ్మోహనశక్తి అని వ్యవహరిస్తున్నారు. చాలా రాజకీయ పార్టీలు వ్యక్తిపరంగానే ప్రాచుర్యంలోకి వచ్చాయి. వాటికి నిర్దిష్టమైన సిద్ధాంతాలు గాని , ప్రణాళికలు గాని లేవు. 1946 నుండి 1964 దాకా నెహ్రూ, 1966 నుండి 1984 దాకా ఇందిరా గాంధీ, 1984 నుండి 1990 దాకా రాజీవ్ గాంధీ వ్యక్తిత్వాలు కాంగ్రెసు పార్టీకి ప్రాతిపదికలయ్యాయి. భారతదేశంలో రాజకీయాలు వ్యక్తిత్వాలతో ప్రభావితమవుతున్నాయని అంటున్నారు. రాజకీయేతర విషయాలు, సంఘటనలు, రాజకీయ పార్టీల ఆవిర్భావ, అంతర్ధానాలకు కారణాలవుతున్నాయి. రాజకీయ పార్టీలకు నిర్దిష్ట సైద్ధాంతిక ప్రాతిపదిక లేకపోవటం ఒక ప్రత్యేక లక్షణంగా కన్పిస్తున్నది. దేశంలోని రాజకీయ పార్టీలన్నీ ప్రజాస్వామ్యం, లౌకిక వాదం, సమసమాజ స్థాపన ప్రధాన ధ్యేయాలని ప్రకటిస్తున్నాయి. ఈ విషయాలలో దేశంలో గల వివిధ పార్టీల మధ్య గల విభేదాన్ని పసిగట్టటం చాలా కష్టమైనపని. ఈ లక్ష్యాల కన్నా లక్ష్య సాధనకు ఉపయోగించే మార్గాలే పార్టీల మధ్య భేదాలకు ప్రధాన కారణాలు. మనదేశపు రాజకీయ పార్టీల వ్యవస్థలో ఎక్కడా వర్గ ధ్రువనం(class polarisation) కన్పించదు. పార్టీలు ఏవీ ప్రత్యేక వర్గాల మీద ఆధారపడి వ్యవస్థీకృతం కాలేదు. అందువల్ల రాజకీయ పార్టీల సామాజిక ప్రాతిపదికలను కనుక్కోవటం కష్టమవుతున్నది. ఒకవిధంగా దేశంలోని రాజకీయ పార్టీల సిద్ధాంతాలలోని ఏకత్వాన్ని మనం గ్రహించగలం కాని వ్యవస్థీకృత నిర్మితులలోని భిన్నత్వాలను తెలుసుకోవటం చాలా కష్టమవుతున్నది. ప్రతి రాజకీయ పార్టీ సామాజిక వర్గాలను రాజకీయం చేస్తూ అధికారం పొందటం కోసం వాటిని తమ అనుకూల వర్గాలుగా మలచుకొంటున్నది. భారతదేశంలోని రాజకీయ పార్టీలు రాజకీయ కారకాల వల్ల, బాహ్య కారకాల వల్ల ప్రభావితమవుతున్నాయే గాని రాజకీయ సిద్ధాంతాల వల్ల మాత్రం కాదు. మిశ్రమ రాజకీయ సంస్కృతిని భారతదేశ రాజకీయ పార్టీల మరో లక్షణంగా చెప్పుకోవచ్చు. మినహాయింపులు లేకుండా దేశంలోగల అన్ని రాజకీయ పార్టీలూ ఒకవైపు కుల, మత వర్గాలతోనూ మరొక పక్క లౌకిక శక్తులతోనూ నిత్యం రాజీ పడటాన్ని మనం గమనించవచ్చు. అవసరాల దృష్ట్యా రాజకీయ పార్టీలు కూటాలను ఏర్పరచుకొంటున్నాయి. ప్రతి ఎన్నికలలోను ఏ పార్టీకీ చెందని స్వతంత్ర అభ్యర్థులుండటం మనదేశంలో సంప్రదాయమైంది. రాజకీయ పార్టీల నుండి అభ్యర్థులుగా ఎంపిక కాలేకపోయినవారు, స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసి గెలుస్తున్నారు. వీరి సంఖ్య ఒక ఎన్నిక నుంచి మరొక ఎన్నికకు క్రమంగా వృద్ధి చెందటం గమనించాల్సిన విషయం.

దేశంలో గల రాజకీయ పార్టీలలో చీలని పార్టీలేదు. ప్రతి పార్టీలోను చీలికలు రావటం సర్వసామాన్య విషయమై పోయింది. చీలికలు ఏర్పడి పాత పార్టీల నుండి కొత్తపార్టీలు అవతరించిన సందర్భాలు అనేకం. పార్టీలో చీలికలకు కారణాలు కూడా అనేకం. చీలికలు లేనప్పుడు గూడా పార్టీలలో అంతర్గతంగా భిన్న భావాలు, ముఠాలు కూడా ఉంటున్నాయి. వీటికి కూడా సైద్ధాంతిక ప్రాతిపదికలు లేవు. మన దేశపు ప్రత్యేక చారిత్రక నేపథ్యం వల్ల పార్టీలు ఏర్పడిన తరువాతనే వాటిలో ముఠాలు ఆవిర్భవించాయి. రాజకీయ పార్టీలకు శాసనబద్ధత ఉంది కాని ముఠాలకు లేవు. వాటికి

BRAOU

అధికారికమైన గుర్తింపు లేదు. ముఠాల ధ్యేయాలన్నీ ముఠాలోని వ్యక్తిత్వాలకు గుర్తింపు కొనసాగేటందుకు ప్రయత్నిస్తుంటాయి. రాజకీయ పార్టీల దృక్కోణంలో ముఠాలు పార్టీ నాయకత్వ బలహీనత, అవకాశవాదం, విచ్ఛిన్నతలను తెలియజేస్తాయి. పార్టీలలోని విభేదాలకు ముఠాలే కారణాలైనందున, పార్టీ వ్యవహార సరళిపైన అవి వ్యతిరేక స్వభావాన్ని కలుగచేసేవిగా ఉన్నాయి. పార్టీలో జరిగే నాయకత్వపు పోటీలను వ్యవస్థీకరించటంలో ముఠాలు నిర్మాణాత్మకమైన పాత్రను నిర్వహిస్తున్నాయి. దేశంలో పార్టీలు నిర్వహించే పాత్రను, పార్టీలలో ముఠాలు నిర్వహిస్తున్నాయి. ముఠాలు పార్టీలోని నాయకుల మధ్య గల అస్థిర స్నేహాలను అయోమయ స్థితిని ప్రదర్శిస్తున్నాయి. ముఠాల పోటీలు వ్యక్తిత్వాల చుట్టూ కేంద్రీకృతమై పదవుల పంపిణీకి, అధికార ప్రాప్తికి బేరసారాలు సాగిస్తుంటాయి. సరళత్వం, కాఠిన్యం, మోసం ముఠా రాజకీయాలలో ప్రధాన ఆయుధాలు. ముఠాలకు శాశ్వత రాజకీయ వ్యవస్థీకృత నిర్మాణం ఉండదు. ముఠాల సరళత్వ గుణం నాయకత్వ స్వభావాన్ని బట్టి సమయ సందర్భాలను బట్టి స్నేహ సంబంధాలను అనుకూల పరచుకుంటుంది. భారతదేశంలో "నాయకుడు - అనుచరులు" ( leader - follower ) గల ముఠాలు, తెలిసిన వారి మధ్యనే ఏర్పడి బయటివారికి ప్రవేశం లేనందున స్థిరత్వంతో రాజకీయ రంగంలో నిలువ గలుగుతున్నాయి. వ్యవస్థీకృతమై మార్పు చెందే పార్టీల రాజకీయాల యథార్థతకు ముఠాలు ప్రతిబింబాలు. మన దేశంలో ముఠాలు లేని రాజకీయ పార్టీలు లేవు. కమ్యూనిస్టేతర పార్టీలలో వ్యక్తిత్వాల ప్రాతిపదికన ముఠాలు ఏర్పడితే, కమ్యూనిస్టు పార్టీలలో సైద్ధాంతిక, వ్యూహాత్మక విభేదాలు ప్రాతిపదికలవుతున్నాయి. ముఠాలు ఏర్పడటం, చీలటం, మళ్ళీ కలవటం భారతీయ రాజకీయ సంస్కృతిలో భాగమైపోయింది.

**అభ్యాసం**

రాజకీయ పార్టీలలో 'వ్యక్తి ప్రాధాన్యత' బలమా, బలహీనతా చర్చించండి.

## 22.7. విదేశాంగ విధానం.

ప్రపంచ వ్యవహారాల్లో ప్రతి దేశమూ తనకు గల శక్తి సంపన్నతల, బలహీనతల ఆధారంగా సంబంధాలు ఏర్పరచుకొంటుంది. ప్రపంచ రాజ్యాల వ్యవస్థ ప్రభావాలకు లోబడి రాజ్యాలు మనుగడ సాగిస్తున్నాయి. ప్రతి దేశం తన జాతీయ ప్రయోజనాల కనుగుణమైన విధానాన్నే అనుసరిస్తుంటుంది. విదేశాంగ విధానాలలో లక్ష్యసాధన

BRAOU

ఆంతరంగిక, అంతర్జాతీయ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. విస్తృత విధాన ప్రకటనల ద్వారా రాజ్యం తన విదేశాంగ విధానానికి నిర్దిష్ట లక్ష్యాలను నిర్దేశించుకొంటుంది. దేశ స్వాతంత్ర్యానికి ముందే భారత జాతీయ కాంగ్రెసు అంతర్జాతీయ సంబంధాలకు కొన్ని మార్గదర్శక సూత్రాలను నిర్దేశించింది. దేశంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడగానే నెహ్రూ విదేశీ వ్యవహారాలకు మార్గ నిర్దేశం ఏర్పరచ ప్రారంభించారు. అంతర్జాతీయ సమావేశాల్లో స్వేచ్ఛందంగా, స్వతంత్ర దేశంగా తనదైన విదేశాంగ విధానంతో పాల్గొంటుందే కాని భారతదేశం ఏదో ఒక అగ్ర రాజ్యానికి ఉపరాజ్యంగా మాత్రం ఉండబోదని నెహ్రూ ప్రకటించారు. చారిత్రకంగా పొరుగు దేశాలతో భారతదేశ సంబంధాలు రెండు ప్రధాన కారణాలపై ఆధారపడి ఉన్నాయి. మధ్య ఆసియా, దక్షిణ చైనా, పశ్చిమాసియా, యూరోపుల నుంచి వచ్చిన దండయాత్రలను తట్టుకొని వలసగా వచ్చిన ప్రజలను భారతదేశం తనలో ఇముడ్చుకోగల్గింది. కాని చరిత్రలో భారతదేశం ఎప్పుడూ పొరుగు దేశాలపై దండయాత్ర చేయలేదు. పొరుగు దేశాలతో వాణిజ్య, సాంస్కృతిక సంబంధాలను పెంచుకొంది. ప్రత్యేక పరిస్థితుల వల్ల ఒక్క పాకిస్థాన్ తప్ప, తక్కిన పొరుగు దేశాలకు భారతదేశ స్వాతంత్ర్యం పట్ల ఎలాంటి అనుమానాలు రాలేదు. రెండు అగ్ర రాజ్యాల కూటాలలో భారతదేశం దేనినీ సమర్థించలేదు. శాంతిని మాత్రమే కాంక్షించింది. చారిత్రకంగా పొరుగు దేశాలతో ఉన్న స్నేహ సంబంధాలు భారత విదేశాంగ విధానాన్ని ప్రభావితం చేశాయి. స్వతంత్రంగా ఉంది. విశాల హృదయంతో వ్యవహరిస్తూ విమోచనోద్యమాలకు మద్దతు పలుకుతున్న భారతదేశ స్నేహాన్ని పొరుగున గల చిన్న దేశాలు కాంక్షిస్తూ వచ్చాయి. ఈ చిన్న రాజ్యాలు భారతదేశాన్ని ధైర్యం ప్రదర్శిస్తున్న పెద్ద రాజ్యంగా భావించసాగాయి. అంతర్జాతీయ రాజకీయ వాతావరణం, భారతదేశ పరిస్థితి, చారిత్రక వారసత్వం, నెహ్రూ నాయకత్వం భారత విదేశాంగ విధానం రూపొందటంలో బాగా దోహదపడ్డాయి.

దేశ ఆర్థికాభివృద్ధికి ప్రపంచ శాంతి అవసరమని భారత జాతీయ కాంగ్రెసు భావించింది. భవిష్యత్తులో జరిగే యుద్ధాల ప్రభావం నుంచి ఏ దేశం తప్పించుకోలేదని, వలసవాదం, సామ్రాజ్యవాదం అంతమయ్యేదాకా శాంతి, నిరాయుధీకరణ, ప్రగతి సాధించ లేమని నాయకులు భావించారు. అందువల్లనే ఆది నుండి భారతదేశం అలీన విధానాన్ని, నిరాయుధీకరణ ప్రయత్నాలను సమర్థిస్తూ, సామ్రాజ్య వలస వాద వ్యతిరేకత ప్రదర్శిస్తూ ఆయా జాతీయ విమోచనోద్యమాలను బలపరిచింది. మొదటి నుంచీ కమ్యూనిస్టులు మనదేశపు అలీన విధానాన్ని సమర్థించలేదు. 1955లో రష్యా నాయకులు మనదేశంలో పర్యటన జరిపాకనే కమ్యూనిస్టులు అలీన విధానానికి మద్దతు పలుకసాగారు. 1964 తరువాత చీలిపోయిన రెండు కమ్యూనిస్టు పార్టీలు అలీన విధానాన్ని సమర్థించటం మొదలుపెట్టాయి. దేశ ప్రయోజనాలకు దోహదం చేసే విదేశాంగ విధానం పట్ల రాజకీయ పార్టీలన్నీ ఆమోదం తెలుపుతుంటాయన్న విషయాన్ని మనం గమనించాలి. భారత రాజ్యాంగంలోని ఆదేశ సూత్రాలు భారత ప్రభుత్వం ప్రపంచ శాంతి భద్రతల కోసం పాటుపడాల్సిందిగా నిర్దేశించాయి. అందువల్ల ప్రపంచ శాంతికోసం జరిగే ప్రతి ప్రయత్నంలో భారత దేశం తనదైన పాత్రను నిర్వహించింది. కాని ప్రచ్ఛన్న యుద్ధ విషవలయంలో చిక్కుకున్న అమెరికా భారతదేశపు స్వతంత్రాలోచనలను హర్షించలేకపోతున్నది. మనదేశపు ఆర్థికాభివృద్ధిలో ప్రధానంగా ప్రభుత్వరంగ సంస్థల అభివృద్ధిలో సహాయ పడటానికి అమెరికా అన్ని సందర్భాలలోను సుముఖత చూపలేదు. 1953లో స్టాలిన్ మరణం దాకా సోవియట్ రష్యా, భారతదేశ సంబంధాలు నిరుత్సాహంగానే కొనసాగాయి. స్టాలిన్ మరణానంతరం సోవియట్ విదేశాంగ విధానంలో మార్పులు వచ్చాయి. అప్పటి నుండి రెండు దేశాల స్నేహ సంబంధాలు బాగా వృద్ధి చెందాయి. భారత్ సోవియట్ రష్యా సంబంధాలలో సుహృద్భావం వృద్ధి చెందటానికి ఉభయుల లక్ష్యమూ, సోషలిజం కావడం ఒక కారణం.

BRAOU

మనదేశంలోని ప్రభుత్వరంగ పారిశ్రామిక సంస్థల అభివృద్ధికి సోవియట్ రష్యా బాగా సహాయమందించింది. చైనా విషయంలో సోవియట్, భారత్ ఆసక్తులు ఒక్కటే అయ్యాయి. 1963లో రష్యా చైనా సంబంధాలు చెడినప్పుడు దక్షిణాసియాలో చైనాకు మారుగా భారత్ బలపడటం మంచిదని మనకు ఆయుధాలు అమ్మి ఆర్థికాభివృద్ధికి రష్యా సహాయమందించింది. సోవియట్ రష్యా విచ్ఛిత్తితో భారతదేశం ఒక బలవత్తరమైన మిత్ర రాజ్యాన్ని కోల్పోయింది. ఇంతవరకు దూరంగా ఉన్న అమెరికా నేడు భారతదేశంతో సన్నిహిత సంబంధాలు వృద్ధి చెందించుకోవటానికి ఉత్సాహం ప్రదర్శిస్తున్నది. 1981లో దక్షిణాసియా ప్రాంతీయ సహకార ఉద్యమం ప్రారంభమైంది. రాజకీయ సమస్యలపై విభేదాలు ఎన్ని ఉన్నా దక్షిణాసియా ప్రాంతీయ సహకారోద్యమం సంతృప్తికరంగా అభివృద్ధి చెందుతున్నది.

అభ్యాసం

సోవియట్ రష్యాపట్ల భారతదేశం అవలంబించిన వైఖరిని సమీక్షించండి ?

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

## 22.8 తృతీయ ప్రపంచదేశాలు - రాజకీయ స్వభావం.

BRAOU

గత నాలుగున్నర దశాబ్దాలుగా కొనసాగుతున్న భారత ప్రజాస్వామ్య వ్యవస్థ మూడో ప్రపంచ రాజ్యాలలో తలమానికంగా నిలిచింది. పాశ్చాత్య రాజ్యాల ఉదారవాద పార్లమెంటరీ వ్యవస్థను నెలకొల్పి, విజయవంతంగా కొనసాగిస్తున్న మూడో ప్రపంచ రాజ్యాలలో భారతదేశం ఒకటి. రెండు పార్టీల వ్యవస్థ ద్వారానే పార్లమెంటరీ వ్యవస్థ విజయవంతంగా పనిచేయగలదన్న విషయం భారతీయుల అనుభవంతో మిథ్యగా మారింది. రెండు పార్టీల వ్యవస్థ, బహుళ పార్టీల వ్యవస్థలకు భిన్నంగా మనదేశంలో ఏక పార్టీ ప్రాధాన్య వ్యవస్థ వేళ్ళూనింది. అనేక రాజకీయ పార్టీలు ఉండి, ఒక్కటే ప్రధాన పార్టీగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్య భావాలను దేశంలో బాగా నాటుకొల్పగలిగాం. ప్రధాన పార్టీని అధికార పీఠం నుండి దూరం చేయటానికి చేసిన ప్రయత్నాల వల్ల సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడటం ఆనవాయితీగా మారింది. పదకొండవ లోక్ సభ ఒక హంగ్ పార్లమెంట్‌గా వ్యవస్థీకృతం కావటం పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక కొత్త భావన. ఏ రాజకీయ పార్టీ స్వంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే బలం పొందక, ప్రభుత్వ ఏర్పాటుకు పార్టీల కలయిక ప్రాతిపదిక కావటం హంగ్ పార్లమెంట్ లక్షణంగా మారింది. ఎన్నికల ముందు పరస్పరం దూషించుకొని విమర్శించుకొన్న రాజకీయ పార్టీలు ఎన్నికలయ్యాక రాజకీయ ఆవశ్యకతతో ఏకమై ప్రభుత్వం ఏర్పరచాల్సిన పరిస్థితి

ఏర్పడింది. ప్రభుత్వం ఏర్పరచిన పార్టీల కూటమిలో రాజకీయ ఆవశ్యకత ప్రధాన సూత్రం. రాజకీయ ఆవశ్యకత అవసరం లేనప్పుడు మద్దతు ఉపసంహరణ ద్వారా ప్రభుత్వ పతనానికి వెనుదీయకపోవటం ఆధునిక భారత రాజకీయ వ్యవస్థలో పార్టీల లక్షణంగా మారింది. అధికారంలో ఉన్న కాంగ్రెసు పార్టీని విమర్శించిన పార్టీలే దాని మద్దతుతో అధికారంలో కొనసాగాల్సిన పరిస్థితి గతంలోను, ప్రస్తుతంలోను ఏర్పడింది. బహు రాజకీయ పార్టీలున్న ఫ్రాన్సు అనుభవం, మనదేశ రాజకీయ పార్టీల వ్యవహార ధోరణికి భిన్నంగా ఉంది. భవిష్యత్తులో రాజకీయ నాయకుల, రాజకీయ పార్టీల వ్యవహారం ఏ విధంగా దేశ రాజకీయాల్లో పరిణమిస్తుందో మనం గమనించాల్సి ఉంది.

**అభ్యాసం**

హంగ్ పార్లమెంటు అంటే ఏమిటి ?

## 22.9 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం.

BRAOU

★ ప్రపంచ దేశాలలో విజయవంతంగా నడుస్తున్న అతిపెద్ద ప్రజాస్వామ్యాలలో భారతదేశం ఒకటి.

★ మనది ఆధునిక ప్రజాస్వామ్య తత్వానికి అద్దంపట్టిన రాజ్యాంగం. ఇప్పటి వరకూ రాజ్యాంగాన్ని చాలా సార్లు సవరించారు.

★ మనదేశపు పార్లమెంటులో లోక్‌సభ, రాజ్యసభ అనే రెండు సభలున్నాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్య విజయానికి అత్యున్నతమైన బాధ్యతా భావం, రాజ్యాంగ నైతికత చాలా అవసరం.

★ భారత రాష్ట్రపతిని ప్రజలెన్నుకున్న ప్రజా ప్రతినిధులు ఎన్నుకుంటారు. రాజ్యాంగ రక్షకుడుగా రాష్ట్రపతి వ్యవహరిస్తాడు.

★ పార్లమెంటరీ తరహా ప్రభుత్వంలో ప్రధానమంత్రి పదవి చాలా ప్రధానమైంది. బాధ్యతాయుతమైంది.

★ భారతదేశంలోని రాజకీయ పార్టీలు సభ్యుల మీదకన్నా నాయకుల మీదే ఎక్కువగా ఆధారపడుతున్నాయి. వ్యక్తి ప్రాధాన్యం పార్టీలకు బలహీనతగా తయారైంది.

★ పాశ్చాత్య రాజ్యాల ఉదారవాద పార్లమెంటరీ వ్యవస్థను నెలకొల్పి విజయపథంలో ముందుకు వెడుతోన్న తృతీయ ప్రపంచ రాజ్యాలలో భారతదేశం ముఖ్యమైంది.

## 22.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు.

30 పంక్తుల్లో జవాబులు రాయండి.

1. భారతదేశ రాజ్యాంగ నిర్మాణాన్ని సమీక్షించండి.

2. భారతదేశంలో రాజకీయ పార్టీల వ్యవస్థను పరిశీలించండి.

15 పంక్తుల్లో జవాబులు రాయండి.

1. పార్లమెంటరీ ప్రజాస్వామ్య పంథాలో భారతదేశం ఎంతవరకు సఫలమైంది ?

2. "రాజ్యాంగ రక్షకుడుగా" రాష్ట్రపతిని ఎందుకు పేర్కొంటారు.

BRAOU

# భాగం-23 ఆంధ్రప్రదేశ్ పరిణామాలు, ధోరణులు

విషయక్రమం

23.0 ఉద్దేశం

23.1 ప్రవేశిక

23.2 ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం

అభ్యాసం

23.3 గవర్నరు

అభ్యాసం

23.4 ముఖ్యమంత్రి - మంత్రి వర్గం

అభ్యాసం

23.5 శాసన సభ

అభ్యాసం

23.6 రాజకీయ పార్టీలు - స్వభావాలు, ప్రభావాలు

అభ్యాసం

23.7 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

23.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 23.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు:

★ రాష్ట్రాలను గురించి - ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గురించి తెలుసుకోగలుగుతారు.

★ గవర్నరు, ముఖ్యమంత్రి, మంత్రివర్గం బాధ్యతలు, విధులు గుర్తించగలుగుతారు.

★ శాసన సభ నిర్మాణం, పనితీరు గురించి, రాష్ట్రంలోని రాజకీయ పార్టీలను గురించి వివరించగలుగుతారు.

## 23.1 ప్రవేశిక

భారతరాజ్యాంగం దేశాన్ని రాష్ట్రాల కలయిక (UNION OF STATES) గా నిర్దేశించింది. సమాఖ్య అనే పదం వాడకపోయినారాజ్యాంగంలో అటు సమాఖ్య లక్షణాలూ ఇటు ఏక కేంద్ర లక్షణాలూ చోటు చేసుకొన్నాయి.

మనదేశంలో గల రాష్ట్రాలు జనాభాలోను, వైశాల్యంలోను, చాలా స్వతంత్ర రాజ్యాలకన్నా పెద్దవి. స్వాతంత్ర్య సముపార్జనతో రాష్ట్రాలన్నింటినికలిపి భారత యూనియన్‌గా రూపొందించుకొన్నాం. స్వాతంత్రోద్యమ కాలంలోనూ, దేశ పునర్నిర్మాణంలోనూ రాష్ట్రాలు చాలా క్రియాశీలమైన పాత్రను నిర్వహించాయి. అయితే రాష్ట్ర రాజకీయాల అధ్యయనం చాలా ఆలస్యంగా ప్రారంభమైంది. మనదేశంలోని రాష్ట్ర రాజకీయాల శాస్త్రీయ అధ్యయనానికి నాంది పలికింది విదేశీ సామాజిక శాస్త్రజ్ఞులే. రాష్ట్రాలన్నింటికీ ఒకే విధమైన రాజ్యాంగ నిర్మితులు ఉన్నప్పటికీ ఆచరణలో మాత్రం రాష్ట్రాల మధ్య సారూప్యం లేదు. రాష్ట్రాలన్నింటిలో రాజకీయ స్వరూప స్వభావాలు ఒక్క తీరుగా లేవు.

భారత రాజ్యాంగం కేంద్ర ప్రభుత్వానికే అనేక విశేషాధికారాలను కట్టబెట్టినప్పటికీ రాష్ట్రాల ప్రాముఖ్యాన్ని ఏ మాత్రం కాదనలేదు. ప్రజల దైనందిన అవసరాలను తీర్చేది రాష్ట్ర స్థాయి పాలకులే. అనునిత్యం రాష్ట్ర ప్రభుత్వం, దాని పాలన మనజీవితంతో పెనవేసుకొని పోయి ఉన్నాయి. అభివృద్ధికి సంబంధించిన ఒడిదుడుకులు ముందుగా రాష్ట్రాల్లోనే సంభవిస్తాయి. జాతీయ ప్రణాళికల్లో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు తగిన యంత్రాంగాన్ని రాష్ట్రమే సమకూరుస్తుంది. ఈ పథకాల వల్ల జరిగే అభివృద్ధిపెరుగుదల ముందుగా రాష్ట్రాలలో తరువాత జాతీయ స్థాయిలోనూ కన్పిస్తుంది. రాష్ట్రాల రాజకీయాలనూ, ప్రభుత్వ వ్యవహార సరళినీ ఆయా రాష్ట్రాలలోని సామాజిక, రాజకీయ శక్తులు ప్రభావితం చేస్తాయి. దేశంలో అంతర్భాగంగా రాష్ట్రాలు పని చేస్తున్నప్పటికీ వాటి ప్రభుత్వం, రాజకీయాలు విభిన్న ధోరణులను వ్యక్తం చేస్తాయి. కొన్ని రాష్ట్రాలలో వామ పక్షాలు బలంగా ఉంటే, మరి కొన్ని రాష్ట్రాల్లో మధ్యే మార్గ రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్నాయి. కొన్నింటిలో ప్రాంతీయ రాజకీయ పార్టీలు ప్రధాన పాత్రను నిర్వహిస్తున్నాయి.

## 23.2 ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం

BRAOU

భారతదేశ రాష్ట్రాలలో అక్షరక్రమంలో ఆంధ్రప్రదేశ్ మొదటిది. జనాభా పరంగాను, విస్తీర్ణం విషయంలోనూ దక్షిణాది రాష్ట్రాలలో మొదటిది. మన దేశంలో రాష్ట్రాల పునర్విభజనకూ, భాషా రాష్ట్రాల వాదనకూ తెలుగువారే పునాదులు వేశారు. రాజకీయ సుస్థిరతలో కూడా ఆంధ్రప్రదేశ్‌దే అగ్రతాంబూలం. దేశ స్వాతంత్ర్యం నాటికి చారిత్రక కారణాల వల్ల తెలుగు భాష మాట్లాడేవారు ఒకే రాష్ట్రంగా వ్యవస్థీకృతమై లేరు. జాతీయోద్యమ కాలంలోనే తెలుగు భాష మాట్లాడేవారు తమకు ప్రత్యేక రాష్ట్రం కావాలని వాదించి ఉద్యమించారు. చారిత్రక రాజకీయ కారణాల వల్ల విడివిడిగా ఉండిపోయిన తెలుగువారి స్థితిగతులు అన్ని ప్రాంతాల్లోను ఒకే విధంగా లేవు. నీటి పారుదల సౌకర్యాలు వృద్ధి చెందిన "సర్కారు" జిల్లాలు ఆర్థికంగా, సాంస్కృతికంగా, రాజకీయంగా బాగా అభివృద్ధి చెందాయి. నీటి పారుదల సౌకర్యాలు గాని, పారిశ్రామికాభివృద్ధి కాని లేని "రాయలసీమ" జిల్లాలు సర్కారు జిల్లాల కంటె వెనుకబడి ఉన్నాయి. నిజాం రాజు పాలనలో "తెలంగాణా" ప్రజల పరిస్థితులు మధ్యయుగాల ఫ్యూడల్ జీవన విధానంగా మారాయి. ఇతర ప్రాంతాలతో పోల్చినప్పుడు తెలంగాణాలో అభివృద్ధికార్యక్రమాల స్థాయి చాలా తక్కువ. పాలన పరంగా తెలంగాణా నిజాం రాజు ఏలుబడిలో ఉంది. మిగతా భాగాలు బ్రిటిష్ ప్రభుత్వ ఏలుబడిలో ఉండేవి. బ్రిటిష్ ఏలుబడి ప్రాంతాలలో ప్రజాస్వామ్య వ్యవస్థలు బాగా వేళ్ళూనుకున్నాయి. అలాంటి ప్రయత్నాలేవీ తెలంగాణాలో జరుగలేదు. విద్య, వ్యవసాయం బాగా వృద్ధి చెందటం వల్ల కోస్తా జిల్లాలలో రాజకీయ చైతన్యం బాగా వృద్ధి చెందింది. ఈ శతాబ్దం ఆరంభంనుండి సర్కారు జిల్లాలలో కాంగ్రెసు జాతీయోద్యమం బాగా విస్తరించిపోయింది. తెలంగాణా ప్రాంతంలో జాతీయోద్యమం రెండవ ప్రపంచ యుద్ధంతో ప్రారంభమైందనవచ్చు. జాతీయోద్యమంలో అంతర్భాగంగా ఆంధ్ర

ప్రాంతంలో ఈ శతాబ్దం ఆరంభం నుండి తెలుగు మాట్లాడే జిల్లాలలో ప్రత్యేక రాష్ట్రం కావాలన్న ఉద్యమం ప్రారంభమైంది. చివరకు పొట్టి శ్రీరాములు ఆత్మాహుతితో మద్రాసు రాష్ట్రంలోని తెలుగు జిల్లాలతో 1953 అక్టోబరు 1వ తేదీన ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది.

తెలుగు భాష మాట్లాడేవారందరూ ఒకే పాలన కిందకు రావాలన్న ఆకాంక్ష ఆంధ్ర ప్రాంతపు ఆంధ్రోద్యమంలో అంతర్లీనంగా ఉంది. తెలంగాణా వారు నిజాం సంస్థానంలో అంతర్భాగమై ఉన్నందున, తెలుగు వారుగా ఒకే పాలన కిందకు రావటం ఆనాడు అసాధ్యమైన విషయం. అందుకు అవసరమైన ఉద్యమం ఏదీరూపుదాల్చ లేదు. తెలుగువారంతా ఒకే రాష్ట్ర పాలనలోకి రావాలన్న విషయాన్ని ఆంధ్రప్రాంత నాయకులే బహిరంగంగా కాంక్షించారు. అలాంటి ఆలోచనలు, భావాలు తెలంగాణా తెలుగు నాయకులలో ఏర్పడలేదు. హైద్రాబాదు సంస్థాన విమోచనం తరువాత తెలుగు వారంతా ఒకే పాలన కిందకు రావాలన్న వాదనకు కొంత బలం చేకూరింది. కమ్యూనిస్టులు ఈ వాదాన్ని బాగా ప్రచారం చేశారు. 1949 చివరలో అయ్యదేవర కాళేశ్వరావు విజయవాడలో విశాలాంధ్ర మహాసభను ఏర్పాటు చేశారు . క్రమేపి విశాలాంధ్ర నినాదం తెలంగాణా ప్రాంత ప్రజల్లోకి పాకిపోయింది. విశాలాంధ్ర ఏర్పాటుకు ఆంధ్ర ప్రాంతీయులలో ప్రకటితమైన ఉత్సాహం, తెలంగాణా ప్రజల్లో ఎన్నడూ ప్రకటితంగా లేదు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కావాలని ఉద్యమించినప్పుడు కానీ, పొట్టి శ్రీరాములు ఆత్మాహుతి సందర్భంలో కానీ, తెలంగాణా ప్రజలు ఏ విధంగానూ స్పందించలేదు. దేశంలో రాష్ట్రాల పునర్విభజనకు ఫజల్ ఆలీ కమీషనును నియమించాక విశాలాంధ్ర రాష్ట్ర ప్రతిపాదనకు మంచి ప్రోత్సహం లభించింది. తెలంగాణా కాంగ్రెసు నాయకులలో ఒక వర్గం విశాలాంధ్రను సమర్థించగా మరొక వర్గం ప్రత్యేక తెలంగాణా రాష్ట్రాన్ని కోరింది. ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల నాయకులు విశాలాంధ్ర ఏర్పాటుకు సుముఖులు. తెలంగాణా నాయకులలోనే భిన్నాభిప్రాయాలు వెల్లడి అయ్యాయి. హైద్రాబాదు రాష్ట్ర శాసనసభలో చర్చలో పాల్గొన్న 147 మంది తెలంగాణా శాసన సభ్యులలో 103 మంది విశాలాంధ్రను సమర్థించారు. ఆంధ్ర రాష్ట్ర శాసనసభలోని సభ్యులందరూ విశాలాంధ్ర కావాలన్నారు. కేంద్ర కాంగ్రెసు నాయకుల చొరవతో ఢిల్లీలో ఏర్పాటైన తెలుగు భాష మాట్లాడే నాయకుల మధ్య ఒక అంగీకారం కుదిరి ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. దీనినే "పెద్దమనుషుల ఒప్పందం"గా వ్యవహరిస్తున్నాము. ఈ పెద్దమనుషుల ఒప్పందం రాష్ట్రంలో రాజకీయ వ్యవహారాల నిర్వహణకు ప్రాతిపదిక అయింది. కొత్త మంత్రివర్గ నిర్మాణం జరిగినప్పుడల్లా, ప్రతి ముఖ్యమంత్రి పెద్దమనుషుల ఒప్పందాన్ని పాటించాల్సిన రాజకీయ ఆవశ్యకత ఏర్పడింది. భాష ప్రజలను సమైక్య పరచలేకపోయింది. రాష్ట్రం ఏర్పడి దశాబ్దం గడవగానే రాష్ట్ర విచ్ఛిత్తికి రెండు బలమైన ఆందోళనలు చెలరేగాయి. అవి సమసిపోయి సమైక్య రాష్ట్రంగా తిరిగి కొనసాగుతున్నది.

రాష్ట్రావతరణ నుండి 1983 వరకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసుకు దుర్భేద్యమైన దుర్గంగా నిలిచింది. 1983 నుండి "తెలుగు దేశం" ప్రాంతీయపార్టీ రాజకీయ రంగప్రవేశం చేసింది. కాంగ్రెసు గుత్తాధిపత్యాన్ని బద్దలు చేసింది.

**అభ్యాసం**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణానికి కారణమైన పరిస్థితులను క్లుప్తీకరించండి.

BRAOU

## 23.3 గవర్నరు

రాష్ట్రానికి అధిపతిగా గవర్నరును భారత రాష్ట్రపతి నియమిస్తారు. గవర్నర్ల నియామకంలో రెండు సంప్రదాయాలు రూపొందాయి. అవి: రాష్ట్ర ముఖ్యమంత్రిని సంప్రదించటం మొదటిది. సంబంధిత రాష్ట్రానికి చెందని వ్యక్తిని నియమించటం రెండోది. 1950 నుండి 1967 దాకా కేంద్రంలోను, రాష్ట్రాలలోను ఒకే పార్టీ అధికారంలో ఉన్నందున సంప్రదాయాల పాటింపులో ఎలాంటి వివాదాలు ఏర్పడలేదు. 1967 తరువాత నుంచి అనేక రాష్ట్రాలలో కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడటంతో సంప్రదాయాలను గాలికి వదిలేశారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రిని సంప్రదించకుండానే రాంలాల్‌ను గవర్నరుగా నియమించారు. నేషనల్ ఫ్రంట్ కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు గవర్నరు నియామకంలో మన రాష్ట్ర ముఖ్యమంత్రిని సంప్రదించారు. రాజ్యాంగ రీత్యా రాష్ట్రాలలో గవర్నరులు చాల కీలకమైన పాత్రను నిర్వహించాల్సి ఉంది. సాధారణ పరిస్థితులలో గవర్నరు పాత్ర వ్యక్తం కాదు. అసాధారణ పరిస్థితుల్లో వారి పాత్ర వ్యక్తమవుతుంది. కేంద్రం, రాష్ట్రాలలో ఒకే పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గవర్నర్ల పాత్ర వివాదాంశం కాలేదు. కాని ఇటీవలి కాలంలో గవర్నర్లు వ్యవహరిస్తున్న తీరుతెన్నులపై వాదోపవాదాలు చెలరేగుతున్నాయి. రకరకాల విమర్శలు వస్తున్నాయి. రాజకీయాలకు అతీతంగా ఉండాల్సిన గవర్నర్లు కేంద్రంలోని అధికార పక్షానికి ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారని, రాజ్‌భవన్‌లు రాజకీయభవన్‌లుగా మారాయని పలువురు బాహాటంగా విమర్శిస్తున్నారు.

1952 సార్వత్రిక ఎన్నికలలో మద్రాసు రాష్ట్రంలో కాంగ్రెసుకు నిరపేక్ష మెజారిటీ రాలేదు. శాసన సభకు ఎన్నికైన వివిధ పార్టీల సభ్యులు ఫ్రంట్‌గా ఏర్పడి టంగుటూరి ప్రకాశాన్ని నాయకునిగా ఎన్నుకొన్నారు. కాని గవర్నరు ఫ్రంట్ నాయకుని ప్రభుత్వం ఏర్పరచమని ఆహ్వానించలేదు. ఎన్నికలలో గెలిచిన ఏకైక పెద్ద పార్టీ అయిన కాంగ్రెసుకు ప్రభుత్వం ఏర్పరచే బాధ్యతనప్పగించారు. గవర్నరు 1954 లో ఆంధ్రరాష్ట్రంలో ప్రకాశం మంత్రివర్గం రాజీనామా చేసినప్పుడు గవర్నరు శాసనసభలో ఏకైక పెద్ద పార్టీ అయిన కమ్యూనిస్టు పార్టీని ఆహ్వానించక, శాసన సభ రద్దుకు సిఫారసు చేశారు. ముఖ్యమంత్రుల నియామకంలో గవర్నర్లు తమ వివేచనాధికారాన్ని ఉపయోగిస్తున్నారు. రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులను ఆమోదించే విషయంలో కూడా గవర్నర్లు విచక్షణ పాటిస్తున్నారు. కొన్ని బిల్లులను ఆమోదించటానికి గవర్నర్లు నెలలతరబడి కాలయాపన చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పటినుంచి ఇంతవరకు రాష్ట్రంలో 15 మంది గవర్నర్లు పనిచేశారు. 1956 నుండి 1982 వరకు పనిచేసిన గవర్నర్లు ఎవ్వరూ వివాదాస్పదం కాలేదు. 1983లో రాష్ట్రంలో కాంగ్రెసేతర ప్రభుత్వం ఏర్పడ్డాక

BRAOU

గవర్నరు ముఖ్యమంత్రుల మధ్య వివాదాలు మొదలైనాయి. 1984లో గవర్నర్ రాంలాల్ రాష్ట్ర ముఖ్యమంత్రిని బర్తరఫ్ చేసి నాదెండ్ల భాస్కరరావును ముఖ్యమంత్రి చేయటం తీవ్ర విమర్శలకు గురి అయింది. తదుపరి రాష్ట్ర గవర్నరుగా వచ్చిన శంకర్‌దయాల్ శర్మ తెలుగుదేశం ప్రభుత్వాన్ని పునరుద్ధరించటంతో ముఖ్యమంత్రి గవర్నర్ల మధ్య సత్సంబంధాలు ఏర్పడ్డాయి. అయితే ఆయనకూడా ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు మంత్రిమండలి సిఫారసు చేసిన మూడు ఆర్డినెన్సులను తిరిగి జారీ చేయటానికి తిరస్కరించిన సంఘటన ఒకటి ఉంది. తదుపరి రాష్ట్ర గవర్నరుగా నియమితులైన కుముద్‌బెన్ జోషి కాలంలో సత్సంబంధాలు దెబ్బతిన్నాయి. వైస్ ఛాన్సలర్ల నియామకం, కర్షక పరిషత్ బిల్లుకు ఆమోదం విషయాల్లో గవర్నరు వ్యవహరించిన తీరు మొత్తం గవర్నర్ల వ్యవస్థనే వివాదాస్పదం చేసింది. ప్రస్తుతం గవర్నరుగా ఉన్న కృష్ణకాంత్ కాలంలో ముఖ్యమంత్రి గవర్నర్ల మధ్య పెద్ద వివాదాలు రాలేదు.

**అభ్యాసం**

గవర్నరు పాత్ర కీలకమైందన్న విషయం ఎలాంటి పరిస్థితుల్లో తెలిసివస్తుంది ?

______

______

______

______

______

______

## 23.4 ముఖ్యమంత్రి

భారతదేశ రాష్ట్ర పాలన వ్యవస్థలో ముఖ్యమంత్రి ప్రధాన సూత్రధారి. రాష్ట్ర రాజకీయాలలో ఆయనది చాలా కీలకమైన పదవి. రాష్ట్ర గవర్నరు ముఖ్యమంత్రిని నియమిస్తారు. ముఖ్యమంత్రి సలహా మేరకు గవర్నరు ఇతర మంత్రులను నియమిస్తారు. శాసనసభ విశ్వాసం పొందగలడన్న వ్యక్తిని గవర్నరు ముఖ్యమంత్రిగా నియమిస్తారు. ముఖ్యమంత్రిగాని ఇతర మంత్రులుగాని శాసనసభ సభ్యత్వం లేకుండా ఆరునెలలకు మించి అధికారంలో ఉండరాదు. శాసనసభలో రాజకీయ పార్టీకి నిర్దిష్టమైన మెజారిటీ ఉన్నప్పుడు ఆ పార్టీ నాయకునే ముఖ్యమంత్రిగా నియమించటం మినహా గవర్నరుకు వేరే గత్యంతరం లేదు. శాసనసభలో మెజారిటీ పొందిన రాజకీయ పార్టీ ఏ విధంగా నాయకుని ఎన్నుకొంటుందన్న విషయంలో రాజ్యాంగ పరిమితులేవీ లేవు. ఇప్పటి వరకు రాష్ట్రంలో రెండు పార్టీలకు చెందినవారే ముఖ్యమంత్రులు అయ్యారు. ఒకటి కాంగ్రెసు, రెండు తెలుగుదేశం పార్టీ. రెండు సందర్భాలలో- 1984, 1985 లలో- తెలుగుదేశం పార్టీలో చీలికలు రాగా ముఖ్యమంత్రిగా ఉన్నవారిని నిర్ణీత గడువులో శాసనసభ విశ్వాసం పొందమని గవర్నరు కోరటం జరిగింది. కాంగ్రెసు పార్టీకి శాసనసభలో మెజారిటీ ఉన్న సందర్భాలలో కాంగ్రెసు శాసనసభా పక్ష నాయకుని ఎన్నుకొనే విషయంలో పార్టీ కేంద్ర అధిష్ఠాన వర్గం మార్గదర్శక సూత్రాలను నిర్దేశించింది. అన్ని



BRAOU

సందర్భాలలోను ఈ మార్గదర్శక సూత్రాలు ఒకే విధంగా లేవు. ఆయా సందర్భాన్ని బట్టి నాయకుని ఎన్నిక పద్ధతిని నిర్దేశిస్తున్నారు. శాసనసభా పక్ష నాయకుని ఎన్నికలో పార్లమెంటరీ బోర్డు అధిష్ఠాన వర్గం నిర్వహించేపాత్ర కేంద్ర కాంగ్రెసు నాయకుల సమైక్య నాయకత్వ బలం మీద ఆధారపడి ఉంది. పార్టీ నాయకత్వం బలహీనంగా ఉన్నప్పుడు కేంద్ర నాయకత్వ ధోరణి సముచితమైనదిగా లేదు. అంతేగాక రాష్ట్ర రాజకీయాలలో కాంగ్రెసు ముఠాల ఎత్తుల జిత్తుల తీవ్రత మీద కూడా కేంద్ర నాయకత్వ పాత్ర ఆధారపడి ఉంటున్నది. ఇప్పటికి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు శాసన సభాపక్షం వివిధ సందర్భాలలో నాయకుని ఎన్నుకొంది. నాయకుని ఎన్నిక జరిగిన ప్రతిసారీ, రాష్ట్రంలోని ప్రజలంతా ఎవ్వరు ముఖ్యమంత్రి కాగలరన్న విషయాన్ని ఉత్కంఠతతో వేచిచూశారు. నాయకుని ఎన్నికలలో ముఠాలు, వర్గాలు, పోటీ చేస్తున్న వారి మిత్రులు, మంత్రి పదవులను ఆశించేవారు ప్రత్యక్షంగానో పరోక్షంగానో క్రియాశీలక పాత్రను నిర్వహిస్తున్నారు. ప్రతిసారీ నాయకుని ఏకగ్రీవ ఎన్నికకు తెరవెనుక ప్రయత్నాలు జరిగాయి. 1983, 1995 లలో తెలుగుదేశం పార్టీ శాసనసభ నాయకుని ఎన్నిక విషయం ప్రజలలో ఉత్కంఠను రేకెత్తించలేదు. ఎన్నికలకు ముందే తెలుగుదేశం పార్టీగెలిస్తే ఎన్.టి.రామారావే ముఖ్యమంత్రి అన్న విషయం అందరూ గ్రహించారు. 1984లో జరిగిన రాజకీయ పరిణామాలవల్ల నాదెండ్ల భాస్కరరావు నాయకులుగా ఉన్నారు. కొద్ది కాలానికి అంటే 1985లోనే మళ్లీ ఎన్నికల్లో ఎన్.టి. రామారావు నాయకునిగా ఎన్నికయ్యారు. ఇది అందరూ ఊహించిందే. అయితే 1995లో సంభవించిన పరిణామాల వల్ల నారాచంద్రబాబు నాయుడు ఎన్నికయ్యారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని అధిష్టించే వారికి ఎలాంటి అర్హతలుండాలన్న విషయాన్ని రాజ్యాంగం నిర్దేశించలేదు. రాజ్యాంగ అర్హతల నిర్దేశన లేకపోయినా,రాజకీయ అర్హతలు ఆవశ్యకాలు. రాజకీయాలలో అంచెలు దాటి సమున్నత స్థానాలకు చేరుకోవటం అందరికీ సాధ్యమయ్యే విషయం కాదు. పదవులు కొందరికి వ్యక్తిత్వాన్ని ప్రసాదిస్తే, మరికొందరు తమ వ్యక్తిత్వంతో పదవికి రూపకల్పన చేశారు. ముఖ్యమంత్రి అధికారాల పరిధి, ఆ స్థానంలో ఉన్న వ్యక్తిమీద, సందర్భంమీద ఆధారపడి ఉంటుంది. పదవి ఒకటే అయినా వ్యక్తులలో విభిన్నత్వం, అధికార నిర్వహణలో, పాత్ర పోషణలో కొట్టవచ్చినట్లు కనపడుతుంది. ఇప్పటి వరకు ముఖ్యమంత్రులు అయిన వారందరూ తమ ప్రత్యేకతలను ప్రదర్శించారు. ఒక్కొక్కసారి ఆయా సందర్భాలు కూడా వారి వ్యక్తిత్వాలను తీర్చిదిద్దాయి. ముఖ్యమంత్రులందరి వ్యవహార శైలి ఒకే విధంగా లేదు. ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా నిర్వహించారు. సమ్మోహన వ్యక్తిత్వాలు కేంద్రంలో దేశ ప్రధానమంత్రి పదవిని ప్రభావ పరచాయి. మన రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్యమంత్రులు ఎవ్వరూ సమ్మోహన శక్తి కలిగినవారు కాదు. తెలుగుదేశం పార్టీ నాయకులలో ఒక్క ఎన్.టి. రామారావు తన సమ్మోహన వ్యక్తిత్వంతో రాష్ట్ర రాజకీయాలను ప్రభావ పరిచి, కాంగ్రెసుకు ప్రత్యామ్నాయ శక్తిగా అవతరించారు.

BRAOU

రాష్ట్రమంత్రి వర్గంలో ఎంత మంది ఉండాలి, వారికి ఏయే శాఖలు కేటాయించాలి అన్న విషయంలో ఏ విధమైన రాజ్యాంగ పరిమితులూ లేవు. రాష్ట్రంలో మంత్రి వర్గ నిర్మాణం జరిగినపుడల్లా, ముఖ్యమంత్రి రాష్ట్రావతరణ సమయంలో జరిగిన "పెద్దమనుషుల ఒప్పందా"న్ని పాటించాల్సి ఉంది. ఈ ఒప్పందంలో ఉపముఖ్యమంత్రి పదవి, ఆంధ్ర తెలంగాణా ప్రాంతాల మంత్రుల మధ్య నిష్పత్తి, శాఖల కేటాయింపు ప్రధానమైనవి. మంత్రుల సంఖ్య ఆంధ్ర తెలంగాణా ప్రాంతాల మధ్య 60:40 నిష్పత్తిలో ఉండాలి. ఆంధ్ర ప్రాంత వ్యక్తి ముఖ్యమంత్రి అయితే తెలంగాణా వారు ఉప ముఖ్యమంత్రి పదవిని పొందాలి. తెలంగాణా వారు ముఖ్యమంత్రి అయితే ఆంధ్ర ప్రాంతంవారు ఉప

ముఖ్యమంత్రి పదవిని పొందాలి. శాఖల కేటాయింపులో హోమ్, ఆర్థిక, రెవెన్యూ, ప్లానింగ్, వాణిజ్య, పరిశ్రమలలో విధిగా కనీసం రెండు శాఖలను తెలంగాణా వారికి కేటాయించాలి.

రాష్ట్రాల మంత్రి వర్గాలలో ఉప ముఖ్యమంత్రి పదవిని ఆంధ్రులే ఆరంభించారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ సందర్భంలో అది రాజకీయ ప్రాధాన్యాన్ని సంతరించుకొంది. ఉప ముఖ్యమంత్రిని నియమించాలన్న నిబంధన ఏదీలేదు. నియమించినప్పుడు పెద్దమనుషుల ఒప్పందాన్ని పాటించాల్సి ఉంది. మంత్రులకు శాఖల కేటాయింపులలో ప్రతి ముఖ్యమంత్రి విధిగా ఒప్పందాన్ని గౌరవిస్తూనే ఉన్నారు. ముఖ్యమంత్రులు తమ ఇష్టం వచ్చినట్లుగా, రాజకీయ అవసరకతలను బట్టి మంత్రుల సంఖ్యను నిర్ణయిస్తున్నారు. మంత్రులందరినీ ఒకేసారి నియమించాలన్న నిబంధన కూడా ఏదీ లేదు. చిన్న మంత్రి వర్గాలతో ప్రారంభమైన సంప్రదాయం, పెద్ద మంత్రి వర్గాల సాంప్రదాయంగా స్థిరపడిందని చెప్పవచ్చు. మంత్రి పదవులను ఆశించేవారు పార్టీలో చాలామంది ఉంటారు. ఆశించే పెక్కుమందిలో ముఖ్యమంత్రి కొద్దిమందినే మంత్రులుగా ఎంచుకొంటారు. మంత్రి పదవిపై ఆశలను పెంచుకొన్నవారు తమను మంత్రి వర్గంలో చేర్చుకోవాల్సిందిగా ముఖ్యమంత్రికి నివేదించటానికి తమ అనుచరులను ప్రతినిధి వర్గంగా పంపుతుంటారు. నాయకుడుగా ఎన్నికైన మరుక్షణం నుంచి మంత్రి పదవుల గురించి, జిల్లాలు, ప్రాంతాలు, కూటాలు, కులాలు, మతాల వారిగా ప్రతినిధి వర్గాలు ముఖ్యమంత్రిని కలుస్తూనే ఉంటాయి. గతంలో మంత్రి పదవిని ఆశించేవారు తమ అనుభవాన్ని బేరీజు వేసుకొనేవారు. కాని ఇటీవలి రోజుల్లో శాసన సభ్యుడుగా ఎన్నిక కాకముందు నుంచే కాబోయే మంత్రిగా ప్రచారం చేయించుకొంటూ వ్యక్తిత్వాలను పెంచుకొంటున్నారు. నాయకత్వపు ఎన్నికలో ముఖ్యమంత్రిని సమర్థించిన వ్యక్తిగత మద్దతుదార్లు కూడా మంత్రి పదవులను ఆశిస్తుంటారు. సాధారణంగా ప్రతి ముఖ్యమంత్రి మంత్రి వర్గంలో జిల్లాలన్నింటికి ప్రాతినిధ్యం ఉండేటట్లు జాగ్రత్త పడతాడు. ప్రతిజిల్లా వారూ తమ జిల్లాకు మంత్రి వర్గంలో స్థానం లభించాలని తాపత్రయపడుతుంటారు.

BRAOU

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో మంత్రి వర్గం ప్రభుత్వ విధుల నిర్వహణలో మార్గ దర్శకత్వం వహిస్తుంది. ప్రభుత్వం నిర్వహించాల్సిన వివిధ కార్యక్రమాల మధ్య సమన్వయం సాధిస్తుంది. ప్రభుత్వ వ్యవహారాల నిర్వహణలో ముఖ్యమంత్రి సహచర మంత్రుల కార్య నిర్వహణను పర్యవేక్షిస్తుంటారు. పర్యవేక్షించటమేగాక, మంత్రులు పనులను ఎలా నిర్వహిస్తున్నారో అనుక్షణం సమాచారం పొందుతుంటారు. ప్రభుత్వ నిర్వహణకంతకు మంత్రి వర్గం బాధ్యత వహిస్తుంది. కాబట్టి, నిర్ణీత వ్యవధులలో మంత్రివర్గం సమావేశమవుతూ ప్రభుత్వ వ్యవహారాలను సమీక్షించి చర్చించి అవసరమైన నిర్ణయాలను చేయాల్సి ఉంటుంది. ముఖ్యమంత్రికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ముఖ్య సలహాదారు. ఆయనే మంత్రివర్గ కార్యదర్శిగా బాధ్యతలను నిర్వర్తిస్తుంటారు. రాష్ట్ర మంత్రి వర్గ సమావేశాలు ముఖ్యమంత్రి నిర్దేశించిన స్థలంలో సమయంలో ఏర్పాటు అవుతాయి. మంత్రి వర్గనిర్ణయాలను రికార్డు చేయటానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశాలకు హాజరవుతుంటారు. మంత్రివర్గ సమావేశాలకు ముఖ్యమంత్రి అధ్యక్షుడు. ముఖ్యమంత్రి సమావేశం ఎజెండాను నిర్ణయిస్తాడు. మంత్రి వర్గ సమావేశాలన్నీ రహస్య సమావేశాలే. మంత్రి వర్గ సమావేశానికి మంత్రులు రాగానే సమావేశపు పుస్తకంలో సంతకాలు చేస్తారు. ముఖ్యమంత్రి రాకతో మంత్రివర్గ సమావేశం ఆరంభమవుతుంది. ముఖ్యమంత్రి ఎజెండాలోని ఒక్కొక్క విషయాన్ని తీసుకొని చర్చను ప్రారంభిస్తారు. చాలా సందర్భాలలో వివరణల కొరకు సంబంధిత కార్యదర్శులు వచ్చి సమావేశంలో వివరాలను నివేదిస్తారు. మంత్రివర్గ నిర్ణయాలలో ఓటింగ్ ఉండదు. సమావేశపు ధోరణిని బట్టి ముఖ్యమంత్రి నిర్ణయాన్ని ప్రకటిస్తారు. కేవలం మంత్రివర్గ

నిర్ణయాలు తప్ప మరేవీ రాత పూర్వకంగా ఉండవు. లాంఛనప్రాయ ఉపన్యాసాలకు మంత్రివర్గ సమావేశంలో స్థానం లేదు. కుటుంబ సభ్యులు కూర్చొని తమలో తాము చర్చించినట్లుగా మంత్రివర్గ సమావేశాలు జరుగుతాయి. మంత్రివర్గ సమావేశాలకు కారణం లేకుండా మంత్రులు హాజరుకాక పోవటాన్ని క్రమశిక్షణ రాహిత్యంగా భావిస్తారు. మంత్రివర్గ సమావేశంలో జరిగిన చర్చలనూ నిర్ణయాలనూ వెల్లడించటం క్రమశిక్షణలోపంగా భావిస్తారు. మంత్రివర్గ నిర్ణయాలను బహిరంగంగా వ్యతిరేకించ దలచుకొన్న మంత్రులను రాజీనామా చేయమని ముఖ్యమంత్రి కోరవచ్చుకూడా. మంత్రివర్గ సమావేశ నిర్ణయాల అమలుకు వెంటనే పాలన చర్యలు ప్రారంభమవుతాయి. మంత్రివర్గ నిర్ణయాలను అమలు పరచటంలో మంత్రులు మార్గదర్శక సూత్రాలను మాత్రమే రూపొందించి మిగతా విషయాలను ప్రభుత్వ కార్యదర్శికి వదిలివేస్తారు. ప్రభుత్వ విధానాలు ఎలా అమలు జరుగుతున్నాయో పరిశీలించే అవకాశం, అధికారం సంబంధిత మంత్రికి ఉంటుంది.

ప్రజలతో సంబంధాలు పెంచుకునేటందుకు మంత్రులు పర్యటనలు చేస్తుంటారు. పర్యటనలలో మంత్రులు ప్రజల నుండి దరఖాస్తులను విజ్ఞాపనలను స్వీకరిస్తుంటారు. అవసరమని తలిస్తే మంత్రులు ఎక్కడికక్కడే ఉత్తరువులు జారీ చేయవచ్చు. పాలన సంబంధమైన ఆలస్యాలు లేకుండా చేసేందుకు ముఖ్యమంత్రి జలగం వెంగళరావు పర్యటనల సందర్భంలో ఎక్కడికక్కడే అవసరమైన ఉత్తరువులు జారీ చేసేవాడని ప్రతీతి. ముఖ్యమంత్రి చెన్నారెడ్డి తాను పర్యటనల సందర్భంలో చెప్పేవన్నీ ప్రభుత్వ ఉత్తర్వులుగా సంబంధిత అధికారులు పరిగణించాలని బహిరంగంగా ప్రకటించారు. ఇటీవలి కాలంలో ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు "ప్రజల ముంగిట పాలన" అన్న నినాదంతో జిల్లాలలో పర్యటనలు జరిపి సమస్యలు పరిష్కరించబూనటం ఒక ప్రయోగం. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు "ప్రజల వద్దకు ప్రభుత్వం" పేరుతో ప్రజల వద్దకు వెళ్ళి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించి చూపటం ఒక వినూత్న ప్రయోగం.

మంత్రి తన వ్యక్తిత్వం ద్వారా ప్రభుత్వాధికారులను ఉత్తేజపరచి కార్యోన్ముఖులు చేయగలడు. ఒక్కొక్క సందర్భంలో నిర్ణయాలు చేయాల్సి వచ్చినప్పుడు మంత్రులు అధికారుల చర్చలతోనే సంతృప్తి చెందక, ప్రభుత్వం వెలుపల ఉన్న సాంకేతిక నిపుణులనూ, మేధావులనూ పిలిపించి కూడా సమస్యలను పరిష్కరించే వీలున్నది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచటానికి ప్రజల నుండి బహిరంగంగా సలహాలను కోరటం కూడా కొత్త విషయం. మంత్రుల నియామకం రాజ్యాంగంలో ప్రస్తావించారు. వారి రాజీనామాల గురించి ఎక్కడా ప్రసక్తిలేదు. మంత్రులు తమ ఇష్టం వచ్చినప్పుడు రాజీనామా చేయవచ్చు.

అభ్యాసం

మంత్రి వర్గంలో మంత్రుల పదవుల కేటాయింపు ఏ ప్రాతిపదిక మీద జరుగుతుంది ?

BRAOU

## 23.5. శాసన సభ

ఆంధ్రప్రదేశ్ అవతరణ సమయంలో రాష్ట్ర శాసనసభ ఒకే సభగాఉండేది. శాసన వర్గాన్ని రెండు సభలుగా వ్యవస్థీకరించటం, ప్రాముఖ్యం గల విషయంగా ప్రపంచమంతటా గుర్తింపును పొందింది. 1952లో మద్రాసు రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికలలో గెలిచిన ఆంధ్ర ప్రాంతపు సభ్యులతో ఆంధ్ర రాష్ట్ర శాసనసభ ఏర్పాటైంది. దీనికి 1955లో మధ్యంతర ఎన్నికలు జరిగాయి. 1956లో ఆంధ్రప్రదేశ్ అవతరించినప్పుడు ఇదే శాసనసభ కొనసాగింది. తెలంగాణా ప్రాంతపు శాసన సభ్యులు ఆంధ్ర రాష్ట్ర శాసనసభలో కలిసిపోయి, ఆంధ్రప్రదేశ్ శాసనసభగా వ్యవస్థీకృతమయ్యారు.1957లో దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరిగినప్పుడు ఆంధ్ర ప్రాంతంలో శాసనసభకు ఎన్నికలు జరుగలేదు. 1955లో ఎన్నికైన ఆంధ్ర ప్రాంత శాసన సభ్యుల పదవీ కాలాన్ని 1962 సార్వత్రిక ఎన్నికల దాకా పొడిగించారు. మొత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభకు 1962లోనే ఎన్నికలు జరిగాయి. రాష్ట్రావతరణ తరువాత రాష్ట్రంలో రెండో సభను ఏర్పాటు చేయాలని శాసనసభ తీర్మానించింది. ఫలితంగా జులై 1, 1958 నుండి రాష్ట్రంలో లెజిస్లేటివ్ కౌన్సిల్ ఏర్పాటైంది. జులై 7, 1958న భారత రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌ను లాంఛనంగా ప్రారంభం చేశారు. 1983 ఆరంభంలో అత్యంత మెజారిటీ బలంతో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ లెజిస్లేటివ్ కౌన్సిల్‌ను రద్దు చేయాలన్న తీర్మానాన్ని ప్రతిపాదించి ఆమోదింపజేసింది. పర్యవసానంగా రాష్ట్రంలో కౌన్సిల్ రద్దు అయింది. 1989లో జరిగిన శాసనసభ ఎన్నికలలో తిరిగి రాష్ట్రంలో కౌన్సిల్‌ను పునరుద్ధరిస్తామని కాంగ్రెసు పార్టీ తమ ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేసింది. ఎన్నికలలో గెలిచి అధికార పీఠం అధిష్ఠించాక కౌన్సిల్‌ను పునరుద్ధరించాల్సిందిగా కోరుతూ శాసనసభ తీర్మానించింది. కాని కేంద్ర ప్రభుత్వం కౌన్సిల్ పునరుద్ధరణకు ఎలాంటి ప్రయత్నమూ చేయలేదు. 1983లో ఎన్నికలు జరిగి ఏర్పాటైన శాసనసభను దాని కాలపరిమితి పూర్తి కాకుండానే 1985 నవంబరులో ముఖ్యమంత్రి సిఫారసుపై రద్దు చేశారు. 1973లో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం తీవ్ర స్థాయికి చేరుకొన్నప్పుడు, కాంగ్రెసు అధిష్ఠాన వర్గం సలహా మేరకు ముఖ్యమంత్రి పి.వి. నరసింహారావు రాజీనామా చేశారు. శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనను విధించింది కాని శాసనసభను రద్దు పరచలేదు. సమావేశాలు జరపకుండా శాసనసభను కొనసాగించారు. 1973 చివరిలో రాష్ట్రపతి పాలనను ఉపసంహరించినప్పుడు శాసనసభను పునరుద్ధరించారు.

1956లో దేశంలో రాష్ట్రాల పునర్విభజన జరిగాక శాసనసభల ప్రాంతీయ సంఘాలు రూపొందాయి. రాష్ట్రాల పునర్విభజనకు ఉద్దేశించిన 1956 సంవత్సరపు భారత రాజ్యాంగ ఏడవ సవరణ చట్టం ద్వారా ఆంధ్రప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాలలో శాసనసభల ప్రాంతీయ సంఘాలు ఏర్పరిచే అధికారం భారత రాష్ట్రపతికి సంక్రమించింది. ఈ ప్రాంతీయ సంఘాల స్వరూప స్వభావాలు శాసనసభల ఇతర సంఘాలకన్నా భిన్నంగా ఉన్నాయి. సాధారణంగా శాసనసభల సంఘాల కార్యకలాపాలు రాష్ట్రానికంతటికీ సంబంధించి ఉంటాయి. పంజాబ్, ఆంధ్రప్రదేశ్‌లలో రూపొందించిన

BRAOU

ప్రాంతీయ సంఘాలు మాత్రం ఆయా రాష్ట్రాలలోని ప్రత్యేక ప్రాంతాలకే పరిమితం కావటం గమనించదగ్గ అంశం. ఆంధ్రప్రదేశ్ అవతరణ సందర్భంలో ఆంధ్ర, తెలంగాణా నాయకుల మధ్య కుదిరిన "పెద్ద మనుషుల ఒప్పందం" తెలంగాణా ప్రాంతీయ సంఘం ఏర్పాటును నిర్దేశించింది. రాష్ట్ర అవతరణ నాటి నుండి తెలంగాణా ప్రాంతీయ సంఘం ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపింది. రాష్ట్ర శాసనసభలోని తెలంగాణా ప్రాంత శాసన సభ్యులతో తెలంగాణా ప్రాంతీయ సంఘం ఏర్పాటయింది. ఇందులో స్పీకరు, ముఖ్యమంత్రి, ఇతర మంత్రులకు స్థానం కల్పించలేదు. ప్రాంతీయ సంఘం తన సభ్యులలో ఒకరిని ఛైర్మన్‌గా ఎన్నుకొంటుంది. రాష్ట్రపతి ఉత్తర్వు ద్వారా ప్రాంతీయ సంఘం ఏర్పాటయింది. తెలంగాణా ప్రాంతానికి సంబంధించిన చిత్తు శాసనాలన్నీ తెలంగాణా ప్రాంతీయ సంఘం ఆమోదం పొందాలని నిర్దేశించారు. తెలంగాణా ప్రాంతం మిగులు నిధుల నిర్ధారణ విషయంలో తెలంగాణా ప్రాంతీయ సంఘానికీ, రాష్ట్ర ప్రభుత్వానికీ మధ్య విభేదాలు పొడసూపాయి. ప్రాంతీయ సంఘం సమావేశాల చర్చలు బహిరంగమైనవికాక రహస్యమైన విషయాలుగా భావించటం వల్ల, చర్చలలో ఏ విషయాలు ప్రాధాన్యం వహించాయన్న విషయం బయటపడలేదు. దాని కార్యకలాపాలన్నీ రహస్యమైనవని భావించటం వల్ల దానిని ఏర్పరచిన ఆశయానికి విఘాతం కలిగింది. 1972 ఆరంభంలో ఆంధ్ర ప్రాంతంలో చెలరేగిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమస్యకు పరిష్కార మార్గంగా రాష్ట్ర నాయకులు "ఆరు సూత్రాల పథకాన్ని" ఆమోదించారు. పర్యవసానంలో తెలంగాణా ప్రాంతీయ సంఘం ఏర్పాటు రద్దు అయింది. రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలన్నింటి అభివృద్ధికి ప్రాంతీయ అభివృద్ధి బోర్డులు ఏర్పాటు అయ్యాయి.

అభ్యాసం

శాసన సభల ప్రాంతీయ సంఘాలు ఎందుకు ఏర్పడ్డాయి ?

BRAOU

## 23.6. రాజకీయ పార్టీలు - స్వభావాలు, ప్రభావాలు

ఆంధ్రప్రదేశ్‌లో అంతర్భాగమైన ఆంధ్ర ప్రాంత ప్రజలకు స్వాతంత్ర్యానికి పూర్వమే రాజకీయ పార్టీల అనుభవం ఉంది. 1948లో హైద్రాబాదు సంస్థానం విముక్తమయ్యే దాకా తెలంగాణాకు రాజకీయ పార్టీల అనుభవం లేదు. తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించిన కమ్యూనిస్టు పార్టీ పై నిషేధం ఉన్నందున 1952 ఎన్నికలలో మిత్ర పక్షాలతో కలిసి కమ్యూనిస్టులు పీపుల్స్ డెమోక్రాటిక్ ఫ్రంట్‌గా ఏర్పడి తెలంగాణాలో పోటీ చేశారు. జాతీయ స్థాయిలో అవతరించిన పార్టీ లన్నింటికి మద్రాసు రాష్ట్రంలో శాఖలు ఏర్పడ్డాయి. 1952 ఎన్నికలలో వివిధ పార్టీలకు తమ బలాన్ని నిరూపించుకొనే అవకాశం లభించింది. ఆంధ్ర ప్రాంతపు జిల్లాలలో కాంగ్రెసు పార్టీకి నిర్దిష్టమైన మెజారిటీ రాలేదు. ఈ పరిస్థితి 1952 మద్రాసు రాష్ట్ర మంత్రి వర్గ నిర్మాణాన్ని ప్రభావ పరచింది. 1953లో మద్రాసు రాష్ట్రం నుండి ఆంధ్ర జిల్లాలను వేరు చేసి ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుచేసినప్పుడు కాంగ్రెసుకు శాసనసభలో మెజారిటీ లేదు. కాంగ్రెసు, ప్రజాపార్టీ, కృషిక్ లోక్ పార్టీల సభ్యులతో కూడిన యునైటెడ్ లెజిస్లేచర్ పార్టీ ప్రకాశం నాయకత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పరచింది. సంవత్సరం గడవకుండానే అంతర్గత కారణాల వల్ల ప్రభుత్వం మీద అవిశ్వాస తీర్మానం నెగ్గింది. రాష్ట్రపతి పాలన ఏర్పడి ఆంధ్ర రాష్ట్రంలో శాసనసభకు 1955లో మధ్యంతర ఎన్నికలు జరిగాయి. బలంగా మోహరించి అధికార పీఠం అధిష్టించటానికి ప్రయత్నిస్తున్న కమ్యూనిస్టు పార్టీని ఓడించటానికి కాంగ్రెసు, ప్రజాపార్టీ, కృషికి లోక్ పార్టీలు కలిసి ఎన్నికల పొత్తు కుదుర్చుకొన్నాయి. 1955 ఎన్నికలలో కమ్యూనిస్టులు ఘోరంగా ఓడిపోయారు. కాంగ్రెసు నాయకుడు బెజవాడ గోపాల రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. కమ్యూనిస్టులను ఓడించటానికి ఏర్పడిన అవగాహన, తరువాత కాలంలో కొనసాగలేదు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రావతరణతో రాజకీయ పరిస్థితుల ప్రాబల్యం వల్ల ఎవరికి వారే విడిపోయారు. 1956 నుండి 1983 వరకూ, 1989 నుండి 1994 వరకూ రాష్ట్రంలో కాంగ్రెసు పార్టీయే అధికారాన్ని నిర్వహించింది. జాతీయ స్థాయిలో 1970, 1977 లలో కాంగ్రెసులో వచ్చిన చీలికలు రాష్ట్ర కాంగ్రెసు పార్టీపై ఎలాంటి ప్రభావాన్నీ చూపలేదు. 1967 సార్వత్రిక ఎన్నికల తరువాత దేశంలో కాంగ్రెసు ప్రతిష్ఠ సన్నగిల్లి అనేక రాష్ట్రాలలో సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడినప్పుడు కూడా, రాష్ట్ర ప్రజలు కాంగ్రెసునే అభిమానించారు. 1983లో రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికలలో అందరి ఊహలకూ భిన్నంగా ప్రజలు స్పందించారు. ఎన్నికలకు తొమ్మిది నెలల ముందు రాష్ట్రంలో ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీ శాసనసభా స్థానాల్లో మూడింట రెండు వంతులు గెలుచుకొని రాష్ట్రంలో మొదటిసారిగా కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పరచింది. 1989లో తిరిగి ప్రజలు కాంగ్రెసుకు మెజారిటీ కల్గించారు. 1995 ఆరంభంలో జరిగిన ఎన్నికలలో ప్రజలు కాంగ్రెసును ఓడించి తిరిగి తెలుగుదేశం పార్టీని గెలిపించారు. 80, 90 దశాబ్దాల పార్టీల చరిత్రలో రాష్ట్రంలో రెండు పార్టీల వ్యవస్థ వేళ్ళూనుకుందని మనం భావించుకోవచ్చు. రాష్ట్రావతరణకు పూర్వం బలంగా ఉన్న కమ్యూనిస్టు పార్టీ తన పూర్వ వైభవాన్ని పునరావృతం చేయలేకపోయింది. 1960 దశకంలో జాతీయ పార్టీగా ఆవిర్భవించిన స్వతంత్ర పార్టీ కూడా రాష్ట్ర రాజకీయాలలో మనుగడను సాగించలేకపోయింది. ఇవిగాక కాంగ్రెసు నుండి విడిపోయిన వారు ఏర్పరచుకొన్న సోషలిస్టు డెమాక్రాటిక్ పార్టీ పట్టుమని ఐదేండ్లు పనిచేయలేకపోయింది. జాతీయ స్థాయిలో కాంగ్రెసుకు ప్రత్యామ్నాయంగా ఏర్పడ్డ జనతా పార్టీ కూడా రాష్ట్ర రాజకీయాలలో తన ఉనికిని నిలుపుకోలేకపోయింది. అసంతృప్తిగా, ఆందోళనగా, ఉద్యమంగా, మహోద్యమంగా మారి, రాజకీయ రూపం సంతరించుకొని, తన మనుగడకు ఎన్నికల విజయాన్ని సాక్ష్యంగా ప్రదర్శించి ఆంధ్రప్రదేశ రాజకీయరంగంలో తళుక్కున మెరసి తెలంగాణా ప్రజాసమితి పార్టీ అంతర్థానమైంది. 1968-69లలో తెలంగాణా ప్రాంత విద్యార్థుల,

BRAOU

ఉద్యోగుల ప్రేరణతో ప్రారంభమైన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం రాజకీయ రూపం ధరించింది. ఆరంభంలో తెలంగాణా ప్రజా సమితి ఒక రాజకీయేతర సంస్థ. ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర సాధన దాని లక్ష్యం. క్రమంగా అసంతృప్తి చెందిన కాంగ్రెసు నాయకులు అందులో చేరారు. దాన్ని 1970 ఆరంభంలో రాజకీయ పార్టీగా మార్చారు. 1971లోక్‌సభ మధ్యంతర ఎన్నికలలో పోటీ చేసి 49 శాతం ఓట్లను పొందారు. ఎన్నికల అనంతరం మారిన దేశ రాజకీయ వాతావరణంలో తెలంగాణా ప్రజా సమితి కాంగ్రెసులో అంతర్లీనమైంది. హైద్రాబాదు సంస్థానం భారత యూనియన్‌లో చేరక పూర్వం, సంస్థానాన్ని పాలించే హక్కు ముస్లిములకే ఉన్నదని అది స్వతంత్ర రాజ్యంగా మనుగడ సాగించాలని ముస్లిములు వాదించేవారు. వారి సాధనకు ప్రతినిధిగా ఇత్తేహాదుల్ ముస్లిమాన్ సంస్థ ఏర్పాటైంది. సంస్థానంపై భారత యూనియన్ పోలీసు చర్యతో ఈ సంస్థ కార్యకలాపాలకు తెరపడింది. పోలీసు చర్య తరువాత 1957 వరకూ రాష్ట్రంలో ఎలాంటి ముస్లిం రాజకీయ పార్టీ అవతరించలేదు. మజ్లిస్ నాయకుడు కాశింరజ్వీ కారాగార శిక్ష అనుభవించి విడుదలయ్యాక 1958లో మజ్లిస్ ఇత్తేహాదుల్ ముస్లిమాన్ సంస్థను అఖిల భారత సంస్థగా మార్చారు. 1958 తరువాత రాష్ట్ర రాజకీయాల్లో మజ్లిస్ ప్రాచుర్యానికి దోహదం చేసిన కారకాలూ, దాని సిద్ధాంతం, పరిసరాల పరిస్థితులు, దాని వ్యవస్థారూపం, నాయకత్వం చాలా ప్రధానమైనవి. మజ్లిస్‌కు నిర్దిష్టమైన సైద్ధాంతిక ప్రాతిపదిక అంటూ ఏదీలేదు. భారతదేశంలో ఇస్లాం మత రక్షణ దాని ఆశయం. ఉర్దూ భాష, ఇస్లాం మతం రెండూ దానికి ప్రాతిపదికలు. ప్రభుత్వ కార్యకలాపాలను ఖురాన్ నిర్దేశించిన సూత్రాలతో పరిశీలించటం మజ్లిస్ కార్యదీక్ష. ఇటీవలి కాలంలో మజ్లిస్ ప్రాంతీయ సమస్యల పట్ల కొంత ఆసక్తి చూపుతున్నది. పార్టీ వ్యవస్థ చాలా బలహీనమైనది. ఎన్నికల సందర్భంలోనే మజ్లిస్ కార్యకర్తలు చాలా చురుకుగానూ క్రియాశీలంగానూ కన్పిస్తారు. రాష్ట్ర రాజకీయాలలో ఈ పార్టీ ప్రభావం జంట నగరాలకే పరిమితమైంది. జిల్లాలలో దీనికి ఎక్కువ ప్రాధాన్యం ఏదీ లేదు. పార్టీ తన ఎన్నికల ప్రణాళికల ద్వారా ప్రచారం సాగించిన దాఖలాలు లేవు. పార్టీ అధ్యక్షుడు సుల్తాన్ సలావుద్దీన్ ఓవైసీ ఉపన్యాసాల ద్వారా ఆ పార్టీ ఆశయాలను మనం గ్రహించవచ్చు. ఇవిగాక ఇంకా అనేకమైన పార్టీలు రాష్ట్రంలో తమ ఉనికిని ఏర్పరచుకొన్నాయి. 1987లో ప్రాంతీయ పార్టీగా తెలుగుదేశం ఆవిర్భవించి రాష్ట్ర రాజకీయాలలో తనకు ఒక ప్రధాన స్థానాన్ని పదిలపరచుకొన్నది.

ప్రతి ఎన్నికలోనూ ఏ పార్టీకీ చెందని వారు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసి గెలవడం ఆనవాయితీ అయింది. రాజకీయ పార్టీల అభ్యర్థులుగా ఎంపిక కాలేని వారు తమ ప్రాధాన్య నిరూపణ నిమిత్తం స్వతంత్ర అభ్యర్థులుగా నిలచి గెలవటం గమనించదగిన విషయం. రాష్ట్రంలో ఏదో ఒక స్థాయిలో చీలని రాజకీయ పార్టీ లేదు. పాలక పార్టీల నుండి చీలి బయటికి వచ్చిన నాయకులు కొత్త పార్టీలను పెట్టిన సందర్భాలున్నాయి. రాష్ట్ర రాజకీయ చరిత్రలో చిన్న చిన్న పార్టీలు, ఫ్రంటులు, గ్రూపులు, ముఠాలు ఎక్కువగా లేకపోయినా, ఉన్న కొన్ని అయినా కొంతకాలం అధికారంలో ఉన్న పార్టీకి తలనొప్పిగా పరిణమించటం గమనార్హమైన విషయం. ఉత్తరాది రాష్ట్రాలలో వ్యాపించిన పార్టీ ఫిరాయింపుల లాంటివి రాష్ట్రంలో స్థానం పొందలేదు. సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీలకు వ్యతిరేకత ప్రతిపక్షాల నుండి కాక ప్రధానంగా పాలక పార్టీలోనే ఆవిర్భవిస్తున్నది. ఇందుకు కాంగ్రెసు పార్టీలోని ముఠా తగాదాలను ఉదాహరణగా స్వీకరించవచ్చు. రాష్ట్రంలో జరిగిన ఆందోళనలన్నీ కాంగ్రెసులోని ముఠా కలహాల ప్రతిబింబాలే. రాష్ట్ర శాసనసభలో కాంగ్రెసుకు సుస్థిరమైన మెజారిటీ ఉన్నప్పటికీ, మంత్రి వర్గాలకు స్థిరత్వం లేకుండా పోయింది. ముఠా తగాదాల వల్ల సుస్థిరంగా ఉన్న కాంగ్రెసు మంత్రి వర్గాలను ప్రజాస్వామ్యేతర పద్ధతులలో అధికార పీఠం నుండి తొలగించాల్సి వస్తున్నది. తెలుగుదేశం పార్టీలో కూడా ముఠాలు స్థానం పొందటం గమనించదగ్గ విషయం. రాష్ట్రావతరణ నుండి

BRAOU

నేటిదాకా ఏర్పడిన ఏ కాంగ్రెసు పార్టీ ప్రభుత్వమైనా ముఠా రాజకీయాల ప్రభావాలకు లోనుగాకుండా ఉండలేదు. 1982 దాకా రాష్ట్రంలో కాంగ్రెసు పార్టీని అధికారం నుండి తొలగించటానికి ఏ పార్టీగాని, పార్టీల కలయికగాని ప్రయత్నించలేదు. ప్రాంతీయ విధేయతలు రాష్ట్రంలో రెండుసార్లు ఉద్యమాలు చెలరేగటానికి దోహదం చేశాయి. గత నాలుగు దశాబ్దాలుగా మూడు పదులకు పైన వివిధ రాజకీయ పార్టీలు రాష్ట్రంలో జరిగిన ఎన్నికలలో పాల్గొన్నాయి. కాంగ్రెసు, తెలుగుదేశం పార్టీలు తప్ప మిగతా పార్టీలేవీ రాష్ట్ర రాజకీయరంగంలో నిలకడగా కొన్నాళ్ళయినా నిలచి అధికారాన్ని పొందలేకపోయాయి. కమ్యూనిస్టు పార్టీలు మాత్రం మొదటినుంచి రాష్ట్రంలో అంతో ఇంతో బలం కలిగి ఉన్నాయి. వారికి రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో స్థిరమైన బలం ఉంది. పూర్వపు భారతీయ జనసంఘ్ గాని ప్రస్తుతపు భారతీయ జనతా పార్టీ గాని రాష్ట్రంలో గణనీయమైన మద్దతు సమకూర్చుకోలేక పోతున్నాయి. 1967 సార్వత్రిక ఎన్నికల తరువాత దేశంలో కాంగ్రెసు ప్రతిష్ఠ సన్నగిల్లి అనేక రాష్ట్రాలలో సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడినప్పుడు కూడా మన రాష్ట్రంలో సుస్థిరంగానే ప్రభుత్వాన్ని నిర్వహించగల్గింది. 1978 దాకా శాసనసభ ఎన్నికలలో కాంగ్రెసు పార్టీ తప్ప మరే పార్టీ రాష్ట్రంలోని అన్ని శాసనసభ స్థానాలకూ అభ్యర్థులను నిలపలేకపోయింది. 1983లో కాంగ్రెసుకు ప్రత్యామ్నాయంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించే వరకూ ఏ రాజకీయ పార్టీ కూడా అధికారాన్ని చేపట్టే స్తోమతనుగానీ ప్రజాదరణను గాని పొందలేకపోయింది.

స్వాతంత్ర్యానికి పూర్వం కాంగ్రెసులో బ్రాహ్మణ నాయకుల ఆధిక్యత ఎక్కువగా ఉండేది. స్వాతంత్ర్యం వచ్చాక క్రమక్రమంగా వ్యవసాయం ప్రధాన వృత్తిగా గల రెడ్డి, కమ్మ, వెలమ కులాల చేతుల్లోకి కాంగ్రెసు నాయకత్వం మారింది. ఆంధ్ర ప్రదేశ్ అవతరణ తరువాత బ్రాహ్మణేతర కులాల ప్రాధాన్యం మరింత అధికమైంది. మంత్రి వర్గాలలో కూడా బ్రాహ్మణేతర అగ్ర కులాల వారికే ప్రాధాన్యం లభిస్తూ వచ్చింది. 1959లో పంచాయతీరాజ్ వ్యవస్థల ఆవిర్భావంతో రాజకీయాలలో బ్రాహ్మణేతర అగ్రకులాల ఆధిపత్యం బలపడిపోయింది. జిల్లా పరిషత్తులు, పంచాయితీ సమితులు, గ్రామ పంచాయితీలు, సహకార సంఘాలు రాజకీయ అధికారాన్ని నిలబెట్టు కోవటానికి సాధనాలయ్యాయి. ముఖ్యమంత్రి, తదితర మంత్రుల అగ్రవర్ణాల వారి పెత్తనానికి ఈ సంస్థలు సహాయపడినాయి. నిరాటంకంగా పెత్తనం చెలాయిస్తున్న కాంగ్రెసు పార్టీకి భూస్వామ్య అగ్రవర్ణాలు ప్రధాన ఆధారాలయ్యాయి. తెంగాణాలో కమ్యూనిస్టుల పోరాటం, ఆంధ్ర రాష్ట్రంలో కమ్యూనిస్టులు అధికారం చేపట్టటానికి చేసిన ప్రయత్నాలు, భూస్వామ్య వర్గాలను కలవరపెట్టి వారిని కాంగ్రెసు వైపు మద్దతు వర్గంగా చేర్చాయి. కమ్యూనిస్టుల భయం వల్ల కాంగ్రెసు వైపు మొగ్గిన అగ్రకులాల నాయకులను అడ్డుపెట్టుకొని, కాంగ్రెసు ఓటర్లను ఆకట్టుకోగలిగింది. ఆదిలో రాజకీయ చైతన్యం ఎక్కువగా ఉన్న బలహీన వర్గాలు, అగ్రకులాల ప్రభావం నుండి బయటపడటానికి వీలు కలుగలేదు. రాష్ట్ర రాజకీయాలపై భూస్వామ్య అగ్రకులాల వారికున్న ప్రాధాన్యాన్ని తగ్గించటానికి 1972 శాసనసభ ఎన్నికలలో ప్రయత్నాలు జరిగాయి. వెనుకబడిన కులాల వారికి, అల్ప సంఖ్యాక వర్గాల వారికి, ఎక్కువ శాసన సభా స్థానాలు దక్కాయి. మంత్రి వర్గాలలో కూడా బలహీన వర్గాల వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ కాలంలో రెండు విశేషాలు జరిగాయి. పూర్వపు మంత్రి వర్గాలు చేసిన వాటికన్నా ఇంకా ఎక్కువ అభ్యుదయకరమైన భూసంస్కరణలు చేపట్టటం ఒకటి. భూస్వామ్య వర్గాల జేబు సంస్థలుగా మారిన పంచాయితీరాజ్ సంస్థ సంస్కరణలు రెండవది. 1978 శాసనసభ ఎన్నికలలో ఉత్తర భారతపు జనతా ప్రభంజనం రాష్ట్ర రాజకీయాలపై ఎలాంటి ప్రభావాన్ని చూపలేకపోయింది. రాష్ట్రంలో మొదటిసారిగా బలహీనవర్గాలలో కాంగ్రెసు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల ఫలితాలకు కల్గిన ప్రతిస్పందనే

BRAOU

కాంగ్రెసు విజయానికి కారణమని చెప్పవచ్చు. కాంగ్రెసు ప్రభుత్వం అమలు జరిపిన "ఇరవై సూత్రాల పథకం" ఓటర్లను బాగా ప్రభావపరిచింది. గ్రామీణ పేదలలో ఆత్మ విశ్వాసాన్ని పెంచింది. ఇవన్నీ పేద ప్రజలలో మానసిక స్వాతంత్ర్యాన్ని కలుగ చేసాయి. 1982-83లో జరిగిన శాసనసభ ఎన్నికలో మొదటిసారిగా రాష్ట్ర ప్రజలు కాంగ్రెసును ఓడించి తెలుగుదేశం పార్టీకి అధికారం అప్పజెప్పారు. 1982-83 ఎన్నికల ఫలితాలు ఎవరి ఊహకూ అందలేదు. సామాజిక శాస్త్రజ్ఞుల అంచనాలు అసలు స్వరూపాన్ని బహిర్గతం చేయలేకపోయాయి. పత్రికల అంచనాలు తారుమారయ్యాయి. జ్యోతిశ్శాస్త్రజ్ఞుల లెక్కలు తప్పిదాలయ్యాయి. సామాన్యుడి రాజకీయ నిర్ణయ విజ్ఞతను ఎవ్వరూ పసికట్టలేకపోయారు. రాజకీయ చరిత్రలోనే తెలుగుదేశం విజయం రికార్డును సృష్టించింది. రెండు పార్టీల వ్యవస్థను ప్రజలు కోరుకుంటున్నారా అన్నట్లు 1989 ఎన్నికలలో రాష్ట్ర ఓటర్లు తెలుగుదేశం పార్టీని ఓడించి తిరిగి కాంగ్రెసును గెలిపించారు. అంతటితో ఆగక 1995 ఎన్నికలలో తిరిగి ప్రజలు కాంగ్రెసును ఓడించి తెలుగుదేశం పార్టీని గెలిపించారు. ఇలా మూడు ఎన్నికలలో పార్టీలు గెలవటం, ఓడటం, తిరిగి గెలవటం తెలుగు ఓటర్ల విజ్ఞతకు, పరిణతికి (maturity) నిదర్శనమని చెప్పవచ్చు.

భాషా రాష్ట్రాల ఉద్యమాన్ని ప్రారంభించింది తెలుగువారు. భాష ఒక్కటే రాష్ట్ర సమగ్రతకు సరిపోదని, ప్రాంతీయ ఆర్థికపరమైన అసమానతల సర్దుబాటు చేయాల్సిన అవసరమున్నదన్న విషయాన్ని వేర్పాటు ఉద్యమాల ద్వారా చాటింది కూడా తెలుగువారే. 1969లో ప్రత్యేక తెలంగాణా ఉద్యమం పెల్లుబికింది. రాష్ట్రావతరణ సమయంలో తెలంగాణా ప్రాంతానికి ఇచ్చిన హామీలను అమలు పరచకపోవటం దీనికి ప్రధాన కారణం. తెలంగాణా ప్రాంతానికి చెందిన అదనపు నిధులను, ఆ ప్రాంత అభివృద్ధికి ఉపయోగించకుండా, కోస్తా జిల్లాలకు తరలిస్తున్నారనే భావం మరో కారణం. ముల్కీ నిబంధనలకు నీళ్ళు వదలి, తమకురావల్సిన ఉద్యోగాలను కోస్తా జిల్లాల వారు పొంది తమపై పెత్తనం చేస్తున్నారన్న భావం మరొక కారణం. ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర ఉద్యమం, తెలంగాణాకు ప్రత్యేక రాష్ట్ర ప్రతిపత్తిని సంపాదించలేకపోయినప్పటికీ ఈ ప్రాంతానికి కొన్ని ప్రయోజనాలను సాధించింది. వాటిలో ఆరు సూత్రాల పథకం, తెలంగాణాకు ప్రత్యేక బడ్జెటు, ప్రత్యేక కాంగ్రెసు కమిటీ, ముల్కీ నియమాల కొనసాగింపు ప్రధానమైనవి. మొదటిసారిగా తెలంగాణాకు చెందిన వారు ముఖ్యమంత్రి అయ్యారు. ప్రత్యేక తెలంగాణా ఉద్యమానికి ప్రతిచర్యగా 1972లోప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం ప్రారంభమైంది. ఈ రెండు ఉద్యమాలు ఇంచుమించు ఒకే సమస్యపై ఏర్పడ్డవి. రాజకీయంగా ఈ ఉద్యమం తలెత్తడానికి ప్రధాన కారణం, ప్రధాన కులాలైన రెడ్డి, కమ్మ వ్యవసాయదారులు వ్యతిరేకించిన ప్రగతిశీల భూసంస్కరణల చట్టం. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం కలిగించిన హింసాకాండ, ఆస్తి నష్టం ఎంత తీవ్ర స్థాయికి చేరుకుందంటే నాటి ముఖ్యమంత్రి రాజీనామా చేయాల్సి వచ్చింది. శాసనసభ సమావేశాలను తాత్కాలికంగా రద్దు చేసి రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనను విధించారు. ఉద్యమ పర్యవసానంగా తెలంగాణా ప్రాంతీయ కమిటీ రద్దు అయింది. రాష్ట్రంలోని మూడు ప్రాంతాలకు ప్రణాళికా బోర్డులను ఏర్పరిచారు. హైదారాబాదు నగరంలో కేంద్ర విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఒక నిర్ణీత స్థాయికి లోబడిన అన్ని ఉద్యోగాలకు, విద్యాలయాల్లో ప్రవేశానికి స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యం ఇచ్చే నిర్ణయం చేశారు. ఉద్యోగస్థుల ఫిర్యాదులు వినటానికి కేంద్ర పాలన ట్రిబ్యునల్‌ను స్థాపించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలలో ఏర్పడిన మరొక ఆసక్తికరమైన పరిణామం రాజకీయ స్థిరత్వం. అధికారంలో గల రాజకీయ పార్టీకి శాసనసభలో మెజారిటీ ఉన్నప్పటికీ ముఖ్యమంత్రులు మారటమన్నది సాంప్రదాయకతను సంతరించుకొంది. ముఠా రాజకీయాలు ఒక్క కాంగ్రెసుకే గాక, ఇటీవల రంగప్రవేశం చేసిన తెలుగుదేశం పార్టీలోనూ ఉన్నాయి. రాజస్థాన్ తరువాత ఎన్నిక ప్రాతిపదికన పంచాయితీరాజ్ సంస్థలను ఏర్పాటు చేసిన ఘనత ఆంధ్రప్రదేశ్‌దే.

BRAOU

1959లోనే రాష్ట్రంలో పంచాయతీరాజ్ సంస్థలను ఏర్పరచారు. 1983లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక జరిగిన ఒక గణనీయమైన పరిణామం గ్రామాధికారుల వంశపారంపర్యపు పదవులను రద్దు చేయటం ; మండల పాలన వ్యవస్థ రూపొందించటం. సంక్షేమ పథకాల రూపకల్పనలో ఆంధ్రప్రదేశ్ మొత్తం దేశానికి మార్గదర్శకురాలైంది. 1983లో రెండు రూపాయల కేజి బియ్యం, జనతా వస్త్రాలు, 1995లో మద్యపాన నిషేధం - ఈ విధానాలు దేశంలోనే సంచలనం సృష్టించాయి.

అభ్యాసం.

ప్రత్యేక తెలంగాణా, ఆంధ్రోద్యమాల వెనక ఉన్న ప్రేరణలు ఏమిటో వివరించండి ?

## 23.7. ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

★ భారత రాజ్యాంగంలో అటు సమాఖ్య లక్షణాలు, ఇటు ఏక కేంద్ర లక్షణాలు కన్పిస్తాయి.

★ జనాభా పరంగానూ, విస్తీర్ణం విషయంలోనూ దక్షిణాది రాష్ట్రాలలో మొదటిది ఆంధ్రప్రదేశ్.

★ 1953 అక్టోబరు 1న ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది.

★ రాష్ట్రావతరణం నుండి 1983 వరకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసుకు నిర్భేద్యమైన దుర్గంగా నిలిచింది. 1983 నుండి 'తెలుగుదేశం' ప్రాంతీయ రాజకీయ పార్టీ కాంగ్రెసు ఆధిపత్యాన్ని ముక్కలు చేసింది.

★ అసాధారణ పరిస్థితుల్లో గవర్నర్ల పాత్ర కీలకమైంది.

★ రాష్ట్ర పాలనా వ్యవస్థలో ముఖ్యమంత్రి ప్రధాన సూత్రధారి.

★ రాష్ట్రంలో మంత్రివర్గ నిర్మాణం జరిగేప్పుడు రాష్ట్రావతరణ సమయంలో జరిగిన "పెద్ద మనుషుల ఒప్పందం"లోని నియమాలను ముఖ్యమంత్రి పాటించాలి.

BRAOU

★ ఆంధ్రప్రదేశ్ అవతరణ సమయంలో రాష్ట్ర శాసనసభ ఒకే సభగా ఉండేది.

★ 1956 సంవత్సరంలో రాజ్యాంగ సవరణ ద్వారా శాసన సభల ప్రాంతీయ సంఘాలు ఏర్పడ్డాయి.

★ ఆంధ్రప్రదేశ్‌లో స్వాతంత్ర్యానికి పూర్వమే రాజకీయ పార్టీలు చురుగ్గా పనిచేస్తుండేవి.

★ కాంగ్రెసుకు బలమైన ప్రత్యామ్నాయంగా తెలుగుదేశం 1983లో అవతరించింది.

★ భూస్వామ్య అగ్ర వర్ణ రాజకీయాల ప్రాబల్యాన్ని తగ్గించటానికి 1972 శాసనసభ ఎన్నికల్లో ప్రయత్నాలు జరిగాయి.

★ రాజకీయ స్థిరత్వం ఒక ప్రత్యేకమైన పరిణామంగా మనం చెప్పుకోవాలి.

## 23.8. మాదిరి పరీక్షా ప్రశ్నలు.

30 పంక్తుల్లో జవాబులు రాయండి.

1. ఆంధ్రప్రదేశ్ అవతరణకు దోహదపడిన అంశాలను సమీక్షించండి.
2. ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ పార్టీలను పేర్కొని వాటి గురించి వివరించండి.

15 పంక్తుల్లో జవాబులు రాయండి.

1. రాష్ట్రపతి పాలనలో గవర్నర్ పాత్రను గురించి వివరించండి.
2. మంత్రివర్గ నిర్మాణం ఏ ప్రాతిపదిక మీద జరుగుతుందో తెలియజేయండి.

BRAOU

# చదవదగిన పుస్తకాలు


| | | |
|---|---|---|
| టి. శివాజీ రావు | - | మనమూ - మన పరిసరాలు (సామాన్యుడికి పర్యావరణ పరిచయం, తెలుగు అకాడమి, హైదరాబాద్ ప్రచురణ) |
| బి.వి. సుబ్బారావు | - | ఆంధ్రప్రదేశ్ పర్యావరణ పరిస్థితి ప్రజానివేదిక - 1990. (గాంధీ విజ్ఞాన పరిషత్ Academy of Gandhian Studies, Hyderabad ప్రచురణ) |
| సత్యనారాయణరావు, ఎం. | - | ఎన్నికల రాజకీయాలు |
| కృష్ణారావు; వై.వి. | - | ఆంధ్రప్రదేశ్ దర్శిని |
| సత్యనారాయణరావు; ఎం. | - | ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు |
| సత్యనారాయణరావు; ఎం. | - | ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గాలు |
| బలరామమూర్తి; వై. | - | ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర, విజయవాడ, 1964. |
| మాదాల వీరభద్రరావు | - | ఆంధ్రోద్యమ చరిత్ర |
| యం. సుబ్బారెడ్డి | - | తెలుగులో జాతీయోద్యమ కవిత్వం |
| **Narayan Rao; K.V.** | - | *The Emergence of Andhra Pradesh* |
| **Maheshwari; S.R.** | - | *State Governments in India* |
| **G.V. Subba Rao** | - | *Andhra Movement, basic documents* - 2 - Vol. |
| **Sarojini Regani** | - | *Highlights of Freedom Movement in Andhra Pradesh.* |
| **The Hindu** | - | *Survey of the Environment 1994* |
| **A.V. Ramana Rao** | - | *Economic Development of Andhra Pradesh*, Bombay, 1957. |
| **V. Ramakrishna** | - | *Social Reform in Andhra*, New Delhi, 1983. |
| **Y. Vaikuntham** | - | *Education and Social Change in Modern India, Andhra* 1880-1920, Madras, 1982. |
| **P. R. Rao** | - | *History of Modern Andhra*, New Delhi, 1978. |
| **A. Sarada Raju** | - | *Economic Condition in the Madras Presidency*, Madras, 1941. |


BRAOU

**B. Kesavanarayana** - *Political and Social Factors in Andhra,* (1900 - 1956) Vijayawada, 1976.

**G. Parthasarathy** - *"Agricultural Growth, Problems and Prospects in Andhra Pradesh",* (Report Submitted to the world Bank) Institute of Development and planning studies, Visakhapatnam, 1996.

**G. Parthasarathy** - *"Growth stability and Equity with in the Agrarian sectors of Andhra Pradesh"'* presidential Address, A.P. Economic Association, Third Conference, Kawali, 1985.

**R. Radhakrishna** - *"Andhra Pradesh Agriculture - Emerging Issues"* in Development of Andhra Pradesh, Problems and Prospects. T. Koteswara Rao and S. Sudhakar Reddy (eds) (ESS and Booklinks Corporation, Hyderabad, 1991.)

**D. B. Reddy** - *"Industrial Development in Andhra Pradesh : A Perspective"* in Development of Andhra Pradesh : Problems and Prospects, (ed) T. Koteswara Rao and S. Sudhakar Reddy, Centre for Economic and Social Studies and Booklinks Corporation, Hyderabad, 1991.

**CMIE (Bombay)** - *Basic Statisctics Relating to states of India,* EIs,sept. 1994.

*Manorama Year Book* - 1995-96

**P. Satya Sekhar** - *"Agriculture : Growth performance and projections'* in Andhra Pradesh Economy in Transition, Kamakalatha Mukunk (ed), CESS and Booklinks Corporation, Hyderabad, 1990.

**CMIE (Bombay)** - *Performance of Agriculture 1980-81 to 1992-93,* EIs, May, 1994.

**V. Surender** - *"Introduction" to Part III Industry.*

**J. Satyanarayana and Surendar** - "Planning for Industrial Development of Andhra Pradesh : Eight Five Year Plan perspecting.

**S. Lakshminarayana and M. C. Swaminatham** - *'Industrial Development in Andhra Pradesh".*

**S.V. Reddy, S. Ramana and G. Pakki Reddy** - *"Industrial Development of Andhra Pradesh : A perspective".*


BRAOU

BRAOU